# ప్రేమావతార్

## శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం



ప్రేమావతార్ శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం

# ప్రేమావతార

## శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం



డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు, ఎమ్మెస్సీ, పి.హెచ్‌డి



# అంకితం




నమామి శ్రీరామకృష్ణ పాదపంకజం
కరోమి శ్రీరామకృష్ణ పూజనం సదా
వదామి శ్రీరామకృష్ణ నామ నిర్మలం
స్మరామి శ్రీరామకృష్ణ తత్త్వ మవ్యయం ॥

సక్కుబాయి తనూజాతం, గురుదేవ సమప్రభం ।
శిష్యానుగ్రహ కారకం శ్రీరామకృష్ణం నమామ్యహం॥

## ప్రాతఃస్మరణం

ప్రాతఃస్మరామి శ్రీరామకృష్ణ ముఖారవిందం
మందస్మితం మధురభాషి విశాల ఫాలం,
దివ్యాధి దివ్య వర శోభిత గండభాగం,
కర్ణాంత దీర్ఘ నయనం నయనాభిరామం ॥



# ప్రేమావతార శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం

ప్రథమ ముద్రణ : 30 జూన్ 2019
(పూజ్యశ్రీ మాస్టర్‌గారి పంచమ ఆరాధనోత్సవం)

ప్రతులు : 1,000

వెల : రూ. 200/-

ప్రచురణ మరియు ప్రతులకు

: **అపూర్వ పబ్లికేషన్స్**
ఇ.నెం. 36/71/336, శ్వేతద్వీపము
పవిత్ర కాలేజి రోడ్, ఒంగోలు - 523 001
మొబైల్: 94913 17670
వెబ్‌సైట్: **www.missionrk.com**

ముద్రణ : **యశస్వి ఆర్ట్ ప్రింటర్స్**
ఫీవర్ ఆసుపత్రి దగ్గర, మెయిన్‌రోడ్,
ఓల్డ్ నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్: 040-66554439
మొబైల్: 97010 55009
E-mail: yasasveeartprinters@gmail.com

# కృతజ్ఞతలు

ఈ విరాట్‌విశ్వంలో నాకు జీవితాన్ని ప్రసాదించిన పరమాత్మకు, కులదైవమైన శ్రీ వేణుగోపాల స్వామికి, నాకీ దేహాన్నిచ్చి, సన్మార్గంలో నడిపించిన నా తల్లిదండ్రులు శ్రీమతి చంద్రమౌళీశ్వరి, శ్రీలక్ష్మీనరసింహారావుగార్లకు అనంత కోటి ప్రణామాలు.

మహాకాలస్వరూపులు పూజ్యగురుదేవులు పండితశ్రీరామశర్మ ఆచార్య, మాతా భగవతీదేవి గార్ల ప్రత్యక్ష దర్శనాలనిప్పించి, వారిచ్చిన గాయత్రీపరివార్ కార్యక్రమాలను చేయటానికి మాకు కొండంత అవకాశాన్నిచ్చి, అఖండ సేవా భాగ్యాన్ని ప్రసాదించిన ప్రజ్ఞావతారులు, ప్రేమస్వరూపులు, మహాపురుషులు పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారికి సహస్రాధిక వందనములు. ఈ పుస్తకరచనకు పరోక్షంగా ప్రేరణనిచ్చిన శ్రీమతి విజయావిశ్వనాధ్ గారికి ధన్యవాదాలు.

నాలుగు సంవత్సరాలపాటు జరిగిన ఈ రచనా వ్యాసంగంలో త్రికరణశుద్ధిగా నాకు సహకరించిన

***డి.టి.పి.:*** శ్రీమతి కె. కృష్ణకుమారి, శ్రీమతి లక్ష్మీరాజగోపాల్, శ్రీమతి వల్లీశ్రీనివాస్

***ఎడిటింగ్:*** శ్రీమతి వల్లీశ్రీనివాస్, చిరంజీవి చవ్వాకుల హవి

***ఎడిటింగ్ & డిజైనింగ్:*** శ్రీమతి కాటూరి తేజశ్రీ

***ప్రూఫ్‌రీడింగ్:*** శ్రీమతి అట్లూరి శ్రీలక్ష్మి

***కవర్‌పేజీ డిజైనింగ్:*** చిరంజీవి కాటూరి గార్గేయ ఋత్విక్

ఈ పుస్తక ప్రచురణకు సహకారాన్ని అందించిన పరివార్ సభ్యులందరికి మా కృతజ్ఞతాభి వందనములు తెలుపుకుంటూ వీరికి వీరి కుటుంబాలకు పూజ్యశ్రీ గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య- మాతాభగవతీదేవి శర్మగార్ల దివ్యఆశీస్సులు, శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవుల దివ్య ఆశీస్సులు పుష్కలంగా వర్షించాలని కోరుకుంటూ

**మీ రాజ్యలక్ష్మి**

**ఓం తత్సత్**

# ముందుమాట

ఇంకొక 1500 సంవత్సరాలకు గానీ నన్నెవరూ గుర్తించలేరు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారిని గురించి వారి అభిమానులు ఎవరికి తోచిన రీతిలో వారు రకరకాలైన ఊహాగానాలను చేస్తుండేవారు. కొంత మంది 'మాస్టర్‌గారు స్వామీ వివేకానంద అయివుంటారనే వారు. ఇంకొంత మంది మేడంబ్లావెట్స్కీయే తిరిగి ఈ రూపంలో జన్మించిందని' చాలా ధృఢంగా చెప్తుండేవారు. కొంచెం సాహసించి ఇంకెవరైనా వారి స్థాయిని గుర్తించటానికి చేసే ప్రయత్నంలో సూటిగా అలాంటిదేదైనా అడిగితే, 'అలాంటి ప్రయత్నాలు మీరెవ్వరూ, ఏమీ చెయ్యవద్దు. నేనేంటో మీరెవరూ గుర్తించలేరు.' అని చాలా స్పష్టంగా అనేవారు.

ఇక్కడ మనమొక ధర్మసూక్ష్మాన్ని గమనించాలి. మన కంటికి కనిపించే భౌతికజగత్తే కాకుండా, దానికావల ఇంకొక ఆరు ఆవరణలున్నాయని పెద్దలు చెప్తుంటారు. ఆధ్యాత్మిక గ్రంధాల్లో కూడా దీని వివరణ ఉన్నది. నిజానికి భౌతిక జగత్తుకు సంబంధించిన జ్ఞానమే మనకు చాలా తక్కువ. ఏ కొద్ది మంది దగ్గరో మనమలాంటి జ్ఞానాన్ని చూస్తుంటాము. అలాంటి మనం చేతనత్వం యొక్క ఏడు ఆవరణలలోనూ విస్తరించి జీవించే వ్యక్తి యొక్క వైభవాన్ని ఏవిధంగా గుర్తించగలం? అందుకే మాస్టర్‌గారు 'నేనెవరో గుర్తించే ప్రయత్నం చేయకండి. ఇంకొక 1500 సంవత్సరాలకు గానీ, నేనెవరో మానవజాతి గుర్తించలేదు.' అని ఒకానొక సందర్భంలో చెప్పారు.

ఇక్కడ మనం మాస్టర్‌గారి చేతనత్వం యొక్క ఔన్నత్యాన్ని గుర్తు చేసుకోవాలి. ఎందుకంటే అప్పుడు మాత్రమే ఆయన కార్యక్రమాలనుగానీ, సాధనావిధానాలనుగానీ కొద్దో, గొప్పో అర్థం చేసుకోగలుగుతాము. మాస్టర్‌గారెప్పుడూ తాము చేసే బీజారోపణ కార్యక్రమాలకు ఏదైనా ఆటంకాల్లాంటివి వస్తాయనే భావనతో ఉద్దేశ్యపూర్వకంగానే అధికసంఖ్యాకులను తమ సాధనా విధానాలకు ఆకర్షితులను కాకుండా చేసేవారు. ఇదే విషయాన్ని అమలాపురంలో శ్రీమతి నాగమణి గారింట్లో ఇలా చెప్పారు.

1. గురువు తన జీవితకాలంలో భవిష్యత్ ప్రణాళికలకు బీజాలు మాత్రమే వేస్తాడు. ఆయన వెళ్ళిపోయాక అవే క్రమంగా డెవలప్ అవుతాయి.

2. ఆ చేతనత్వం భూమ్మీద వుండగా ఎవ్వరూ గుర్తించలేరు. ఆయన వెళ్ళిపోయాక ఆయన ఫోటోలకు, విగ్రహాలకు దండలు వేసి పూజలు చేస్తారు అని.

సరే, ఇప్పుడిక్కడ మనమీ విషయాలను ఎందుకు గుర్తు చేసుకుంటున్నామంటే, పూజ్యశ్రీ మాస్టర్‌గారు తమ జీవిత కాలంలో అనేక కార్యక్రమాలకు బీజాలు వేసుకుంటూ వెళ్లిపోయారు. వాటన్నింటికీ ఇప్పుడు ఎరువు, నీరూ వెయ్యవలసిన బాధ్యత మనందరి మీదా ఉన్నది. కానీ ఒక్క విషయాన్ని మాత్రం మనమెప్పటికీ గుర్తుంచుకోవాలి.

24వేల రోజుల దివ్యప్రణాళికతో భూమ్మీద అవతరించిన చేతనత్వం.

అవతారపురుషులకు సైతం అందని చేతనత్వం,

అఖండగురుసత్తాలోని వ్యక్తులే నేరుగా వచ్చి కలవలేని చేతనత్వం,

ఈ భూమ్మీద నడయాడినప్పుడు, అనేక భవిష్యవాణులు చెప్పిన ఆ చేతనత్వం,

ఆ చేతనత్వం చేపట్టిన కార్యక్రమాలు, ఆ చేతనత్వం అందచేసిన సాధనా విధానాలు,

ఆ చేతనత్వం పంచిపెట్టిన ప్రేమాభిమానాలు, ఆ చేతనత్వం అందించిన జ్ఞానసంపద,

ఏ స్థాయిలో ఉన్నాయో గుర్తించగల ప్రజ్ఞ మనలో కనుక జాగృతమైనట్లైతే, అది కూడా ఆయన ఇచ్చిన  అనుగ్రహంగా భావించి, వారికి శతకోటి ధన్యవాదాలు తెలుపుకోగలిగితే మన జీవితం  ధన్యమౌతుంది.

# పాఠకులకు విజ్ఞప్తి

మాస్టర్‌గారి జీవితచరిత్రను మూడుభాగాలుగా విడుదల చేయవలెనని ప్రేరణ పొందిననాటి నుండి దీనినెలా రూపొందించాలనే తపనతో పూజ్యశ్రీ మాస్టర్‌గారినే శరణు వేడుకున్నాను. వారి నుండి వచ్చిన సూచనల ప్రకారమే మూడు చరణాలుగా, మూడుసంపుటాలను రూపొందించడం జరిగింది.

మొదటిసంపుటంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు జన్మించినది మొదలు ఉద్యోగ విరమణ చేసేంత వరకు అంటే 1948 అక్టోబరు 14 నుండి 2002 ఆగస్టు వరకు చేయించిన సాధనలు, స్థాపించిన ఆశ్రమాలు, అనుగ్రహ పీఠాలు మొదలైనవాటి వివరణ ఇవ్వడం జరిగింది.

రెండవ సంపుటంలో 2002 నుండి వారు చేసిన వివిధ కార్యక్రమాలు ముఖ్యంగా విశ్వ ఏకీకరణయజ్ఞాలు, అఖండ భాగవతయజ్ఞాలు, శ్రీమహాలక్ష్మి - గోమహాలక్ష్మి మంత్రజపాలు మరియు యజ్ఞాలు, భాగవతసప్తాహాలు, కుండలినీసాధనా శిబిరాలు ఇంకా 2007లో శాంతికుంజ్‌కు వెళ్ళటం లాంటి ప్రధానాంశాలున్నవి.

మూడవ సంపుటంలో 2008 ఫిబ్రవరిలో శాంతికుంజ్‌కు వెళ్ళి యుగశిల్పి సాధనా శిబిరం చేసివచ్చిన దగ్గర నుండి పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది కార్యక్రమాలకు శాంతికుంజ్ వారిచ్చిన నిర్దేశాల ప్రకారం అవిశ్రాంతంగా పనిచేసి వేలాదిమందికి ప్రేరణనిచ్చి, అందరినీ జన్మశతాబ్దికి శాంతికుంజ్‌కు తీసుకువెళ్ళి గురుదేవుల పట్ల తమకు గల శ్రద్ధా భక్తులను గురుదక్షిణగా సమర్పించుకున్నారు. ఆ తరువాత కూడా గురుసత్తా ప్రణాళికలో భాగంగా ఆశ్రమాలన్నింటినీ వ్యవస్థీకృతం చేసుకుంటూ, పూజ్యగురుదేవుల సూక్ష్మ నిర్దేశానుసారము తమ యొక్క వ్యక్తిగత సాధనలో అత్యున్నత శిఖరాలకు చేరుకుని, తమ ఇచ్ఛానుసారము 30 జూన్, 2014న అనగా సరిగ్గా 24000 రోజుల తమ భౌతిక జీవనయాత్రను మహాకాలునికి సమర్పించుకున్నారు.

*ఓం శ్రీరామభగవతీ శరణం మమ॥*

# సాప్తాహిక పారాయణ విధానము

## క్రమానుగత పట్టిక


క్రసం. అధ్యాయము ........................................ పేజీ నెం.

**I. మొదటి రోజు పారాయణ**

**గురు ప్రణాళిక – విశ్వప్రణాళిక ........................ 1**

1. శ్వేతద్వీపం అంటే ఏమిటి? ........................ 1

2. గురు సాన్నిధ్యము - ఆత్మానుభూతి ........................ 14

**II. రెండవ రోజు పారాయణ**

**సాధనలు – సిద్ధి ........................ 24**

3. మానవ జాతిపై గురువుల ఆశ ........................ 24

4. పరమ గురువులు - దీక్షా విజ్ఞానం ........................ 38

**III. మూడవ రోజు పారాయణ**

**గురుపరంపర – దత్త పరంపర ........................ 50**

5. పౌర్ణమి - గురువులతో అనుబంధం ........................ 50

6. దత్తుడు - స్మర్తుగామి ........................ 77

## IV. నాలుగవ రోజు పారాయణ

**మిషన్ ఆర్.కె - కార్యక్రమాలు ........................... 88**

7. మిషన్ ఆర్.కె. ........................... 88

8. ప్రదక్షిణలు - ఆపదల నివారణ ........................... 102

## V. ఐదవ రోజు పారాయణ

**మహాసంకల్ప - మహా యజ్ఞాలు ........................... 123**

9. శ్రీమహాలక్ష్మి సాధనలు ........................... 123

10. యుగపరివర్తన - సాధనలు ........................... 149

## VI. ఆరవ రోజు పారాయణ

**శ్రీకృష్ణ: లలితాంబికా ........................... 180**

11. శ్రీమద్భాగవత మహాయజ్ఞాలు ........................... 180

12. ఆత్మసాక్షాత్కారం ........................... 193

## VII. ఏడవ రోజు పారాయణ

**శాంతికుంజ్‌తో సంగతీకరణ ........................... 218**

13. ప్రాణశక్తి - కుండలినీశక్తి ........................... 218

14. కరిష్యే వచనం తవ ........................... 240

# నిత్య పారాయణా విధానము

**గణపతి ప్రార్థన**

మూడుసార్లు ఓంకారము

ఏకదంతాయ విద్మహే వక్రతుండాయ ధీమహి తన్నోదంతి ప్రచోదయాత్ ॥

**గురు ప్రార్థన**

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః॥

ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః అను గురు మంత్రమును 108సార్లు చేసుకుని పారాయణను మొదలు పెట్టాలి. పారాయణానంతరం ఆరతి, శుభకామనలతో ముగించ వలెను.

**ఆరతి**

జయ జగదీశ హరే శ్రీరామకృష్ణ దేవహరే ।

సూర్యచేతన సాధక ।

శ్వేత ద్వీపవాసా ।

శ్రీరామకృష్ణ దేవహరే ।

ఓం జయ జగదీశహరే ॥

శ్రీవత్స గోత్రజా శ్రీ సక్కుబాయి పుత్రా ।

అమరత్వా అనంతా ॥2॥

ఆపద్బాంధవా ।

శ్రీరామకృష్ణ దేవహరే ॥

మాత పితా గురు దైవము స్వామి అంతయు నీవే

మరి అంతయు నీవే ॥

అనుగ్రహమాలామంత్రదాతా ॥2॥

ధరణీ దీక్షా ద్రష్టా ।

శ్రీరామకృష్ణ దేవహరే ॥

ఓంకార రూప ఓజస్వరూపా ।

రామకృష్ణ మహదేవా ।

శ్రీరామకృష్ణ మహాదేవా ।

మంగళ ఆరతి అందుకో ॥2॥

మహాకాల రూపా।

శ్రీరామకృష్ణ మహాదేవా ॥

మహాకాల మహాకాల ఓం జయ మహాకాల మహాకాల ఓం ।

మహాకాల మహాకాల ఓం జయ మహాకాల మహాకాల ఓం జయ ।

మహాకాల మహాకాల ఓం ।

మహాకాల మహాకాల ఓం ॥

రామ కృష్ణ రామ కృష్ణ ఓం శ్రీరామకృష్ణ రామ కృష్ణ ఓం ।

రామ కృష్ణ రామ కృష్ణ ఓం శ్రీరామకృష్ణ రామ కృష్ణ ఓం శ్రీ ।

రామ కృష్ణ రామ కృష్ణ ఓం ।

రామ కృష్ణ రామ కృష్ణ ఓం ॥3॥

ఓం జయ సద్గురు దేవా

ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః

## మహా శుభ కామన

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం

న్యాయేన మార్గేణ మహీ మహీశాః

గోబ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యం

లోకా సమస్తాః సుఖినో భవంతు

కాలేవర్షతు పర్జన్యః పృథ్వీ సస్యశాలినీ

దేశోయం క్షోభరహితో బ్రాహ్మణా సంతు నిర్భయాః

సర్వేభవంతు సుఖినః సర్వేసంతు నిరామయాః

సర్వేభద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దుఃఖమాప్నుయాత్

అపుత్రాః పుత్రిణః సంతు పుత్రిణః సంతు పౌత్రిణః

నిర్ధనాః సధనాః సంతు జీవంతు శరదాం శతం

ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

అసతోమా సద్గమయా । తమసోమా జ్యోతిర్గమయా ॥

మృత్యోర్మా అమృతంగమయా । స్వార్థం మా పరమార్థంగమయా ॥


అవ్యవస్థాం మా సువ్యవస్థాంగమయా

ఓం శాంతిః శాంతిః శాంతిః శాంతిః శాంతిః

*భావం:* సకల ప్రాణికోటి క్షేమాన్ని కాంక్షిస్తూ సమస్త మానవజాతి శాంతి, సుఖము, సమృద్ధులతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ భావనాత్మకముగా ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి 12 గంటలకు లేని యెడల పడుకునే ముందు ఈ మహా కామన చేసుకోవాలి. ఈ సాధన చేయడము వలన మనము కోరుకున్నప్పుడు మనకు మన కుటుంబానికి శాంతి, సుఖము, సమృద్ధి చేకూరుతుంది.

# శ్రీ శ్రీరామకృష్ణ సమర్ధ సద్గురుదేవాయ నమః

భారతదేశం ఎంతోమంది గురువులు సశరీరములతో నడయాడిన పుణ్యభూమి. పూర్వ కాలంలో ఈ భూమిలో పుట్టిన ప్రతి ఒక్కరికి గురునామ మహిమను గురించి జన్మతఃనే కొంత అవగాహన ఉన్నది అనటం అతిశయోక్తి కాదు. భగవద్గీత, గురుగీతలు మన కర్మగీతలను మార్చి మనలో ఉన్న అజ్ఞానాంధకారములను పటాపంచలు చేయగల సశాస్త్రీయమైన విజ్ఞాన గ్రంధాలు. గురుగీత గురునామ మహిమను, గురుసేవామహిమను తెలిపుతుంది. మంత్రము, మంత్ర రూపాధి దేవత, యంత్రము అనునవి ఒకదానికి ఒకటి పూరకములు. మంత్రమునుండి వెలువడే శబ్ధమువలన ఏర్పడే రూపమే ఆ మంత్రాధి దేవత. గాయత్రీ మంత్ర స్వరూపమే గాయత్రీమాత ప్రత్యక్ష రూపము. సులువుగా అర్ధం చేసుకునేందుకు పదము పదార్ధముగా ఏర్పడుతుంది. మంత్రము పదము, రూపము పదార్ధము అని వాడుక భాషలో చెప్పుకొనవచ్చు. ఆధ్యాత్మిక మార్గము అనే బ్రహ్మవిద్యను నేర్చుకునే మార్గములో మనకు సహాయము చేయగల మార్గదర్శి మన గురువు. గురువు సహాయంతో మాత్రమే మనము పరిణామ క్రమములో మన లక్ష్యాన్ని సాధించగలం. గురు నామమే మనకి మన లక్ష్యానికి చేరుకోగల మార్గదర్శనాన్ని అందిస్తుంది. ఎంతో మంది గురువులు, ఎన్నో నామములు ఉన్నాయి. మరి మన శ్రీరామకృష్ణ గురుదేవులు "ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్ధ సద్గురుదేవాయ నమః" అనే మంత్రాన్ని ఇవ్వటానికి కారణం కేవలం అది తన పేరనేనా లేదు పూర్వ జన్మలో తన గురువు పేరు శ్రీ రామకృష్ణ పరమహంస అనా? లేదు రెండూ కలిసి వచ్చాయనా? ఈ మంత్రాన్ని అందరికీ అనుగ్రహించినప్పుడే ఈ మంత్ర గొప్పతనాన్ని తెలియచేసారు. రామ నామము శ్రీరాముడు జన్మించక ముందునుండి ఉన్నది, దానిని తారక మంత్రము అంటారు. రామనామ జపంతో భవిష్య బ్రహ్మగా పరిణితి సాధిస్తున్న హనుమంతులవారి పుణ్యచరిత్రే దీనికి నిదర్శనము. మాస్టర్‌గారు ఎప్పుడు ఏ మంత్రము నిచ్చినా అది అప్పటి దేశకాల పరిస్థితులకు బాగా ఉపయోగపడేదే అయి ఉంటుంది. ప్రస్తుత కాలములో మానవజాతి త్రీడైమన్షన్ వరల్డ్‌లో 90 శాతం ఆధిపత్యాన్ని సాధించి, 4త్ డైమన్షన్‌లోకి ప్రవేశించవలసిన సమయము ఆసన్నమయినది. గాయత్రీ మంత్రము మాత్రమే మానవజాతిని ఈ ఆపదల సమయములో 4త్ డైమన్షన్‌లోకి ప్రవేశించేందుకు కావలసిన శక్తిని ప్రసాదిస్తుంది. మానసిక తలాన్ని దాటి బుద్ధితలములో ప్రవేశింపచేయగల ఏకైక మంత్రము గాయత్రీమంత్రము. దీనికి మార్గదర్శనము చేయగల అతి ఉన్నతమైన మంత్రము "ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్ధ సద్గురుదేవాయ నమః".




అంటే ఏమిటీ?

Swastic - 4th dimension స్వస్తిక్ ఫోర్త్ డైమన్షన్ ను సూచిస్తుంది. దాని ఫలితము Grace అంటే అది అనుగ్రహమును ఇస్తుంది.

అలాగే శ్రీం అనే బీజాక్షరము హ్రీం మరియు క్లీం అనే బీజాక్షరాల సమన్వయమును తెలుపుతుంది.

రామ అనగా విద్యుశ్ఛక్తి (Electric energy)

కృష్ణ అనగా అయస్కాంత ఆకర్షణ శక్తి (Magnetic energy)

(పూజ్యశ్రీ మాస్టర్‌గారు జ్వాలాకూల్ మహర్షిగారి ఎ ట్రీటైజ్ ఆన్ కాస్మిక్ ఫైర్ అనే పుస్తకమును ఎడిట్ చేసినప్పుడు పేజి నం. 116లో పైన సూచించిన ఫార్ములాను వివరించారు)

ఫోర్త్ డైమన్షన్‌లోకి ప్రవేశిస్తున్న సాధకులకు ఆ డైమన్షన్‌కు సంబంధించిన అనుగ్రహాన్ని సాధకులపై వర్షింపచేయగల మంత్రము, ఆ లోకంలోకి ప్రవేశించేందుకు, తరువాత ఆ లోకంలో పనిచేసేందుకు కావలసిన మార్గదర్శనాన్ని అందిచగల మంత్రము, **"ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవాయ నమః" అను గురు మంత్రము. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా (హ్రీం, శ్రీం మరియు క్లీం) శక్తుల సమన్వయముతోనే సాధకుడు అంతఃకరణమను సేతువును దాటి ఉన్నత మానసిక తలములోకి ప్రవేశించి తదుపరి ఆత్మ బిందువును చేరుకోగలుగుతాడు. అదే ఈ మంత్రములోని 'శ్రీం' బీజము, ఇదే శ్రీచక్ర మధ్యస్థంగా ఉన్న బిందువు బీజ రూపము. సాధకుడు ఉన్నత లోకములలోకి సశరీరముగా ప్రవేశించటానికి కావలసిన కుండలినీ శక్తి = (Electric energy) విద్యుత్ శక్తి + (Magnetic energy) అయస్కాంత శక్తి రామకృష్ణ నామము నుండి లభిస్తుంది. అలా మనల్ని నడిపించగలవాడే**

**సమర్థ సద్గురు దేవులు. ఆ మంత్రము "ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవాయ నమః". గురు మంత్రమును, గాయత్రీ మంత్రమును నిత్యము క్రమపద్ధతిలో చేసుకుంటే పసిపిల్లవాడిని తన భుజాలమీద ఎత్తుకుని ఎదిగేవరకూ మార్గదర్శనం చేసే తండ్రివలె మనకు ఈ గురునామము మార్గదర్శనం చేసి అమ్మ గాయత్రీమాత ఒడిలోకి మన అందర్నీ చేరుస్తుంది.**

రామచేతనత్వమునందు విద్యుచ్ఛక్తి (Electric energy) ఉంటుంది. శ్రీకృష్ణుడిలోఅయస్కాంత సామర్థ్యము (Magnetic power) ఉంటుంది. అది సాధకులలో అభివృద్ధి చెందుతున్నప్పుడు, ఆ అయస్కాంత శక్తి దానికి తగిన వనరులను తనవైపుకు ఆకర్షించుకుంటుంది. ఈ ఆకర్షణను, శ్రీకృష్ణుడు తన మురళీస్వరముతో జరిపే 'రాసలీల'గా చేతనత్వ వైజ్ఞానికులైన ఋషులు అభివర్ణించారు. రామ చేతనత్వ అభివృద్ధిలో సుందరకాండ పారాయణ ప్రముఖపాత్ర వహిస్తే, కృష్ణచేతనత్వ అభివృద్ధి నందు భాగవతము యొక్క దశమస్కందము ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఈ రెండు శక్తిధారలను లక్ష్యము వైపు ఉపయోగించుకోవటానికి

**'ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయనమః'** అనే మంత్రం తోడ్పడుతుంది. ఈ మంత్రాన్ని పైన చెప్పిన రామ, కృష్ణ అర్థాలకు అన్వయించుకుంటూ ఉపయోగించుకోమని మాస్టర్ గారు మరీమరీ చెప్పారు. అన్ని సమూహాలకు ఈ రెండు లక్షణాలు చాలా అవసరం.

సమూహాలలో పని చేసేటప్పుడు ప్రతి వ్యక్తికి 'రామ' చేతనత్వం పలకాలి. రామనామము పలకాలి. ధర్మాన్ని ఆచరించాలి. దీని వలన కలిగే గురుచేతనత్వ స్పందనలకు అతని స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు పూర్తిగా లొంగిపోతాయి. ఈ శరీరాల లొంగుబాటు హనుమంతుడి జీవితంలో స్పష్టంగా చూడవచ్చు. దీనిని వ్యక్తిగత ధ్యానముతో పెంపొందించుకోవాలి.

మంత్రాలలో శబ్దం ముఖ్యం కానీ వ్యక్తి ముఖ్యం కాదు. దీనిని బాగా చదివి అర్థం చేసుకొని సమూహములుగా ఏర్పడి అందరూ కలసి సాధనలు చెయ్యాలి. నిత్యావతార దత్తక్షేత్రము, శంబళ, సప్తర్షి, కాకువాయి, రేపల్లెతో సహా అన్ని ఆశ్రమాలలో కూడా ఈ సాధనలను చేయటానికి తగిన ప్రణాళికలను వేసుకొని సమూహాలుగా కలిసి మెలసి పనిచెయ్యాలి. ఇందులో

**నిత్యావతార దత్త క్షేత్రం – ఇంటర్ ప్లానెటరీ ఆర్గనైజేషన్‌గా; శంబళ–ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్‌గా మారతాయి.**

**కండీషన్ – దానికి తగిన కృషి మీరు చేస్తే!**

# ప్రేమ

పూజ్యశ్రీ శ్రీరామకృష్ణమాస్టర్‌గారు మనపై కరుణతో ప్రసాదించిన అనేక మంత్ర సాధనలు, యోగ సాధనలు, ఉపాసనా విధానములు, ధ్యాన పద్ధతులను ఈ గ్రంధము ద్వారా అందిస్తున్నాము. శ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు, మానవుడు తన పరిణామ క్రమంలో ఉన్నత స్థాయిని చేరుకోవటం కోసం, నూతన మానవజాతికి అవసరమైన ఆధ్యాత్మిక సాధనలను బీజరూపములో అందిస్తున్నానని చెప్పేవారు. మూడు భాగములుగా అందిస్తున్న వారి దివ్యజీవనమునందు కొన్ని ముఖ్య సాధనలను అందించగలిగాము. ముఖ్యంగా వారు నిరంతరం ఆచరణాత్మకముగా చేసి చెప్పిన అతి తేలికైన సాధన 'ప్రేమ'. మీరు నిరంతరం ప్రేమ ధ్యానాన్ని చేసుకోవటం నేర్చుకోండి అని ఆ ధ్యాన విధానాన్ని ఆయన మాటలలోనే ఇలా చెప్పారు.

1. ఒకే విషయం గురించి నిరంతరం అన్ని కోణాలలోను తీవ్రంగా ఆలోచించటాన్ని ధ్యానం అంటాం. దాన్నే 'ప్రేమ' అంటాం. పసిబిడ్డని ఊయలలో పడుకోబెట్టి పని చేసుకుంటున్న తల్లి, ఏ క్షణంలో బిడ్డ అలికిడి చేసినా ఒక్క ఉదుటున బిడ్డ వద్దకు చేస్తున్న పనిని వదిలేసి పరుగుపెడుతుంది, ఎందుకంటే ఆమె మనస్సులో నిరంతరం బిడ్డపై ప్రేమ ఉంటుంది కనుక.

2. ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ ఏదీ కష్టం అనిపించదు, నిరంతరం ఏ పనిలో ఉన్నా ఇష్టమైన విషయముపై నుండి దృష్టిని మరల్చలేము కదా. మరి మీకు ఈ చరాచర సృష్టిని చేసిన భగవంతునిపై, గురువులపై ప్రేమ ఉంటే వారి పనులలో తదాత్మ్యత అప్రయత్నంగానే రావాలి కదా.

3. ప్రేమ ఎక్కడ ఉన్నదో, ఆసక్తి ఎక్కడ ఉన్నదో అక్కడ మీకు బోర్ కొట్టదు. మీ సాధనలలో మీరు ఎక్కువ సేపు మనస్సు నిలిపి కూర్చోలేకపోవటానికి కారణం మీరు చేసే పనిపైన మీకు ఆసక్తి లేకపోవటమే.

4. మీకు ఆధ్యాత్మిక లక్ష్యముపై ప్రేమలేదు కనుక మీరు ఒకరితో ఒకరు కలిసి పని చెయ్యలేకపోతున్నారు. లక్ష్యము ఉంటే తప్పక కలిసి పని చేస్తారు. రైలులో పరిచయంలేని ప్రయాణీకులు కలిసి సంతోషంగా పేక ఆడుకుంటుంటారు, మరి పేకాటపై ఉన్నంత ప్రేమ మీకు గురువులపై ఉందా లేదా ప్రశ్నించుకోండి.

5. మీరు గురువులు చేసిన కార్యక్రమాలను చదివి పులకించిపోవాలి. ఆధ్యాత్మిక జగత్తులో మనకి ప్రవేశం లేకపోవటానికి కారణం ఈ పులకింత లేకపోవటమే. ఆదర్శం మీద, లక్ష్యం మీద ప్రేమను పెంచుకోండి. ప్రేమ ఉంటే ఏ పనీ కష్టం అనిపించదు. గురునామము, భగవంతుని స్తోత్రాలన్నీ ఈ పులకింతను తెచ్చుకునేందుకే.

6. అణువణువునా వ్యాపించి ఉన్న ఆ గురుసత్తాకు స్పందించండి. ఆ సర్వసత్తాలో కరిగిపోండి. ఉప్పుతో చేసిన బొమ్మను సముద్రములో ముంచితే ఏమవుతుంది? సముద్రమే ఉంటుంది, అలా మీరు కూడా ఈ సర్వశక్తిమంతంలో, సర్వవ్యాపకత్వంలో లీనమైపోండి. ఏ అద్భుత శక్తి ఈ ప్రపంచాన్ని నడిపిస్తోందో ఆ శక్తితో మమేకమైపోండి.

ఆ ప్రేమ మూర్తి తన అనంత జ్ఞానసాగరమునుండి అందించిన ఒక్క బిందువుని సేవించినా, వారి ప్రేమ తత్వాన్ని తెలుసుకొని ఆచరించినా, ఆ గురుచరణాలకు మనల్ని మనం సమర్పించుకున్నట్లే.

# I గురు ప్రణాళిక - విశ్వప్రణాళిక

## అధ్యాయం-1
## శ్వేతద్వీపం

### మరోమలుపు :

మహామహితాత్ములైన మాస్టర్‌గారి సన్నిధిలో ఉండగలగడం, వారికి సేవలను అందించ గలగడం, వారి దివ్య అమృతవాణిని ఆస్వాదించగలగడం అనేవి ఎంతో అరుదైన అనుభవాలు. దివ్యాత్ములైన పూజ్యశ్రీ మాస్టర్‌గారి తత్వాన్ని కానీ, జీవన విధానాన్ని కానీ, వారి యోగమును గురించి కానీ అర్థం చేసుకోగలగడమనేది అంత సులభమైన విషయమేమీ కాదు. వారి జీవన విధానాన్ని గమనిస్తూ, వారి బోధనలను విని, అర్థం చేసుకొని, అనుభూతి చెంది తిరిగి దానిని పదిమందికి అర్థమయ్యే విధంగా చెప్పగలగడమనేది కూడా ఒక సాధనే. పూజ్యశ్రీ మాస్టర్‌గారి జీవితం దివ్య ప్రణాళికకు మరియు పరమగురువుల పరంపరకు సమర్పణ చేసుకున్న ప్రయాణము. అలాంటి మహనీయుని గురించి ఎంతని చెప్పగలం? ఏమని వ్రాయగలం?

దైవీప్రణాళికలోని భాగంగానో, తల్లిదండ్రుల తపఃఫలితంగానో, జన్మ సంస్కార సుకృతముల ఫలితంగానో ఆ మహనీయుని మార్గదర్శనంలో పరమగురువుల దివ్య ప్రణాళికలను విని అర్థం చేసుకొని వారి సాన్నిధ్యంలో సాధన చేసుకున్నవారి జీవితాలను, వారికి కలిగిన ఆ అదృష్టం తలుచుకుంటేనే ఒడలు పులకరిస్తాయి. సామాన్యులకు ఆధ్యాత్మిక జీవితంలో ఓ-న-మాలను దిద్దబెట్టి, పరమగురువులందించే ప్రణాళికల్లో భాగస్వాములని చేసి, వారి సేవా కార్యక్రమాలలో పాలుపంచుకునే భాగ్యం అనేకానేక దివ్యాత్మలకు లభించిందని చెప్పడంలో ఇసుమంత కూడా అతిశయోక్తి లేదు. మాస్టర్ ఆర్.కె.గారు పారసమణివంటివారు. ఎంతటి కఠినమైన ఇనుమైనా సరే వారి సాంగత్యంలోకి వెళ్ళిందంటే బంగారంలాగా మారిపోవలసిందే! ఆ పారసమణి వారి ప్రేమయే.

వాలెంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చేసిన తరువాత కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకు రావాలనే ఉద్దేశ్యంతో మాస్టర్‌గారు హైదరాబాదుకు వెళ్ళారు. అక్కడ వారు తమ తమ్ముడి గారింట్లో ఉంటూనే తమ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలను చురుగ్గా చేస్తున్నారు.

ఒకరోజున శ్రీమతి విజయావిశ్వనాథ్‌గారు హైదరాబాదు నుంచి నాకు ఫోన్ చేశారు. మామూలు క్షేమసమాచారాలు అయ్యాక, 'రాజ్యలక్ష్మిగారు నన్ను రమ్మని పిలువలేదు, హైదరాబాదు వచ్చాక ఆవిడ నన్ను మర్చిపోయారేమో!' అని మాస్టర్‌గారు అన్నారని చెప్పారు. అప్పట్లో నేను, స్వర్ణ జిల్లాపరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయినిగా ఉద్యోగం చేస్తుండేదాన్ని. మాస్టర్‌గారు గుంటూరులో ఉన్నంత కాలం సప్తర్షి ఆశ్రమంలోగాని వేరే బయట ఎక్కడైనా సాధనా క్యాంపులు అవీ జరిగితే వెళ్ళడం, వాటి నిర్వహణ బాధ్యతలవీ చూచుకునేదాన్ని. వారు హైదరాబాదు వెళ్ళాక కేవలం 'మేధా' మాగజైన్ పని మాత్రమే చేస్తుండేదాన్ని. శ్రీమతి విజయగారు ఇలా అని చెప్పగానే మనస్సులో చాలా బాధపడ్డాను. అయ్యో నిజంగానే మాస్టర్‌గారిని అలా ఒక్కసారైనా రమ్మని పిలవాలని తట్టలేదు. ఎంత పొరపాటు చేశాను అని ఎంతో నొచ్చుకొని ఒక్కసారి రమ్మని చెప్పాలని శ్రీశ్రీ మాస్టర్‌గారికి ఫోన్ చేశాను. మాస్టర్‌గారే స్వయంగా ఫోన్ తీసుకొని, 'నేను ఊరికే అలా ఎలా వస్తాను, నేను వస్తే ఇంక అక్కడే ఉండిపోతాను. నాకేం కావాలో తెలుసు కదా! ఆ విధంగా ఇంటిని ఏర్పాటు చేసి పిలిస్తే వస్తాను. ఎవరు పిలిచినా వస్తాను, ఎవరు ముందు పిలిస్తే వాళ్ళ దగ్గరకు వెళ్తాను' అని చెప్పారు.

ఇలా ఉండగా ఒకరోజున సాయి భక్తురాలు శ్రీమతి విమల, మాస్టర్‌గారి దగ్గరికొచ్చి త్వరలోనే జరుగబోయే భరద్వాజ మాస్టర్‌గారి జన్మదిన వేడుకలకు ఆహ్వానించింది. ఇలాంటి కార్యక్రమాలకు మాస్టర్‌గారు తప్పనిసరిగా వెళుతుంటారు కనుక ఆమె ఆహ్వానాన్ని మన్నించి కుకట్‌పల్లిలో జరిగే ఆ కార్యక్రమానికి వెళ్ళారు. అలా వెళ్ళిన వారు కొంతమంది కార్యకర్తల ఆహ్వానం మేరకు అక్కడే కొన్నాళ్ళు ఉండి ప్రచార కార్యక్రమాలను కొనసాగించటానికి నిర్ణయించుకుని తమకొక నివాసాన్ని ఏర్పాటు చేయమని చెప్పారు. తక్షణమే అక్కడున్న కార్యకర్తలు సాధనా, స్వాధ్యాయం చేసుకుంటూ సాధనా శిబిరాలను కూడా నిర్వహించటానికి వసతిగా ఉన్న ఒక భవనాన్ని కుకట్‌పల్లిలో ఏర్పాటు చేశారు. అక్కడికి దగ్గర్లోనే ఉన్న శ్రీమతి భానుమతిగారు, సదానందమూర్తిగారు మాస్టర్‌గారి భోజన, వసతి సదుపాయాలు చూసుకుంటుండగా శ్రీమతి తేజ, లక్ష్మీ కస్తూరిగార్లు, కుమారి

అనూష, శ్రీ మహేంద్ర, పూజ్య మాస్టర్‌గారికి అనువాద కార్యక్రమాలు మరియు ఇతర కార్యక్రమాలలోను సహాయం చేస్తుండేవారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారి పద్ధతులు, జీవన విధానం, ఎటువంటి వ్యవస్థ కావాలి అనేది ఇన్నేళ్ళుగా చూస్తున్న నాకు అన్ని విషయాల మీద పూర్తి అవగాహన ఉంది. వారిని తీసుకురావాలని ఉన్నా మాకు ఒంగోలులో ఇల్లు లేదు. ఎలా తీసుకురావాలి? అని మధనపడుతుండగా మా పెద్దల్లుడు శ్రీనివాస్, 'మన ఇల్లు వుందిగదా, దానిని వారికి కావలసినట్లుగా మార్చి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి, రమ్మని చెప్దాము' అంటూ స్వయంగా మాస్టర్‌గారికి వెంటనే ఫోన్ చేశారు. అంతా విని మాస్టర్‌గారు ఒంగోలు రావటానికి ఒప్పుకున్నారు. దాంతో వెంటనే పని ప్రారంభించారు. మా రెండవ అల్లుడు శ్రీరంగనాథ్ కూడా కలిశారు. వారం రోజుల్లోనే వారిద్దరు ఎంతో దీక్షతో మాస్టర్‌గారికి కావలసిన రీతిలో అన్ని ఏర్పాట్లు చేసి "శ్వేతద్వీపం" ఇంటిని సిద్ధం చేశారు.

కుకట్‌పల్లిలోని బాబా మందిరములో మాస్టర్‌గారు ప్రతిరోజూ సాయంత్రం ప్రవచనం చెప్పేవారు. ఇక్కడ ఉండగానే 'సర్వసహా మాతాజీ జీవిత చరిత్ర'ను తెలుగులోకి అనువదించడం ప్రారంభించారు. ఒకనాడు వారు ఆ పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో పుంసవన సంస్కారం చేయించుకోవాలని శ్రీమతి స్నేహలత, శ్రీనివాస్‌గార్లు మాస్టర్‌గారి దగ్గరకు వచ్చారు. సాక్షాత్ దుర్గాదేవి అవతారమైన మాతాజీ జీవిత చరిత్ర వ్రాస్తున్న సందర్భంలో వచ్చిన ఆమెకు పుంసవన సంస్కారం చేయించి, పుట్టబోయే పాపకు 'భగవతి' అనే పేరు పెట్టమని చెప్పారు. శ్రద్ధావంతులైన వారు పుట్టిన పాపకు 'భగవతి' అనే పేరు పెట్టారు. మాతాజీని చిన్నప్పుడు ముద్దుగా "లాలి" అని పిలిచేవారు, కనుక మీరు కూడా పాపను ప్రేమతో 'లాలి' అని పిలవండి అని చెప్పారు. అలా అటు మాతాజీ ఆశీస్సులు, మాస్టర్‌గారి అనుగ్రహముతో పుట్టిన ఆ పాప ఎంత అదృష్టవంతురాలో కదా! మాస్టర్‌గారు ఒంగోలుకు వచ్చాక ఆ అనువాదము పూర్తి చేసి ఇవ్వగా శ్రీ విశ్వనాథ్‌గారు దానిని అచ్చువేయించి డిసెంబరు 7వ తేదీన మాస్టర్‌గారి చేతనే ఆవిష్కరింప చేశారు. తన రిటైర్‌మెంట్ తర్వాత హైదరాబాదులో తన కార్యక్రమాలను అక్కడే ఉండి విస్తరింప చేస్కుందాం అనుకున్నారు. 2002 సంవత్సరం నవంబర్ 9వ తేదీన శ్రీ సత్యనారాయణరావుగారు హైదరాబాదుకు వెళ్ళి పూజ్యశ్రీ మాస్టర్‌గారిని ఒంగోలుకు తీసుకువచ్చారు. వారు వస్తూనే శ్వేత ద్వీపంలో 'అఖండజ్యోతి' వెలిగించారు. మాస్టర్‌గారి రాక విని చాలా మంది పరివార్ సభ్యులు

వచ్చారు. అందరిని ఉద్దేశించి తాను చేయబోయే కార్యక్రమాలను గురించిన సందేశాన్ని సంక్షిప్తంగా చెప్పారు. రేపటి నుండి 'శ్వేతద్వీపం'లో గురుకుల పాఠశాల ప్రారంభించబోతున్నానని ప్రకటించారు. అలా మాస్టర్‌గారు ఎక్కడ ఉన్నా సాధన, స్వాధ్యాయ, సత్సంగాల పట్ల పూర్తి నిష్ఠను కలిగివుండేవారు. శ్వేతద్వీపంలో సాధనా, సత్సంగాలు పరిపూర్ణ నిష్ఠతో కొనసాగుతున్నాయి.

పూజ్యశ్రీ మాస్టర్‌గారి నిర్దేశం ప్రకారం వారు ఉండబోయే ఇంటిపేరు 'శ్వేతద్వీపం' అని బోర్డు వ్రాయించి పెట్టారు. 'ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం' అనే మంత్రానికి అనురూపంగా సాయి, వేంకటేశ్వరస్వామి, శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల ఫోటోలను దేవస్థాపన మాదిరి ఏర్పాటు చేయించారు. సాధన విషయానికి వస్తే సాధకులందరూ ఉదయం పదిగంటలకల్లా శ్వేతద్వీపానికి రావాలి. ఆసనాలు, ప్రాణాయామాలు, మంత్ర జపాలు, ఆరతి అయ్యాక భోజనానికి వెళ్ళేవారు. మళ్ళీ వచ్చాక మూడు నుండి ఐదు గంటల వరకు క్లాసులు, మళ్ళీ సాయంత్రం ఆరు గంటలకు తొమ్మిది దీపాలు వెలిగించి దీపయజ్ఞం, ఆరతి. ఈ ప్రకారం అందరూ క్రమశిక్షణతో కార్యక్రమాలకు హాజరౌతుండేవారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఎక్కడుంటే అక్కడ సాధనతో పాటు సందడి, సందడితో పాటు సంతోషం కూడా ఉంటాయి. అప్పుడప్పుడు సినిమాలకు వెళ్ళడం, ఎంతో హాయిగా, ఆనందంగా సరదాగా రోజులు క్షణాల్లా గడిచిపోయేవి. శ్రీశ్రీ మాస్టర్‌గారు ఉద్యోగానికి రిజైన్ చేసి రావడంతో, అప్పటి వరకు సెలవులు పెట్టుకుంటూ మాస్టర్‌గారితో పాటు కార్యక్రమాలకు వెళుతుండే నేను కూడా ఉద్యోగ విరమణకు దరఖాస్తులు పెట్టుకున్నాను. సరే, అసలు

## శ్వేతద్వీపం అంటే ఏమిటి?

'శ్వేతద్వీపం' యొక్క విశిష్ఠతను గురించి కొన్ని విషయాలు చెప్పాలి. అసలు శ్వేతద్వీపమంటే ఏమిటి? అక్కడ ఎవరుంటారు? వారేం చేస్తుంటారు? అనే దానికి మాటల సందర్భంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు అప్పుడప్పుడు కొన్ని మణిమాణిక్యాల వంటి మాటలను చెప్తుండేవారు. అలాగే 'సిద్ధాశ్రమ యోగులు' అనే పుస్తకంలో ఈ ప్రదేశాలను గురించిన సంపూర్ణమైన వివరణ ఉన్నది. హిమాలయ పర్వత ప్రాంతాలలో, అనేక స్థలాలలో దీని వివిధ భాగాలున్నవని, భిన్న సంప్రదాయాలకు చెందిన యోగులవర్గాలు అక్కడ అనేక ప్రదేశాలలో నివశిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. ఉదాహరణకు

శ్రీకృష్ణ నిర్యాణానంతరం కృష్ణభక్తులు ఉద్ధవుని దగ్గరకు వచ్చి 'కలియుగం ప్రారంభమైంది, తపస్సు చేసేవాళ్ళు తగ్గిపోతున్నారు. చేసినా యుగప్రభావం వల్ల తపస్సు ఫలిస్తుందన్న నమ్మకం కలగడం లేదు. దీనికి మీరే మార్గం సూచించాలి' అంటే అప్పుడు ఉద్ధవుడు హిమాలయ సిద్ధాశ్రమంలోని ఒక ప్రదేశాన్ని నిర్దేశించి ఇక్కడ తపస్సు చేస్తే శీఘ్రంగా ఫలిస్తుందని తెలియజేశారు.

పూజ్యశ్రీ నారాయణదత్త శ్రీమాలిగారు గొప్పసాధకులు. వారు మంత్ర, తంత్ర, యంత్ర విజ్ఞానం మీద పూర్తి ఆధిపత్యాన్ని పొందిన సిద్ధసాధకులు. వారు మంత్ర, తంత్ర, యంత్ర అనే మాసపత్రికను కూడా నడిపేవారు. మన మాస్టర్‌గారు వారిని గురించి 'వారు చాలా గొప్ప నైష్ఠికసాధకులని, సిద్ధపురుషులని' చెప్తుండేవారు. వారు సిద్ధాశ్రమం గురించి ఏం చెప్పారంటే, "ఇది మానస సరోవరానికి ఈశాన్యదిశలో వందల మైళ్ళ ప్రాంతంలో విస్తరించి ఉన్నది. అది పై నుండి విమానంలో చూస్తే కనిపించేది కాదు. ఫోటోలకు అందేది కాదు. అక్కడ కొన్ని చోట్ల వేదఘోష, కొన్ని చోట్ల నిశ్శబ్ద తపస్సు, కొన్ని చోట్ల సాధనలను గురించిన ప్రవచనాలు, బ్రహ్మర్షుల అనుగ్రహ భాషణలు జరుగుతుంటాయి. ఇక్కడ ఎవరికీ బాధలు, రోగాలు, ముసలితనపు కష్టాలు ఉండవు. అప్సరసలు సైతం మహర్షుల అనుగ్రహం కోసం ఆడుతూ పాడుతూ ఉంటారు. నిరంతర సమాధిలో ఉండే మౌనులనిక్కడ దర్శించవచ్చు" అని వ్రాశారు.

సిద్ధాశ్రమం ఒక ఊహా ప్రదేశం కాదు. నిజంగా భౌతికంగా ఉన్నదని నిరూపించటానికి శ్రీమాలిగారు దేశ, విదేశ ప్రముఖులను కొందరిని తీసుకువెళ్ళి కొన్ని గంటల పాటు ఈ దివ్యప్రదేశాలను, అక్కడి మహాత్ములను దర్శింపజేశారు. వారిలో ప్రఖ్యాత అమెరికన్ అణుశాస్త్రవేత్త జెఫ్, బ్రెజిల్ వైద్యుడు డా॥పూలింగ్, హాలివుడ్ సుందరి బీలే, శాస్త్రవేత్త ఎమర్సన్, ఖగోళ శాస్త్రవేత్త పహారిచ్, చంద్రగ్రహ చోదకుడు సిరాంగ్, కంప్యూటర్ విజ్ఞాన ఆద్యుడు హెూరి. వీరంతా ముక్తకంఠంతో ఈ దివ్యప్రదేశము యొక్క మహత్తును కొనియాడారు. మహావతార్ బాబాజీ, బదరీ ప్రాంతాన్ని కేంద్రంగా పెట్టుకున్న జ్ఞానగంజ్‌తో సన్నిహిత సంబంధం కలిగిన మహాత్ములు. పండిట్ గోపీనాథ్ కవిరాజ్ (వీరిని మన మాస్టర్‌గారు దర్శించారు)గారు రచించిన గ్రంథాల్లో వీటిని గురించి ఇంకా ఎన్నో విశేషాలు వివరంగా ఉన్నాయి.

ఈ ప్రదేశంలో మరికొందరు మహాత్ములు ఉన్నారు. వారిలో మన ఆంధ్రుడైన త్రైలింగస్వామి, భోగనాధుడు, రామదేవర్ వంటి మహాత్ములేకాక పురాణాలలో చెప్పబడిన అశ్వత్థామ, బలి, వ్యాసుడు,

హనుమంతుడు, విభీషణుడు, కృపుడు, పరశురాముడు మొదలైన చిరంజీవులందరూ ఈ సిద్ధభూమిలో సాధనలు చేస్తూ సాధకులను అనుగ్రహిస్తూనే ఉంటున్నారు. ఈ ఏడు మంది చిరంజీవుల పేర్లను ఎవరైతే తమ పుట్టినరోజునాడు స్మరిస్తారో వారికి ఆయురారోగ్యాలు ఇంకా వారి ఆశీర్వాదాలు లభిస్తాయి. వారిని స్మరించే దివ్యశ్లోకం ఈ క్రింద ఇవ్వబడింది.

**అశ్వత్థామో, బలిర్వ్యాసః, హనుమాంశ్చ, విభీషణః।**
**కృపశ్చ పరశురామశ్చ సప్తైతే చిరంజీవినః ॥**

ఇంత మహత్తరమైన, శక్తివంతమైన ప్రదేశాన్ని ఒక నమూనాగా తయారుచేసుకొని 'శ్వేతద్వీపము' పేరుతో సాధకులను తయారుచేసేందుకు పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఇక్కడ బీజారోపణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా వారు 'దేవస్థాపనలు' చెయ్యాలనే దీక్షను తీసుకున్నారు. డిసెంబర్ 19వ తేది దత్తజయంతి సందర్భంగా వేటపాలెం, దత్తక్షేత్రంలో 108 కుండీల యజ్ఞము నిర్వహించి అందులో వందలాదిమందికి దేవస్థాపన ఫోటోలనిచ్చారు. దానితో పాటు మేదరమెట్లలో ఉన్న సిద్ధిరాజు దత్తపీఠంలో కూడా దీపయజ్ఞ కార్యక్రమాలు చేసి 'దేవస్థాపన'లను వందలాదిమందికి అందించారు. అలా కార్యక్రమాలు చేస్తూనే ఒక క్రొత్త యజ్ఞానికి రూపకల్పన చేశారు. దాని పేరు గాయత్రీ, లలితా, భాగవత విశ్వఏకీకరణ యజ్ఞము. అది ఎందుకు చేశారు అనే విషయం గురించి, ఈ యజ్ఞ వైశిష్ట్యాన్ని గురించి తెలుసుకుందాం.

## గాయత్రీ, లలితా, భాగవత, విశ్వఏకీకరణ యజ్ఞము అంటే ఏమిటి? ఎందుకు ఈ ప్రయోగం చేశారు?

గాయత్రీ, లలితా, భాగవత, విశ్వఏకీకరణ యజ్ఞములను ఒక విశిష్ట ప్రయోజనం కోసం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. అసలు యజ్ఞము అనే పదాన్ని గురించి గీతలో 'యజ్ఞానాం జపయజ్ఞోస్మి' అంటాడు శ్రీకృష్ణుడు. అంటే జపం కూడా యజ్ఞమనే కదా! దాని తర్వాత స్వాధ్యాయ యజ్ఞము అని ఇంకో యజ్ఞం ఉన్నది. విద్యార్థులందరూ ఈ యజ్ఞమునే చేస్తారు. అందుచేత అలా ఏదైనా ఒక విషయాన్ని యజ్ఞములాగా అధ్యయనము చేసినప్పుడు మాత్రమే నీకు ఫలితం వస్తుంది. అందుచేత యజ్ఞము అంటే ఒక నిర్ణీత లక్ష్యానికి చేర్చే మార్గము. యజ్ఞము ఎప్పుడు కూడా ప్రమాదరహితమైన, నిష్కంటక ప్రాయమైన మార్గమని అర్థము. యజ్ఞము అనేది ఒక రాజమార్గము.

అనేక మంది మహర్షులు, మహాత్ములు ఆ దారి వెంట ప్రయాణించి ఫలితాలు పొంది, నీవు చెయ్యి నీకు ఫలితం వస్తుంది అని చెప్పారు. ఆ మహనీయులు చెప్పిన దారిలో వెళ్తే మంచి ఫలితాలు వస్తాయి. అందుచేత యజ్ఞము అంటే ఈ మూడు శక్తులను ఉపయోగించుకునే దారి. ఏ మూడు శక్తులను అంటే సంకల్పము-జ్ఞానము-వనరులు. దాన్నే మనం ఇచ్ఛాశక్తి-జ్ఞానశక్తి-క్రియాశక్తి అంటాము. ఇచ్ఛ అనగా సంకల్పము, జ్ఞానము అనగా ఎలా చెయ్యాలి అనే అవగాహన, క్రియ అనగా ఉన్న వనరులను, జ్ఞానముతో ఉపయోగించుకునే విధానము. ఉదాహరణకు పాయసం తయారుచెయ్యాలి. మరి దాన్ని తయారుచేయటానికి కావలసిన జ్ఞానము ఉండాలి, కావలసిన వనరులు ఉండాలి. జ్ఞానము ఉంది, వనరులు ఉన్నాయి, చెయ్యాలంటే నీకు బద్ధకంగా ఉంది. అంటే సంకల్పం లేదు, కోరిక బలంగా లేదు. క్రియాశక్తి కూడా లేదు. ఈ మూడింటిలో ఏది లోపించినా లక్ష్యాన్ని చేరలేము. అందుచేత ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి ఈ మూడింటినీ కలుపుతూ మనల్ని లక్ష్యం వైపుకు తీసుకువెళ్ళేటటువంటి మార్గాన్ని యజ్ఞము అంటారు.

**'విశ్వఏకీకరణ' అనే పరమగురువుల మహాలక్ష్యాన్ని పొందటానికి ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులు మూడింటినీ కలిపి ఒక యజ్ఞాన్ని శ్రీశ్రీ మాస్టర్‌గారు మనకు గాయత్రీ-లలితా-భాగవత మరియు విశ్వఏకీకరణ యజ్ఞముగా పరిచయం చేశారు.** ఇందులో

**మొదటిది గాయత్రీ సాధన:** ఇక్కడ మనం అర్థం చేసుకోవలసిందేమిటంటే, 'గాయత్రీ అంటే మాకు సద్బుద్ధి కావాలనే సంకల్పం' గాయత్రీలోని భావన కూడా అదే. 'హే! సూర్యదేవా మాకు సద్బుద్ధిని ప్రసాదించు' అని. మనమిలా ప్రార్థించినా, గాయత్రీ చేసినా అదే ఫలితం వస్తుంది. గాయత్రీమంత్రాన్ని, ఋషులు శబ్దవిజ్ఞానాన్ని ఉపయోగించి మనకందించారు. శబ్దవిజ్ఞానంతో కలిపి ఇచ్చారు కనుకనే అది సద్బుద్ధిని త్వరగా ఇస్తుంది.

**రెండవది లలితా సాధన:** పూజ్యశ్రీ మాస్టర్‌గారు చెప్తుండేవారు, నాకు తెలిసి లలితా పారాయణలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కోట్ల కోట్ల పారాయణలు జరుగుతున్నాయి.

**శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ, చిదగ్నికుండ సంభూతా దేవకార్యసముద్యతా॥**

అంటే లలితాదేవి ఏంచేస్తుంది? డివైన్ వర్క్ చేస్తుంది. అంటే దేవతల కార్యము. దేవకార్య సముద్యతా, ఉద్యత అంటే సంకల్పం, అంటే ఉద్యమించటం. అందుచేత దేవకార్యముల నిర్వహణ

కోసం ఈ యజ్ఞం ఉపయోగపడుతుంది. దేవకార్యసముద్యతా అంటే **నీవు ఎప్పుడైతే ఇతరుల కోసం పని చేస్తావో, అది నీకు అనేక రెట్లుగా తిరిగి వస్తుంది.** ఈ **విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి. మీకేదైనా బాగా కావాలనుకుంటే మీరు ముందు ఇవ్వడం నేర్చుకోండి.** ఇతరులకి గోరింటాకు పెడుతున్న వారి చెయ్యి కూడా పండుతుంది కదా. అలాగే దేవకార్యసముద్యతా అంటే ప్రపంచం కోసం ఎలా జీవించాలన్నది నేర్చుకోవాలి. అది ఎలా అనేది ఈ యజ్ఞంలో నేర్పబడుతుంది. **గాయత్రీతో సద్బుద్ధిని పొంది, మీరు ఇతరుల కోసం పనిచేయడమే లలితాసాధన.** దీని తర్వాత మూడవది భాగవత సాధన.

**భాగవత సాధన:** ఇది జగద్గురువు శ్రీకృష్ణుని కాన్సెప్ట్. గురువులందరూ ఏమి చేస్తారు? వాళ్ళ జ్ఞానాన్ని ఇతరులకి ఇస్తారు. గురువు నీకిచ్చిన జ్ఞానానికి సమానంగా తిరిగి నీవు ఏమీ ఇవ్వలేవు, నీవు ఏమి ఇచ్చినా ఋణం కూడా తీర్చుకోలేవు. నేనెందుకు ఇవ్వాలండి? అంటే అసలు కృతజ్ఞత అనేది మనకు లేదు అని అర్థం. ఈనాటి విద్యావ్యవస్థ కృతజ్ఞతను నాశనం చేసేసింది. నేను ఫీజు కట్టాను–మీరు చదువు చెప్పారు అంతే, అయిపోయింది అంటారు. అసలు **నీకు కృతజ్ఞత ఉంటే నీవేం చేయాలి అంటే ఆ జ్ఞానాన్ని ఇతరులకు పంచాలి. ఆ జ్ఞానాన్ని అలా ఇతరులకు పంచే పరంపరనే గురుపరంపర అంటారు.** దానినే

**నారాయణ సమారంభం శంకరాచార్య మధ్యమాం ।**
**అస్మదాచార్య పర్యంతం వందే గురుపరంపరాం ॥**

అంటారు. అంటే మన ఋషులు గురుపరంపరకు ఎంత గొప్పస్థానాన్ని ఇచ్చారో ఈ ఒక్క శ్లోకంలో తెలిసిపోతుంది. భాగవతము దీనికి ఆధారము. రాశిచక్రములో 12 రాశులు ఉంటాయి. నిజానికది గురుపరంపర. ఈ 12 రాశుల యొక్క జ్ఞానాన్ని ఇతరులకు అందచేయగలిగే గురుతత్వము లేక గురుపరంపర మన చుట్టూ అంతరిక్షంలో ఉన్నది. అది శ్రీమద్భాగవతంలో మనకి 12 స్కంధాలుగా అందించబడింది. **ప్రతి సద్గురువు జీవితచరిత్రను మనం శ్రీమద్భాగవతంలో దర్శించ వచ్చు.**

**ఇక్కడ లక్ష్యము ఏమిటి?** "విశ్వఏకీకరణ" – "వసుధైక కుటుంబకము": కాస్త మనసు పెట్టి ఆలోచిస్తే ఎలాంటి సమయంలో ఈ సంకల్పం వచ్చిందో అర్థమౌతుంది. మొబైల్ ఫోన్స్ ద్వారా

మీరు ఎక్కడికైనా మాట్లాడవచ్చు. టి.వి.ల ద్వారా ఎక్కడో జరుగుతున్న యుద్ధాలను కూడా ప్రత్యక్షంగా చూడవచ్చు. ఒక్క సంజయుడే కాదు, ఈనాడు ప్రతి ఒక్కరూ అన్నీ వినగలుగుతున్నారు, చూడగలుగు తున్నారు. ఈ విధంగా భూగ్రహం అంతా ఒక్కటైంది. కానీ మనం ఒక్కటి కాలేకపోతున్నాము. అన్ని సదుపాయాలు వచ్చాయి, మనం వాటిని ఉపయోగించుకుంటున్నాము. కానీ మనం బాధ్యతను మర్చిపోతున్నాము. వనరులనేవి ఒక సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి మాత్రమే పరిమితమౌతున్నాయి. **వసుధైక కుటుంబకములోని వ్యక్తి తన సామూహిక బాధ్యతను యజ్ఞప్రక్రియతో సాకారం చేసుకునేందుకే ఈ విశ్వఏకీకరణయజ్ఞం ప్రారంభమైంది.**

ఈ ప్రపంచాన్ని మేము కూడా ప్రేమిస్తున్నాము. భారతదేశం నా మాతృభూమి, కనుక దీనికి మేము చేయగలిగేదేదో ఈ విశ్వఏకీకరణ యజ్ఞము ద్వారా చేస్తాము అనే తీవ్రసంకల్పంతో యజ్ఞము చేద్దాం. ఈ యజ్ఞానికి ఆ పేరే ఎందుకు పెట్టుకున్నామో అర్థమైంది కదా! దీనిని శక్తి వంచన లేకుండా అందరం కలసి కృషిచేసి దీనిని విశ్వవ్యాప్తం చేద్దాం. గాయత్రీ, లలితా, భాగవత మరియు విశ్వఏకీకరణ యజ్ఞం యొక్క కాన్సెప్ట్ అర్థమైంది కదా !

ఎంతో లోతైన అంతరార్థంతో పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఈ విశ్వఏకీకరణ యజ్ఞాన్ని ఆరంభించారు! మానవ జీవిత పరమార్థమంతా ఈ మహాయజ్ఞంలో నిక్షిప్తం చేశారు. ఒకానొక సమయంలో ఒక దివ్యమైన రహస్యాన్ని కూడా చెప్పారు, '**నేను ఈ శరీరంలో మీకు అందుబాటులో ఉన్నా లేకపోయినా, నేను ఏ సోలార్ సిస్టమ్‌లో ఉన్నా మీరు నన్ను కాంటాక్ట్ చెయ్యదలచుకుంటే దానికి అతి సులువైన మార్గము ఈ విశ్వఏకీకరణ యజ్ఞం. దీని ద్వారా మీరు నన్ను కాంటాక్ట్ చెయ్యవచ్చు**' అన్న అతి విలువైన సత్యాన్ని తెలియచేసారు.

ప్రయోగాత్మకంగా ఈ యజ్ఞాన్ని ప్రప్రథమంగా శ్వేతద్వీపం మేడ మీద డిసెంబర్ 25వ తేదీ సాయంత్రం 6-00 గంటలకు 33 కుండీలతో నిర్వహించారు. తరువాత మెల్లమెల్లగా రూపకల్పన జరిగింది. డిసెంబరు 31వ తారీఖు సాయంత్రం నుండి ఒంగోలులోని కళ్యాణ మంటపంలో సాధనా శిబిరం ప్రారంభమైంది. దాదాపు అన్ని జిల్లాల నుంచి సాధకులు వచ్చారు. చాలా కాలం తర్వాత మళ్ళీ మాస్టర్‌గారు అందరిని కలవబోతున్నారు. అందులోను నూతన సంవత్సరమాయె! పూజ్యశ్రీ మాస్టర్‌గారు కూడా చాలా ఉత్సాహంగా నూతన సంవత్సరంలో

చేయబోయే కార్యక్రమాల ప్రణాళికను మెల్లమెల్లగా ప్రవచనాల ద్వారా సాధకులకందచేస్తున్నారు. ఈ శిబిరంలో సాధనలకంటే సంతోషం, ఆనందం, ఉత్సాహం అందరిలోను వెల్లివిరిసింది. ఆ రోజు అందరూ చాలా కాలం తరువాత మాస్టర్‌గారితో కలిసి వున్నామనే ఆనంద పరవశంతో, ఉత్సాహభరిత మానసికస్థితిలోనే రాత్రి 12గంటల వరకు వారు చెబుతున్న విషయాలను ఒక అలౌకిక జగత్తులో ఉండి పారవశ్యంతో వింటున్నారు.

**గాయత్రీఉపాసన వలన వ్యక్తిగతంగా ఎదుగుతూ, లలితా సాధన ద్వారా దైవీకార్యక్రమముల ఆచరణచేస్తూ (సామూహిక శ్రేయస్సు), భాగవతము ద్వారా గురువు యొక్క మార్గదర్శనంలో పరిణామక్రమంలో ముందుకు వెళ్ళేటువంటి మానవ సముదాయము ఏర్పడినప్పుడు విశ్వఏకీకరణ జరుగుతుంది. అప్పుడే వసుధైక కుటుంబమునకు కావలసిన జీవన విధానము ప్రతి వ్యక్తికి సహజంగా ఆచరణయోగ్యమవుతుంది. ఈ లక్ష్యముతోనే మాస్టర్‌గారు ఈ గాయత్రీ, లలితా, భాగవత మరియు విశ్వఏకీకరణ యజ్ఞం రూపొందించారు.**

## గజేంద్ర మోక్షము

పూజ్యశ్రీ మాస్టర్‌గారికి మానవజాతి పై అపారమైన కరుణ. ఎక్కడకు వెళ్ళి, ఎవరికష్టాలను విన్నా వెంటనే వారికో కొత్త సాధనను తక్షణమే ఇచ్చేవారు. ఇలా మాస్టర్‌గారినుండి కొన్నివందల క్రొత్త సాధనలకు పృథ్విపై బీజారోపణ జరిగింది. ఆయన ఎప్పుడు ఏ సాధనను ఇచ్చినా, చేసేవారు పూర్తిగా లీనం అయిపోయేవారు. ఒకసారి ఒకళ్ళు ఒక సమస్యతో మాస్టర్‌గారి వద్దకు వచ్చారు. వారి సమస్యలపరిష్కారంగా ఈ క్రింది సాధనను ఇవ్వడం జరిగింది.

ప్రతి ఇంట్లోను కష్టములు, అరిష్టములు జరగకుండా ఉండటానికి గజేంద్ర మోక్షము ఫొటోను పెట్టుకొమ్మన్నారు. గాయత్రీ మంత్రమును, కలుపుకుని విష్ణుమూర్తిని ధ్యానించే ఒక కొత్త సాధనను అందించారు. ముందుగా రిలాక్స్‌డ్‌గా అర్ధ పద్మాసనంలో కానీ, పద్మాసనంలోకానీ కూర్చుని 'నేను ధ్యానం అయ్యేవరకు ఎట్టి పరిస్థితిలోను కళ్ళు తెరవను' అనే గట్టి సంకల్పంతో కూర్చోవాలి. ఇప్పుడు నెమ్మదిగా శ్వాసను గమనించండి. బయటికి, లోపలికి వెళ్తున్న ఊపిరిని గమనించండి. హృదయములో శంఖం, చక్రం, గదా, పద్మం ధరించిన విష్ణుమూర్తిని ధ్యానించండి. పసుపురంగు పంచను ధరించి నీలి రంగు శరీరముతో మెరిసిపోతున్న విష్ణుమూర్తిని ధ్యానించండి.

ఆ రూపాన్ని హృదయంలో ప్రతిష్ఠించుకోండి. 'స శంఖ చక్రం సకిరీట కుండలం' అన్న రూపంలో, అంగుష్టమాత్రంగా ఉన్న విష్ణువు స్వరూపాన్ని దర్శించండి, దీనితోపాటు మానసికంగా గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించండి. ఆ గాయత్రీ మంత్ర తరంగాలు హృదయమునుండి రక్తముద్వారా శరీరమంతా వ్యాపిస్తున్నాయి. మంత్ర జపంతో పాటు, చతుర్భుజ విష్ణురూపాన్ని ధ్యానించాలి. ఈ గాయత్రీ మంత్ర తరంగాలు మన శరీరములోని కణకణములో నిండిపోతున్నాయి, మన శరీరములో ఎక్కడన్నా ఏదన్నా ఇబ్బంది లేదా రోగం ఉన్నా అన్నీ ఈ మంత్ర కిరణాల వలన పోతున్నాయి అన్న భావన చేసుకొనండి. మన శరీరము స్వర్ణాభా - (స్వర్ణ ఆభా) బంగారు రంగుతో మెరుస్తున్నది. గాయత్రీ మంత్రమువలన శరీరము అందంగా బంగారు రంగులోకి మారుతున్నది. హృదయము లోంచి గాయత్రీ మంత్ర తరంగాలతో కలిసిన రక్తము శరీరము అంతా వ్యాపిస్తోంది. విష్ణుమూర్తి రూపాన్ని దర్శిస్తూనే ఉండాలి. త్రిపుటి అంటే విష్ణుమూర్తి రూపము, గాయత్రీ మంత్రము, మంత్ర తరంగాలు హృదయమునుండి శరీరమంతా వ్యాపిస్తున్న భావన కలిపి జరగాలి. మన హృదయములో ఉన్న విష్ణుస్వరూపము మన రక్తముతో అభిషిక్తమై ఉన్నది, అంటే మన హృదయము లోని రక్తములోనే ఉన్నది. ఆయన స్పర్శతో తడిసిన రక్తము శరీరమంతా వ్యాపిస్తోంది. అలా గాయత్రీ మంత్రమును మానసికంగా ఒక 10 నిమిషములు చేసాక మంత్రజపం ఆపేసి మీ ఎదురుగా ఒక టి.వి సినిమా స్క్రీన్ ఉన్నట్టుగా నేను చెప్పింది ఊహించుకోండి. ఇప్పుడు భగవంతుని లీలను దర్శించే ప్రయత్నం చేస్తున్నాం. నారదమహర్షి అంత గొప్పవారవటానికి కారణం నిరంతరం భగవంతుని లీలను గుర్తుచేసుకుంటూ గానం చెయ్యటమే. ఇప్పుడు గజేంద్రమోక్షం అనే లీలను మనం దర్శిస్తున్నాం.

ఒక దట్టమైన అడవి, చెట్లతో, లతలతో , తామర పూలతో ఉన్న కొలనుతో, ఆకు పచ్చని లతలు, పక్షుల కిలకిల రావాలు, అతి అందమైన లోతైన విశాలమైన చెరువు. నెమ్మదిగా ఆ లతలను ఛేదించుకుంటూ ఏనుగుల గుంపొకటి ఘీంకారము చేసుకుంటూ కొలను వేపుకు వస్తోంది. అవి చెరువులో చేరి అల్లరి చేస్తూ తొండాలతో నీళ్ళు విరజిమ్ముతున్నాయి, కోలాహలంగా అందంగా ఉన్న ఆ దృశ్యాన్ని సరిగ్గా చూడండి. ఏనుగుల సమూహము చెరువులోని నీళ్ళు చల్లుకుంటూ, తామరపూలను పీకేసి, అంతా చిందరవందర చేసేసాయి. చెరువులోంచి ఒక మొసలి వస్తోందన్న అలికిడి చూసి అన్ని ఏనుగులు గబగబ బయటకు వెళ్ళిపోయాయి కానీ గజరాజు మాత్రం చెరువులోనే ఉండిపోయింది. గజరాజు మొసలికి దొరికినందుకు మిగతా ఏనుగులు బాధతో ఆ ఏనుగును

బయటకు లాగే ప్రయత్నం చేస్తున్నాయి. మన పరిస్థితి అదే, మనం సంసారం అనే సాగరంలో ఇరుక్కుపోయి మాయా మోహాలనుండి బయటికి రాలేకుండా ఉన్నాం. బయటికి వచ్చేసిన గురువులు మనల్ని బయటికి లాగే ప్రయత్నం చేస్తున్నారు. మొసలి ఏనుగును లోపలికి లాగుతోంది. మకరము అనగా మ అంటే 5 ఇంద్రియాలు , కరము అంటే చేతులు చెరువులోకి లాగేస్తున్నాయి. వాసనలు కామమయలోకంలోకి లాగేస్తున్నాయి. రోజూ మనం ఇది గమనించుకోవాలి, ఏ పన్లను చేసాం, అందులో ఎన్ని ఇంద్రియాలకు లోబడిన పనులు చేసాం అనేది గమనించుకోవాలి. మనం మాయా మోహాలనుండి బయటికి వచ్చే ప్రయత్నం చేస్తున్నాం, ఏనుగు బయటికి వచ్చేందుకు పోరాడుతోంది, తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మనం అలా పోరాడి అలసిపోయి నిద్ర పోతుంటాము. మనం ఇంద్రియాలకు లోనై జీవిస్తూ ఉంటాం, ఈశ్వరార్పిత బుద్ధితో ఉన్నామా ? లేదా ఇంద్రియాలకు లొంగామా ? మన తోటివారితో, మన కుటుంబ సభ్యులతో ప్రవర్తించేప్పుడు మనం ఒక ఆత్మవలె ప్రవర్తిస్తున్నామా ? అనే ప్రశ్నను వేసుకోండి. ఇలా ఏనుగు 1000 సంవత్సరములు పోరాడి చివరికి మొసలికి లొంగిపోతున్నాను అని అర్థం చేసుకుంటుంది. అప్పుడు దానికి పూర్వ జన్మ స్మృతి కలిగి నేను చెయ్యగలిగింది ఏమీ లేదు, భగవంతుని పాదాలే పట్టుకోవాలని గ్రహిస్తుంది. మనం కూడా అంతే, మనం చెయ్యగలిగింది ఏమీ లేదు అని అర్థం చేసుకుని గురుదేవులకు సమర్పణ చేసుకోవాలి. హృదయంలో ఉన్న విష్ణుమూర్తిని ఆర్తితో మమ్మల్ని ఈ మకరం బారినుండి బయటపడెయ్యి. మా గురుదేవుల కార్యక్రమాలు చేసేందుకు కావలసిన ప్రేరణను ఇవ్వు, నీ వాణి, నీవిచ్చే మార్గదర్శనం నాకు తెలియాలి. మకరం పట్టులోంచి బయటపడే శక్తి నాకు లేదు. పరిపూర్ణమైన సమర్పణ చేసుకోండి. అలసిపోయిన ఆ ఏనుగు, దస్సిపోయి, చిక్కి శల్యమైపోయి, దాని కాలు మకరము నోట్లో ఉన్న దృశ్యాన్ని చూడండి. ఇంద్రియాలకు లోనైన మన జీవాత్మ ఆ ఏనుగు అని గ్రహించి ప్రార్థించండి. నేను ఏమి చెయ్యలేను , నేను పరిపూర్ణమైన సమర్పణ చేసుకుంటున్నాను. ఈ పట్టునుండి నన్ను బయట పడెయ్యి, అవి శారీరక పరిస్థితులు కావచ్చు, మానసిక ఒత్తిడులు కావచ్చు, ఆర్థిక పరిస్థితులు కావచ్చు, ఏ కష్టమైనా సరే, వీటినుండి నన్ను బయటపడెయ్యమని వేడుకోండి. నేను, నీకు తగిన పనిముట్టుగా మారాలి. నాలో ఉన్న ఆ విష్ణు అంశ, నాలో ఉన్న ఆ ఆత్మ అంశవలె నేను జీవించాలి. అలా చేస్తుండగా దూరం నుండి గరుడుడి రెక్కల చప్పుడు వినిపిస్తోంది, గరుడవాహనముపై విష్ణుమూర్తి కూర్చుని ఉన్నాడు, పసుపు రంగు

పంచె ధరించి, పైన కుడి చేతిలో చక్రము ఉన్నది. ఆ చక్రము మెరుస్తోంది, ఆ చక్రము వచ్చి మకరాన్ని కోసేసింది, ఏనుగు కాలు బయటపడింది, మీరు బంధ విముక్తులయ్యారు. పరిపూర్ణమైన స్వాతంత్ర్యము లభించింది. ఎక్కడ ఉన్న వాళ్ళు అక్కడే ఉంటారు, కానీ బంధవిముక్తులవుతారు. జాగ్రత్తగా దర్శించండి, ఆ చక్రము మకరము యొక్క తలను కోస్తోంది. ఆ నీరు రక్తసిక్తమయ్యింది. ఆ ఏనుగు ఎలా బయటపడిందో మీరు ప్రతి రోజూ ఈ ధ్యానం చేసుకోవటం వలన కాలచక్ర గమనంలో మీరుకూడా బయటపడతారు. కష్టనివారణ జరిగాక కలిగే ఆనందాశ్రువులు, విష్ణుమూర్తియొక్క స్పర్శవలన మీరు పడ్డ బాధలన్నీ మాయం అయిపోయాయి. మొసలి గంధర్వుడిగా మారింది, మొసలి రూపంలో మనకువచ్చిన కష్టాలకు మనం కృతజ్ఞత చెప్పుకోవాలి, కష్టాలవలనే నేను భగవంతునికి దగ్గరకాగలిగాను అనే కృతజ్ఞత భావం మీకు కలగాలి. ఈ సాధనా విధానం నాకు అబ్బింది, ఆ ఏనుగు నెమ్మదిగా మీ రూపు దాల్చింది, మొసలి బారినుండి బయటపడిన నేను ఇంక మళ్ళీ ఆ చెరువులో ఇరుక్కోను అనే తీవ్ర సంకల్పము చేసుకోండి.

మళ్ళీ ఇప్పుడు గాయత్రీ మంత్రం చేసుకుంటూ గాయత్రీ మంత్ర శక్తి శరీరమంతా వ్యాపిస్తోంది అనే భావన చేసుకోండి. ఆ హృదయంలో అంగుష్టమాత్రంగా ఉన్న విష్ణు స్వరూపం మీ అంత పెద్దది అయ్యింది. మీరే విష్ణురూపులు. చతుర్భుజములతో శంఖము, చక్రము, గద, పద్మములను దర్శించండి. శంఖము దివ్య వాణికి ప్రతీక, చక్రము సమయము-సమయానుకూలముగా ప్రవర్తిస్తాను, ఈ యుగసంధి కాలములో నా బాధ్యతలను నేను సవ్యముగా నిర్వహిస్తాను. గద పరిస్థితులు ఎలా ఉన్నా సంయమముతో ఎదుర్కుంటాను. పద్మము, నిరంతరము నేను సూర్యునివేపే దృష్టిని నిలిపి ఉంచుతాను.

ఇప్పుడు అన్ని భావనలు ఆపేసి మీరు చేసే జపాన్ని మీ అంతరేంద్రియములతో వినండి. శ్వాసను గమనించుకొంటూ నెమ్మదిగా ధ్యానం నుండి బయటికి రండి.

## అధ్యాయం-2

# గురు సాన్నిధ్యము – ఆత్మానుభూతి

### 2003 సంవత్సరానికి ఆహ్వానం

2003వ సంవత్సరం నూతన ఉత్సాహం, నవనవోన్మేషంతో అడుగుపెట్టింది. 2003 జనవరి ఒకటవ తేదీన ఉదయం ఆరుగంటలకు అదే కళ్యాణమంటపంలో 33 కుండాలలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు గాయత్రి–లలితా–భాగవత విశ్వఏకీకరణ యజ్ఞాన్ని సాధకులందరి చేత చేయించారు. వినూత్నమైన ప్రయోగం. సద్యఃఫలితాలనిచ్చే , శక్తివంతమైన స్వార్థ, పరమార్థాల కలయికతో రూపొందించబడిన అద్భుతమైన యజ్ఞము. ఈ క్రొత్త యజ్ఞంలో పాల్గొన్న వాళ్ళందరూ నూతన ఉత్తేజంతో తాము కూడా ఈ యజ్ఞ విధానాన్ని అవలంభించాలని ఉబలాటపడ్డారు. అయితే ఈ మహాయజ్ఞానికి కావలిసిన రూపురేఖలు పూర్తిగా రూపొందించబడలేదు. ఇంకా దానికి తగిన వనరులు అవి ఏర్పాటు చేయలేదు కనుక వారి నుంచి దానికి అనుమతి లేదు. ఏది ఏమైనా ఒక అద్భుత ప్రయోగాన్ని నూతన సంవత్సర శుభాకాంక్షలుగా పూజ్యశ్రీ మాస్టర్‌గారు సాధకుల కిచ్చారు.

### అద్భుత వరప్రదాయినిగా విశ్వఏకీకరణ యజ్ఞం

ఆ తర్వాత ప్రతి ఆదివారం పూజ్యశ్రీ మాస్టర్‌గారే స్వయంగా గాయత్రీ అనుగ్రహపీఠంలో విశ్వఏకీకరణ యజ్ఞం చేయించేవారు. ఈ యజ్ఞం వ్యక్తిగత కోరికలు తీర్చుకోవటానికి కూడా చాలా అద్భుతంగా పనిచేస్తుంది. అయితే దానికి కొన్ని నియమాలను ఏర్పరచారు. ఆ నియమాలను పాటిస్తూ 12 వారాల పాటు ఖచ్చితంగా ఏ విధమైన నాగా లేకుండా యజ్ఞంలో మొదటి నుంచి చివరి వరకు పాల్గొనాలి. పూర్ణాహుతిలో తాము పెట్టుకున్న సంకల్పాన్ని మనస్ఫూర్తిగా మూడుసార్లు చెప్పుకొని పూర్ణాహుతిని చేసుకోవాలి. అనుష్ఠాన నియమాలను పాటించి, శ్రద్ధాభక్తులతో చేసినట్లయితే ఈ యజ్ఞం చక్కటి ఫలితాలను ఇస్తుందని చెప్పారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారి మాట వేదవాక్కేగదా! నిత్యజీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు నివారణగా, కోరిన కోరికలను తీర్చే కల్పవృక్షంగా ఈ యజ్ఞాన్ని ఆచరించి ఎంతో మంది ఎన్నో ఫలితాలను పొందారు. మార్గశిర పూర్ణిమకు వేటపాలెంలో గల దత్తక్షేత్రానికి వెళ్ళి మూడురోజుల పాటు దత్తచరిత్ర పారాయణలు, దత్తనమస్కారాలు చేయించారు. పూర్ణాహుతిగా 108 కుండీల్లో విశ్వ ఏకీకరణ యజ్ఞాన్ని ఎంతో వైభవంగా నిర్వహించి, యజ్ఞంలో కొత్తగా వచ్చిన వారికి దేవస్థాపనల నివ్వడం కూడా జరిగింది.

## అమ్మ సాన్నిధ్యంలో

2003 జనవరిలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు మొదటిసారిగా జిల్లెళ్ళమూడికి వెళ్ళటం జరిగింది. ఒంగోలు పరివార్ సభ్యులు, అమ్మ భక్తులు శ్రీ రామకోటేశ్వరరావుగారు, మాస్టర్‌గారి దగ్గరకు వచ్చి 'ఇవాళ ముక్కోటి ఏకాదశి. అమ్మ దర్శనానికి వెళుతున్నాను. ఇవాళ అమ్మ, ఉత్తరద్వార దర్శనం ఉంటుంది, మీరూ రండి మాస్టారూ' అంటూ పిలిచారు. మాస్టర్‌గారు మహనీయుల దర్శనం విషయంలో ఎప్పుడూ ఎంతో జాగురూకులై ఉంటారు. పిలిచిందే తడవుగా వెంటనే బయలుదేరి వెళ్ళారు.

ముక్కోటి ఏకాదశినాడు ఉత్తరద్వార దర్శనార్థం అమ్మను చతుర్భుజాలతో శంఖ, చక్ర, గదా, పద్మాలను ధరించిన నారాయణీ స్వరూపిణిగా అలంకరిస్తారు. భక్తులందరూ ఆ రోజున, అమ్మను 'నారాయణీ స్వరూపిణిగా' దర్శించి తరిస్తుంటారు. అలాంటి పరమపవిత్రమైన రోజున జిల్లెళ్ళమూడికి వెళ్ళటం జరిగింది. ఆశ్రమవాసులకు ముందే చెప్పినట్లున్నారు, 'మాస్టారి రాక' కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. శ్రీశ్రీ మాస్టర్‌గారు కూడా అమ్మదగ్గరికి నేరుగా కారులో వెళ్ళటం ఉచితంగాదని, కారును రోడ్డు మీదనే ఆపించి నడుచుకుంటూనే ఆశ్రమంలోకి ప్రవేశించారు. భక్తులు ఆయనను నేరుగా అమ్మ 'నారాయణిగా' దర్శనమిస్తున్న ఉత్తరద్వారం దగ్గరికే తీసుకువెళ్ళారు. దివ్యమంగళస్వరూపిణి, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి, ఆర్తత్రాణ పరాయణియైన అమ్మ, తన ముద్దుల తనయుని రాకకై ఎదురు చూస్తోందా! అన్నట్లనిపించింది. అల్లంత దూరం నుంచే తన ముద్దులబిడ్డను చూస్తూ పరమానందంతో తనయునికి ఆహ్వానం పలుకుతూ ఎంతో ప్రేమతో అక్కునచేర్చుకొని ఆశీస్సులను అందించినట్లనిపించింది. మాస్టారు మాత్రం ప్రశాంతంగా అమ్మకి ఎదురుగా కూర్చున్నారు. భావమయ జగత్తులో ఇద్దరి కన్నులలో

ప్రేమామృత ధారలు కురిశాయి. ఆనందపరవశులై అలానే ధ్యానంలోకి వెళ్ళిపోయారు. మౌనభాషలో 'అమ్మ' ఇచ్చిన సందేశాన్ని అక్షరం,అక్షరం విన్నారు. తల్లీ, తనయుల మధ్య అపురూపమైన, ఆధ్యాత్మిక ఒడంబడిక ఏదో జరిగింది. అది కాలాంతరంలో కార్యరూపాన్ని ధరించింది. అమ్మ ఇచ్చిన దర్శన దీక్ష అయిపోయింది. అమ్మ ప్రసాదాన్ని పరమ ప్రీతితో భుజించారు. మనస్సంతా అమ్మతో మమేకమైపోయింది.

శ్రీరామకోటేశ్వరరావుగారు మాస్టర్‌గారిని తీసుకొనిపోయి, అమ్మ ఆలయాన్ని చూపించారు. అక్కడ వారు ఏమి చూశారో తెలియదుగానీ, 'అమ్మసమాధి' విశేషాలను చెప్పమని రామకోటేశ్వరరావు గారిని అడిగారు. అప్పుడు వారు ఇలా చెప్పారు. 'అమ్మ కంటే ముందే నాన్నగారు శరీరం చాలించారు. అమ్మే వారిని సమాధి చేసింది. తరువాత కొంత కాలానికి అమ్మ శరీరం వదిలాక అమ్మ సూచనల మేరకు అదే ఆలయంలో అమ్మను నాన్నగారి సమాధికి కుడివైపున సమాధి చేశారు. అక్కడే వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు' అని చెప్పారు.

ఆ రోజున మాస్టర్‌గారు అక్కడికి వస్తున్నారన్న సంగతి తెలిసి అప్పటికే చాలా మంది పరివార్ సభ్యులు వచ్చివున్నారు. ఇంక అక్కడి నుండి ఒక పెద్ద రావిచెట్టు, దాని చుట్టూ విశాలమైన పెద్ద అరుగు ఉన్న ప్రదేశం దగ్గరకు తీసుకు వెళ్ళి, 'ఇది అమ్మ కాపురం చేసిన ఇల్లు. ఆమె జీవించి ఉన్నప్పుడు ఇక్కడ ఒక పుట్ట వుండేది. ఎవరు వచ్చి ఏది కావాలన్నా అమ్మ అందులో చెయ్యి పెట్టి కాస్తంత మట్టి తీసి వారి చేతిలో పెట్టేది. దాంతో వారి బాధలు తీరిపోయేవి. హాయిగా ఉండేవారు' అని చెప్పారు. అందుకే అమ్మ దానికి 'అందరిల్లు' అని నామకరణం చేసిందని, ఇంకా చాలా విషయాలను చెప్పుకొచ్చారు.

ఆ ప్రదేశం యొక్క మాహాత్మ్యం అర్థమైందేమో ఇంక ఆ ప్రదేశాన్ని చూస్తూనే మాస్టారు, 'ఇవాళ మన సాధన ఈ చెట్టు క్రిందనే' అంటూ అలా కూర్చుండిపోయారు. ఆనాటి వారి ప్రవచనంలో అనేక ధర్మ సూక్ష్మాలతో పాటుగా చిత్రమైన కొన్ని విషయాలను చెప్పారు. ఈ ప్రదేశంలో నాగేశ్వరాలయం వస్తుంది. అది కుండలినీ జాగరణకు కేంద్రస్థానమౌతుంది. అలానే ఇంకొక ప్రదేశాన్ని చూపించి 'ఇక్కడ నిత్యాగ్నిహోత్రం జరిగే యాగశాల వస్తుంది' అని చెప్పడం జరిగింది. కాలాంతరంలో ఆ రెండు నిర్మాణాలు అక్కడ రావడమేకాక కార్యక్రమాలు కూడా ఎంతో ఉజ్జ్వలంగా నడుస్తున్నాయి.

జిల్లెళ్ళమూడి అమ్మగారి అర్ధాంగిని వసుంధర అక్కయ్యగారు. అమ్మలాగే ఎంతో ప్రేమస్వరూపిణి. పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఎప్పుడు జిల్లెళ్ళమూడికి వచ్చినా వారి ఇంట్లోనే ఉండేవారు. అమ్మ గురించి అనేక ఆధ్యాత్మిక రహస్యాలను ఆమెగారి నడిగి చెప్పించుకునేవారు. ఒకసారి పూర్ణిమకు రావడం జరిగింది. ఆ రోజున హైమాలయంలో జరుగుతున్న అఖండనామ సంకీర్తనలో మాస్టర్‌గారు పాల్గొన్నారు. అక్కడున్న ఆ దివ్యశక్తిని దర్శించిన వారు పరివార్‌సభ్యులతో, 'ప్రతీ పూర్ణిమకు వచ్చి హైమనామాన్ని ఏకాహంగా చేసుకోండి, మీ సంకల్పాలు నెరవేరుతాయని' చెప్పారు. ఈనాటికీ చాలా మంది వారి సూచనలను తు.చ తప్పకుండా పాటిస్తున్నారు.

ఆ రోజంతా వారు అమ్మ సాన్నిధ్యంలోనే గడిపారు. 'అమ్మకు' పరమభక్తుడు, ఆశ్రమవాసి అయిన శ్రీ హనుంబాబుగారు మాస్టర్‌గారిని చూస్తూనే ఎంతో ఉద్వేగంతో సాగిలిపడి నమస్కరించారు. అమ్మను గురించి మాస్టర్‌గారు అడుగగా ఎంతో ఆర్ద్రతతో అమ్మను గురించిన అనేక విషయాలను, కన్నుల నుండి ఆనందాశ్రువులు కారిపోతుండగా ఏకబిగిన చెప్పసాగారు. మాస్టర్‌గారైతే, హనుంబాబుగారు ఎంతో భక్తి ప్రపత్తులతో అమ్మను గురించి చెప్పిన విషయాలను విని పులకరించి పోయారు. శ్రీహనుంబాబుగారు మాతృశ్రీ ఓరియంటల్ పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తుంటారు. తమ విద్యార్థులకు పెద్దలచేత మంచి విషయాలను చెప్పించాలనే తపనతో, 'మా పిల్లలకి మీరేదైనా సాధనలను నేర్పించాలి మాస్టారు', అని ఎంతో ఆర్తితో వారు కోరగా శ్రీశ్రీ మాస్టర్‌గారు అంగీకరించారు. హనుంబాబుగారు తక్షణమే మాస్టర్‌గారి పునరాగమనానికి తేదీలను (27, 28, 29) కూడా నిర్ణయించేసి అప్పటికప్పుడు అన్ని ఏర్పాట్లు చేసేశారు.

వారి శ్రద్ధకు మాస్టర్‌గారు ఎంతో ఆనందపడిపోయారు. అనుకున్న తేదీలలో మళ్ళీ జిల్లెళ్ళమూడికి వచ్చి మూడు రోజులపాటు విద్యార్థినీ, విద్యార్థులలో 'క్రియాశక్తిని' ప్రోదిచేసే అత్యంత ప్రధానమైన, అవసరమైన 'ఓం'కార సాధనను నేర్పించారు. వారు కూడా పిల్లలతో ఎంతో చక్కగా కలిసిపోయి ఒక దివ్యమైన, ఆనందపూరిత వాతావరణంలో అందరికీ ప్రణవసాధనను నేర్పించారు. మిగిలిన సమయాలలో ఆశ్రమ నియమాలకు అనుగుణ్యంగా కార్యక్రమాలలో పాల్గొంటూ గాయత్రీ పరివార్ సభ్యులకు కూడా తరగతులు నిర్వహించేవారు.

ఆ సందర్భాలలోనే హనుంబాబుగారు, శ్రీవిద్యారణ్యప్రణీతమైన శ్రీమహాలక్ష్మీ సాధనను, దాని వైభవమును గురించి ఎంతో విపులంగా వర్ణించి చెప్పగా మాస్టర్‌గారు తక్షణమే 'శ్రీమహాలక్ష్మీ

సాధన' పుస్తకాన్ని జిరాక్స్ కాపీలు తీయించి అక్కడే హైమాలయంలో సాధనను ప్రారంభింపచేశారు. అలా ప్రారంభమైన 'శ్రీమహాలక్ష్మీ సాధన' గ్రామాలలో, పట్టణాలలో, నగరాలలో ఇంకా విదేశాలలో కూడా ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. అలా శ్రీశ్రీ మాస్టర్‌గారి దృష్టిలోకి వచ్చిన సాధన ఏదైనా సరే అలా వేలాదిమందిలోకి వెళ్ళిపోయి ప్రజాహితానికి ఎంతో దోహదం చేస్తుందనేది అనేక సందర్భాలలో మనకు అనుభవమే! **భారతీయ సంస్కృతిలో విశిష్టమైన కార్యప్రణాళికయైన 'విద్యాలయం, వైద్యాలయం, దేవాలయం' అనే త్రిపుటి ఒకే గొడుగు క్రింద ఉండడమనేది మనమీ ప్రాంగణంలో చూస్తాము.** అదే పరమగురువులందరి లక్ష్యం.

## శిరిడీ, ఖాండ్వా యాత్రలో జియోపాలిటిక్స్

2003 జనవరి 2వ తేదీన పూజ్యశ్రీ మాస్టర్‌గారు హైదరాబాదులో కాటూరి జగన్‌కు పుట్టినరోజు సంస్కారం చేసి అతనికి ఉషా వేంకటకు మనం శిరిడీకి, ఖాండ్వాకు వెళ్ళాలి, దానికి తగిన ప్రణాళిక తయారుచెయ్యండని చెప్పడం జరిగింది. వెంటనే దానికి తగిన సన్నాహాలు చేసి అందరికీ ఈ విషయాన్ని చెప్పారు. మాస్టర్‌గారితో కలిసి వెళ్ళడమనగానే అందరికీ కొండంత ఉత్సాహం వచ్చేసింది. వీలైన వాళ్ళందరూ ప్రయాణానికి సిద్ధపడ్డారు. 2003 జనవరి 4 వ తేదీన హైదరాబాదు నుండి పరివార్ సభ్యులంతా మాస్టర్‌గారితో కలిసి శిరిడీకి బయల్దేరి, ఎంతో ఆనందంతో హుషారుగా శిరిడీకి చేరారు. వెళ్తూనే అందరూ ధూళి దర్శనానికై శిరిడీసాయి మందిరానికి చేరారు. అక్కడక్కడా ఆగుతూ ఆ స్థలవైభవాన్ని వివరిస్తూ మాస్టర్‌గారు ముందుకు నడుస్తున్నారు. ఇంతకు ముందెప్పుడూ చెప్పని క్రొత్త అంశమైన జియోపాలిటిక్స్ గురించి మొదటిసారి అద్భుతంగా వివరించారు.

జియోపాలిటిక్స్ అనే మాటను మొట్టమొదటిసారి వాడిన వ్యక్తి హిట్లర్. దానిని ఆయన చెప్పడమే కాదు చేసి నిరూపించాడు. ఆయన ప్రకారం రాజనీతిజ్ఞులు ఆ దేశపు భౌగోళిక పరిస్థితి వల్ల ఏర్పడతారు. ప్రతి భూభాగానికి ఒక ప్రత్యేకత ఉంటుంది, ఆ భూభాగంలో పుట్టినవారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు కలుగుతాయి, ఇవి కేవలము ఆ జియోగ్రాఫికల్ వైబ్రేషన్స్ వల్ల ఏర్పడతాయి. **భూమి నుండి వచ్చే శక్తిని కుండలినీశక్తి అంటారు. అలాగే సూర్యుడి నుండి వచ్చే శక్తిని ప్రాణశక్తి అంటారు.** భారతదేశానికి ఒక విచిత్రమైన రక్షణ ఉంది, అదే ఆధ్యాత్మికత. జియో రెలిజియన్ అంటే అది ఆ ప్రత్యేక ప్రదేశంలో ఉండే రెలిజియన్. మానవులు థర్డ్ డైమన్షన్‌లో ఉంటారు,

గురువులు ఫోర్త్ డైమన్షన్‌లో, ఫిఫ్త్ ఇంకా వాటికంటే పై డైమన్షన్స్‌లో ఉంటారు. మనుషులపై ఈ జియోరెలిజియన్ ప్రభావం ఉంటుంది కానీ గురువులపై ఉండదు. జియోరెలిజియన్‌ను గురించి చెప్తూ బాబా రెలిజియన్స్‌ను అధిగమించి ఒకే మతానికి నాందిగా ఉండే ఆధ్యాత్మికతను అందించారు. అంతేకాదు షట్చక్ర జ్ఞానాన్ని కూడా అక్కడ వేరువేరు ప్రదేశాల్లో, వేరువేరు పేర్లతో స్థాపించారు.

1. ద్వారకామాయి– ధుని– మణిపూరక చక్రము. బాబా ద్వారకామాయిలో ధునిని పెట్టి దానిని ఉపయోగించుకున్నారు. ఇంకా వంటపొయ్యి కూడా పెట్టారు. ధుని అంటే అగ్నేగా. అంటే మణిపూరక చక్రసాధన అక్కడ అయిపోయింది.

2. గురుస్థానం–ఆజ్ఞాచక్రసాధన.

3. ఆంజనేయస్వామి దేవాలయం–అనాహత చక్రసాధన. అక్కడ స్వామివారి రెండు రూపాలు గుండెలోని రెండు భాగాలుగా చెప్పవచ్చు.

4. లెండీవనం–స్వాధిష్ఠానం. స్వయంగా తానే నీరు పోసి ఆ వనాన్ని పెంచారు. అది స్వాధిష్ఠాన చక్రసాధన.

5. సమాధిమందిరం–మూలాధారం. సమాధి ఎప్పుడూ భూమిలోనేగా ఉంటుంది. అక్కడ మూలాధార చక్రసాధన.

6. భక్తులు–వాక్శక్తి. మహల్సాపతి, లక్ష్మీబాయి, దాసగణు వంటివాళ్ళు తమ వాక్శక్తితో బాబా గొప్పదనాన్ని తెలియచెప్పారు. అలా అక్కడ విశుద్ధి చక్రసాధన.

7. చావడి–సహస్రారం. బాబా రోజు విడిచి రోజు చావడిలో నిద్రించేవారు. ఇది సహస్రార సాధన. ఎవరైనా నిద్రాస్థితిలోకి వెళ్తేనే సహస్రారంలోకి ప్రవేశించగలరు. షట్చక్రసాధన అన్నా, కుండలినీ సాధన అన్నా ఒక్కటే.

అలా శిరిడిలోగల మూలశక్తికేంద్రాల గురించి చెప్తూ వాటి శక్తిని నూతన సాధనావిధానములో దర్శింపచేసారు. ఋణానుబంధాలను అర్థం చేసుకుని జీవించాలని, జపం, ధ్యానం, ప్రాణాయామాలు చెయ్యకుండా సాధనామార్గములో ముందుకు వెళ్ళలేమని చెప్తూ మనము ఏ గురుపరంపరకు సంబంధించినవారమో ఆ గురువు పనిచేస్తూనే ఆ గురుపరంపరకు కనెక్ట్ అయి ఉన్న మిగతా

గురుపరంపరను కూడా అర్థం చేసుకోవాలని చెప్పారు. మాస్టర్‌గారు ఎప్పుడూ ఏది ఆచరిస్తారో అదే చెప్తారు. 'నేను పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల పనిచేస్తూనే ఆ గురుపరంపరతో ముడిపడి ఉన్న గురుపరంపరకు సంబంధించిన మొత్తం పనులను చేశాను' అని చెప్తుండేవారు.

అక్కడి నుండి ఖాండ్వాలోని ధునివాలాదాదాగారి ఆశ్రమానికి చేరారు. ఒంగోలు కిషోర్, ఆదిత్య శేఖర్ కూడా అక్కడికి చేరుకున్నారు. అప్పటి వరకు సరదాగా ఉన్న మాస్టర్‌గారు ఆశ్రమం దగ్గరకి వెళ్ళగానే అందరినీ మౌనంగా ఉండమని సూచిస్తూ ఆయన పూర్తి మౌనంలోకి వెళ్ళిపోయారు. అంతకు ముందు తేజావాళ్ళకి 'ప్రాణశక్తి ఒక దివ్య విభూతి' అనే గురుదేవుల వాఙ్మయాన్ని తెలుగులోకి అనువదించమని ఇచ్చారు. అక్కడ ఉన్న మూడు రోజులలో అనువాదమును చదివి మరికొన్ని మార్పులను, చేర్పులను చేశారు. ధునీవాలాదాదాగారి ఆశ్రమములోకి వెళ్ళినప్పుడు ఆ రోజులలో ఆయన వాడిన రకారకాల కార్లను, వస్తువులను చేతితో ఎంతో శ్రద్ధగా స్పృశిస్తూ, ఆ స్పర్శతో తాదాత్మ్యతను అనుభవించారు. అక్కడి నుండి నాగపూర్ మీదుగా తిరిగి అందరూ హైదరాబాదుకు చేరారు. సావిత్రి నాగపూర్ రైల్వేస్టేషన్‌లో అరుదుగా దొరికే కబీరు దోహా పుస్తకాలు ఉన్నాయని చెప్పగానే మాస్టర్‌గారు ఆనందంగా సెట్‌మొత్తం కొనేశారు. ఏ కొత్త ప్రదేశానికి వెళ్ళినా అక్కడి నుండి పుస్తకాలను తప్పక తెచ్చేవారు. ఆ యాత్రలో మాస్టర్‌గారితో కలిసి వెళ్ళి దివ్యానుభూతులను పొందినవారు ఇప్పటికీ ఆ అనుభవాలను గురించి మైమరచిపోయి చెప్తూనే ఉంటారు.

## ప్రహ్లాదబాబావారి దర్శనం

2003 వసంత పంచమి, పూజ్యగురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినం. ఆ రోజుననే రంగాపురం పరివార్ సభ్యులు శ్రీమతి సుభద్రా రామకృష్ణగార్ల షష్ఠిపూర్తి మహోత్సవం కలిసి వచ్చింది. ఆ శుభసందర్భంగా ఆ దంపతులు పూజ్యశ్రీ మాస్టర్‌గారిని ఆహ్వానించి రంగాపురంలో వసంతపంచమికి మూడు రోజులుపాటు సాధనా శిబిరం పెట్టాలని, పూర్ణాహుతిగా 108 కుండీలలో విశ్వఏకీకరణ యజ్ఞాన్ని చెయ్యాలని కోరారు. వారు చాలా మంచి సక్రియ కార్యకర్తలు. వారి ఆహ్వానం మేరకు మాస్టర్‌గారు రంగాపురం వెళ్ళి వారు కోరిన విధంగా సాధనాశిబిరం నిర్వహించారు. ఆ పైన మహాపూర్ణాహుతిగా 108 కుండీలలో విశ్వఏకీకరణ యజ్ఞం చేశారు.

అక్కడ నుండి అమలాపురం శ్యామలరావుగారింటికి వెళ్ళడం జరిగింది. అమలాపురంలో శ్రీశ్యామలరావుగారు విశేషంగా కృషి చేస్తూ అనేక ప్రాంతాలలో గాయత్రీపరివార్‌ని ఏర్పాటు చేసి చురుగ్గా కార్యక్రమాలు చేస్తుండేవారు. వారు మాస్టర్‌గారికి బంధువులు కూడా! వారితో మాస్టారి అనుబంధం చాలా ప్రత్యేకమైనది.

అమలాపురంలో గల గీతాశ్రమంలో శ్రీరామానందస్వామివారి ఆహ్వానం మేరకు మాస్టర్‌గారు అక్కడ గీతాప్రవచనాలను ఇవ్వడం జరిగింది. అమలాపురానికి అతి దగ్గరగా ఒక అద్భుతమైన ఆశ్రమం ఉంది. దానిని తోటలపండరి అంటారు. అది ప్రహ్లాదబాబావారి ఆశ్రమం. సాక్షాత్ ప్రహ్లాదుని అంశావతారం శ్రీ ప్రహ్లాదబాబావారు. శ్రీ శ్యామలరావుగారు, శ్రీశ్రీ మాస్టర్‌గారిని వారి దగ్గరకు తీసుకువెళ్ళారు. పూజ్యశ్రీ బాబావారు వీరిని చూస్తూనే ఎన్నో సంవత్సరాల తర్వాత వచ్చిన కుమారుని చూచి ఆనందించిన తండ్రిలాగా వాత్సల్యంతో దగ్గరకు తీసుకొని ఆలింగనం చేసుకొని ప్రక్కన్నే కూర్చోబెట్టుకొని అనేక మధుర పదార్థాలను తెప్పించి స్వయంగా తమ చేత్తో తామే తినిపించారు. ఆ దృశ్యం చూస్తూంటే ఒళ్ళు పులకరించిపోయింది. అలా అనేకమంది మహనీయుల ప్రేమను, ఆశీర్వాదాలను అందుకొన్న దివ్యాత్మ శ్రీ శ్రీరామకృష్ణగారు. అలాంటి మహనీయులు మన మధ్య అతి సామాన్యవ్యక్తిలాగా తిరుగుతున్నారంటే అది వారికి మానవజాతిపై గల అవ్యాజమైన ప్రేమ, కరుణ కాక మరేమిటి!! మరి అంతటి వారికి దగ్గరగా ఉండగలగడం మన అదృష్టం. పూజ్యశ్రీ మాస్టర్‌గారికి శ్రీబాబావారితో మంచి ఆత్మీయతా, అనుబంధము అలాఅలా పెరిగి పోయింది. అమలాపురం వెళ్ళినప్పుడల్లా తప్పనిసరిగా వారి దర్శనం చేసుకునేవారు.

## విశ్వఏకీకరణ యజ్ఞ శృంఖల

విశ్వఏకీకరణ యజ్ఞాలు చాలా బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ప్రయోగాత్మకంగా 'వేదమాత గాయత్రీ అనుగ్రహ పీఠం, ఒంగోలులో 12 ఆదివారాల పాటు ఈ యజ్ఞం చేసుకున్న వారి కోరికలు చాలానే తీరడం జరిగింది. అలా అలా ఆ యజ్ఞము మెల్లమెల్లగా పరివార్ హృదయాలలోకి చొచ్చుకొనిపోయింది. ప్రతీ ఊళ్ళో ఆదివారంనాడు విశ్వఏకీకరణ యజ్ఞాలు ప్రారంభమయ్యాయి. గాయత్రీ పరివార్ కార్యకర్త శ్రీలక్ష్మిగారి అత్తగారు, శ్రీమతి అట్లూరి రంగనాయకమ్మగారికి మాస్టారన్నా, ఈ యజ్ఞమన్నా విశేషమైన అభిమానం. 70 సంవత్సరాలు పైబడినా కూడా ఆమె ప్రతి పౌర్ణమికి

ఈ యజ్ఞాన్ని చేయించేవారు. ఎంతో ఆదరంతో అందరికీ భోజనాలు పెట్టి ఎంతో ఆనందించేవారు. అంత పెద్దవారైనా ఎంతో ఓపికతో అలా నాలుగు సంవత్సరాల పాటు ఆపకుండా ఈ యజ్ఞాన్ని జరిపించడం చూచి స్ఫూర్తి పొందిన గ్రామస్థులు చుట్టుప్రక్కల గ్రామాలవారు కూడా ఈ యజ్ఞాన్ని ప్రారంభించారు.

## వరంగల్‌లో గాయత్రీ పరివార్ కార్యక్రమాలు

వరంగల్‌లో మాస్టర్‌గారికి బాగా ఆత్మీయులైన కుటుంబం శ్రీమతి అన్నపూర్ణ, శ్రీ నారాయణ రావు గార్లు. వీరు ఒంగోలు అనుగ్రహపీఠ నిర్వాహకులు శ్రీమతి సీతామహాలక్ష్మి, శ్రీలక్ష్మీనారాయణ గారి కుమార్తె, అల్లుడుగారు. వారి ఆధ్వర్యంలో వరంగల్‌లో సక్రియ కార్యకర్తలతో కూడిన గాయత్రీ పరివార్ ఏర్పడింది. వీరంతా అజాంజాహి మిల్స్ ఉద్యోగులు. వీరంతా మంగళవారం స్వాధ్యాయ మండలి అన్నపూర్ణగారింట్లో స్థాపించుకొని కొన్ని సంవత్సరాల పాటు నిరవధికంగా కొనసాగించారు. ఈ కార్యకర్తల ఉత్సాహముతో రెండుసార్లు సహస్రకుండీ యజ్ఞాలు అద్భుతమైన రీతిలో జరిగాయి. వీరికి ప్రతి సంవత్సరం అజాంజాహి మిల్స్ దగ్గర గల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మూడు రోజులపాటు సాధనా శిబిరము నిర్వహించి పూర్ణాహుతిగా 108 కుండీలలో యజ్ఞాలు చేయడం పరిపాటి. ఆ పరంపరలో భాగంగా, శ్రీశ్రీ మాస్టర్‌గారు ఏ కార్యక్రమం చేయమని ఆదేశించినా వారు తు.చ. తప్పక చేసేవారు. 'దేవస్థాపన కార్యక్రమాల' సాంప్రదాయాన్ని విధిగా చేసేవారు. వరంగల్‌లో చేసే పెద్ద పెద్ద కార్యక్రమాల వలన అతి తక్కువ సమయంలో చాలా మంది సక్రియ కార్యకర్తలు తయారయ్యారు. ఈనాటికీ అక్కడ ఆ పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు.

ఆ రోజులలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు విధిగా గురుదేవులు విధించిన కార్యక్రమాల పట్ల ఎంతో శ్రద్ధ వహించేవారు. అందులో ముఖ్యమైనవి సంస్కారాలు. జన్మదిన, వివాహసంస్కారం తప్పనిసరిగా అందరూ చేసుకోవాలని చెప్తుండేవారు. ఆయన ప్రవచనాలకు ప్రేరితులైన వారు తమ పిల్లల వివాహాలను కూడా గురుదేవుల పద్ధతిలో నిర్వహించారు. వీరిలో హైదరాబాద్ గాయత్రీపరివార్ కార్యకర్తలైన శోభగారు ముందుగా వారి కుమార్తె వివాహం తిరుమలలో చేసుకోవాలని, అది కూడా గాయత్రీపరివార్ సాంప్రదాయంలో చేయించాలని కోరగా అందుకు పూజ్యశ్రీ మాస్టర్‌గారు సంతోషించారు. వారితో పాటు నేను, సత్యనారాయణరావుగారు చి.ల.సౌ

ఇందిర పెండ్లి చేయించటానికి తిరుమలకు వెళ్ళాం. మార్చి 5వ తేదీన 'చి.ల.సౌ. ఇందిర' పెండ్లిని ఎంతో వైభవంగా గాయత్రీపరివార్ పద్ధతిలో చేయించాము. శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యసన్నిధిలో, పూజ్యశ్రీ మాస్టర్‌గారి సమక్షంలో ఎంతో వైభవంగా, అపురూపంగా ఈ వివాహం జరిగింది. మాస్టర్‌గారు తమ దివ్య అనుగ్రహ ఆశీస్సులను వధూవరులపై అనంతంగా కురిపించారు. తిరిగి ఒంగోలుకు వచ్చేశాము. ఈ కార్యక్రమాలు నడుస్తున్నా కూడా ఎంతో ముఖ్యమైన మూడు పూర్ణిమల సాంప్రదాయాన్ని వారు ఎన్నడూ విస్మరించలేదు. మాస్టర్‌గారు ఎంత సరదాగా ఉన్నా, ప్రవచనాలు చెప్పినా, ఏ కార్యక్రమాలు చేసినా గురువుల కార్యక్రమాల విషయంలో అత్యంత జాగరూకతతో ఉంటారు.

అనూచానంగా వస్తున్న ఆచారం ప్రకారంగా ఈసారి ఏప్రియల్‌లో వచ్చే మేష పూర్ణిమను గుంటూరులో నిర్వహించారు. సప్తర్షి ఆశ్రమంలో శ్రీమతి విజయ, శ్రీవిశ్వనాథ్‌గార్ల పర్యవేక్షణలో మూడు రోజుల సాధనా శిబిరం జరిగింది. ఈ శిబిరంలో మాస్టర్‌గారు యజ్ఞవిద్య-సంస్కారాలు అనే అంశం మీద తమ సందేశాన్ని చాలా ఘాటుగా అందిస్తూ, గాయత్రీ మహావిజ్ఞానం 3వ భాగం బాగా అధ్యయనం చెయ్యాలనీ, సంస్కారాలు చేయడం అందరూ బాగా నేర్చుకోవాలని, త్వరలో వాటి మీద పరీక్షలను నిర్వహిస్తామని చాలా గట్టిగా చెప్పటం జరిగింది. ఆ తరువాత పరీక్షలను కూడా నిర్వహించడం జరిగింది.

ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా ఈ సంవత్సరం మాస్టర్‌గారు బెంగుళూరు వెళ్ళాలని సంకల్పించారు. ఆ సంవత్సరమే మాధురి వాళ్ళ కుటుంబం బెంగుళూరుకు రావటంతో వారింట్లోనే మాస్టరుగారు ఉండటం జరిగింది. మళ్ళీ మేనెలలో అంటే వృషభ పూర్ణిమకు తిరుమలకి వచ్చి అక్కడ మూడు రోజుల సాధనాశిబిరం నిర్వహించారు. మాస్టర్‌గారు ఎక్కడవున్నా విధిగా ఈ మూడు పూర్ణిమలను పద్ధతిగా నిర్వహించేవారు.

# II సాధనలు – సిద్ధి

## అధ్యాయం-3
## మానవ జాతిపై గురువుల ఆశ

### డార్జిలింగ్ యాత్ర

ఒకసారి మాస్టర్‌గారి దగ్గరికి అంటే శ్వేతద్వీపానికి సావిత్రి వచ్చింది. సావిత్రి ఏ పనిచేసినా తనకు తానే సాటి అన్నట్లుగా చేస్తుంది. పూజ్యశ్రీ మాస్టర్‌గారు గుంటూరు సప్తర్షి ఆశ్రమంలో ఉన్నప్పుడు ఆయన ఎప్పుడు ఏది కావాలంటే దానిని క్షణాల మీద అమర్చిపెట్టేది. శ్వేతద్వీపంలో ఆ రోజు మాస్టర్‌గారితో పాటు మరికొంతమంది పరివార్ సభ్యులు ఉన్నారు. మాటల సందర్భంలో సావిత్రి మాస్టారితో, 'గురుపూర్ణిమ వస్తోంది కదా మాస్టారూ మనం బాగా చల్లగా ఉండే ఏదైనా క్రొత్త ప్రాంతానికి వెళితే బావుంటుంది, వెళ్దామా?' అని అడిగింది. 'ఎక్కడికి వెళ్దాం. వెళితే అందరం వెళ్ళాలి మరి!' అన్నారు మాస్టర్‌గారు. 'సరే మాస్టారు, డార్జిలింగ్ చాలా అందమైన ప్రదేశం. అక్కడ నాకు తెలిసిన వాళ్ళు ఉన్నారు. మనకు కావాల్సిన ఏర్పాట్లు అంతా వాళ్ళే చూసుకుంటారు. మీరు ఓకే అంటే ఇప్పుడే వాళ్ళతో మాట్లాడతాను' అంది. మాస్టర్‌గారి అనుమతి రాగానే అన్నీ క్షణాల మీద ఫోన్ల ద్వారానే ఏర్పాట్లు చేసేసింది. రిజర్వేషన్స్ అంతా తానే ఏర్పాటు చేసింది. శ్రీశ్రీ మాస్టర్‌గారు అనుష్ఠానాలు చేస్తున్న సమయం అది. ఆ రోజున గాయత్రీ అనుగ్రహ పీఠంలో అనుష్ఠాన పూర్ణాహుతి చేసుకున్నాక మాస్టర్‌గారు గురుపూర్ణిమ-దాని విశిష్టత, దానిని ఎలా చేసుకోవాలి అనే విషయంపై చక్కటి సందేశాన్ని ఇచ్చారు.

నాకు ఈ సందేశాన్ని అందరికీ చెప్పాలనిపించింది. ఈ మధ్యకాలంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు బయట గ్రామాలలో ఎలాంటి సాధనా శిబిరాలు పెట్టకపోవడంతో అందరూ స్తబ్ధుగా అయిపోయారు. తిరిగి అందరిలో చైతన్యం తీసుకురావాలంటే మళ్ళీ కార్యక్రమాలను ప్రారంభించాలి అనే ఆలోచనతో

కొంతమంది కార్యకర్తలతో కలసి చర్చించి అన్ని గ్రామాలలో తిరిగి చైతన్యవంతంగా ఒక యాత్ర చెయ్యాలని నిర్ణయించుకున్నాను. వెంటనే మాస్టర్‌గారితో నా అభిప్రాయాన్ని చెప్పి డార్జిలింగ్‌కు వెళ్ళే ప్రయాణం విరమించుకోవడానికి అనుమతి కోరాను. అనూహ్యంగా వారు దానికి సమ్మతించారు. అనుకున్నట్లుగానే అన్నీ సవ్యంగానే జరిగిపోయాయి. గ్రామాలలో పూజ్యశ్రీ మాస్టర్‌గారి సందేశాన్ని అందించాలనే ప్రయత్నాలు చేశాము. శ్రీశ్రీ మాస్టారితో పాటు డార్జిలింగ్‌కు సావిత్రి, శ్యామల, కరణ్ మొదలైనవాళ్ళు వెళ్ళారు.

అనుకున్నట్లుగానే నేను, మావారు, శ్రీ సి.వి.వి రామారావుగార్లు ఇంకా మరికొంతమంది పరివార్ సభ్యులం కలిసి ఒక వెహికిల్‌ని మాట్లాడుకొని ఎంతో ఉత్సాహంగా చాలా గ్రామాలలో తిరిగి ఆనాడు మాస్టర్‌గారిచ్చిన సందేశాన్ని వినిపించాము. అందరిలో నూతన స్ఫూర్తిని, ప్రేరణను తీసుకురావడానికి ప్రయత్నించడం జరిగింది. ఆ రోజు గురుపూర్ణిమ. రేపల్లెలో శ్రీశాంతారావు గారింట్లో యజ్ఞం చేస్తున్నాము. సరిగ్గా అదే సమయానికి డార్జిలింగ్ నుంచి శ్రీశ్రీ మాస్టర్‌గారు ఫోన్‌చేసి పేరుపేరున అందరికీ గురుపూర్ణిమకు, పరమగురువుల ఆశీస్సులను ప్రసాదిస్తూ, ఇక్కడ చాలా విశేషాలు జరిగాయి, నేను వచ్చాక అన్ని విషయాలు చెప్తాననే ఆశ్వాసనను ఇచ్చారు. వారు డార్జిలింగ్‌లో దాదాపు ఇరవై రోజులపాటు ఉన్నారు.

ఆ ఇరవై రోజులు డార్జిలింగ్‌లో సాధన చేసుకోవాలనే ఉద్దేశ్యం వ్యక్తపరచగా శ్రీకరణ్‌భయ్యా అందుకు కావలసిన ఏర్పాట్లు చేశారు. మాస్టర్‌గారు రోజూ ఉదయాన్నే లేచి పర్వతప్రాంతాలలోకి సాధన కోసం వెళ్ళిపోయేవారు. అక్కడికి వెళ్ళేటప్పుడు ఆయన ఒంటరిగానే వెళ్ళేవారు. అలా వెళ్ళినప్పుడు ఒకరోజున అక్కడ 25,000 సంవత్సరాల వయస్సున్న ఒక ఋషి మాస్టర్‌గారిని కలిసి ఆయనను ఆశ్రమాల అంతర్భాగాలలోకి తీసుకువెళ్ళారు. వెళ్ళి చూడగా అక్కడ ఎన్నోవేల సంవత్సరాలున్న అనేక మంది ఋషుల దర్శనభాగ్యం మాస్టర్‌గారికి కలిగింది. అక్కడ వారు ఈ యుగసంధికాలము యొక్క విశిష్టత, చేయవలసిన పనులను గురించి మాస్టర్‌గారికి అనేక సూచనలనిచ్చారు. డార్జిలింగ్ నుండి వచ్చిన తరువాత ఆ మహాత్ములు చెప్పిన విశేషాలను అనుగ్రహపీఠంలో అందరికీ వివరించారు.

## గురువులు ఏం కోరుకుంటున్నారు?

కాలాతీతం కాదు కాని ఒక సంఘటన జరిగింది. అందులో పరమ గురువులు చేసిన నిర్ణయాలు మన భవిష్యత్తును నిర్మిస్తాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలని శ్రీ అరవిందో, శ్రీ రమణమహర్షి మొదలైన వాళ్ళు తెర వెనుకన ఉండి పని చేస్తే, తెర ముందర లోకమాన్య తిలక్, మహాత్మాగాంధీ, వల్లభభాయ్‌పటేల్ ఇలా చాలా మంది పనిచేశారు. సర్వస్వాన్ని అర్పించిన కార్యకర్తలు ఆనాడు 10, 15 మందికి పైనే ఉన్నారు. వాళ్ళకి అనేక మంది సహకరించారు.

ఆనాడు కష్టపడ్డట్లే ఈనాడు కష్టపడాలి. గూమ్ (Ghum or Ghoom Monastery) అనే మొనాస్ట్రీ ఉంది. అక్కడ బుద్ధుడు, క్రైస్ట్, మహమ్మద్‌లు కలిసి చేస్తున్న ఒక అద్భుతమైన సామూహిక ప్రయత్నం ఉంది. అది ఖచ్చితంగా జరిగి తీరుతుంది. ఆ సంఘటన వారనుకున్నట్లుగానే జరిగి పోతుంది. కాని అందులో మీరుంటారా? లేదా అన్నది మీ ప్రయత్నం బట్టి ఉంటుంది. ఆధ్యాత్మిక సాధనా ప్రవాహంలో కొట్టుకుపోయేవారికి దారి దొరకవచ్చు. ఎప్పుడు? అంటే దానికి తగిన కృషి చేసినప్పుడు!

దానిని పట్టుకోటానికి నేను సుమారు 108 లఘు అనుష్టానాలు చేస్తున్నాను. ప్రతి నెల 10, 20, 30 తేదీలలో పూర్ణాహుతిని చేస్తాను. **ఈ శక్తిని మీకు అందజేస్తాను. అది నాది కాదు. ఆ శక్తి అంతా ఆధ్యాత్మిక గురువులది. ఎవరు దానిని అందుకునే అర్హత సాధిస్తారో వారికా శక్తి ఇవ్వబడుతుంది. ఈనాడు పూజలు, జపాలు, యజ్ఞాలు ఎందుకు చేస్తున్నామో మర్చిపోయాము. అందువల్లనే అవి పని చెయ్యడం లేదు. కానీ ఆ కార్యక్రమాలు క్రమంగా జరుగుతూ ఉంటేనే గురువుల ఆశీర్వాదాలు మనకు లభిస్తాయి.** వివేకానందుడికి, శ్రీరామకృష్ణ పరమహంస తమ శక్తిని ఎందుకు ధారపోశారు అంటే దానిని ప్రపంచానికి చెప్పటానికే. ఇలాంటి చిత్రమైన కాలం ప్రపంచంలో ఇది వరకు కాలంలో రాలేదు. ఈనాడు చేస్తున్న కార్యక్రమాల ప్రముఖ నిర్ణయం ఏమిటంటే శ్రీకృష్ణ నిర్యాణం తర్వాత వచ్చిన గురుపరంపర మనల్ని ఏం చెయ్యమంటోంది? వారు ఊర్ధ్వలోకాలను వదలి ఈ భూమి మీదకు ఎందుకు వచ్చారు? సాయితత్వం అతి ఉచ్ఛ లోకాల నుండి ఎందుకు ఈ భూమ్మీదకు దిగింది? పురాణాలలో దొరకదది–దానికి కాస్త లింక్ దత్తావతారాలలో దొరుకుతుంది. ఆ అవతారం ఎందుకు భూమి మీదకు వచ్చింది? మీ అమ్మాయి పెండ్లి కొరకో లేక అబ్బాయి ఉద్యోగం కొరకో వాళ్ళు వచ్చారనుకుంటున్నారా? సూక్ష్మంగా

వాళ్ళిచ్చే ప్రేరణ, వాళ్ళిచ్చే ఉత్సాహం మీకు అర్థం కావటం లేదు కనుకే వారు ఈ స్థూల శరీరంతో వచ్చారు. గురువుల దగ్గర ఉంటే మీకేది కావాలో దానిని ఇస్తారు. కోరికలు కోరుకోకుండా అసలైన పని చెయ్యండి.

అసలు ఈ దేశకాల పరిస్థితులలో ఎందుకు పుట్టాం? ఆలోచించండి. సత్యసాయి ఇచ్చిన ప్రేరణతో బి.వి. రాజుగారు 360 మంది యోగుల జీవితాలను గురించి వ్రాశారు. ఇంత మంది మహానుభావుల మధ్యన మనం జన్మించాం. **వాళ్ళ దగ్గరికి వెళితే, మీ పనులు, మీ శ్రద్ధ, నిష్ఠ, మీ ప్రారబ్ధకర్మలను బట్టి లాభాలు వస్తుంటాయి.**

మంచి పనులు చేస్తుంటే చెడు ఫలితాలు వస్తున్నాయని భ్రమపడి దేవుడిని దూషిస్తాం. కాని భౌతికజగత్తులో ఉండే అమ్మకే కోపం రాదు, మరి జగజ్జననికి కోపం వస్తుందా? మనమేం నాటుకుంటామో అదే కోసుకుంటామని గుర్తుంచుకోండి. భగవన్నామం చేసే వారికి కోపం రాదు. ఈ కాలంలో పుట్టిన మీరెంతో అదృష్టవంతులు. **గురువుల ప్రణాళికలో నాతో కలసి పనిచేస్తున్న మీరందరూ అదృష్టవంతులే.** ఇంతకీ మీరేం **చేశారు గురువుల** పనిని? ఏం చెయ్యాలి? **గురువులేం కోరుకుంటున్నారు?** అని ఎప్పుడైనా ఆలోచించారా? **మన ఊర్లోనే, మన మధ్యనే అనేక మంది మహాత్ములు పని చేస్తున్నారు. మీరు వాళ్ళ పనికి అనుగుణంగా పని చేస్తే వాళ్ళు మీకు కూడా కనిపిస్తారు. సరైన రీతిలో సహకరిస్తారు కూడా.**

ఈనాడు గురువులు ఒక లక్ష్యానికి అనుగుణంగా జీవించమని చెప్తున్నారు. అదేమిటంటే 1) మానవులలో దైవత్వ అవతరణ. 2) పృథ్విపై స్వర్గావతరణ. ఈ దిశలో మనమేం పని చేస్తున్నాము? ఎక్కడ వైషమ్యాలు ఉండకూడదో, ఎక్కడ విద్వేషాలు ఉండకూడదో అక్కడ అవి ఏరులై ప్రవహిస్తున్నాయి. దాని నుండి బయట పడండి. మానవులలో దైవత్వం రావాలంటే రామకార్యానికి హనుమంతుడు సహాయపడ్డట్లు మీరు గురువుల పనులకు సహకరించండి. ఒక ఉడుతలాగా సాయం చెయ్యండి. **అక్కడ మనకు దాని భావం ముఖ్యం. ఎంత చేసింది అనేది ముఖ్యం కాదు. అలా చెయ్యాలి.**

ఈ సమయంలో మీరెంత చిన్న పని చేసినా ఫలితం అనంతంగా ఉంటుంది. ఈనాడు నేను చెప్తున్న ఈ విషయాలను ప్రపంచానికి బ్రాడ్‌కాస్ట్ చేయగలిగితే మీరు ప్రపంచ పౌరులౌతారు.

ప్రపంచ పౌరులుగా జీవించాల్సిన మీరు కనీసం ఒక కుటుంబానికి కాని, ఒక్క ఊరికి కాని చెందే రీతిలో జీవించడం లేదు. ఈనాటి ఈ దేశకాల పరిస్థితులను చక్కబరచటానికి హిమాలయాలలో ఉన్న పరమగురువులు, కొంతమంది వ్యక్తులను ఈ భూమ్మీదకు పంపించారు. అలా వచ్చి దేశకాల పరిస్థితులను అధిగమించి పనిచేసిన ఒక కబీర్, శ్రీరామకృష్ణపరమహంస, వివేకానంద లాంటి వాళ్ళకు కూడా అనుకున్నంత పని జరగలేదు. అప్పుడు ఋషులు మరొక మీటింగ్ వేశారు. మానవునిలో దైవత్వ అవతరణ, పృథ్విపై స్వర్గావతరణ జరగాలనేది వారి ప్రణాళిక. అందుకోసం శ్రీరామశర్మఆచార్య, శ్రీదయానంద సరస్వతులవంటివారు అవతరించారు. వారి ద్వారా గాయత్రీ మంత్రం, యజ్ఞాలు వ్యాప్తిలోకి వచ్చాయి. ఇక మనం వాటిని ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి.

కోరికలు తీర్చుకోవాలంటే దానికి తగిన పెట్టుబడి దానికి పెట్టాలి. దాన్నే శ్రీకృష్ణుడు 'యజ్ఞానాం జప యజ్ఞోస్మి' అన్నాడు. కోరికలు తీర్చుకోవటానికి జపయజ్ఞం ముఖ్యం. (యజ్ఞాలలో రారాజైన అశ్వమేధ యజ్ఞం తిరుమలలో జరిగింది. అది అయిపోయాక అందరి కోరికలు సులభంగానే తీరాయి.) ఆధ్యాత్మిక సాధనలో మొదటి మెట్టు ధ్యానం, జపం, ప్రాణాయామం. వీటిని మర్చిపోవద్దు. **మీరు నాతో లింక్‌లో ఉంటే మిమ్మల్ని చాలా దూరం తీసుకుపోతాను. దానికి తపస్సు కావాలి. దానికి మీకొక ప్రణాళికను ఇచ్చాను. మీరు నాతో పాటు అనుష్ఠానాలను చెయ్యండి.**

**అప్పుడు గురువుల సిండికేట్‌లో మీ భవిష్యత్తును చూడగల్గుతారు. పూజ్య గురుదేవులు ఇన్ని కోట్ల మందికి, ఎవరి పేరున వారికి 24 లక్షల జపం డిపాజిట్ చేశారు. మీ పేరున ఉన్న ఆ జపసాధనను మీరు అందుకోవాలంటే ప్రతిరోజు రెండు గంటల పాటు పనిచెయ్యాలి.** మీరెంత పెద్ద పెద్ద అడుగులు వేస్తే పృథ్విపై స్వర్గావతరణకు అంత దగ్గరౌతారు. ప్రతిరోజు రెండు గంటల పాటు చేసే సాధనలో ఆసనాలు:15 నిమిషాలు, ప్రాణామాయం:15 నిమిషాలు, జపం - 45 నిమిషాలు, స్వాధ్యాయం: 30 నిమిషాలు. ఇలా చేసే వాళ్ళకి గాయత్రీమంత్రం సిద్ధిస్తుంది. గురువుల ప్రణాళికలో మీరు పాలుపంచుకొనే అవకాశం లభిస్తుంది.

యజ్ఞాలు వ్యాప్తిలోకి వచ్చాయి. ఇక మనం వాటిని ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి.

కోరికలు తీర్చుకోవాలంటే దానికి తగిన పెట్టుబడి దానికి పెట్టాలి. దాన్నే శ్రీకృష్ణుడు 'యజ్ఞానాం జప యజ్ఞోస్మి' అన్నాడు. కోరికలు తీర్చుకోవటానికి జపయజ్ఞం ముఖ్యం. (యజ్ఞాలలో రారాజైన

అశ్వమేధ యజ్ఞం తిరుమలలో జరిగింది. అది అయిపోయాక అందరి కోరికలు సులభంగానే తీరాయి.) ఆధ్యాత్మిక సాధనలో మొదటి మెట్టు ధ్యానం, జపం, ప్రాణాయామం. వీటిని మర్చిపోవద్దు. **మీరు నాతో లింక్‌లో ఉంటే మిమ్మల్ని చాలా దూరం తీసుకుపోతాను. దానికి తపస్సు కావాలి. దానికి మీకొక ప్రణాళికను ఇచ్చాను. మీరు నాతో పాటు అనుష్ఠానాలను చెయ్యండి.**

## ఆత్మానుభూతిని ఇస్తాను

శ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు డార్జిలింగ్ నుండి వచ్చేశాక అక్కడ పరమగురువులందించిన విశేష ప్రణాళికలను, సాధనలను సాధకులకు అందచేయడానికి ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయమని చెప్పారు. అది కూడా ముందుగా ఆశ్రమాలు, అనుగ్రహ పీఠాలలో జరగాలి కనుక తత్సంబంధమైన కార్యాచరణ పథకాన్ని రూపొందించమని చెప్పారు. అన్ని ఆశ్రమాల వారికి సందేశం వెళ్ళిపోయింది. ముందుగా 'దత్తక్షేత్రం' వేటపాలెంలో సాధనాశిబిరానికి ఏర్పాటు చేశారు. అది ఆగష్టు నెల. ఆగష్టు 10వ తేది మోక్షస్మృతి అనే పాపకు జన్మదిన సంస్కారం చేశాక మాస్టర్ గారు సాధనాశిబిరాన్ని ప్రారంభించారు. మాస్టర్‌గారు డార్జిలింగ్ నుండి వచ్చిన తర్వాత జరగబోతున్న సాధనాశిబిరం. వారు ఇచ్చే సందేశాన్ని వినాలనే తపన, ఆనందంతో అన్ని గ్రామాల నుండి సాధకులు వచ్చారు. సంస్కారం జరిగిన తర్వాత దత్తస్వామి సాన్నిధ్యంలో ప్రశాంత వాతావరణంలో ఋషితుల్యులైన మన మాస్టర్‌గారు సందేశాన్ని ప్రారంభించారు.

గత సంవత్సరం నుండి అంటే 2002 సంవత్సరం నుండి నేను పూర్ణిమ ధ్యానాలను ప్రారంభించాను. వాలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చేశాను. ఇక నా మొత్తం సమయాన్ని గురుదేవుల కార్యక్రమాల నిర్వహణకే అంకితం చేస్తాను. ఈ మధ్య కాలంలోనే హిమాలయాలకు వెళ్ళి వచ్చాను. అక్కడ పరమగురువులు అందించిన విశేష కార్యక్రమాలను చేయవలసిన బాధ్యత నాపైన చాలానే ఉంది. ఈ మధ్యకాలంలో నేను మీకు మొదటి దీక్షను ఇచ్చాను. మీకే సమస్యలు వచ్చినా నాకు చెప్పండి. నేను తీరుస్తాను. ఏ మాత్రం సంకోచించవలసిన పనిలేదు. సరైన గురు-శిష్య సంబంధం ఏర్పడాలి. **నేను చాలా మంది గురువుల బాధ్యతను స్వీకరించాను. దానిని వ్యవస్థీకృతం చేయాలంటే అందులో నాతోపాటు మీకూ బాధ్యత ఉంటుంది. అలా పరస్పర అవగాహనతో జరిగే ఇంటరాక్షన్‌తోనే గురు,శిష్య సంబంధాలు ధృఢమవుతాయి. పూర్వకాలంలో మాదిరిగా ఈనాడు ఆ గురుశిష్య సంబంధాలు చక్కగా స్థాపించబడి, వ్యవస్థీకృతం కావాలి అని చెప్పారు.**

10-08-2003వ తేదీని గుర్తుంచుకోండి. ఆ రోజున గురుశిష్యుల మధ్య బాధ్యతాయుత ఒప్పందం జరగబోతున్నది. ఇందులో శిష్యుని బాధ్యతే ఎక్కువగా ఉంటుంది. ఈ దీక్షా సమారోహానికి నాలుగు రోజులు ప్రిపరేషన్ చేసుకోవడంతో పాటు ముందస్తు ఏర్పాట్లు కావాలి. నేను చెప్పే ప్రతి మాటను హృదయంగమం చేసుకోండి. ముఖ్యంగా మీకు మూడు పుస్తకాలను గురించి చెప్పాలి. అవి జ్వాలాకూల్‌మహర్షి వ్రాసిన పుస్తకాలు

1) Soul and its mechanism: జీవాత్మ-దాని పరికరాలు. ఇది తెలుగులోకి అనువదించబడి ప్రింట్ అయిపోయి ఉంది. అందరికి అందుబాటులోకి వచ్చేసింది. ఈ పుస్తకాన్ని చాలా సీరియస్‌గా చదవండి. మీరు స్త్రీలు కాదు, పురుషులు కాదు. మీరు ఆత్మలు. మీకు నేను 'ఆత్మను అనే ఆత్మానుభూతిని' ఇస్తాను. ఇది నాది కాదు. అనేక మంది గురువుల ఆర్తి, ఆరాటం ఇది. అందుకే దానిని ఇస్తాను.

2) బాధలు ఉన్నాయి, పట్టించుకోవద్దు. నాకో విశేషమైన టార్గెట్‌ను గురువులు ఇచ్చారు. అది పరమ రహస్యం. అయితే ఈ టార్గెట్‌లో మీకు భాగం ఉన్నది. మీకు ఈనాడు ఉన్న కష్టాలు ఉండవు. శాంతి వస్తుంది. అశాంతి అనేది మీ జీవితాలలో రాదు. ఈనాటి ఈ దీక్షా కార్యక్రమంలో శాంతిని ప్రవేశపెట్టాను. రేపు 20వ తేదీనాడు, నేను చేసుకోబోతున్న పూర్ణాహుతికి మీరందరూ ఒంగోలుకు రావాలి. ఈనాటి నుంచి మీరంతా నా శిష్యులు. ఈ క్రింద ఇచ్చిన మూడు పుస్తకాలలో మొదటిది ప్రింటైపోయి వుంది. మిగిలిన రెండింటిని తెలుగులోకి అనువదించి అందించాలి.

1) Soul and its mechanism 2) Externalisation of Heirarchy 3) Reappearance of christ

ఈ దీక్ష తీసుకోబోయే వారికి 17, 18, 19 తేదీలలో నేను ఈ మూడు పుస్తకాల గురించి పరిచయం చేస్తాను. దీక్ష తీసుకోవాలి. అప్పుడే కాంటాక్ట్ వస్తుంది. అందుకే ఇంత ఇదిగా చెపుతున్నాను. హిమాలయాలలో గురువులు ఏం చెప్పారో చెప్పడానికి నేను మాధ్యమాన్ని మాత్రమే. ఇచ్చే శక్తి మాత్రం వారిదే. ఈ మూడు పుస్తకాలు చదివినా చాలు లేదా విన్నా చాలు. మీ జీవితాలకు అర్థం తెలుస్తుంది. అంత గొప్ప పుస్తకాలవి.

ప్రతినెలా 7-9, 17-19, 27-29 తేదీలలో ఈ మూడు పుస్తకాల మీద క్లాసులు పెడతాను. రేపు ఆదివారానికి ఒంగోలుకు రండి. మీ జీవితాలలో ఎదురౌతున్న ఒడిదుడుకులు-ఏ లోటుపాట్ల

వల్ల అవి వస్తున్నాయో నాకు తెలుస్తుంది. దానికో బీజమంత్రమున్నది. దీక్ష తీసుకోటానికి ముందు మూడు రోజుల పాటు జల ఉపవాసం ఉండాలి. అలా దీక్ష తీసుకుంటేనే మీకు ఆ మంత్రం చాలా శక్తివంతంగా పనిచేస్తుంది. మీకే కష్టాలు ఉన్నా నాకు ఉత్తరం వ్రాయండి. జవాబు వ్రాస్తాను. బీజమంత్రాలను, ఉత్తరాల ద్వారా కూడా పంపుతాను, నియమాలు చెపుతాను. గురుపూజ చెయ్యాలి. గురుదక్షిణ ఇవ్వాలి. దీక్షకు మూడు రోజుల పాటు పండ్ల రసాలు మాత్రమే తీసుకొని దీక్ష స్వీకారం చెయ్యాలి. అనుష్టానమయ్యాక నేను చేసే పూర్ణాహుతికి రావాలి. ఆ సమయంలో గురువులు అనంతమైన శక్తినిస్తారు. మీ అదృష్టం. తీసుకోవాలని ఉంటే రండి.

నా ముఖ్యమైన టార్గెట్ మూడు పుస్తకాలని చెప్పాను. తర్వాత సంస్కారాలు చెయ్యాలి. ఈ సంస్కార మహోత్సవాల విలువ మీకు ముందు ముందు తెలుస్తుంది. ఆషామాషీగా చెయ్యవద్దు. సంస్కారాలను అందంగా ఆకర్షణీయంగా చెయ్యండి. అప్పుడు ఆ సంస్కారం వల్ల ఎంతటి ఆధ్యాత్మిక శక్తి వస్తుందో మీకే అనుభవమౌతుంది.

**శక్తినిచ్చే బాధ్యత గురువులదే. దీక్ష తీసుకున్నాక ప్రతి పూర్ణాహుతికి మీరు రావాలి. వచ్చాక మీకే తెలుస్తుంది. ఆ శక్తి అంతా నా అనుష్టానశక్తి. శ్రీరామశర్మఆచార్య గురుదేవుల శక్తి ఎలా అందరికీ వితరణ చేయబడుతుందో మీరే చూస్తారు. కొన్ని బీజమంత్రాలని హిమాలయాలలోని గురువులు ఇచ్చారు. ఇచ్చే పని నాది. తర్వాత బాధ్యత గురువులది. మీకున్న బాధలన్నింటిని నాకు చెప్పవచ్చు. వాటిని పరిష్కరించే బాధ్యత నాది అని ఆ రోజున ఒక విచిత్రమైన వాగ్దానాన్ని ఇచ్చారు.**

అలా చెప్తూ చెప్తూ శ్రావణ పూర్ణిమ నుంచి సాధనను ప్రారంభించమని చెప్పారు. ఆ రోజులలో మాస్టర్‌గారు ఎక్కడ క్లాస్ పెట్టినా జ్వాలాకూల్ మహర్షి పుస్తకాలు గురించే మాట్లాడేవారు. అయితే అప్పటికే సోల్ అండ్ ఇట్స్ మెకానిజం చెప్పడం అయిపోయింది. దానిని ప్రింట్ చేయడం, ఆవిష్కరించడం కూడా అయిపోయింది. దాని తరువాత ఆగష్టు నెల నుంచి The Externalisation of Heirachy అనే పుస్తకం చెప్పడం ప్రారంభించారు. మొదట దానిని గురుపరంపర యొక్క పునఃప్రాదుర్భావం అని చెప్పారు. కాని తర్వాత కాలంలో దీనిని **ఋషుల బాహ్యప్రకటీకరణ** అనే పేరుతో పుస్తక రూపంలో తయారుచేయడం జరిగింది. ఈ పుస్తకం గురించి దాదాపు 4, 5 నెలల పాటు క్లాసులు చెప్పారు. దీని క్యాసెట్లను శ్రీమతిలక్ష్మీరాజగోపాల్, వల్లీ శ్రీనివాస్‌గార్లు వ్రాసి డి.టి.పి. చేసి పుస్తకరూపంలోకి తేవడానికి సిద్ధపరిచారు. కాని మాస్టర్‌గారు, దీనిని ప్రచురించటానికి

ఇంకా సమయం రాలేదు. ప్రస్తుతానికి దానినలా ఉండనివ్వండి. సమయం వచ్చినప్పుడు నేనే చెప్తాను, చేద్దురుగాని అని చెప్పారు.

పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు పరమగురువుల పరంపరకు చెందినవారే అయినప్పటికి అతిసామాన్య మానవుని వలె జీవిస్తూ, నిరంతరం లోక శ్రేయస్సును గురించి ఆలోచిస్తూ పరమ గురువులందించిన జ్ఞానాన్ని అత్యంత సరళమైన రీతిలో సాధకుల హృదయాలలోకి చొప్పించటానికి ప్రయత్నం చేసేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీశ్రీ మాస్టర్‌గారు మానవ జీవితము యొక్క పరిమితిని, బంధాన్ని దాటినవారు. మానవజాతిని నిరపాయకరంగా ఒక క్రమపద్ధతిలో ఎలా మలచవచ్చునో తెలిసినవారు. పరమగురువుల పంథాలలో మానవుని ఆధ్యాత్మిక పరిణామక్రమ దశలను త్వరిత పరచి, సరైన మార్గంలో మరలింపగలిగిన వారు, దానికవసరమైన సహాయములను కూడా అందించగలిగినవారు. మానవుల ప్రజ్ఞకు, దేవతల ప్రజ్ఞకు మధ్యన గల అంతరాన్ని దాటించటానికి వారు అనేక రకాల సాధనలను, సద్ జ్ఞానాన్ని అపారంగా పంచిపెట్టడానికి ప్రయత్నం చేశారు.

అలాంటి ప్రయత్నంలో భాగంగానే శ్రీశ్రీ మాస్టర్‌గారు జ్వాలాకూల్ మహర్షి వ్రాసిన మూడు పుస్తకాలను సాధకులకు అందించారు. మాస్టర్ డి.కె గారు A treatise on cosmic fire (విశ్వాగ్ని వేదము) అనే అద్భుతమైన గ్రంథంలో సూటిగా కొన్ని ముఖ్యమైన విషయాలను ప్రకటించారు. (ఈ పుస్తకం పై మాస్టర్‌గారి ప్రవచనాలున్నాయి). ఈ పుస్తకాన్ని ఇరవైయ్యొకటవ శతాబ్దంలో 'భౌతికశాస్త్ర' వాచక గ్రంథ(text book)మని పేర్కొన్నారు. వారు చాలా స్పష్టంగా చెప్పిన విషయమేమిటంటే తన రచనల ఏకైక లక్ష్యము గుప్తవిద్యను అర్థమయ్యేటట్లు నిరూపించి, దానిని ప్రయోగంలోకి తీసుకురావడమేనని శ్రీ జ్వాలాకూల్ మహర్షి విశ్వాగ్ని వేదము (A treatise on cosmic fire) అనే గ్రంథములో పేర్కొన్నారు. మేడం బ్లావెట్స్కీ వ్రాసిన సీక్రెట్ డాక్ట్రిన్ కొరకై డి.కె.గారు ఇంత శ్రమ చేయవలసి వచ్చింది. ఎందుకంటే బ్లావెట్స్కీ తన శిష్యురాలు కావటమే ఇందుకు కారణం.

### కొన్ని ముఖ్యమైన విషయాలు

1. భగవద్గీతలోని అంతరార్థాలు బోధపడాలంటే గుప్తవిద్యను చదువుకున్నాకే గీతను చదవాలి.
2. గుప్తవిద్యను సులభంగా అర్థం చేసుకోవాలంటే మనకు ఉపయోగపడే పుస్తకము ఒకటే, దానిపేరు

ఎ) 'మానవ పరిణామము' (హ్యూమన్ ఇవల్యూషన్) దీనిని బార్బరోకో వ్రాశారు. అలాంటిదే ఇంకో పుస్తకము.

బి) విశ్వ సంఖ్యలు. (కాశ్మిక్ న్యూమరల్స్).

సి) గుప్తవిద్య పుస్తకంలోని ప్రతి పేజీ అర్థం కావటానికి ఉపయోగపడే మరొక పుస్తకం. 'దివ్యప్రణాళిక' (డివైన్ ప్లాన్). దీనిని కూడా బార్బారోకోనే వ్రాశారు. ఈయన ఆస్ట్రేలియా దేశస్తుడు. మొట్టమొదటిగా ఈ పుస్తకాన్ని చదవాలి.

డి) 'ఏనిషియంట్ విజ్‌డం' దీనిని అనీబీసెంట్ వ్రాసింది.

ఇ) 'ఓషన్ ఆఫ్ థియోసఫీ' (దివ్యజ్ఞాన సాగరము). దీన్ని డబ్ల్యూ-క్యూ జడ్జి (W.Q.Judge) వ్రాశారు. దీనిని చదివితే వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు అన్ని అర్థమౌతాయి.

ఎఫ్) సోలార్ సిస్టమ్: ఎ.ఇ. పావెల్ (A.E.Powell) వ్రాశారు. ఈ గ్రంథములో కొంచెము ఇతోధిక విజ్ఞానమున్నది.

ఈ గ్రంథాలనర్థం చేసుకున్నాకే మనకు సీక్రెట్ డాక్ట్రిన్ అర్థమౌతుంది. పూజ్యశ్రీ మాస్టర్‌గారు చెప్పిన కొన్ని విషయాలతో పాటుగా మాస్టర్ ఇ.కె.గారి పుస్తకాల ద్వారా కొంత విషయ సేకరణ చేసి పాఠకుల సౌలభ్యం కోసం అందించడమైనది.

## భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞానం

**పూజ్యగురుదేవులు పండితశ్రీరామశర్మ ఆచార్యగారు, దాదాగురుదేవుల మార్గదర్శనంలో హిమాలయాలలోని అనేక మంది ఋషుల కార్యక్రమాలను తిరిగి పునర్వ్యవస్థీకరించి, వాటికి ఈనాటి దేశకాల పరిస్థితులకు తగిన రీతిలో ఒక నూతనరూపాన్ని కల్పించి, వాటిని మానవ జీవితంలోకి తమదైన బాణిలో ప్రవేశపెట్టారు. గురుదేవులు 18 మంది ఋషి సాంప్రదాయాలకు నూతన ఉత్తేజాన్ని తీసుకువచ్చారు. వశిష్ఠ సాంప్రదాయం, విశ్వామిత్ర సాంప్రదాయం, భగీరథ సాంప్రదాయం, ఆదిశంకరాచార్య, నారద మొదలైన ఋషుల కార్యక్రమాల గురించి మనం ఆత్మకథలో చదువుకున్నాం. సాధారణంగా సైన్సులో ఒక సైంటిస్ట్ చేసిన ప్రయోగాన్ని ఇంకో సైంటిస్ట్ చెయ్యడు. ఆ తర్వాత ఏం చెయ్యాలో అక్కడి నుంచి తన ప్రయోగాలను ప్రారంభిస్తాడు. ఎలాగైతే గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య ఋషిపరంపరను వ్యవస్థీకృతం చేశారో**

**అలానే డాక్టర్ శ్రీరామకృష్ణగారు కూడా గురుపరంపరలందించిన అనంతమైన జ్ఞానాన్ని, సాధనలను సర్వసులభం చేసి, సార్వజనీనం చేయటానికి ఒక భగీరథ ప్రయత్నం చేశారు. అఖండ గురుసత్తా అని 14 మంది గురువుల యొక్క సాధనలను, వారిచ్చిన జ్ఞానాన్ని, గురువుల మధ్య గల ఏక సూత్రాత్మతను తెలియజేసేందుకు తీవ్ర కృషి చేశారు.**

"గురుపరంపర ద్వారా భారతీయ ఆధ్యాత్మిక వైజ్ఞానికతలో ఒక నూతన మలుపు వచ్చింది. ఈ యుగసంధి కాలంలో ఈ మలుపు రావడమనేది కాకతాళీయం కానేకాదు. అది ఒక నియతి. అద్భుతమైన ఈ యుగసంధి కాలంలో మన పాత్ర ఏమిటి? మనమేం చెయ్యాలి? అనే దానికి నా పాత్రను స్పష్టంగా చెప్తాను. దానికి మీ సహకారం ఏమిటి అనేది కూడా చెప్తాను. నాతో సమానంగా పని చెయ్యాలంటే మీరు కొన్ని త్యాగాలు చెయ్యాలి, కష్టపడాలి. అయితే కష్టానికి మించిన ఫలితాలను మీరు పొందుతారు. ఒక్క విత్తనం భూమిలో నాటితే ప్రతిగా ఎంత పంట వస్తుందో అదే సంభావనా ఇక్కడ కూడా వర్తిస్తుంది. ప్రకృతిలో ప్రతిదీ అఖండ మండలాకారమేగా. నేను చేయవలసిన పనులు ముందుగా

1. పుస్తకాల సమీకరణ. ఒక వ్యక్తి ఒక విద్యలో నిష్ణాతుడు కావాలంటే పుస్తక పరిజ్ఞానం చాలా ఉండాలి. ఈనాటి చదువుల్లో డిగ్రీలు ఉంటున్నాయి కాని ప్రాక్టికల్ జ్ఞానం ఉండటం లేదు. ఆచరణాత్మకం కాని విద్య ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. విద్య నేర్చుకున్న వాడు ఈనాడు ఉద్యోగం లేకపోతే బ్రతకలేకపోతున్నాడు. కానీ సాయి, సత్యసాయి, వెంకయ్య స్వామిలాంటి వాళ్ళేం చదువుకున్నారు. వాళ్ళేది కావాలంటే అది తక్షణం వాళ్ళ దగ్గరకొచ్చేది కదా! ఆ విద్యను నేను మీకు నేర్పబోతున్నాను. నేను చెప్పేది అక్షరాలా ఆచరించినట్లయితే మీరూ అంతటి వాళ్లు అవుతారు. ఆధ్యాత్మిక విద్యను నేర్పించడానికి అనేక మంది మహనీయులు ఆవిర్భవించారు. నేను కాశీలో ఉండగా 33 మంది గురువుల దగ్గర దీక్ష తీసుకున్నాను.
2. నాకు విదేశీ గురువులు కూడా ఉన్నారు. అంతే కాక ఇంకా అనేక మంది మహనీయులతో డైరెక్ట్ కాంటాక్ట్ ఉంది. ఇంత మంది గురువులతో ఉన్నా, నా సాధనను నేను చేస్తున్నా, నా జీవితం చాలా మామూలుగానే ఉంటుంది. నేను సాధన చేస్తున్నాననే విషయం ఎవరికి తెలియను కూడా తెలియదు. కానీ ఈ సాధనలన్నింటికీ పరాకాష్ట 1971 జూన్ 18వ తేదీ సాయంత్రంతో పూర్తైంది. నా జీవితంలో సౌభాగ్యసూర్యోదయం నా గురుదేవులు పండిత

శ్రీరామశర్మ ఆచార్యగారి వద్ద గాయత్రీ మంత్ర దీక్ష తీసుకున్న పవిత్రమైన క్షణాలలో జరిగిపోయింది.

3. ఈ మహత్తరమైన విద్యను నేర్పించటానికి జ్వాలాకూల్‌మహర్షి 10 స్కూల్స్‌ను పెట్టారు. ఈ విద్యను నేర్పించడానికి ఆయన పడిన ఆవేదన అంతాఇంతా కాదు. భారతీయ ఆధ్యాత్మికత చీకట్లోకి పోయింది. తిరిగి దానిని వెలుగులోకి తేవడమనేది ఎంత కష్టం. అందుచేత నేను దీనిని పునఃప్రతిష్ఠింప చెయ్యాలి. ఇవ్వాల్సిన జ్ఞానం కొండలంత పరిమాణంలో ఉంది. మీకేం కావాలో ఇవ్వటానికి గురువులు సిద్ధంగా ఉన్నారు. మీరు పారిపోకపోతే నేర్పటానికి నేను సిద్ధంగా ఉన్నాను అని చెప్పారు.

4. గురుదేవుల వాఙ్మయాలు 70 ఉన్నాయి. వాటన్నింటినీ తెలుగులోకి నేనే బయటకు తీసుకు రావాలి. ఆ పనిని ఇంకెవ్వరూ చేయలేరు. గురువు ఎప్పుడు అడగడు. ఒకవేళ అడిగితే ఆ శక్తిని, సామర్థ్యాన్ని కూడా గురువే ఇవ్వాలి. దానిని చేయటానికి కావలసిన ఆ శక్తిని ఆయనే ఇస్తే కనుక ఆ పనిని మనం చేసి తీరాలి. అలా గురువు చెప్పిన పని చెయ్యకపోతే అది గురుద్రోహమే అవుతుంది. **వైట్ లాడ్జి నుంచి విచిత్రమైన రీతిలో పరమగురువులు పరిస్థితులను కంట్రోల్ చేస్తున్నారు. ఆ సిద్ధసంఘంతో చేతులు కలిపి పనిచేయగలిగే వారిలో పొలిటికల్ లీడర్స్‌తో సహా ఇంకా కొంత మంది వ్యక్తులీనాడు ఆవిర్భవించారు. ఐదురకాల వ్యక్తులు దానికి అనుగుణ్యంగా మారుతారు. పంచ వీరభద్ర సాధనను గురుదేవులెందుకు చేశారో మీకు తెలియదు.** గురువుగారి పంచవీరభద్ర సాధనలో వ్యక్తులందరిని మార్చలేరు. పంచవీరభద్రులు ఈ ఐదు రకాల వ్యక్తుల మీద మాత్రమే పని చేస్తున్నారు. వారు రాజనీతిజ్ఞులు, వ్యాపారవేత్తలు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహితీవేత్తలు.

వీరందరిలో ఒక అద్భుతమైన ఒరవడిని క్రియేట్ చేస్తారు. రమణ మహర్షి, మెహర్‌బాబా మొదలైనవారు మౌనంగా ఉన్నా ప్రపంచాన్ని శాసిస్తారు. పూజ్యగురుదేవులు చేసిన పంచవీరభద్ర సాధన (పంచకోశసాధన) సృష్టిని కుదిపివేస్తుంది. ఈ ఐదు రకాల వ్యక్తులపైన వీరు తమ ప్రభావాన్ని చూపిస్తారు. ఇంకా నేను చేయవలసిన పని పుస్తకాలు వ్రాయటం.

ఒకటి గురుదేవుల వాఙ్మయాలను తెలుగులో ప్రచురించి బయటకు తీసుకురావాలి.

రెండవది జ్వాలాకూల్ మహర్షి పుస్తకాలను వెలుగులోకి తేవాలి.

మూడవది 'ఎడ్గర్ కేసి' పుస్తకాలపై కూడా మానవజాతికి అవగాహనను తీసుకురావాలి. దానికోసమే పని చేస్తాననీ ఆ రోజు ప్రవచనంలో చెప్పిన మాస్టర్‌గారు తర్వాత కాలంలో అక్షరాలా ఆ పనులన్నింటినీ పూర్తి చేశారు.

## ఆచరణీయాలు...

1. ఈ యుగసంధి కాలంలో మీ సమయాన్ని, శ్రమను, ప్రతిభను, ధనాన్ని భగవంతుని పొలంలో నాటుకోండి. నేనీ పనిని చేస్తున్నాను. దీని వలన ప్రయోజనం ఏమిటి అని తెలిసి చెయ్యాలి. సమయాన్ని నాటుకోవడం నేర్చుకోండి. నాతో పాటు కలిసి ప్రయాణించదలచిన వారు పైన చెప్పిన మూడు పుస్తకాలను బాగా చదవండి. పదిమందికి చెప్పండి. వినడానికి ఎవ్వరూ రాలేదు అంటారు. మీ ఇంట్లోనే మంచం మీద కూర్చొని వేలాది మందికి చెప్తున్నాననే భావనతో చెప్పటం నేర్చుకోండి.

2. కష్టాలు ఎవరి కారణంగా రావు. నీ కష్టాలు నీవల్లనే నీకు వస్తున్నాయి. ఇతరులను నిందించవద్దు. నీ కష్టాలకు కారణం నీ చేతలే అనేది అర్థం చేసుకో! ఈ విద్యను ఇప్పుడు మీరు నేర్చుకుంటే ఉన్న విలువ అందరూ నేర్చుకున్నాక రాదు. ఈ విద్యను నేర్చుకోవటం కోసమే మీ సమయాన్ని నాటుకోండి.

3. ప్రతిభ: ఇతరులకు ఈ విద్యను అర్థమయ్యేలా చెప్పగలగాలి. అందరికీ అందించాలి. ఊద్భటం కరెక్ట్‌గా వస్తే అదీ నాటుకోవటమే. గాంధీగారు ఈ ఊద్భటం అనే విషయం గురించి 20 పేజీల పుస్తకం రాశారు, దొరికితే చదవండి. దీని వల్లనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.

4. మన కష్టాలు పోవాలి అంటే మనం ఇంకో మంచి పనిని చెయ్యాలి.

5. భోజనం చేసేటప్పుడు అందరూ కలసి తినండి. ఆ సమయంలో మంచి మాటలను నాటుకోవాలి. సహనావవతు, సహనౌభునక్తు – ఈ మంత్రం వచ్చుగదా! చెప్పుకుని భోజనం చెయ్యండి. భోజనం చేసేటప్పుడు 1) 'తతశ్చాద్విరభూత్ సాక్షాత్' – ఈ శ్లోకం చదువుకుంటూ కలిసి తింటే లక్ష్మీదేవి ఆవిర్భావం జరుగుతుంది. 2) 'అచ్యుతానంత గోవింద' శ్లోకం

చెప్పుకుని భోజనం చేస్తే రోగాలు రావు. ఈ రోజుల్లో సర్వసాధారణంగా వచ్చే క్యాన్సర్, హార్ట్ఎటాక్, డయాబెటీస్ లాంటి ఏ రోగాలు అయినా తగ్గుతాయి. మనం భోజనం చేసేటప్పుడు ఏది నాటుకుంటామో అదే మన జీవితానికి సాఫల్యాన్నిస్తూంది. భోజనం చేశాక మాస్టర్ సి.వి.వి. ధ్యానం చెయ్యాలి. ఈ మూడు మీ జీవిత సాఫల్యానికి నాటుకునే కార్యక్రమాలే. ఇంకోటి, భోజనానికి ముందు అన్నం ముద్ద బయటపెట్టి రండి. ఎంత శ్రద్ధతో చేస్తే అంత ఫలితాలు వస్తాయి. ఈ పనులన్నీ ఒక్కరోజు చేస్తే వచ్చే ఫలితాలు కావు. ఈ పనుల వల్ల ఎన్నో తప్పులు పోతాయి. ప్రాయశ్చిత్తం జరుగుతుంది.

6. యాక్సిడెంట్‌కు కారణం మనం రకరకాలుగా చెప్తుంటాం. ప్రారబ్ధకర్మల వల్ల కాదు. **ఇతరులను తప్పుపట్టటం వలన, విమర్శించటం వల్ల యాక్సిడెంట్స్ జరుగుతాయి. దయలేని ఆలోచనల వల్ల మాత్రమే ప్రమాదాలు సంభవిస్తాయి. విద్వేషాలు, కసి, ఇరిటేషన్ వల్ల యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి. ఇవి పోవాలంటే నిరంతర 'ఉదారగుణాన్ని' మరియు మంచి ఆలోచనలను ప్రోది చేసుకోవాలి. ప్రతీరోజూ క్రమం తప్పకుండా నైరుతిమూలలో చిటికెడు ఉప్పుపెడితే ధనం వస్తుంది చేసి చూడండి.**

7. లవ్ ఇన్ థింకింగ్–ప్రేమించే గుణాన్ని అలవరచుకోండి. ప్రేమించే ఓర్పును ప్రాక్టీసు చెయ్యండి. **దీనికి స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం అనే శుభకామనను మూడు పూటలా శ్రద్ధగా చెప్పుకోండి.**

8. ఈ కాలంలో ఉన్న గొప్పదనం ఇంక 200 సంవత్సరాల తర్వాత ఉండదు. ఇప్పుడు శరీరం వదిలితే మళ్ళీ 700 సంవత్సరాల దాకా మళ్ళీ పుట్టము.

9. ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు భగవద్గీతలోని 17వ అధ్యాయం చదవాలి. నీ శ్రద్ధ దేని మీద ఉందో నీవు అదే అవుతావు.

10. **మా జీవితాలు మారాలి. మంచిగా ఉండాలి అనుకునే వారు హింసాత్మకమైన, వ్యంగ్య పూరితమైన, ద్వేషంతో కూడిన మాటలు మాట్లాడవద్దు. హిమాలయాలలోని ఋషికూటమి వీటిని నేర్పించమని ఆదేశిస్తున్నది. ఇది సంధికాలం కాబట్టి వారు తమ చేయినందిస్తున్నారు. ఈ కాలం వెళ్లిపోయాక ఇంక మీకీ అవకాశం ఉండదు. నాతో ఉన్న వాళ్ళు ఖచ్చితంగా అదృష్టవంతులే. నేను నేర్పే ఈ విద్యను ప్రపంచంలో ఎవ్వరూ నేర్పించటం లేదు.**

11. మనం యుగసంధికాలంలో ఉన్నాం. విశేషమైన శక్తిధారలు మన మీద పడుతున్నాయి. ఈ పరిస్థితి ఇంతకు ముందు రెండు సార్లు వచ్చింది.

12. మీ హృదయంలోని విశ్వాసరాహిత్యం పోయి మంచి విశ్వాసం రావాలి. గురువుల యొక్క అధ్యాత్మిక ప్రక్రియకు మీరు చేయూతనిస్తే మీ జీవితాలు ధన్యమౌతాయి.

13. దైవీ ప్రణాళికకు అనుగుణంగా జీవిస్తే మీకు కావలసిన వనరులు వాటంతటవే మీ వైపుకు ప్రవహిస్తాయి. ఆధ్యాత్మిక జగత్తులో మీ పోషణభారాన్ని గురువుల మీద పడెయ్యకండి.

14. తీర్థస్థానాలకు ఎందుకు వెళ్తారు అంటే మీ అంతట మీరు మారలేనిది, ఆ తీర్థాలలో స్నానం చేస్తే ఆ పాప ప్రక్షాళణ జరుగుతుంది.

15. 1934వ సంవత్సరంలో పూర్ణిమా ధ్యానాలను మాస్టర్ డి.కె. గారు ప్రారంభించారు. సాధకులను 12 గ్రూపులుగా తయారుచేసి వారితో పూర్ణిమ ధ్యానాలను చేయించి రెండవ ప్రపంచ యుద్ధం ఆపాలని ప్రయత్నం చేశారు. మళ్ళీ మనం ఇప్పుడు వాటిని ఆచరిస్తే ఈనాడు సర్వత్రా వ్యాపించి ఉన్న ఈ విపరీత పరిస్థితులు ఖచ్చితంగా తొలగిపోయి ఉజ్వల భవిష్యత్తు వస్తుంది.

## అధ్యాయం-4

# పరమ గురువులు – దీక్షా విజ్ఞానం

### దీక్షా కార్యక్రమము

డార్జిలింగ్ నుంచి వచ్చిన తర్వాత మాస్టర్‌గారు అనుష్టాన పరంపరలను సాగించారు. ప్రతి నెలా 10, 20, 30 తేదీలలో పూర్ణాహుతి చేసుకుంటారు. ఆ టైమ్‌కి సాధన చేసినా, చేయకపోయినా అందరూ రావచ్చని చెప్పారు. ఇంకా ఏం చెప్పారూ – కొన్ని నియమాలనిచ్చి పరమగురువుల ఆదేశాల మేరకు ఎవరికి ఏ మంత్ర దీక్ష నివ్వాలో వారికి ఆ దీక్షను ఈసారి పూర్ణాహుతిలో ఇస్తానని ముందు ప్రవచనాల్లో చెప్పారు కదా!

ఆ దీక్షను శ్రీకృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా ఆగష్టు 20వ తేదీన గాయత్రీ అనుగ్రహపీఠం, ఒంగోలులో ఇవ్వాలని మాస్టర్‌గారు సమాయత్తమైనారు. అన్ని ఊళ్ళ నుండి సాధకులు వచ్చారు. అందరూ మూడురోజులపాటు కేవలం ద్రవాహారం మాత్రమే స్వీకరించి ఎంతో శ్రద్ధా భక్తులతో దీక్ష తీసుకోవటానికి ఒంగోలుకు వచ్చారు.

అనుగ్రహపీఠంలో దీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు మాస్టర్‌గారు చెప్పినట్లే చేశాము. అంతా సిద్ధమైంది. ఈ నెలలో చేయబోతున్న రెండవ పూర్ణాహుతి ఇది. అందరూ మౌనంగా వారేం చెప్తారోనని ఉద్వేగంతో ఎదురుచూస్తున్నారు. ఆ రోజున మాస్టర్‌గారు కూడా అత్యంత ఉగ్రమానసిక స్థితిలో ఉన్నారు. ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా ఏం జరుగుతుందో, వారేమంటారోనని అందరూ చాలా జాగురూకతతో ఉన్నారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు వేదిక మీదకు వచ్చి గాయత్రీమాత, గురుదేవులకు ప్రణామాలు చేసి అందరివైపు ఒక్కసారి తేరిపార చూశారు. కార్యక్రమం ప్రారంభించటానికి ముందుగా 'ఓం' కారం మూడుసార్లు చేసి గాయత్రీమంత్రం చెప్పి, దీక్షకు అందరూ సిద్ధంగా ఉన్నారా? అంటూ మొదలుపెట్టారు.

ఆపరేషన్ థియేటర్‌లాంటి పరిశుభ్రత ఈ ఆవరణలో మాత్రమే కాదు, చుట్టూ ఉన్న వాతావరణంలో కూడా ఉండాలి. పరిసరాలన్నీ నిర్మలంగా, శాంతంగా ఉండాలి. అప్పుడే దీక్షలు

ఇవ్వబడతాయి. ఇవాళ నేను దీక్ష తీసుకుంటున్నాననే తీవ్ర ప్రకంపనలు మీ హృదయంలో నుంచి రావాలి. త్రిపదాగాయత్రీ లాంటి మూడు పుస్తకాలను గురించి చెప్తాను. మొదటిది సోల్ అండ్ ఇట్స్ మెకానిజం. అనేక జన్మలెత్తుతున్న మనం ఈసారి మానవజన్మ ఎత్తాం, మనం మనుషులం కాబట్టి కోరికలు ఉంటాయి. వాటిని తీర్చుకోవచ్చు. వైరాగ్యంలాంటివేమీ వద్దు. దేనికోసం వెంపర్లాడవద్దు. నీవు ఆత్మవు. అనేక జన్మల ప్రారబ్దాల కారణం వల్ల ఇలాంటి, దేశ, కాల పరిస్థితులలో పుట్టాం. పరమగురువులు ఎలా జీవించారో అలా జీవించాలని చెప్తుంది ఈ పుస్తకం. పూర్వజన్మలలో ఏం చేశారనేది కూడా మీకు రాబోయే మూడు సంవత్సరాలలో తెలుస్తుంది. ఇంకా లోతుగా అధ్యయనం చేసేవాళ్ళకు థియోసఫీ మీద కూడా అద్భుతమైన అథారిటీ వచ్చేస్తుంది. ఇది అర్థమైపోతే గొప్ప గొప్ప ఆత్మలను మీ కుటుంబాలలోకి దింపుకోవచ్చు. దానికి కావలసిన పరిస్థితులనేర్పరచే ప్రాథమిక విద్యను నేర్పాలనే ప్రయత్నం చేస్తున్నాను.

1. శ్రీకృష్ణుడు అత్యంత శ్రద్ధావంతులైన పృశ్ని, సుతపాలకు పృశ్నిగర్భుడిగా జన్మించాడు. వాతావరణం బాగోలేదని వేరేచోటికి వెళ్లాడు. రాబోయే రోజులలో మీరు కూడా ఒక సైంటిఫిక్ యాంగిల్‌లో సాయిపరివార్, గాయత్రీపరివార్‌లాంటి సెల్స్‌లో జన్మ తీసుకుంటారు. దానికి గాయత్రీ దీక్ష తీసుకోవాలి.

2. దీక్ష తీసుకోవటానికి ముందు మీలోని కుసంస్కారాలు కడిగివేయబడాలి. అంటే అర్థం ఏమిటంటే 'నాలో ఉండే కుసంస్కారాలు పోయి మంచి సంస్కారాలను తీసుకుంటాను' అనే భావన పటిష్ఠమవ్వాలి.

3. ఏ పరివార్‌లో, ఏ గురుపరంపరలోకి చేరతావనేది నీ ఇష్టం. అదే Externalisation of Hierarchy. ఏదైనా ఒక కోర్సులో నీకు సీటు కావాలంటే దానికి గురువులేం చెయ్యరు. మీ కోరికను బట్టి ఆ కోర్సును మీరు ఎన్నుకోవటం జరుగుతుంది. కానీ ఇప్పుడు మీకున్న పెద్ద సమస్య ఏమిటంటే ముందుగా మీరు ఏ దిశలో జీవిస్తున్నారనే దాని గురించి సరైన అవగాహన మీకు అసలు లేదు. అందుకే గురువులు మీ జోలికి రావటం లేదు.

ఇవాళ చేయబోతున్న ఈ దీక్షా కార్యక్రమం ఎంత గొప్పదో మీకు తెలియదు. మీ అబ్బాయి ఇంజనీరింగ్ పూర్తి కావాలంటే మీరెన్ని త్యాగాలు చేస్తారు. వాళ్ళకు మీరెన్ని పనులు చేసి పెడతారు.

మరి ఇక్కడ మీరు శ్రీరామశర్మఆచార్యగారి 108 నామాలు చదవండి. ఎంతమంది గురువుల కార్యక్రమాలకు ఆయన పునఃప్రతిష్ఠాపన చేశారో తెలుస్తుంది. అన్ని కార్యక్రమాలను నర్సరీలోని మొక్కలను పెంచినట్లు పెంచారాయన. దానిని గురించి ఎంత చెప్పినా, ఎందుకు చెయ్యలేక పోతున్నారో నాకిప్పటికీ అర్థం కావటం లేదు. సరే, ఈ రోజున మనం మళ్ళీ అదే విషయాన్ని నేర్చుకోబోతున్నాం. ఈ క్షణం నుండి నేను చెప్పే ప్రతీ అక్షరాన్ని హృదయంతో వినండి.' అని చెప్తూ దీక్ష ఇవ్వడానికి ముందు

1. గురుపూజ చేయించారు.

2. దీక్షలో ఇచ్చిన విశేషనామం పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల నామమే. ప్రతిరోజు ఈ నామం 12 మాలలు చెయ్యాలి. “శ్రీరామశర్మ ఆచార్య” (అష్టాక్షరీమంత్రం).

3. రెండవ మంత్రం “ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం”. ఈ నామాన్ని అందరికి కానుకగా ఇచ్చారు. ఆ తర్వాత విశేష దీక్షగా ఎవరికే మంత్రము అవసరమో దానికి బీజమంత్రాలను కలిపి వ్యక్తిగతంగా ఇచ్చారు.

4. గురుపరంపరలో అందరికీ ఇష్టమైన ఒక విశేషనామం ఉంది “బాబాజీ” అని. ఆ నామం చేస్తే చాలు ఆయన రియాక్ట్ (స్పందిస్తారు) అవుతారు. శ్వాసవిజ్ఞానంలో నిష్ణాతులం కావాలి అనుకునేవారు సాధనగా మూడు సార్లు “బాబాజీ – బాబాజీ –బాబాజీ” అంటే చాలు. మీ జీవితాలు ధన్యమైపోతాయి. అలా గురుపరంపరకు సంబంధించిన ఆ విశేష దీక్షలను ఎవరికి ఏది కావాలో దానిని ఇచ్చారు. గాయత్రీ దీక్ష తీసుకున్న వారికి మాత్రం సార్వజనీనంగా గాయత్రీ మంత్రం 8 మాలలు చెయ్యాలని, నెల సాధన చేసిన తర్వాత నేను చేసుకునే పూర్ణాహుతికి మీరంతా ఇక్కడికైనా రావచ్చు, లేదా మీమీ గ్రామాల్లో ఎక్కడి వారక్కడనే పూర్ణాహుతిని చేసుకోవచ్చుననే వెసులుబాటును కూడా కల్పించారు.

5. ప్రతిరోజూ రెండు గంటలపాటు సాధన చెయ్యండి. ధ్యానం చెయ్యండి. ఈ యుగసంధి కాలంలో మీరే కాస్త చిన్న పనిని చేసుకోగలిగినా అపూర్వమైన ఫలితాలను పొందుతారు. అద్భుతమైన అవకాశం ఇది. దీనిని ఉపయోగించుకోలేకపోతే కోల్పోయిన అవకాశం కోసం ఏడ్చే రోజులు వస్తున్నాయని చెప్తారు జ్వాలాకూల్ మహర్షి.

6. **మీరు ఏ గురువు దగ్గరికి వెళ్ళినా సరే వారికి వినయంగా నమస్కరించినట్లయితే ఆయన నుంచి శక్తి మీ వైపుకు ప్రవహిస్తుంది. 'శ్రవణం' అంటే గురువులు చెప్పేది శ్రద్ధగా వినండి. 'మననం' గురువు చెప్పింది నమ్మితే సరే లేదా మననం చెయ్యండి.** ఇదెందుకు చెప్తున్నానో బాగా మననం చేసి, అర్ధం చేసుకోండి. గురువులు చెప్పిన విషయాలను విని ఆ విషయాలను చెప్పగలిగే స్థితికి మీరు ఎదగాలి. ఆధ్యాత్మికంగా ఏ వ్యక్తి, ఏ మంచి మాట చెప్పినా కూడా మీరు ఆధ్యాత్మికంగా ఎదగటానికి అది ఎంతో ఉపయోగపడుతుంది.

7. రాబోయే రోజులలో జ్యోతిష్యం చాలా ప్రముఖపాత్ర వహిస్తుంది (జ్యోతిష్యంపై సప్తర్షి ఆశ్రమంలో తరగతులు నిర్వహించారు).

8. **అసలు ఆధ్యాత్మిక విద్యను పూర్ణిమ రోజునే నేర్చుకోవాలి. ఆ రోజునే గురుపరంపర మీతో మాట్లాడుతుంది. ఆ రోజునే మీకు మీ గురువులతో లింక్ వస్తుంది.** గురుపరంపర మానవ జాతికి విద్య నేర్పటానికి ఈ ప్రక్రియను ప్రారంభించారు.

9. కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు యుద్ధం చేయనంటూనే, సాక్షీభూతంగా ఉంటూనే చేయవలసిన దంతా చేశాడు. **భౌతిక జగత్తులో దేనికీ దుఃఖించకుండా పరమశాంత స్థితిలో ఉండటాన్నే "ద్రష్టాస్థితి" అంటారు. ఆ శాంత స్థితిని అభ్యాసం చేయటం చాలా మంచిది.**

నూతన యుగధర్మంలో ఉండాలనుకునే వారికిది ప్రాధమిక విద్య లాంటిది ఈ The soul and its mechanism. దీనిని మీరు బాగా చదవండి. Externalisation of Heirarchyలో జ్వాలాకూల్ మహర్షి ఈనాటి యుగపరివర్తన మీనయుగం నుంచి కుంభయుగంలోకి ప్రవేశిస్తున్నదనీ, దీని ప్రభావం చాలా విచిత్రంగా ఉంటుందనీ వ్రాస్తారు.

ప్రస్తుతం జరుగుతున్నది కుంభయుగం. కుంభరాశి అనేది వాయువునకు సంబంధించిన రాశి. వాయువు అనేది ఎప్పుడూ కూడా ఆకాశం నుండే ఆవిర్భవిస్తుంది. 'ఆకాశాత్‌వాయుః' అనేది ఉపనిషద్వాక్యం. అన్ని రాశుల కాలములో కంటే **కుంభరాశి కాలములో 'ఉచ్చారణ' అనేది ప్రధానము. అందుచేత మీరేమంత్రము చేసినా అది చాలా శక్తివంతముగా ఉంటుంది. ఇదొక నిగూఢమైన పరమరహస్యము. ఇప్పుడున్న ఈ కుంభరాశియుగము కాలచక్రపరిభ్రమణంలో అనేకసార్లు వచ్చింది. కుంభరాశిలో 'ఉత్తర విషువః' కాలము**(Vernal eqninox) ప్రవేశించినప్పుడల్లా

మానవులకు కుంభయుగం ప్రారంభమౌతుంది. ఇది జరిగినప్పుడల్లా ప్రజ్ఞ ప్రచోదితమై, సువికసితమై బాగా విస్తారమౌతుంది.

ఇదివరలో ఒకానొక కుంభయుగంలోనే విశ్వామిత్రమహర్షి గాయత్రీమంత్రాన్ని దర్శించి దయతో లోకానికి ప్రసాదించారనే సంభావన ఒకటి కలదు. ప్రస్తుత కాలంలో గాయత్రీమంత్రము ఎంత బాగా అనుష్టానం చేస్తామో తర్వాత అంత శ్రేష్టంగా ఉంటామనే విషయాన్ని పూజ్యశ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యగారు చెప్పుండేవారు. ప్రజ్ఞను ప్రచోదితం చేయగల గాయత్రీమంత్ర విశిష్ఠతను గురించి పూజ్య గురుదేవులందించిన విశేష విషయ పరిజ్ఞానం తెలుసుకోవాలంటే గాయత్రీ మహావిజ్ఞాన్ మూడుభాగాలు చదవాల్సిందే! మీరు ఎక్కడుంటే అక్కడే రోజుకు రెండుగంటలపాటు గురువుల పనిని చేస్తూ గాయత్రీ మంత్రాన్ని, గురునామాన్ని 45 నిమిషాలపాటు ఆపకుండా చేస్తే మీ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు ఈ యుగపరివర్తనకు అనుకూలమైన రీతిలో స్పందిస్తాయి. అద్భుతమైన ఈ యుగసంధి కాలంలో గురుప్రణాళికలో మీరు కూడా భాగస్వాములై జీవిత లక్ష్యాన్ని సార్థకం చేసుకోండి అని ఆ రోజు సుదీర్ఘమైన ప్రవచనాన్ని ప్రసాదించారు.

## ఆత్మవిస్మృతి నుండి మేలుకొలుపు

తరువాత 2003 ఆగష్టు నెలలో సహ్యాద్రి దత్తాశ్రమం, ఓడరేవులో ప్రత్యేకించి కార్యకర్తలకు మాత్రమే ఒక విశేష సాధనాశిబిరాన్ని నిర్వహించారు. ఆత్మవిస్మృతికిలోనై జీవిస్తున్న కార్యకర్తలను జాగృత పరచడానికి, వారిలో నూతనస్ఫూర్తిని నింపడానికి, వారిచేత ప్రణాళికా బద్ధమైన గురుసత్తా కార్యక్రమాలను చేయించడానికి అవసరమైన ఆత్మజాగరణ కొరకు ఈ సాధనాశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రేమమూర్తి, ఆత్మలో ఆత్మగా వెలుగొందే ఆ పరమపురుషునికి, ఆత్మబంధువులైన పరిజనులపై అపారకరుణ వున్న కారణంగా, వారి జీవితాలకు సార్థకత చేకూర్చాలనే తలంపుతో నయానో, భయానో వారిని అవతారమూర్తి కార్యకలాపాలలో భాగస్వాములను చేయడానికి, ప్రేరణ నివ్వడానికి ప్రయత్నించేవారు. 18వతారీకు ఉదయం నుండి మాస్టర్‌గారు తమ మధురమైన వాక్కు ద్వారా అపూర్వమైన జ్ఞానామృతాన్ని కురిపించడం మొదలుపెట్టారు.

“త్రేతాయుగంలో రామునితో పాటు జీవించాలనుకున్న కొన్ని ఋషి ఆత్మలు, కారణాంతరాల వల్ల అది సాధ్యపడక ద్వాపరయుగంలో గోపికలుగా శ్రీకృష్ణునితో పాటు పుట్టారు. శ్రీకృష్ణుని యొక్క ప్రేమతత్వాన్ని అవగాహన చేసుకున్న గోపికలు ఆ స్థాయిలోనే జీవించారు. అందుచేత

వారికి భౌతికజీవితంతో సంబంధం లేదు. వారు ఈనాటికీ ఆధ్యాత్మిక ప్రేమసరోవరంలోనే జీవిస్తున్నారు. బృందావనంలో, మధురలో (ఆ లైఫ్‌టైమ్ ఆత్మలు) అలనాటి ఆ దివ్యాత్మలు ఈనాటికీ పుడుతూనే వున్నారు. ఇప్పుడు పుడుతున్న ఆత్మలు ( ఈ కాలంలో పుట్టిన కొన్ని ఆత్మలు) ఒక విశేషలక్ష్యంతో పుట్టినవారే. వారంతా ఆత్మవిస్మృతి చెందినవారే. భౌతికంగా ఎంత ఆనందకరమైన స్థితిలో ఉన్నవారైనా, ఎంత బాధాకరమైన స్థితిలో ఉన్నవారైనా ఆ ఆత్మలు తాము ఎందుకు పుట్టారో మర్చిపోయారు.

నిర్మాణాత్మక కార్యకలాపాలలో ఏ పనికైనా, ఎవ్వరైనా ఉపయోగపడవచ్చు. ఇప్పుడు జరుగుతున్న ఈ నిర్మాణాత్మకమైన పరిస్థితులలో అందరూ అన్ని పనులకు ఉపయోగపడవచ్చు. శ్రీకృష్ణనిర్యాణము దగ్గర నుండి 2003 వరకు రకరకాలైన ధ్వంసాత్మక, నిర్మాణాత్మక చర్యలు జరుగుతూనే ఉన్నాయి. కానీ 2000 ఎ.డి, నుండి జరుగుతున్న ప్రతి కార్యక్రమము నిర్మాణాత్మకమైన దేనని అర్థం చేసుకుంటే మీరెలా ఉపయోగపడడం లేదో మీకే అర్థమౌతుంది. ఈ క్లాసులో నేను చెప్తున్నది మళ్ళీ మళ్ళీ వినండి.

## మొదటి పాయింట్

సృజనాత్మక కార్యకలాపాలు జరుగుతున్నాయి. కనుక అందరూ ఉపయోగపడేవాళ్ళే. రామాయణ కాలంలో హనుమంతుడూ ఉపయోగపడ్డాడు, ఉడతా ఉపయోగపడింది. ఎవరి స్థాయిలో వారు పనిచేశారు. నిర్మాణాత్మక కార్యక్రమాలలో ఎవరు ఏ పని చేసినా గురువులకు ఉపయోగపడతారు. కాదండీ మేము పెళ్ళి చేసుకుని 20మంది పిల్లల్ని కంటామంటారా అదంతా మీ ఇష్టం మరి!

ఈనాడు పుట్టిన ప్రతి మానవుడు గురువుల ప్రణాళికలో భాగంగానే పుట్టాడు. అందరూ పుట్టింది గురువుల పని కోసమే. అయినా ఎవ్వరూ గురువుల ప్రణాళికకు పనికిరాకుండా పోవడం వల్ల, ఎవరెన్ని కోట్లు సంపాదించి, ఉచ్ఛస్థితిలో ఉన్నప్పటికీ ఆ 'ఆత్మ ప్రతాడన' వల్ల మీకు శాంతి లభించడం లేదు. **ఏ గురువు పని కోసం వచ్చారో అది తప్ప ఇతర ఏ పని చేసినా అది మీ జీవితంలోని అశాంతికి కారణమౌతున్నది. మీ అమ్మాయికి పెళ్ళికాలేదు, అబ్బాయికి ఉద్యోగం రాలేదు, ఇంకా ఆర్థికబాధలు, ఇవన్నీ మీ అశాంతికి కారణాలు కావు. మీరు గురువులను, వారి పనులను మర్చిపోయారు. మీ అమ్మాయికి పెళ్ళి కాలేదనో, మీరనుకున్న పనులు కాలేదనో కాదు**

**మీ అశాంతి, మీకు శాంతి రాకపోవడానికి కారణం ఈ ఆత్మప్రతాడనే (అంటే ఆత్మ కొట్టే దెబ్బలు).** ఎంత పెద్ద రోగానికైనా సరైన మందు పడితే ఉపశాంతి లభిస్తుంది.

ఆత్మప్రతాడన నుండి బైటపడే వ్యక్తుల కోసం నేను వెతుకుతున్నాను. గురువుల పనులు చెయ్యనివారితో నేను మాట్లాడడం లేదు. వారిని దూరంగానే పెట్టాను. గురువుల పని చేస్తారని నాకు అనిపించిన వారి దగ్గరికి నేనే వస్తున్నాను. వారు తలుపులు వేసినా బద్దలు కొట్టి వారి హృదయాలలోకి వచ్చేస్తాను. శిష్యులు చెప్పినట్లు వింటే గురువు ఛస్తాడు. మీరు ఆత్మప్రతాడన నుండి బైటపడి, నా మనుష్యులుగా మిగులుతారని ఆశిస్తూ అలాంటివారి కోసం వెతుకుతున్నాను. శిష్యులను తన అదుపాజ్ఞలలో ఉంచుకున్న మొట్టమొదటి గురువుగా ప్రపంచంలో ప్రసిద్ధిచెందాలనేదే నా కోరిక. ఇది నా గురువులు నాకిచ్చిన సూచన. నాలో వస్తున్న ఈ మార్పులు నాకు దగ్గరగా ఉన్నవారికి అర్థమౌతాయి. ఇలాంటి మార్పులు 2006 వరకు జరుగుతూనే వుంటాయి. డార్జిలింగ్ నుండి వచ్చిన తరువాత 108 అనుష్ఠానాల పరంపరను మొన్న గురుపూర్ణిమ నుండి మొదలు పెట్టాను.

2003 జూన్ నుండి జూలై వరకు నేను జరిపిన ఏకాంత సాధనా కాలంలో హిమాలయాలలోని ఒక విశిష్టమైన ఋషి యొక్క తపఃస్థలిలో నాకు దీక్ష ఇవ్వబడింది. సాధనాకాలంలో నేను ఏమి చేశానో, ఎక్కడ నేను ఉన్నాను, ఏం నేర్చుకున్నానో అనేది మీకు అనవసరం. మీరు ఏమి చేయాలో అది మాత్రమే మీకు చెప్తున్నాను. నేను చెప్పినట్లు చేసుకున్న వారికి మీ ఇంటి పరిస్థితులు, ఆరోగ్య పరిస్థితులు వాటంతటవే చక్కబడతాయి. మిలటరీలో చేరిన వారి కుటుంబాల బాధ్యతనంతా ప్రభుత్వంవారు చూసుకున్నట్లుగా మీ బాధ్యతలనన్నింటిని గురువే చూసుకుంటాడు. ఈ ఆత్మవిస్మృతి నుండి మేలుకున్న వారందరూ మిలటరీ వారేనని నేను చెప్తున్నాను. అయితే పాత్రత లేని ఏ కోరికా గురువులు తీర్చలేరు. తండ్రి విద్యాశాఖామంత్రి, వాడి కొడుకు ఐదవతరగతి చదువుకున్నాడు. యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఉద్యోగం కావాలని కొడుకు అడిగితే ఏ తండ్రి అయినా, ఆయన మంత్రే అయినా, కొడుకుకు ఆ ఉద్యోగం ఇవ్వలేడు కదా! అలాంటి కోరికలు కోరితే ఏ గురువు కూడా ఇవ్వలేడు.

గురువు నీ కంటే ముందే ఆలోచించి నీవు ఏ పరిస్థితులలో ఉంటే బావుంటుందో ఆ ఆనందానికి కావలసిన పరిస్థితులను కల్పించగలడు. పుట్టబోయే బిడ్డకు తల్లిపాలను భగవంతుడు

ఎలా అమర్చిపెట్టాడో అదే విధంగా నీకు ఏది మంచిదో నీకన్నా ముందే ఆలోచించి నీ కొరకు ఆ పరిస్థితిని కల్పిస్తాడు. నీకు అర్హతలేని కోరికలను ఎంత గొప్ప గురువైనా తీర్చలేడు. మీ అనారోగ్య పరిస్థితులు, మీ మానసిక వ్యధలకు కారణం మీరు చేసుకున్న కర్మలే. అది మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. కానీ మీరు సాధన చేసుకోగలరు. ఎలా? గురువు దగ్గరకు వెళ్ళిన తరువాత ఆయన చెప్పినట్లు వింటే రెండు రకాల మార్పులు వస్తాయి. దాన్నే శ్రీకృష్ణుడు గీతలో

**యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।**
**యస్మిన్ స్థితోన దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥ (భ.గీ 6/2)**

ఈ శ్లోకంలో ఆ గ్యారంటీ ఇచ్చాడు.

## దేవతల కంటే ఉచ్చస్థితిలో ఉన్నవాడు గురువు

దేవతలకు కోపం వస్తే గురువు క్షమించగలడు కానీ, గురువుకు కోపం వస్తే రక్షించేవాడెవ్వడూ లేడు అని గురుగీతలో చెప్పబడి వుంది. ఎప్పుడు చూచినా నా పిల్లలు, నా ఉద్యోగం, నా పెళ్ళాం అని ఏడ్చేవాడు "శ్రీరామశర్మఆచార్య" అనే అద్భుతమైన గురువుకి శిష్యుడిగా ఉండతగడు.

గురుదేవుల ప్రణాళికను అమలు చేయడానికి మీకెప్పటికీ వీలుకలుగదు. ఒక సినిమాను చూడాలంటే వీలు కలిగించుకొని వెళతారు. టి.వీ. సీరియల్స్ చూడడానికి సమయం వుండదు, కానీ చూస్తారు. ఆ గంభీరతను అర్థం చేసుకోండి. ఈ గురుపూర్ణిమ నుండి 2004, 2005, 2006 గురుపూర్ణిమల వరకు సాధన చేసి పూర్ణాహుతి నిర్వహించాలనేది నా కోరిక. వీలైతే అది ఒక మహాయజ్ఞంగా చెయ్యాలనే కోరిక వున్నది. అది ఎలా? నేననుకున్నదాన్ని అనుకున్నది అనుకున్నట్లుగా, మీకు మీరుగా చేస్తే మీ జీవితం యజ్ఞమయంగా మారుతుంది.

నేను చేయబోయే 108 లఘు అనుష్టానాల పరంపరలో మీరూ పాలుపంచుకోవాలి. దానికి సంబంధించి ప్రతి నెలా 10, 20, 30 తారీకులలో జరిగే పూర్ణాహుతిలో సంస్కార మహోత్సవాలు జరుపుకోవాలి. దీక్ష తీసుకోదలచినవారు అధికసంఖ్యలో వచ్చి ఈ పూర్ణాహుతిలో దీక్ష తీసుకోవాలి, ప్రతి నెలా ఆ సంఖ్య అలా పెరిగిపోతూ వుండాలి. అలా వచ్చిన గొప్ప ఆత్మబలం గల వారి యొక్క శక్తితో మనం ఒక మహాయజ్ఞాన్ని నిర్వహించాలి. అంతేతప్ప చందాలడుక్కోవటం, ఆ ఇచ్చేవాడు ఆదాయపు పన్ను ఎగ్గొట్టి ఆ డబ్బును చందాగా ఇస్తే, 'దాన్ని సగం మన జేబులో

వేసుకొని, ఆ మిగిలిన సగంలో బయటకు చెప్పకురా బాబూ,' అని ప్రక్కవాడికి కాస్త ఇచ్చి, మిగిలిన దాంతో యజ్ఞాలు చేసి,' ఓహోహో! మేం ఇన్ని వేలకుండీలతో యజ్ఞం చేశాం' అని అనిపించుకోవచ్చు. కానీ నా ద్వారా మాత్రం మీరు అనిపించుకోలేరు. గురుదేవుల యొక్క సృజనాత్మక కార్యకలాపాలలో పాలు పంచుకోకుండా, నేను చెప్పింది చెప్పినట్లు ఆచరించని వారితో ఈ మహాయజ్ఞం జరిగేటట్లు నేను చూడను. అది కూడా గుర్తుంచుకోండి. మీలో ఆ ఆవేదన వచ్చి గురుప్రణాళికా కార్యక్రమాల కొరకు మీకై మీరు పాటుపడాలి. ఈనాడు ఈ దేశకాల పరిస్థితులలో పుట్టి ముఖ్యంగా శ్రీరామశర్మఆచార్య గురుదేవుల పేరు విని, వారి కార్యకలాపాలనవగాహన చేసుకొని, మీరు సవ్యంగా జీవించాలని నేను కోరుకుంటున్నాను. గురుదేవుల పేరును విన్నవారు చాలా మందే ఉండి వుండవచ్చు. కానీ వారికా తపన లేదు. ఆ తీవ్రతా లేదు. అలాంటి వారు నాకు అక్కరలేదు.

## యుగసంధి- పరివర్తన

ఈ కాలంలో ఒక పరివర్తన జరుగుతున్నది. దాని కొరకు ప్రతి నెలా మూడు అనుష్టానాలు, మూడు పూర్ణాహుతులు 10, 20, 30 తేదీలలో జరగాలి. గురుదేవులు మీలో ప్రతి ఒక్కరికీ 24 లక్షల గాయత్రీజపం అంతరిక్షంలో నిక్షిప్తం చేసి ఉంచానని వ్రాసి పెట్టారు. గురుదేవులు మీకూ, మీ పిల్లలకు, వాళ్ళపిల్లలకు సరిపోయినంత గాయత్రీ మంత్రశక్తి అనే ఆస్థిని అంతరిక్షంలో పెట్టి వెళ్ళారు. గాయత్రీ మంత్రశక్తి కోసం తీవ్ర తపస్సాధనలేవీ చేయనక్కరలేదు. అయితే వీలునామా రాశారు కదా అని ఆయన ఆస్తిని, నీ ఇష్టానికి ఖర్చు పెట్టుకోనివ్వరు. ఆయన ఖర్చుపెట్టమన్నట్లు ఖర్చుపెట్టాలే తప్ప, మీ స్వార్థానికి దానిని ఉపయోగించుకోకూడదు. రజనీకాంత్ నటించిన అరుణాచలం సినిమా చూస్తే అదేంటో మీకర్థమౌతుంది. మీరు గురుదేవుల గాయత్రీమంత్ర శక్తిని, మీ స్వార్థానికి ఉపయోగించుకోకపోతేనే ఆయన అనంత సంపద మీకు లభిస్తుంది. ఆ అనంత సంపదను మంచి పనులకోసం మాత్రమే ఉపయోగించుకోవాలి. గురుదేవులు అందరికీ కావలసిన తపశ్శక్తిని, దానశక్తిని అంతరిక్షంలో వుంచారు. దీనిని ఉపయోగించుకోవాలంటే ముందు మీరు ఈ ఆధ్యాత్మిక విద్యను నేర్చుకోవలసి వుంటుంది. ఉదాహరణకు కంప్యూటర్‌ని కొని ఇంట్లో పెడితే లాభం లేదు. దానిని మీరు ఉపయోగించుకోవటం నేర్చుకోవాలి. దానిని మీరెంత బాగా నేర్చుకుంటే మీకది అంత గొప్పగా ఉపయోగపడుతుంది.

ఆధ్యాత్మిక విద్యను నేర్చుకొని దానిని ఉపయోగించుకోవడానికి గురుదేవులు ఆరునెలల కాల పరిమితి గలిగిన సర్టిఫికేట్ కోర్సులనిచ్చారు. ఆ కోర్సును మనం ఒకటవ తేదీ నుండి తొమ్మిదవ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు జరిగే లఘు అనుష్టానాల పూర్ణాహుతితో పాటు ఆ పదిరోజులలో నేను చెప్పే సిలబస్‌ను నేర్చుకోవాల్సివుంటుంది. ఇది యుగసంధి కాలం. కాబట్టి మీ ఆలోచనా విధానాలు, పనులు మారాలి. తాతలు చేసిన పనులే చెయ్యాలంటే ఎలా? దాన్నే సోషియాలజిష్టులు జనరేషన్ గ్యాప్ అన్నారు. ఈ యుగసంధి కాలం దాటగానే కొన్ని కోట్ల సంవత్సరాల వరకు ఇంక మీకు జనరేషన్‌గ్యాప్ అనేది వుండదు.

## మీనరాశి నుండి కుంభరాశికి మారుతున్నాం

ఈ యుగసంధికాలంలో అనేక సృజనాత్మక, నిర్మాణాత్మక కార్యకలాపాలు జరుగుతాయి. మనం మీనరాశి నుండి కుంభరాశికి మారుతున్నామనే విషయాన్ని పండిత శ్రీరామశర్మఆచార్య గురుదేవులు మాత్రమే అతి స్పష్టంగా చెప్పారు. మిగతా గురువులెవరూ ఈ విషయాన్ని గురించి భారతదేశంలో చెప్పలేదు. ఇక్కడ మళ్ళీ సౌరమండలాలు, గ్రహాలు మొదలైన వాటిని గురించి చెప్తూ కొన్ని పవిత్రగ్రహాలు, కొన్ని అపవిత్రగ్రహాలు వున్నాయని చెప్పారు. అలా చెప్పినప్పుడు పృథ్వి అపవిత్రగ్రహమని చెప్పటం జరిగింది. అయితే రెండువేల సంవత్సరంలో దానికి పవిత్రత ఆపాదించబడింది. రెండువేల సంవత్సరంలో పవిత్రత ఆపాదించబడిందే కానీ, స్వతహాగా దానికి పవిత్రత లేదు. ఈ విధంగా మనం కొంచెం అదృష్టవంతులం.

### మరొక ముఖ్యమైన విషయం : జీవించటం ఎలా?

ఇదొక ప్రత్యేకమైన ప్రణాళిక. పూర్తిగా ఇది మీ మానసిక స్థితికి సంబంధించిన విషయం. మీ జీవిత విధానం ద్వారా ఇతరులను ప్రభావితం చేయటం. దాని కొరకు ఆధ్యాత్మిక ప్రాణశక్తిని పెంపొందించుకోవడం చాలా అవసరం. ఈ విద్యనే గాయత్రీవిద్య, యజ్ఞవిద్యగా చెప్తారు. అయితే మీరు చెప్పే యజ్ఞమంత్రాలు మాత్రమే యజ్ఞవిద్యకాదు. మీరు చేసే గాయత్రీ మంత్రం మాత్రమే గాయత్రీ కాదు. గీతలో శ్రీకృష్ణుడు,'యజ్ఞానాం జప యజ్ఞోస్మి' అన్నాడు. అంటే యజ్ఞాలలో జపయజ్ఞాన్ని 'నేనే' అనీ మళ్ళీ 'గాయత్రీ ఛందసామహం' గాయత్రీ ఛందస్సును నేనే అని అంటే, దానినే గురుదేవులు 'గాయత్రీ జపయజ్ఞాన్ని' మించినది లేదు అని దానిని అందరికీ అందించారు.

**మంత్రజపంలో వుండవలసిన మానసికస్థితి ఏమిటీ అంటే 'గాయత్రి అంటే అది ప్రాణవిద్య'.** గయాన్ ప్రాణాన్ త్రాయతి ఇతి గాయత్రీ. అదీ గాయత్రీ అంటే. గాయత్రీ చేసే వాడు చావడు. మీరు నిరంతరం జపం చేయటం అలవాటు చేసుకోండి. సామూహిక జపం చాలా మంచిది. జపం చేసేటప్పుడు ఉచ్చారణ చాలా స్పష్టంగా ఉండాలి. కళ్ళు మూసుకొని అందులో లీనమైపోయి ఒకే స్వరంతో చెప్పాలి. ఈ యుగసంధికాలంలో అదే మిమ్మల్ని ముందుకు తీసుకుపోతుంది. ఆ ఒక్క పని చేస్తే చాలు మీ జీవితాలు ధన్యమైపోతాయి. సరే, ఇప్పటి వరకు చెప్పిన విషయాలను మననం చేసుకుందాం.

1. మనం చాలా విశేషమైన కాలంలో పుట్టాం. అందరం అదృష్టవంతులం.

2. ఈ యుగసంధి కాలంలో మీరు చేయవలసిన మూడు పనులు - సమయదానం, అంశ దానం, ప్రతిభాదానం. దానము అని ఈ పనులకు పేరు చెప్తున్నాంగానీ, నిజానికి భవిష్యత్తులో మీరు వాటిని నాటుకుంటున్నారు.

3. గురువుల పనులు చెయ్యటానికి ఎవ్వరూ ముందుకు రావటం లేదు కనుక, గురువులకెవరు దొరికితే వారి ద్వారా పనులు చేయించుకోవలసిందే. ఈ జన్మలో మీరీ పనులు చేసి ఎంత ఎత్తుకు ఎదుగుతారో మీకు తెలియదు. ఈ విషయాలను నేను తప్ప మీకు ఇంకెవరూ చెప్పరు. విన్న దానిని అక్షరాలా ఆచరిస్తేనే ఫలితాలు వస్తాయి. క్షణం వృధాగా పోకుండా చెప్పినవి చెప్పినట్లు చెయ్యండని ఆనాటి ప్రవచనాన్ని ఎంతో శాంతంగానే కానీ ప్రచండంగా చెప్పారు.

# III గురుపరంపర – దత్త పరంపర

## అధ్యాయం-5
## పౌర్ణమి – గురువులతో అనుబంధం

### గణపతి నవరాత్రులు

#### ఎఱ్ఱబాలెంలో జరిగిన సాధనా శిబిరం 2003 సెప్టెంబరు 7

ప్రకాశం జిల్లాకు సమీపాన గల ఎఱ్ఱబాలెం గ్రామంలో ఒక చిన్న 'టీలే' (చిన్న కొండ) మీద మాస్టర్‌గారు అపూర్వ గణపతిని స్థాపించారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారి సూచనల ప్రకారం స్థానిక కార్యకర్తలు ఆ గణేశునికి నిత్యపూజలు, అర్చనాది కార్యక్రమాలు ఒక పద్ధతిలో కొనసాగిస్తూ వున్నారు. 2003వ సంవత్సరంలో గణపతి నవరాత్రులను అక్కడ చెయ్యాలని శ్రీకాశీనాథ్‌బాబుగారు వచ్చి మాస్టర్‌గారిని కోరారు. శ్రీ మాస్టర్‌గారు ఒప్పుకున్నారు. చుట్టుప్రక్కల అన్ని గ్రామాల నుండి పరివార్ సభ్యులు గణపతిస్వామి పూజలకు వచ్చారు.

ఈ నవరాత్రులలో పూజ్య మాస్టర్‌గారు అనేక క్రొత్త, క్రొత్త ఆధ్యాత్మిక, సాధనాత్మక రహస్యాలను అపూర్వగణపతి సమక్షంలో అపూర్వంగా వెల్లడించటం జరిగింది.

ఈ కార్యక్రమానికి రావడానికి ముందు శ్రీ మాస్టర్‌గారు గొలగమూడికి వెళ్ళి "శ్రీ వెంకయ్య స్వామి" వారిని దర్శించుకుని వచ్చారు. మూడురోజులు అక్కడ వుండాలని వెళ్ళినవారు రెండవరోజుకే తిరిగి వచ్చేశారు. ఎందుకో మరి తెలియదు. కానీ తర్వాత శ్రీ మాస్టర్‌గారు చెప్పిన ప్రవచనంలో 'మాస్టర్‌గారి సాధనలో చేయవలసిన మార్పుల గురించి, ఇంకా వారు శిష్యులకు నేర్పబోయే సాధనలలో చేయవలసిన మార్పులను నేర్పించడం కొరకే అక్కడ మూడు రోజులపాటు వుండటానికి పిలిపించుకున్నారుట స్వామి. అయితే ఆయన చెప్పే ఆ సందేశంలోని తీవ్రతను తట్టుకోలేక ఒకటిన్నర రోజులలోనే పరిగెత్తుకుని వచ్చేశాను' అని ఆనాటి సందేశంలో చెప్పారు.

మనం ఈనాడు కలుసుకోవడానికి వెనకాల వున్న చరిత్ర తెలుసుకోవాలంటే సుమారు 90 వేల సంవత్సరాల వెనక్కి వెళ్ళాల్సి వస్తుంది. మానవజాతి యొక్క భూతకాలం గురించి చెప్తున్నాను. మనం వర్తమానంలో ఎలా ప్రవర్తిస్తే మానవజాతి యొక్క భవిష్యత్తు నందనవనంగా మారుతుందనే విషయం గురించి చెప్తున్నానంటూ ప్రారంభించారు.

95 వేల సంవత్సరముల క్రిందట మనమందరమూ కలిసి ఒక తప్పుచేసాము. ఆ తప్పు ఏమిటీ అంటే ఆ కాలంలో 95 వేల సంవత్సరముల క్రిందట గురువులు, మహాత్ములు, ఋషులు, మనుషులు అందరూ కలిసే జీవిస్తూ వుండేవారు. వారితో పాటుగానే రాక్షసులూ వుండేవారు. ఆ కాలంలో దేవతలు, ఋషులు మానవులతో కలిసి జీవించేవారు. ఋషులకు, దేవతలకూ విశేషమైన శక్తి ఉండేది. అది ఈనాడు మనం చూస్తున్న విద్యుశ్ఛక్తి కంటే చాలా గొప్పదైనటువంటి ఒక శక్తిని వాళ్ళు ఉపయోగిస్తూ ఉండేవారు. వాళ్ళు మనుషులతో తిరుగుతూనే వున్నా, కానీ మానవులకు అదేమిటో తెలుసుకునేటంత జ్ఞానంలేదు ఆ రోజులలో. ఈ ఋషులు, దేవతలు వాడేటటువంటి ఆ ఆధ్యాత్మిక శక్తి యొక్క ఫలితాలను వాళ్ళు చూస్తునే వుండేవారు. ఉపయోగించుకుంటూనే వుండేవారు. అదంతా మన వెన్నుపూసలో వుండేటటువంటి కుండలినీ శక్తి యొక్క ఫలితాలే.

వినాయక పూజ ఎందుకు ముఖ్యమూ అంటే అది కుండలినీ శక్తికి ఆధారం కనుక. మూలాధారం ఆ కుండలినీ శక్తికి ఆధారంగా వుంటుంది. ఆ రోజులలో దేవతలు గానీ, ఋషులు గానీ ఉపయోగించే శక్తులకు ఆధారం అదే! అందుకే వినాయక పూజ చేస్తారు. పూర్వకాలం నుండి దేవాలయాలలో ఉన్న పూజా విధానాలన్నీ కూడా మనిషిలో ఉన్న కుండలినీశక్తిని ఉపయోగించుకోటానికి వీలుగా వుండే సశాస్త్రీయమైన విద్యలు. వాటిని మనం మర్చిపోయాం. కానీ ఆనాడు దేవతలు, ఋషులు కూడా ఈ కుండలినీశక్తితో ప్రయోగించగల అస్త్ర, శస్త్రాలను మానవజాతికి బహూకరించారు. మానవజాతి దానిని ఉపయోగించుకోగలిగింది కానీ అది ఎలా తయారైందో మాత్రం వాళ్ళకి తెలిసేది కాదు. అదెలాగంటే ఈనాడు మనం టి.వి., కంప్యూటర్ లాంటి ఎన్నో సాధనాలను ఎలా తయారయ్యాయో తెలియకుండానే ఉపయోగించుకుంటున్నామో అలాగే ఆనాడూ జరిగేది.

ఋషులు, దేవతలు కుండలినీశక్తితో పనిచేయగల పరికరాలను తయారుచేసి వాడుకోమని మానవజాతికిచ్చారు. ఇస్తే ఏం జరిగింది? చైనాలోనూ, ఈజిప్టులోనూ ఉన్న కొంతమంది మానవులు

దానిని సక్రమంగా ఉపయోగించుకోకపోవటం వలన భయంకరమైన పెనుతుఫానులు లేచాయి. కుండలినీశక్తిని దురుపయోగం చేసుకోవటం వలన ఆ ప్రమాదాలు జరిగాయి. అసలు ఆ పరిస్థితులలో పృథ్వి యావత్తు నాశనం అయిపోతుందనుకున్నారు. కానీ అంత నష్టం జరుగలేదు. కుండలినీశక్తి దురుపయోగం చెయ్యబడింది కనుక వ్యవస్థ మొత్తం నాశనమైంది.

మళ్ళీ సృష్టి మొదటికి వచ్చింది. మెల్లమెల్లగా మానవజాతి ఈనాటికి ఈ స్థితికి వచ్చింది. 95 వేల సంవత్సరాల క్రిందట ఆ తప్పు చేసిన వ్యక్తులు మళ్ళీ ఇప్పుడు పుడుతున్నారు. మనమందరమూ కూడా అందులో వున్న వాళ్ళమే. 1750 నుండి 2250 మధ్యలో పుట్టిన, పుట్టబోయే ప్రతి వ్యక్తి కూడా ఆ కాలంలో వున్నవాడే. కానీ అందరూ ఆ తప్పు చెయ్యలేదు. అలా పుట్టిన కొందరు ఆ తప్పును సవరించుకోవటానికి ప్రయత్నం చేశారు ఈ మధ్యకాలంలో.

ఈ కాలం యొక్క విశిష్టత అర్థమైందికదా! **వాళ్ళే ఇప్పుడు ఎందుకు పుడుతున్నారూ అంటే, ఏ శక్తిని నువ్వు తప్పుగా ఉపయోగించావో, మళ్ళీ అదే శక్తి ప్రపంచంలో ఉన్నప్పుడు - నువ్వు పుడితేనే, దాన్ని నీవు మంచిగా ఉపయోగించుకుంటావో లేక చెడుగా వుపయోగించుకుంటావో తేలుతుంది. కర్మసిద్ధాంతం అదే గదా!** అందుచేత ప్రకృతి ఇన్నాళ్ళు ఆగింది. మీలో ఎవరైనా సవ్యంగా ఉపయోగించుకోవాలి అని అనుకొని కొంచెం ప్రయత్నం చేస్తే ఆ అద్భుతమైన శక్తిని మీరు పొందగలుగుతారు. దానికి నిదర్శనమేమిటంటే 1750 నుండి ఇప్పటి వరకు భారతదేశంలో అద్భుతమైనటువంటి వ్యక్తులు ఎందరో ఆవిర్భవించి, ఆ అద్భుతమైన శక్తిని దివ్యంగా ఉపయోగించు కొని మహాత్ములైనారు. వెంకయ్యస్వామి ఏమీ చదువుకోలేదు. కానీ మహామహా డాక్టర్లు నయం చేయలేని వ్యాధులను నయం చేశాడాయన. అలాంటిది ఆ కుండలినీ శక్తి యొక్క పవర్. ఏ శక్తి వల్లనైతే వెంకయ్యస్వామిలాంటి వాళ్ళు అంత అద్భుతమైన వ్యక్తులుగా మారారో, **అలాంటి శక్తిని నేను సాధిస్తాను అనే తీవ్ర లక్ష్యం కలవాళ్ళు నా దగ్గరకు రండి. అలాంటి ఆధ్యాత్మిక శక్తిని నేర్పుతాను. భగవంతుణ్ణి అడుక్కోవద్దని చెప్తున్నాను. కానీ నిరంతరం మీకు నచ్చిన ఏదో ఒక నామాన్ని చేసుకుంటూ వుండండి. మీరు నామాన్ని ఉపయోగించుకోగలిగితే ఆయనే మీ దగ్గరకు వచ్చి మీక్కావలసినదంతా చేసిపెడతాడు.**

అందుకని నామజపం చాలా ముఖ్యమైనది. "యత్ర యత్ర రఘునాధ కీర్తనం" ఎక్కడ

ఎక్కడ రామనామం జరిగితే అక్కడకు హనుమంతుడు వస్తాడు. ఆ రామ నామాన్ని ఉపయోగించుకొనే కదా హనుమంతుడు అంత గొప్పవాడు అయ్యాడు. ఆ రామ నామాన్ని ఉపయోగించుకొనే కదా సక్కుబాయి, మీరాబాయి, త్యాగరాజు, రామదాసు, పోతన అంతంత గొప్పవాళ్ళు అయ్యారు. నామం చేసేటప్పుడు మీలో ఆర్తి కలగాలి. విశేషమైన మంత్రాలు తెలియాల్సిన పనిలేదు. చదువులు అక్కర్లేదు. నేను చెప్పినట్లు చేసుకుంటూ పోతే మూడు సంవత్సరాల్లో మీరు చాలా చాలా మ్యాజిక్కులు చేయగలరు.

ఇవాళ నామ మహిమను అర్థం చేసుకోండి –'ఏ నామం చెయ్యాలి మాస్టర్‌గారు' అడుగుతారు. నామం మారిస్తే ప్రమాదమట కదా?.. ఇలా అన్నీ అనుమానాలే! కానీ మీరు గుర్తుంచుకోవాల్సిందేమి టంటే 'ఏ నామం చేసుకున్నా కూడా ఫలితం ఇస్తుంది, భగవన్నామంలోనే ఆ మహిమ వుంది' మనం ప్రతిరోజు ఆహారంలో రకరకాల కాయగూరలు, పండ్లు తింటుంటాము. అంతా శక్తిగానే మారుతోంది కదా! అలానే ఇది కూడా!

అలాగే వాక్ శక్తిని ఉపయోగించుకుని ఉచ్చారణ చేసే ప్రతి మంత్రము మీలో ఆధ్యాత్మికశక్తిని లేపుతుంది. శిరిడీసాయిలాంటి వాడు తిట్టినా కూడా అది ఆశీర్వాదముగానే పనిచేస్తుంది. అవధూతల చరిత్రలు చదివితే వాళ్ళ 'వాక్' ఎంతటి చమత్కారాలను చేసిందో తెలుస్తుంది.

## వాక్‌శక్తే కుండలినీశక్తి

చేతనైనవాడు 'వాక్‌శక్తి'ని ఎలా ఉపయోగించాలనుకున్నా అది కుండలినీశక్తే–అది దైవీశక్తే అవుతుంది. అందుచేత మొట్టమొదట మనం గుర్తుంచుకోవలసినదేమంటే **వాక్‌శక్తే–కుండలినీశక్తి.** మనం మాట్లాడుతున్నామూ అంటే మనలో కుండలినీశక్తి జాగృతమై ఉన్నదని అర్థం.

అయితే దానిని ఉపయోగించుకునే విధానం తెలియడం లేదు. మనం వాక్‌శక్తిని అర్థరహితంగా వాడుకుంటున్నాము. మనం వాక్‌శక్తిని ఎలా వాడుతున్నామంటే ఒకవైపు నోటితో మాట్లాడుతూ వుంటాము, రెండో ప్రక్క మనసుతో ఆలోచిస్తూవుంటాము. **ఆలోచించడం కూడా వాక్‌శక్తే. మీ మనస్సులో మీరు మాట్లాడుకోవడమే మీ ఆలోచన అవుతుంది. జాగ్రత్తగా గమనించుకోండి. మనందరం చేసే పెద్ద తప్పు ఏమిటంటే ఆలోచించడమే. అలా అర్థరహితంగా ఆలోచించడం వలన మన వాక్‌శక్తి వృథా అవుతోంది.**

మీలో వున్న ఆ దైవశక్తి, ఆధ్యాత్మిక శక్తి ప్రచోదన చెందాలంటే సాధ్యమైనంతవరకు తక్కువ, తక్కువగా మాట్లాడండి. అవసరం ఉన్నచోట గంటలు గంటలు మాట్లాడండి. అవసరం లేని చోట అస్సలు నోరు విప్పకండి. ఈ నియమాన్ని ఒక్క సంవత్సరంపాటు పాటిస్తే చాలామందికి వాళ్ళకు ఉన్న అనేక రోగాలు నయమైపోతాయి. **ముఖ్యంగా మోకాళ్ళ నొప్పులు – ఆచరణలో పెట్టనటువంటి అనవసరమైన ఆలోచనల వలన మోకాళ్ళ నొప్పి వస్తుంది. ఆలోచనలు కార్యరూపంలో పెట్టరు కాబట్టి కాళ్ళ జాయింట్స్ జామ్ అయిపోతాయి. అందువలన అనవసరమైన ఆలోచనలను ఆపేటందుకే "నామ జపం" చాలా అవసరం.**

అస్త్రాలు, శస్త్రాలు అనే రెండు మాటలకు తేడా ఏమిటంటే – అస్త్రము అనేది వాక్‌తో వచ్చేది. కేవలం ఒక దర్భపుల్ల తీసుకొని వాక్‌ని దాని మీద ప్రయోగిస్తే అది బ్రహ్మాస్త్రం అవుతుంది. ద్వాపరయుగంలో ఈ ప్రయోగాన్ని అశ్వత్థామ, అర్జునుడి మీద చేశాడు. అస్త్రాలు అంటే వాక్ శక్తే కదా! అలా అక్కడ 'వాక్' శక్తి దుర్వినియోగం అయింది. ఈనాడు జరుగుతున్న అన్ని రకాల ప్రమాదాలకి, ప్రకృతి వైపరీత్యాలకు ముఖ్య కారణం వాతావరణ కాలుష్యం కాదు, వాక్‌శక్తి యొక్క దురుపయోగమే అని శ్రీ జ్వాలాకూల్ మహర్షి అంటారు.

అందుకే ఋషులు నిరంతరం మౌనంలో ఉంటారు. 'మౌనేన కలహం నాస్తి–జపతో నాస్తి పాతకం' అంటారు పెద్దలు. వాక్ శక్తిని పెంపొందించుకోవాలంటే ముందుగా పాటించవలసిన మొదటి నియమం – మౌనం. దాని తర్వాత నామ జపం. మౌనంతోపాటు హాయిగా నవ్వుతూ ఉండటం కూడా కుండలినీశక్తి జాగరణకి చాలా అవసరం. దేవతామూర్తుల ఫోటోలు ఎక్కడ చూచినా నవ్వుతూ వుంటాయి. అలానే మనము ఎప్పుడు నవ్వుతూనే వుండాలి. **తక్కువగా మాట్లాడుతూ, చిరునవ్వుతో ఉండటం–ఈ రెండూ సాధన చేశాక, మూడవది నిరంతరం ఏదో ఒక మంత్రాన్ని కానీ, నామాన్ని కానీ జపం చేసుకుంటూ మనస్సును దాని మీద లగ్నం చేయాలి.**

ఈ నియమాలను కనుక అమలు చేస్తే, కొన్ని వేల సంవత్సరాల నుండి చేస్తున్న తప్పులను సవరించుకొని మళ్ళీ సవ్యమైన మార్గంలో పడడమేకాక, వయస్సు పెరిగితే వచ్చేటువంటి రోగాలు ఏవీ కూడా మీకు ఉండవు అనే ఒక అద్భుతమైన సత్యాన్ని ఆయన చెప్పారు. పై విషయాలను మౌనంగా మననం చేసుకుందాం.

వాక్ శక్తే కుండలినీ శక్తి – దీనిని పెంచుకోవటానికి ముఖ్యంగా పాటించవలసినవి.

1) అనవసరమైన ఆలోచనలను తగ్గించాలి.

2) మాటలు తగ్గించి – మౌనంగా వుండడానికి ప్రయత్నించాలి.

3) నిరంతరం నామ జపం చేయటం వలన ఇది సులభ సాధ్యమౌతుంది.

4) మౌనంతో పాటు చిరునవ్వుతో ఉండటం వల్ల కుండలినీ జాగరణ త్వరగా జరుగుతుంది.

5) వీటన్నింటితోపాటు రోజుకు మూడుసార్లు శుభకామన చెప్పుకోవాలి.

ఇలా కుండలినీ జాగరణకు అవసరమైన ప్రధానాంశాలను ఈ సాధనా శిబిరంలో చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా ఎంత శ్రద్ధగా చెయ్యాలో, చేసి చూపించడమే కాక అందరిచేత చేయించారు.

ఈ సాధనా శిబిరంలో 'గురుపూజ', దాని ప్రాముఖ్యతను గురించి చెప్తూ ఆధ్యాత్మిక జీవితంలో 'గురుపూజ' ఎలా చెయ్యాలి, గురుపాదుకల యొక్క గొప్పదనం, ఇంకా 'గురుపాదోదకం' తీర్థంలాగా ఎలా స్వీకరించాలి, తత్ఫలితాలు ఏమిటి అనే విషయాలపై సుదీర్ఘమైన ప్రవచనం చెప్తూ 'ప్రతిరోజూ కార్యక్రమాలకి ముందు గురుపూజను స్వయంగా మాస్టర్‌గారే ఎంతో శ్రద్ధాభక్తులతో చేయడమనేది ఆ సాధనా శిబిరానికి అత్యంత శోభనిచ్చింది. పూజ ఎలా చేయాలనేది వారిని చూచి నేర్చుకోవాలి. ఆ శ్రద్ధ, భక్తి, తాదాత్మ్యతలను గురించి ఎంత వర్ణించినా అది తక్కువే అవుతుంది. చూసి తీరాల్సిందే!!

## దీక్ష

'గురుపూజ' జరిగిన తర్వాత దీక్షా సందేశాన్ని ఇవ్వడం జరిగింది.

ఆ రోజు దీక్ష ఇవ్వడానికి ముందు అసలు 'దీక్ష' అంటే ఏమిటి? ఒక శిష్యుని జీవితంలో జ్ఞానదాత అయిన గురువు యొక్క పాత్ర ఎలా వుంటుంది? 'దీక్ష' నిచ్చే సమయంలో గురువు, శిష్యుని యొక్క మనోక్షేత్రములో ఏమి నాటుతాడు? జగద్గురువు శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా మానవజాతికి ప్రసాదించిన దీక్షా విజ్ఞానం ఏమిటి? అనే విషయాలపై కనీ, వినీ ఎరుగని రీతిలో ప్రచండ ఝంఝూమారుతంలాంటి ప్రవచనాన్ని ఆ రోజు చెప్పారు. ఆ దీక్షకు ముందే అందరినీ

శారీరకంగా, మానసికంగా సంసిద్ధులను చేసిన తరువాత ఒక అద్భుతమైన దీక్షను అనుగ్రహించారు. దీక్షలనిచ్చే ముందు అవగాహన కల్గించటానికి మరికొన్ని ముఖ్యమైన విషయాలను వివరించారు.

'ఆధ్యాత్మిక విజ్ఞానం బయటకు రావలసినటువంటి సమయం వచ్చేసింది. ఇప్పుడది బయటకు రాకపోతే మానవజాతి మరింత బాధలలో కూరుకుపోతుంది. అందుచేత మీరు ఈ దీక్షలను తీసుకోవాలని కోరుకుంటున్నాను. ఈ దీక్షలు తీసుకున్న తర్వాత ఈ సాధనలను మీరు చేస్తూ మిగిలిన సమయాన్ని ప్రచారానికి కచ్చితంగా ఇవ్వండి. ప్రచారం చెయ్యాలంటే మీకు జ్ఞానం ఉండాలి. స్వాధ్యాయం చెయ్యకపోతే మీకు జ్ఞానం రాదు' అంటూ ఒక ఉదాహరణ చెప్పారు. తండ్రి స్టెతస్కోప్ పెట్టి చూస్తూ వుంటే వాళ్ళ పాప కూడా తండ్రిని అనుకరిస్తూ స్టెతస్కోప్ పెట్టి చూస్తుంది. కానీ తండ్రికి జ్ఞానం వుంది కనుక కావలసిన మందు ఇవ్వగలడు. కానీ పాపకు జ్ఞానం లేదు కనుక మందులు ఇవ్వలేదు. అదే విధానం ఇక్కడా జరుగుతున్నది.

మన ఆధ్యాత్మిక సాధనలు, మన జపాలు, మన పూజలు కూడా జ్ఞానరహితమైన పూజలు, జపాలుగా అయ్యాయి. అందుకే మనకు ఫలితాలు రావటంలేదు. నేను వ్రాసిన పుస్తకాలు చదవండి. ఎందుకు అంటే అవే మనకు సవ్యమైనటువంటి మార్గదర్శనం చేస్తాయి. నాకు 33 మంది కంటే ఎక్కువమంది గురువులయ్యారు. మొన్న డార్జిలింగ్‌కు వెళ్ళినప్పుడు వాళ్ళ మాటలను విన్నాను. కాని వాళ్ళ మాటలను విని అర్థం చేసుకొని ఈ రూపంలో మీకు చెప్పటానికి కావలసిన జ్ఞానం నాకు పుస్తకాల వల్ల మాత్రమే లభించింది. దేశ, విదేశాలలోని ప్రముఖ రచయితలు వ్రాసిన అనేక ఆధ్యాత్మిక పుస్తకాలను చదివాను. కనుకనే మీకు, నేను ఈనాడు ఈ విజ్ఞానాన్ని అందచేయగలుగు తున్నాను. అవన్నీ చదవడం మీకు అసంభవం. కనుక నా పుస్తకములలో ఆ విషయ పరిజ్ఞానం మొత్తం వుంటుంది కనుక వాటిని చదువమంటున్నాను.

ఆధ్యాత్మిక విజ్ఞానం వృద్ధి చెందటానికి మూడు సూత్రాలను పాటించాలి.

**1) జపము  2) ప్రాణాయామము  3) ధ్యానము**

దీక్ష తీసుకున్న తరువాత మీకు రెండు ఫోటోలు ఇవ్వబడతాయి.

**1) గురుసత్తా ఫోటో  2) జగజ్జనని మహాయోగీశ్వరిదేవి ఫోటో**

ఈ ఫోటో మీ డ్రాయింగ్ రూంలో, సాధారణంగా ఎక్కడ కూర్చుంటారో అక్కడ మీరు కూర్చుంటే మీ శిరస్సుకు ఒక అడుగుపైన ఉండేలాగా పెట్టుకోవాలి. ఈ నియమాన్ని తప్పక పాటించండి. ఎందుకంటే ఇవంతా ఆ దైవశక్తి ధారలు మీ వైపుకి ప్రవహింపచేయటానికి చేసే ప్రయత్నాలు. ఇదికాక జప, ధ్యాన, ప్రాణాయామాలను విధిగా ఎలా చేసుకోవాలో మళ్ళీ చెప్పారు.

ముఖ్యంగా మహాత్ములైన మాస్టర్‌గారు గుచ్చి గుచ్చి చెప్పిన విషయాలు 'మీ యొక్క సమయాన్ని, డబ్బును, మీ ప్రతిభతో సద్వినియోగం చేసుకుంటూ, మీరు నేర్చుకుంటూ, ఇతరులకు నేర్పటానికి కష్టపడండి'. ఈ తీవ్రమైన ప్రయోగం చేస్తే మూడు సంవత్సరాలలో ఆధ్యాత్మికంగా మీరు ఎంతో ఎత్తుకు ఎదుగుతారు. ఒక వెంకయ్య స్వామివారిలాగా మీరే ఎంతోమంది కష్టాలను, బాధలను నివారించగలుగుతారు. ఆ స్థితికి ఎదగండి. అని చెప్తూ దానికి ఒక చక్కటి ధ్యాన విధానాన్ని చెప్పారు.

**ధ్యానానికి ఒక ఫోటో చూపించారు. శ్రీమన్నారాయణమూర్తి శంఖు, చక్ర, గదా, పద్మములు ధరించి పద్మంలో నిలబడివున్న ఫోటో అది.** దాని మీద దృష్టి నిలిపి ఆ రూపాన్ని అంతరంగములోకి దింపుకోమని చెప్పారు. తర్వాత మెల్లమెల్లగా ధ్యాన ప్రక్రియను వివరించసాగారు.

శ్రీమన్నారాయణమూర్తికి పైన రెండు చేతులున్నాయి. ఆ చేతులలో ఉన్న ఆయుధాలు–ఎడమ చేతిలో శంఖం, కుడి చేతిలో చక్రం. క్రింద గల రెండు చేతులలో ఎడమ చేతిలో పద్మము, కుడి చేతిలో గద వున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి చేతులలో గూడా శంఖం, చక్రం వుంటాయి గదా! ఆయన యొక్క మొత్తం మ్యాజిక్ ఆ రెండింటిలోనే వున్నది. మన ఇళ్ళల్లో తప్పనిసరిగా వేంకటేశ్వర స్వామి ఫోటో వుంటుంది గదా, వివరంగా చూడండి. చూడకపోయినా ఫరవాలేదు. దాని వలన రక్షణ అయితే గ్యారెంటీగా వస్తుంది. మీరే కనుక వాటిని పట్టుకుంటే ఎంత రక్షణ లభిస్తుందో ఊహించుకోండి. ఈ ధ్యానం ద్వారా చాలా అద్భుతమైన శక్తి ధారలు ప్రసరించబడుతూ వుంటాయి.

ఈ ధ్యానానికి మీరు ఎప్పుడు కూర్చున్నా కనీసం 20 నిమిషాలు తగ్గకుండా చేయాలి, మరీ ఇబ్బందైతే రెండు నిమిషాలు చేసినా ఫరవాలేదు. ఏదో కారణం వలన మీకు మానసికంగా బాధ అనిపించింది. వెంటనే కళ్ళుమూసుకొని క్రింది చేతులలో పద్మం, గద, పైన వున్న చేతులలో శంఖం, చక్రం ఉన్నట్లు భావిస్తూ కూర్చోండి. మీరింక ఆ రక్షణ వలయంలోకి వచ్చేస్తారు.

నారాయణమూర్తి ఎవరిని రక్షించినా ఆ శంఖం, చక్రంతోనే గదా! వాటితోనే కదా మొసలి బారి నుండి ఏనుగును రక్షిస్తాడు. శ్రీకృష్ణుడు ఆ చక్రాయుధంతోనే సైంధవుడి బారి నుండి అర్జునుని రక్షిస్తాడు. ఆ సుదర్శన చక్రంతోనే ఉత్తర గర్భంలో ఉన్న పరీక్షిత్తుని బ్రహ్మాస్త్రం బారి నుండి కాపాడాడు. అందుచేత అవే ఆయుధాలు మీ దగ్గర వుంటే ఇంక తిరుగేమున్నది. శ్రీవేంకటేశ్వరస్వామి యొక్క మొత్తం మ్యాజిక్కులకు అదే కారణం. శంఖం, చక్రం. ఇంకో రెండు చేతులలో పద్మము ఉంటాయి. వీటి గురించి శ్రీరామశర్మ ఆచార్య చాలా అద్భుతంగా చెప్పారు.

శంఖము అంటే వాక్ సంయమనము, **శబ్దానికి ప్రతీక**

చక్రము అంటే సమయ సంయమనము, **కాలానికి ప్రతీక**

గద అంటే ఇంద్రియ సంయమనము, **ఇంద్రియ సంయమనానికి ప్రతీక**

పద్మము అంటే అర్థ సంయమనము, **ధనశక్తికి సంకేతము**

**ఈ అస్త్రాలను మీరెంత స్పష్టంగా ఊహించుకోగలిగితే మీకంత కష్టాలు వుండవు.**

**ఈ రెండు నియమాలను పాటిస్తూ "విష్ణువు యొక్క చతుర్భుజ రూపము-శంఖము, చక్రము, పద్మము, గద" అనే ఈ నాలుగు ఆయుధాలతో ఎవరు ధ్యానం చేసుకుంటారో వాళ్ళకి నిత్యావసరాలకి కావలసిన పరిస్థితులు ఖచ్చితంగా ఏర్పడతాయి. క్రిందనున్న ఎడమ చేతిలో పద్మము, పైన ఎడమ చేతిలో శంఖము, క్రింద కుడిచేతిలో గద, పై కుడి చేతిలో చక్రము ఎడమ చేతిలో గద ఉన్న భావన చెయ్యాలి . మీకు కూడా ఈ నాలుగు చేతులు ఉన్నాయి అని ఊహించుకుంటూ ధ్యానానికి కూర్చోవడమే. మీ యొక్క అసలైన రూపము అదే! మీ హృదయంలో వున్న ఆ జగద్గురువుని 'ఈ శంఖు, చక్ర, గద, పద్మముల'తో ఊహించుకోండి. వేరే పిలవనక్ఖర్లేదు. శంఖము, చక్రము, పద్మము, గదా ధారులుగా మిమ్మల్ని మీరు ఆ రూపంలో ఉన్నట్లుగా ఊహించుకొని కూర్చోండి. ఇది ఎంత అద్భుతమైన తపశ్చర్య అవుతుందో, తర్వాత తర్వాత మీకే అర్థమౌతుంది. చెయ్యండి. ఈ క్షణంలోనే మీకా అనుభూతి వచ్చేస్తుంది.**

సమచతురస్రాకారంలో ఉన్నట్టు చూడాలి. అప్పుడు ఆర్థికపరమైన, కాలపరమైన, వాక్‌పరమైన, ఇంద్రియపరమైన కష్టాలు మీకు ఉండవు. ఈ అస్త్రాలు మీ దగ్గర వుంటే తగిన పరిస్థితులు, అనుకూల వాతావరణం అనేవి వాటంతటవే చక్కగా తయారౌతాయి. ఆధ్యాత్మిక

విద్యను గురించి చెప్తూ పెద్దవాళ్ళు **"శ్రీరామః శ్యామలాదేవీ శ్రీకృష్ణో లలితాంబికా"** అన్నారు. శ్రీకృష్ణుడే లలితాదేవి అని చెప్పారు. అలానే లలితా షోడశాక్షరీ మంత్రాన్ని వారు చెప్తూ అందరి చేత పలికించారు. ఇదే లలితా సహస్రనామానికి ముందు చేయవలసిన షోడశీమంత్ర దీక్షగా తీసుకోండి. స్వయంగా లలితాదేవియే 'ఈ పూర్ణిమ చంద్రుడు' కనుక అందరూ చంద్రుని వంక చూడండని చెప్తూ ఆ ధ్యానాన్ని చేయిస్తూ, షోడశీ మంత్రాన్ని 16 సార్లు పలికించారు. 'షోడశీ మంత్రము మంచి ఫలితాలనిస్తుంది. కానీ షోడశీకి ఆధారం గాయత్రీ మంత్రమే! షోడశీ మంత్రాన్ని సూక్ష్మ గాయత్రీ లేదా యోగ గాయత్రీ అని కూడా అంటారు. ఆ శక్తే శ్రీకృష్ణుని కంటే ముందుగా యోగమాయగా అంతరిక్షంలో ఉద్భవించి శ్రీకృష్ణుడు తన కార్యక్రమాలను సవ్యంగా చేసుకోవటానికి సహకరించింది' అని చెప్పారు. ఈ విధంగా అనేక రకాల సాధనలతో, దీక్షలతో, అనంతపద్మనాభ స్వామి వ్రతంతో, గణపతి నవరాత్రులు ఎంతో ఆనందంగా, ఆహ్లాదకరంగా జరిగిపోయాయి.

చివరగా ప్రవచనాన్ని ముగిస్తూ మాస్టర్‌గారు సింహావలోకనంగా మూడు విషయాలు చెప్పారు.

1. అనన్య చింత: భగవంతుని మీద భక్తునికి అనన్య చింత వుండాలి.

2. ఆధ్యాత్మిక విజ్ఞానం వృద్ధి చెందటానికి మూడు సూత్రాలను పాటించాలి.

(1) జపము (2) ప్రాణాయామము (3) ధ్యానము

**3. రక్షణకి, సమస్త బాధా నివారణకి. చతుర్భుజ ధ్యానము.**

బలహీనులకు ఆధ్యాత్మిక విద్య లభించదు. ఆధ్యాత్మిక విద్యలో ఈనాడున్న ఒక విశేషమైనటు వంటి రోగాన్ని మీ మనస్సులలో నుండి పోగొట్టుకోవాలి. అదేమిటంటే 'నీవు శక్తినిస్తే మేము చేస్తాము. నీవు చేయించుకో' అనే రోగం. రోగగ్రస్తమైన ఆధ్యాత్మికతే ఈ బలహీనమైనటు వంటి, నీచమైనటువంటి మాటలను మాట్లాడుతుంది.

**'నాయమాత్మా బలహీనేన లభ్యతే'** బలహీనులకు ఆధ్యాత్మిక విద్య లభించదు అని వేదాలు, ఉపనిషత్తులు చెప్తున్నాయి. గురువు శక్తి ఇస్తే మేము చేస్తాము. శక్తినివ్వకపోతే మేము చెయ్యము అనే భ్రమలో నుండి బయటపడండి. గురువు ఇచ్చిన ప్రేరణని అండగా తీసుకొని మీ ఆత్మశక్తితో ప్రతి పని సాధించండి. ఇదే నిజమైన ఆధ్యాత్మికత. అలా ఈ శిబిరంలో చెప్పిన సాధనలను,

పూర్ణిమా ధ్యానాలను వీలైనంత వరకు ఏ ఊరివాళ్ళు ఆ ఊళ్ళో సామూహికంగా చేసుకోటానికి అలవాటు పడ్డారు.

'ఎప్పుడు ఈ ధ్యానం చేసుకున్నా కళ్ళు మూసుకొని ఈ నాలుగు ఆయుధాలను మీ మనస్సులో, మీ చేతులలో పెట్టుకొని, సీరియస్ మూడ్‌లో కాకుండా, చాలా రిలాక్స్‌డ్‌గా నవ్వు ముఖంతో చేసుకోండి' అని చెప్తూ మెల్లమెల్లగా అద్భుతమైన ఆ ధ్యానంలోకి తీసుకువెళ్ళారు. ఆ ధ్యానం పూర్తి అయిన తరువాత అందరి ముఖాలలోనూ చిత్రమైన ప్రశాంతత కనిపించింది. ఆ తరువాత కాలంలో కూడా ఈ ధ్యానాన్ని కొనసాగించటం జరిగింది. ఏ చిన్న విషయాన్ని అయినా ఎంతో శ్రద్ధతో హృదయానికి హత్తుకునేలాగా చెప్పేవారు.

## అనంతపద్మనాభ వ్రతం

వినాయక చవితి వెళ్ళిన తర్వాత వచ్చే చతుర్దశినాడు అనంతపద్మనాభ వ్రతం చేస్తారు. వ్రతాలన్నింటిలోనూ అదే మొదటి వ్రతం. ఈ వ్రతాన్ని మొట్టమొదట చేసిన వ్యక్తి శ్రీరాముడు. మానవుడు ఎలా జీవించాలి, కుటుంబంలో చక్కటి మానవీయ సత్సంబంధాలను ఎలా నిలుపుకోవాలి, మనిషిగా ఎలా జీవించాలి అనేది చేసి చూపించాడు శ్రీరాముడు. స్వయంగా ఆయన భగవంతుడే అయినా 'నేను భగవంతుణ్ణి' అని ఆయన ఎప్పుడూ గుర్తుచేసుకోలేదు. ఒక కష్టం వస్తే దానిని ఎలా సంబాళించుకోవాలి, ఎలా బాధపడాలి, ఎలా ఆనందించాలి, ఎలా ప్రవర్తించాలి, ఎలా జీవించాలి, కుటుంబాలలో సంబంధ, బాంధవ్యాలను ఎలా నిలుపుకోవాలి అనే విషయాలను అచరించి చూపించాడు శ్రీరాముడు.

అవతారమూర్తి, మర్యాదాపురుషోత్తముడైన శ్రీరాముడు ఈ వ్రతాన్ని చేసుకున్నాడు. ఈ వ్రతాన్ని 14 సంవత్సరాల పాటు చేసుకోవాలి. ఇదొక మహత్తరమైనటువంటి దీక్ష. ఏమిటా దీక్ష అంటే ఆధ్యాత్మికతలో 14 సంవత్సరాల కోర్సు ఒకటి ఉన్నది. మొట్టమొదట ఈ శరీరంలో ఉండే షట్చక్రాలు-6 (షట్చక్రభేదన), పంచకోశాలు-5 (పంచకోశ అనావరణ), త్రిగ్రంధి భేదన (అంటే బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంధి, రుద్రగ్రంథి) అనే విద్యలకు సంబంధించిన దీక్ష ఇది. ఈ మూడు విద్యలూ ఈ 14 సంవత్సరాలలో నేర్పటానికి 'దీక్ష' తీసుకోమని మాస్టర్‌గారు చెప్పారు. 2003 సంవత్సరంలో ఎఱ్ఱబాలెంలో అపూర్వగణపతి సాన్నిధ్యంలో ఈ 'వ్రతం' యొక్క దీక్షను ఇవ్వటం జరిగింది.

ఇక్కడ **'వ్రతము'** అంటే ఏమిటో చూద్దాం.

1. ఎవరైనా ఒక వ్యక్తి నియమ, నిష్టలతో సంకల్పం తీసుకొని ఏదైనా వ్రతంగానీ, అనుష్ఠానం గానీ చేస్తుంటే దానిని వ్రతం అంటారు.

2. ఆ వ్రతంలో కుటుంబ సభ్యులంతా భాగస్వాములైతే దానిని **పర్వం** అంటారు.

3. ఈ పర్వం సమాజంలో ఒక అభిన్న అంగమై, యావత్ సమాజం అత్యంత ఉత్సాహంతో దానిని జరుపుకుంటే దాన్ని **' పండుగ లేక ఉత్సవం '** అని సంబోధిస్తారు. ఈ దీక్షలో అవగాహన చేసుకోవలసిన మూడు ముఖ్యమైన విశేషకార్యక్రమములను ఈ సాధనా శిబిరంలోనే ప్రారంభించారు. అవి 1.జపము, 2. ప్రాణాయామము, 3. ధ్యానము.

ఇందులో జపమును స్థూల శరీరంతో చేస్తాము. ఈ జపము వలన స్థూలశరీరమునకు కావలసిన అవసరాలు దానితో తీరిపోతాయి. కష్టాలు పోతాయి. నష్టాలనేవి రావు. జపం చేస్తే వచ్చే లాభం అది.

ఇక రెండవది ప్రాణాయామం. **ఇది సూక్ష్మ జగత్తుకు సంబంధించినది. ఈ ప్రాణాయామం గుర్తు వచ్చినప్పుడల్లా నెమ్మదిగా గాలి పీల్చి, పూర్తిగా గాలి వదిలివెయ్యాలి. ఇది బాగా అభ్యాసం చెయ్యాలి. అలా చేసిన వారి శరీరం వజ్ర సదృశమౌతుంది. వాళ్ళకి రోగాలు రావు. ఏ పూజలలోగానీ, వ్రతాలలోగానీ ప్రాణాయామానికి ప్రథమ స్థానం ఇస్తారు. వీలు చేసుకొని, గుర్తు వచ్చినప్పుడల్లా మూడు లేదా ఐదుసార్లు ఇలా చేయడం చాలా మంచిది. దీర్ఘశ్వాస తీసుకునే ఏనుగు వందల సంవత్సరాలు జీవిస్తుంది. ఇలా మనమూ చేసినట్లయితే ఆయుర్దాయం పెరుగుతుంది. శ్వాసను లోతుగా, దీర్ఘంగా పీల్చుకోవాలి. తర్వాత పూర్తిగా వదలాలి. దీని వలన సంకల్ప శక్తి పెరుగుతుంది. అనుకున్నది సాధించటానికి కావలసిన శక్తి లభిస్తుంది. ప్రపంచాన్ని ఎదిరించైనా సరే లక్ష్యమును సాధించగలిగేందుకు కావలసిన సామర్థ్యం ఈ ప్రాణాయామము వలన వస్తుంది. కనుక దానిని బాగా అభ్యసించమని చెప్పారు.**

**ఇక పోతే మూడవది ధ్యానము. 'నేను ఆత్మను. నాకు మృత్యువులేదు. నేను భగవంతుడి యొక్క అంశను' అని తెలుసుకోవడానికి ధ్యానం సహాయపడుతుంది.**

ఆ సంవత్సరము పూజ్యశ్రీ మాస్టర్‌గారి నుండి ఈ దీక్ష తీసుకున్నవారు ఈనాటికీ ఆ వ్రతాన్ని ఎంతో శ్రద్ధా, భక్తులతో చేస్తూనే వున్నారు. వాళ్ల అమ్మగారి పుణ్యతిథిని పురస్కరించుకొని ఆ రోజున చక్కటి మృష్టాన్న భోజనాల ఏర్పాటును మాస్టర్‌గారే చేయించారు.

## పూర్ణిమా ధ్యానం

ఎఱ్ఱబాలెంలో గణపతి నవరాత్రులలో చతుర్దశి రోజున అనంతపద్మనాభ వ్రతం పూర్తి అయిన మర్నాడు పూర్ణిమ. ఆ రోజున సాధనా శిబిరంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని చాలా దివ్యంగా ఏర్పాటుచేశారు. ఆ రోజు రాత్రికి పూర్ణిమా ధ్యానం ఉంటుందని, అందులో విశేషమైన ఒక 'దీక్షా' కార్యక్రమం ఉంటుందని ఆ రాత్రి దీక్ష తీసుకోదలచిన వారు ధ్యానం అయ్యేవరకు ఉపవాసం చెయ్యాలని చెప్పారు.

పూర్ణిమనాటి రాత్రి పుచ్చపువ్వులాంటి వెన్నెల. పూర్ణచంద్రుడు తన శీతలకిరణాలతో పృథ్విని అమృతత్వంతో నింపుతున్నాడు. ప్రాణవంతమైన ఆ దివ్యవాతావరణంలో వేదిక మీద శ్రీశ్రీ మాస్టర్‌గారు కూర్చొని తమ ప్రవచనం ప్రారంభించారు. వేలాదిమందితో ప్రారంభమైన ఆ దీక్షాకార్యక్రమానికి ముందుగా మూడుసార్లు 'ఓంకారం, గాయత్రీమంత్రం' చెప్పిన తర్వాత పూర్ణిమ పర్వదినం గురించి చాలా అద్భుతంగా వివరించారు.

ఆ వివరణలో 'రాబోయేటటువంటి నూతన ఆధ్యాత్మిక జీవితంలో ప్రతి పూర్ణిమ కూడా ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. మొట్టమొదటసారిగా శ్రీ జ్వాలాకూల్ మహర్షి దీని గురించి 1930లో చెప్పారు' అని చెప్తూ ప్రతి పూర్ణిమను మూడు లక్ష్యాలతో చేసుకోబోయే రోజులు రాబోతున్నాయి. ఆ లక్ష్యాలను మాత్రం మనం ఇప్పుడప్పుడే ఆచరణలో పెట్టలేం. కానీ, అవి ఏమిటి అనేది తెలుసుకోవటం చాలా అవసరమని మొదలెట్టారు.

ఒక విషయాన్ని గురించి బాగా అర్థం చేసుకోవాలి. ఆధ్యాత్మిక జగత్తులో ఒక ప్రణాళికా బద్ధంగా పాఠ్యాంశ రూపంలో ఆధ్యాత్మిక విద్య యొక్క ఒరవడిని తీసుకురాలేదు. మనం పుట్టాము. పుట్టాక ఆధ్యాత్మిక జగత్తులో ఏ స్థాయిలో ఉన్నాము? ఇంకా ఎదగాలంటే ఏం చెయ్యాలి? ఇలాంటి విషయాలను వివరించే విజ్ఞానమును గురించి కాని, దాన్ని గురించి చెప్పే వ్యక్తులు కాని ఈనాడు కొరవడ్డారు. ఎవరికి నచ్చిన విధానంలో వారు 'మేము భగవంతుణ్ణి పూజిస్తున్నాము' అనుకుంటూ

పోతున్నారే తప్ప ఒక క్రమబద్ధమైన విధానంలో ముందుకు వెళ్ళడంలేదు. జ్ఞానానికి, విజ్ఞానానికి చాలా తేడా ఉంది. **జ్ఞానములో క్రమబద్ధత అనేది ఉండదు. విజ్ఞానములో క్రమబద్ధత ఉంటుంది. దానిని నేర్పించే విధానమునే గురుదేవులు సైంటిఫిక్ రెలిజియన్ అన్నారు.**

అందుకే ఈ గురుపూర్ణిమ నుండి 'నేను ఒక నిర్ణయానికి వచ్చాను'. ప్రతి నెలా 10, 20, 30 తేదీలలో నేను రాబోయేటటువంటి ఆ నూతనయుగానికి సంబంధించిన ధర్మం యొక్క ఆధార సూత్రాలు చెప్తుంటాను. దానికి సంబంధించిన ఆ దీక్షను మీకు ఇవ్వబోతున్నాను. దానిని మీరు ఎంత బాగా ఉపాసన చేస్తారు అన్నది నేను చూస్తాను. సాధన ఎప్పుడూ విద్యార్థి మీదే ఆధారపడి వుంటుంది. ఆధునిక విజ్ఞానంలోనూ అదేగా జరుగుతున్నది. ఉపాధ్యాయుడు అందరికీ ఒకేలాగా పాఠం చెప్తాడు. ఒకరికి మంచి మార్కులు వస్తాయి. ఇంకొకరికి సున్న వస్తుంది. ఫలితం పొందడమనేది విద్యార్థి కృషి మీద ఆధారపడి వుంటుందే తప్ప గురువు మీద ఆధారపడి వుండదు. ఈ రోజు నేనివ్వబోయే 'దీక్ష'ను తప్పనిసరిగా తీసుకోండి. ఇక్కడ మీ యొక్క ఆత్మశక్తిని పెంపొందించుకునేటువంటి విధానాలు నేర్పించబడతాయి. ఈ విధానాలలో సద్గురువుల యొక్క అనుగ్రహం మాత్రం ఖచ్చితంగా వుంటుంది. నూతన ధర్మాన్ని ప్రపంచానికి అందించడానికి కటిబద్ధులమైన మనం కొన్ని ప్రాథమిక సూత్రాలను పాటించితీరాలి. జ్వాలాకూల్ మహర్షి పూర్ణిమకు **1. ఫర్‌గెట్, 2. ఫర్‌గివ్ (3) ఫుల్‌ఫిల్‌మెంట్** అనే మూడు ధర్మాలను ఎలా పాటించాలో చాలా స్పష్టంగా వివరించారు.

మొట్టమొదటగా 'క్షమించటం' నేర్చుకోవాలి. పృథ్వీ పూజనంలో

**"పృథ్విత్వయా ధృతాలోకా దేవి త్వం విష్ణునాధృతా!**
**త్వం చ ధారయ మాం దేవీ పవిత్రం కురుచాసనం॥**

అని పూజచేస్తాము. ఇక్కడ ఎవరైనా పృథ్వి నుండి 'క్షమ'ను నేర్చుకోవాలి. ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్ళు భూమి నుండి, ఇనుము, పెట్రోలు, బంగారం, వజ్రాలను తీసేసుకుంటున్నారు. అది పృథ్విని కొల్లగొట్టడమేగా. ఒక్కసారైనా పృథ్వి 'నువ్వు ఎందుకు దోచుకుంటున్నావు' అని అడగలేదు. ఇంకా మనకు కావలసిన వనరులనిస్తోంది. అదీ క్షమించడమంటే ! క్షమించడమంటే ఏమిటో అర్థమైందికదా!

**1. ఫర్‌గెట్ (మర్చిపోవడం) :**

ఎవరికైనా మీరు చేసిన మేలును మర్చిపోవాలి. చాలామంది నా దగ్గరకు వచ్చి “మేము ఇంత చేశామండి, వాళ్ళు మా సహాయాన్ని ఏ మాత్రం గుర్తించటంలేదు’ అని వాపోతూంటారు. నీవు ఇతరులకు చేసిన మేలును గుర్తుంచుకోకూడదు. సమయానికి వాళ్ళకవసరమైన సహాయం అది ఏదైనా కావచ్చు. దానిని చేసిన తర్వాత ఇంక ఆ విషయం మర్చిపోవడం నేర్చుకుంటే చాలా మంచిది. నేనింత చేశాను, వాళ్ళు నా త్యాగాన్ని గుర్తించి నన్ను కీర్తించడం లేదు. పదిమందికీ నా గురించి చెప్పటం లేదు అనే నీచమానసికస్థితి నుంచీ బయటపడండి.

**2. ఫర్‌గివ్ (క్షమించడం) :**

ఇతరులు మనకు కలిగించిన బాధను, అది కుటుంబసభ్యులు కావచ్చు, బైటవారు కావచ్చు, ఎవరైనా సరే వదిలేస్తాను, క్షమించేస్తాను అనేది నేర్చుకోవాలి.

**3. ఫుల్‌ఫిల్‌మెంట్ (పూర్ణత్వము) :**

పూర్ణత్వాన్ని ఇచ్చేది పూర్ణిమకు ముందురోజు, పూర్ణిమ రోజు, పూర్ణిమ తర్వాత రోజు. ఈ మూడు మానవజాతికి అపూర్వమైన, శుభప్రదమైన రోజులు. గురువులతో అనుబంధాన్ని పెంచుకోవటానికి అనుకూలమైన రోజులు.

గురువుల ఆశ్రమాలలో ఉన్నా, వ్యక్తుల యొక్క అంతరంగాలు పెరగటంలేదు. పెరగని అంతరంగాలు ఉన్నవాళ్ళు ఏమౌతారూ? దూరమైపోతారు. ఆ స్థాయి అంతరంగమున్న వారు మాత్రమే గురువులకు దగ్గరౌతారు. గురువు యొక్క రాతి విగ్రహాన్ని మీరు పూజించగలరు కానీ, బ్రతికి ఉన్నటువంటి గురువును మీరు భరించలేరు. ఎందుచేతనంటే రాతి విగ్రహం మారదు. నువ్వు ఎలా వున్నావో అదీ అలానే ఉంటుంది. ‘యద్భావం తద్భవతి’ అన్నట్లు. నువ్వు ఎలా పూజ చేసుకోవాలనుకుంటున్నావో, అలా పూజ చేసుకోనిస్తుంది. ఏ సమయంలో చేసుకోదలిస్తే ఆ సమయంలో చేసుకోనిస్తుంది. **బతికి వున్న గురువు వున్నాడనుకోండి. ఆయన ఎప్పుడు ఏం చెయ్యమంటే అది చెయ్యాలి. అలా చేసే వాడి దగ్గరికే వెళ్తాడు. నీ ఇష్టం వచ్చినట్లుగా, నీ మూడ్‌ని బట్టి చేయడం అనేది జీవించివున్న గురువు దగ్గర చెల్లదు. సమస్య ఎక్కడ వస్తుందంటే జీవించి**

**వున్న గురువుతో పాటు మీరూ ఎదగాలి. అలా మీరు ఎదగలేకపోతే రెండు జరిగే అవకాశాలుంటాయి. ఒకటి ఆ గురువు ఆశ్రమం నుండి మీరు దూరమౌతారు. లేకపోతే ఆ గురువే వెళ్ళిపోతాడు. చివరకు శరీరాన్నే వదిలేస్తాడు.**

గురువు దగ్గర క్షమ, ఓర్పు అనే రెండు లక్షణాలు పరిపూర్ణంగా వుంటాయి కనుకనే ఈ జాతి ఇంకా తన మనుగడను కొనసాగిస్తున్నది. ఫర్‌గివ్, ఫర్‌గెట్ అనేవి గురువుల దగ్గర పుష్కలంగా వుంటాయి. వాటిని మీరు మీ సొంతం చేసుకోవాలి. ఈ పూర్ణిమతో మీరు ఆ రెండు లక్షణాలను సొంతం చేసుకొని సాధన చెయ్యాలి.

1. మర్చిపోవాలి: ప్రతి రోజూ రాత్రి పడుకునే ముందు, మీరు ఇతరులకు చేసిన మంచిని మర్చిపోండి. పదిమందికీ చెప్పుకోవద్దు. నా వల్ల ఇంతమందికి మంచి జరిగింది, నేను అంత చేశాను ఇంత చేశాను అనేది మర్చిపోవాలి.

2. క్షమ: ఆ రోజు మిమ్మల్ని ఎవరైనా బాధించి వుంటే వాళ్ళని, అంటే మీరు కష్టపడటానికి, దుఃఖపడటానికి కారణమైన వాళ్ళను క్షమించెయ్యండి. 'ఎట్టి పరిస్థితులలోనూ వాళ్ళపై కోపం తెచ్చుకోను' అని గట్టిగా నిర్ణయం తీసుకోవాలి.

తరువాత లలితాసహస్రనామ పారాయణ చేయించారు. ఇంతకు ముందు చెప్పిన క్షమించటం, మర్చిపోవడమనే మానసికస్థితినే లలిత అంటారు. ఈ స్థితికి రెండు ఆయుధాలు ఉన్నాయి. ఒకటి క్షమించటం, రెండవది మర్చిపోవటం. క్షమించటాన్నే పాశము అంటారు. మర్చిపోవటాన్ని అంకుశము అంటారు. లలితా సహస్రనామాలలో "రాగస్వరూప పాశాఢ్యా క్రోధాకారాంకుశోజ్వల" అనే మంత్రార్థము ఇదే!

## మాఘ పూర్ణిమ

పూర్ణిమ విశిష్టత గురించి చెప్పిన ప్రవచన సారాంశం. ప్రకృతిలో సంవత్సరానికి 12 పూర్ణిమలు, 12 అమావాస్యలు వస్తాయనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే ఒక్కొక్క పూర్ణిమకు ఒక్కొక్క ప్రాముఖ్యత వుంది. రాబోయే రోజులలో పూర్ణిమలు చాలా ప్రముఖపాత్రను వహిస్తాయని జ్వాలాకూల్ మహర్షి చెప్పారని ఇంతకు ముందే చెప్పడం జరిగింది.

పూర్ణిమ అర్థమైపోతే బుద్ధత్వం ప్రాప్తిస్తుంది. మన ధ్యానం బుద్ధత్వం వైపుకు వెళ్ళాలి. అది నాలుగు రకాలైన పద్ధతుల్లో చాలా స్పష్టంగా చెప్పబడింది. ఈ విద్య నేర్చుకోవాలనుకునే వారిని ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థి మరియు జ్ఞానులు అంటారని భగవద్గీతలో చెప్పబడి ఉంది. ఈ నలుగురు ఎలా వుండాలంటే

**ఆర్తులు:** వీరు దైవాన్ని ధ్యానిస్తారు. కష్టం తీరాక కృతజ్ఞత చెప్తారు, అంతే. కుంతీదేవి, గురుదేవుల కంటే ముందుగా పంచవీరభద్ర సాధన చేసి పంచ పాండవులను పుత్రులుగా పొందింది. అలాంటి కుంతీదేవి శ్రీకృష్ణుణ్ణి ఏమని ప్రార్థిస్తుందంటే

“హే కృష్ణా! నాకెప్పుడూ కష్టాలే ఇవ్వు. అప్పుడే సదా నిన్ను తల్చుకుంటుంటాము”అని. కష్టం అనేది వుంటేనే ఆర్తితో భగవంతుణ్ణి లేదా గురువుని పిలుస్తాము. ఆ కష్టం తీరాక – దానికి తగిన కృతజ్ఞత ఏ స్థాయిలో చూపించాలో, ఆ స్థాయిలో చూపించాలి. ఈ శరీరాన్ని పొందాము. అవయవాలన్నీ సవ్యంగా ఉన్నాయి. సరిగ్గా ఆలోచించగలుగుతున్నాము. వీటికి మనం భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పాలి. నిరంతరం చెప్పాలి.

నాలెడ్జ్ + టెక్నాలజీ = జ్ఞాన, విజ్ఞానయోగం. ఆర్తి వున్నవాళ్ళు ఈ జాన్ణ,విజ్ఞానాలను నేర్చుకోటానికి ప్రయత్నిస్తారు.

ఆర్తి – నిజమైన ఆర్తి వున్నవాళ్లు పూర్ణిమనాడు శ్రద్ధతో కృతజ్ఞత చూపించాలి. మనకింత జ్ఞానాన్ని ప్రసాదించిన గురుదేవులకు మనం ఎంతో కృతజ్ఞతను చూపించాలి.

**జిజ్ఞాస:** జీవితంలో ఏదో ఒకటి నేర్చుకోవాలనే జిజ్ఞాస వుండాలి. ఆ జిజ్ఞాస వున్న వాళ్ళందరూ సైంటిస్ట్‌లు అయిపోయారు. ఐన్‌స్టీన్‌కు లెక్కలు రావు. అయినా చాలా గొప్ప శాస్త్రవేత్త అయిపోయారు. జిజ్ఞాస వల్ల విజ్ఞానశాస్త్రము అభివృద్ధి చెందింది. జిజ్ఞాసులకు ప్రకృతిలో కనిపించే ప్రతి వస్తువుని వివిధ కోణాల్లో పరిశీలించే దృష్టి కోణం, నమ్మకము ఉంటుంది. వారు దానిని తెలుసుకోవాలని తీవ్రంగా ప్రయత్నం చేసి దానిని సాధిస్తారు.

**అర్థార్థి:** సూర్యునికి 24 కళలు, చంద్రునికి 16 కళలు ఎందుకుండాలి, దీని అర్థమేమిటి అంటే గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలు = 12 పూర్ణిమలు+12 అమావాస్యలు. ప్రకృతిలోని సృష్టిరహస్యాలన్నీ పూర్ణిమనాడే తెలుస్తాయి. ఇది అర్థమైతే ప్రకృతి నిన్నెక్కడ వుంచిందో అదే నీకు

సరైన స్థానమని అర్థమౌతుంది. అంతకంటే మంచిచోటు నీకింక్కెడా దొరకదు. దీనినే గీతలో శ్రీకృష్ణుడు 'కరిష్యే వచనం తవ', అంటారు. అర్థార్థి ఎప్పుడూ, ఏ పనినైనా తెలుసుకొని చేస్తాడు. నీ వెనుకన ఉన్న ఆ దివ్యచేతనత్వమే నీ చేత అన్నీ చేయిస్తుంది. అర్జునునిచేత శ్రీకృష్ణుడు యుద్ధం చేయించినట్లు. దివ్యదర్శనం కూడా పూర్ణిమనాడే జరుగుతుంది.

**జ్ఞాని:** పై ముగ్గురు భగవంతుణ్ణి ప్రార్థిస్తే భగవశ్శక్తి జ్ఞానిని ప్రార్థిస్తుంది. గీతలో శ్రీకృష్ణుడు 'జ్ఞాని నాకందరికంటే ప్రియమైనవాడు' అని చెప్తాడు. పూర్ణిమనాడు ఆ జ్ఞానం దిగుతుంది.

ఒంగోలు గీతా మందిరంలో ఏడు రోజుల పాటు, ఈ క్రింద ఇవ్వబడిన నవవిధ భక్తులను శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యమాత్మ నివేదనం॥ ఈ శ్లోకాన్ని **గీతాజ్ఞాన యజ్ఞాల ద్వారా ఎంతో అద్భుతంగా వివరించారు.**

## హైదరాబాదులో శరన్నవరాత్రులలో గాయత్రీ మహావిజ్ఞాన్ సాధనా శిబిరము

మాస్టర్‌గారి తమ్ముడు శ్రీవిశ్వనాథ్‌గారు హైదరాబాదులో 2003 అక్టోబరు 5వ తేదీనుండి గాయత్రీ మహావిజ్ఞాన్ సాధనా శిబిరమును ఏర్పాటు చేసారు. మాస్టర్‌గారు ఈ సాధనా శిబిరములో గాయత్రీ మంత్రముపై ఇచ్చిన ప్రవచనములు సాధకుని అంతరంగపులోతులను ఎంతో సున్నితంగా స్పృశించాయి. వారిలోని చైతన్యాన్ని సైతం తట్టిలేపి వారిని కార్యోన్ముఖులను చేస్తాయనేది సత్యం. భారతదేశములో ఎంతోమంది గాయత్రీ మంత్రాన్ని జపించినప్పటికి దానికి తగిన మార్పులు వ్యక్తులలోను సమాజములోను కనిపించట్లేదు. దానికి కారణం ఒకటి ఆచరణ లోపం, రెండవది యజ్ఞము చేయకపోవడం. **గాయత్రీ మంత్రము-యజ్ఞము ఒక యుగ్మము, ఒక జంట.** అవి రెండూ కలుపుకుంటేనే ఋషులు చెప్పిన ఫలితాలను మనం సంపూర్ణంగా పొందగలం. వేదమాత గాయత్రీ గురించి వివరిస్తూ వేదజ్ఞానంలోని నాలుగు భాగాలను గురించి, ధర్మానుసారము ఏర్పడిన వర్ణవ్యవస్థను గురించి అతి సాధారణ భాషలో ఇలా చెప్పారు.

1. ఋక్ - శుభము - బ్రాహ్మణులు - తూర్పు
2. యజుర్ - ధైర్యము - క్షత్రియులు - దక్షిణ
3. సామ - వినోదము - శూద్రులు - పశ్చిమ
4. అథర్వ - సంపద - వైశ్యులు - ఉత్తర

జీవితములో మీకు ఏది కావాలో ఆ దిశను ఉపయోగించుకోవాలి. ఋషులు అందించిన వాస్తు, జ్యోతిష, వేదవిజ్ఞానములను శాంతిమయ జీవనానికి ఎలా ఉపయోగించుకోవాలో సశాస్త్రీయముగా తెలియచెప్పారు. ఆ సాధనా శిబిరములో చివరి రోజున యజ్ఞోపవీత, అన్నప్రాశన, వివాహ సంస్కారములను చేయించారు. ప్రొజెక్టర్‌లో స్లైడ్స్ వేసి ఎంతో అధునాతన శైలిలో సాధనా శిబిరాన్ని నిర్వహించారు.

## పరమ గురువులు - వారి కార్యక్రమాలు

పూజ్యశ్రీ మాస్టర్‌గారు గొప్ప థియోసఫిస్ట్. బ్లావెట్స్కీ మాత రచనలను జ్వాలాకూల్ మహర్షిగారి రచనలను, వారు ఔపోసన పట్టారనే విషయం లోక విదితమే! వారి దయ వలన మనకు థియోసఫీకి సంబంధించిన కొందరు పరమ గురువుల పేర్లు, వారి ఫోటోలు కూడా లభించినవి. అయితే పరమగురువులకు ఫోటోలతో, ఆరాధనలతో పని లేదు. బ్రహ్మవిద్యాప్రాప్తియే వారి లక్ష్యము, వారి ప్రయోజనము. ఈ దివ్యజ్ఞాన సంస్థ ద్వారా అనేక మంది పరమగురువులు సూక్ష్మకక్ష్యలో పని చేస్తూనే వుంటారని, సందర్భం వచ్చినప్పుడల్లా శ్రీశ్రీ మాస్టర్‌గారు వారి గురించి చెప్తుండేవారు. అలా పరమగురువుల గురించి చెప్తున్నప్పుడు ఒక విచిత్రమైన దివ్యతేజో మండలం వారిని ఆవరించి, ఒక అలౌకికమైన డివైన్ డిసెంట్ కనబడుతుండేది.

ముఖ్యంగా శ్రీశ్రీ మాస్టర్‌గారి ప్రవచనాలలో ముగ్గురు పరమగురువుల కార్యక్రమాల వివరణ తరచుగా వినడం జరిగేది. అందులో మొదటగా మాస్టర్ మౌర్య, రెండవవారు కుతుహుమీ లాల్‌సింగ్, మూడోవారు జ్వాలాకూల్ మహర్షి. వారి ప్రవచనాల సారాంశముతోపాటు వారి గురించి మరికొన్ని విషయాలను అధ్యయనం చేసి వారికి సంబంధించిన కొన్ని ముఖ్య విషయాలను సంక్షిప్తంగా పరిచయం చేయడం ఇక్కడ జరిగింది.

## మాస్టర్ మౌర్య

**మాస్టర్ మౌర్య** : వీరు రాజపుత్రుల వంశంలో జన్మించారు. వీరు అనేక సంవత్సరాలపాటు భారతదేశపు వ్యవహారములలో అధికారయుతమైన స్థానమునందు పనిచేసారు. విశేషించి రాజపుత్ర సంస్థానాధీశులు. వీరి ఆధ్యాత్మిక సోదరులు కుతూహుమీగారు. వీరిద్దరూ హిమాలయాలలోని “షిగాట్సి” (దానినే శ్రావస్తి అని కూడా అంటారు) అనే ప్రదేశంలో నివశిస్తున్నారు. అక్కడ నివసిస్తున్న గ్రామీణ ప్రజలకు వారు సుపరిచితులు కూడా!

మాస్టర్ మౌర్యాగారు ఆజానుబాహువు, సహజ రాచరికపు లక్షణమైన హుందాతనంతో, గంభీరాకృతితో, నల్లని గడ్డముతో, దివ్యకాంతులు వెదజల్లే కనుదోయితో, తెల్లని దుస్తులతో, కిరీటములాంటి తలపాగాతో అతి నిర్మలంగా కనిపిస్తుంటారు. బహుమిత భాషే అయినా మంచి చమత్కారములు వారి ప్రవచనాలలో దొరలుతుండేవి. శ్రీ మౌర్యాగారు, కుతూహుమీగారు సమైక్య భావంతో అనేక శతాబ్దాలు పనిచేసారు. ఇంకా చేస్తూనే వున్నారు. వీరిరువురి నివాసములు ప్రక్కప్రక్కనే ఉండటం మూలాన సన్నిహిత, సాంగత్యములతో కార్యక్రమములు నిర్వహిస్తుంటారు.

మాస్టర్ **మౌర్యాగారు ఆధ్యాత్మిక ప్రథమరేఖ అయిన సంకల్పశక్తి – విల్‌పవర్‌కు సంబంధించిన వారు.** వీరు తమ కార్యక్రమాలలో చాలా భాగము మనువు ప్రణాళికకు సంబంధించినవే చేసేవారు. ప్రస్తుతము వారు మనువుతో సన్నిహిత సంబంధమును కలిగివున్నారు. అంతేకాదు – రాబోవు ఆరవ మూలజాతికి మాస్టర్ మౌర్యాగారే 'మనువు' అవుతారు. వారి శిష్యులలో అనేకమంది అమెరికా, ఐరోపా దేశములకు చెందినవారున్నారు. మేడం బ్లావెట్స్కీ గారిని బాల్యదశ నుండి అనేక పర్యాయములు విపత్కర పరిస్థితుల నుండి రక్షించినది వీరి అదృశ్యహస్తమే! ఆమె ద్వారా దివ్యజ్ఞాన సమాజమును స్థాపించి నూతన ధర్మమును, జ్ఞానమును ప్రపంచానికందచేసిన పరమ గురువులు వీరే. మానవజాతి ఉత్తమ పరిణామమునకు, అభ్యుదయమునకు అవసరమైన పరిస్థితులను వీరు ఏర్పరుస్తుంటారు. భౌతికకక్ష్యలో దూరదృష్టి, అంతర్జాతీయ సదవగాహన కల వివిధ దేశముల, జాతుల ప్రముఖ కార్యకర్తలపై వీరి ప్రభావము ఎంతగానో వున్నది. మానసిక కక్ష్యకు సంబంధించిన కొందరు పెద్ద దేవతలు మరి మూడు వర్గములకు చెందిన దేవదూతలు (ఏంజిల్స్) కూడా మాస్టర్ మౌర్యాగారితో మానసిక పరిస్థితులపై పనిచేయుటకు సహకరించు చున్నారు. వీరందరూ కలిసి చిన్నదేవతావర్గమునకు పుష్టిని చేకూరుస్తున్నారు.

మౌర్యాగారి ఆదేశానుసారము ప్రవర్తించుటకు విశేషమైన శిష్యగణములు అనేక దేశములలో పనిచేస్తున్నాయి. అనేక ఆధ్యాత్మిక గుప్త సంస్థల విషయములలో, ప్రపంచ ప్రముఖ రాజకీయ నాయకులతో, రాజనీతిజ్ఞులతో కలిసి మౌర్యాగారు పనిచేస్తున్నారు. వీరూ, మాస్టర్ కుతూహమీగారు అత్యంత ముఖ్యమైన కార్యకలాపములయందు నిమగ్నులైయున్నారు. అందుచేత వీరు తమ శిష్యులకు "డిక్టేషన్సు" ఇచ్చుటలేదు. వీరు, వీరి శిష్యులు చేపట్టిన అత్యంత విలువైన కార్యక్రమము ఒకటి యున్నది. అది :

1) మానవాళిలో సౌహార్ద్ర పూరకములైన సంబంధములను నెలకొల్పుట;

2) సవ్యమైన రాజకీయ చైతన్యమును కలుగచేయుట. తద్వారా అన్ని దేశాలవారు, జాతులవారు ఐకమత్యముతో మెలగునట్లు చేయుట;

3) వ్యక్తి స్వాతంత్ర్యమునకు రక్షణ కల్పించుట;

4) యుద్ధములు రాకుండా చేయగల అంతర్జాతీయ పరస్పర సహకార భావములను పెంపొందించుట.

5) నిస్వార్థము, నిర్మలములైన రాజకీయ పాలన ప్రవేశపెట్టుట అనేవి వారి లక్ష్యములు.

**ఇంకా చెప్పాలంటే శ్రీమద్భాగవతంలో చెప్పబడిన మనువు మహర్షి వీరే.** భవిష్యత్తులో రాబోయే మనువుగా అవతరించబోయేవారు వీరే! అని కొందరు మహనీయులు సెలవిచ్చియున్నారు.

## మాస్టర్ కుతుహుమీలాల్ సింగ్

వీరు పశ్చిమ దేశాలవారికి సుపరిచితులు. దేశ దేశములలో వీరి శిష్యులున్నారు. వీరి పూర్వీకులు భారతీయులే. వీరు జన్మతః కాశ్మీరు దేశానికి చెందినవారు. **వీరు 'ప్రేమ-ప్రజ్ఞ' (లవ్-విజ్‌డమ్) అనే ద్వితీయ రేఖకు చెందినవారు.** వీరు కాస్త బక్కపలుచగా ఉంటారు. మంచి పొడగరి. సొగసరి కూడా. చక్కని మేనిఛాయతో అందమైన గడ్డంతో, సువర్ణ కేశపాశములతో అఖండమైన జ్ఞానమును, ప్రేమను వర్షించు అందమైన కనుదోయితో హుందాగా కనిపిస్తుంటారు. విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించారు. నిగూఢమైన అనుభవజ్ఞులు, విద్యావేత్తలు, అనర్గళముగా ఆంగ్ల భాషను మాట్లాడగల వాక్పటిమ గలవారు. పరమగురువుల బృందములోని అతిపెద్దవారలలో వీరూ ఒకరు. వేదాంత తత్వములకు పరిపుష్టిని చేకూర్చటానికై విస్తృతముగా వీరు కృషి చేస్తున్నారు. సకలమానవుల హృదయాలలో నివాసితమై వున్న ప్రేమను ఉద్దీపింపచేయుట, మానవజాతిలోని ప్రజ్ఞను జాగృతం చేసి, విశ్వమానవ సౌభ్రాతృత్వమును స్థాపించు కార్యక్రమాలను వీరు చేపట్టారు. వీరు ఇంకా కొంతమంది పరమ గురువులతో కలిసి ప్రాక్పశ్చిమ సమన్వయమునకు పనిచేయుచున్నారు.

షిగాస్తిలో మాస్టర్ మౌర్యాగారి ఇంటి ప్రక్కనే వీరి నివాసస్థలము. అయితే మాస్టర్ల ఆశ్రమములు భౌతిక కక్ష్యలో ఉండవు. బుద్ధి కక్ష్యలో వుంటాయి. వీటినన్నింటినీ కుతుహుమీగారు పర్యవేక్షిస్తుంటారు.

వీరికి చేదోడువాదోడుగా మాస్టర్ జ్వాలాకూల్‌గారు వుంటుంటారు. ఐదుగురు మాస్టర్లలో వీరి ఆశ్రమము ప్రముఖమైనది. మాస్టర్లనబడేవారు ఎంతగా పురోగమిస్తుంటారో అంతగా వీరి ప్రజ్ఞ ప్రసరిస్తూవుంటుంది. నిర్ణీతకాలములలో మాత్రమే వారు శంబళతో కలిసి పనిచేస్తుంటారు. వీరు పెద్దవారు కనుక వారి ఆశ్రమము శంబళ ప్రజ్ఞతో వెల్లివిరుస్తుంటుంది. ముఖ్యంగా వీరు మానవాళి చిత్తప్రవృత్తులను సంస్కరించి ఉదాత్తమైన రీతిలో రూపొందించటంతో పాటు యావత్ ప్రపంచంలో విద్యావిధానమును పెద్దపెట్టున సంస్కరించవలసిన పనిని స్వీకరించారు.

వీరిరువురి మార్గదర్శనముతో వీరి శిష్యుడైన మాస్టర్ జ్వాలాకూల్‌గారు కొంత కార్యక్రమమును తమ ఆశ్రమముద్వారా నిర్వహిస్తున్నారు. మాస్టర్ మౌర్యాగారు, మాస్టర్ కుతూహుమీగార్లు ఆంతరంగిక కార్యకలాపాలతో మునిగివుండుటవలన వీరు తమ శిష్యులకు నేరుగా శిక్షణ నిచ్చుటలేదు. **శ్రీమద్భాగవతములో చెప్పబడిన మరువు, దేవాపి మహర్షులు వీరేనని శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యగారు తమ గ్రంథాలలో పరిచయం చేశారు.** మాస్టర్ జ్వాలాకూల్‌గారి గ్రంథ రచనకు ఎన్నిక చేయబడిన ఎలీస్–ఎ–బెయిలీ శ్రీ కుతూహుమీగారి శిష్యురాలే. మాడం బ్లావెట్స్కీకి ఇంగ్లీష్ భాషలో చక్కటి తర్ఫీదునిచ్చి తీర్చిదిద్దినదీ వీరే. వీరు అత్యంత సరసప్రియులు. మృదుహాస్య సంభాషణ వీరి ఆభరణం.

ఇక్కడ ఒక యదార్ధ సంఘటన మీకు తెలియపర్చాలి. మాస్టర్‌గారు గుంటూరులో సుకృత విల్లాలో వుంటున్న రోజులు. అప్పుడు వారి లైబ్రరీలో చాలా తక్కువ పుస్తకాలుండేవి. ఒక రోజున వాటినన్నింటిని సర్దుతున్న సమయంలో ఎ4 సైజులో వున్న బైండ్ పుస్తకం చాలా పాతది కన్పించింది. తెరిచి చూడగా అందులో వున్న సమాచారమంతా ఇంగ్లీష్‌లో టైపు చేయబడి వుంది. మొదటి పేజీలో గడ్డాలున్న ఒక అందమైన వ్యక్తి ఫోటో వుంది. 'కుతూహుమీ' అని వ్రాసి వున్నది. ప్రక్కనే ఒకవాలు కుర్చీలో మాస్టర్‌గారు కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు. ఆ ఫోటో చూపించి "ఈ ఫోటోలో వున్నది ఎవరు, మాస్టారూ" అని అడగ్గా, ఎన్నో జన్మలనుంచి ఈయనే నా గురువు. కుతూహుమీ లాల్‌సింగ్ – అని చెప్తూ పుస్తకాన్ని తీసేసుకున్నారు. ఆ తరువాత ఎప్పుడు పుస్తకాలు సర్దుతున్నా ఆ పుస్తకం మాత్రం కనబడలేదు. అప్పట్లో అంతగా వారి గురించి తెలియలేదు కానీ తర్వాత కాలంలో మాస్టర్‌గారు ఈ ముగ్గురు మాస్టర్లను గురించి సమయం వచ్చినప్పుడల్లా చెప్తుండేవారు. వారే మాస్టర్ మౌర్యా, మాస్టర్ కుతూహుమీ, మాస్టర్ జ్వాలాకూల్‌గార్లు. మాస్టర్‌గారికి

ఈ ముగ్గురు అంటే ఎంతో ఇష్టం. సందర్భం వచ్చినప్పుడల్లా వీళ్ళ గురించి ఏదో ఒక కొత్త విషయాలను చెప్తూనే వుండేవారు. అందుకే వారి గురించి వ్రాయటం సముచితమనిపించి సంక్షిప్తంగా వారి పరిచయములను ఇక్కడ పొందుపరచుట జరిగింది.

## శ్రీ జ్వాలాకూల్ మహర్షి

వీరు రెండవ రేఖయైన 'ప్రేమ – ప్రజ్ఞ' శాఖకు సంబంధించిన కుతూహుమీ గారి అనుంగు శిష్యులు. కుతూహుమీగారి కుటీరమునకు చేరువలోనే వేరొక చిన్న కుటీరమునందు వీరు వుంటారు. వీరి ఆశ్రమము కుతూహుమీగారి ఆశ్రమానికి అనుబంధమైనది. మాస్టర్ మౌర్య, కుతుహుమీ గార్లు అత్యంత ముఖ్యకార్యక్రమాలకు తమ సమయాన్ని వినియోగించవలసినప్పుడు – వారి వారి శిష్యులకు జ్వాలాకూల్‌గారే తమ ఆశ్రమములోనే శిక్షణనిస్తుంటారు. అంతేకాక **శ్రీ జ్వాలాకూల్‌గారు ప్రపంచ విద్యా సంస్కరణ కార్యక్రమమునందు కూడా కొంత బాధ్యతను నిర్వహిస్తుంటారు. విశేషంగా చెప్పాలంటే వీరు ఆఖండ విద్వజ్ఞులు. సౌర కుటుంబములోని గ్రహసంబంధిత గురుపరంపరల గురించి, మిగతావారికంటే వీరికి క్షుణ్ణంగా తెలుసు. ప్రపంచములోని అనేకమైన పెద్ద పెద్ద పరిశోధనాశాలలలో సత్యాన్వేషణ చేసేవారికి వీరు అజ్ఞాతముగా సహకరిస్తుంటారు. బాధితులను ఊరడించి, వారి బాధల నుండి వారికి ఉపశమనము కలిగించేందుకు తపన పడే ప్రపంచ సేవకు లకు వీరు సదా సహకరిస్తుంటారు. రెడ్ క్రాస్ వంటి సేవా సంస్థలకు చక్కటి సహకారాన్ని అందిస్తుంటారు.** మానవాళికుండే భౌతిక ఆదివ్యాధులకు చికిత్స చేయు కొందరు దేవతలతో కలిసి వారు పని చేస్తుంటారు.

### కార్యక్రమాలలోని ప్రధానాంశాలు :

వీరు తమ ఆశ్రమమునందు ఉంటూనే ప్రపంచములోని వివిధ ప్రాంతములవారిని ప్రభావితులను చేస్తున్నారు. తమ రచనల ద్వారా, శిష్యబృందాల ద్వారా అనేకానేక ప్రజలతో సత్సంబంధాలను పెంపొందించుకుంటూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. "నవీన కాలపు వేదము" అనబడే గుప్తవిద్య 'సీక్రెట్ డాక్ట్రిన్' లోని చాలా భాగమును మేడమ్ బ్లావెట్స్కీ గారికి వీరే స్వయంగా చెప్పి వ్రాయించారు. ఇంకా దీనికవసరమైన చిత్రపటములను కూడా వీరే చూపించారు. 1919 సంవత్సరం నవంబర్ 19 తేదీ నుండి ఎలీస్–ఎ–బెయిలీ గారి ద్వారా అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను వెలువరించారు. అవి అన్నియు వారి అనుభవము నుండి ఆవిర్భవించినవే!

వీరు ముఖ్యంగా రెండు కార్యక్రమాలను గురించి చెప్పటం జరిగింది.

1) ప్రపంచ నూతన సేవక బృందము “ది న్యూ గ్రూప్ ఆఫ్ వరల్డ్ సర్వర్స్’. ఇందు అనేక దేశములవారు ప్రపంచ శ్రేయస్సుకై రాత్రీ, పగలు పనిచేస్తున్నారు. ఈ బృందము అటు గురుపరంపరకు ఇటు మానవాళికి మధ్య వారధిగా పనిచేస్తున్నది.

2) ఇంతేకాక గురుపరంపర కార్యక్రమాలను వీరు సదా నిర్వహిస్తూనే వున్నారు. గురుబృందములో ఐదుగురు కలిసి ఒక కమిటీగా ఏర్పడి ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణ, ఆధ్యాత్మిక బోధనాలయముల సంస్థాపనకై విశేషంగా పనిచేస్తున్నారు. ఆ కమిటీకి కార్యదర్శిగా మాస్టర్ జ్వాలాకూల్‌గారు వ్యవహరిస్తున్నారు. వీరు ఇంతకు ముందు పాశ్చాత్య శరీరములు రెండింటిని ధరించియున్నారు. అయినప్పటికి వారి పోకడలేమిటో ఇంకను అర్థం కాలేదని చమత్కారంగా చెప్తుంటారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు కూడా పరమగురుపరంపరకు చెందినవారే అయినప్పటికీ సామాన్య మానవుని వలెనే జీవించి, ఆదర్శప్రాయంగా అందరికీ స్ఫూర్తినిస్తూ, నిరంతరం గురుప్రణాళికలకు అంకితమై పని చేస్తుండేవారు. సప్తర్షి ఆశ్రమంలో జ్వాలాకూల్‌మహర్షి వ్రాసిన “ఏ ట్రీయటైజ్ ఆన్ వైట్ మ్యాజిక్ (A Treatise On White Magic)” అనే పుస్తకంపై ప్రవచనాలను చెప్తుండేవారు. **మాస్టర్ గారికి జ్వాలాకూల్‌గారి రచనలంటే ఎనలేని అభిమానం.** ఆ రోజు మాటల సందర్భంలో, వచ్చే సంవత్సరం నాటికి **మాస్టర్** డి.కె. బుక్స్‌లో కొన్నింటినైనా తెలుగులోకి తేవాలని చెప్పటం జరిగింది. ఇ.కె. గారి రచనలలో కూడా మనకు వారి గురించిన విషయాలు బోధపడతాయి.

మేడమ్ బ్లావెట్‌స్కీ వ్రాసిన “సీక్రెట్ డాక్ట్రిన్” లాగానే “ది వాయిస్ ఆఫ్ సైలెన్స్ (The Voice Of Silence)", “ఐసిస్ అన్ వీల్డ్ (Isis Unveiled)” అనే పుస్తకాలన్నీ వివరాణాత్మకములు, ప్రయోగాత్మకములు, మరియు నిరూపణాత్మకములని మాస్టారు చెప్తారు. సీక్రెట్‌డాక్ట్రిన్‌లోని మొదటి ఏడు స్టాంజాలపై మాస్టర్‌గారిచ్చిన ఉపన్యాసాలను పుస్తకరూపంలో ‘గుప్తవిద్య’ అనే పేరుతో ఆడ్డరోడ్డులో జరిగిన 2400 కుండీల యజ్ఞంలో ఆవిష్కరించడం జరిగింది.

**ఇంతమంది మహాత్ములు మానవజాతిని ఉద్ధరించటానికి ఇంతలాగా కృషి చేశారు.** అతి సామాన్యమైన మనకు ఇంతటి మహత్తరమైన విజ్ఞానాన్ని ఇన్ని పుస్తకముల ద్వారా అందించిన శ్రీశ్రీ మాస్టర్‌గారికి మనం ఎన్ని ధన్యవాదాలు చెప్పాలి? ఎంతటి సత్కారాలను చేసి ఉండాల్సింది?

## సోల్ అండ్ ఇట్స్ మెకానిజమ్

ఇంతటి చరిత్ర గలిగిన ఈ జ్వాలాకూల్ మహర్షిగారి పుస్తకాలను ఆంధ్రలోకానికి అందించే ప్రయత్నంలో అనితర సాధ్యమైన కృషిని మాస్టర్‌గారు చేయవలసివచ్చింది. జ్వాలాకూల్ మహర్షి భారతీయ సంస్కృతికి, ఆధారభూతమైన గాయత్రి మంత్రములో గల 24 అక్షరాలకు వ్యాఖ్యగా 24 అత్యద్భుతమైన పుస్తకాలను ఎలీస్-ఎ-బెయిలి ద్వారా వ్రాయించారు. ఆధ్యాత్మిక విద్యకు అవి ప్రామాణిక గ్రంథాలుగా విరివిగా ప్రాచుర్యంలోకి వచ్చిన విషయం మాస్టర్‌గారి ద్వారా మనం అనేక సందర్భాలలో విని వున్నాము. ఇంగ్లీషు భాషలో అంతటి మహాద్గ్రంథాలను చదవి అర్థం చేసుకోగల సత్తా ఏ కొద్దిమందికో ఉంటుంది.

అందుచేత వాటిని తెలుగులోకి తీసుకు వచ్చే ప్రయత్నంలో భాగంగా శ్రీ వేదమాత గాయత్రీ అనుగ్రహపీఠం ఒంగోలులో, ఈ మహావిద్యకు శ్రీకారం చుట్టారు. ఒక రోజు ఉదయం 'సోల్ ఎండ్ ఇట్స్ మెకానిజం చెప్తాను' అన్నారు. తక్షణమే అందరికీ ఫోన్లు చేశాం. ఉదయం 10 గంటలకు అనుగ్రహపీఠంలో 'సోల్ అండ్ ఇట్స్ మెకానిజమ్' అనే పుస్తకం తీసుకుని, ఇంగ్లీషులో ఉన్న దానిని చదువుతూ ఒక్కొక్క పేరాకి వివరణ చెప్పటం మొదలుపెట్టారు. ఒక్క భోజన విరామం మాత్రమే ఇచ్చారు. ఉదయం 10 గంటలకు నుండి సాయంత్రం 5 గంటల వరకు ఏకబిగిన ఈ పుస్తకంపై ప్రవచనాలను మూడు రోజులపాటు చెప్పారు. మహత్తరమైన ఆ విజ్ఞానం వినడం అనేది ఎన్ని జన్మల పుణ్యమో అనిపించింది. విన్న మనకే కాదు ఈ జ్ఞానాన్ని అందరికీ వెంటనే అందించాలనే తపనతో ఆ ప్రవచనాలను లిఖితపూర్వకంగా వ్రాసి ఒక పుస్తక రూపంలో దానిని శ్రీమతి లక్ష్మీరాజగోపాల్, వల్లీశ్రీనివాస్ వాళ్ళు తయారుచేశారు. శ్రీరంగనాధ్‌గారు, మాస్టర్‌గారి సూచనలమేరకు "జీవాత్మ-దాని పరికరాలు" అనే పేరుతో ఆ పుస్తకాన్ని అచ్చు వేయటం జరిగింది. ఇదంతా శ్రీశ్రీ మాస్టర్‌గారి అవ్యాజకరుణతో మనకు ప్రసాదించిన జ్ఞానామృతం. ఆ అమృతాన్ని గ్రోలి అమరులమవ్వాలనేదే వారి ఆశయం. జీవాత్మ-దానిపరికరాలు అన్న పుస్తకంలో ఏముంది? మాస్టర్‌గారు దాని గురించి ఎందుకంత గొప్పగా చెప్పారు అన్నదానికి సాధకులైన వారికి సంక్షిప్తంగా నైనా దానిని గురించి కొంచెం పరిచయం చెయ్యాలనిపించింది.

'జీవాత్మ-దాని పరికరాలు' అనే పుస్తకంలో భౌతికశరీరంలో వున్న గ్రంధులకు-సూక్ష్మ శరీరంలో గల చక్రాలతో ఉండే అవినాభావ సంబంధాన్ని అత్యంత సున్నితంగా అందరికీ

అర్థమయ్యేలా అద్భుతంగా వివరించారు. సాధనలో ఋషులు చక్రాల క్రమమును – విశుద్ధి నుంచి అనాహతం, అనాహతం నుండి మణిపూరకం, అక్కడి నుండి స్వాధిష్ఠానం, స్వాధిష్ఠానం నుండి మూలాధారం అని పై నుండి క్రిందికి చెప్తారు. అలా వుంటుంది వాటి రచన.

**ముందుగా విశుద్ధి:** విశుద్ధి అంటే వాక్. వాక్ ద్వారా నామపారాయణ జరగాలి. లలితా సహస్రనామాల్లో "నామ పారాయణ ప్రీతా"అనే నామాన్ని గమనిస్తే అర్థమౌతుంది. విశుద్ధి అంటే వాక్ ద్వారా నిరంతరం భగవన్నామ స్మరణ జరగాలి. ఎవరైనా సరే విశుద్ధిని సరిగ్గా ఉపయోగించుకో గలిగితే –

1) వారు చెప్పిన దానిని అందరూ చేస్తారు.

2) గురువుకాశక్తి ఉంటుంది. కనుక ఆయన అన్నది వెంటనే జరిగిపోతుంది.

3) వారి వాక్కుకి విలువ వుంటుంది. కనుకనే ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులను చూస్తే – వారికి విశుద్ధి జాగృతమైనట్లేగా! మానవ జాతికి భగవంతుడిచ్చిన గొప్పవరం – వాక్‌శక్తి. అందుచేత నామ సంకీర్తన, జపం, వీలైనంత ఎక్కువ చేస్తే విశుద్ధి జాగృతమౌతుంది. మీకు సుఖాలు వచ్చాయి అంటే మీరు విశుద్ధి చక్రంలోకి వెళ్తున్నారని అర్థం. దీని పరాకాష్ఠగా ఆదిత్యహృదయ పారాయణ చెయ్యడం చాలా మంచిది. రాముడు ఆదిత్యహృదయాన్ని చక్కగా ఉపయోగించుకున్నాడు

**రెండవది అనాహతం:** స్పర్శ అనాహతానికి ప్రతీక. స్పర్శలోని దివ్యత్వాన్నివ్వగలిగే నేర్పును అందరూ సాధించవచ్చు. ఆ దివ్యస్పర్శ జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గర, శ్రీమాతామిత్రా దగ్గర, మాతా భగవతీదేవిశర్మగార్ల దగ్గర అపారంగా ఉన్నది. స్పర్శ లేకుండా ఎదుగుదల అనేది అసంభవం. **ఆ స్పర్శ రోగ నివారణకు చాలా బాగా పనిచేస్తుంది.**

భైరవి బ్రాహ్మణి స్పర్శ వలన శ్రీరామకృష్ణపరమహంస – శారదామాతలోని తల్లిని దర్శించగలిగారు. తల్లి స్పర్శ బిడ్డల ఎదుగుదలకు ముఖ్యకారణం. **అనాహతం జాగృతమైన వ్యక్తి ప్రతి పనిని సమర్థిస్తాడే గాని విమర్శించడు.** ఆకాశతత్వం నుండి వాయుతత్వం అవకాశం తీసుకొని ఒక మెట్టు దిగేసరికి స్పర్శగా రూపొందింది. ఈ స్పర్శ మళ్ళీ మూడు రకాలుగా చెప్తారు. (1)సృజనాత్మక స్పర్శ, (2) పరిపాలనాత్మక స్పర్శ, (3) లయాత్మక స్పర్శ

**మూడోది మణిపూరకచక్రం** : ఇది రూపానికి చెందినది. మాటలకు రూపకల్పన చేసేది, స్పర్శకు రూపకల్పన చేసేది మణిపూరక చక్రమే. పై మూడు చక్రాలలో జీవిస్తే వారు మహాపురుషులే. ఈనాడు మానవజాతి క్రింది చక్రాల్లో జీవిస్తోంది. కష్టాలు వస్తే ఏ మాత్రం భరించలేరు. క్రింది చక్రాల్లో పశువులు జీవిస్తుంటాయి. కాబట్టి **ఎవరికి వారు ఏ చక్రాలలో జీవిస్తున్నారనేది ప్రతి క్షణం గమనించుకోవాలి.**

**నాలుగవది స్వాధిష్టానచక్రం:** ఈనాటి మనుషులు స్వాధిష్టానచక్రంలోనే జీవిస్తున్నారు. కోరికలు తీర్చుకోవటంతోటే వారి సమయం సరిపోతున్నది. **స్వాధిష్టానచక్రం జాగృతమైన వ్యక్తి లక్షణం, చెప్పింది చెప్పినట్లు టైముకి చెయ్యగలగటం. మరొకరు చేశారా, లేదా? అనేది ఉండకూడదు. ఎవరికివారు, తాము చేశామా, లేదా? చూచుకోవాలి.అంతే!**

**మూలాధారం : కష్టమైనా మనకిష్టమైతే చేస్తాము.** ఊపిరి సలపడం లేదు అంటే మీకిష్టం కాని పరిస్థితులు వస్తున్నాయని అర్థం. **గురువుల దగ్గరికెళ్తే కష్టాలు పోతాయా అంటారు. వాళ్ళ శక్తికి మీరు లొంగిపోతే మీ కష్టాలు ఖచ్చితంగా పోతాయి.**

1. మూలాధారం – వాసనలు – సుఖంగా ఉండాలనుకోవడం
2. స్వాధిష్టానం – అనుకున్నపనిని తక్షణమే చెయ్యటం – కష్టాలను ఓర్చుకోగలగడం
3. మణిపూరకం – రూపం – చూచేదృష్టి, సవ్యమైన దృష్టి కోణాన్ని అలవరుచుకోవడం
4. అనాహతం –స్పర్శ – స్పర్శలో దివ్యత్వాన్ని డెవలప్ చేసుకోవడం
5. విశుద్ధి – వాక్సంయమనం – సవ్యమైన వాక్కుతో మాట్లాడడం అలవాటు చేసుకోవాలి. దీనికి మౌనం చాలా అవసరం. వాక్శక్తి అభివృద్ధిచెందాలంటే దివ్యక్షేత్రాలకి వెళ్ళాలి. అక్కడుండే ఆ చేతనత్వాన్ని పరిపూర్ణంగా (ఓ స్పాంజ్ ఎలాగేతే నీటిని పీల్చుకుంటుందో అలా) అంతరంగంలోకి దింపుకునే ప్రయత్నం చెయ్యాలి. సిద్ధక్షేత్రాలకు వెళ్ళినప్పుడు, సమాధి మందిరాలకు వెళ్ళినప్పుడు, తీర్థయాత్రలకు వెళ్ళినపుడు ముఖ్యంగా మనస్సును ఏకాగ్రమొనరించుకొని ఆ దివ్యశక్తిని పరిపూర్ణంగా స్వీకరించే ప్రయత్నం చెయ్యాలి. అంతటి మహత్తరమైన జ్ఞానం గల ఈ ‘ జీవాత్మ–దానిపరికరాలు’ అనే పుస్తకాన్ని తెలుగులోకి

(జ్వాలాకూల్‌మహర్షిగారి పుస్తకాన్ని) అత్యంతసరళంగా ఆంధ్రలోకానికందించారు. దానిని చదివినట్లయితే చక్రాలకు సంబంధించిన అనంతమైన జ్ఞానాన్ని మనం పొందవచ్చు.

## అధ్యాయం-6
# దత్తుడు - స్మర్తుగామి

### దత్త క్షేత్రంలో గురుసత్తా ప్రణాళికలు :

అది 2004 జూలై నెల. శ్వేతద్వీపంలో శ్రీశ్రీ మాస్టర్‌గారు మేడ మీద గదిలో ఉన్నారు. ఒక రోజున ఉన్నట్లుండి మాస్టర్‌గారు 'నాకు ఒక బ్లాక్‌బోర్డ్, చాక్‌పీస్‌లు+డస్టర్ వెంటనే కావాలి' అన్నారు. తక్షణమే వారు కోరినవాటిని ఏర్పాటు చేయడం జరిగిపోయింది. మాస్టర్‌గారు ఎక్కడ వున్నా వారితో కనీసం 5,6 మంది ఉంటుంటారు. ఉదయం అల్పాహారం అయిపోతూనే ఆ ఉన్న వాళ్ళకే క్లాసు చెప్పడం ప్రారంభించారు. చాక్‌పీసు తీసుకొని బోర్డు మీద బొమ్మలు గీస్తూ క్లాసు మొదలుపెట్టారు. మాస్టర్‌గారు ఏ పని చేస్తుంటే దానికి తగిన బట్టలను ధరిస్తారు. అందుచేత ప్రతి రోజూ ఉదయం 8.30కి అల్పాహారం ముగించాక ప్యాంటు, షర్టు వేసుకొని కాలేజికి వెళ్ళినట్లే పైకి వెళ్ళేవారు. ఖచ్చితంగా 10 గంటల నుండి 12 గంటల వరకు క్లాసు చెప్పేవారు.

ఒకరోజు "నేను ఒక్కణ్ణే వెళ్తాను. మీరెవరూ రావద్దు. ఇవాళ మీకు ఛుట్టీ" అంటూ పైకి వెళ్ళారు. అలా వెళ్ళడం మాస్టర్‌గారికి చాలా మామూలు. సాధారణంగా 'పైకి ఎవరూ రావద్దు' అన్నారు అంటే ఆ రోజు ఆయన ఏ మహాత్ములను కలవడానికో, ఎవరితోనైనా ఏదైనా ముఖ్యమైన విషయమై భేటీ కావాలనుకుంటేనో అలా రావద్దని చెప్తుంటారు. శ్వేతద్వీపానికి ఎవరు వచ్చినా ఖచ్చితంగా ఆ నియమాన్ని పాటించవలసిందే! 'క్లాసుకు మీరు రావద్దు' అన్నారంటే – ఏ దివ్యాత్మలకో ఆ రోజు క్లాసు జరగబోతోంది అని అర్థమైపోయేది. ముఖ్యంగా యక్ష, నాగ, గంధర్వ స్థాయి దివ్యాత్మలకు చెప్పే క్లాసులు, వేర్వేరుగా వుంటాయి. ఎప్పుడు, ఏ రకమైన పని కావాలంటే ఆ రకమైన స్థాయీ వ్యక్తులకు ఆ రకమైన తరగతులు పైన చెప్తుండేవారు. అలాంటి తరగతులు నిర్వహిస్తున్నారు అంటే సాధనాత్మకమైన మలుపు ఏదో జరగబోతోందని నాకర్థమైంది.

ఆ రోజు జూలై 7వ తేది. ఉదయం అల్పాహారం తింటుండగా వేటపాలెం దత్తక్షేత్రం గురించిన ప్రస్తావన వచ్చింది. "అక్కడ సాధకుల నిలయం ఒకటి కట్టాలి. గురునిలయంలో కొన్ని మార్పులు చెయ్యాలి. 'గురుసత్తా' కార్యక్రమాలను రూపొందించటానికి తగిన ప్రణాళికలను విస్తృతంగా ప్రచారంలోకి తేవాలి. ఇదంతా చెయ్యటానికి ఈ రోజే మనం దత్తక్షేత్రానికి వెళ్ళిపోవాలి. చేయవలసిన పనులు చాలా వున్నాయి. ఆ పనులు అయిపోయేదాకా వేటపాలెంలోనే ఉండాలి, దానికి తగిన ఏర్పాట్లు చెయ్యి" అని చెప్పారు. ఇంక అంతే, సాయంత్రానికల్లా రెండు కార్లలో కావలసిన సామానంతా తీసుకొని దత్తక్షేత్రానికి బయల్దేరాం.

మరునాటి నుంచే వారనుకున్న పని కార్యరూపం ధరించింది. గురు సాంప్రదాయానికి ఆధారభూతమైన దత్తక్షేత్రంలో 'గురుసత్తా' ఫోటోలో గల సివివి + బ్లావెట్స్కీ, లాహిరీ మహాశయ + యోగానంద, అరవిందో+శ్రీమాత, శ్రీరామకృష్ణ పరమహంస + శారదామాత, శిర్డీసాయి + సత్యసాయి, శ్రీరామశర్మ ఆచార్య + మాతా భగవతీదేవీగార్లతో – 6 గ్రూపులు తయారుచేశారు. నిర్దిష్టంగా ఒక్కొక్క గ్రూపుకు మూడురోజుల పాటు సాధనా తరగతులు నిర్వహించటానికి ప్రణాళిక తయారు చేయించారు. ఏ గ్రూపుకు సంబంధించినవారు, నిర్ణీతమైన ఆయా తారీకులలో, ఆ తరగతులకు హాజరు కావాలి. అందరికీ ఫోన్ల ద్వారా వివరాలు చెప్పేయడం జరిగింది. ఈ ప్రణాళికలోని భాగంగా మొదటిగా **క్షిప్రప్రసన్న దత్తక్షేత్రాన్ని – నిత్యావతారదత్త క్షేత్రంగా ప్రకటించారు. ఎందుకంటే దత్తుడు, నిత్యావతారం కనుక.**

## దత్తుడు – నిత్యావతారం

"నీచైర్గచ్ఛత్యుపరిచ దశా చక్రనేమి క్రమేణ" అనేది సృష్టి రహస్యం. ఈ సృష్టిలో అనాది నుండి ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. సమాజంలో అధర్మం, అనాచారం, పెచ్చు పెరిగిపోయి, సమస్యల వలయంలో చిక్కుకుపోయి, దిశానిర్దేశం తెలియక బాధపడుతున్న జీవులను ఉద్ధరించడానికి అవతార పురుషులు దిగివస్తుంటారు. అధర్మాన్ని సాధ్యమైనంతవరకు నిర్మూలనం చేసి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పిన తదుపరి వారు ఈ భూమ్మీద నుండి నిష్క్రమిస్తుంటారు. ఈ భూమ్మీద మానవుడు నిరంతరం అనేక సమస్యలతో బాధపడుతూనే ఉంటాడు. అటువంటి వారిని ఉద్ధరించ టానికి ఎందరో మహాత్ములు అవతరిస్తూనే ఉన్నారు. అలాంటి వారిలో కొందరు అవధూతల

రూపంలోనూ, మరికొందరు సాధుసత్పురుషుల రూపంలోనూ అవతరించి మానవజాతికి అవసరమైన దిశానిర్దేశం చేస్తూ, సదా వారి శ్రేయస్సు కొరకే జీవిస్తారు. అజ్ఞానులైన జీవులు పడే లౌకిక సమస్యలను వారు తొలగిస్తూ పరమార్థం వైపు నడిపిస్తూంటారు. అలా దిగి వచ్చిన మహనీయులే శ్రీశిరిడీసాయి, అక్కలకోటమహారాజ్‌వారు, మాణిక్యప్రభువు, శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీనృసింహ సరస్వతీ స్వామి. వీరిని పంచదత్తావతారాలు అంటారు.

అయితే అవతారాలు రకరకాలు. వారు వేర్వేరు కళలతో ఉంటారు. కానీ దత్తుడు నిత్యావతారం. అన్ని మతాల వారు అవతారం మళ్ళీ వస్తుందనే అభిప్రాయంలోనే వున్నారు. కానీ అవతారాలు ఇంక రావు. ఖచ్చితంగా ఇంక అవతారాలు రావు అంటూనే మళ్ళీ ఆ అవతారం వస్తుందనే అంటున్నాము, ఎందుకూ అంటే ఆ అవతారం ఇక్కడే ఉంది. కానీ మనం గమనించుకోవటం లేదు. దత్త సాంప్రదాయాన్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తున్న మనం ఎంతో అదృష్టవంతులం.

**కృతజ్ఞతాభావాన్ని నిజంగా తెచ్చుకోగలిగితే ఎవరికైనా తప్పక దత్తదర్శనం అవుతుంది.**

ఎవరిపట్ల కృతజ్ఞతను కలిగివుండాలి? దత్తస్వామి పట్ల కృతజ్ఞత ఎలా ఉంటుంది? అనే విషయం తెలుసుకుంటే మనం ఎలా నడచుకోవాలో తెలుస్తుంది. దత్త సాంప్రదాయంలో మనమొక విషయాన్ని నిశితంగా గమనించాలి, ఇందులో తక్కువ ఆహారాన్ని ఎక్కువ మందికి పంచగలగడమనేది ప్రధానమైన విషయం. ఈ ప్రక్రియ ఎక్కడ జరిగితే అక్కడ దత్తుడున్నాడని అర్థం. దత్త సాంప్రదాయంలో నీ కర్మఫలం – నీ వైపుకు ఆ శక్తిని ఆకర్షించేలా చేస్తుంది. భాస్కరశర్మ అనే భక్తుడు తెచ్చిన సోలెడు బియ్యంతో వేలాదిమందికి అన్నసంతర్పణ చేయించాడు శ్రీగురుడు.

1. కృతజ్ఞతకు మరో పేరే దత్తుడు. ఆయనే గురువు. ఆయనే కృష్ణం వందే జగద్గురుం అని ప్రేమగా పిలుచుకునే శ్రీకృష్ణుడు, దత్త కృతజ్ఞత ఎంతవరకైనా వెళ్తుంది. ఏకనాథుడి ఇంట్లో ఊడిగం చేస్తాడు శ్రీకృష్ణుడు.
2. పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో ద్రౌపది ఇచ్చిన చిన్న ఆకుముక్కను ఆరగించిన శ్రీకృష్ణపరమాత్మ, దుర్వాసమహర్షి – ఆయన శిష్యుల ఆకలిని తీర్చాడు.
3. శ్రీకృష్ణునికి వేలు తెగినప్పుడు చిన్న గుడ్డముక్కతో కట్టుకట్టినందుకు ద్రౌపదికి కురుసభలో అవమానం జరుగుతుంటే అంతులేని వలువలనిచ్చి ఆమెకు మానసంరక్షణ చేశాడు.

4. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవయ్యా, ఆకలిగొన్న వారికి అన్నం పెట్టయ్యా అంటారు వెంకయ్యస్వామి.

దత్తుణ్ణి నీవేం అడగక్కర్లేదు. నీవు అడగవలసింది ఒక్కటే. నిరంతరం నీ సాన్నిధ్యాన్ని నాకివ్వు అని అడగవచ్చు. నిత్యావతార దత్తక్షేత్రంలో దత్తాత్రేయస్వామి ప్రధాన దైవం. ప్రత్యేకంగా దత్త సాధన చేసేవారందరిని ఒక గ్రూపుగా చేశారు మాస్టర్‌గారు. గురువులకు గురువు, ఆది గురువు, అత్రివరదుడు అయిన ఆ స్వామి పేరుతో 'దత్తగ్రూప్' అని ప్రత్యేకంగా ఒక గ్రూపును ఏర్పాటు చేసి అందులో చేరిన వారికి దీక్షలనిచ్చి సాధనలను ప్రారంభింపచేసారు. మొట్టమొదటగా 21.07.2004వ తేదినుంచీ దత్త గ్రూపువాళ్ళకు శిక్షణా తరగతులు ప్రారంభించారు.

## దత్త సాంప్రదాయంలో నియమాలు

1. దత్త కృప పొందాలంటే ఉండవలసిన ప్రధాన లక్షణం – కృతజ్ఞత.
2. దత్తావతారాలు వచ్చాకే – ఆనాటి దేశకాల పరిస్థితులలో, పరిపాలనా వ్యవస్థలలో మార్పులు చాలా వచ్చాయి. శిరిడీసాయిలాంటి వారు మానవజాతిని ఉద్ధరించటానికి వచ్చారనుకుంటాం కానీ మొత్తం సృష్టిని ఉద్ధరించటానికనేది మనకర్థం కాదు. దత్తావతారాలు వచ్చాకే మనకు సైంటిఫిక్ డెవలెప్‌మెంట్ బాగా వచ్చింది.

**గురుద్రోహము:** అస్సలు ఏ గురువు గురించి ఎప్పుడూ నోరెత్తవద్దు. వారిని గురించి మాట్లాట్టానికి ఎవ్వరికీ హక్కు లేదు. ఏదైనా విపరీతంగా మాట్లాడామా? అది గురుద్రోహమే అవుతుంది, గురుద్రోహం చేసినవాడు బ్రహ్మరాక్షసుడౌతాడు. దానికింక నిష్కృతి లేదు.

**ఆ పాపానికి నివృత్తి ఏదైనా ఉందా అంటే అది గురుచరిత్ర పారాయణ ఒక్కటే. అదొక్కటే తరుణో పాయం.** అది చదవకుండా వేరే దారి లేదు. 'ఆచార్య దేవో భవ' ఆచరించి చెప్పేవాడే ఆచార్యుడు. మనల్ని మనం విశ్లేషణ చేసుకోకపోతే గురుచరిత్ర పారాయణం ఏమీ చెయ్యదు. గురుచరిత్ర పారాయణ చేసేటప్పుడు ఏ కోరికా పెట్టుకోకూడదు. గురుఅనుగ్రహం ఒక్కటే చాలు. అది మనల్ని అన్ని బాధలనుండి బయటపడేస్తుంది. దీనినే గీతలో 'అనన్యాశ్చింతయంతోమాం' అని శ్రీకృష్ణుడు చెప్పాడు. గురువు దగ్గరికి జ్ఞానం కోసం వెళ్ళాలి. గురువులను ఏమి అడగాలనేదానికి గురుచరిత్రలు చదివితేనే వాటిలోని అంతరార్థాలు బోధపడతాయని ఆనాటి ప్రవచనసారాంశం.

## దత్తావతారం - నిత్యావతారం - ఈ భూమ్మీదనే ఉన్నది

ఆయన కేవలం మనుషులకోసం రాలేదు. సమస్త సృష్టి కోసం వచ్చాడు. అయితే మనం కూడా ఆ భూమ్మీదనే ఉన్నాం కనుక ఆయన వలన మనమూ లబ్ధి పొందవచ్చు. అవతార పురుషులు ఎవ్వరూ ఒక్క మానవజాతికోసమే పుట్టలేదు. దత్తుడి దగ్గరే వున్నాం, కానీ ఆయనను ఎలా ఉపయోగించుకోవాలో తెలియకపోతే ఏమిటర్థం? ఆయన చెప్పిన నియమాలు తెలియవనే గదా అర్థం! నియమానుసారం ప్రవర్తిస్తే ఎవరి కోరికలైనా తీరిపోతాయి. అందుచేత గురుచరిత్ర పారాయణ ఇంట్లో కాదు మందిరాల్లో చెయ్యాలి. గురుచరిత్ర పారాయణా విధానం భాగవతంలో వ్రాసే వుంది.

**గురుచరిత్ర పారాయణ వలన సంపూర్ణ సృష్టి పులకించిపోతుంది మరి. అది ఎంత యోగాన్ని మీకిస్తుందో మీరూహించలేరు. అఖండ గురుచరిత్ర పారాయణ క్రమాన్ని అన్ని సాయి మందిరాలలో జరిగేలా చూడాలి.**

ఈ సాధనలతో పాటుగా ఆ రోజుల్లో శ్రీశ్రీ మాస్టర్‌గారు సావిత్రీ సాధన అనే కొత్త సాధనను ప్రవేశపెట్టారు. కానీ అది ఎక్కువ కాలం సాగలేదు. పంచదత్తావతారములలో:

1) శ్రీపాదశ్రీవల్లభులు................ మొదటి అవతారం.

2) శ్రీ నృసింహసరస్వతీ స్వామి ...... మూల పురుషులు, పెద్దగా మానవ సంపర్కంలో లేరు.

3) శ్రీ మాణిక్య ప్రభువు ............... రాజులా జీవించారు.

4) అక్కల్‌కోట స్వామి ................. ఒక సైనికుడిలాగా ఎంతో క్రమశిక్షణతో జీవించారు. స్వాతంత్ర్య సమర పోరాటానికి సైనికుల్ని తయారుచేశారు.

5) శిరిడీసాయి - భారతదేశ ఆధ్యాత్మిక ఉన్నతి కోసం కృషి చేసారు. మొత్తం యోగవిద్య వీటన్నింటికి సమన్వయమే. మేస్త్రికి ఇంటి బ్లూప్రింట్ ఇస్తే చాలు, భవన నిర్మాణం చేస్తాడు. అలాగే భవ్యమైన భారతదేశానికి కావలసిన బ్లూప్రింట్‌ను శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతిస్వామి ఇచ్చారు.

1) మూలాధారం - గణపతి - శ్రీపాదశ్రీవల్లభస్వామి - భాద్రపద శుద్ధచతుర్థి నాడు జన్మించారు.

2) స్వాధిష్టానం -విశ్వం యొక్క స్వాధిష్టానంలో శ్రీనృసింహసరస్వతిస్వామివారు మార్పు తెచ్చారు.

ఊరికి కరెంట్ వస్తే మనింటికి కరెంట్ వస్తుంది. సామూహికంగా గురుచరిత్రల పారాయణలు చేస్తుంటే మూలాధార, స్వాధిష్టాన చక్రాలలో మార్పులు వస్తాయి. అందరి జీవితాలలో క్రొత్త క్రొత్త మార్పులు వస్తాయి.

**నిత్యావతారదత్తక్షేత్రంలో నిరంతరం అఖండగురు చరిత్ర పారాయణ జరుగుతూ ఉండాలి.**

రాముడి కంటే రామనామం గొప్పది. కృష్ణుని కంటే కృష్ణనామం గొప్పది. వారి జపాన్ని ఉపయోగించుకొని చేతనత్వంలో మార్పు తెచ్చుకోవచ్చు. తన్మయత్వంలో చేసే ఆ నామజపం మీలో విశేషమైన మార్పులు తెస్తుంది. తన్మయత్వం రావాలంటే గురుచరిత్రలు పారాయణ చెయ్యాలి. తద్వారా గురువుల జీవితంలో వచ్చిన మార్పులు ప్రతి మనిషి జీవితంలో కూడా వస్తాయి. **ఎవరికి నచ్చిన గురునామాన్ని వారు, నిరంతరం స్మరణ చెయ్యాలి. ఆ గురునామం వారికి రక్షణ కవచం లాగా పనిచేస్తుంది. వాక్శక్తిని పెంచుతుంది. అది వ్యక్తి జీవితంలోని పరిస్థితులను మారుస్తుంది. ఆ వాక్ శక్తే జ్ఞానాన్ని ఇస్తుంది.** గురుచరిత్ర పారాయణ వలన దత్త స్వామి సాధకునిలో అవతరిస్తాడు. అందుచేత ఈ జన్మలోనే దత్తానుగ్రహం పొందుతారు. గురుచరిత్రలో ఒక సుమతి, జడమతి, రజకుడు వీరంతా శ్రీపాదవల్లభుల అనుగ్రహం పొందారు.

సుమతి సాధన ఆ జన్మలోనే ఫలించింది. మందమతికి తర్వాతి జన్మలో ఫలించింది. రజకుని సాధన - నీచయోనిలో పుట్టి బాధతో గురువు దగ్గరికెళ్ళి అనుగ్రహాన్ని పొందారు. అలా దత్తానుగ్రహమనేది ఏదో ఒక రూపంలో, సాధకుల జీవితంలో నిరంతరం వర్షిస్తూనే వుంటుంది. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఆ అనుగ్రహం వుంటూనే ఉంటుంది కానీ మనం గమనించుకోం.

అమావాస్యనాడు పితృదేవతల అనుగ్రహం చాలా ఎక్కువగా వుంటుంది. దత్తానుగ్రహం కావాలంటే పిండప్రదానం చెయ్యాలి. **అమావాస్యనాడు అపరిచిత వ్యక్తికి భోజనం పెడితే పిల్లల్లేని వారికి సంతానం కలుగుతుంది.** నిత్యావతార దత్తక్షేత్రంలో గురుచరిత్ర పారాయణ చేస్తే ఎలాంటి

లాభాలు ప్రాప్తిస్తాయో మీరూహించలేరు. అక్కడున్న శక్తిని మీరూహించలేరు. అలా ఆ శిబిరంలో గురుచరిత్ర, శిరిడీసాయి చరిత్ర పారాయణలు ఎలా చెయ్యాలనేటటువంటి విషయమై క్రొత్త, క్రొత్త విశేషాలను చెప్పటం జరిగింది.

## గురుసత్తాలోని ఆరు గ్రూపులు - సాధనలు

పూజ్యశ్రీ మాస్టర్‌గారు, గురుసత్తా శిక్షణా తరగతులను నిత్యావతార దత్తక్షేత్రం, వేటపాలెంలో ఉదయం చెప్పేవారు. మధ్యాహ్నం తరగతులు సహ్యాద్రి దత్తాశ్రమం, ఒడరేవులో చెప్పేవారు. ఎంతో ఉదాత్తమైన, దివ్యమైన, భవ్యమైన భవిష్యద్దర్శనంతో మాస్టర్‌గారు ఈ తరగతులను ఈ రెండు ఆశ్రమములలో నిర్వహించారు. ఈ తరగతులు చెప్తూ ఒకమాట అన్నారు.

**'సిద్ధాశ్రమం యొక్క అవగాహనకు కావల్సిన క్లాసులు ఇక్కడ జరుగుతున్నాయి. భవిష్యత్తులో వీటి యొక్క రూపురేఖలు చాలా ఉదాత్తంగా వుంటాయి. వేటపాలెం, ఒడరేవుల్లోనే కాక మిగతా ఆశ్రమాలను కూడా సిద్ధాశ్రమాలుగా రూపొందించాలనేదే నా కోరిక' అంటూ తమ భవిష్య ప్రణాళికలను చాలా స్పష్టంగా వివరించారు.** (డార్జిలింగ్‌కి వెళ్ళినపుడు అక్కడ సిద్ధాశ్రమ యోగుల ఆదేశమది)

'అయితే దానికి తగిన కృషి, సహకారం, ఓర్పు, క్రియాశీలతలనేవి మనిషి కృషి మీదనే ఆధారపడివున్నాయి' అనే నగ్నసత్యాన్ని పదేపదే చెప్పటం జరిగింది. ఆ తర్వాత క్లాసులు

(1) సివివి + మాడమ్ బ్లావెట్‌స్కీల సమూహము

(2) శ్రీలాహిరీ మహాశయులు + యోగానందల సమూహము

(3) శ్రీ సత్యసాయి + శిరిడీసాయిల సమూహము

(4) శ్రీ అరవిందో + శ్రీమాతల సమూహము

(5) శ్రీరామకృష్ణపరమహంస + శారదామాతల సమూహము

(6) శ్రీరామశర్మ ఆచార్య + మాతా భగవతీదేవీశర్మగార్ల సమూహముల గురించి శిక్షణా తరగతులు చాలా బాగా చెప్పారు. ఈసారి చెప్పిన శిక్షణా తరగతులకు గురుదక్షిణగా కొంత మొత్తాన్ని సాధకులివ్వటం జరిగింది. ఏ రోజు వచ్చిన మొత్తాన్ని ఆ రోజే దత్త ఆశ్రమ నిర్వహణ

చేస్తున్న శ్రీమతి ప్రమీలమ్మగారికి, ఓడరేవు ఆశ్రమ నిర్వహణ చేస్తున్న శ్రీసుబ్బారావుగారికి ఇచ్చారు.

**సాధనా సారాంశము**

(1) గురుచరిత్ర పారాయణలు – సాప్తాహికంగా జరగాలి.

(2) శ్రీమద్భాగవత పారాయణలు జరగాలి.

(3) ప్రదక్షిణలు జరగాలి.

(4) మూడుపూటలా స్వస్తి చెప్పాలి.

(5) ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పురుష సూక్తం, శ్రీ సూక్తం, మంత్ర పుష్పం అందరూ కలిసే చదవాలి. అలా చేయడం వల్ల దేవాలయాలలో దివ్యత్వం బంగారు వర్షంలాగా కురుస్తుంది. దేవాలయాలను మార్చే బాధ్యత మనుష్యులదే! దత్తస్వామి సశరీరంగా ఇక్కడ తిరిగేలాగా మనం సాధన చెయ్యాలి.

## యోగవిద్య అంటే ఏమిటి?

వ్యక్తి తన యొక్క మొత్తం జీవిత పరిణామాన్ని ఒక జీవితకాలంలో కానీ, కొన్ని సంవత్సరాలలో కానీ, కొన్ని నెలల్లో కానీ పూర్తి చేసుకొనుట యోగము అని సింథసిస్ ఆఫ్ యోగా అనే గ్రంథములో శ్రీ అరవిందో చెప్పారు. ఆయన అంతవరకు చెప్పగా 'నేటి కాలములో దాన్ని కొన్ని రోజుల్లోనే పూర్తి చేసుకొనవచ్చు' అనే విషయాన్ని మాస్టర్‌గారు కలిపారు. మొత్తం పరిణామక్రమ జీవితాన్ని కొన్ని రోజులలోనే జీవించడం జరగాలంటే సాధనా మార్గంలో గతుకులు, మలుపులు వుండరాదు. ఎదురుగుండా మన వైపుకు వచ్చే ట్రాఫిక్ వుండకూడదు. వాటిని తప్పించుకోవాలంటే ప్రకృతిలో వున్న ఈ శక్తులను ఉపయోగించుకోవాలి.

గతుకులు ...................... కుటుంబ సభ్యులు.

పెద్దపెద్ద గోతులు ............ స్నేహితులు.

మలుపులు .................... నీకున్న ఆలోచనలు. అవి స్పీడ్ బ్రేకర్స్‌గా పనిచేసి నిన్ను ముందుకు పోనీయవు.

స్ట్రయిట్ రోడ్డు ................. జ్ఞాన యోగము

(1) పురుష సూక్తము .............. పరిణామక్రమమును గురించి చెప్తుంది.

(2) శ్రీసూక్తం ....................... పరిణామక్రమంలో నీవు ఎక్కడున్నావో తెల్పుతుంది.

(3) మంత్రపుష్పం .................... పరిణామక్రమంలో నీవు వేగంగా ఎలా వెళ్ళాలో నేర్పుతుంది.

ఈ మూడు ప్రతి నిత్యం దేవాలయాల్లో జరిగితీరాలి. అప్పుడే దేవాలయాలు క్రియాన్వితంగా ఉంటాయి.

ప్రస్తుతం దేవాలయాలు దేవతాశక్తుల వల్ల యాక్టివ్‌గా వుండటం లేదు. ప్రదక్షిణల వలన యాక్టివ్‌గా వుంటున్నాయి. ఆరతుల వల్ల యాక్టివ్‌గా వుంటున్నాయి.

(4) ప్రతి దేవాలయంలోను ఈ ప్రదక్షిణలు తప్పక జరిగితీరాలి. దేవాలయాలలో ప్రదక్షిణ, దక్షిణ, తీర్థ, ప్రసాదాలనేవి ఒక విశాలమైన భవంతికి నాలుగు స్తంభాల్లాంటివి. అందుచేత గుడికి వచ్చిన వాళ్ళందరూ తప్పని సరిగా ఈ నాలుగు విధానాలను పాటించి తీరాలి. ప్రతి పూర్ణిమకు ఐదు రోజులు ఆశ్రమంలో ఉంటానని, విశేష సాధనలు చేయిస్తానని చెప్పారు.

**స్మర్తుగామి:** గురుచరిత్ర పారాయణలో 'దత్తస్వామి' గురించిన మరొక విశేషమైన నామము, 'స్మర్తుగామి'. అంటే పిలువగానే పలికే చేతనత్వము. ఎప్పుడు ఎవరికి ఏ కష్టము వచ్చినా మనస్ఫూర్తిగా తలుచుకున్నవారికి ఏదో రూపంలో వారికి దర్శనమిచ్చి వారి సమస్యలను పరిష్కరించడమనేది అనేక సందర్భాలలో గురుచరిత్రలో చదువుతుంటాం.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు 2004 జూలై 6వ తేది నుండి ఆగష్టు నెల చివరి వరకు దత్తక్షేత్రంలోనే ఉన్నారు. ఈ కాలంలో గురుసత్తాలోని ఆరు జతల గురువుల విశేష కార్యక్రమాలను పూర్తిచేసి, ఆ తర్వాత శ్వేతద్వీపానికి వచ్చేశారు. వస్తూనే అప్పటికే జ్వాలాకూల్ మహర్షి వ్రాసిన "Soul and its mechanism" అనే పుస్తకం మీద మాస్టర్‌గారిచ్చిన ప్రవచనాలు ఆధారంగా తెలుగులో సిద్ధం చేసివుంచిన "జీవాత్మ-దాని పరికరాలు" పుస్తకాన్ని ఆవిష్కరించటం జరిగింది.

మళ్ళీ ఆగష్టు చివరికి, అనుగ్రహపీఠంలో "Reappearance of Christ" అనే జ్వాలాకూల్ మహర్షి పుస్తకం పైన ప్రవచనాలనివ్వటం జరిగింది. నూతన మానవజాతి యొక్క ప్రకృతిని

గురించి చెప్పిన ఎంతో అద్భుతమైన పుస్తకం అది. అందులోనూ మాస్టర్‌గారి నోటి వెంట ఆణిముత్య ముల వలె జాలువారిన ఆ పదజాలం పుస్తకరూపంలో తయారైంది. అనేక మంది కృషి ఫలితంగా వెలువడిన ఆ పుస్తకం మాస్టర్‌గారు కోరిన సమయానికి దానిని ఆవిష్కరించటం జరిగింది.

మహాపురుషులైన శ్రీజ్వాలాకూల్ గారి భావ ప్రకటనను ఎలీస్-ఎ-బైలీ ఇంగ్లీషులో మానవజాతికి అందిస్తే, పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఆ పుస్తకాలు ఆంధ్రలోకానికి తెలుగులో అందించారు, వారి అనుగ్రహంతో ఆ ప్రవచనాలను పుస్తకాలుగా అందించడానికి మనమెంత అదృష్టం చేసుకున్నామో గదా!

## Externalisation of hierarchy - ఋషి పరంపర బాహ్యప్రకటీకరణ

పూజ్యశ్రీ మాస్టర్‌గారి సాధనలన్నీ అంతర్ముఖంగానే జరిగిపోతుండేవి. వారిని ఎంత నిశితంగా పరిశీలించినా, ఎంత దగ్గరగా వున్నా, వారు చేస్తున్న సాధనలు ఏమిటనేవి ఎవ్వరికీ ఏ మాత్రం తెలిసేవి కాదు. ఏ సాధననెందుకు చేస్తారో ఎప్పుడూ ఎవ్వరికీ చెప్పేవారు కాదు. కానీ ఆ సాధన యొక్క తీవ్రత మాత్రం వారి ప్రవర్తనలో తెలిసిపోతుండేది. 'ఓహో! మాస్టర్‌గారు ఏదో లక్ష్యం కోసం సాధన చేస్తున్నారు' అని! ఇంక అప్పుడు వారితో చాలా మితంగా, జాగ్రత్తగా నడుచుకోవటం జరిగేది. ఒక్కొక్క రకమైన సాధనకు ఒక్కొక్క రకమైన బట్టలు, ఉంగరాలు ధరించేవారు. ఆహారంలో కూడా ఎప్పుడేది అడిగితే అది మాత్రమే, అంత పరిమాణంలో మాత్రమే పెట్టటం జరిగేది.

ఒకసారి లలితాసాధన చేసి, దాని పూర్ణాహుతిని చాలా బాగా చెయ్యాలని చెప్పారు. ఒంగోలులోని సంతపేటలో వున్న టి.టి.డి. కళ్యాణమంటపంలో 108 కుండీలలో 3 రోజులపాటు గాయత్రీ, లలితా యజ్ఞం చేయించారు. అన్ని ఊళ్ళ నుండి సాధకులు వచ్చి ఈ యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీశ్రీ మాస్టర్‌గారు అనుకున్నవిధంగా దిగ్విజయంగా యజ్ఞ కార్యక్రమం పూర్తి చేశారు. విరామ సమయంలో శ్రీరంగనాథ్‌వచ్చి, 'మాస్టారూ, Soul and its mechanism' మరియు 'Reappearance of Christ' చెప్పారు కదా, ఈసారి Externalisation of hierarchy చెప్పండి. అందరూ ఉన్నారు, సమయం కూడా ఉంది' అన్నారు. శ్రీశ్రీ మాస్టర్‌గారిని అలా చెప్పమని అడగటమే ఆలస్యం. వెంటనే ఒప్పేసుకున్నారు. తక్షణమే దానికి కావలసిన ఏర్పాట్లు చేశారు. Externalisation of hierarchy పుస్తకాన్ని జిరాక్స్ కాపీలు చేయించి ఇంగ్లీషు వచ్చిన వారందరికీ అందజేశారు.

అలా మాస్టర్‌గారు వీలున్నప్పుడల్లా ఎలీస్-ఎ-బెయిలీ పుస్తకముల మీద కూడా క్లాసులు చెప్తుండే వారు.

## పంచదత్తుల ప్రతిష్ఠ

2004 ఆగష్టులో నిత్యావతార దత్తక్షేత్రంలో పంచదత్తుల ప్రతిష్ఠ చేయాలని, దానికి తగిన విగ్రహాలు తెప్పించి మూడు రోజులపాటు జలాధివాసం చేయించారు. అనంతరం ప్రతిష్టకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేసేశారు. దత్తస్వామి గర్భగుడిలోనే ఈ ఐదు దత్తావతారాల ప్రతిష్టను రంగరంగ వైభోగంగా చేయించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా శ్రీ జి.యస్.కృష్ణగారు హైదరాబాద్ నుంచి వచ్చి, సశాస్త్రీయముగా మాస్టర్‌గారి చేత చేయించారు. వేలాదిమంది భక్తులు ఈ ప్రతిష్ఠకు వచ్చి పంచదత్తుల్ని, సశరీరంగా తిరుగాడుతున్న దత్తావతారమైన పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారిని దర్శించుకొని పునీతులైనారు.

తర్వాత కాలాంతరంలో అదే ఆవరణలో విడిగా వృత్తాకార మంటపాన్ని కట్టించి ఈ విగ్రహాలను అక్కడకి తరలించి ఎంతో వైభవంగా ప్రాణప్రతిష్టలను చేయడం జరిగింది. ఆనాటి నుండి దత్తస్వామితోపాటు పంచదత్తులకూ పూజ, అర్చనాది కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఇదంతా మాస్టర్‌గారి తపశ్శక్తికి ప్రత్యక్షనిదర్శనము.

# IV మిషన్ ఆర్.కె – కార్యక్రమాలు

## అధ్యాయం-7
## మిషన్ ఆర్.కె.

### మిషన్ ఆర్.కె. ఆవిర్భావం :

అది 2004వ సంవత్సరం సెప్టెంబరు 6 వతేదీ కృష్ణాష్టమి గదా! ఆ రోజు తేజతో 'నాకు ప్రత్యేకంగా ఒక ఇల్లు కావాలి' అన్నారు. ఎందుకు, ఏమిటి అనేదేమీ చెప్పలేదు. అన్నారంటే అది తక్షణం అయిపోవాల్సిందేగా! కొత్త ఇల్లు, అందులోనూ హైదరాబాదులో అంటే అది ఆలోచించాల్సిన విషయమే. పైగా సమయం చాలా తక్కువగా ఉంది. సరే, ప్రయత్నం మనం చేస్తే పరిష్కార మార్గం ఆయనే చూపిస్తారనుకొని తన వంతు ప్రయత్నం తాను మొదలెట్టింది. ఇంతలో ఒక శుభవార్త తెల్సింది. వీళ్ళు వుంటున్న సాయికృషి అపార్టుమెంటులోనే 5వ అంతస్తులో ఒక కుటుంబం వారు రేపో, మాపో మూడునెలల పాటు విదేశాలకు వెళుతున్నారని తెల్సింది. ఈమెకు ప్రాణం లేచి వచ్చింది. ఈమెకు, వారితో మంచి పరిచయమే ఉండడంతో తక్షణమే వెళ్ళి వారిని కలిసింది, తనకు కొన్ని రోజులపాటు ఇల్లు కావాలని, రేపు వచ్చే కృష్ణాష్టమికి ఆ ఇంటిలో మూడు రోజులపాటు సాధనలు, సత్సంగాలను మాస్టర్‌గారు చేయిస్తారని చెప్పగానే ఆ ఇంటివారు కూడా అదెంతో మహద్భాగ్యంగా భావిస్తూ, 'ఇది మాకు బాబా ఇచ్చిన వరం, మేము రేపే వెళ్ళిపోతాం. మీరు ఇల్లు వాడుకోవచ్చుని' చెప్పారు. ఆ క్షణంలో అదొక పెద్ద చమత్కారంగానే అనిపించింది. వారు చేసిన అంత పెద్ద సహాయానికి ధన్యవాదాలు తెలుపుకొని ఇంటికి వచ్చి మాస్టర్‌గారికీ శుభవార్త చెప్పింది. మాస్టారికివన్నీ తెలియకపోతేనే గదా! కర్త, కర్మ, క్రియ అంతా ఆయనే అయినప్పుడు అందులో వారు ఆశ్చర్యపడటానికేముంటుంది? అయినా సరే, వారు మన సంతోషాన్ని ఇంకాస్త ఉత్సాహపరచటానికి, 'మరి మన గురువుగారంటే ఏమనుకుంటున్నావు! ఆయనగారి మాజిక్కులన్నీ అలానే వుంటాయి' అన్నారు నవ్వుతూ!

సరే, సెప్టెంబరు 6వతేదీ వచ్చేసింది. సాక్షాత్తు జగద్గురువు శ్రీకృష్ణులవారి జన్మదినం. ఎంతో ఉత్సాహంతో అందరూ కలిసి అందంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆహూతులందరూ వచ్చేశారు. ఆ ఇంట్లో అప్పటికే అక్కడ శ్రీశిరిడీసాయి, సత్యసాయిబాబాగార్ల నిలువెత్తు ఫోటోలు వున్నాయి. వారితో పాటు శ్రీకృష్ణవిగ్రహాన్ని అక్కడ ఎంతో అందంగా అలంకరించి వేదిక ఏర్పాటుచేసి దాని మీద ధూప, దీపాలను పెట్టి పూజ, అర్చన చేశారు. శ్రీశ్రీమాస్టర్‌గారు వచ్చారు. వేదికనలంకరించారు. అందరివైపూ ఒక్కసారి తేరిపార చూశారు. వచ్చిన వారందరూ ఎంతో మౌనంగా, ఏం చెప్తారా? అని ఉత్సాహంతో ఎదురు చూస్తున్నారు. ఓంకారం, గురుప్రార్థన అయ్యాక ఇంక చెప్పటం ప్రారంభించారు.

## పూజ్యశ్రీమాస్టర్‌గారి ప్రవచనం ప్రారంభమైంది.....................

బుద్ధుని జీవితంలో ఎదురైన మూడు సమస్యల గురించి, వాటిని ప్రతి మనిషి సాధనాపరంగా ఎలా నిగ్రహించవచ్చును, దానికి పరిష్కార మార్గాలేమున్నాయి అనే అంశం మీద వారి సందేశం ప్రారంభమైంది. ప్రతి మనిషి తమ జీవితకాలంలో ఎదుర్కొనే సమస్యలు: వాటి నివారణకు సరళమైన మార్గాలు ఏమిటి? 1. రోగరహిత 2.వృద్ధాప్యరహిత 3. మృత్యురహిత జీవితాలనే మూడు అంశాల మీద మనం ఎలాంటి సంయమనాలను పాటించి ఆ సమస్యలను నివారించుకోవాలి? అనే విషయంపై దాదాపు ఒకటిన్నర గంటల పాటు ప్రవచనం చెప్పారు. దానితోపాటుగా పైన చెప్పిన మూడు అంశాలనే ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకొని 'మిషన్ ఆర్.కె' అనే సంస్థను ఆవిష్కరించారు, తక్షణమే తయారుగా ఉన్న మిషన్ ఆర్.కె బోర్డును అలాగే తత్సంబంధమైన లోగోను కూడా సభాముఖంగా ప్రకటించారు.

కర్మసిద్ధాంతం ప్రకారం మానవజీవితంలోని ప్రతి సంఘటనలోను కర్మ చాలా ప్రముఖపాత్ర వహిస్తుంది. అందువలన పరమగురువుల మార్గదర్శనం కావాలనుకునేవారు ఇతరులను ప్రేమతోను, ఇంకా వారికి మేలు కలగాలనే ఆకాంక్షతోను నిస్వార్థభావనతోను నిరంతరం సహాయపడుతూ ఉండాలి. అప్పుడు మాత్రమే సాధకుడు గురువు ద్వారా అందించబడుతున్న సహాయాన్ని పొందగలుగుతాడు అనే పరమసత్యాలను నాటి ప్రవచనంలో చెప్పారు. మిషన్ ఆర్.కె సభ్యులుగా ఉండదలచినవారు పాటించవలసిన ఆహార, విహార నియమాలను వివరించారు. సంజీవనీ ఆహారనియమావళిని ఏర్పరిచారు. అందులో భాగంగా 80 శాతం ఆహారంగా నీరు,

ఫలములు, పచ్చికూరలను, వండిన ఆహారపదార్థాలను 20 శాతం తీసుకోమన్నారు. ఆసన, ప్రాణాయామాలు ముందు చెప్పిన విధంగా చెయ్యమన్నారు.

## మిషన్ ఆర్ కె లోగో - వివరణ

ఒక భవ్యమైన సమన్వయానికి ప్రతీకగా ఇప్పటివరకు ఏ సంస్థా ధైర్యం చెయ్యని విధంగా మిషన్ ఆర్.కె. లోగోని తయారుచేయించారు. మనం ఏ సంస్థకు వెళ్ళినా ఆ సంస్థవారు తమ గురువుని తమ ఆర్గనైజేషన్ తప్ప ఇతరములని వారు మనఃస్ఫూర్తిగా ఆదరించలేరు. వసుధైవక కుటుంబకము పృథ్వీమీద రావాలంటే ముందు భారతీయ ఆధ్యాత్మికతకు ఆయువుపట్టు ఐన ఆధ్యాత్మిక సంస్థలు కలిసి మెలిసి సోదర భావంతో గురువులు ఇచ్చిన జ్ఞానాన్ని ఒకరితో ఒకరు పంచుకుని చకచక కలిసి ముందుకు వెళ్ళవలసిన అవసరం ఉందనేది మాస్టర్‌గారి సిద్ధాంతం. దానికి ముందుగా మిషన్ ఆర్ కె తనకంటూ ఒక నూతన అస్థిత్వాన్ని సంపాదించుకోవటానికి కాక సమస్త గురువుల సమన్వయమే తమ లక్ష్యంగా కలిగి ఉంది అనే విషయం ప్రస్ఫుటించే విధంగా లోగోని తయారుచేయించారు.

లోగో మధ్యలోని బిందువు శ్రీ యంత్రములోని బిందువు ఒక్కటే. శివ, శక్తుల కలయిక ఈ బిందువు. త్రిభుజము, ఇచ్ఛాశక్తి, జ్ఞాన శక్తి, క్రియా శక్తులు.

స్టార్, పెంటగన్‌లో పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచభూతములు, పంచ ప్రాణాలు.

ఇలాంటి మానవ శరీరములో ఉన్న మనం వీటిని మన అధీనంలోకి తెచ్చుకొని గురు ప్రణాళికలో భాగస్వాములుగా పనిచెయ్యాలి.

**అజోఽ పి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽ పి సన్ ।**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥**

నేను పుట్టుకలేనివాడను, నిత్యుడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను. అయినా నేను, నా ప్రకృతిని అధీనములో ఉంచుకొని నా యోగమాయచే జన్మమెత్తుచున్నాను.

**మిషన్ ఆర్.కె. లక్ష్యం లోగోని జాగ్రత్తగా గమనిస్తే అర్థం అవుతుంది.**

**"అజోపిసన్"** నాట్ బార్న్ – పుట్టుక లేనివాడనైనను

**"అవ్యయాత్మా"** – ఇన్‌క్రెషబుల్ – అవినాశియైనది

**"భూతానాం ఈశ్వరోపిసన్"** – ప్రాణులకు ప్రభువు

ఈ పంచభూతాలకు అధిపతి.... ఆ నాశరహితమైనటువంటిది అనేది మీకు అర్థం అవటానికి ఉపనిషత్ దీనిని –

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయా పూర్ణమేవా వశిష్యతే।** అని చెప్పింది.

హోలోగ్రఫిక్ ఫోటోగ్రఫీలో ఒక ఆకు తీసి, మీరు దాని ఫోటోగ్రాఫ్ తీయండి. దానిని ప్రొజెక్ట్ చెయ్యండి. మీకు ఆకు బొమ్మా పూర్తిగా వచ్చేస్తుంది. అది మొత్తం (నాడులలాగా ఉంటాయి కదా, ఏమంటారు) వెయిన్స్. ఆ ఆకు లోనుంచే ఒక చిన్న ముక్క తియ్యండి మీరు. దాన్ని ప్రొజెక్ట్ చెయ్యండి, అదీ మళ్ళీ పూర్తిగా వస్తుంది. మీరు ఎప్పుడైనా చేసి చూడండి, హోలోగ్రఫి సిస్టమ్‌లో, త్రీ డైమెన్షనల్ ఫోటోగ్రఫిలో జరిగేటటువంటి మేజిక్ అది. అంటే ఏంటి? ఒక ఆకును మీరు చిన్న ముక్కగా కత్తిరించినా, దాని ఫోటోగ్రాఫ్‌లో పూర్ణత్వమే ఉంటుంది, ఇంత చిన్న ముక్క తీసుకున్నా కూడా. అంచేత అతి చిన్న కణం నుంచి ఈ సృష్టి మొత్తం వరకూ కూడా ఒకే ఆత్మ ఉన్నది అంటే సైంటిఫిక్‌గా మీరు ఇది ఇంపాజిబుల్ అనలేరు. ఎప్పుడైనా ఆ బొమ్మని మీరు చూడటానికి ట్రై చెయ్యండి. ఎనీ సైంటిఫిక్ జర్నల్‌లో దీని వివరాలు దొరుకుతాయి.

**"భూతానాం ఈశ్వరోపిసన్"** ఇక్కడ చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

పృథ్వీ, జలం, అగ్ని, వాయువు, ఆకాశమను పంచభూతాలు ఉన్నాయి మనకి. దానితో ఈ ప్రపంచం అంతా తయారయ్యి ఉన్నది.

**భూతానాం – ఈశ్వరః – అపిః** వీటన్నిటికి మనం అధిపతులం. కానీ ఎలా ప్రవర్తిస్తున్నాం మనం?

మీరు నేర్చుకోవలసినది ఏంటి అంటే భూతానాం ఈశ్వరోపిసన్. మీరు ఈ పంచభూతాలకు అధిపతులుగా జీవించటం నేర్చుకోవాలి. కాబట్టి మిషన్ ఆర్ కె లక్ష్యం ఏంటి అంటే పంచభూతాలపై మీకు పూర్తి ఆధిపత్యం రావాలి.

పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ ప్రాణాలు, పంచ తత్వాలు, నాలుగు అంతఃకరణాలు - మనో, బుద్ధి, చిత్త, అహంకారములను సరిగ్గా ఉపయోగించుకోవటమే ఆధ్యాత్మికత. వీటిపై ఆధిపత్యం సాధించటం వలనే మనకు "ఈశ్వరత్వము" లభిస్తుంది. కరిష్యే వచనం తవ అనే మానసిక స్థితిద్వారానే ఇది సాధ్యము.

లాహిరీమహాశయ - పరమహంస యోగానంద, శ్రీమాత-శ్రీఅరబిందో, షిరిడీ సాయి-సత్యసాయి, రామకృష్ణ పరమహంస - శారదామాత, మేడం బ్లావెట్స్కీ -మాస్టర్ సి.వి.వి గురువుల సాహిత్యాన్ని, సాధనలను అర్థం చేసుకోవాలి అంటూ ఒక విశాలమైన ప్రణాళికను అందించారు. మాస్టర్‌గారివద్ద ఉన్న పరివార్ సభ్యులంతా ఈనాటికి ఏ గురువు సంస్థలో కార్యక్రమమైనా అతి ఉత్సాహంగా వారి పూర్తి సహకారాన్ని అందిస్తారు. అంతేకాదు మాస్టర్‌గారి మార్గదర్శనంలో అనేకమంది గురువుల సాహిత్యాన్ని, వారి లక్ష్యాలను అర్థం చేసుకొని మనసా, వాచా కర్మణా వారికోసం పనిచెయ్యటమే నిజమైన ఆలోచనా క్రాంతి. గురువులు, వారి జ్ఞానము అనంతములు, అవి ఏ సంస్థకో, ఆ సంస్థాగత వ్యక్తులకో పరిమితం కాదు. వారి జ్ఞానాన్ని, వారి వారసత్వాన్ని పొందేందుకు శిష్యులకు సన్నద్ధత, వారందించిన జ్ఞానాన్ని నేర్చుకోవాలనే తీవ్ర సంకల్పములు ముఖ్యము అనే సత్యాన్ని అందరికీ నరనరాల్లోను యింకేవిధంగా చెప్పారు. ఈ సమయంలో ఇది చాలా పెద్దక్రాంతి. మా గురువు, మా సంస్థే గొప్పది, మిగతా గురువులు - వారి జ్ఞానము అనవసరము అనే సంకుచిత సంస్థాగత సంకెళ్ళనుండి గురువుల్ని వారి లక్ష్యాలను బయటికి తీసి మానవజాతికి గురువుల విశాలరూపాన్ని పరిచయం చేసారు. తరువాతి కాలంలో ఎన్నో ఆధ్యాత్మిక సంస్థలు కలిసి పనిచెయ్యటాన్ని ఇప్పుడు మనం సాక్షులుగా దర్శిస్తున్నాం కదా. కొంతకాలం తరువాత మాస్టర్‌గారు మరల మిషన్ ఆర్ కె లోగోను మార్చారు. 24 గాయత్రీ మంత్రాక్షరాలను, సూర్యుడిని, మధ్యలో ఓంకారాన్ని కలిపిన కొత్త లోగోను ఆవిష్కరించారు. అలా మాస్టర్‌గారు ఏ పని చేసినా కాలానుగుణంగా నిత్య నూతనంగా ఉండేది.

# హైదరాబాదులో వినూత్న రీతిలో విస్తరించిన మాస్టర్‌గారి విజ్ఞానం

మాస్టర్‌గారు హైదరాబాదుకు వెళ్ళినప్పుడు తరచూ శ్రీమతి తేజా జగన్ వాళ్ళింట్లోనో, తమ్ముడు శ్రీవిశ్వనాథ్ గారింట్లోనో ఉండేవారు. అక్కడి నుండే అన్ని కార్యక్రమాలు నిర్వహించేవారు. ఎంతో కాలంగా మాస్టర్‌గారు తమ జ్ఞానాన్ని హైదరాబాద్‌లో పంచుతున్నప్పటికీ 2004 నుండి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. 2004 ఆగష్టు 8వ తేదిన తేజాజగన్ వాళ్ళ ఇంట్లో చెప్పిన క్లాసులో పంచోపచార పూజా విధానంలో పంచజ్ఞానేంద్రియాలను, పంచకర్మేంద్రియాలను ఎలా ఉపయోగించుకోవాలి అనే విషయంపై చక్కటి ప్రవచనం చెప్పారు. పంచోపచార పూజలో పంచ జ్ఞానేంద్రియాలను పంచకర్మేంద్రియాలను అంతఃకరణతో లింక్ చేయాలి.

కర్మేంద్రియాలు – ఉత్పాదక శక్తి (జనరేటివ్ ఫోర్స్)

జ్ఞానేంద్రియాలు – పీల్చుకునే శక్తి (అబ్‌జార్బ్షన్ ఆఫ్ ఫోర్స్)

నాటు, కోసుకో – తీసుకునే శక్తి (రిసీవింగ్ ఎనర్జీ). లా ఆఫ్ కర్మకి ఇదంతా ఎలా అవసరమో ఒక బొమ్మ ద్వారా వివరించారు.

తరువాత అదే నెలలోనే “హోటల్ మినర్వా”లో ‘బాడీ బ్యూటిఫుల్’ అనే చాలా కొత్త అంశం మీద ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. విషయం చాలా కొత్తగా ఉండడంతో, నేర్చుకోవాలనే ఆసక్తితో ఆ వర్క్‌షాప్‌కి చాలామంది వచ్చారు. ఎప్పుడూ, ఎక్కడా వినని క్రొంగ్రొత్త విషయాన్ని ఎంతో ఆసక్తి కలిగించేలా వివరించారు. పంచ జ్ఞానేంద్రియాలకు, పంచ కర్మేంద్రియాలకు, పంచ తన్మాత్రలకు–మన శరీరంలోని పంచభూతములకు–బాహ్య ప్రపంచానికి ఉన్న సంబంధాన్ని యానిమేషన్స్ ద్వారా అద్భుతంగా చూపించారు. మన దేహమనే దేవాలయాన్ని ఆత్మ సౌందర్యంతో నింపుకునేందుకు, మనలోని పరమాత్మను దర్శించేందుకు చక్కటి సాధనా పద్ధతులను అందించారు. ఈ కార్యక్రమానికి మొట్టమొదటిసారి శ్రీమతి మనోరమ అమ్మ, శ్రీ చంద్రశేఖర్ అను శ్రీ సాయి, దుర్గా ఉపాసకులు వచ్చారు. వారు తమ ఆధ్యాత్మిక శక్తితో ఎంతోమంది బాధలను నివారించేవారు. వారికి పూజ్య మాస్టర్‌గారిని చూస్తూనే గురు భావం కలిగింది. సర్వజ్ఞులైన మాస్టర్‌గారు వారిని చూస్తూనే ఎంతో ఆనందముతో వారిపై అపారమైన ప్రేమను వర్షించారు. అందరికీ వారి గొప్పతనాన్ని చెప్పి ఏదన్నా సమస్య ఉంటే వారి సహకారాన్ని తీసుకొమ్మని చెప్పారు. తరువాతి

కాలంలో మనోరమ అమ్మ తన భక్తులతో వ్రాయించిన 18 కోట్ల సాయి నామాన్ని 'మౌంట్ శంబళ' ఆశ్రమంలో స్థాపించి మాస్టర్‌గారిపై వారికిగల ప్రేమాభిమానలను తెలియచేసారు. ఇలా పూజ్య మాస్టర్‌గారి కార్యక్రమాలకు ఆధ్యాత్మిక ఉన్నతి కలిగిన ఎంతోమంది వచ్చి వారితో కలిసి గురు ప్రణాళికలో భాగస్వామ్యం పొందేవారు.

## లా ఆఫ్ కర్మ అంటే-కర్మ సిద్ధాంతం

తమాషా ఏమిటంటే మాస్టర్‌గారు చెప్పే విషయ పరిజ్ఞానం కేవలం ఒక్క అంశానికి మాత్రమే పరిమితమై వుండేది కాదు. ఈనాడు మానవజాతి అనుకోని రీతిలో అనేక సమస్యలను ఎదుర్కొం టున్నది. అసలు ఈ సమస్య నాకే ఎందుకు వచ్చింది? నేను ఫలానా కుటుంబంలో ఎందుకు పుట్టాను? నేను అనుభవిస్తున్న కష్టమైన – సుఖమైన పరిస్థితులకు మూల కారణం ఏమిటి? వాటి నివారణకు సరైనమార్గమేదైనా వుందా? ఇలా ప్రతి మనిషిని బాధించే అనేక ప్రశ్నలకు సమాధానాన్ని, మార్గదర్శనాన్ని అందించేందుకే 'లా ఆఫ్ కర్మ' అనే వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా, మానవుడు తన ప్రతి కదలికను, ప్రతి కర్మను సవ్యమైన మార్గంలో ఉపయోగిస్తే ఎంత ఎత్తుకైనా ఎదగగలడు అనే ఒక నూతన స్ఫూర్తితో వెళ్ళారు. ఈ వర్క్‌షాప్‌లో చెప్పిన అంశాలను 'లా ఆఫ్ కర్మ' అనే తెలుగు పుస్తకంగా అందించారు. పూజ్య గురుదేవులు 'గహనా కర్మణో గతిః' అనే పుస్తకంలో కర్మ సిద్ధాంతాన్ని గురించి చాలా సమగ్రంగా వ్రాశారు. నిజంగా ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిన పుస్తకాలివి. 'మెనీమాన్షన్స్' అనే ఇంగ్లీషు పుస్తకంలో జినాసెర్మినారా అనే రచయిత్రి ఈ సిద్ధాంతాల్ని చాలా చక్కగా అందరికీ అర్థమయ్యేరీతిలో వ్రాశారు. మాస్టర్‌గారి ప్రేరణతో మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఈ పుస్తకాన్ని కర్మసిద్ధాంతం అనే పేరుతో అనువదించారు. హైదరాబాద్‌లోని 'నైస్ రెస్టారెంట్'లో ఒక్క రోజు నిర్వహించిన ఈ వర్క్‌షాపుకు అప్పట్లో ఛీఫ్‌విప్‌గా పనిచేస్తున్న సి.ఎమ్. కిరణ్‌కుమార్‌రెడ్డి ఛీఫ్ గెస్ట్‌గా రావటమే కాక మాస్టర్‌గారి జ్ఞానాన్ని విని ముగ్ధులైపోయారు. మాస్టర్‌గారు చెప్పిన ఈ క్లాసులకు కొంత ప్రవేశరుసుమును పెట్టారు. అలా వచ్చిన ఆ మొత్తాన్ని వేటపాలెంలో జరుగుతున్న 'నిత్యావతారదత్తక్షేత్ర' ఆలయ నిర్మాణానికి అనుగ్ర హించారు. ఆ తరువాత అవంతి కాలేజీ ఆవరణలో చెప్పిన మరొక విచిత్రమైన అంశం "మైండ్ ప్రోగ్రామింగ్". దాని గురించి కేవలం విద్యార్థులకు మాత్రమే చక్కటి అవగాహనా తరగతులను నిర్వహించారు. అలా మాస్టర్‌గారు దేశ, కాలాలను దృష్టిలో వుంచుకొని ఎవరికి ఏది అవసరమో దానిని అద్భుతంగా ప్రసాదిస్తుండేవారు.

పూజశ్రీ మాస్టర్‌గారికి జ్వాలాకూల్‌గారి సాహిత్యం పట్ల విపరీతమైన అభిమానం. అభిమానంతో పాటు ఆకర్షణ కూడా ఉంది. మహర్షిగారి రచనలలో ఒకటి ఈసోటెరిక్ ఆస్ట్రాలజీ, రెండవది ఈసోటెరిక్ సైకాలజీ. ఈ రెండు పుస్తకాల మీద ప్రత్యేకంగా ప్రవచనాలను ఇచ్చారు. అప్పుడప్పుడు హైదరాబాద్‌లో ఇలాంటి క్లాసులను చాలా ఉత్సాహంగా చెప్పుండేవారు. ఎంతో విషయపరిజ్ఞానంతో పాటు నిత్యజీవితానికి ఉపయోగపడే అఖండజ్ఞానాన్ని ఇచ్చే ఆ తరగతులకు హైదరాబాద్ పరివార్ వాళ్ళు వినటానికి చాలా శ్రద్ధగా వచ్చేవారు. ఒక్క మాస్టర్‌గారి దగ్గర తప్ప మరింకెక్కడా ఇలాంటి విషయ పరిజ్ఞానాన్ని వినలేము.

**హైదరాబాదు హైకోర్టులో వర్క్‌షాప్:** శ్రీమతి అమ్మాజీగారు హైదరాబాదు హైకోర్టులో ఉద్యోగం చేస్తుండేవారు, ఆవిడ మాస్టర్‌గారి ప్రవచనాలతో చాలా ప్రభావితులై, తాము పొందిన ఆ జ్ఞానాన్ని పంచిపెట్టటానికి హైకోర్టులో పనిచేస్తున్న జడ్జిలకు, అడ్వకేట్‌లకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. శ్రీశ్రీ మాస్టర్‌గారు మైండ్‌పవర్‌ను నిత్య జీవితంలో ఎలా ఉపయోగించుకోవాలో వివరిస్తూ ఓంకారముపై ప్రాక్టికల్స్‌ను చేయించారు. దాని వలన అనేక రోగములను నివారించటమే కాక అనేక ఆధ్యాత్మిక లాభములను పొందవచ్చని చెప్పటం జరిగింది.

## గాణ్గాపూర్‌లో సాధన

పూజ్యశ్రీ మాస్టర్‌గారి లీలలు అనంతం. ఎప్పుడు ఏ క్షణంలో ఏం చెప్తారో, ఏం చేయాలో అనేది వారికి దగ్గరగా వుండేవారికి మాత్రమే అనుభవం. ఆ రోజు తేజశ్రీతో మనం రేపు గాణ్గాపూర్ వెళ్తున్నాం. అందరికీ చెప్పండి. ఎవరి ఏర్పాట్లతో వాళ్ళు రావాలి. కానీ అందరం కలిసే వెళ్ళాలనే చాలా స్పష్టమైన సూచనలనిచ్చారు. అందరికీ సమాచారం వెళ్ళింది. మర్నాడు ఉదయం రెండు సుమోలలో అందరం గాణ్గాపూర్‌కు బయల్దేరాం.

అందరం గాణ్గాపూర్‌లో దిగాం. సర్దుబాటు అంతా అయ్యాక 'సంగమం'లో స్నానానికి బయల్దేరాం. అందరికీ ఒకటే ఆనందం. సాక్షాత్ దత్తావతార ప్రతిరూపమైన పూజ్యశ్రీ మాస్టర్‌గారితో సంగమంలో స్నానం చెయ్యడమంటే ఎన్ని జన్మల పుణ్యమో కదా! పరమాత్మ భౌతిక శరీరంలో ఉంటూ మనతో కలిసిమెలిసి తిరుగుతుంటే ఆ చేతనత్వాన్ని గుర్తించగలగాలంటే, మనమూ (మాయా) ముక్తావధూతలము కావాలి. ఎంతో శక్తివంతమైన ఆ క్షేత్రంలో, సంగమంలో స్నానం చేశాక విరామసమయంలో మాస్టర్‌గారి ప్రవచనం మొదలైంది.

## ఆధ్యాత్మిక జీవితం ఏం నేర్పుతుంది?

ఆధ్యాత్మిక జీవితంలో మామూలు సంసార జీవితానికి స్థానం లేదనే భ్రమలో జీవిస్తున్నది మానవజాతి. కానీ 'ఆధ్యాత్మికత' ఎప్పుడూ జీవించటం ఎలా? అనేది నేర్పుతుంది. ఆధ్యాత్మికత అంటే సంసార జీవితం నుండి పారిపోవడమనే భావన వచ్చేసింది ఈనాడు. 'భగవంతుడి జోలికి వెళ్తే మనకేం లాభం వస్తుంది?' అనే వ్యక్తులు సమాజానికి పనికిరారు. ముందు మనకు ఆ భ్రమలు పోవాలి. దాని కోసం మనకు మనమే కొన్ని పరీక్షలు పెట్టుకోవాలి.

ఆరోగ్యమనేది అందరికీ కావలసిన మహాభాగ్యం. ముందు దాని మీద ఛాలెంజ్ చెయ్యండి.

1. స్వామీ ! నిన్నే నమ్ముతున్నాను. నీ చరిత్రను పారాయణ చేస్తున్నాను. నాకు ఆరోగ్యాన్నివ్వు.
2. స్వామీ ! నీవు ఇక్కడ (గాణ్గాపూర్) వున్నావు. ఇక్కడనుండి నేను 'రోగరహితంగా' తిరిగి వెళ్ళాలి. నీ శ్రీ చరణాలకు సర్వసమర్పణ చేసుకుంటున్నాను.
3. దేవతలు సైతం దత్తావతారాలకి సేవ చేస్తారు. మనం ఉన్నది దత్త క్షేత్రంలో! ఆ అద్భుతమైన శక్తి సాన్నిధ్యంలో ఉన్నాము. మీరు ఆ శక్తిని ఉపయోగించుకోగలిగితే అన్ని దోషాలు పారిపోతాయి.
4. "కరిష్యేవచనం తవ" అనేది నోటిమాటగా కాక ఆత్మలో నుండి ఆవేదనగా రావాలి.
5. గురువుకు సమర్పణ చేసుకున్న మనం – గురువుకు ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్ప వద్దు. నాకిదికావాలని మాత్రం ఆయన్ను వేడుకోండి. నా బాధ నీవే తీర్చాలి అనే మానసిక స్థితి రావాలి. మీ జ్వరాలు, రోగాలు తగ్గినా తగ్గకపోయినా ఆయన మీద భక్తిని పోనివ్వకండి.

రోగాలు, బాధలనేవి మనం కోరి తెచ్చుకున్నవే. అవి వస్తేనే మనం గురువుల దగ్గరికి పరుగుపెడతాం. ప్రతి జన్మలోనూ మనం గురువులతో కలిసే పుట్టాం, కలిసే వున్నాం. ఆ సంబంధం లేకపోతే మనం ఇక్కడికి రాలేం. గురుచరిత్ర పారాయణ సకల కర్మబంధాల నుండి మనలను విముక్తులను చేస్తుంది. మన ఆలోచనా విధానంలో మార్పు తెస్తుంది. గురుచరిత్రలు చదవండి. ఐదు దత్తావతారాలకి ప్రాముఖ్యత వుంది. శిర్డీసాయినాథునితో సహా ఇంకా ఐదు దత్తావతారాలు – ధునీవాలా దాదా, అక్కలకోట మహారాజ్, తాజుద్దీన్ బాబా, వాసుదేవానంద సరస్వతి, గజానన మహారాజ్ గార్లు ఒకేసారి ఈ భూమ్మీదకు వచ్చారు.

**గాణ్గాపూర్ యాత్రలో నేర్చుకున్న పాఠాలు :**

(1) "గురుచరిత్ర పారాయణతో మా బాధలు పోయాయి, మా కష్టాలు పోయాయి, పరిపూర్ణమైన ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వెళుతున్నాము.

(2) నిరంతర "గురునామ' స్మరణతో ప్రతి ప్రాణిలోనూ దత్తుణ్ణి దర్శించండి.

(3) నచ్చిన దత్తావతారాన్ని నిరంతరం స్మరిస్తూ, అవసరమైతేనే మాట్లాడండి. లేకపోతే మాట్లాడకండి – మౌనంగా వుంటూ చుట్టూ ఉన్న పరిస్థితులను గమనించండి.

(4) మనకొచ్చే కష్టాలన్నీ ఆయన మనకిచ్చే విజిటింగ్ కార్డ్స్ లాంటివి. అందుచేత 'దేనికీ భయపడకండి, బాధపడకండి'. అని ఆనాటి శిబిరంలో ఎన్నో సాధనా రహస్యాలను వివరించారు. అలా గాణ్గాపూర్ యాత్ర అందరికీ ఎంతో ఆనందాన్నీ, మధురానుభూతినీ, దత్తస్వామి అనుగ్రహాన్ని ప్రసాదించింది.

## 2004 అక్టోబర్ 14వ తేదిన మాస్టర్‌గారి జన్మదిన వేడుకలు

ఈ జన్మదిన వేడుకలు ఒక విచిత్రమైన రీతిలో జరిగినాయి. అక్టోబర్ 12వ తేది గురుదేవుల జన్మనక్షత్రం వచ్చింది. కాబట్టి ఆ రోజు **పండిత శ్రీరామశర్మ ఆచార్య** జన్మదినాన్ని, అక్టోబర్14వ తేదీన మాస్టర్‌గారి జన్మదినం రావటం వల్ల మూడు రోజుల సాధనా శిబిరాన్ని ఒంగోలులోని కళ్యాణమంటపంలో ఏర్పాటు చేయగా చాలా ఊళ్ళ నుండి పరివార్ సభ్యులు వచ్చారు. ఉదయం 5.00గంటలకే సాధనా శిబిరం ప్రారంభించేవారు. ముందుగా యోగాసనాలు + ప్రాణాయామాలను శ్రీమతి వల్లీశ్రీనివాస్ నిర్వహించగా, యజ్ఞకార్యక్రమాన్ని శ్రీసత్యనారాయణగారు చేసేవారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు మాత్రం ఉదయం, సాయంత్రం రెండు పూటలా వచ్చి ప్రవచనాలు చెప్పేవారు.

ఈ సాధనా శిబిరానికి పూజ్యశ్రీ మాస్టర్‌గారి ప్రియతమ శిష్యులు శ్రీ జి.యస్. కృష్ణగారు కూడా వచ్చారు. మాస్టర్‌గారి జన్మదిన వేడుకలు ఎంతో భవ్యంగా, దివ్యంగా అందరికీ ఎంతో ఆనందం కలిగించేలా జరిగినాయి. దేవుడి పెండ్లికి అందరూ పెద్దలే అన్నట్లు ఎవరికి తోచిన రీతిలో వారు, ఎంతో అభిమానంతో తాము మాస్టారి మీద వ్రాసిన పాటలను పాడుతున్నారు. అనుభవాలను చెప్తున్నారు. అంతా కోలాహలంగా ఉంది. ఇంతలో పెద్దకేకు తీసుకువచ్చారు. దాంతో పాటు మొయ్యలేనంత గులాబీమాల తెచ్చారు. మాలవేసి, మధ్యాహ్నం 12గంటలకు కేక్

కటింగు. హాపీ బర్తడే పాటలు పాడేవాళ్ళు. ఇలా ఎవరి ఆనందాన్ని వాళ్ళు మళ్ళీ ఈ అవకాశం ఎప్పటికొస్తుందో అన్నట్లుగా ఆ విధంగా వ్యక్తపరచుకున్నారు. ఎంతో ఘనంగా, సంతోషంగా జన్మదిన వేడుకలు పూర్తయిపోయాయి. విందు భోజనాలు అయ్యాక శ్రీ జి.యస్.కృష్ణ గారు (ఇంతకుముందే వారు తేలప్రోలులో సాధనాశిబిరం పెట్టడానికి మాస్టర్‌గారి అనుమతిని పొంది వున్నారు) మాస్టర్‌గారిని, నన్ను, సుమను తేలప్రోలుకు తీసుకుని వెళ్ళారు. అప్పట్లో శ్రీకృష్ణగారికి తేలప్రోలులో గాయత్రీ మందిరం ఉంది. సాధనాశిబిరాన్ని అక్కడ ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సావిత్రీ సాధన గురించి పరిచయం చేశారు. ఆ శిబిరం అయిపోతూనే, అక్కడి నుండి వైజాగ్ సమీపాన గల భీమిలిలో వున్న దుర్గాగాయత్రీ శక్తి పీఠంలో నవరాత్రి సాధనాశిబిరం చెయ్యడానికి వెళ్ళాము.

దుర్గా గాయత్రీ శక్తి పీఠం ఎంతో అందమైన ఆశ్రమం. శాంతికుంజ్‌లో మాదిరే ప్రఖరప్రజ్ఞ, సజలశ్రద్ధ మొదలుకొని అన్ని విభాగాలు ఎంతో తీరుగా నిర్మించారు డా॥ చంద్రశేఖర్, వారి సతీమణి భారతీగార్లు. అక్కడ మూడు రోజుల శిబిరం, తరువాత విజయదశమికి పూర్ణాహుతి వచ్చేలా ఏర్పాటు చేశారు. వైజాగ్ నుంచి శ్రీ అవతారం రాజుగారు, వారి భార్య లక్ష్మీగారు, సౌజన్య, కిశోర్‌గార్లు కూడా ఈ శిబిరానికి ప్రతిరోజు వచ్చేవారు. వారు ఆశ్రమంలో ఉదయం కార్యక్రమాలు అయ్యాక సాయంత్రం వేళల్లో వైజాగ్‌లో వేర్వేరు ప్రదేశాలలో ప్రవచనాలు పెట్టించేవారు. అలా క్షణం తీరిక లేకుండా కార్యక్రమాలు చేశారు. విజయదశమికి ఆశ్రమంలో పూర్ణాహుతికి ఎంతో ఘనంగా ఏర్పాట్లు చేయించారు డాక్టర్ చంద్రశేఖర్‌గారు. అశేషంగా వచ్చిన భక్తుల చేత మాస్టర్‌గారు నవరాత్రి అనుష్టాన పూర్ణాహుతిని చేయించారు. శ్రీశ్రీ మాస్టారి దివ్య ఉపస్థితిలో జరిగిన ఈ పూర్ణాహుతి అందరికీ ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చింది. పూజ్యశ్రీ మాస్టర్‌గారికి కూడా ఈ శక్తిపీఠంలో చేసిన సాధన ఎంతో ఆనందాన్ని, ప్రమోదాన్ని కలిగించింది.

## సోలార్ సిస్టమ్

పూజ్యశ్రీ మాస్టర్‌గారు హైదరాబాదులో ఉన్నప్పుడు ప్రాణిక్ హీలింగ్ సురేష్‌గారు సమయం దొరికినప్పుడల్లా వారివద్దకు వచ్చి సత్సంగములో పాల్గొనేవారు. పూర్ణిమాధ్యానములను మాస్టర్‌గారి సమక్షంలో చేసుకునేందుకు ఒక రోజు తేజా జగన్‌వాళ్ళ ఇంటికి వచ్చారు. ప్రాణిక్ హీలింగ్‌లో జంటహృదయాల ధ్యానములో పృధ్వీమాతను ఆశీర్వదించటం ఒక పద్ధతి. ధ్యానానంతరము

మాస్టారు పృధ్వి పరిణామ క్రమమును గురించి, పృధ్వీగ్రహ దీక్షను గురించి కొన్ని అద్భుతమైన విషయాలను చెప్పారు. ఆయన నుండి ప్రవహించిన జ్ఞాన ప్రవాహానికి వారంతా ముగ్ధులై సృష్టి పరిణామక్రమము, పృధ్వీగ్రహ దీక్ష. అందులో మానవుని స్థానముల గురించి ఇంకా ఎన్నో ఆధ్యాత్మిక విషయములను తెలుసుకునేందుకు మాస్టర్‌గారిని ఐదు రోజుల సాధనా శిబిరమునకు అనుమతిని ఇవ్వవలసిందిగా కోరారు. వారు దానికి అంగీకరించారు. అప్పటికప్పుడే పిల్లలకి చెప్పి ఎ.యి. పావెల్‌గారు రచించిన సోలార్‌సిస్టమ్ అను పుస్తకముపై, పాతంజలి యోగసూత్రములపై సాధనాశిబిరానికి కావలసిన స్లైడ్స్‌ను తయారుచేయించారు. ప్రాణిక్ హీలింగ్ వారికి రాజ్‌భవన్ రోడ్‌లో ఒక కార్యాలయం ఉంది. అందరూ క్యాంప్ అయ్యేవరకు అక్కడే ఉండటానికి కావలసిన అన్ని ఏర్పాట్లు క్షణాలలో జరిగిపోయాయి. పూజ్యమాస్టర్‌గారితో రాత్రి పగలు కలిసి ఉండే అవకాశం వారికీ కాంప్‌లో కలిగినందుకు వారెంతో ఆనందపడిపోయారు. డిసెంబర్ 2 నుండి 6 వ తేదీవరకు అందరికీ వసతి, భోజన సదుపాయాలు సిద్ధమైపోయాయి. అనుకున్న సమయానికి కార్యకర్తలు అక్కడికి చేరారు. ఉదయం మహాకాల యజ్ఞముతో కార్యక్రమం మొదలైంది. ఈ కాంప్‌లో అందరూ క్రొత్తవాళ్ళవటం మూలాన, మాస్టర్‌గారు ముందుగా అందరికీ గాయత్రీ మంత్ర దీక్షను, ఉపనయన సంస్కారమును చేయించారు. యజ్ఞం పూర్తికాగానే సోలార్ సిస్టంపై ఉపోద్ఘాతాన్ని మొదలుపెట్టారు. కొన్ని ముఖ్య అంశములు –

1. 'ఏకోహం బహుశ్యామ' అనే ఆలోచనతో సృష్టి ఆదితలము నుండి అనుపాదక, ఆత్మ, బుద్ధి, మనస్సు, కామమయ నుండి మరింత క్రిందికి భౌతిక తలములోకి ప్రవేశించింది. మనము కంటితో చూడగలుగుతున్న చరాచర సృష్టి మొత్తము భౌతికతలమును సూచిస్తుంది. ఈ భౌతికతలము మొత్తము, పైన ఉన్న తలముల ద్వారా నియంత్రింపబడుతుంది అనేది సత్యము.

2. సృష్టిలోగల అనేక సోలార్ సిస్టమ్స్‌లో మన సోలార్ సిస్టమ్ ఒకటి. అందులో ఉన్న మానవజాతి అనేక లక్షల జన్మల తరువాత మానవజన్మను పొందింది. ఇంతకుముందు చంద్రగ్రహములో జంతు స్థాయిలో ఉన్న జీవము కొన్ని కారణాల వలన పరిణితిని సాధించి భూమి మీదకి మానవ జాతిగా జీవనాన్ని పొందింది. మనము అందుకే చంద్రగ్రహమును చూసినప్పుడు ఒక అవినాభావ సంబంధాన్ని అనుభూతి చెందుతాము.

3. మనము చేసే కర్మలను బట్టి మన పరిణితి నిర్ణయింపబడుతుంది. మన కర్మలు ఉన్నతమైనచో ఉన్నత జన్మలను, నీచమైన పనులు చేయుటవలన నీచమైన యోనులలో జన్మించటము జరుగుతుంది. ఇది మనకు అన్ని గురుచరిత్రలలోనూ చెప్పబడే విషయము. జడ్జ్‌మెంట్ డేస్‌లలో వారి వారి కర్మానుసారము జీవరాశులను ఏ గ్రహముపై ఏ యోనిలో ఉంచాలో నిర్ణయిస్తారు. పెద్ద పెద్ద సునామీలు, భూకంపాలు వంటి ప్రకృతిలో జరిగే ఉపద్రవాలు సామూహిక కర్మ కల వారిని, వారి పరిణామానికి తగిన స్థానానికి చేరుస్తాయి.

4. పరిణామ క్రమములో ప్రస్తుతం అందరమూ మీన యుగమునుండి కుంభ యుగములోనికి అనగా కలియుగము నుండి సత్యయుగములోకి ప్రవేశించవలసిన అతి విలువైన క్షణములు. ఈ సమయము ఎంతో అద్భుతమైన అరుదైన సమయము. ఈ సమయములో అతి తక్కువ శ్రమతో అతి ఉత్తమ కర్మను సాధించుకోగలిగిన సదవకాశము. గురువులు పంపించే స్పందనలకు అనుగుణమైన జీవితవిధానమును అలవరచుకున్న మనుషులు చాలా ఎక్కువమంది వారికి కావాలి. అందువలన మీరు చేసే అతి సులువైన ఆసన ప్రాణాయామములు, జపము, సమయ అంశ ప్రతిభాదానములు ఇవన్నీ మిమ్మల్ని గురువులే మీ వద్దకు వచ్చి మీకు మార్గదర్శనమును అందించేలా చేస్తాయి.

5. మానవుడు దేవమానవుడుగా ఎదగాలి. అలా దేవమానవునిగా ఎదిగిన వారి ఎదుట ఏడు అత్యున్నత మార్గములు ఉంటాయి, ఎవరికి నచ్చిన మార్గమును వారు ఎన్నుకొనవచ్చు. అందులో 1. రాబోయే ప్రపంచమునకు ఒక అవతారముగా ఎదగటానికి 'నిర్వాణ' మార్గము. 2. స్పిరిట్యుయల్ పీరియడ్‌లో ప్రవేశించి సంభోగకాయమును స్వీకరించవచ్చు. 3. నిర్మాణ కాయమును స్వీకరించి తన కాజల్‌బాడీని దానికి సంబంధించిన పర్మెనెంట్ ఆటమ్స్‌ను తనవద్దే ఉంచుకొనవచ్చు. 4. అక్కల్ట్ హైరార్కీ మెంబరుగా ఉండవచ్చు. 5. తరువాతి చైన్‌లోకి ప్రవేశించి అక్కడివారికి పరిణామక్రమానికి మార్గదర్శనం అందించవచ్చు. 6. దేవతలలో చేరి ఆ పరిణామక్రమములో ముందుకు వెళ్ళవచ్చు. 7. సోలార్ లోగోస్ స్టాఫ్ మెంబరుగా మారవచ్చు. ( వీటికి సంబంధించిన మరిన్ని వివరములు పావెల్‌గారు రాసిన 'కాజల్ బాడీ' అను పుస్తకములో చూడవచ్చు.)

6. నా వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరు 'మాస్టారు మా పిల్లవాడికి ఫస్ట్ ర్యాంకు రావాలని దీవించండి, లేదు ఎంసెట్‌లో సీట్ రావాలనో, డాక్టరు కావాలనో, ఇంజనీరు కావాలనో దీవించమని అడుగుతారు'. ఒక్కళ్ళు కూడా మా పిల్లలు సుఖంగా ఉండాలని దీవించమని అడగరు. ఇది మనుష్యుల మూర్ఖత్వానికి అద్దం పట్టే ఒక్క ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం మానవజాతి ఎన్నో రకాలైన అసమంజసమైన, అనవసరమైన ఆలోచన విధానాలతో సతమతమవుతున్నది. గాయత్రీ మంత్రము ద్వారా మాత్రమే వారు ఈ స్థితిని దాటి బుద్ధి తలములోకి ప్రవేశించ గలరు.

పతంజలి యోగసూత్రములలో యోగస్థితిని చేరటానికి సంబంధించిన సూత్రములు అందించ బడ్డాయి. ఏ విద్యనైనా నేర్చుకునేందుకు ఒక క్రమమైన ప్రణాళిక అవసరము. అందునా ఆధ్యాత్మికత వంటి అత్యున్నత విద్యను నేర్చుకునేందుకు ఏ మార్గమును అనుసరించాలి? ఎక్కడ మొదలు పెట్టాలి? సిలబస్ ఏంటి? అనేవి ఈ మార్గంలో నడవదలచుకున్నవారికి వచ్చే ప్రశ్నలు. దానికి ఒక్కటే సమాధానం. ఇది చాలా తేలికైన, సురక్షితమైనది. అది గురువుల చరిత్రలను చదవటం, వారి జీవితాన్ని ఎలా జీవించారో అలా మనం కూడా జీవించటం. మనకు భారతదేశములో ఎంతో మంది గురువులు సశరీరముగా ఈ భూమిమీద మనతో కలిసి జీవించారు. వారి జీవితాలే మనకు మార్గదర్శనము.

సాధనా శిబిరము 5 రోజులు ఒక అద్భుతమైన లోకంలో ఉన్నట్లుగా గడిచింది, మాధురీ రాజీవ్‌వాళ్ళ వివాహదిన సంస్కారము, లక్ష్మీ కస్తూరి పుట్టినరోజు సంస్కారమును జరిపించాము. భాగవతముపై మాస్టర్‌గారు ఇచ్చిన ప్రవచనములను శ్రీమతి లక్ష్మీరాజగోపాల్ శ్రవణం, కీర్తనం అనే చిన్న పుస్తకాన్ని అందమైన బొమ్మలతో తయారుచేసి మాస్టర్‌గారి చేతులమీదగా ఆవిష్కరింపచేసారు. ఈ సాధనా శిబిరములో లభించిన అంశదానాన్ని మొత్తం సహ్యాద్రి ఆశ్రమములో జరగబోయే గురుసత్తామహోత్సవాలకు ఇచ్చాము.

## గురుదేవుల ఆశ్వాసన

2004వ సంవత్సరానికి వీడ్కోలు, 2005వ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఒంగోలు లోని "సిల్వర్ గోల్డు కళ్యాణమండపం"లో జనవరి నెలలో సాధనాశిబిరం నిర్వహించారు. నూతన

సంవత్సరంలో చేయవలసిన సాధనల గురించి, ఋషుల బాహ్యప్రకటీకరణకు కావలసిన మానసిక స్థితి గురించి అద్భుతమైన సందేశాన్ని ఆ రోజు రాత్రి చెప్పారు. ఆనాటి ఆ సందేశం భవిష్య ప్రణాళికలకు కావలసిన దివ్యమైన ప్రేరణను ప్రసాదించింది. ఆనాటి ప్రవచనంలో గల ప్రభావాన్ని తర్వాత రోజులలో గుర్తించడం జరిగింది.

ప్రతి సంవత్సరము వసంతపర్వము నూతన సందేశమునందచేస్తుంది. 'గురుసత్తా నిర్ధారణల ప్రకారము ఉచ్చస్థాయి ఆదర్శాలను పాటిస్తూ తమ ప్రతిభ, కాలములను రాష్ట్రము లేదా దేశము యొక్క నవనిర్మాణము కొరకు వెచ్చించిన వ్యక్తే వరిష్ఠుడు అనిపించుకుంటాడు. 2001 ఏ.డి. నుండి 2005 ఏ.డి.వరకు పూజ్య గురుదేవుల సూక్ష్మసత్తా మన మధ్య సక్రియంగా వుంటుంది కనుక అందుకు తగిన సాధనాలను, ప్రతిభలను ఉత్పాదన చేయుటయే ఈ రోజులలో చేయవలసిన కర్తవ్యము. బద్ధకమును దరికి రానీయకుండా ఉల్లాసంతో పనిచేసిన వారికే దాని ఫలితాలందుతా యనేది పరమసత్యం'. ఈ విషయం 1994 ఫిబ్రవరి 18 ప్రజ్ఞాఅభియాన్‌లో ప్రచురించారు. ఈ అక్షరసత్యాలను శ్రీశ్రీ మాస్టర్‌గారు పైన చెప్పిన కాలవ్యవధిలో (2001–2005) ఎంతో అద్భుతంగా ఆచరించారు. పరిజనులతో ఆచరింపచేశారు.

# అధ్యాయం-8

# ప్రదక్షిణలు – ఆపదల నివారణ

## గురుసత్తా మహోత్సవాలు – ఓడరేవు

ప్రకృతిలో నిరంతరం అనేకానేక అద్భుతాలు జరిగిపోతుంటాయి. గమనించిన వారికి అదొక పరమాద్భుతం. అదొక వరప్రసాదం కూడా. అలాంటి కాలాన్ని సద్వినియోగం చేసుకున్నవారి జీవితాలు ధన్యమైపోతాయి. అలాంటి మహత్వపూర్ణమైన సంఘటన ఒకటి ప్రకృతిలో 2004 డిసెంబర్ 24,25,26 తేదీలలో మెరుపులాగా మెరిసింది. డిసెంబర్ 25వ తేదీ అనేసరికల్లా అందరికీ గుర్తుకు వచ్చే పర్వదినం క్రీస్తు జన్మదినం. తిథుల ప్రకారం ఆ రోజు మార్గశిర పూర్ణిమ.

అది గురువులకు గురువు ఆదిగురువు, నిత్యావతారులైన శ్రీదత్తాత్రేయస్వామివారి జన్మదినం. అది కూడా 25వతేదీన రావడమనేది ప్రకృతిలో వచ్చిన ఒక విశేష నియతి.

అలాంటి మహత్తరమైన కాలాన్ని సద్వినియోగపరచుకోవాలనే సంకల్పంతో పూజ్యశ్రీ మాస్టర్ గారు 'సహ్యాద్రి దత్తాశ్రమం' ఓడరేవులో మూడురోజుల సాధనాశిబిరం 'గురుసత్తా మహోత్సవాలు' అనే బ్యానర్ మీద జరగాలని శ్రీ సుబ్బారావుగారికి కబురుచేయగా, వారు వెంటనే ఒంగోలుకు వచ్చారు. ఈ కార్యక్రమం ఎలా జరిపించాలనే దానికి మాస్టర్‌గారిచ్చిన విశేష సూచనలను జాగ్రత్తగా విని రాసుకొని వెళ్ళారు. ఆనాటి నుండి శిబిరానికి కావలసిన సమస్త ఏర్పాట్లనూ పద్ధతిగా చేశారు. గురుసత్తా మహోత్సవాలు కనుక వేదిక మీద ప్రధానంగా పెద్ద గురుసత్తా ఫోటోను ఇంకా సిద్ధపురుషులైన అనేకమంది మహనీయుల చిత్రపటాలను ఎంతో అందంగా అలంకరించి వేదిక మీద స్థాపించారు. గురుపరంపరలో శ్రీరామశర్మ ఆచార్య, మాతాజీ, శ్రీరామకృష్ణపరమహంస, శ్రీఅరవిందో, లాహిరీమహాశయ మొదలైనవారి జీవితవిశేషాలు, వారు చేసిన సాధనావిశేషాలను గురించి ధాటిగా చెప్పగలిగిన అనేకమంది సాధు,సత్పురుషులందరినీ తమ సందేశాలను చెప్పటానికి ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఒక్క మాటలో చెప్పాలంటే మాస్టర్‌గారు 'దీనిని ఒక సత్రయాగం లాగా' రూపొందించారు.

పరమగురువులు ఏ కార్యార్థమై ఈ భూమిపైన అవతరించారు, వారి సందేశాలేమిటి, వారిచ్చిన సాధనావిధానాలేమిటి, వాటిని మానవజాతికెలా అందించాలని తపనపడుతున్న మాస్టర్‌గారికి ప్రకృతి ప్రసాదించిన ఈ మూడురోజులూ ఎంతో అపురూపంగా కనిపించాయి. పరమగురువుల వాణిని వినిపించటానికి ఇంతకంటే పర్వదినాలెక్కడినుండి వస్తాయి? తక్షణమే ఓడరేవుకు బయల్దేరారు. ఈ మహోత్సవాలలో ముఖ్యంగా మానవుడు 1. రోగరహిత జీవితము. 2. వృద్ధాప్యరహితజీవితము. 3.మృత్యురహిత జీవితమును ఎలా సాధించాలనే విషయాలను చెప్పాలనేది వారి అభిమతం. సాధనాశిబిరం ప్రారంభించిన మొట్టమొదటి క్లాసులో వారు కొన్ని నియమాలనిలా చెప్పారు. ప్రతివారు

1. రోజుకు మూడు లీటర్ల నీరు త్రాగాలి.
2. ఆహారంలో 80% పచ్చికూరలు, 20% ఉడికించిన పదార్థాలను తీసుకోవాలి. రాత్రి పూట విధిగా పాలు త్రాగాలి.

3. ప్రతిరోజూ ఒకే సమయానికి ఆసన, ప్రాణాయామాలు చేయాలి.

4. గాయత్రీమంత్రంతో పాటు సవితా ధ్యానం చెయ్యాలి.

5. రోజుకు కనీసం ఒక గంట స్వాధ్యాయం చెయ్యాలి.

వీటితో పాటు వారానికోసారి యజ్ఞం చేసుకోవాలి. ఇలా ఇంకా ఎన్నో విషయాలు చెప్పారు. ఇంక ఆ క్షణం నుంచే సాధన ప్రారంభమైంది. ఇంతే కాకుండా మానవునిలో నిద్రాణంగా ఉన్న అనంతమైన శక్తిని జాగృతపరచటానికి ప్రాణశక్తి చాలా అవసరం. ప్రాణశక్తికి ప్రతీక సముద్రం. అలాంటి సముద్రతీరాన గల ప్రాణశక్తి కేంద్రమునందు ఈ మహోత్సవాలలో పాల్గొనాలనే ఉత్సాహంతో మారుమూల ప్రాంతాల నుండి సాధకులు వచ్చారు. ఈ సాధనలో పాల్గొనడమనేది సాధకుల అదృష్టం. మానవజాతి ఆలోచనాసరళిలో మార్పుతేవడం అనేది కేవలం ఒక్క గాయత్రీ మంత్ర శబ్దతరంగాలతో మాత్రమే సాధ్యమౌతుందనే తథ్యమాధారంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళలలో ఒక గంటసేపు సామూహిక గాయత్రీజపం చేయించేవారు. సాధనానంతరం ఒక్కొక్క గురువుకు సంబంధించిన జీవితలక్ష్యాలు, వారు ప్రపంచానికందించిన సాధనావిశేషాలతో కూడిన ప్రవచనాలుండేవి. ఈ కార్యక్రమం కోసం ఆహ్వానింపబడిన పెద్దలు వారికి నిర్దేశించిన సమయంలో ఆయా మహాపురుషులను గురించి ఉపన్యసించటం జరిగింది.

ప్రతిరోజూ ఎంతో ఉత్సాహంగా అందరూ మాస్టర్‌గారితో కలిసి సముద్రస్నానాలు చేయడ మనేది ఇక్కడ గొప్ప సాధన. ఆ తర్వాత జపం, యజ్ఞం, ప్రవచనాలు మాత్రమే కాకుండా ఈ శిబిరంలో ఒక క్రొత్త సాధన ఇవ్వబడింది. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ విధిగా 'ప్రఖర ప్రజ్ఞ, సజలశ్రద్ధ' స్మారక చిహ్నాలకు 8 ఆకారంలో వీలైనన్ని ప్రదక్షిణలను చేయమన్నారు. శ్రీమతి విజయా విశ్వనాధ్‌గారు బాధ్యతగా అక్కడే ఉండి ఎవరెన్ని ప్రదక్షిణలు చేశారో వ్రాసుకుంటున్నారు. అలానే ప్రతిరోజూ ఉదయం విశ్వఏకీకరణ యజ్ఞం చేయించేవాళ్ళం. మూడురోజులూ ఇదే విధంగా క్రమశిక్షణతో కార్యక్రమాలు జరిగాయి. ఇక్కడ ప్రత్యేకించి చెప్పాల్సిన విషయమేమిటంటే ఈ మూడురోజులలో చేసిన ప్రదక్షిల సంఖ్య 1 లక్షా 25 వేలని తేలింది. మాస్టర్‌గారెందుకు చేయించారో తెలియదు గానీ అందరూ అత్యుత్సాహంతో సకలపాప నివారణార్థం అనుకొని ప్రదక్షిణలు చేశారు.

డిసెంబరు 26వ తేదీన ఆగ్నేయాసియాతో సహా దక్షిణభారత దేశములోని కోస్తా ప్రాంత మంతటినీ అతలాకుతలం చేసిన అతి భయంకరమైన సునామీ సంభవించిందారోజున. సరిగ్గా అదే సమయంలో ఆశ్రమాలలో రోజువారీ సాధనలో భాగంగా 'సజలశ్రద్ధ-ప్రఖర ప్రజ్ఞల' చుట్టూ అందరూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాత్రి, పగలు చేసిన ఆ ప్రదక్షిణల సంఖ్య లక్ష 25వేలకు చేరింది. ఇక్కడ మూడురోజుల సాధన అయిపోయాక వేటపాలెం, టైంటేబిల్ ప్రకారం దత్తక్షేత్రంలో ఒక రోజు సాధనాశిబిరం జరుగుతుంది. అనుకున్న సమయానికందరూ వేటపాలెం చేరారు. ఇక్కడ ఒక విచిత్రం జరిగింది.

పూజ్యశ్రీ మాస్టర్‌గారి ప్రవచనం అయిపోయింది. శ్రీ జి.ఎస్. కృష్ణగారి ప్రవచనం జరుగు తున్నది. క్షణాలలో ఒక విచిత్రమైన వార్త ఆశ్రమంలో కలకలాన్ని రేపింది. సాధనాశిబిరంలో వున్న వారి బంధువుల దగ్గర నుండి ఫోను వచ్చింది. అప్పుడే అందిన వార్తగా, టి.వి.లో చూపిస్తున్న వార్తల ప్రకారం ఆ రోజు ఉదయాన సముద్రంలో సునామీ వచ్చి, తీరప్రాంతాలన్నీ బీభత్సంగా దెబ్బతిన్నాయి, అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. మరి మీరందరూ ఓడరేవులోనే ఉన్నారా? అక్కడి వాతావరణం ఎలా ఉందంటూ అందరూ ఆదుర్దాగా క్షణాల మీద శిబిరంలో ఉన్న అనేక మందికి ఫోన్‌లు వచ్చాయి. ఆపద వచ్చినప్పుడు పిల్లలందరూ వచ్చి అమ్మకి చెప్పుకున్న మాదిరి అందరూ పరుగుపరుగున వచ్చి **మాస్టర్‌గారికి ఈ ఫోను వార్తను వివరించగా, 'భూమాతకు పురిటినొప్పులు వచ్చాయి. ఇది ఒక విశాలమైన పరివర్తనకు నాంది. భయపడటానికేమీ లేదు. నిశ్చింతగా ఉండండి' అని కొండంత ధైర్యాన్నిచ్చారు.** సర్వజ్ఞులైన వారికిది తెలియని విషయం కాదు. మాస్టర్‌గారు ఎంత పెద్ద ప్రమాదాన్ని దాటించటానికో ఈ గురుసత్తా మహోత్సవాల పేరుతో ఇంత పెద్ద సామూహిక సాధనను నిర్వహించారో? ఎంత పెద్దసాధన జరిగిందీ మూడు రోజులూ. అఖండ గాయత్రీజపం, విశ్వఏకీకరణయజ్ఞం, ప్రఖరప్రజ్ఞ-సజలశ్రద్ధలకు చేసిన లక్షా పాతికవేల ప్రదక్షిణలు, పరమగురువుల జీవితరహస్యాలను చెప్పే ప్రవచనాలతో ఆశ్రమ ప్రాంగణ మంతా దైవీచేతనత్వపు దివ్యతరంగాలతో పులకించి పోయిన ఆ పవిత్ర వాతావరణంలో శుభాలు కాక మరేమి జరుగుతాయి.

ప్రకృతిలో వస్తున్న ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన మాస్టర్‌గారు ఈ గురుసత్తా మహోత్సవాల పేరుతో ఒక విశాలమైన సామూహిక సాధనలను చేయించి ఆ ప్రమాదం నుంచి

ఎంతమందిని రక్షించారో మనకు తెలియదు గదా! అమ్మయ్య, మనం బయటపడ్డాంలే, అయినా ఇప్పుడు మనం దత్తక్షేత్రంలో గదా ఉన్నాము. ఆ దత్త మహిమను గురించి ఎంతని చెప్పగలం? ఇంతటి రక్షణను ప్రసాదించిన ఆ పరమాత్మకు ధన్యవాదాలు తెలుపుకోవాలనే భావనతో, కృతజ్ఞతా పూర్వకంగా దత్తనామ సంకీర్తనను చేసి చివరగా 'స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం' అనే శుభ కామనతో సాధన ముగించారు.

## శంబళ సంపర్క సాధనా శిబిరము

డిసెంబరు 24,25 తారీకులలో జరిగిన సునామీ మరల తిరగబెట్టవచ్చని వాతావరణశాఖ వారు హెచ్చరించారు. ఈ ప్రకృతి విపత్తును తట్టుకునేందుకు వీలుగా కావలసిన సూచనలను మార్గదర్శనము అందించేందుకై సాధనాశిబిరం మరురోజే నిర్వహించాలని ఆదేశించారు. 2005 జనవరి 1వ తేదీన ఒంగోలులోని కళ్యాణమండపంలో ఒక్కరోజు సాధనాశిబిరం నిర్వహించటం జరిగింది. ఈ శిబిరానికి 'శంబళ సంపర్క సాధన' అనే బ్యానర్ పెట్టమన్నారు. ఆనాడు సంభవించిన విపత్తును తట్టుకునేందుకై మాస్టర్‌గారు చెప్పబోయే సాధనలు నేర్చుకోవాలని అన్ని గ్రామల నుండి ఎంతోమంది సాధకులు ఎంతో ఉత్సాహంగా వచ్చేశారు. ఈ శిబిరంలో ఆనాటి దేశ, కాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ రోజు శ్రీశ్రీ మాస్టర్‌గారిచ్చిన సందేశము యొక్క సంక్షిప్త సారాంశము ఇలా వున్నది.

'2005వ సంవత్సరం నుండి గురువుల బాహ్యప్రకటీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. వాళ్ళ వైపు నుండి వాళ్ళిస్తున్న నిర్దేశాలను మీకు స్పష్టంగా చెప్తున్నాను. వాటిని మీకు చెప్పి, ఏ సాధన ఎలా చెయ్యాలో చెప్పాక, **నేను భౌతికంగా మీకు** దూరంగానే ఉంటాను. విశేష కార్యక్రమాలలో తరగతులు చెప్పవలసి వచ్చినప్పుడు తప్ప మిగిలిన సమయాలలో మౌనంగా వుంటాను.

ఋషులందరికీ బయటకు రావాలనే వుంది. అయితే మానవజాతి వాళ్ళను బయటకు రాకుండా అడ్డుకుంటున్నది. మీరు కనుక నాకు సహాయసహకారాలనందిస్తే నా ప్రయత్నం నేను చేస్తాను. గురువుల బాహ్య ప్రకటీకరణకు మార్గము ఇవ్వాలన్నదే నా ఉద్దేశ్యము. ఎన్ని రకాలుగా చెప్పినా మనుషులు భయంకరమైన అంధకారంలోనే ఉంటున్నారు. నా కష్టములు, నా బాధలు, నా పరిస్థితులు ఇలా వున్నాయని వాపోతున్నారే గానీ ఋషుల ప్రణాళికలకు, 'నా వంతు సహకారాన్ని

నేను అందిస్తాను' అనే మానసికస్థితి ఎవ్వరికీ రావడం లేదు. **ఈ కష్టాలు రావడం అనేది ఒక రకంగా మంచిదే ! తర్వాత చూసుకుంటే అవి ఎందుకొచ్చాయో అర్థమౌతుంది.** కానీ నేను చెప్పవలసినదంతా 2005 డిసెంబర్ 31వ తేదీ లోపల నాకు అర్థమైనదంతా నేను చెప్పేస్తాను. మీరు కాస్త తీవ్రంగా విని అర్థం చేసుకొని ఇతరులకు చెప్పండి. శంబళ సంపర్క కేంద్రాలు అన్ని ఊళ్ళల్లోనూ రావాలి. (ఈ బ్యానర్లు ముందుగానే చేయించి, కేంద్రం పెట్టుకుంటామనే వారికి ఇవ్వటం జరిగింది.)

నా కార్యక్రమాలను రెండు భాగాలుగా విభజించుకుంటున్నాను. 1.వ్యక్తిగతమైన బాధలన్నింటిని ప్రక్కన నెట్టి నేను చెప్పినట్టుగా తీవ్రమైన సాధనలు చేసే వాళ్ళు మొదటి రకం. వీరు రోజుకు ఆరుగంటలు సాధన చేసేవారు. అలా తీవ్ర సాధనలు చేసే వాళ్ళకి మాత్రమే నా వాక్‌శక్తి ఉపయోగపడుతుంది. ఈ సాధన చేసేవారి కోరికలు చాలా సహజంగా తీరిపోతాయి. ఇకపోతే రెండవ రకం వారికి తేలికైన సాధనలను ఇస్తాను. అవి చేస్తే చాలు. దానికి తగిన ఫలితాలను వారు పొందుతారు.

ముందుగా తమ బాధలు, కష్టాలు తీరాలనుకునేవాళ్ళు చేయవలసిన అతి సరళమైన సాధనలను చెప్తాను. ఈ సాధనలలో మీకు వీలైన, చేయగలిగిన సాధనలను ఎంచుకొని క్రమం తప్పకుండా చేసినట్లయితే మీ మీ సాధనా తీవ్రతను బట్టి కోరికలు తీరుతూవుంటాయి. చేతనత్వవిజ్ఞానంలో అన్నమయకోశము, కామమయకోశము, అథో మానసిక కోశములను ఉపయోగించడం నేర్చుకుంటారు. నేను చెప్తున్న విభిన్నసాధనలు ఈ లక్ష్యమును అనగా మనస్సు, వాక్కు, కర్మకాండల సమన్వయాన్ని గుర్తుంచుకొని ఆచరించాలని చెప్పారు. ప్రతి సాధకుడు రోజుకు 2.5 లీటర్ల నీరును తాగాలి. టీ, కాఫీలను మానెయ్యాలి. ప్రతి రోజూ తప్పని సరిగా

**చందనస్య మహత్పుణ్యం పవిత్రం పాపనాశనం,**
**ఆపదాం హరతే నిత్యం లక్ష్మీస్తిష్టతి సర్వదా॥**

అనే శ్లోకాన్ని చదువుతూ, కుడిచేతి ఉంగరపు వ్రేలును మనం బొట్టు పెట్టుకునే దగ్గర కాసేపు వుంచాలి. ఎందుకంటే కుడిచేతి ఉంగరపు వేలుకు, హృదయగత భావనలకు దగ్గర సంబంధం వున్నది. ఆజ్ఞాచక్రము వద్ద 'గురుప్రబోధన' నిరంతరమూ జరుగుతూ వుంటుంది.

కుడిచేతి ఉంగరపు వేలును అక్కడ వుంచుకొని పై శ్లోకమును చదివినప్పుడు మనో,వాక్కాయ,కర్మల సమన్వయం జరుగుతుంది. దానివలన మహత్తరమైన పుణ్యము, పవిత్రత, పాపనాశనము జరగడమేకాకుండా, నిత్యమూ వచ్చే ఆపదలు, ప్రమాదాలు మరియు రోగాల నుండి రక్షణ లభిస్తుంది. **మనకున్న వనరులను కోల్పోము. లక్ష్మి స్థిరంగా వుంటుంది. నిద్ర లేవగానే, పడుకునే ముందు కుడిచేతి ఉంగరపు వేలుతో ఆజ్ఞా చక్రమును స్పృశిస్తూ పై మంత్రాన్ని ఉచ్చరించాలి. అలా మౌనంగా నిద్రాస్థితిలోకి వెళ్ళిపోవాలి. దీని వలన మీ జీవితం చక్కటి రక్షణ వలయంలో వుంటుంది. ముఖ్యంగా మీరు ఎప్పుడు బయటకు వెళుతున్నా, ఆజ్ఞాచక్రం దగ్గర మీ ఉంగరపు వేలు పెట్టుకొని, భావనాత్మకంగా పై శ్లోకాన్ని చదువుకొని వెళితే ఎలాంటి ప్రమాదాలు** జరగవు.

ఇలాంటివే మొత్తం 48 సాధనలను రూపొందించి అందులో ఎవరు ఏది చెయ్యగలరో ఎంచుకొని రోజుకు ఆరుగంటలపాటు చేసే సాధనా పద్ధతులను, వివరించి ఈ సంవత్సరమంతా వాటిని పాటించాలని చెప్పారు.

## ఆపో జ్యోతి సాధన

ఈ సాధనాశిబిరంలో మాస్టర్‌గారు శక్తివంతమైన నూతన ప్రదక్షిణా విధానాన్ని పరిచయం చేశారు. ప్రకృతిలో రాబోయే అనేక విపత్తుల నివారణార్థం సాధన చిన్నదే కాని అత్యంత శక్తివంతమైన సాధనను శ్రీశ్రీ మాస్టర్‌గారిచ్చారు. అతివృష్టి, అనావృష్టి, అగ్ని ప్రమాదాలు, సునామీలు, భూకంపాలు మొదలైన అనేక ప్రకృతి వైపరీత్యాల బారి నుండి ఈ ప్రకృతిని, మానవజాతిని రక్షించడానికి ఇవ్వబడిన విశేషమైన సాధనతో పాటు మాస్టర్‌గారి ప్రత్యేక ప్రవచనాలుండేవి. ప్రతి రోజూ పంచకుండీ యజ్ఞం, ఏడురకాల ప్రాణాయామాలు, ఇంకా నూతన సంవత్సర వేడుకలతో జరిగిన ఈ శిబిరం అందరికీ ఎంతో ఆనందాన్నిచ్చింది.

ది.31.12.2004వ తేదీ సాయంత్రం నుంచే శిబిరం ప్రారంభించారు. భౌతిక జగత్తులో పిల్లలకు ఏ రకమైన పాఠ్యాంశాలు, శిక్షణా తరగతులు జరుగుతాయో అలానే ఆధ్యాత్మిక జగత్తులో కూడా మనిషి పరిణామక్రమంలో ఉన్నత స్థాయికి వెళ్ళటానికి అవసరమయ్యే కొన్ని పాఠ్యాంశాల క్రమం ఈ శిక్షణాశిబిరంలో ప్రయోగాత్మకంగా పరిచయం చేశారు.

ఈ శిబిరంలో మొట్టమొదటగా శ్రీశ్రీ మాస్టర్‌గారు ప్రదక్షిణల విశిష్టతను గురించి ఋషులిచ్చిన అతిసరళమైన ప్రాథమిక సూత్రాన్ని వివరించారు. అది అందరికీ తెలిసిన మంత్రమే కానీ దాన్ని అందరూ ఎంతో యాంత్రికంగా, అన్యమనస్కంగా చేస్తుంటారు. ఇందులో ఎంత లోతైన అర్థం వున్నదో, ఎంత లోతైన సాధన ఉన్నదో ఆ రోజున వారు చెప్పాక అర్థమైంది. ముందుగా ఈ శ్లోకాన్ని అందరితో చెప్పించారు.

**యాని కానిచ పాపాని జన్మాంతర కృతానిచ ।**
**తాని సర్వాణి నశ్యంతి ప్రదక్షిణాయాం పదేపదే ॥**

అనే శ్లోకంలో ఎంత అద్భుతమైన పరమార్థమున్నదో వివరించారు. దేవాలయాలలో చేసే ప్రదక్షిణల ప్రాశస్త్యాన్ని, గుడిలో దక్షిణ ఇవ్వటం, తీర్థ ప్రసాదాలను స్వీకరించటంలో గల మాహాత్మ్యాన్ని కూలంకషంగా వివరించారు.

ఆ తర్వాత ప్రకృతి విపత్తుల వలన జరిగే అరిష్టాలను నిరోధించగలిగే అద్భుతమైన సాధనను మొట్టమొదటిసారిగా ఈ శిబిరంలో ప్రయోగాత్మకంగా అందరిచేత చేయించారు. '8' అంకె ఆకారంలో చేసే ప్రదక్షిణా విధానం ఉధృతమైన ప్రభావాన్ని కలుగచేస్తుంది. మంచి ఆలోచన రాగానే సరిపోదు. దానికి తగిన ఆచరణ కూడా కావాలి. మన జీవితాలలో రకరకాల సమస్యలు వస్తుంటాయి. ఆ సమస్యలకు పరిష్కారమార్గం దొరకక నానా అవస్థలూ పడుతుంటాము. ఈ ఎనిమిది ఆకార ప్రదక్షిణల వలన మన ఆలోచనా విధానంలో లక్షణమైన మార్పులే కాకుండా, ప్రకృతిలో వచ్చే అనేక విపత్తుల నుండి రక్షించగలిగే ప్రభావం ఈ పరిక్రమావిధానంలో ఉన్నది. ఎనిమిది అనేది కుండలినికి సంబంధించిన సంఖ్య. ఎనిమిది ఆకారంలో ప్రదక్షిణ చేయడం వల్ల ఆ అంకె మధ్యలో ఉన్న బిందువు నొక్కబడి పృధ్వికి రక్షణ ఏర్పడి భూకంపాలు, సునామీలు రాకుండా ఉంటాయని మాస్టర్‌గారు ఇలా అందరితో చేయించారు. ఈ ప్రదక్షిణా విధానాన్ని ఒక సంవత్సరం పాటు అందరూ తమతమ ఇళ్ళల్లో చేస్తూ కరపత్రాల ద్వారా అందరికీ తెలియచెప్పి వారితో చేయించాలని ఆదేశించారు. మాస్టర్‌గారి ఆదేశాన్ని అందరూ అక్షరాలా పాటించారు.

మహాభారతయుద్ధంలో ఎనిమిది సంఖ్యలో జన్మించిన ఇద్దరు మహావ్యక్తులున్నారు. ఒకరు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుని కంటె ముందు పుట్టిన ఏడుగురిని కంసుడు వధించాడు. అలానే ఇంకొకరు

భీష్ముడు, ఆయన కూడా ఎనిమిదవ సంతానంగానే జన్మించాడు. భీష్ముడి కంటే పైన పుట్టిన ఏడుగురిని స్వయంగా తల్లే గంగపాలు చేసింది. ఈ పురాణగాథలోని అంతరార్థం తర్వాత వివరించటం జరిగింది. ముఖ్యంగా ఎనిమిది అంకె మాదిరి చేసే ప్రదక్షిణాల వలన ఎన్నో మహా ప్రయోజనాలు, సద్గురువుల ఆశీర్వాదాలు లభించటంతో పాటు ప్రకృతి విపత్తుల నుండి రక్షణ కలుగుతుంది.

ఈ సాధనాశిబిరానికి ఒక రెండు రోజుల ముందు ఒకరోజు మధ్యాహ్నం సుమారు 4.00 గంటల ప్రాంతంలో ' మనం అనుగ్రహ పీఠానికి వెళ్దాం' అన్నారు. శ్వేతద్వీపం నుండి అనుగ్రహ పీఠానికి నడిచి వెళ్ళేంత మాత్రం దూరమే ఉంటుంది. సరే వెళ్ళాం. అనుగ్రహపీఠంలో ఉంటున్న సీతామహలక్ష్మిగారు, సీతా వాళ్ళంతా వచ్చేశారు. వెంటనే ఒక కలశాన్ని చక్కగా అలంకరించమన్నారు. అలాగే ఒక దీపాన్ని సిద్ధం చెయ్యమన్నారు. ఎత్తుగా ఉండే రెండు ముక్కాలి పీటలను అందంగా అలంకరించి ఆ రెండింటినీ 8 అడుగుల దూరంలో పెట్టించారు. ఈశాన్యం దిక్కులో వున్న పీటమీద కలశాన్ని, అలాగే ఆగ్నేయ దిశలో వున్న పీట మీద దీపాన్ని పెట్టించారు. ఇంతలోనే శ్రీశ్రీ మాస్టర్‌గారు అనుగ్రహపీఠంలో వున్నారని తెలిసి చుట్టు ప్రక్కల వున్న పరివార్ వాళ్ళంతా వచ్చేశారు. అందరినీ కూర్చోబెట్టి, ఇప్పుడు తాము చెప్పబోయే నూతన ప్రదక్షిణా విధానాన్ని గురించి వివరించి అందరిచేత ప్రదక్షిణలు చేయించారు. ఆ రెండూ తీయవద్దు, అలానే ఉంచండి. ప్రతిరోజూ ఎవరికి వీలైన సమయంలో వారు వచ్చి తప్పనిసరిగా ప్రదక్షిణలు చెయ్యండని చెప్పారు. అప్పటికే వాతావరణశాఖవారు ఇస్తున్న హెచ్చరికలు అందరికీ తెలియటంతో యుగసైనికులంతా నడుం బిగించి సాధనలు మొదలు పెట్టారు. మాస్టర్‌గారు ఒక సాధన చెప్పారంటే అందులో ఏదో పరమార్థం ఉంటుందనేది పరమసత్యం. అందుకనే వారు ఏం చెప్తే దానిని తక్షణమే చేయటం ఎంతో శ్రేయస్కరం.

మానవుని మెదడులో ఎంత జ్ఞానము నిక్షిప్తం చేయబడి వుంటుందంటే, ఖనిజ జగత్తు మొదలుకొని వృక్ష జగత్తులోని అనుభవాలను, ఆ జ్ఞానాన్ని మానవశరీరంలోని ఆత్మ మెదడులో దాచి ఉంచుతుంది. అంతే కాదు భవిష్యత్తుకు సంబంధించిన ప్రతి సంఘటన కూడా మనిషి మెదడులో రికార్డు చేయబడివుంటుంది. ఋషులు చెప్పిన ఈ సిద్ధాంతానికి ఉదాహరణ చెప్పాలంటే సుమారు 75 వేల సంవత్సరాల క్రితం ఫలానా రోజు నీ పరిస్థితి ఏమిటనేది కూడా నీ సబ్ కాన్షస్ మైండ్‌లో వుంటుంది. అలాగే రాబోయే ఓ లక్ష సంవత్సరాల తర్వాత నీవు ఎలాంటి స్థితిలో

వుంటావనేది కూడా నీ సూపర్‌కాన్స్‌స్‌మైండ్‌లో అతి స్పష్టంగా నోట్ చేయబడి వుంటుంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు అనుభవజ్ఞుడైన వ్యక్తి, గత అనుభవాల జ్ఞానంతో దానిని పరిష్కరించుకో గలుగుతాడు. ఎలాంటి సమస్యకైనా అద్భుతమైన పరిష్కారాన్ని చూపించి దానిని ఆచరణలో పెట్టగలిగే శక్తిని ఈ ప్రదక్షిణలు ప్రసాదిస్తాయి. వినడానికి నమ్మశక్యం కాకపోయినా ఇది యథార్థం. ఆ రోజున అక్కడ ప్రారంభించిన ఈ ప్రదక్షిణల శృంఖల ఒక సాధనగా అన్ని ఆశ్రమాలలో, అనుగ్రహ పీఠాలలో కూడా ప్రారంభించారు.

2004వ సంవత్సరం డిసెంబరు నెలలో ఓడరేవు ఆశ్రమంలో జరిగిన గురుసత్తా మహోత్సవాలలో ప్రఖరపజ్ఞ, సజల శ్రద్ధలకు ఈ ఎనిమిది ఆకారంలో చేసిన ప్రదక్షిణ ప్రభావమేమిటో ప్రత్యక్షంగా అందరికీ అనుభవమైంది. ఆనాడు మాస్టర్‌గారు చెప్పిన ఆ పరిక్రమావిధానం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది.

**ప్రఖరప్రజ్ఞ, సజల శ్రద్ధ స్మారకాల నిర్మాణాలు చేసినప్పటి నుండి సహ్యాద్రి ఆశ్రమంలో ఇదే క్రమం కొనసాగిస్తున్నారు. ప్రతి ఒక్కరు అక్కడ ఐదు దీపాలు పెట్టి, రోజు మొత్తంలో 108 ప్రదక్షిణలు 8 ఆకారంలో చెయ్యాలి. అలా నియమం పెట్టి అందరిని ప్రదక్షిణలు చేయమన్నారు. చేసిన వారికి అద్భుతమైన లాభాలు వస్తున్నాయి.**

## ఆధ్యాత్మిక సిలబస్

**ఆ రోజు చెప్పిన ప్రవచనం:** రాబోయే రోజులలో ఈనాటి వైద్యవిధానంలో ఎలాగైతే అలోపతీ, హోమియోపతీ, ఆయుర్వేద అని రకరకాల విధానాలున్నాయో అలాంటి విశిష్టమైన మార్పులను ఆధ్యాత్మిక విద్యలో కూడా తేవాలి. అలాగే యోగవిద్యలో కూడా విశిష్టమైన మార్పును తేవాలి. అసలు మనం యోగవిద్యకు సంబంధించిన ఋణానుబంధంతోనే కలుసుకున్నాము.

ఆధ్యాత్మికవిద్య తెలియని కారణంగా వ్యక్తి ఈనాడు తాను కష్టాలను కొనితెచ్చుకోవటమే కాకుండా, ఇతరులను కూడా కష్టాలపాలు చేస్తున్నాడు. పూర్వకాలంలో ఏ విధమైన రవాణా సౌకర్యాలు లేకుండానే భారతదేశంలో యోగవిద్య నేర్చుకోవడానికి విదేశీయులు సైతం వచ్చేవారు. ఎందుకంటే భారతదేశం యోగవిద్యకు పుట్టినిల్లు. ఈనాటి విద్యావిధానంలో సరైన అవగాహన లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జీవితం ఉత్సాహంగా, ఆనందంగా, క్రొంగొత్తగా వుండేలా

చేసుకోవాలి. శ్రీకృష్ణుని జీవితం అందుకు సరైన ఉదాహరణ. ఈ క్యాంప్‌లో మీకు స్కూల్ ఎడ్యుకేషన్ లోలాగే ట్రైనింగ్‌నిస్తాను. ఇది ఆడుతూ, పాడుతూ నేర్చుకునే విద్యగాదు. కష్టపడి నేర్చుకోవాలి. ఇదివరలో మీకు దీన్ని గురించి చెప్పిన నాలుగు సాధనలను మళ్ళీ ఒక్కమాటు గుర్తుచేసుకుందాం!!

(1) ఆసనాలు, (2) ప్రాణాయామాలు, (3) జపం, (4) ధ్యానం. నిత్యజీవితంలో కాలకృత్యాలు తీర్చుకొని శుభ్రంగా బట్టలేసుకున్నట్లే, వీటిని కూడా నిత్యకృత్యములో భాగంగా చేసుకొని నిష్టతో ఆచరించాలి. ఈ విద్య నేర్పడానికి పెద్దలు ఎంత కష్టపడ్డారో మీరు ఊహించలేరు.

గాంధీగారైతే పండ్లు తోముకునే పని దగ్గర్నుండి ప్రతి చిన్న విషయాన్ని ఆశ్రమవాసులకు నేర్పించారు. పళ్ళు తోముకోవడం, స్నానం చెయ్యడం, నీళ్ళు త్రాగడం, అన్నం తినడం, వస్త్రాలు ధరించడంతో సహా అన్ని పనులు కూడా యోగవిద్యలోని ప్రధానాంశాలే. నీళ్ళు సరిగ్గా ఉపయోగించుకోవడం వస్తే మనకి నీళ్ళకు కరువుండదు. ఇదంతా యోగవిద్యే. ఈసారి జప, ప్రాణాయామాలను ధ్యానంగా మార్చాను. **మీకు ధ్యానం చెయ్యడం ఎప్పుడు వస్తుందంటే, బట్టలు వదలి మళ్ళీ కట్టుకోవటంలాగా శరీరాన్ని వదలడం వచ్చిన వారికి వస్తుంది.**

### ధ్యానం

ధునీవాలాదాదావారు ఏడు సంవత్సరముల బాలుడుగా ఉన్నప్పట్నుండి నర్మదానదీ పరిక్రమను జీవితాంతం చేసేవారు. "వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణోతి నరోపరాణి" అని గీతలో చెప్పినట్లుగా వారు 4 సార్లు చనిపోయి 4 సార్లు జన్మించారు. ఇది తెలిసి ధ్యానం చెయ్యాలి. ధ్యానానికి పరాకాష్టయే ఈ విధమైన ప్రాక్టీసు.

### ప్రాణాయామం

ధ్యానంలో మీకు సరైన పట్టువస్తే, మరుసటి జన్మలో మీరెక్కడ పుట్టాలో తెలుస్తుంది. ఈ జన్మ తర్వాత పుట్టుకలో ఏ శరీరంలోకి, అంటే ఏ తల్లిగర్భంలోకి దూరాలి అనేదానికి ప్రాణాయామం ఎలా ఉపయోగపడుతుందో నేర్చుకోవాలి.

1. ప్రాణాయామం ద్వారా శరీరం ఎలా వదులుతారు?
2. ధ్యానం ద్వారా జన్మ ఎలా తీసుకోవాలి?

3. జపం ద్వారా ఇదంతా జరగడానికి కావలసిన వనరులనెలా సమీకరించుకోవాలో తెలుస్తుంది.

దీనికంతటికీ కారణం నర్మదానదీ పరిక్రమ. నదుల పరిక్రమ ఎందుకో అర్థమైంది కదా! ప్రాణాయామం నేర్చుకోవటానికి రెండు సంవత్సరములు పడుతుంది. దానికి మీ శరీరంలో ఉండే ఒక నదిని ఎన్నుకోవాలి. దానిని ఉపయోగించుకునేందుకు పుష్కరం అంటే 12 సంవత్సరాలు పడుతుందంటారు ధునీవాలా బాబా. ఆయన నర్మదానదీ పరిక్రమ చేస్తూ ప్రాణాయామాన్ని పట్టుకున్నారు. దీనికి పిండాండ బ్రహ్మాండ సమన్వయం చాలా ముఖ్యం.

జపంతో విద్యుత్తు, శబ్దము, ఉష్ణము అనే మూడు రకాల వనరులను సమీకరించుకోవచ్చు. ఈ మూడు శక్తులను ఆధ్యాత్మికతలో ఎనర్జీ ఆఫ్ లైట్, ఎనర్జీ ఆఫ్ సౌండ్, ఎనర్జీ ఆఫ్ హీట్‌గా చెప్తారు. సౌండ్ అంటే జపం. జపంలో ఎనర్జీ ఆఫ్ సౌండ్‌ను ఉపయోగించుకుంటాం. అంటే శబ్దశక్తిని ఉపయోగించుట. ఇక్కడ దీనిని సరిగ్గా ఉపయోగించుకుంటే ప్రాణాయామం మరియు ధ్యానాదులకు కావలసిన వనరులన్నీ సులభంగా సమీకరించబడతాయి. హీట్ అంటే ప్రాణాయామం. శరీరంలో వేడి పెరగాలి. ప్రాణాయామం చేస్తే శక్తివంతమైన వేడి ఉత్పన్నమౌతుంది. అందుకు మంత్రవిజ్ఞానానికి కావలసిన వనరులను సమీకరించుకోవాలి. సౌండ్ పొటెన్సీని ప్రాణాయామంలో కలుపుతాం.

ఓం భూర్భువఃస్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ – ఇదే లైట్.

**ఇదొక అద్భుతమైన ఆధ్యాత్మిక రహస్యం.** తర్వాత కాలంలో శ్రీశ్రీ మాస్టర్‌గారు ఈ టెక్నిక్‌ని ఉపయోగించే, అనేక ఆశ్రమాలను పునర్నిర్మాణం చేశారు. ధ్యానం అంటే లైట్. దీన్ని ఎలా నేర్చుకోవాలి. ఋషులు శబ్దాన్ని ఎలా ఉపయోగించుకున్నారు. ఏ వస్తువైనా సూక్ష్మీకృతం అయితే దాని పవర్ ఎలా పెరుగుతుందో మనమీనాడు కళ్ళారా చూస్తూనే ఉన్నాం. ఈ సాధన సామూహికంగా చెయ్యాలి. ప్రాణాయామంలో (1) స్లో డీప్ బ్రీతింగ్‌లో సో2హం శబ్దాన్ని వింటూ సాధన చెయ్యండి. ఇందులో రిథమ్ ముఖ్యం. దానితో పాటు సంకల్పశక్తి చాలాచాలా ముఖ్యం. ఈ సాధనలో అద్భుతమైన ఆనందం వస్తుంది. యు ఫర్‌గెట్ యువర్ బాడీ, చివరగా కేవల కుంభకం అంటే పూర్తిగా పీల్చి వదలడం చేస్తే చాలు. జపం చేసేటప్పుడు మాలలో ఉన్న 108 పూసల స్పర్శ

తెలియడం చాలా ముఖ్యం. ఈ స్పర్శ వలన, మనలోని పంచప్రాణాల ప్రవాహం తెలియడంతో పాటు మనకు కావలసిన వనరులు వస్తాయి.

## అనీబిసెంట్ సాధన

ఓం......... ఆజ్ఞ నుండి మూలాధారం వరకు 3 సార్లు

సహస్రారంలో ....... అ ........ ఉ .......మ్ .......... 3 సార్లు

ఇలా సాధన చేసి, స్వాధ్యాయం చేస్తే అనిబిసెంట్‌కు రేపు స్పీచ్‌లో ఏం చెప్పాలనేది మూడు పంక్తులలో కనిపించేదిట! అలా ఎవరు చేసినా ఆ అనుభవం అందరికీ లభిస్తుంది. ఈ సాధనను అనిబిసెంట్ చేసేవారు.

### తపస్సును ఎలా చెయ్యాలి

04.01.2005 అనుగ్రహపీఠంలో తపస్సు ఎలా చెయ్యాలి? అనే విషయంమీద అద్భుతమైన సాధనను ఇచ్చారు. క్షణం తీరిక లేకుండా పరుగులు పెడుతూ జీవిస్తున్న ఈనాటి మానవుడికి శాంతి ఎంతో అవసరం. దాని కొరకు మనిషి పరిపరి విధాలుగా ఆలోచిస్తూ దారీ, తెన్నూ తెలియక ఎక్కడికెక్కడికో వెళుతూ ఎందరినో ఆశ్రయిస్తూ ఎంతో డబ్బును ఖర్చు చేసుకుంటూ ఎక్కడా ఏమీ పొందక చివరికి రిక్తహస్తాలతో ఇంటికి వస్తున్నాడు. ప్రతి సమస్యకూ పరిష్కారం మన దగ్గరే వుంది. దానికొరకు ఎక్కడ వెతకాలి, ఏం చెయ్యాలి అనేది ఈ రోజు సాధనలో ఇలా చెప్పారు. తపస్సే అన్ని సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తుంది. కాబట్టి దానినే అందరూ చేయవలసి వుంటుంది. అయితే ఈ శరీరంతో ఆ తపస్సెలా చెయ్యాలి? అనేది అందరూ అర్థం చేసుకోవాలి.

**శ్లో: దేహోదేవాలయో ప్రోక్తః జీవోదేవస్సనాతనః।**
**త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్ ॥**

**అర్థం:** శరీరమే దేవాలయం. సనాతనుడైన దేవుడు ఇందులోకి జీవుడుగా దిగి వచ్చాడు. ధర్మసాధనకు ఈ శరీరం చాలా అవసరం. అనేక జన్మల పుణ్యఫలంగా సాధించుకున్న ఈ శరీరమును కర్మబంధాలలో చిక్కుకొనకుండా కాపాడుకుంటూ సాక్షీభూతంగా నిత్యజీవితాన్ని సాగిస్తూ, ఆత్మోన్నతి వైపుకు అడుగులు వేయడానికి మాస్టర్‌గారు మనకు అనేక సాధనలను

ప్రసాదించారు. అలా పరిణామక్రమంలో ముందుకు వెళ్ళటానికి తపస్సు, స్వాధ్యాయాలు ఎంతో ఉపకరిస్తాయి. అందుచేత ఈనాటి దేశ,కాల పరిస్థితులకు వీలుగా వుండే సరళమైన సాధనలను చెప్పారు.

2005వ సంవత్సరం ప్రారంభంలో వేదమాత గాయత్రీ అనుగ్రహపీఠంలో 'తపస్సునెలా చెయ్యాలి' అనే అంశం మీద ప్రథమ సాధనా తరగతులను ప్రారంభించారు. తపస్సు చెయ్యాలంటే ముందుగ పద్మాసనంలో చిన్ముద్ర లేక జ్ఞానముద్రలో కూర్చోవాలి. రెండు భుజాలు, వెన్నుపూస నిటారుగా ఉండాలి. 'నేను కదలను, కళ్ళు తెరవను' అని అనుకుంటూ శరీరాన్ని గమనిస్తూ, చర్మంలోపల వున్నది "నేను", చర్మం బయట ఉన్నది ప్రపంచం" అని గట్టిగా పదేపదే అనుకోవాలి. దాని తరువాత గీతలో కృష్ణుడు కూర్చునే విధానాన్ని గురించి చెప్పిన శ్లోకం

**సమంకాయ శిరోగ్రీవం ధారయన్ అచలం స్థిరః ।**
**సంప్రేక్ష్య నాశికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥**

అనే శ్లోకాన్ని చదువుకోవాలి.

ఇది రాకుండా సాధనలు చేస్తే ఏం లాభం లేదు. పదేపదే అనుకోండి చర్మంలోపల నేను – చర్మం బయట ప్రపంచం అని. స్పర్శను గమనించండి. చిటికన వేలు నుండి శరీరం యావత్తు స్పర్శను అనుభవించండి.

ఆధ్యాత్మికత మొత్తం గురుస్పర్శ మీదనే ఆధారపడియున్నది. ఆ గురుస్పర్శను తట్టుకోగలిగే స్థితికి రావాలి. స్థిరంగా పద్మాసనంలో కూర్చోండి. తపస్సులో ఆసనశుద్ధి చాలా అవసరం. మీరు గమనించవలసింది కేవలం స్పర్శను మాత్రమే. **రెండవ చరణం సూర్యధ్యానం:** ఉదయిస్తున్న సూర్యుని బంగారు రంగు కిరణాలు శరీరం మీద పడుతున్నాయి. ఆ బంగారు కాంతి శరీరంలో ప్రతిబింబిస్తోంది. ఆ బంగారు రంగు కిరణాలు మీలో ఉత్సాహాన్ని, సక్రియతను తీసుకువస్తున్నాయి. రాగినాణెం మీద నాయనగారి (శ్రీరమణమహర్షిగారు, గణపతిమునిని నాయన అని పిలిచేవారు) చెమట బిందువు పడితే అది బంగారం లాగా అయిపోయింది. సూర్యుని ఆకర్షణా ప్రభావంతోనే గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయి. ఈ సూర్యకిరణాలను మీరూ ఆకర్షించుకోండి. ఆ బంగారు రంగు కిరణాలు మీ శరీరంలోని అన్ని భాగాల మీద పడుతున్నాయి. మీలో ఉత్సాహం వస్తోంది. తపస్సు చెయ్యాలనే ఉత్సాహం వస్తోంది. ఆ ఉత్సాహాన్ని తెచ్చుకోండి.

తపస్సులోని మొదటి భాగం **"సమంకాయశిరోగ్రీవం".**

దాని తర్వాత సూర్యుని నుండి వచ్చే ఆ సూర్యకిరణాలను పీల్చుకోవాలి. దాని వలన మీలో ఉత్సాహం, సక్రియతలు వస్తున్నాయి. దాంతో ఆనందమయ స్థితి రావాలి. మీరు ఆ సువర్ణకిరణాల స్పర్శను అనుభూతిలోకి తెచ్చుకోలేకపోతే ఉత్సాహం రాదు. ఆ స్పర్శను పదేపదే అనుభూతిని చెందండి. అలా గాయత్రీమంత్రం చేస్తే ముందుగా మీకు వచ్చేది సువర్ణవిద్యే. ఇదే విషయాన్ని గురుదేవులూ చెప్పారు. గణపతిమునీ చెప్పారు. మంత్ర జపం చెయ్యండి. అయితే దాంతో పాటు సవితా ధ్యానం చేయడమనేది చాలా అవసరం. **ఈ జపం వలన ఉత్సాహం, సక్రియతలు, పెల్లుబకాలి.**

## మణిపూరక చక్రం - 10 దళాలు. నాభి దగ్గర ధ్యానం

**మూడవ చరణం**: మణిపూరక చక్రం మీద సూర్యకిరణాలు పడుతున్నాయి. ఈ మణిపూరక చక్రంలో పది దళాలుంటాయి. ఈ పసుపురంగు దళాల మీద సూర్యకిరణాలు పడుతున్నాయి. దాని వలన సంయమనం వస్తున్నది. సంయమనంతోపాటు ఆరోగ్యం వస్తుంది. **మనస్సును మణిపూరకచక్రం మీద పెట్టి గాయత్రి చేస్తే ఆ ధ్యానం వలన సంయమనం, దాని వలన ఆరోగ్యమూ వస్తాయి.** దీని వల్ల మీ జీవితాలలో ఉత్సాహము, ఆనందమూ కలుగుతుంది. కనుక ఈ ధ్యానం మీ జీవితాలలో పుష్పించి పల్లవించాలి.

## అనాహత చక్రం - 12 దళాలుంటాయి. హృదయం మీద ధ్యానం

ఈ సాధన వలన మీ మానసిక స్థితిలో దివ్యమైన మార్పు వస్తుంది. అది శ్రద్ధ, సత్ప్రవృత్తుల రూపంలో వికసిస్తుంది. ఈ సాధనలో మీరు సూర్యకిరణాలు అనాహతం మీదపడుతున్నాయని ఊహించుకోవాలి. ఇది చాలా ముఖ్యమైన చక్రం.

"శ్రద్ధామయోయం పురుషః" అని గీతలో చెప్పినట్లు మనలో శ్రద్ధ వికసించాలి అంటే హృదయంలో ఉన్న పరమాత్మ చెప్పిందే చేస్తాననే భావన రావాలి. దీని వెనుక గాయత్రీ మంత్ర జపం జరుగుతూ వుండాలి. తపస్సు చేసేటప్పుడు మంత్రం పైకి చెప్పరాదు. **అనాహత చక్రధ్యానము వలన సాధకునిలో శ్రద్ధ, సత్ప్రవృత్తులు వస్తాయి.**

## ఆజ్ఞాచక్రం - రెండు దళాల మీద ధ్యానం చేస్తాము

మనస్సును ఆజ్ఞాచక్రంలో ఉంచి గాయత్రీ జపం మానసికంగా చెయ్యాలి. ఈ జపంలో **'నాలో వివేకం, సాహసం వికసిస్తున్నాయి'** అనే తీవ్ర భావసంవేదనను తెచ్చుకోవాలి. అక్కడ కాసేపు జపం చేయాలి. బంగారు రంగు సూర్య కిరణాలు మన శరీరం మీదపడుతున్నాయి అని ఊహించుకోవాలి.

| | **మానసిక స్థితి** | – | **భౌతిక లాభాలు** |
|---|---|---|---|
| 1. | మణిపూరకచక్రం | – | ఉత్సాహం, సక్రియత. |
| 2. | అనాహతచక్రం | – | శ్రద్ధ, సత్ప్రవృత్తులు. |
| 3. | ఆజ్ఞాచక్రం | – | వివేకం, సాహసం. |

**గాయత్రీమంత్రజపం చేయటం వలన ఈ 6 లాభాలను పొందవచ్చు. దాంతో పాటు బంగారు రంగు సూర్యకిరణాల ధ్యానం ప్రాణశక్తిని ఇస్తాయి. సాధకుడు సిద్ధి పొందడానికి సాధన చెయ్యాలి. సిద్ధి పొందటమే మన లక్ష్యం. సిద్ధి అంటే**

(1) సంయమనం ద్వారా ఆరోగ్యాన్ని పొందటం.

(2) శ్రద్ధ ద్వారా సత్ప్రవృత్తులను పొందటం.

(3) వివేకం ద్వారా సాహసం పొందటం.

ప్రస్తుతం తపస్సులో ముందుగా ఆసనసిద్ధి పొందాలనేది మన లక్ష్యం. ఆసనంలో ఉండే పెద్ద లాభం భగవంతుడి అనుగ్రహాన్ని పొందటం. దీని వల్ల సర్వరోగాలు పోతాయి. మొదట్లో కుదరకపోయినా ప్రయత్నిస్తూ వుంటే అదే వస్తుంది. సాధనలో మొదటగా వచ్చేది (1) ఆసన సిద్ధి. (2) మనం కళ్ళు మూసుకోవాలి – దానివలన బాహ్య జగత్తు నుండి వచ్చే అలజడులు తగ్గిపోతాయి. కళ్ళు తెరవను, కళ్ళు తెరవను అనే మాట పదేపదే అనుకోవాలి. **తపస్సంటే ఉత్తినే కూర్చోవడం కాదు. బ్రహ్మాస్త్ర ప్రయోగంలో చేసే సాధనా ప్రయోగమంతా మనస్సు అనే కేంద్రం నుంచే జరుగుతుంది.**

సూర్యకిరణాలను కేంద్రీకరించి అగ్ని ప్రజ్వలన చేసినట్లు మనస్సును కేంద్రీకరణ చేసి సాధన చెయ్యాలి. సాధనను ఉపయోగించి లక్ష్యసిద్ధిని పొందడమే తపస్సు యొక్క ఉద్దేశ్యము. దీనిని ప్రతివారు తమతమ దేహాలలోకి దింపుకోవాలి. ఈ విధంగా ఋషుల సాధనను, తపస్సును, దింపే ప్రయత్నం జరుగుతున్నది. కనుక లక్ష్యం స్పష్టంగా ఉండాలి. అలా చేసిన ఈ తపస్సు ద్వారా వచ్చే లాభాలను అందరూ పొందాలి. దీనితోనే మనం యుగనిర్మాణం చేస్తాము. ఇంటింటికీ ఈ తపస్సును తీసుకువెళ్ళాలి. అప్పుడే గురువుల అనుగ్రహం వస్తుంది. గురువుల బాహ్య ప్రకటీకరణ జరుగుతున్నది. ఎవరో చెయ్యలేదనుకోకుండా ఉత్సాహాన్ని మీరే తెచ్చుకోవాలి. మీ ఉత్సాహాన్ని, సక్రియతను చూచి ఇతరులు కూడా ఉత్సాహం తెచ్చుకుని సాధన చేయడానికి కృషి చెయ్యాలి.

**అనాహతం : పన్నెండు దళాల మీద ధ్యానం చేస్తాము.**

అనాహతంలో గల ద్వాదశ దళాలు వికసితమవటం వల్ల శ్రద్ధ వస్తుంది. ఈ "12 దళాలు వికసిస్తే – ప్రతి పని యందు శ్రద్ధ వస్తుంది. అరవిందో మదర్ ఇలా చెప్పేది 'మనం కుర్చీనైనా సరే తన్నుకుంటూ వెళ్ళకూడదు. దాన్ని కూడా ఆదరంగా చూడాలి. ప్రతి వస్తువునూ జాగ్రత్తగా చూసుకోవాలి. మంచి నీళ్ళిచ్చినా ప్రేమ, ఆదరణలతో ఇవ్వాలి'.

**ఆజ్ఞ : రెండు దళాలు వికసించినందున వివేకం వస్తుంది.**

ఇక్కడ ఉత్సాహం, సంయమనం, శ్రద్ధ, వివేకం అనే ఈ నాలుగు లక్షణాలు వస్తాయి. ఎప్పుడైతే సాధకునిలో ఈ నాలుగు గుణాలు వికసిస్తాయో, అప్పుడు గురువే పరుగెట్టుకుంటూ మన దగ్గరకొస్తాడు. ఉత్సాహాన్ని పెంచుకుంటున్నాను. సంయమనాన్ని పెంచుకుంటున్నాను, శ్రద్ధను పెంచుకుంటున్నాను, వివేకాన్ని పెంచుకుంటున్నాననే ఈ నాలుగు మంత్రాలను పదేపదే అనుకోవాలి. సాధన చిన్నదే కానీ ఫలితాలు అమోఘం.

**తపోశక్తిని పెంచుకోటానికి -**

స్థిరమైన పద్మాసనంలో కూర్చోవడంతో పాటుగా ఐదు ముఖ్యమైన ప్రాణాయామాలు చెయ్యాలి.

(1) భస్త్రికా ప్రాణాయామం – దీనివలన 5 ప్రాణాలు యాక్టివ్ అవుతాయి.

(2) కపాలభాతి – శరీరంలో ఉండే అనేక టాక్సిన్స్ పోతాయి.

(3) త్రి గ్రంథి భేదన ప్రాణాయామం.

(4) లోమ, విలోమ ప్రాణాయామం

(5) ఉద్గీత ప్రాణాయామం. ఇదే అసలైన ప్రాణాయామం. ఇది నాశికలో జరుగుతుంది.

1. గాలి లోపలికెళ్ళేప్పుడు మనస్సు ఆజ్ఞ దగ్గరుండాలి. గాలి వదిలేప్పుడు మనస్సు నాశిక చివరి భాగంలో చూడాలి. నాసాభ్యంతర చారిణౌ అంటే అదే! ఇంక అక్కడ ఆలోచనలు ఆగి పోవాలి. మంత్రజపం ఆగిపోవాలి. అప్పుడే సాధకునిలో స్థితప్రజ్ఞత వస్తుంది.

## సమర్పణ యోగం

శిరస్సుకు ఆరు అంగుళాల పైన మనస్సును కేంద్రీకరించాలి. దీనినే సుప్రామెంటల్ డిసెంట్ అంటారు. ఊర్ధ్వ లోకాల నుండి దిగే ఆ శక్తిని రిసీవ్ చేసుకునేది ఓవర్‌మైండ్, అంటే ఈ ఆరు అంగుళాల పైన ఉండే మనస్సు. ఆ శక్తికే సమర్పణ చేసుకుంటాం. ఇక్కడ అంతకంటే చెయ్యటానికేం లేదు. ప్రతి అణువును మారుస్తుంది ఆ శక్తి.

నియమం ఏంటంటే మీ మనస్సు అక్కడే ఉండాలి. మీరు ఆ అతిమానవీయ చేతనత్వానికి లొంగిపోండి. ఆ భగవదనుగ్రహానికి లొంగిపోండి. మీరిలాగా చేస్తే క్రొత్త ఇంద్రియాలొస్తాయి అంటారు శ్రీఅరవిందో. మీ శరీరాన్ని, మనస్సును, కోరికలను దానికి సమర్పణ చెయ్యండి. ఇంక అదే మిమ్మల్ని మార్చేస్తుంది. అదే సంపూర్ణ సమర్పణ.

ఈ సాధన వల్ల నూతన మానవజాతి ఆవిర్భవిస్తుంది. విశ్వఏకీకరణ జరుగుతుంది. కొట్లాట లుండవు. శ్రీరమణమహర్షి, శ్రీఅరవిందో, పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు అందరూ దీన్ని దింపాలనే ప్రయత్నం చేశారు. దాన్ని దింపటం కోసమే మన ఈ తపస్సు.

**సాధన:** మన దృష్టి, మనస్సు–శిరస్సుపైన ఆరు అంగుళాల దగ్గర ఏకాగ్రం చెయ్యాలి. ఓం తత్సత్.

## అరుణాచలం - రమణమహర్షి ఆశ్రమం

అది 2005 జనవరి 9వతేదీ. ఒక రోజున మాస్టర్‌గారు ఉన్నట్లుండి అరుణాచలం వెళ్ళాలి. అందరికీ తెలియపరచండి. వీలైన వాళ్ళు వస్తారు అని చెప్పారు. చెప్పటమే ఆలస్యం. తక్షణమే ఏర్పాట్లు జరిగిపోయాయి. రాదలుచుకున్నవాళ్ళు ఎవరికి వీలైన పద్ధతిలో వారు నేరుగా అరుణా చలానికే రావడానికి నిర్ణయాలు జరిగిపోయాయి. సరే ఒంగోలు నుంచి మాస్టర్‌గారితో పాటు మూడు కుటుంబాలవాళ్ళం రెండు కార్లలో బయల్దేరి వెళ్ళాం. దారిలో చెన్నై నుండి ఉషాశ్రీనివాస్

వాళ్ళ కుటుంబం కూడా మాతో కలిశారు. అరుణాచలం చేరేసరికి రాత్రి 10.30 అలా అయింది. అప్పటికే పటేల్, సుమ వాళ్ళు పిల్లలతో వచ్చారు. మాధురీవాళ్ళూ వచ్చారు. ఇంక అంతే తక్షణమే గిరిప్రదక్షిణకు బయల్దేరదీశారు. ఇంకా కొంతమంది పరివార్ సభ్యులు వచ్చారు. అందరం గిరిప్రదక్షిణకు బయల్దేరాం. ప్రదక్షిణాపథంలో ఒక్కొక్కచోట ఆగుతూ గాయత్రీ, శ్రీమహాలక్ష్మి మంత్రజపం చేసుకుంటూ, పూజ్యశ్రీ మాస్టర్‌గారు చెప్తున్న ప్రవచనాలను వింటూ, దారిలో మంచి మంచి సాధనాపరమైన కబుర్లు చెప్పుకుంటూ మెల్లగా నడుస్తున్నాం. అందులో కొంతమంది బాగా పాటలు పాడేవారు ఉన్నారు. వారు మంచి ఉత్సాహంగా ఎంతో మధురంగా పాటలు పాడుతుంటే, విని ఆనందిస్తూ, మధ్యమధ్యలో కబుర్లతో గిరిప్రదక్షిణ చాలా హుషారుగా ముందుకు సాగుతున్నది. అసలే చలికాలం. అందులోనూ రాత్రివేళ. హాయిని గొలిపే మలయమారుతం మెల్లగా వీస్తున్నది. అందులోనూ ఎంతో హాయిని గొలిపే విధంగా అమృతవర్షాన్ని కురిపిస్తున్న అందమైన చంద్రుడు. ఇలాంటి చల్లని నిశీథిలో అరుణగిరిలో చేస్తున్న ఈ పరిక్రమ జీవితంలో మరుపురాని రీతిలో జరిగింది.

ఎన్నో జన్మల యోగసాధన ఈ గిరి ప్రదక్షిణ! అందులోనూ శ్రీశ్రీ మాస్టర్‌గారితో కలిసి చేయాలంటే అనేక జన్మల సంసిద్ధత ఉండి ఉండాలి. దాదాపు మర్నాడు ఉదయం 10 గం.లకి పరిక్రమ పూర్తయి ఆశ్రమానికి చేరాం. అందరం బాగా అలసిపోయినందున ఏ విధమైన తదుపరి కార్యక్రమాలు లేకుండా పూర్తిగా విశ్రాంతినిచ్చారు.

సాయంత్రానికి అందరూ బాగానే కోలుకున్నారు. స్థిమితంగా శ్రీశ్రీ మాస్టర్‌గారితోపాటు శ్రీరమణాశ్రమానికి వెళ్ళి అక్కడ విశేషాలను చూచి అక్కడ నుండి శేషాద్రిముని దేవాలయం చూడడంతో ఆ సాయంత్రం కార్యక్రమం పూర్తి అయింది. ఈ శేషాద్రిముని అనే ఆయన ఎవరు, రమణమహర్షికి వారికి గల అనుబంధమేమిటి అనే విషయాలను తెలుసుకోవడం జరిగింది. ఆ మరునాడు శ్రీరమణుల ఆశ్రమ ప్రాంగణాన్ని, మాతృభూతేశ్వరాలయాన్ని, స్కందాశ్రమం, విరూపాక్ష గుహలు, ఇలా అణువణువూ ఆశ్రమంలో తిరిగిచూడటం జరిగింది. అప్పటికి 15 రోజుల ముందు నుండే మాస్టర్‌గారు శ్రీరమణమహర్షి, నాయనగార్ల పుస్తకాలను దీక్షతో అధ్యయనం చేస్తున్నారు. అరుణాచలంలో ఏ ఏ ప్రదేశాలు చూడాలో తెలియాలంటే మరి స్వాధ్యాయం కావాలి అనేది మాస్టారిగారి సిద్ధాంతం. ఏ క్షేత్రానికిగానీ, ఆశ్రమానికిగానీ వెళ్ళే ముందు వారు ఆ ప్రదేశం యొక్క విశిష్టతను బాగా తెలుసుకొని వెళ్తారు.

**ఆ రోజు మాస్టర్‌గారిచ్చిన ప్రవచనం:** మన జీవితాలలో వేగంగా వస్తున్న మార్పులని గమనించుకోవాలి.

**1. తపస్సు: ఈనాడు భారతదేశంలో తపస్సు చేసే వ్యక్తులు కావాలి. 1875 నుంచి 1975 వరకు అలా తపస్సు చేసిన వారిలో ముఖ్యులు శ్రీరమణమహర్షిగారు. వారి జీవితాన్ని కనుక మనం గమనిస్తే, "తీవ్రసంవేగానామాసన్నః"** అనే పతంజలి యోగసూత్రాలు గుర్తుకువస్తాయి. He gets realization instantaneously.

1895-1900 సంవత్సరముల మధ్యకాలంలో రేడియో యాక్టివిటీ కనుగొనబడిందనేది కాకతాళీయం కానేకాదు. ఇవన్నీ విజ్ఞానపరమైన దృక్పథం (Scientific aspect)లో వచ్చిన మార్పులు – కానీ ఇవన్నీ శ్రీరమణమహర్షి జీవితంలో వచ్చిన మార్పుగా గమనించాలి. ఆయన జీవితం అమరత్వ సిద్ధి (Immortality aspect) వైపుకు తోయబడడం జరిగింది.

అమరత్వసిద్ధి కోసం శ్రీఅరవిందులవారు కష్టపడితే, శ్రీరమణమహర్షి మరణాన్ని దర్శించారు. And immediately he realized that there is no death. అదే కఠోపనిషత్తులోని 'నచికేతో పాఖ్యానం'లో చెప్పబడి ఉన్నది. దానినే శ్రీరమణమహర్షి 'సాధనలేం అక్కర్లేదు. ఎలా జీవించాలనేది నేర్చుకోండి చాలు' అన్నారు.

**మెడిటేషన్‌లో మనం చనిపోతున్నామనే అనుభూతిని పొందగలిగితే చాలు. అదే మొత్తం సాధన అన్నారు.**

**ఆఫ్టర్ డెత్ యు ఆర్ దేర్**

**ఆ అనుభూతి (ఫీలింగ్)ని పొందినవాడు ఋషి. ఆ కాన్సెప్ట్ ను అందించేవాడు ముని.**

మహాభారతంలో ఉన్నవారు అందరూ వైదిక ఋషులే. శ్రీరామాయణంలో, భారతంలో కూడా కనిపించేది అంతా అస్త్రవిద్యేగదా! గడ్డిపోచని బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించగలిగేవారు ఆ రోజులలో. అంటే అస్త్రవిద్యను బాంబ్‌లా ప్రయోగించేవారు. నాయనగారు రేణుకాదేవి దర్శనం కోసం 40 రోజులు తపస్సు చేశారు. పరశురాముడు 40రోజుల్లో 21సార్లు ప్రపంచమంతా తిరిగి నిక్షాత్రం చేశాడు. అంటే అస్త్రవిద్య అనేది లేకుండా చేశాడు అని అర్థం. ఇక్కడ మీరు శ్వాసేఅస్త్రం, అన్నది గుర్తుంచుకోండి. శ్వాసను రోజుకు 40 నిమిషాల పాటు ప్రాక్టీసు చెయ్యండి. ఫీల్ టు డై

(feel to die), తర్వాత 40 నిమిషాల పాటు–శరీరానికి అతీతంగా–కోరికలు లేని శరీరం–ఇప్పుడు శరీరం కూడా లేదు అన్న స్ఫురణ– కానీ నీవు జీవించే ఉన్నావు అన్న అనుభూతిని పొందండి.

సహస్రార చక్రం మీది ధ్యానం చెయ్యండి. ఈ సాధన అద్భుతమైనది. నమ్మకంతో మీరు ఆ సాధన చెయ్యండి. శ్రీ రమణమహర్షి లాగించేస్తారు. అసలు ఈ సాధనాశిబిరాన్ని ఎందుకు పెట్టారో తెలుసా? **08.01.05వ తేది రాత్రి మాస్టర్‌గారికి రమణమహర్షి జీవితంలోని అనుభూతి కలిగిందని చెప్పారు. 08.01.05 రాత్రి ఒంటి గంట 9 నిమిషాలకు ఆయనకు పునర్జన్మ (rebirth) అనుభవం కలిగిందిట. అందుకే అంత త్వరగా రమణుల దర్శనానికి బయలుదేరానని చెప్పారు.**

శ్రీరమణమహర్షి పడుకుని 'నేను చనిపోయాను' అని అనుకొని, ఆ తర్వాత 'ఎలా జీవించాలి' అని సాధన మొదలుపెట్టారు. నీవు ఆత్మవు – నీకు మృత్యువు లేదు అనే శాశ్వతసత్యాన్ని అనుభూతి చెంది, ఆ ధర్మాన్ని ప్రపంచానికి ప్రకటించారు. శ్రీరమణమహర్షిగారు, వారి తల్లిగారు ఈ పాంచ భౌతికశరీరాన్ని విడిపెట్టేశాక ఆవిడకు 'మాతృభూతేశ్వరాలయం' కట్టించారు. ఆవిడకు దైవత్వాన్ని ప్రాప్తింపచేశారు. అది ఎలాగంటే శ్రీరమణమహర్షిగారు చనిపోయిన తనతల్లి – హృదయం మీద కుడిచెయ్యి–శిరస్సు మీద ఎడంచెయ్యి ఉంచి ఇంక ఆమెను దివ్యధామానికి పంపారుట. ఒక దివ్యపురుషునికి జన్మనిచ్చిన తల్లి ఆత్మ ఎంతటి దివ్యత్వస్థాయిలో ఉండివుంటుందో ఊహించలేం కదా! మహర్షిగారికి తమ తల్లిగారి ఆత్మవైభవం తెలుసు కనుక ఒక మహర్షి స్థాయిలో ఉన్న కుమారుడిగా కర్తవ్యనిష్టతో వారు, ఆమెకు సద్గతిని ప్రాప్తింప చేశారు.

2. మాతృభూతేశ్వర లింగం–శ్రీరమణమహర్షిగారి ప్రార్థన రాకెట్ స్పీడ్‌లో తల్లిగారికి ముక్తిని ప్రసాదించింది. వారి తల్లిగారు కొన్ని గంటలలోను, శిష్యుడైన శ్రీపళనిస్వామి – కొన్ని జీవితాలలోను ముక్తిని పొందారు.

## సాధన

ఎలాంటి కోరికలు లేకుండా మీ హృదయలోతులలోకి వెళ్ళే ప్రయత్నం చెయ్యండి. అదే మిమ్మల్ని జీవన్ముక్త స్థితికి తీసుకువెళ్తుంది. ఆ స్థితిని పొందటానికి ప్రతినెలా మూడు రోజులు వచ్చి ఇక్కడ అంటే తిరువణ్ణామలైలో తపస్సు చేసుకోవాలి. నేను వస్తాను. మీకూ రావాలనిపిస్తే ఆ సమయానికి రావచ్చునని పునరుద్ఘాటించారు.

# V మహాసంకల్ప - మహా యజ్ఞాలు

## అధ్యాయం-9
## శ్రీమహాలక్ష్మీ సాధనలు

### సహస్రాధిక శ్రీమహాలక్ష్మీసాధన

శ్రీరమణాశ్రమమునకు వెళ్ళినప్పుడు మాస్టర్‌గారు నిర్దిష్టంగా ఇచ్చిన సాధనలలో భాగంగా ఎక్కడున్న వారు అక్కడే ప్రతి ఆదివారం విశ్వఏకీకరణ యజ్ఞాలను కొనసాగిస్తూనే ఉన్నారు. రెండవ సాధనావిధానంలో ప్రతి గురువారం సామూహికంగా, గోపూజ చెయ్యాలి, తర్వాత ప్రతిరోజు సహస్ర శ్రీమహాలక్ష్మీ మూలమంత్ర జపం చెయ్యాలని చెప్పారు గదా! ఒంగోలుకు వచ్చాక మాస్టర్‌గారు మరొక విశిష్టసాధనాక్రమాన్ని తెలియచేశారు. అదేమిటంటే వెయ్యిమందితో సామూహికంగా ఒకేసారి శ్రీమహాలక్ష్మీ సాధన, అదే విద్యారణ్య ప్రోక్త బీజమంత్ర సంపుటిత శ్రీసూక్త పారాయణ చెయ్యాలనే సూచనలనిచ్చారు. మళ్ళీ మరొక క్రొత్త సాధనకు బీజారోపణ చేస్తున్నారు.

వెంటనే దానికి తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవడం జరిగింది. గోపూజ + శ్రీమహాలక్ష్మీ సాధన ఏకకాలంలో చెయ్యాలంటే దానికి తగిన విశాలమైన, పవిత్రమైన ఆవరణ కావాలి. వెంటనే తల్లి అనుగ్రహమా? అన్నట్లుగా ఒంగోలులోని శ్రీ బాపూజీ గోసంరక్షసంఘం అవరణ మదిలో మెదిలింది. వెంటనే తత్సంబంధిత వ్యక్తులను కలవడానికి శ్రీరామకోటేశ్వరరావుగారూ, నేను గోశాలకు వెళ్ళాం. పూజ్యశ్రీ మాస్టర్‌గారి ప్రణాళికను వారికి వివరించగా వారు అదెంతో మహద్భాగ్యంగా భావించి శ్రీమహాలక్ష్మీ సాధనకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. వెంటనే కార్యాచరణ ప్రారంభమైంది. ముందుగా గోశాల ఆవరణను పరిశుభ్రం చేసి వెల్ల వేయించి తోరణాలు కట్టించి, గోమంత్రాన్ని, శ్రీమహాలక్ష్మీ మంత్రాలను గోడల మీద వ్రాయించి అత్యంత సుందరంగా గోశాలను అలంకరించి, సాధనకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడం జరిగింది.

ఏ సాధన చెయ్యాలన్నా ముందుగా దానికి తగిన మంత్రబలం ఉండాలంటారు కదా! అందుచేత జనసామాన్యంలో ఈ రెండు మహామంత్రాలు విరివిగా ప్రచారంలోకి వెళ్ళాలి, జపం జరగాలనే ఉద్దేశ్యంతో అఖండజపం చెయ్యాలనే సంకల్పం కల్గింది. ఆ ప్రాంగణంలోనే అఖండజ్యోతి వెలిగించి, అఖండ జపం ప్రారంభించాలనే ప్రతిపాదనను మాస్టర్‌గారు కూడా అంగీకరించారు. అందుచేత గోశాల ఆవరణలో 02.02.2005 తేది ఉదయం 6.00 గంటలకు అఖండజ్యోతిని వెలిగించి గోమంత్రము, మహాలక్ష్మి మంత్రముల అఖండజపం ప్రారంభించాము. ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు లేకుండానే 2,3,4,5 తేదీలలో ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు అఖండజపం ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగింది. వేలాదిమందికి కార్యక్రమం గురించి తెలిసింది. ఐశ్వర్యం కావాలంటే శ్రీమహాలక్ష్మి సాధన చేసి తీరాలి.

శ్రీ విద్యారణ్యస్వామి వారు భారతదేశంలో అఖండ ఐశ్వర్యాన్ని దర్శించాలనే కదా ఈ మహా మంత్రాన్ని పురశ్చరణ చేసి ఆ దివ్యమంత్రరాజాన్ని సమస్త మానవజాతికి అందించారు. ఐశ్వర్యమంటే కేవలం డబ్బు మాత్రమే కాదు, వనరులన్నీ కూడా శ్రీమహాలక్ష్మి రూపాలేనని మనకు అష్టలక్ష్మి వైభవం తెలుపుతుంది. దానితో పాటే 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటారు పెద్దలు. అలా ఆరోగ్యం కావాలనుకునేవారు, సంతానం కావాలనుకునేవారు గోసేవ చేయాలని శాస్త్రాలు చెప్తున్నాయి, కనుక ఒంగోలులో గల బాపూజీ గోసంరక్షణశాల ప్రాంగణంలో 6వ తేది ఉదయం మహిళలందరిచేత గోపూజ చేయించాము. అనంతరం నవకుండీయ శ్రీగాయత్రీ - లలితా - భాగవత యజ్ఞమును చేయించాము. ఆ రోజు పూర్ణాహుతి సమయంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారే స్వయంగా అందరికీ గోమహాలక్ష్మి, శ్రీమహలక్ష్మి, గాయత్రీ మంత్ర దీక్షలనిచ్చారు.

అదే రోజు సాయంత్రం గోశాలలో ఆనందం వెల్లివిరిసింది. వేలాదిమంది స్త్రీ, పురుషులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ మహాపర్వాన్ని కనులారా చూడాలని, మాస్టర్‌గారి దివ్యఅనుగ్రహ ప్రవచనాలను వినాలని, ఎంతో కుతూహలంతో గోశాల ఆవరణలో ఆశీనులైనారు. ఆ రోజు గోశాలకు పట్టలేనంత మంది జనం వచ్చారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఆ రోజున పసుపుపచ్చని వస్త్రాలలో సాక్షాత్ ఆ శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మి అమ్మను తన వక్షస్థలంలో పదిలపరచుకొని ఈ మహాయాగాన్ని నిర్వహించటానికి వచ్చారా అన్నంత సౌందర్యంతో వెలిగిపోయారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారిని భక్తులందరూ రోడ్డు మొదలు నుండి జయజయధ్వానాలు చేస్తూ పుష్పవర్షం కురిపిస్తూ

సాదరంగా గోమాతల ఆలయానికి ఆహ్వానించారు. మృదుమధురమైన చిరునవ్వులతో వారు వస్తుంటే గోమాతలు తమ ప్రియతముడైన శ్రీకృష్ణులవారు వస్తున్నారు, ఆయనను "అంబారావాలతో" ఆహ్వానించాలనే సంకల్పంతో ఆవరణమంతా హోరెత్తిపోయేలా చేసిన అంబారావాలు మిన్నంటినాయి. ఆనాటి ఆ దృశ్యం చూస్తూ ఆ అంబారావాలు వింటుంటే – గోవింద్ గోకుల్ ఆయో, గోవింద్ గోకుల్ ఆయో అన్న మధుర సంగీతం మృదుమధురంగా చెవులలో ప్రతిధ్వనిస్తోంది. మేను పులకించిపోతున్నది. అందరి కళ్ళల్లో ఆనందభాష్పాలు. తనివితీరా మాస్టర్‌గారినే చూస్తున్నా రందరూ. సాదరంగా తీసుకువచ్చి వేదిక మీద ఆసీనులను చేశారు. ఏమి చెబుతారా వినాలనే ఆదుర్దాతో చూస్తున్నారందరూ!!

## గోమహాలక్ష్మి సాన్నిధ్యంలో శ్రీ మహాలక్ష్మిసాధన

వేదికనలంకరించిన పూజ్యశ్రీ మాస్టర్‌గారు ముందుగా గోమాతల వైభవాన్ని ఎంతో అద్భుతంగా వివరించారు. గోసేవ వలన కలిగే అపురూపమైన లాభాలను, ఈ సాధన ప్రాశస్త్యాన్ని వివరిస్తూ అనంతరం శ్రీమహాలక్ష్మి పారాయణ మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి వచ్చిన యావన్మందికీ శ్రీమహాలక్ష్మి పారాయణ పుస్తకాలనిచ్చారు. అందరూ దీక్షతో మాస్టర్‌గారితో కలిసి "శ్రీవిద్యారణ్య ప్రోక్త బీజమంత్ర సంపుటిత శ్రీసూక్త పారాయణ" క్రమమునద్భుతంగా గానం చేశారు. సామూహిక సాధన యొక్క దివ్యానుభూతిని పొందిన సాధకులంతా ఎంతో ఆనందంతో శ్రీశ్రీ మాస్టర్‌గారికి అభివాదాలు తెలుపుకొన్నారు, వారి నుండి ప్రత్యేకమైన అఖండాశీస్సులతో పాటు ప్రసాదాలు స్వీకరించి వెళ్ళిపోయారు. ఆ రోజు కార్యక్రమంలో వచ్చిన ధనమేదైతే వుందో దానినంతా మాస్టర్‌గారి చేతులమీదుగా గోసేవకే సమర్పించాము. ఆనాటి నుండి వందలాదిమందికి గోశాలకు రావడం గో సేవ చేయడం, గోగ్రాసానికి తమవంతు అంశదానాన్నివ్వటం, గోవుకు ప్రదక్షిణలు చెయ్యడమనేది బాగా అలవాటైపోయింది. దాని వలన వారి జీవితంలో గల అనేక సమస్యలకు పరిష్కారం లభించడంతో గోశాల యొక్క ప్రాభవం దశదిశలా వ్యాపించడం జరిగింది. గోసేవతో పాటుగా ప్రతి అమావాస్యకు ఐదురోజులు 'శ్రీమహాలక్ష్మి' సాధన చేసే ఆనవాయితీ కూడా ఏర్పడింది. అలా గోశాలకు, చక్కని శ్రీమహాలక్ష్మి సాధనా కేంద్రంగా ప్రజలలో మంచి గుర్తింపు వచ్చింది.

ఆనాటి నుండి ప్రతి అష్టమికి గోసేవ – గోమంత్రసాధన – పూర్ణాహుతి కార్యక్రమాలను, అలాగే ప్రతి అమావాస్యకు శ్రీమహాలక్ష్మి సాధనను శ్రీమతి మలసాని శ్యామల, లక్ష్మి ఇంకా కొంతమంది భక్తులు ఎంతో శ్రద్ధాభక్తులతో చేస్తున్నారు. గోసేవ, యజ్ఞాలను కొనసాగిస్తూనే వున్నారు. ఎంతోమంది గోశాలకు వచ్చి ఈనాటికీ సేవ చేసే ఆనవాయితీ అలా ఏర్పడిపోయింది. ఇదంతా అపారప్రేమ స్వరూపులైన మన మాస్టర్‌గారి సంకల్పబలం, మన అదృష్టం కాక మరేమిటి?

శ్రీమహాలక్ష్మి సాధన అంతటితో ఆగిపోలేదు. ఆంధ్రరాష్ట్రమంతటా దిగ్విజయ యాత్ర మాదిరి ఈనాటికీ జరుగుతూనే వుంది. పరివార్ సభ్యులందరూ తమతమ గ్రామాలలో శ్రీమహాలక్ష్మి సాధనను ఒక విప్లవంలాగా తీసుకువచ్చారు. ప్రతి అమావాస్యకు ఐదు రోజుల పాటు సాధన చెయ్యడం, దాని పూర్ణాహుతిని దీపావళీ అమావాస్యకు సామూహికంగా అందరూ కలిసి ఒకచోట చేసుకునే ఆనవాయితీని శ్రీశ్రీ మాస్టర్‌గారు ఆనాడు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో ఈ శ్రీమహాలక్ష్మి సాధన ప్రతినెలా ఎక్కడో ఒకచోట నిష్టగా జరగాలనే సంకల్పంతో దాని బాధ్యతను మాస్టర్‌గారే స్వయంగా వెంట్రాప్రగడ శివన్నారాయణగారికి ప్రసాదించారు. వారు కూడా మాస్టర్‌గారి మాటను వేదవాక్కుగా భావించి, శ్రీమహాలక్ష్మిసాధన, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను నిరాఘాటంగా కొనసాగిస్తూ తమ బాధ్యతను నిర్వహిస్తున్నారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఒక్కొక్క సాధనను బాధ్యతగా చేయడానికి, ఒక్కొక్కరికి ఆ వరాలను అలా ప్రసాదించారు. గోసేవా భాగ్యాన్ని శ్రీమతి శ్యామల వేంకటేశ్వర్లుగారికి, లక్ష్మిగార్లకు, శ్రీమహాలక్ష్మి సాధన బాధ్యతను శ్రీ శివన్నారాయణగారికి ఇచ్చారు. అలాగే లలితా సహస్రనామ పారాయణ బాధ్యతను శ్రీమతి ధారా భవానిగారికి అప్పచెప్పి, కోట్లకోట్ల పారాయణ చేసేవిధంగా వారికి ప్రేరణ, స్ఫూర్తినిచ్చి మాఘపూర్ణిమకు కోటి లలితాసహస్రనామ పారాయణ పూర్ణాహుతిని ఎక్కడో ఒకచోట చేయించేవారు. అలా సాధన చేస్తూనే ఆవిడ తన జీవితాన్ని అమ్మపాదాలకు సమర్పణ చేసుకొని ధన్యతను పొందారు. వాతావరణంలో దైవీ చేతనత్వపు శక్తిధారలు ప్రవహింప చేయటానికే అలాంటి పారాయణాక్రమాల పరంపరలను మాస్టర్‌గారు తలొక బాధ్యతగా అందరికీ ఇవ్వడం జరిగింది. అలా బాధ్యతలను స్వీకరించిన వారందరూ ఎంతో నిష్టతో, బాధ్యతగా తమ కర్తవ్యాలను నిర్వహిస్తూ జీవితాలను ధన్యం చేసుకుంటున్నారు.

2004వ సంవత్సరంలో శ్రీ జి.ఎస్.కృష్ణగారి ఆహ్వానం మేరకు పూజ్యశ్రీ మాస్టర్‌గారు హైదరాబాద్‌లో గల ఇమేజ్ గార్డెన్స్‌లో గాయత్రీ, సావిత్రీ, కుండలినీ సాధనల గురించి మూడు రోజుల పాటు అనగా జనవరి 22,23,24 తేదీలలో ఎంతో అద్భుతంగా చక్కటి శిక్షణాతరగతులను నిర్వహించారు. ఆధ్యాత్మిక సాధనలో మనం ముందుకు వెళ్ళాలి అంటే ముందు మన ఆలోచనా విధానం మారాలి. ఆలోచనా విధానం అనేది సాధనలో అన్నం వంటిది, అన్నం లేకుండా మిగతా ఎన్ని ఆధరవులు వడ్డిస్తే ఏమి లాభం? మీలో ఆధ్యాత్మిక దృష్టికోణం రావాలి, అది జీవన సాధనగా మారాలి. ఫలితము కనిపించాలి అంటే సాధన సిద్ధిగా మారాలి. వ్యక్తిగతముగా ఉపయోగించుకుంటే అది గాయత్రీ, సామూహికంగా ఉపయోగించుకుంటే అది సావిత్రి. పృధ్వి మీద ఉన్న ప్రతి మనిషి సూర్య శక్తితోనే జీవిస్తున్నాడు, వీటికి కుల మతాలతో సంబంధం లేదు. ఈ శక్తి మనలోకి మన శ్వాసతో ప్రవేశిస్తుంది. మనలో కుడి కన్ను సూర్యుడికి, ఎడమ కన్ను చంద్రుడికి ప్రతీక. శ్వాసతో మనలోని 7 చక్రాలను లింక్ చేసుకుంటూ చేసే మంత్రమే సావిత్రి సాధన. సావిత్రీ సాధన వలన మన ఆలోచనలతో సమాజంలో స్వర్గీయ వాతావరణాన్ని నిర్మించవచ్చు.

**సావిత్రీ మంత్రము - ఓం భూర్ భువః స్వః మహః జనః తపః సత్యం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్**

ఎంతో అద్భుతంగా జరిగిన ఈ సాధనా శిబిరములో శ్రీ జి.ఎస్. కృష్ణగారు అడిగిన ఒక ప్రశ్నకు జవాబుగా త్వరలోనే 'గాయత్రీ-కుండలినీ-సావిత్రీ' సాధనలకు అవసరమైన మెటీరియల్ తయారుచేసి ఇస్తాను అని చెప్పటం జరిగింది. అన్న మాట ప్రకారం మాస్టర్‌గారు గాయత్రీ, కుండలినీ, సావిత్రీలకు సంబంధించిన పుస్తకరచనకు పూనుకున్నారు.

## గాయత్రీ - కుండలినీ - సావిత్రి

అది 2005 సంవత్సరం ఫిబ్రవరి6వ తేది గోశాలలో, సహస్రాధిక శ్రీమహాలక్ష్మి (ఉపాసన) సాధనా పూర్ణాహుతి జరిగింది. ఆ కార్యక్రమం శ్రీశ్రీ మాస్టర్‌గారికి ఎంతో తృప్తినిచ్చింది. అనుకున్న దాని కంటే ఎంతో శోభాయమానంగా జరిగిన ఆ కార్యక్రమం ఇంకా ఎంతోమందికి ప్రేరణ నిచ్చింది. మేము కూడా మా గ్రామాలలో ఇలాంటి అద్భుతమైన కార్యక్రమం చేస్తాము. మా ఊళ్ళకూ మాస్టర్‌గారు రావాలనే ఆనందానుభూతి అందరిలోను కలిగింది. అమ్మయ్య, మాస్టర్‌గారు

చెప్పినందుకు శ్రీమహాలక్ష్మీ సాధనా పూర్ణాహుతి దివ్యంగా జరిగిందిలే, కొంచెం విశ్రాంతి తీసుకుందాం అనుకున్నాము. అంతే మరో విచిత్రం జరిగింది.

అది ఫిబ్రవరి 7వతేదీ ఉదయం. పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఆరోజు ఉదయాన లేస్తూనే "గురుదేవుల వాఙ్మయాలను తీసి బయటపెట్టండి, నోటు పుస్తకాలు, పెన్నులు సిద్ధం చేసి, చెప్తుంటే వ్రాయటానికి సమర్థులైన వ్యక్తులను ఏర్పాటు చేయమని నాతో చెప్పారు. శ్వేతద్వీపంలో గల మాస్టర్‌గారింటిలో లైబ్రరీ ఎంతో పద్ధతిగా క్రమశిక్షణతో వల్లీ అమర్చిపెట్టి ఉంచేది. ఎప్పుడే పుస్తకం కావాలన్నా అలా తీసి ఇవ్వటానికి వీలుగా ఉండేది. మాస్టర్‌గారు కూర్చుని 'లాప్‌టాప్‌లో' పనిచేసుకునే కుర్చీకి వెనుకన పై భాగంలో ముఖద్వారానికి ఎదురుగా వున్న అలమారులో పూజ్యగురుదేవుల 70 వాఙ్మయాలు ఎంతో అందంగా అమర్చిపెట్టి ఉండేవి. వాటిని చూచినప్పుడల్లా ఈ వాఙ్మయాల నన్నింటిని అనువదించి ఆంధ్రలోకానికి అందివ్వాలి. శ్రీరామకృష్ణ పరమహంసగారి సాహిత్యం తెలుగులోకి ఎలాగైతే ప్రాచుర్యంలోకి వచ్చిందో అలాగే పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని అనువదించి తెలుగుప్రజలకి అందించాలనే ఆర్తితో, 'మాస్టర్‌గారూ' ఈ పుస్తకాలన్నీ తెలుగులోకి మీరే తేవాలి. అప్పుడే కదా మహాకాల స్వరూపులైన పూజ్యగురుదేవుల గురించి అందరికీ తెలుస్తుంది' అని మనస్సులోనే అనుకునేదాన్ని. ఆ పుస్తకాలను చూసినప్పుడల్లా ఇదే భావన మదిలో మెదులుతుండేది.

అలాంటి సంకల్పంతో ఉన్న నాకు ఆ రోజు ఉదయం మాస్టర్‌గారు 'వాఙ్మయాలు నా టేబుల్ మీద పెట్టు' అన్న మాటలకు చెవిలో అమృతం పోసినట్లనిపించింది. చెప్పలేనంత ఆనందం కలిగింది. కనీసం ఎందుకు, ఏమిటి అని అడక్కుండానే మాస్టర్‌గారు అడిగిన ఏర్పాట్లను క్షణాలలో చేసేశాను. ఆ రోజున అప్పుడక్కడ పరివార్ సభ్యులు ఒక ఆరు, ఏడు మంది కూడా ఉన్నారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఇలా చెప్పారు–'గురువుగారి వాఙ్మయాలలో గల గాయత్రీ మహా విద్య, సావిత్రీ మహావిద్య, కుండలినీ మహావిద్యలన్నింటిని కలిపి ఒక "సమగ్ర విషయ పరిజ్ఞానాన్ని" సాహసవంతులైన సాధకలోకానికి అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాను. ఇంక రాత్రి పగలు అనుకోకుండా ఈ గ్రంథ రచన సాగాలి. ఏ రోజుకారోజు డి.టి.పి. పనిపూర్తి కావాలి. విషయమునకు అనురూపంగా ఉండే ఫోటోలను, పట్టికలను కూడ ఏ రోజుకారోజే తయారుచేసి మర్నాటికల్లా టేబుల్ మీద పెట్టాలి అనే సూచనలను నిశితంగా కూడా ఇచ్చారు. విన్న మా అందరికి అది ఎంత కష్టమైనా సరే చెయ్యాలనిపించింది.

పూజ్యగురుదేవులచే రచించబడిన 70 వాఙ్మయాలను మాస్టర్‌గారు విహంగ వీక్షణంగా చదివి పైన చెప్పిన గాయత్రీ, సావిత్రీ, కుండలినీ మహావిద్యలకు సంబంధించిన జ్ఞానము ఎక్కడెక్కడ ఉన్నదో దానినంతా ఒక క్రమపద్ధతిలో ఏర్చికూర్చి అనువదించటానికి సమాయత్తమైనారు.

మూడునెలల కాలంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు మరింక ఏ ఇతర కార్యక్రమాల గురించి పట్టించుకోలేదు. గాయత్రీ-కుండలినీ-సావిత్రీ గ్రంథ రచన చేయటానికి గల ప్రధాన కారణమేమిటో మనకు తెలియదు కానీ మాస్టర్‌గారు ఈ రచన చేయడం వెనుక ఏదో లోతైన అంతరంగ సాధనా క్రమం జరిగి వుంటుంది. లేదంటే ఇటువంటి పరమాద్భుత జ్ఞానం మానవజాతికి అందడం అసాధ్యం. ఇంతటి సాధనాత్మక గ్రంథరచన చేయడం వెనుక రహస్యం ఏమిటో తెలియదు. అయితే గాయత్రీ మహావిద్య, సావిత్రీ మహావిద్య, కుండలినీ మహావిద్యల మధ్య గల పారస్పరిక సంబంధం, ఈ మహాసాధనలు చేస్తే వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయనే విషయాల గురించి కాస్త పరిచయం చెయ్యటం ఇక్కడ ఎంతో అవసరం.

అసంభవాలు, సంభవాలుగా మారిపోతున్న రోజులివి. **ఆలోచనలలో ఒక చిన్న మార్పు, జీవితాలలో ఊహించని మలుపులు తీసుకువస్తుందనేది యథార్థం.** ఈనాడు అతిసూక్ష్మమైన పరమాణుకేంద్రక లోతుల్లోకి, సుదూర అంతరిక్షంలోకి దూసుకొని పోగలిగే సాహసం చేయగలుగు తున్న ఈ మానవజాతి, ఒక విచిత్రమైన మలుపు దగ్గర ఆగిపోయింది. ఆ చిన్న మలుపును సాధించగలిగితే ఈనాటి భయావహ, నరకప్రాయమైన పరిస్థితుల నుండి బైటపడి పృధ్విని స్వర్గంగా తీర్చిదిద్దుకోగలుగుతాము. **అదేమిటంటే ఆలోచనల యొక్క బహిర్ముఖీ ప్రవృత్తిని అంతర్ముఖంగా మార్చుకొనగల్గుట.** ఆలోచనా విధానములోని యీ మార్పును ఋషులు మూడు మహావిద్యలుగా మనకందించారు.

1. **గాయత్రి మహావిద్య:** మస్తిష్కము (brain). ఇది ఆలోచనావిధానంలో మార్పు తెస్తుంది. మనోబుద్ధులను శక్తివంతం చేస్తుంది. జ్ఞానశక్తిని ప్రసాదిస్తుంది. ఆధ్యాత్మిక జగత్తులో దీనిని సహస్రారచక్రమంటారు. మన ఋషులు దీనిని శివతత్త్వము అంటారు.

2. **సావిత్రి మహావిద్య:** జననేంద్రియము (reproductive organ). ఇది క్రియాశీలతలో మార్పు తెస్తుంది. చిత్త, అహంకారములను శక్తివంతము చేస్తుంది. ఇది సృష్టికి ప్రతిసృష్టి చేయగల విద్య. ఆధ్యాత్మిక జగత్తులో దీనిని మూలధార కేంద్రము అంటారు. దీనినే కామశక్తి కేంద్రమని

కూడా అంటారు. ఈనాడు జ్ఞానము (గాయత్రి) పెరిగినంతగా క్రియాశక్తి (సావిత్రీ) పెరగలేదు. దీనినే నిద్రిస్తున్న కుండలినీశక్తిగా చెప్తారు. ఋషులు దీనిని శక్తితత్త్వము అని అన్నారు.

3. **కుండలినీ మహావిద్య:** వెన్నుపూస (back bone). ఇది సంకల్పశక్తిలో మార్పు తెస్తుంది. జ్ఞానము-క్రియగాను మరియు క్రియ-జ్ఞానముగానూ మారడానికి వెన్నుపూసలోని ఐదు చక్రాలే కారణము. అందుకే ఈ దృశ్యమానజగత్తును ప్రపంచము అన్నారు. ఐదు చక్రాల జ్ఞానముతో ప్రపంచాన్ని మార్చగలము. రకరకాల ప్రయోగాలు చేసి, జ్ఞానమును సంపాదించు కొని ఆ జ్ఞానమును ఉపయోగించుకునే ప్రక్రియను ఫార్ములాలుగా ఇచ్చే భౌతిక శాస్త్రవేత్తలు క్రియాశక్తి ద్వారా జ్ఞానశక్తిని పొందుతున్నారు.

ఋషులు శరీరము అనే ప్రయోగశాలలోకి, జ్ఞానశక్తిని మస్తిష్కములోనికి దింపుకొని, దానికి తగిన క్రియాశక్తిని వెన్నుపూసలో ఉన్న పంచచక్రాల ద్వారా ప్రోదిచేసుకొని, నేడు వైజ్ఞానికులు యంత్రాల ద్వారా చేస్తున్నటువంటి పనికి అనేకానేకరెట్లు ఎక్కువ పనిని తమ సంకల్పశక్తి, శారీరక అవయవాలను ఉపయోగించి సాధించగల్గారు. అంటే ఋషులు జ్ఞానశక్తి ద్వారా క్రియాశక్తిని ఉపయోగించి ఫలితాలు పొందుతారు. ఈ విద్యలను అనేక మంది మహాత్ములు ప్రపంచము యొక్క స్థితిగతులను మార్చటానికి ఉపయోగించుకున్నారు. ఈ విద్యల జ్ఞానము ఈనాటి దేశ, కాల పరిస్థితులలో ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దటానికి ఎంత ఉపయోగపడుతుందో మాటలతో చెప్పలేమనేది వాస్తవం.

మహాత్మాగాంధీ, శ్రీ అరవిందో, కల్నల్ ఆల్కాట్ మొదలైన స్వాతంత్ర్య సమరయోధులు, రాజారాంమోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరు వీరేశలింగం మొదలైన సంఘ సంస్కర్తలు, ఆధ్యాత్మిక జగత్తులోని అనేకమంది సాధువులు, మహాత్ములందరూ శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీరమణమహర్షి మొదలైన వారి ద్వారా మలచబడ్డారు. శ్రీ యోగిఅరవిందులు ప్రపంచయుద్ధంలో అనేకమంది నాయకులనెలా ఉపయోగించుకున్నారో "Twelve years with Sri Aurobindo" అనే పుస్తకంలో తెలుసుకోవచ్చు. అలానే స్కైలాబ్ 1975-78 విషయం వైజ్ఞానికులకు ఒక భయంకర సమస్యగా మారింది. దీని వలన భూమి మీద 4 వేల మైళ్ళ పొడవు, 100 మైళ్ళ వెడల్పు గల క్షేత్రంలో అత్యంత భయంకరమైన భీభత్సము జరగవచ్చని శాస్త్రజ్ఞులు ఊహించారు.

**పూజ్యగురుదేవుల మార్గదర్శనంలో 1978 సంవత్సరంలో జులై 1-31 వరకు చేయబడిన గాయత్రి పరివార్ విశిష్ఠ సురక్షా సాధన ఆ ప్రమాదాన్ని నివారించింది.** సూర్యవిజ్ఞానాన్ని, వేదవిజ్ఞానాన్ని ప్రపంచానికి అందచేయడంలో శ్రీ విరజానందస్వామి యొక్క పాత్ర గొప్పది. దీనినే దయానంద సరస్వతి, ఆ తర్వాత పూజ్యగురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య కొనసాగించారు. ఆయన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని, ఆధునిక విజ్ఞానమువలె తీర్చిదిద్దారు. దీనిని అనేక సాధనా విధానాల ద్వారా శాంతికుంజ్ సాధనా శిబిరాలలో బోధించటం జరుగుతున్నది.

నేటి సమాజములోని అశాంతి, అస్వస్థత, ఒక సమస్యను పరిష్కరిస్తే అనేక ఇతర సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయి అని ఆలోచించి ఏం చెయ్యాలి, వీటికి పరిష్కార మార్గమేమైనా ఉందా? అని ఆలోచించే విశేషవ్యక్తుల కోసమే ఈ పుస్తకం వ్రాయబడింది. వారికి ఇది మార్గదర్శనం చేస్తుంది.

అదృష్టవశాత్తు అలాంటి మార్గములు వున్నాయి. వాటినే బ్రహ్మవిద్య, గుప్తవిద్యలంటారు. కాస్తలో కాస్త ప్రయత్నం చేస్తే బ్రహ్మవిద్య అందరికి అర్థమౌతుంది, కానీ గుప్తవిద్య కొరుకుడు పడదు. ఈ విద్యలను నేర్చుకోవాలనే తపన గల సాధకులకు 'గురువు' యొక్క మార్గదర్శనం తప్పక వుండితీరాలి. కానీ ఎల్లప్పుడూ విచక్షణా జ్ఞానముండాలి.

**ప్రతి సంఘటనలోనూ 'కర్మ' చాలా ప్రముఖపాత్ర వహిస్తుంది. అందువలన గురువు యొక్క మార్గదర్శనం కావాలనుకునే వారు ఇతరులకు ప్రేమతో, వారికి మేలు కలగాలనే ఆకాంక్షతో, నిస్వార్థంగా నిరంతరమూ సహాయపడుతూ ఉండాలి. అప్పుడు మాత్రమే సాధకుడు, గురువు ద్వారా తనకు అందచేయబడిన సహాయాన్ని అవగాహన చేసుకోగలడు, ఉపయోగించుకోగలడు. ఈ మార్గంలో ఖచ్చితంగా అనేక పరీక్షలను ఎదుర్కొనవలసి ఉంటుంది. ఎందువల్లనంటే వ్యక్తికి తన కాళ్ళ మీద తాను నిలబడి ముందుకు సాగిపోగలననే సామర్థ్యం రావాలి. నిరంతరం గురువు యొక్క సహాయమును ఆకాంక్షించకూడదు. పరీక్షా సమయాలను అర్థం చేసుకోగలగాలి. లోపలి నుండి, బయట నుండి కూడా సహాయము నిరంతరము లభిస్తూనే ఉంటుందనే విశ్వాసము కలిగివుండాలి.**

ఈ గుప్తవిద్యలంటే కుండలినీ మహావిద్య, గాయత్రీ మహావిద్య, సావిత్రీ మహావిద్య యొక్క ప్రవేశద్వారములు. ఈనాటి వైజ్ఞానికుల ద్వారా అనేక రహస్యవిద్యల ద్వారాలు తెరుచుకున్నాయి.

కుండలినీ మహావిద్య యొక్క ప్రవేశద్వారము ఆధునిక వైద్యవిధానము(endocrinology).

గాయత్రి మహావిద్య యొక్క ప్రవేశద్వారము ఆధునిక మనోవిజ్ఞానశాస్త్రము(psychology).

సావిత్రి మహావిద్య యొక్క ప్రవేశద్వారము శస్త్ర చికిత్సావిజ్ఞానము(surgery).

అవి ఎలా తెరువబడినాయి అనే అంశము గురించి, ఈనాటి విద్యా విధానము గురించి 'గాయత్రి–కుండలినీ–సావిత్రీ' అనబడే ఈ సాధనాత్మక గ్రంథరాజమును పాఠకులు అధ్యయనం చేసితీరాలి! పాఠకులు ఈ రహస్యవిద్యల యొక్క ప్రయోజనాన్ని సంపూర్ణంగా అందరూ పొందాలనేదే మాస్టర్‌గారి ఆకాంక్ష. ఈ గ్రంథరచన చేయటం అనే బృహత్కార్యక్రమంలో మాస్టారితో పాటుగా శ్రద్ధావంతులైన పిల్లలు రాత్రీ, పగలు పని చేసి మాస్టారనుకున్న సమయానికి దానిని అచ్చు వేయించటం అనేది ఊహకందని విషయం.

## శివ దీక్ష - కాకివాయి ఆశ్రమము

పుస్తక రచనావ్యాసంగం కొనసాగుతూనే వున్నది. మహాశివరాత్రికి శ్రీహంసరామ ఆశ్రమానికి రావల్సిందిగా ఆశ్రమ కార్యకర్తల ఆహ్వానం మేరకు పూజ్యశ్రీ మాస్టర్‌గారు కాకివాయి గ్రామానికి వెళ్ళారు. మార్చి 8తేదీ 2005 శివరాత్రినాడు సాధకులకు శివదీక్షను ప్రసాదించారు. ఆనాటి దీక్షలో ఇప్పటివరకు కనీ వినీ ఎరుగని రీతిలో ఒక ధ్యానాన్ని అనుగ్రహించారు. శివుని అనుగ్రహాన్ని పొందాలంటే శక్తి ఉపాసన తప్పనిసరి. శివుని చేతిలోని త్రిశూలమే సాధకుని వెన్నుపూసగా ధ్యానం చెయ్యాలి. బంగారు రంగులో ఉన్న ఆ శివుని త్రిశూలము యొక్క చివరి మొన భూమిలోకి పాతబడి ఉన్నది. అది సాధకుని మూలాధార చక్రము. అచ్చటి నుండి పైకి ఆజ్ఞాచక్రము వరకు త్రిశూలమును ధ్యానించాలి. త్రిశూలము పైన ఉన్న మూడుకొనలు సాధకుని కుడికన్ను, ఎడమకన్ను, మధ్య భాగం కనుబొమ్మల మధ్య బొట్టు పెట్టుకునే స్థానము. ఈ మూడు, మూడు స్థితులను సూచిస్తున్నాయి, అవి జాగృత, స్వప్న మరియు సుషుప్త స్థితులు.

త్రిశూలముపైన ఉన్న కుడిమొన – కుడికన్ను– జాగృత స్థితి (మెలుకువగా ఉండే స్థితి) – భూత కాలము

త్రిశూలముపైన ఉన్న ఎడమకొన – ఎడమకన్ను – స్వప్న స్థితి (కలల స్థితి) – భవిష్య కాలము

త్రిశూలములో ఉన్న మధ్యకొన – భృకుటి మధ్య స్థానం – సుషుమ్నా స్థితి (గాఢ నిద్రా స్థితి) – వర్తమాన కాలము

ఈ 3 స్థితులను సాధకుడు ఉపయోగించుకోగలుగుతున్నాడు. తన భూత, భవిష్య, వర్తమాన కాలములను తెలుసుకోగలుగుతున్నాడు. ఆజ్ఞా చక్రమువద్ద ఉన్న సుషుమ్నా నాడి, లేదా వర్తమాన స్థితిలో ఉంటూ ఎడమ కన్ను వద్ద ఉన్న భూతకాలములోని పాపములకు ప్రాయశ్చిత్తము చేసుకొని, కుడికన్ను వద్ద భవిష్యత్తును దర్శిస్తున్నాడు. ఇక్కడ సరిగ్గా నేను చెప్పింది, చెప్పినట్టు ఊహించుకోండి. వర్తమానములో ఉంటూనే శివుని త్రిశూలమువలన తనలో జరుగుతున్న మార్పులను గమనించు కోవాలి. ఇలా శివుని త్రిశూల సహాయంతో సాధకుడు 3 స్థితులపై ఆధిపత్యాన్ని సాధించాలి. తను కోరుకుంటున్న భవిష్యత్తును సరిగ్గా భావన చేసుకోవాలి.

ఇప్పుడు దృష్టిని శివుని డమరు మీదకి తెచ్చుకోండి. డమరు కుడి కొన కుడి చెవ్వు, ఎడమ కొన ఎడమ చెవ్వు, డమరు మధ్య భాగం మీ నాసికాగ్రం. ఇప్పుడు ఎడమ చెవ్వు నుండి నాసికాగ్రానికి, కుడి చెవ్వు నుండి నాసికాగ్రానికి అనగా రెండు చెవులనుండి వచ్చే ఓంకార శబ్దాన్ని భృకుటి వద్ద వినండి అంటూ అతి మధురంగా మాస్టర్‌గారు ఓంకారాన్ని ఉచ్చరించారు. అలా సాధకుడు తన్మయ స్థితిలో తన మొత్తం ధ్యానాన్ని ఓంకారాన్ని మౌనంగా వినటం పై దృష్టిని పెట్టాడు. ఆ ధ్యాన స్థితిలో మన ఎదుట అర్ధనారీశ్వరులను ఆపాద మస్తకము దర్శించాలి. వారి పాదముల వద్ద నుండి శిరస్సు వరకు ఒక వైపు అమ్మను, మరొక వేపు తండ్రిని జగత: పితరౌ వందే పార్వతీ పరమేశ్వరం అని వారి నఖశిఖ పర్యంతం ధ్యానం చెయ్యాలి. ఇప్పుడు అయ్యవారి శిరస్సుపైన ఉన్న గంగమ్మనుండి వస్తున్న గంగాజలములో సాధకుడు తడిసి పూర్తిగా పాపవిముక్తుడై, కుసంస్కారములన్నీ కడగవేయబడుతున్న భావన చెయ్యాలి. అమ్మ శిరస్సు పైన ఉన్న చంద్ర కిరణాలు, చల్లని కిరణాలు మనల్ని స్పృశిస్తున్న భావన, తద్వార మనకు అమృతత్వ ప్రాప్తి లభిస్తోంది అన్న పులకింత తెచ్చుకోవాలి. ఇప్పుడు అయ్యవారి అభయ హస్తమునుండి అభయము లభిస్తోంది. ఇక్కడ మీకు ఉన్న భయాలను పోగొట్టమని తండ్రిని వేడుకోండి. అమ్మ వరదానలహస్తమును చూస్తూ మీకు కావలసిన కోరికలను అమ్మకు చెప్పుకోండి. తండ్రి సహకారముతో కష్టాలను దాటి, అమ్మ సహాయంతో కోరికలు తీర్చుకొని గురు ప్రణాళికలో మీరు అత్యద్భుతమైన కార్యక్రమాలను చెయ్యగల శక్తులను పొందుతారు అని భావిస్తూ, ఈ కుండలినీ జాగరణకు నాందీ ప్రస్తావన

సాధనగా ఇస్తున్నాను. దీనిని ప్రపంచానికి అందిచాల్సిన బాధ్యత మీ అందరిమీద ఉన్నది అని ముగించారు. ధ్యానానంతరము నెమ్మదిగా కళ్ళు తెరిచి, కొంత సేపటితరువాత నెమ్మదిగా శరీరాన్ని కదపాలి. ఇలా శివరాత్రినాడు మాస్టర్‌గారు మరొక అత్యద్భుత సాధనను మానవజాతికి కానుకగా అందించారు.

## 'గో'సాధనతో - క్యాన్సర్ నివారణ, సంతానప్రాప్తి

ప్రాణశక్తికి గోవుకి చాలా దగ్గర సంబంధం ఉన్నది. పూర్వకాలంలో గురువు వద్దకు ఎవరన్నా జ్ఞానాన్ని నేర్చుకునేందుకు వస్తే వారికి ముందు ఆవులను మేపే పనిని అప్పగించేవారు. ఆధ్యాత్మికవిద్య లేదా ప్రాణవిద్య రావాలంటే ఆవుల ఉపస్థితి చాలా అవసరం. ఆవులు లేకుండా కృష్ణుడిని, దత్తాత్రేయుడిని మీరు ఊహించలేరు. ఇదివరకు ఎప్పుడూ లేనంతగా క్యాన్సర్ వచ్చినవారు నా వద్దకు వస్తున్నారు. సూర్యుని నుండి 30 శాతంకంటే ఎక్కువ అల్ట్రా వయొలెట్ రేస్ వస్తున్నందువల్ల క్యాన్సర్ వస్తోందని 1984 సర్వేలో అమెరికా సైంటిస్ట్‌లు చెప్పారు. ఆ రేస్ పర్సంటేజ్ ఇప్పుడు ఇంకా పెరిగింది. మరి మన ఋషులు దీని నివారణకు ఏదైనా తరుణోపాయం చెప్పారా, అంటే చెప్పారు. సంక్రాంతి పండుగ రోజులలో ఉదయాన్నే వాకిళ్లలో, గొబ్బిళ్ళ పెట్టే ఒక సాంప్రదాయంగా వారు దానిని మనకందించారు. ఆవుపేడ అల్ట్రా వయొలెట్ రేస్‌ను మన లోపలికి రానివ్వదు. పేడ, మాగ్నెట్‌లాగా ఆ రేస్‌ను తన లోపలికి లాగేసుకుంటుంది. సంక్రాంతి రోజులలో అల్ట్రా వయొలెట్ రేస్ ఎక్కువగా వస్తాయి. ఈ గొబ్బిళ్ళు వాటి దుష్ప్రభావం మన మీద పడకుండా చేస్తాయి. అలాంటి ఒక అద్భుతమైన సైంటిఫిక్ ప్రక్రియను ఋషులు మనకందించారు. మరికొన్ని సూక్ష్మప్రక్రియలనిలా చెప్పారు.

1. ప్రతిరోజూ సూర్యునికి ఎదురుగా నిలబడి ఒక పెద్ద పళ్ళెంలో నీళ్ళు పోసి, సూర్యుని కిరణాలు ఆ నీటిలోపడి వాటి రిఫ్లెక్షన్ మీ మీద పడేవిధంగా నిలుచుని, సూర్యసూక్తం 9 శ్లోకాలు చదువుకుంటే మీకు మీ కుటుంబంలోని వారికి క్యాన్సర్ రాదు.

2. ప్రతి రోజూ సాయంత్రం గో మహాలక్ష్మీ సాధనను చేసుకోండి. ఇది గోవు వద్ద చేసుకుంటే మంచిది, లేనప్పుడు ఇంట్లో ఫొటో పెట్టుకుని చేసుకోండి.

3. ఈ సాధనలు ఏమీ చేసుకోవటం చేతకానివారు గోశాలలో ఉండి గోవుకి సేవ చేసుకున్నా పూర్తిగా ఆరోగ్యవంతులవుతారు. గోమహాలక్ష్మి సాధనతో పిల్లలు లేనివారికి పిల్లలు పుడతారు. మొత్తం రామాయణము రఘువంశం మీద ఆధారపడి ఉన్నది. పిల్లలు లేని దిలీపుడు, సుదక్షణలకు 21 రోజులు గోశాలలో ఉండి గో సేవ చేసుకొమ్మని వశిష్టులవారు చెప్పారు. అలా గోవుకి అన్ని రకాల సేవలు చెయ్యటం వలన రఘుమహారాజు పుట్టాడు.

## తిరువణ్ణామలైకి ప్రయాణం

గాయత్రీ-కుండలినీ-సావిత్రీ పుస్తకరచన దాదాపుగా పూర్తిగావస్తున్నది. ఎడిటింగ్, కంపోజింగ్ అయినప్పటికి క్షణానికొక మార్పు చేయవలసి వస్తూనే ఉన్నది. ఇది ఇలా జరుగుతుండగానే ఒకరోజు హఠాత్తుగా మాస్టారు 'రేపు మనం తిరువణ్ణామలైకి వెళ్ళాలి అక్కడ నవరాత్రి సాధన జరగాలి. వెంటనే అందరికీ చెప్పండి. ఎవరి వసతి సౌకర్యాలను వాళ్ళే ఏర్పాటు చేసుకునే విధంగా సాధనాక్యాంప్‌ను ఏర్పాటు' చెయ్యమని చెప్పారు.

ఏదో ఒక మహత్తర దివ్యసందేశం అంతరంగంలో ఒక ఉత్తుంగతరంగంలాగా ఆవిర్భవించింది. ఆ దివ్యశక్తిని ఎక్కడ, ఎప్పుడు, ఎవరి సమక్షంలో ప్రకటీకరిస్తే అనన్యసామాన్యమైన ఫలితాలను పొందవచ్చునో దానిని అక్కడే శ్రావణ మేఘంలాగా వర్షింపచెయ్యాలి. అంతే, తక్షణమే అందరికీ సందేశం వెళ్ళిపోయింది. 2005 ఏప్రియల్ 22వ తేదీకి అందరూ తిరువణ్ణామలైకి రావాలనే విషయం ఝుంఝూమారుతంలాగా అందరికి వెళ్ళిపోయింది.

ఏప్రియల్ 21వ తేది సాయంత్రం ఒంగోలు శ్వేతద్వీపం నుండి మాస్టర్‌గారితోపాటు శ్రీమతి సుమ, నేను బయలుదేరాము. తెల్లవారేసరికి తిరువణ్ణామలైకి చేరుకుని ముందుగా ఏర్పాటు చేయబడిన శేషాద్రిస్వామి ఆశ్రమ ప్రాంగణంలో గల వసతి గృహాలకు చేరుకున్నాము. గుంటూరు, రేపల్లె, హైదరాబాద్, వైజాగ్, బెంగుళూరు ఇలా అనేక ప్రాంతాల నుంచి సాధకులు వచ్చేశారు. అరుణాచలశివ - అరుణాచలశివ - అరుణాచలశివ - అరుణశివోం అంటేనే ముక్తిని ప్రసాదించే దివ్యధామం అరుణాచల క్షేత్రం. సాక్షాత్ పరమశివుని ప్రియపుత్రుడైన సుబ్రహ్మణ్యస్వామి వారే శ్రీరమణులుగా జన్మించి ఆధ్యాత్మిక జీవన వికాసానికి ప్రప్రథమ సోపానమైన "నేను ఎవరిని" అనే సాధనామార్గాన్ని మానవజాతికి ప్రసాదించిన పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం అరుణగిరి.

అణువు, అణువునా శ్రీరమణుల సాధనా శాంతి సౌరభాలు దిశదిశలా తమ సుమధుర సుగంధ పరిమళాలను వెదజల్లుతున్నాయి. అటువంటి ఆ పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలో మాస్టర్‌గారు నిరంతరం అంతర్ముఖులై సాధనా శిఖరాగ్రాలలో విహరిస్తుండేవారు. పూజ్యశ్రీ రమణమహర్షి సాధన చేసిన విరూపాక్షగుహలకి వెళ్ళి సాధన చేశారు. విధిగా ప్రతిరోజు సాధనా శిబిరంలో భాగంగా శ్రీ రమణుల యొక్క మరియు శ్రీశేషాద్రిస్వామివారితో పాటు నాయనగారి జీవితాలను గురించి, వారి సాధనల గురించి ఆ క్షేత్రంలో గల అణువు అణువు గురించి ప్రవచనాలు చెప్పేవారు. క్షేత్రదర్శనంగా రోజుకో స్థలానికి వెళ్ళి అక్కడగల ప్రత్యేకతను బట్టి సాధన చేయించేవారు. అలా తొమ్మిది రోజుల పాటు సాధనా శిబిరం ఎంతో దివ్యంగా జరిగింది. అరుణాచల సాధనాశిబిరం అయిపోతూనే మాస్టర్‌గారు మాధురీ, రాజీవ్‌గార్లతో కలిసి బెంగుళూరుకు వెళ్ళిపోయారు. అక్కడ హైదరాబాద్‌లో శ్రీమతి తేజశ్రీ, కుమారి సావిత్రి,అనూషా వాళ్ళు గాయత్రి–కుండలినీ పుస్తకం ప్రింటింగ్ విషయం చూసుకుంటున్నారు. మాస్టర్‌గారి అనుంగు శిష్యులు శ్రీ జి.యస్. కృష్ణగారు గాయత్రీ–కుండలినీ–సావిత్రీ పుస్తక ఆవిష్కరణకు ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్ రాజశేఖరరెడ్డి గారిని ఆహ్వానించారు. 2005 మే 5వ తేది సాయంత్రం “లేక్ పార్క్”లో పుస్తక ఆవిష్కరణకు సుముహూర్తాన్ని నిర్ణయించారు.

## గాయత్రీ-కుండలినీ-సావిత్రీ పుస్తక ఆవిష్కరణ

అనుకున్న తేదీకి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. పూజ్యశ్రీ మాస్టర్‌గారు కూడా అటు బెంగుళూరు నుంచి 5వ తేది ఉదయానికల్లా హైదరాబాద్‌కు వచ్చేశారు. ‘పుస్తక ఆవిష్కరణ’ అదొక మహోత్సవంలాగా ఏర్పాట్లు చేశారు. శ్రీ జి.యస్.కృష్ణగారి ఆహ్వానంపై చాలామంది పురప్రముఖులు కార్యక్రమానికి వచ్చారు. శ్రీకృష్ణగారు, పూజ్యశ్రీ మాస్టర్‌గారిని వేదిక మీదకు ఆహ్వానించి ఆనాటి సభ యొక్క ప్రాముఖ్యతను ఎంతో అపూర్వంగా వివరించారు. తరువాత మాస్టర్‌గారు సభనుద్దేశించి ‘పరమ గురువుల లక్ష్యం– మానవులకు మేలు చేయడం. ఏ పద్ధతిలో ఆనాటి దేశ కాలపు ప్రజలకు మేలు జరుగుతుందో ఆ పద్ధతులను వారు ప్రేమతో ప్రబోధిస్తారు. ఆ మార్గంలో నడపించటానికి వారు తమ తపఃశక్తిని, యోగసిద్ధులను సామాన్యుల కొరకు, ఆర్తులకొరకు వినియోగిస్తుంటారు. తమకున్న జ్ఞానాన్ని, శక్తిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో అది వారి నుండి మనం నేర్చుకోవాలి’ అంటూ ప్రవచనాన్ని ప్రారంభించారు. ప్రవచనం చెప్తూనే

శ్రీ మాస్టర్‌గారు ఉన్నట్లుండి వేదిక నుండి దిగి గెస్ట్‌హౌసులోకి వెళ్ళిపోయారు. ఎందుకు అలా వెళ్ళారో కారణం తెలియక కొందరు ఆయనతో పాటే లోపలికి పరిగెత్తారు. పెద్దవాంతి చేసుకున్నారు. తరువాత పెద్ద విరోచనమూ అయిపోయింది. ఏదో తెలియని బాధతో మెలికలు తిరిగిపోతున్నారు. మాకేం చెయ్యాలో తోచడం లేదు.

కారణం అది హార్ట్ ఎటాక్. మనిషి ఇంకాఇంకా తలక్రిందులైపోతున్నారు. అక్కడ సభ జరుగుతున్నది. శ్రీ జి.యస్.కృష్ణ గారు మిగిలిన కార్యక్రమాలను అంటే శ్రీ వై.యస్. రాజశేఖరరెడ్డి గారితో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. సభ ముగిసింది. శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డిగారు లోపలికి వచ్చి మాస్టర్‌గారిని పరామర్శించి వెళ్ళిపోయారు.

క్షణక్షణానికి మాస్టర్‌గారి పరిస్థితి దిగజారిపోతున్నది. ప్రక్కనే కూర్చున్న నా చేతిలో ఉన్న 'గాయత్రీ-కుండలినీ' పుస్తకాన్ని చూస్తూ "మాతాజీ-గురుదేవుల" ఫోటో తీసి చూపించు అని అడిగారు. ఆ ఫోటోను చూస్తూ రెండూ చేతులు ఎత్తి నమస్కారం పెడుతూ మనస్సులోనే ప్రార్థన చేసుకున్నారు. పరిస్థితి భయం, భయంగానే ఉంది. వెంటనే తేజ, సావిత్రి వాళ్ళు తేరుకొని 'కేర్' హాస్పటల్‌కు ఫోన్ చేసి త్వరత్వరగా అంబులెన్స్ పిలిపించారు. మాస్టర్‌గారిని కేర్ హాస్పటల్లో చేర్పించారు. మాస్టర్‌గారి తమ్ముడు శ్రీ విశ్వనాథ్‌గారు డాక్టర్లతో మాస్టారి పరిస్థితిని గురించి విచారించగా, వారు ఇచ్చిన సమాచారం బట్టి అతి తీవ్రమైన హార్టుఎటాక్‌గా చెప్పారనీ, తక్షణమే చికిత్సను ప్రారంభించమని చెప్పాననీ వారు చెప్పారు. తగు చికిత్స చేసి ఐ.సి.యు.లో ఉంచారు. శ్రీవిశ్వనాథ్‌గారే అంతా చూసుకున్నారు, నాలుగురోజుల తరువాత మామూలు రూముకు పంపారు. సమయానుసారం మందులు, ఆహారాది ఉపచారాలు యథావిధిగా చూస్తున్నాము.

ఒక వారం తరువాత ఇంటికి పంపించారు. కూకట్‌పల్లిలోని భాను,సదానందమూర్తిగారింటికి వెళ్ళారు. మెల్లమెల్లగా కోలుకున్నారు. హైదరాబాదులోనే డాక్టర్ల పర్యవేక్షణలో పూర్తిగా స్వస్థత చేకూరింది. ఈ మధ్యకాలంలో ఒకానొక సందర్భంలో మాస్టర్‌గారు "నేను లక్షయజ్ఞాలు చేయిస్తానని గురుదేవులతో చెప్పుకున్నాను" దానిని ఎలా చేయగలమో ఆలోచించు అన్నారు నాతో. అంతటి అనారోగ్య పరిస్థితిలో కూడా వారి ఆలోచనలు గురుదేవుల పనికోసమే తహ,తహలాడుతుండేవి. అంతటి సమర్పణామయ జీవితం వారిది.

ఇంతలో జులై 20వ తేదీన గురుపూర్ణిమ వచ్చింది. శ్రీశ్రీ మాస్టర్‌గారి ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా కార్యక్రమాలని పెద్దపెట్టున ఏర్పాటు చెయ్యలేదు. హైదరాబాదులోనే శ్రీమతి తేజశ్రీ వాళ్ళింట్లో ఒక సాధారణ స్థాయిలో ఇంటివరకే చేయడం జరిగింది. ఆరోగ్య పరిస్థితిని బట్టి బయట నిర్వహించే పెద్దపెద్ద కార్యక్రమాలలో ఆయన చెప్పగలిగే స్థితిలో లేరు. కానీ అన్ని ప్రాంతముల నుంచి పరివార్ సభ్యులు తెల్లవారేసరికి వచ్చారు. ఆ ఉదయం 10 గంటల నుండి గురుపూర్ణిమ, దాని విశిష్టత మరియు గురుసత్తా కార్యక్రమ ప్రణాళికల గురించి వివరిస్తూ మాస్టర్‌గారు "2011వ సంవత్సరం నాటికి **విద్యా, వైజ్ఞానిక, ఆర్థిక రంగాలలో అనూహ్యమైన క్రాంతి రాబోతున్నది. ఆర్థికరంగంతో పాటు ఆలోచనలలో కూడా క్రాంతి వచ్చి తీరుతుంది.** ఈ రాబోయే మార్పు కోసం మనం అసాధారణ కృషి చేస్తామా, లేదా అనేది గురుపూర్ణిమనాడు మీరే ఆలోచించుకోండి. అవకాశం వచ్చినప్పుడు ఎవరు ఎంత స్థాయిలో త్యాగాలు చేసి గురువులకు సహకరించగలరో వారికే అనూహ్యమైన ఫలితాలు వస్తాయి" అని చెప్పారు. గురుపూర్ణిమనాడు గురువుల ఆశీస్సులు తీసుకోండి. కానీ వారి పనిచేస్తూ వారి స్థాయికి తగినట్లు వారిని గౌరవించటం కూడా నేర్చుకోండి. **రాబోయే 5 సంవత్సరాలలో అంటే విద్య, వైజ్ఞానిక, ఆర్థిక రంగాలలో అనూహ్యమైన క్రాంతి వచ్చి తీరుతుంది. ఆ మూడు రంగాలలో మీరు పనిచేసి చూపించకపోతే ఆ పనిని వేరే క్రొత్త దేశం చేసి చూపిస్తుంది** అంటూ మన ఊహకందని విషయాలు ఆనాటి ప్రవచనంలో చాలా నొక్కినొక్కి చెప్పారు. స్వర్ణయుగం పత్రికా సంపాదకులైన శ్రీసీతారాముడుగారిని, ఆ రోజు గురుసీతారాంగా ప్రకటించారు.

శ్రీ చక్రోపాసన – మాస్టర్‌గారు తను ఎలాంటి పరిస్థితిలో ఉన్నా ఉపాసన, సాధన, ఆరాధన అను త్రిపుటిని ఎప్పుడూ పాటించేవారు. ఆయన హార్ట్ ఎటాక్ తరువాత ఇంటికి వచ్చాక తేజా, సావిత్రిలకు తనకు సాయంత్రానికల్లా శ్రీచక్రము, దానిని పెట్టటానికి 12 దళములతో చేసిన చిన్న వెండి ప్లేటు, ఆ ప్లేటుకి క్రింద 12 అంగుళములతొ మూడు కాళ్ళు త్రిభుజాకారములో ఉండాలని, వాటితోపాటు చిన్న కలశము, దీపారాధన కుంది, అగరవత్తుల స్టాండు, విభూధిని వేసుకునేందుకు ఒక చిన్న గిన్నె, వీటన్నిటినీ పెట్టి పూజించేందుకు ఒక చిన్న నాలుగు కాళ్ళ పీట తెమ్మన్నారు. శ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు స్వయంగా శ్రీ చక్రోపాసనకు కావలసిన సరంజామాను సైజులతో సహా అతి స్పష్టంగా చెప్పేసారు. ఆయన ఆజ్ఞ రాగానే ఎవ్వరైనా ఇది చెయ్యగలమా లేదా అనే ఆలోచన చెయ్యరు, చెప్పిందే తడవుగా ఉత్సాహంగా మాస్టర్‌గారి కోరిక తీర్చటమే తమ అదృష్టంగా భావించి

ఆ పనిని పూర్తి తన్మయతతో చేసేవారు. మాస్టర్‌గారి ప్రతి పనిలోనూ ఒక స్పష్టత చిన్న పిల్లలకి కూడా అర్థం అయ్యే విధంగా ఉండేది. సరే పూజకి కావలసిన సామాన్లతోపాటు పూజా విధానాన్ని ఒక చిన్న పుస్తకంగా తయారుచెయ్యటానికి కూర్చున్నాము, సాయంత్రానికి పుస్తకం తయారు అయ్యింది. పూజకి పీటపై ఈశాన్యములో కలశము, ఆగ్నేయములో దీపము, వాయువ్యములో అగరబత్తి స్టాండు, నైరుతిలో ఒక గిన్నెలో విబూధి వేసి పెట్టించారు. ముందు పంచోపచార పూజ, తరువాత శ్రీసూక్త పురుషసూక్త మంత్రములతో అభిషేకము, నవావర్ణపూజ, పూజ్య గురుదేవుల అష్టోత్తర శతనామావళితో పూజ ముఖ్యాంశములుగా సాయంత్రానికి పుస్తకం తయారుచేయించారు. మరునాటి ఉదయానికి శ్రీ శ్రీరామకృష్ణ గురుదేవులతోపాటు ఒక దంపతుల జంట కూర్చొని శ్రీచక్ర ఉపాసన ప్రారంభానికి అన్ని రకాల ఏర్పాట్లు జరిగిపోయాయి. ముందుగా శ్రీ సూక్త పురుషసూక్తములు చదువుతూ పంచామృతాలతో అభిషేకము, నవావర్ణ పూజ చేసారు. తరువాత కుండలినీ సాధనలో భాగంగా గురుదేవుల అష్టోత్తర శతనామావళి సాధన చేసారు. అలా 90 రోజుల పాటు తేజా జగన్‌వాళ్ళు ఉన్న మెహర్ నివాస్‌లో సాధన జరిగింది. దీనికి ప్రణాళికా బద్ధంగా హైదరాబాదులోని పరివార్ సభ్యులు రోజుకి ఒక జంట కలిసి మాస్టర్‌గారితో శ్రీచక్రార్చన చేసేవారు, ఇలా మాస్టర్‌గారితో కలిసి శ్రీచక్ర పూజ చేసుకోవటం అనేది నిజంగా జన్మ జన్మల పుణ్యము, గురు అనుగ్రహమే కదా. ఇదే సమయంలో ఒంగోలు అనుగ్రహపీఠములో కార్యకర్తగా ఉండే శ్రీమతి సుబ్బులుగారు అనుకోకుండా వీరి ఇంటి పక్కకు వచ్చారు. మాస్టర్‌గారిని, నన్ను అక్కడ చూసి ఆవిడ సంతోషంతో అక్కడ ఉండగా ప్రతిరోజూ వచ్చి తనకు చేతనైన సేవ చేసేవారు. ఆ నాటి నుండి మెంటా సుబ్బులుగారు, కోడలు గీతా రాధిక, కొడుకు నారాయణరావు మాస్టర్‌గారికి పూర్తి సమర్పణతో పనిచేస్తున్నారు. మాస్టర్‌గారితో గడిపే ప్రతి రోజు ఒక కొత్త జన్మే. కొత్త ప్రణాళికలు, కొత్త సాధనలతో నిత్య నూతనంగా ఉండేది. ఈ సమయంలోనే గో మహాలక్ష్మి సాధన, శ్రీ చక్ర సాధన, దేవపరివార్ వివరములకు సంబంధించిన పుస్తకాలు తయారైపోయాయి.

ఏప్రియల్ నెలలో వచ్చిన శ్రీరామనవమినాటి సంఘటన గురించి ఇక్కడ కాస్త చెప్పాలి. పరిస్థితులు ఎలా ఉన్నా జరగవలసిన పనులు జరిగిపోతూనే ఉండాలి కదా! శ్రీరామనవమినాడు, గాయత్రీ అనుగ్రహపీఠంలో శ్రీ సీతారామకళ్యాణం జరిగింది. సమర్థులైన కొంతమంది సాధకులు, రాబోయే గురుపుష్యయోగ పర్వదినాన్ని పురస్కరించుకొని దశసహస్ర శ్రీమహాలక్ష్మి చేస్తామని,

దానికి మాస్టర్‌గారిని అనుమతినివ్వమని కోరారు. దానికి వారు పుష్కలంగా తమ ఆశీర్వాదాల వర్షం కురిపించారు. ఇంక సక్రియకార్యకర్తలందరూ అవిశ్రాంతంగా పనిలోకి దిగారు. ఒంగోలు చుట్టుప్రక్కల వంద గ్రామాలలో 'శ్రీమహాలక్ష్మి' మంత్ర సాధనా విధానాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువచ్చారు. ప్రధానంగా శ్రీమతి సుబ్బరావమ్మ, కోటేశ్వరమ్మ, విమల, శ్రీసుబ్బయ్య, శ్రీ కోటిలింగయ్యగార్లతో ఇంకా ఎంతోమంది ఈ కార్యక్రమ నిర్వహణభారాన్ని శ్రద్ధ, భక్తులతో నిష్టగా స్వీకరించారు. ప్రచారం ముమ్మరంగా సాగుతున్నది.

పూజ్యగురుదేవుల దయవలన శ్రీశ్రీమాస్టర్‌గారికి పూర్తిగా స్వస్థత చేకూరింది. ఆగష్టు నాల్గవ తేదికి మాస్టర్‌గారిని ఒంగోలుకు తీసుకువచ్చాము. వస్తూనే 'ఈ సాయంత్రమే మనం నాగులుప్పలపాడుకు వెళ్ళాలి. అక్కడ అంతా సరిగ్గా ఉందో లేదో చూడాలి. చేయవలసిన పని చాలా ఉంది' అన్నారు. సరే సాయంత్రానికి కారులో మాస్టారిని తీసుకువెళ్ళాము. పూజ్యశ్రీ మాస్టర్‌గారి కోరిక మేరకు లక్ష యజ్ఞాలు చెయ్యాలని కదా అన్నారు, దానికి శ్రీకారం ఈ 'దశసహస్ర శ్రీమహాలక్ష్మీసాధన మహాపూర్ణాహుతి' నాగులుప్పలపాడు నుంచి ప్రారంభించాలనే తలంపు నా మదిలో మెదిలింది. వెంటనే కార్యకర్తలందరిని కలిసి మాస్టర్‌గారి కోరిక చెప్పగా, వాళ్ళుకూడా మహదానందంతో శ్రీమహాలక్ష్మీసాధనతో పాటు సహస్రకుండీయజ్ఞం చెయ్యాలనే నిర్ణయానికి వచ్చారు. అందరూ అదెంతో మహద్భాగ్యంగా స్వీకరించి తక్షణమే దానికి తగిన ఏర్పాట్లను ప్రారంభించారు.

సహస్రాధిక శ్రీమహాలక్ష్మి సాధనా పారాయణ క్రమంతో పాటు మహాపూర్ణాహుతి యజ్ఞం వెయ్యి ఎనిమిది హోమకుండాలలో జరిపించటానికి తగిన స్థల నిర్ణయార్థం శ్రీశ్రీ మాస్టర్‌గారు నాగులుప్పలపాడుకు వచ్చారు. శ్రీ గొల్లపూడి సుబ్బయ్యగారి పొలాల ఆవరణంతా కలయతిరిగి పరిశీలించి చూచి కొంతమేర ప్రదేశాన్ని యజ్ఞ స్థలానికి నిర్ణయించి దానికి చుట్టూ వెదురు బొంగులతో బ్యారికేడ్సు కట్టించారు. స్థలప్రదక్షిణకి వీలుగా పరిక్రమాపథాన్ని కూడా ఏర్పాటు చేసి నాలుగు వైపులా నాలుగు ద్వారాలను ఏర్పాటు చేసి వాటికిరువైపులా పతాకములను కట్టించారు. ముందుగా స్వయంగా తామే ఆ స్థలదేవతకు ఈశాన్య భాగంలో కొబ్బరికాయలు కొట్టి సామూహికంగా అందరూ శ్రీసూక్తం చదువుతూ వుండగా స్థలప్రదక్షిణను ప్రారంభించారు. వారితో పాటు అనేకమంది ఆ పరిక్రమలో పాల్గొన్నారు. అలా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వీలైనంతమంది ఒక

మొక్కుగా పెట్టుకొని స్థలప్రదక్షిణ చేయటం అపూర్వం. ఆగష్టునెలంతా అందరూ సాధనతో పాటు ప్రచారాన్ని విరివిగా కొనసాగించారు.

## శ్రీ మహాలక్ష్మీసాధన

చాలామంది శ్రీమహాలక్ష్మీసాధన, పారాయణలు చేస్తారు. కానీ శ్రీమహాలక్ష్మీసాధన ఎందుకు చెయ్యాలి, ఎప్పుడు, ఎవరు దీనిని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. దీని వలన ఎలాంటి అపూర్వమైన ఫలితాలు ఎలా వస్తాయనేది ఎవరికీ తెలియదు.

శ్రీ విద్యారణ్యస్వామివారు విఖ్యాతపురుషులు, మహాయోగి, వేదత్రయ భాష్యకర్త, బ్రహ్మవిద్యాపరాయణులు, వేదాంత శాస్త్రాది అనేక గ్రంథములను రచించారు. వీరు మతోద్ధారకులే కాదు, రాజ్యోద్ధారకులు కూడా! సాధారణంగా వీరిని విద్యారణ్యస్వామి అని పేర్కొంటారు. కానీ తల్లిదండ్రులు వారికి పెట్టిన పేరు మాధవుడు. సన్యాస స్వీకారము తర్వాత శ్రీ విద్యారణ్యానామమును ధరించారు. తల్లి శ్రీమతి, తండ్రి మాయాణుడు, వీరిది భారద్వాజ గోత్రము, యజుర్వేదశాఖ. శ్రీవిద్యాతీర్థులు, భారతీతీర్థులు, శంకరానందులు మున్నగువారు వీరికి గురువులని తెలుస్తున్నది. 'సర్వజ్ఞ విష్ణు' అనే పేరుగల గురువుగారి దగ్గర వేద, వేదాంత శాస్త్రములనధ్యయము చేసినట్లు సర్వదర్శన సంగ్రహములో ఉన్నది. తమ 40వ సంవత్సరంలో వీరు 'వీతిహోత్రి' అను కన్యను తల్లిదండ్రుల ఆజ్ఞానుసారము సన్యాసస్వీకారానికి ముందు పెండ్లి చేసుకొని సాంసారిక జీవన ధర్మమును పాటించారు.

వీరి విద్యాభ్యాస కాలమునాటికి దక్షిణమున ఆర్షమతము యొక్క పరిస్థితి హీనంగా తయారైంది. వేదశాస్త్రములు అడుగంటాయి. శ్రౌత, స్మార్త విద్యలు భ్రష్టమైపోయాయి. వేదార్థాలను విశదీకరించే వారు ఎవ్వరూ లేరు. దాని ఫలితముగా మతము పలుశాఖలుగా చీలిపోయింది. ఈ పరిస్థితులలో శ్రీవిద్యారణ్యుల వారు అవతరించి వేదమతాన్ని ఉద్ధరించారు. వీరికి కాస్త వయస్సు వచ్చేసరికి ఉత్తర హిందూస్థానమంతా మహమ్మదీయుల వశమైనది. అన్యమతస్థులు దక్షిణాదిన అక్కడక్కడ తమ పీటవేయడం మొదలుపెట్టారు. ఈ విషయాలన్నీ వారిని కలతపెట్టసాగాయి.

అప్పుడు తుంగభద్రానదీ తీరాన భువనేశ్వరీమాతను గురించి తీవ్రమైన తపస్సు గాయత్రీ మంత్రంతో ప్రారంభించారు. అమ్మ ప్రసన్నురాలై ప్రత్యక్షమైంది. వరము కోరుకోమన్నది. అఖండ

ఐశ్వర్యమునిమ్మని కోరారు. ఈ జన్మలో ఐశ్వర్యమును పొందటానికి అర్హత లేదని చెప్పి అమ్మవారు అంతర్ధానమైంది. అప్పుడాయన సన్యసించి శృంగేరి పీఠాధిపత్యము స్వీకరించి విద్యారణ్య బిరుదమును వహించారు. సన్యాసము అనేది మరుజన్మతో సమానం, మళ్ళీ అమ్మకై తపస్సుచేసి 'ఐశ్వర్యమునిమ్మని' అమ్మను అర్థించాడు. అమ్మ ఆయన అభ్యర్థనను స్వీకరించినది. మూడు ఘడియల సేపు బంగారమును కురిపించింది. అప్పుడాయన శాస్త్ర విహితమైన శ్రీమహాలక్ష్మిసాధనా విధానాన్ని సమస్త మానవజాతికి అందించారు.

అదే సమయానికి హరిహరరాయలు, బుక్కరాయలు వారి వద్దకు వచ్చారు. విరూపాక్షస్వామి పేరిట వారిచే ఆయన ఒక రాజ్యాన్ని స్థాపింపచేశారు. భువనేశ్వరిమాత అనుగ్రహించిన ఆ అపార ధనసంపత్తిని విరూపాక్ష పీఠము నెలకొల్పటానికి, విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించడానికి వినియోగించారు. ఈ రాజుల వద్దనే కొంత కాలము మంత్రిగా ఉన్నారు. ఆ తరువాత వారు శృంగేరికి వెళ్ళి అక్కడి శంకర పీఠానికి అధిపతి అయ్యారు. వారు తమ 120వ ఏట 1386 జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి సోమవారం నాడు బ్రహ్మైక్యం పొందారు విద్యారణ్యుల జననం 1267వ సంవత్సరం.

జాతిని ఉత్తేజపరచిన మహనీయులలో శ్రీవిద్యారణ్యులు ఒకరు. వారు బ్రహ్మైక్యము పొందిన జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి నాడు శృంగేరి పీఠములో వారికి సంస్మరణ, పూజలు ఈనాటికీ జరుగు తున్నాయి. అలాంటి మహాత్ముల చేత అందించబడిన ఈ మహాలక్ష్మిసాధనను తిరిగి పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు పునఃప్రాభవంలోకి తీసుకువచ్చారు. ప్రతి అమావాస్యకు శ్రీమహాలక్ష్మి సాధనను ఎంతో శ్రద్ధతో చేయించేవారు. తర్వాత వారు సహస్ర, దశసహస్ర శ్రీమహాలక్ష్మి సాధనలను కనీవినీ ఎరుగని రీతిలో అనేక ప్రాంతాలలో చేయించారు. తద్వారా భారతదేశము ఆర్థిక రంగంలో ప్రపంచ దేశాలలో ముందుకు రావటం జరిగితీరుతుంది. అలాగే చక్కని పరిపాలనా వ్యవస్థ కూడా ఈ సాధనా ఫలితంగా సమకూరుతుంది. తిరిగి భారతదేశం జగద్గురు పీఠమునధిరోహించి తీరుతుంది. ఈ సాధన వల్ల వ్యక్తిగత లాభాలతో పాటు సమాజ వ్యవస్థను కూడా చక్కదిద్దబడుతుంది.

**దశసహస్ర శ్రీమహాలక్ష్మి సాధన - మహాపూర్ణాహుతి - నాగులుప్పలపాడు**

**గురుపుష్య యోగమునాడు మహాలక్ష్మి సాధన చేస్తే అఖండ ఐశ్వర్యం పొందుతారని** శాస్త్రం చెప్తోంది. గత ఆరు నెలలుగా గ్రామ, గ్రామాలలోనూ శ్రద్ధా, నిష్టలతో స్త్రీ, పురుషులందరూ శ్రీ మహాలక్ష్మిసాధన చేస్తున్నారు.

మహాపూర్ణాహుతి సమయం దగ్గర పడుతున్నది. వనరుల సమీకరణ, యజ్ఞశాల నిర్మాణం, సంస్కార మహోత్సవముల ఏర్పాట్లు, 108 గ్రామాలలో స్థాపించిన కలశాలను ఊరేగింపుతో యజ్ఞశాలకు తీసుకురావటం ఇదంతా ముందుగానే భారీ ఎత్తున చేయాలని ఆలోచించి సిద్ధం చేయడం జరిగింది.

ఆగష్టు 31వ తేది ఉదయం సంస్కార మహోత్సవాలకు అన్ని ఊళ్ళ నుంచి జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. షామియానాలు వేశారు. విశాలమైన వేదిక నిర్మాణం, దానిమీద శ్రీమహాలక్ష్మి, పూజ్యశ్రీ మాస్టర్‌గారు, గురుసత్తాల నిలువెత్తు ఫోటోలను అలంకరించారు. యజ్ఞశాల, పృథ్వి మీదకు దిగివచ్చిన ఇంద్రసభ మాదిరి దివ్యకాంతులతో రంగురంగుల పూలదండలతో, తోరణములతో కళకళలాడిపోయింది. శ్రీశ్రీ మాస్టర్‌గారి సూచనల మేరకు అష్టలక్ష్మి వైభవం భవ్యంగా కనిపించేలాగా 8 దిక్కులలో అష్టలక్ష్మి దేవతల ఫోటోలను అలంకరించి పెట్టారు. యజ్ఞశాలకు దూరంగా తూర్పుదిశగా 'శ్రీమహాలక్ష్మి' ఆలయం టెంపరరీగా కట్టించారు. లక్ష్మీదేవి అంటేనే వైభవానికి మారుపేరు. ఈ మందిర నిర్మాణం గాని, ఆ రోజు అమ్మవారి అలంకరణగాని ఎంతో వైభవోపేతంగా తయారుచేశారు. నాలుగు దిక్కులలో గోవు, గుర్రము, ఏనుగుల బొమ్మలున్న ఫ్లెక్సీలను చుట్టూ పెట్టించిన విధానం అదంతా చూచి తీరాల్సిందేగాని, వాచామగోచరః అనే చెప్పాలి. ఈ ఏర్పాట్లన్నీ తేజశ్రీ, సావిత్రి, అనూష, సౌజన్య, వల్లీ వాళ్ళు ఎంతో ఉత్సాహంతో, సరదా సరదాగా చేశారు. శ్రీమహాలక్ష్మి సాధన మారేడు చెట్టు దగ్గర చేస్తే అత్యంత ఫలదాయి అని శాస్త్ర ప్రమాణం. పొలాల్లో ఆ చెట్లు ఉండవు కాబట్టి దానికి సంబంధించి విశాలమైన ఫ్లెక్సీని శ్రీమతి విజయశ్రీగారు తెచ్చి అక్కడ అలంకరించారు.

వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కావలసిన వసతి సదుపాయాలను సాక్షాత్ గాయత్రీమాతే స్వయంగా అందరినీ తన ఇంటికి ఆహ్వానించిందా అన్నట్లుగా ఆ ఊరివారు తమ, తమ ఇళ్ళకు ఆహ్వానించి ఎంతో గౌరవంతో, ప్రేమతో వారిని ఆదరించారు. ఆ ఏర్పాట్లను,

వేదికను, యజ్ఞశాల నిర్మాణాన్ని చూచి శ్రీశ్రీ మాస్టర్‌గారు ఎంతో ఎంతో ఆనందించారు. నాలుగు రోజులు ముందు నుంచే మాస్టర్‌గారి పర్యవేక్షణలోనే ప్లాన్ ప్రకారం యజ్ఞశాల నిర్మాణ వ్యవస్థను శ్రీరంగనాథ్, శ్రీనివాస్, కోటిలింగయ్య, సుబ్బయ్య, హరిబాబుగార్లు పర్యవేక్షించారు. ఇంకా గ్రామస్తులందరి సహకారంతో 1008 కుండీలను ఏర్పాటు చేయించారు. స్త్రీలు ఎంతో రంగరంగ వైభవంగా కుండీలను అలంకరించారు.

అనుకున్న సమయంరానే వచ్చింది. ఆగష్టు 31వ తేది ఉదయం 8గంటల నుండి సంస్కార మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు జరిగాయి. అందరూ కార్యక్రమానికై ఎదురుచూస్తూ కూర్చున్నారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు వేదిక మీదికి వచ్చారు. ధగధగ మెరిసిపోతున్న ధవళవస్త్రాలతో చిరు దరహాసంతో, పొంగిపొరలిపోతున్న ప్రేమను దశదిశలా ప్రవహింపచేస్తూ సాక్షాత్ శ్రీకృష్ణపరమాత్మే ఈనాటి ఈ కార్యక్రమం చెయ్యడానికి వచ్చారా అన్నట్లుగా వారు తమ ఆసనాన్ని అలంకరించారు. ఆనాటి వారి రూపాన్ని దర్శించిన వారి జీవితాలు ధన్యమైనాయి. శరత్‌కాలపు పూర్ణచంద్రుని నుంచి వెదజల్లుతున్న చల్లని వెన్నెలలాంటి ఆహ్లాదకరమైన ఆ నవ్వుల సోయగంతో సభనంతా పరికించి చూస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సంస్కారాలు చేయించుకోవటానికి వచ్చిన వాళ్ళంతా ఒక క్రమపద్ధతిలో ఏ వర్గానికావర్గం వేరువేరుగా కూర్చోవడంతో కార్యక్రమానికే అదొక వన్నె తెచ్చిందనడం యథార్థం. పూజ్యశ్రీ మాస్టర్‌గారు కార్యక్రమానికి నాందిగా 'ఓం' కారాన్ని మూడుసార్లు ఉచ్చరించి, గురుప్రార్థన చేసి గాయత్రీమంత్రం మూడుసార్లు చెప్పారు. ఇంక సంస్కారాల గురించి పరిచయ ప్రవచనం ప్రారంభించారు. అంతే ఆకాశం మేఘావృతమైంది. దట్టమైన నల్లటి కారుమేఘాలు ఆకాశమంతా ఏనుగుల దండు వస్తున్నదా అన్నంత వేగంగా పరిగెట్టసాగాయి. ఒక్కసారి ఫెళఫెళమని ఉరుములు, మెరుపులతో కుండపోతగా కుంభవృష్టి కురవడం మొదలైంది. క్షణాలలో యజ్ఞశాలంతా జలమయం, బురద. అడుగుతీసి అడుగుపెట్టలేని బురద. అందరూ నిశ్చేష్టులయ్యారు. హే భగవాన్! ఏమిటి నీ మాయ. ఇంత అట్టహాసంగా, ఆర్భాటంగా ఏర్పాట్లు జరిగాయి. మరి ఏమిటి నీ లీల? ఈ కార్యక్రమం ఎలా గట్టెక్కిస్తావో నీదే భారం అంటూ మనస్సులోనే అందరం దైవానికి మొక్కుతున్నాము.

ఇంతలో పూజ్యశ్రీ మాస్టర్‌గారి కంఠంలో ఆనందం, సంతోషంతో (మైకులు తడిసి పని చెయ్యలేదు) పెద్దపెద్దగా ఇలా చెప్పారు. అందరూ ఇలా చూడండి, మీరు చేసిన సాధన ఫలించింది. ఇదే అసలైన పూర్ణాహుతి. దీని కోసమేగా మనం సాధన చేశాం. అమ్మవారు కరుణించి వరాలను కురిపించింది అన్నారు. ఒక్కసారిగా అందరికీ మతులు పోయాయి. ఇంకా ఇలా చెప్తూనే వున్నారు. మరి 'శ్రీమహాలక్ష్మి' అంటే ఇదే ! శ్రీమహాలక్ష్మి ఎక్కడ ఉంటుంది. **"చిక్లీత వసమేగృహే"** అని కదా శ్రీసూక్తం చెప్తుంది. చిక్లీత అంటే బురదే కదా! మరి ఇక్కడ అమ్మవారు ఉన్నాట్టా, లేనట్టా? చెప్పండి. నిజంగా అమ్మవారు దిగి వచ్చేసింది అని మాస్టర్‌గారు చెప్పగానే అందరికీ బోలెడంత ధైర్యం వచ్చేసింది.

సాయంత్రానికి అంతా బాగైపోతుంది. పడిపోయిన పందిళ్ళు ఎత్తి కట్టించండి. తర్వాత కార్యక్రమాలను కొనసాగించడానికి యజ్ఞశాలను మెల్లగా శుభ్రం చేద్దురుగాని అని ధైర్యం చెపుతూ యజ్ఞశాలలో కలియతిరిగారు. శ్రీశ్రీ మాస్టర్‌గారు ఆ ప్రాంతంలోనే అటూ ఇటూ తిరుగుతూ అనేక సూచనలనిస్తున్నారు. మళ్ళీ అందరిలో నూతన ఉత్సాహం వచ్చేసింది. కాసేపటికల్లా సూర్యభగవానుని దివ్యకాంతులు, ప్రపంచమంతా ఆవరించాయి. యజ్ఞశాల తడి ఆరిపోయింది. పందిళ్ళు ఎత్తి కట్టారు. ఏర్పాట్లు యథావిధిగా కొనసాగుతున్నాయి. యజ్ఞశాలలో పునర్వైభవం వచ్చేసింది. సాయంత్రానికల్లా అన్ని గ్రామల నుండి అందంగా అలంకరించబడిన పూలరథాలను మైమరపించే రీతిలో చక్కగా అలంకరించిన ట్రాక్టర్లలో ఉంచిన జలకలశాల ఊరేగింపు బాజా, భజంత్రీలలో భక్తులు యావన్మందీ యజ్ఞశాలకు తరలివచ్చేశారు. యజ్ఞశాలలో ఒక దివ్యమైన కళ వచ్చింది.

ఎటు చూచినా ఆనంద తాండవమే! కార్యక్రమాలలో భాగంగా ఆ రోజు సాయంత్రం ఏడుగంటల నుండి మాస్టర్‌గారి అధ్యక్షతన శ్రీరామమూర్తిగారి అష్టావధాన కార్యక్రమం చాలా సరదాగా నిర్వహించబడినది. శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం దగ్గర శ్రీమతి సౌజన్య, తేజశ్రీ మొదలగువారు సహస్రాధిక దీపయజ్ఞం ఎంతో శోభాయమానంగా చేయించారు. ఆగష్టు 31వ తేదీన జరగవలసిన ప్రత్యేక కార్యక్రమాలన్నీ, అంత వానకురిసినా శ్రీశ్రీమాస్టర్‌గారి ఉపస్థితిలో అందంగా, ఆనందంగా జరిగిపోయాయి.

"గురుపుష్యయోగం" సెప్టెంబర్ 1వ తేది తెల్లవారుఝామున 2–35 నిమిషాల నుంచి వస్తుంది. అందుచేత తెల్లవార్లూ దాదాపుగా ఎవ్వరూ నిద్రపోలేదు. మిగిలిన పనులను పూర్తిచేసి సరిగ్గా 2–35 నిమిషాలకు నేను, ఇంకా కొంతమంది కార్యకర్తలు వేదిక మీదకి వచ్చి "శ్రీమహాలక్ష్మి సాధన" పారాయణకు కావలసిన పూజ, అర్చనాది కార్యక్రమాలను పూర్తి చేశాం. అప్పటికే యజ్ఞశాలకు భక్తులు విచ్చేసి వున్నారు. అందరమూ కలిసి ముక్తకంఠంతో "శ్రీవిద్యారణ్యప్రోక్త బీజమంత్ర సంపుటిత శ్రీసూక్తపారాయణ" క్రమాన్ని ప్రారంభించాం. బాగా పారాయణ చేయగలవారు ఇద్దరిద్దరు వేదిక మీదకి వచ్చి పారాయణ చేయగా, వారితో మిగిలిన వారందరూ కలిసి పారాయణ చేయటం జరిగింది. గురువారంనాడు పుష్యమి ఘడియలు తెల్లవారుఝామున 2–35 నిమిషాల నుంచి ఉదయం 10–40 నిమిషాల వరకు ఉన్నందు వలన ఈ పారాయణ క్రమం ఆ సమయంలో వేలాదిమంది భక్తులతో ప్రారంభించడం ఎంత అద్భుతమైన విషయమో మరి! ఆనాడు జరిగిన ఆ పారాయణను చూచిన వారి జీవితాలు ధన్యమే ధన్యం. పారాయణక్రమం పూర్తి అయ్యే సమయానికి పూజ్యశ్రీ మాస్టర్‌గారు వేదిక మీదకి వచ్చేశారు. కరతాళధ్వనులతో వారి ఆగమనానికి ఆహ్వానం పలికారు భక్తజనులు.

వేదిక మీదకి వచ్చిన శ్రీశ్రీ మాస్టర్‌గారు ఆనాటి ప్రవచనంలో క్లుప్తంగా ఏం చెప్పారంటే శ్రీమహాలక్ష్మి సాధన సర్వసౌభాగ్య ఫలదాయిని అని, దాని వలన సమాజం సిరిసంపదలతో తుల తూగడమే కాక సువ్యస్థితమైన పరిపాలనా వ్యవస్థను స్థాపించబడి, దేశం సుభిక్షంగా ఉంటుంది. అలా దేశమును తీర్చిదిద్దాలనే "శ్రీవిద్యారణ్యులవారు క్రీ.శ. 13వ శతాబ్దంలో ఈ మహాలక్ష్మి ఉపాసన చేశారు. అమ్మ అనుగ్రహంతో మూడు ఘడియల పాటు కనకవర్షం కురిసింది". అలా ఆయన ఆ తల్లి అనుగ్రహంతో సుస్థిరమైన అఖండ విజయనగర సామ్రాజ్య స్థాపనకు కారణ భూతులైనారు. సరిగ్గా ఆనాటి ఆ పరిస్థితులే ఈనాడు నెలకొనివున్నాయి. దేశ సౌభాగ్యం కోసం మనం కూడా అలనాటి విద్యారణ్యులవలె ఈ మహాలక్ష్మి సాధనా పరంపరలను అఖండంగా నిర్వహిస్తూ రాష్ట్ర క్షేమానికి, దేశాభివృద్ధికి కృషిచేద్దాం అని చెప్పి యజ్ఞమును ప్రారంభించారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు 1008 కుండీలలో గాయత్రీ మహాయజ్ఞముతో పాటుగా శ్రీమహాలక్ష్మి సాధనా మహాపూర్ణాహుతిని కూడా ఎంతో వైభవంగా చేయించారు. ఈ మహాయజ్ఞంలో ఎవరు తమకు ఏ రకమైన కోరిక తీరాలనుకుంటారో వారు ఆ సంకల్పాన్ని చెప్పుకొని ప్రత్యేక మంత్రాలతో

ఆహుతులను సమర్పించడం జరిగింది. ఇది ఈ యజ్ఞంలో జరిగిన ఒక విశిష్ట ప్రయోగం. **పూర్ణాహుతి సమయంలో ఎవరి కోరికను వారు మూడుసార్లు చెప్పుకుని కొబ్బరికురిడీని హృదయానికి దగ్గరగా ఉంచుకొని కళ్ళుమూసుకోమని చెప్పి, మాస్టర్‌గారు ఈ మహామంత్రాన్ని తాము చెప్తూ, శ్రద్ధగా మూడు సార్లు అందరితో పలికించారు.**

**ఓం యం యం చిన్తయతే కామం తం తం ప్రాప్నోతి నిశ్చితం ।**
**పరమైశ్వర్యమతులం ప్రాప్స్యతే భూతలే పుమాన్ ఓం ॥**

**అంటూ హోమంలో కొబ్బరికురిడీనీ వేయించారు.** సృష్టిలో ఎవరి కోరిక వారిదే. ఎవరి కోరికనైనా తీర్చగల ఈ మహామంత్రంతో అందరి కోరికలూ తీరాలి, సమస్యలు నివారించబడాలనే ఆకాంక్షతో అందరిచేతా ఈ విధివిధానాన్ని చేయించారు. పూర్ణాహుతి అయిపోయాక భక్తులందరూ 1008 కుండీల ఆ యజ్ఞశాలకు ఎవరిశక్తి కొలదీ వారు ప్రదక్షిణలు చేశాకనే భోజనశాలకు వెళ్ళి యజ్ఞప్రసాదాన్ని స్వీకరించి ధన్యులయ్యారు. ఆనాడు 30వేల మంది భక్తులతో యజ్ఞశాల కళకళలాడిపోయింది. భోజన వ్యవస్థను ఎంతో పద్ధతిగా ఏర్పాటు చేసిన కార్యకర్తలను మాస్టర్‌గారు అభినందించి వారికి పురస్కారంగా మూడువేల రూపాయలు స్వయంగా తమ చేతులతో వారికిచ్చారు. అలనాడు త్రికరణ శుద్ధిగా ఈ కార్యక్రమం కోసం కృషి చేసిన వారు ఈనాడు ఆర్థికంగా ఎంతో ఉన్నత స్థితిలో ఉన్నారు. నాటు–కోసుకో అనే సిద్ధాంతం ప్రత్యక్షంగా చూశారందరూ!

అప్పటికి 6, 7 సంవత్సరాల నుంచి వర్షాలు లేక దేశంలో ప్రజలు నీటి కరువుతో త్రాగునీరు, సాగునీరు లేక పల్లెల్లో పంటలు లేక, పశుగ్రాసం లేక ఎంతో సతమతమౌతున్న తరుణంలో జరిగిన ఈ యజ్ఞప్రభావం యొక్క ఫలితమా అన్నట్లు నీటి కొరత తీరడమే కాక "డ్యామ్"ల నిండా నీరు తొణికిసలాడసాగింది. నిజంగా ఆ మహాలక్ష్మీదేవి, ఆ తల్లి దయవలన అందరికి అన్ని రకాల శుభాలే జరిగాయి. లెక్కలేనన్ని సమస్యలు తీరాయి. యజ్ఞశాల నిర్మాణం మొదలు పెట్టిన దగ్గర నుంచి జరిగిన చమత్కారాలు అన్నీ ఇన్నీ కాదు. వ్రాయాలంటే అదొక గ్రంథమౌతుంది. ఈ యజ్ఞ నిర్వహణ కొరకు కేవలం ప్రకాశం జిల్లా వారు మాత్రమే కాదు వైజాగ్, హైదరాబాద్ నుంచి అనంతపురం దాకా ఉన్న పరివార్ సభ్యులందరూ వచ్చారు. వారిచ్చిన సమయ, అంశదానాల గురించి ఎంత చెప్పినా తక్కువే.

నిజంగా ఆ గ్రామవాసులు శ్రీమతి విమల, శ్రీమతి సుబ్బరావమ్మ, శ్రీసుబ్బయ్య, శ్రీ కోటి లింగయ్య దంపతుల సత్సంకల్ప బలంతో, గ్రామస్తుల సహాయసహకారాలతో ఎలాంటి అవరోధాలు లేకుండా పూజ్యశ్రీ మాస్టర్‌గారి దివ్యశక్తి ఆ మహత్తర కార్యక్రమాన్ని చేయించింది.

ఇక్కడ ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. నాలుగుప్పలపాడులో ఈ యజ్ఞ కార్యక్రమం శ్రీ సుబ్బయ్యగారి పొలంలో ఏర్పాటు చేసాము కదా, శ్రీ సుబ్బయ్యగారి తండ్రి, తల్లి కూడా ఆ పొలంలో కట్టుకున్న వారింట్లోనే ఉంటుంటారు. యజ్ఞం ఇంక రెండు రోజులుందనగా వారి తండ్రిగారు పరమపదించారు. సరే పురోహితులవారి ఆధ్వర్యంలో మిగిలిన కర్మకాండలన్నీ జరిగిపోతున్నాయి. చనిపోయిన ఆయన శరీరాన్ని దహనం చేసిన రోజు మధ్యాహ్నం మాస్టర్‌గారు విడిది ఇంటికి వచ్చి ఆనందంతో డ్యాన్సు చేశారనలేం కాని అంతపని చేస్తున్నారు. ప్రక్కనే ఉన్న సీతామహాలక్ష్మి, సీత వాళ్ళు "ఏమిటి మాస్టారూ! అంత ఆనందంగా ఉన్నారు" అంటే ఈ చనిపోయిన ఆయన ఆత్మను విజయవంతంగా ఇంకో శరీరంలోకి ప్రవేశపెట్టాను. ఈ ఆవరణలో శరీరం వదిలి పెట్టిన ఆయన ఆత్మ సామాన్యమైంది కాదు. ఈ నూతన శరీరంతో ఆయన చాలా పనులు చేస్తాడు. అక్కడ పరిస్థితి అంతా ప్రశాంతంగా ఉంది అంటూ ఎవరూ ఊహించలేని పరమరహస్యాన్ని వివరించారు. ఇది ఎంతటి విచిత్రమైన సంఘటనో మాటలతో చెప్పలేం గదా!

మధ్యాహ్నం భోజనాలయ్యాక శ్రీశ్రీ మాస్టర్‌గారు మరల యజ్ఞశాలలో అందరినీ సమావేశ పరచమన్నారు. యజ్ఞ సమయంలో చెప్పిన విషయాలతో పాటు భవిష్య ప్రణాళికను దాదాపు రెండు గంటల సేపు వివరించి, ప్రత్యేకించి ఇంకా ఇలా చెప్పారు. నేను ఒక సంవత్సరం పాటు అవిశ్రాంతంగా పనిచేస్తాను, 2005 జన్మాష్టమి నుంచి 2006 జన్మాష్టమి వరకు చేయవలసిన పనులు దశలవారీగా చెప్తాను. ప్రతినెలా ఎక్కడో ఒకచోట పది రోజుల పాటు తరగతులు నిర్వహిస్తాను. ఈ క్లాసులలో శాశ్వత సత్యాలు చెప్పబడతాయి. వాటిని మీరు విశ్వసించండి.

పరమగురువులు ఎవ్వరూ ఈ భూమిని వదలివెళ్ళలేదు. కేవలం శరీరాలను వదిలారే తప్ప పృధ్వీగ్రహాన్ని విడిచిపెట్టి వెళ్ళలేదు. ఈ యుగసంధికాలాన్ని గురించి జ్వాలాకూల్‌మహర్షి, పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్య చాలా స్పష్టంగా చెప్పారు. భౌతిక శరీరధారులు మాత్రమే ఈ యుగసంధికాలాన్ని గుర్తించగలరు. ఒక సంవత్సరం పాటు నాతో వచ్చేయండి.

గురుప్రణాళికలను అమలుచెయ్యాలంటే నాతో పాటు వచ్చి నియమానుసారంగా జీవించగలిగితే ఈ సంవత్సరంలో నేను చెప్పేది మీకు బోధపడుతుంది. కాబట్టి మొదటి సాధనా క్యాంప్ ఎవరు పెడతారో, ఆలోచించుకొని చెప్పండన్నారు.

సెప్టెంబర్ 9వ తేది నుంచి 18వ తేది వరకు కందులూరులో "సమాధియోగము" అనే విషయం మీద క్లాసులు పెట్టటానికి సుమ, పటేల్ వాళ్ళు ముందుకు వచ్చారు. తర్వాత నెలలో శ్రీమహాలక్ష్మీసాధన, సహస్రకుండీయజ్ఞంతో పాటు సాధనాశిబిరం కూడా ఏర్పాటు చేస్తామని వైజాగ్ పరివార్ శ్రీ జి.సాయికిషోర్, సౌజన్య వాళ్ళు ముందుకు వచ్చారు. సమయానుసారం ఆ కార్యక్రమాలు యధావిధిగా చేయడం జరిగింది. అలా సెప్టెంబర్ నెలలో 1వ తేదీన వచ్చిన గురు పుష్యయోగమునాడు జరిగిన శ్రీమహాలక్ష్మీ యజ్ఞపూర్ణాహుతి ఒక మరుపురాని మధురఘట్టంగా అందరి హృదయాలలో శాశ్వతంగా నిలచిపోవడమే కాక శ్రీశ్రీ మాస్టర్‌గారి భవిష్య ప్రణాళికలకు ప్రధానవేదిక అయింది.

# అధ్యాయం-10

# యుగపరివర్తన - సాధనలు

## సమాధియోగ సాధన

పూజ్యశ్రీ మాస్టర్‌గారి శారీరక పరిస్థితి దృష్ట్యా ఎవరు, ఏ సాధనా శిబిరాన్ని నిర్వహించాలనుకున్నా దానిని మాస్టర్‌గారుండే శ్వేతద్వీపంలోనే ఏర్పాటు చేస్తే తనకు సౌకర్యంగా వుంటుందని ముందుగానే చెప్పారు. ఆ కారణంగా సుమా, పటేల్ వాళ్ళు తాము చేయదల్చుకున్న సాధనా శిబిరాన్ని ఒంగోలుకు అతి దగ్గరలో ఉన్న కందులూరు గ్రామంలో గల ఒక ఆశ్రమంలో ఏర్పాటు చేశారు. 'సమాధి యోగము' అనే పేరుతో జరిపిన ఈ సాధనా క్యాంప్‌కు అన్ని ప్రాంతాల నుండి ఎంతో ఉత్సాహంతో పరివార్ సభ్యులు వచ్చారు. ఆశ్రమ ప్రాంగణంలో సకల వనరులున్న కారణంగా సాధనకు ఎంతో అనుకూలంగా వున్న ఆ ఆశ్రమ ప్రాంగణంలోనే సెప్టెంబర్ 9 నుండి 18వ తేది వరకు ఈ శిబిరం నిర్వహించి, ఆ తరగతులకు హాజరైన వారికి సర్టిఫికేట్లను మాస్టర్‌గారు ఇచ్చారు.

2005 కృష్ణాష్టమి నుంచి 2006 కృష్ణాష్టమి వరకు గురుప్రణాళికను ప్రపంచానికందించాలనే వారి తపన మాటలతో వర్ణించగలిగేది కాదు. ఈనాటి విద్యావిధానం పూర్తిగా మనస్సుకు సంబంధించిందే గానీ వ్యక్తిత్వ నిర్మాణం చేసేవిగా లేదు. వ్యక్తిత్వ నిర్మాణానికి సంబంధించిన విద్య ఈనాడు ఎక్కడా లేదు. ఈనాడు అబ్రహం లింకన్, గాంధి, తిలక్ మహాశయుల వంటి వ్యక్తిత్వాలు కావాలి. అలాంటి వాళ్ళను తయారుచేయాలనే సంకల్పంతోనే రకరకాలుగా అలాంటి సంస్కారాల నిచ్చే విద్యను అందించటానికి ప్రయత్నించేవారు. అందులో భాగంగానే ఈ 'సమాధియోగ' శిక్షణా శిబిరంలో ప్రథమ ప్రసంగంలో కొన్ని ప్రధానమైన సూచనలను చేశారు.

**"ఈనాడు 'వ్యక్తిత్వ నిర్మాణము'ను నేర్పించడం కన్నా దానిని ఆచరించే సాధకులు కావాలి. ఎప్పుడూ ఇతరుల వలన నేనిదిచేశాననవద్దు, మంచైనా, చెడైనా ఇది 'నేనే' చేశాను అనండి. బాధ్యత స్వీకరించే వాడే మహాత్ముడౌతాడు.** ఈనాటి మానవజాతికి మనస్సుందేకాని, నిర్ణయించే బుద్ధి లేదు, సంస్కారాలు లేవు. ఆత్మపరిశుద్ధమైనది. దానికి పాపపుణ్యాలు లేవు. I am proud నేను ఋషి సంతతికి చెందిన వాడిని అని (feel) అనుభూతి చెందండి.

**ఆధ్యాత్మిక విద్య అంటే బాధ్యతలను స్వీకరించే విద్య. 'నేను ప్రయత్నం చేశాను కానీ జరగలేదు' అని గురువులు ఎప్పుడూ అనరు. యోగవిద్య యొక్క ప్రధానలక్షణం బాధ్యతలను స్వీకరించుట. ఆధ్యాత్మిక విద్యలో ఎవ్వరూ ఇది నీవు చెయ్యి అని చెప్పరు. మీరు ఇష్టపడి చెయ్యండి తప్ప ఎవరో చెప్తే చేస్తామని అనకండి. స్వాతంత్ర్యం కోసం వాళ్ళంతట వాళ్ళు బాధ్యతను స్వీకరించి ప్రాణాలిచ్చి పనిచేశారు మన సమరయోధులు. ఈనాడు అలాంటి వ్యక్తిత్వాలు కావాలని గురువులు ఆశిస్తున్నారు. యుగసంధి మధ్యకాలం వరకు పరమ గురువులు అందరికీ చెప్పారు. ఇక చెప్పరు. కేవలం బాధ్యత స్వీకరించేవారికి, యోగవిద్యే నా లక్ష్యం అన్న తపన ఉన్నవారికి మాత్రమే నేను ఈ క్లాసులు చెప్తాను.**

**యోగవిద్య మీద ప్రేమ ఉన్నది అనే వాళ్ళు మాత్రమే ఈ విద్యను పట్టుకోగలుగుతారు. దానికి మీరు చేయాల్సింది గాయత్రీ-లలితా-భాగవత విశ్వఏకీకరణ యజ్ఞం. నాతో సంబంధం కావాలనుకునేవారు ఈ యజ్ఞాన్ని ప్రచారం చెయ్యండి. ప్రతి వారం ఈ యజ్ఞం చేసుకోవాలి. ఇందులో వ్యక్తిగత కోరికలు తీరడంతో పాటు గురువుల ప్రణాళికలో భాగస్వామ్యాన్ని పొందుతూ విశ్వఏకీకరణకు కావలసిన బీజాలు పడిపోవటం జరుగుతుంది. ఈ యజ్ఞాన్ని ప్రచారం చెయ్యండి.**

**కోరికలు తప్పక తీరతాయి. గురువుల దగ్గర ప్రతి మాట జాగ్రత్తగా వాడాలి. మళ్ళీ మళ్ళీ చెప్తున్నాను. బాధ్యతను స్వీకరించటమే యోగవిద్య.**

నేను ప్రపంచాన్ని మార్చే ప్రక్రియలో బాధ్యత వహిస్తాను. నేను నా బాధ్యతను నిర్వర్తించటానికి శాయశక్తులా కృషి చేస్తానని ప్రమాణం చేస్తున్నాననే వాడికే ఈ క్లాసులు ఉపయోగపడతాయి. గురువులందరూ సమిష్టిగా బాధ్యత వహిస్తారు. నీవు ఏ గురువు దగ్గరికెళ్ళినా నీ బాధ్యతను వాళ్ళు స్వీకరిస్తారు. గురుచరిత్రలు చదవండి అర్థమౌతుంది.

1) యోగవిద్య అంటే బాధ్యతలను స్వీకరించుట.

2) యోగవిద్య అంటే శిక్షణ (ట్రెనింగ్) పొందుట.

3) గురువు దగ్గరికెళ్ళినా నీ కోరిక తీరలేదంటే అది కేవలం నీదే బాధ్యత. తప్పు నీలోనే ఉంది.

4) యోగవిద్యకు ఆదర్శం సూర్యభగవానుడు. యోగవిద్య మొత్తం సూర్యవిజ్ఞానాన్ని అవగాహన చేసుకుంటే అర్థమౌతుంది. సూర్యవంశం రాజులు ఈ విద్య యందు నిష్ణాతులు. యోగవిద్యకు ఆధారం యజ్ఞము. యజ్ఞము వలన మూడు రకాల లాభాలున్నాయి.

   1) ఆహారానికి లోటు ఉండదు.

   2) కర్మను అధిగమించవచ్చును. ఏ కర్మల వల్ల బాధ వస్తున్నదో ఆ కర్మను యజ్ఞము తొలగిస్తుంది. విశ్వఏకీకరణ యజ్ఞము దీనికి బాగా ఉపయోగపడుతుంది.

   3) గురు ప్రణాళికలో భాగస్వామ్యాన్ని పొందవచ్చు. పరిణామక్రమంలో ముందుకు పోగలగడం దీనిలోని ప్రధాన లక్షణం.

ఇది యుగసంధికాలం. దీని ప్రభావం 1750 నుంచి 2250 సంవత్సరం వరకు ఉంటుంది. చెప్పాలంటే ఇంకా 235 సంవత్సరాలు యుగసంధిగా గుర్తించి పనిచెయ్యాలి. మొత్తం మానవజాతి యుగసంధి కాలంలోనే ఉన్నది. మీరు మళ్ళీ మానవజన్మ తీసుకుంటారా, లేదా అనేది తెలియదు. తెలివైన వాళ్ళు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తక్షణమే పనికి దిగటం వలన స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ఆనాటి వారి కుటుంబాలు ఈనాటికీ గౌరవ, మర్యాదాలు పొందుతున్నట్లే మీరు, మీ భావితరాలకు బీజాలు వేసుకుంటున్నారు. కోట్ల తరాల వారికి అద్భుత వరాలనిచ్చే

వారెవరున్నారు? ఇటువంటి అవకాశం ఇంక రాదు. తర్వాత జన్మలో పని ఇంకా కష్టంగా ఉంటుంది. పని ఎప్పుడూ కష్టంగానే ఉంటుంది. ఈ జన్మ తరువాతి జన్మను ఎంచుకోవాలంటే ముఖ్యంగా మీరు మూడు విషయాలు నేర్చుకోవాలి.

1. **వేదమాత (వందే వేదమాతరం):** అంటే వేదవిజ్ఞానం అర్థం కావాలి. అంటే రోజూ వేదాలను చదవాలని కాదు. అవసరమైనదేమిటంటే **ఈ పని చెయ్యాలి అనే ఆవేదన, తపన కావాలి. దానినే వందే వేదమాతరం అంటాం.** భూమిలో ఇరుక్కుపోయిన ఈ వేదజ్ఞానాన్ని బయటకు తీయాలంటే దానికి గాయత్రీమంత్రం మీరు చేస్తూ అందరితో చేయించాలి. 1 సంవత్సరం పాటు అలా చేసేవారికి గురువు అనుగ్రహం కలుగుతుంది. ఈ యుగసంధికాలం కేవలం 50 సంవత్సరాలు మాత్రమే ఉంది. 2011 సెప్టెంబర్ 11 వరకు ఉన్న ఈ కాలం చాలా శక్తివంతమైన కాలం (అంటే గురుదేవుల జన్మశతాబ్ది). బీజాలు నాటడానికి సమయం కూడా చాలా తక్కువగానే ఉంది.

2. **దేవమాత (వందే దేవమాతరం):** దేవతా విజ్ఞానం మనకు తెలియదు. దేవతా శక్తులను ఉపయోగించుకునే భాగ్యం రావాలి. నియమాలు తెలిస్తే దేవతా సాక్షాత్కారం చాలా సులభం. శ్రీరామకృష్ణ పరమహంస దానిని చేసి చూపించారు. అలా దేవతా శక్తులను ఉపయోగించుకోవటం నేర్చుకోండి.

3. **విశ్వమాత (వందే విశ్వమాతరం):** ఈనాడు న్యూస్‌పేపర్, కంప్యూటర్ ద్వారా ప్రపంచంలో ఎక్కడేం జరుగుతున్నదో తెలిసిపోతున్నది. దేశవిదేశాలలో మనవాళ్ళు ఉన్నారు. విశ్వమానవులుగా మారే సమయం వచ్చేసింది. ఒక్క సంవత్సరం పాటు మీ కోరికలను ప్రక్కన పెట్టండి. గురువుల ప్రణాళికను ఒక విప్లవంలాగా ప్రచారం చేద్దాం. మనము ఈ క్షణం నుంచి ఇప్పటి నుంచే "విశ్వ ప్రభుత్వం" గురించిన విషయాలు మాట్లాడుకోవాలి."

విశ్వప్రభుత్వ వ్యవస్థ ఎలా ఉండాలి? ఎలా పని చెయ్యాలి? బాధ్యతను స్వయంగా స్వీకరించడమెలా, దానికి సంబంధించిన రూల్స్, రెగ్యులేషన్స్ వాటిపై అవగాహన ఇదంతా తర్వాత క్లాసుల్లో విపులంగా చెప్పారు. తొమ్మిదిరోజులపాటు సమాధియోగా మీద జరిగిన శిక్షణా తరగతులలో పాల్గొని, మాస్టర్‌గారిచ్చిన సాధనలు చేసినవారికి సర్టిఫికేట్లు మాస్టర్‌గారే స్వయంగా అందచేశారు.

ఈ సాధన శిబిరంలో ఒక రోజున "విశ్వప్రభుత్వం" రాబోతున్నది. అది పరమగురువుల ప్రణాళిక. ఈ విషయం ప్రపంచానికి తప్పక తెలియచేయాలనే లక్ష్యంతో రోడ్ షో చేయటం జరిగింది. ప్లేకార్డులు, పాంప్లెట్లు వేయించారు. కార్లు, బండ్లు తీసుకొని కొందరూ, కాలినడకతో కొందరూ పెద్ద ఊరేగింపుగా మైకులో 'విశ్వప్రభుత్వం' యొక్క వ్యవస్థను గురించి చెప్పుకుంటూ ఒంగోలు పట్టణ పురవీధులలో ఈ రోడ్ షో ఎంతో అట్టహాసంగా జరిపించారు. ప్రజలలో ఈ ఊరేగింపు ఏమిటి? ఎందుకింతమంది ఇలా నినాదాలు చేస్తూ ప్రదర్శనలిస్తున్నారనే ఉత్కంఠ కలిగింది. ఇంతకు ముందెన్నడూ ఇలాంటి రోడ్‌షోలు జరగలేదు. ఇక్కడ విషయమూ క్రొత్తదిగానే ఉన్నది. అందుచేత అందరికీ ఇదేమిటో తెలుసుకోవాలనే ఆరాటం బయలుదేరింది. అక్కడక్కడే కొంత మంది కాలినడకన వెళుతున్న కార్యకర్తలను ఆపి దీనిని గురించి ప్రశ్నించి సమాధానం పొందారు.

అలా ఈ రోడ్ షో కార్యక్రమం ఒక్క ఒంగోల్లో మాత్రమే చేసి ఆపించలేదు. ఒక్కొక్క ఊళ్ళో ఒక్కొక్క నెల చొప్పున ఈ కార్యక్రమం చాలా ఉధృతంగా సాగింది. దీని లక్ష్యం ఏమిటంటే పరమ గురువులందరూ నిరంతరం భారతదేశం వైపు చూస్తున్నారు. **ఈ రోడ్‌షోలో ప్రజలకు పరమగురువుల గురించి, వారి ప్రణాళికల గురించి, ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న అనేక ఉదాత్తమైన మార్పులన్నీ ఎవరి ప్రేరణతో జరుగుతున్నాయో అంతా వివరంగా చెప్పాలనే ఉద్దేశ్యంతోనే రోడ్‌షో కార్యక్రమాల శృంఖల** జరిగింది. మాస్టర్‌గారి ప్రణాళికలను ఎంతని చెప్పగలం. ఎన్నని వ్రాయగలం. దేని కోసం చేస్తున్నారో కూడా కొంతలో కొంత, కొందరికైనా అర్థమై దానిని కొనసాగించే ప్రయత్నం చేస్తే మాస్టర్‌గారి కృషి ఫలించినట్లే. అఖండ గురుసత్తా విశ్వవ్యాప్తం చెయ్యటానికై ఒక లక్ష ఫొలోలను కార్యకర్తల ద్వారా గ్రామ గ్రామాలలో పంచే ఏర్పాటు చేసారు.

## గురుస్థానాలనెందుకు పెట్టుకోవాలి?

ప్రపంచాన్ని ఎలా మార్చాలి అనే దానికి అద్భుతమైన రూపకల్పనను పండిత శ్రీరామశర్మ ఆచార్య చెప్పారు. వారి జీవిత విధానంలో గాయత్రి కామధేనువుగా, కల్పవృక్షంగా, పారసమణిగా అనేక మహిమలను చూపించింది. అందరి జీవితాలలో అలాంటి మార్పు రావాలి. దానికి సామూహిక మంత్రజపం అద్భుతంగా పని చేస్తుందని మాస్టర్‌గారు ప్రతి ప్రవచనంలోనూ చెప్తుండేవారు. పూజ్యగురుదేవులు సూక్ష్మీకరణ సాధన చేసి పంచవీరభద్రులను తయారుచేశారు. వారినెందుకు తయారుచేశారు, అసలు వాళ్ళ పనేమిటి? దానిని ఎలా ఉపయోగించుకోవాలి అనేది మనం

నేర్చుకోవాలి. ఇంకా గురుదేవుల తపశ్శక్తిని ఉపయోగించుకోవాలి అంటే మనం ఆ పంచ వీరభద్రులను మన ఇళ్ళకి ఆహ్వానించాలని చెబుతూ దానికొక అద్భుతమైన సాధననిచ్చారు.

ప్రతి ఇంటిలోనూ మనవాళ్ళందరూ పంచవీరభద్రుల అనుగ్రహం పొందటానికి 12 ఇటుకలతో యజ్ఞకుండం అమర్చి, దానిని పసుపు, కుంకుమలతో అలంకరించి దాని మీద 5 దీపాలు పెట్టి గాయత్రీ మంత్రం ఒకమాల, శ్రీమహాలక్ష్మీ మంత్రం ఒక మాల చెయ్యాలనీ, ప్రతి రోజూ ఇలా చేసినవారికి పంచవీరభద్రుల అనుగ్రహం కలిగి వారి అండదండలు లభిస్తాయనేటు వంటి ఒక అద్భుతమైన విషయాన్ని చెప్పారు. మాస్టర్‌గారు ఆ విషయం చెప్పిన నాటి నుండి కార్యకర్తలందరూ తమతమ ఇళ్ళల్లో గురుస్థానాలు పెట్టుకొని తాము సాధన చేస్తూ తమ స్నేహితుల ఇళ్ళల్లో, బంధువుల ఇళ్ళల్లో కూడా ఈ గురుస్థానాలను పెట్టించి మంత్రజపాలు చేయించసాగారు. అలా మాస్టర్‌గారు చెప్పిన ప్రతి సాధన, అది చిన్నదిగానీ, పెద్దదిగానీ జనసామాన్యంలోకి వెళ్ళి బహుళప్రచారాన్ని పొందేది.

## యుగపరివర్తన జరుగుతున్నది

యుగసంధికాలం మీనరాశి నుంచి కుంభరాశికి వస్తున్నది. ఒక ప్రభంజనం లాంటి యుగ పరివర్తన రాబోతుంది. తద్వారా విశ్వసంస్కృతి ఆవిర్భవించబోతున్నది. మానవుడు విశ్వమానవుడుగా మారడం, అందరూ ఒకే రకమైన వస్త్రధారణ చెయ్యడం, ఒకే రకమైన విద్యనభ్యసించటంతో పాటు విశాలమైన ప్రేమరాహిత్యం, ధనదాహం ఎల్లలులేని స్వార్థ సంకుచితత్వాలు, సువిశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించబోతున్నాయి. కానీ గురువుల ఆకాంక్ష దీనికి భిన్నంగా వున్నది. ఒకే విశ్వసంస్కృతి, ఒకే సభ్యత, సంస్కృతితో ప్రపంచం పరిఢవిల్లాలనేది పరమగురువుల ఆకాంక్ష. అయితే మీనరాశి లక్షణాలు ఎలా ఉంటాయి? కుంభరాశి లక్షణాలు ఎలా ఉంటాయి?

మీనరాశి లక్షణాలలో అతి ప్రధానమైనది అథారిటీ. పెద్దలు చెప్పింది చెప్పినట్లు చెయ్యడం, ఇదెందుకు అని ఎవ్వరూ ప్రశ్నించరు. కుంభరాశి లక్షణాలు, వ్యక్తిలో వివేకపూరితమైన ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఒక పని చేసే ముందు, ఇదెందుకు చెయ్యాలి, దీని వలన వచ్చే ప్రయోజనాలు ఎలా వుంటాయనే తర్కవితర్కాలు చాలా చేస్తారు. ఈ మార్పును అన్ని క్షేత్రాలలోను చూడడం జరుగుతుంది. పెద్దలు చెప్పారు కనుక చెయ్యాలనేదేమీ ఉండదు. వివేక పూర్ణమైంది కనుక ఇది చేస్తాను అనే యుగం వస్తోంది. అయితే పదిమందికి తెలియని గందరగోళాలలో మానవజాతి అతలాకుతలమై

పోతుంది. దీనిని తొలగించటానికే గురుసత్తా ప్రయత్నిస్తున్నది. వివేకపూర్ణమైన ఆలోచనలు ఎలా ఉండాలి అంటే వ్యక్తి స్వార్థం కంటే కుటుంబస్వార్థం, రాష్ట్రం బాగుండాలంటే ఒక్క ఊరు పోయినా ఫరవాలేదు. విశ్వం బాగుండాలంటే ఒక రాష్ట్రం పోయినా ఫరవాలేదనేది వివేకం. అందరిలోనూ ఇలాంటి విశాల దృష్టికోణం కలిగిన ఒక అద్భుతమైన మానసికస్థితి రావాలి.

ఈ రోజున దేశంలో మనిషి ఆలోచనలు స్వకేంద్రితమై నేను, నావాళ్ళు అనే ఆలోచనలు మాత్రమే వస్తున్నాయి. దేశస్థాయిలో ఇదే పరిస్థితి నెలకొనివున్నది. మీనరాశి నుండి కుంభరాశికి రావాలంటే మొట్టమొదట రావాల్సింది **విచార క్రాంతి – ఆలోచనలలో క్రాంతి రావాలి. జనమానస పరిష్కారం జరిగి తీరాలి.** దానినే పూజ్య గురుదేవులు 'మనఃస్థితి బదలే తో పరిస్థితియా బదలేగా – అంటే మనఃస్థితి మారితే పరిస్థితులు మారతాయి' అని చెప్పియున్నారు. ఇక్కడ స్వార్థపరత, నిష్ఠురత, సంకీర్ణత అనేది మనిషి ఆలోచనల నుండి పోవాలి. ఆలోచనలలో క్రాంతి రావాలి. అలాంటి మార్పుకు గుర్తుగా ముందుగా స్వకేంద్రిత ఆలోచనలు పోయి, విశ్వమానవుడికి ఉపయోగపడే ఆలోచనలు రావాలి.

స్వార్థం నుంచి పరమార్థం వైపుకు పయనించాలి. అదే ఈ యుగం యొక్క అసలైన ధర్మం. పదార్థ విజ్ఞానం ఆ దిశలో పూర్తి జాగృతిని సాధించింది. రష్యన్ అయిన మాండలీన్, బ్రిటీష్ వైజ్ఞానికుడు న్యూటన్, అమెరికన్ శాస్త్రవేత్త ఎడిసన్, మేడంక్యూరీ, ఐన్‌స్టీన్, హైజన్‌బర్గ్, సర్ సి.వి.రామన్, సర్ జగదీశ్ చంద్రబోస్ వీరి ఆలోచనలతో వచ్చిన క్రాంతి సువిశాల ప్రపంచానికి ఉపయోగపడింది. పదార్థ విజ్ఞానానికి సంబంధించిన వారి ఆలోచనా విధానం సమస్త విశ్వానికి సుఖ, సౌకర్యాలను ప్రసాదించింది. **ఒక పదార్థ విజ్ఞానమే ప్రపంచానికంతటి మార్పు తెచ్చినప్పుడు ఒక గీత, ఖురాన్, బైబిల్ లాంటి గ్రంథాలలో ఉన్న జ్ఞానాన్ని ప్రపంచానికిస్తే ప్రపంచం ఏ స్థాయికి ఎదుగుతుంది? అప్పుడు మతాలలో వున్న భిన్నత్వములన్నీ పోయి శరీరాలు దైవమందిరాలుగా మార్పు చెందుతాయి. ఒకే ధర్మం వస్తుంది. శరీరాలే దైవమందిరాలనే ధర్మం వస్తుంది.**

ఈనాటి మానవజాతి అమెరికాకి పరుగెత్తుతోంది. అక్కడ పెట్రోల్ బంక్‌లో పనిచేసినా ఎక్కువ ధనం వస్తోంది. ధనము అంటే అర్థమేమిటి? నీవు ఖర్చుపెట్టిన శక్తికి తగిన ఘనీభవించిన రూపము. దానిని నీవు రూపాయి రూపంలో పొందడం జరుగుతున్నది. అందువల్ల ఒకే విశ్వం, ఒకే ధర్మం, ఒకే భాష, ఒకే కరెన్సీ. **అలానే ప్రకృతిలోని ప్రాణులన్నీ సూర్య ఊర్జాను ఉపయోగించుకొని**

**ఎలాంటి శక్తిని సముపార్జన చేస్తున్నాయో, అలానే మనిషి కూడా సూర్యకిరణ ఊర్జను, సూర్యకిరణ శక్తిని ఉపయోగించుకోవాలి. ఇదంతా జరగాలంటే మనిషి మనస్సు శాంతంగా ఉండాలి. అలా ఉ న్నప్పుడు మాత్రమే ప్రకృతి చెప్తున్న సందేశాన్ని మనస్సు పట్టుకోగల్గుతుంది. దానికి కావల్సింది మౌనం, దాంట్లో నుంచి ప్రేమ, ప్రజ్ఞ ఆవిర్భవిస్తాయి. ఇదంతా కుంభరాశి అవతరణ లక్షణాలు. మనకు ఇష్టమున్నా, లేకపోయినా ఇవన్నీ జరిగి తీరతాయి.** మన తెలివి ఏమిటంటే దీనికి అనుగుణంగా జీవించటం, ఆలోచనలతో క్రాంతిని తెచ్చుకోవటం. ఇదంతా పరమగురువుల ఆకాంక్ష, పరమగురువుల ప్రేరణే మాస్టర్‌గారి వాణి ద్వారా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నది.

## ప్రకృతిలో వచ్చే మార్పులను ఎవ్వరూ ఆపలేరు

ఇప్పుడు వస్తున్న మార్పులు కొన్ని కోట్ల సంవత్సరముల వరకు మరి ఇంక రావు. అందుచేత సమయము యొక్క గొప్పదనాన్ని గుర్తించి అందరినీ గురుప్రణాళికలోకి లాగడానికి మాస్టర్‌గారు అనేక ప్రయత్నాలు చేశారు. విషయమేమిటంటే మానవజాతి నుండి “డివైన్ కింగ్‌డమ్”లోకి ఒక విశేషమైన ట్రాన్సిషన్ అంటే అద్భుతమైన మార్పు వస్తోంది. **ఎంతమందిని మానవజాతి నుంచి దైవత్వంలోకి తీసుకురాగలం అదీ ప్రశ్న.**

ప్రకృతి రెండురకాలైన ప్రయోగాత్మక కార్యక్రమాలను చేపట్టింది. మొదటిరకం గురుపరంపర ప్రమేయం లేకుండా స్వయంగా ఎదిగి దైవీజాతిలోకి వెళ్ళిపోగలిగేవారు. జిల్లెళ్ళమూడి అమ్మ, శ్రీరమణమహర్షి, శ్రీఅరవిందో స్థాయిలాంటి వారు ఒక రకం. ఇకపోతే రెండోరకం వారు గురుపరంపర సహాయం తీసుకొని ఎదిగేవారు. భారతదేశంలో చాలావరకు రెండో విధానంలోనే ఎదగడం చూస్తాం. అదే సుగమం. అందుచేత మార్పును ఎవ్వరూ ఆపలేరు. అయితే అందులో నీవు వుంటావా? ఉండవా? అనేది నీ నిర్ణయం.

అసలు ఆధ్యాత్మికత అంటే కోరికలు తీర్చుకునే ప్రక్రియ కానే కాదు. ఉన్నత ఆదర్శాలకు అనుగుణంగా జీవితాన్ని మలుచుకొనుట, నీవు జీవిస్తూ ఇతరులకు మార్గదర్శనం చేయుట. ఇలాంటి అవకాశం గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయడం ఎంతో అవసరం. ఈ విషయాలను ఒకానొక ప్రవచనంలో చెప్తూ ‘కాలము యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకొని మీ కుటుంబ పరిస్థితులను ప్రక్కన పెట్టి నాతో కలిసి పని చెయ్యండి-భారత దేశంలోని ప్రతి ఒక్కరికీ చెప్పండి’.

నా దగ్గరకొచ్చే వారి సమస్యలు అవే తీరతాయి. మీలో ఎవరికైనా బాధలుంటే చెప్పండి. ఎలాంటి ఈతిబాధలున్నా తీరిపోతాయి. బాధలను గురించి పట్టించుకోవద్దు. కొంతమందికి బాధ్యతనిస్తాను. **శ్రీరామకృష్ణ ఉన్నాడు ఎవరికే బాధవున్నా తీరుస్తాడు అనే నమ్మకంతో ఉత్తరం రాసినా చాలు అని చెపుతున్నాను. ఎడ్రస్ ఒంగోలు, గాయత్రీ అనుగ్రహ పీఠం ఇవ్వండిచాలు. తరువాత అంతా నేను చూసుకుంటాను.**

ఈ విషయాన్ని అందరికీ చెప్పకపోతే మీరు అవకాశాలు పోగొట్టుకున్నవారౌతారు. ఈ మాత్రమైనా చెయ్యలేని వాళ్ళు ఇంక నా దగ్గరికి రాకండి. ఈ పనిచేసినా చాలు మీరు గొప్ప వాళ్ళైతారు. ఈ పని చిన్నదేం కాదు, చాలా పెద్ద పనే. ఇది చేసినా చాలు, మీకు అనేక మందికి పరోక్షంగా సహాయం చేసిన పరమార్థం దక్కుతుందని చాలా తీవ్రంగానే చెప్పటం జరిగింది. ఈ ప్రవచనాలను విన్న సుమ, పటేల్ వాళ్ళు స్పందించి అక్షరాలా మాస్టర్ గారి మాటలను శిరసావహించి ఉద్యోగానికి సెలవుపెట్టి 2006 సంవత్సరం అంతా వారితో కూడా కలసి పనిచేశారు.

సమాధియోగా శిక్షణా తరగతులు అయిపోయాక శ్రీశ్రీ మాస్టర్‌గారు ఇలాంటి సాధనా క్యాంపులు వైజాగ్, హైదరాబాద్, అమలాపురం ఇంకా వీలైనన్ని ప్రాంతాలలో పెట్టాలని చెప్పారు. మాస్టర్‌గారు చెప్పిందే తడవుగా ముందు వైజాగ్‌లో ఈ క్యాంపు పెట్టటానికి శ్రీసాయికిషోర్, శ్రీమతి సౌజన్యవాళ్ళు ముందుకు వచ్చారు. అక్టోబర్ 8,9,10 తేదీలలో శిబిరానికి ఏర్పాటు చేస్తామని చెప్పారు. మాస్టర్‌గారు ఇంకా అందరికి ఒక (టార్గెట్) లక్ష్యాన్ని ఇచ్చారు. 2006 శ్రీకృష్ణాష్టమి నాటికి ఒక లక్ష విశ్వఏకీకరణ యజ్ఞాలు పూర్తి చెయ్యాలి. 12 వారాలు దీక్షగా ఈ విశ్వఏకీకరణ యజ్ఞాలు చేసిన తర్వాత 24 కుండాలలో పూర్ణాహుతీ యజ్ఞాలు చెయ్యండి.

ఏ బ్రేక్ రాకుండా 12 వారాలు చేసుకున్న వారి కోరికలు గ్యారంటీగా తీరిపోతాయి. మీరు చేసే ఆ యజ్ఞ పూర్ణాహుతి ఏమౌతుందో మీకు తెలియదు. చాలాచాలా లాభాలు వస్తాయి. ఈ యజ్ఞాలకు, చేతనత్వ విజ్ఞానానికి చాలా దగ్గర సంబంధమున్నది. యజ్ఞము వలన మనిషి చేతనత్వంలో మార్పు వస్తుంది. నిస్సందేహంగా మార్పు వస్తుంది. ఈ ప్రక్రియ విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువచ్చే బాధ్యత మీది. అందరితోను చెప్పడం నేర్చుకోండి. మీకు తెలియదు. ఇది ఎంత మహత్తరమైన కార్యాచరణ ప్రణాళికో! మనస్ఫూర్తిగా చేసినవారి జీవితాలు ధన్యమైపోతాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు!

## గ్రహణాలు - వాటి ప్రభావము

ఈ గ్రహాలు, గ్రహణాలు వాటి ప్రభావం గురించి 16-2-1980కు ముందు వచ్చిన సంపూర్ణ సూర్యగ్రహణము సందర్భంగా కలకత్తాలోని ప్రఖ్యాత 'బోటానికల్ గార్డెన్'లో వాయు మండలములో బాక్టీరియా మరియు ప్రాణాంతక క్రిములు అధిక సంఖ్యలో కనిపించాయి. సూర్యగ్రహణమునకు ముందు, ఆ తర్వాత విభిన్న జీవాణువుల మీద అధ్యయనం చేసిన తర్వాత తేలినదేమిటంటే సూర్యగ్రహణ సమయంలో వీటి సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరగటమే కాదు. ఇంతకు ముందు కన్నా వాటిలో చంపగలిగే సామర్థ్యం బాగా వృద్ధి చెందుతోంది. 'రీవా' యూనివర్సిటీ లోని "విక్రమ్ ఫిజిక్స్ సెక్టర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ బయాలజీ" సాగించిన వైజ్ఞానిక పరీక్షల ద్వారా వెల్లడైన ఫలితము ఈ విషయాన్ని ఇంకా బలపరచాయి. గ్రహణకాలంలో కుండలోని నీటి మీద మూతపెట్టకుండా ఉన్నచో విభిన్న రకాలైన విషాణువులు, జీవాణువులు నీటిలోకి చేరి నీటిని విషమయంగా మార్చివేస్తాయని శాస్త్రజ్ఞులు చెప్పారు.

మన భారతీయ ఋషులు ఈ సత్యాన్ని ఆనాడే ఎరుగుదురు. సూర్య-చంద్ర గ్రహణవేళ సంభవించే ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని వారు సూర్య లేదా చంద్రగ్రహణ వేళ్ళల్లో ఎట్టి ఆహారమును తినరాదని ఆంక్షలు విధించారు. ఆనాడు ఉపవాసముండాలనే సాంప్రదాయాన్ని స్థాపించారు. **గ్రహణకాలంలో అన్నపానాదులను తీసుకుంటే శరీరానికి చేటు వస్తుందని, అంతరిక్షము నుండి వచ్చే దుష్ప్రభావము నుండి తప్పించుకునేందుకు ఆ సమయంలో సామూహిక సాధన, ఉపాసన కార్యక్రమాలను చేపట్టేవారు.** ఆ సాంప్రదాయాన్ని ఈనాటికీ చాలా మంది ఆచరిస్తున్నారు.

## ఆరువేల సంవత్సరాల తర్వాత వచ్చిన అద్భుతం

ఆ రోజు ఉదయం శ్వేతద్వీపంలో అల్పాహారం, కాఫీలు జరుగుతున్నాయి. శ్రీసత్యనారాయణ మాస్టర్‌గారు ఆ రోజు న్యూస్‌పేపర్‌లో వచ్చిన ఒక విశేష సమాచారాన్ని పూజ్యశ్రీ మాస్టర్‌గారికి చదివి వినిపించారు. అది అక్టోబర్ నెల. ఆ సంవత్సరం అక్టోబరు నెలలో వచ్చిన మూడు మహత్వ పూర్ణమైన సంఘటనల గురించి ఆ పేపర్‌లో ఇలా వ్రాసి ఉంది.

2005 అక్టోబర్ నెల ఒక విశిష్టమైన కాలగణనను తీసుకువచ్చింది. ఈ నెల అంటే 03-10-2005వ తేదీన సూర్యగ్రహణం, 17-10-2005వ తేదీన చంద్రగ్రహణం,

23-10-2005వ తేదీన కుజగ్రహం భూమికి అతి దగ్గరగా వస్తున్నది. ఇలాంటి విశిష్టతను సంతరించుకున్న ఈ కాలము ఆరువేల సంవత్సరాలకొకసారి మాత్రమే వస్తుంది. రెండు గ్రహణాలు ఒకే నెలలో రావటం, దానికి తోడు దేవతలసేనాని అయిన కుజగ్రహం భూమికి దగ్గరగా రావటం వలన, ప్రకృతిలో, పరిసరాలలో మనుషులలో, మానసిక స్థితులలో ఎలాంటి మార్పులు వస్తాయనేది శాస్త్రజ్ఞులు అంచనా వేసి వాటి ఫలితాలను గురించి ఎంతో విశేషంగా వ్రాశారు. ఎంతో శ్రద్ధగా ఆ సమాచారాన్ని విన్నారు మాస్టర్‌గారు. ఇంక వారి మనస్సు ఈ విశేషమైన సమయాన్ని ప్రకృతికి, మానవులకు ఉపయోగపడే రీతిలో వినియోగించే ప్రయోగములను గురించి, రాబోయే విపత్తుల నివారణకు ఆ గ్రహాల శక్తిని అనుకూలంగా మార్చే ఆధ్యాత్మిక ప్రయోగాన్ని ఈ విశిష్టమైన కాలంలో చేసి సత్పరిణామాలను పొందటానికి గల తరుణోపాయాలను గురించి విశేషంగా ఆలోచించటం మొదలెట్టారు.

సూర్యగ్రహణం కానీ, చంద్రగ్రహణం కానీ వచ్చినప్పుడు నదీస్నానం లేదా సముద్రస్నానం చెయ్యడం అన్నది ఒక ఆచారముగా వస్తున్నది. ప్రవహిస్తున్న నీటిలో ప్రాణశక్తి మెండుగా ఉంటుందని వైజ్ఞానికులు విశ్వసిస్తారు. గ్రహణకాలములో వాయుమండలములోని విషాణువులు శరీరము మీద దాడిచేస్తాయి. నదీస్నానము చెయ్యడం వలన నీటిలో ఉండే ప్రాణశక్తి ఆ విష క్రిములను చంపివేస్తుంది. కొంతమంది అజ్ఞానులు దీనిని లెక్కచెయ్యకపోగా వృథా అని భావిస్తారు. అయితే ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు మాత్రం ఋషిగణము అందించిన ఆ సమగ్రప్రక్రియలన్నీ విశేష రీతిలో శరీరమును రక్షించేందుకు తగిన శక్తిగల మాధ్యమములని నొక్కి చెబుతున్నాయి. అందుచేత భౌతిక అధ్యయనము విశ్లేషణ - ఉపచారము కొరకు చెయ్యబడే ఆ ప్రయత్నములతో పాటు ఖగోళములోని గ్రహాల ప్రభావమును గూర్చిన జ్ఞానసముపార్జన, ఔపచారిక ఉపాయముల అన్వేషణ కూడా తప్పకుండా సాగాలి. జ్యోతిర్విజ్ఞానము ద్వారానే ఈ జ్ఞానమంతా బోధపడుతుంది అని వేరుగా చెప్పనవసరము లేదు కదా! మానవుడి ప్రకృతి, అతని స్వభావము రెండూ జ్యోతిర్విజ్ఞానముతో చాలా గాఢముగా ముడిపడి ఉన్నాయి. కనుక ఈ జ్ఞానముతోనే పిండాండ-బ్రహ్మాండము, వ్యష్టి-సమిష్టి, ఆత్మ-పరమాత్మల సంబంధమును సమ్మిళితముగా అధ్యయనం చేయడం జరుగుతుంది.

అద్భుతమైన ఆధ్యాత్మిక ఉపచారాలతో ఈ ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చే ప్రయత్నంలో ఒక విశేషమైన ప్రయోగాన్ని ఆ నవరాత్రులలో ప్రారంభించారు. ఇది ఒక అద్భుతమైన

సంధికాలం. చాలా చాలా గొప్ప సమయం ఇది. ఈ సంధికాలంలో చేసే పూజలు, అనుష్ఠానాలు, యజ్ఞాలు అద్భుతమైన ఫలితాలనిస్తాయి. దేవతాశక్తిని అస్త్రంగా ఉపయోగించుకునే వాడు బ్రహ్మర్షి. ఆ బ్రహ్మర్షి స్థాయి ప్రయోగాన్ని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ నవరాత్రులలో మారుమూల గ్రామాల వరకు తీసుకువెళ్ళి మాస్టర్‌గారు చేయించడం మనకిక్కడ కనిపిస్తుంది

**విశిష్ట ఉపచారములు:** పూజ్యగురుదేవుల ద్వారా 1958 అక్టోబరులో జరిగిన సహస్రకుండీ యజ్ఞము ఇలాంటి ప్రయోగమే. వాతావరణ విశేషజ్ఞులు 1957 జులై నుంచి 1958 డిసెంబరు వరకు "అంతర్ రాష్ట్రీయ శాంతసూర్య సంవత్సరంగా' (International year of quite sun) గా ఖగోళశాస్త్రజ్ఞులు ప్రకటించారు. ఈ రోజులలోనే పూజ్య గురుదేవులు ఆదేశానుసారం సాధకులు గాయత్రి యొక్క విశేష సాధనలు చేశారు. తర్వాత 1958 అక్టోబర్ నెలలో నాలుగు రోజుల యజ్ఞం చేసి శరత్ పూర్ణిమకు పూర్ణాహుతి చేశారు. ప్రజ్ఞాపురశ్చరణలో భాగంగా, సవితాధ్యానం, కల్పసాధనలు, మహాయజ్ఞాలు, అనుష్ఠానాలు దేశవ్యాప్తంగా చేయించారు గురుదేవులు.

ఈ ప్రయోగాలతో ప్రపంచంలో అద్భుతమైన సత్ఫలితాలు రావడాన్ని ప్రత్యక్షంగా చూడటం జరిగిందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. అలాంటి ప్రయోగాలనే ఈ కాలంలో మాస్టర్‌గారు చేయించి ప్రకృతి ధర్మాలను మానవ జాతికి అనుకూలంగా మార్చటానికి వివిధ ఆధ్యాత్మిక ప్రయోగాలను రూపొందించారు.

## విరాట్ కార్యక్రమాలకు బీజారోపణ

రాబోయే విపత్కర, సంకట పరిస్థితుల నుండి ప్రపంచాన్ని సంరక్షించటానికి సామూహిక సాధనలు, అనుష్ఠానాలు, సామూహిక పారాయణలు, సామూహిక యజ్ఞాలు, పూర్ణాహుతులను చేసే క్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గాయత్రీ అనుష్ఠాన పరంపరలు ప్రారంభమయ్యాయి. దాంతోపాటు శ్రీమహాలక్ష్మీ విశిష్టసాధనలను కలిపారు. శ్రీమహాలక్ష్మీ ఆలయాలను కట్టించాలి. మహాలక్ష్మీ ఆలయాల అవసరం గురించి ప్రతి ప్రవచనములోను విస్తారంగా వివరించేవారు. 35×21 కొలతలు గల 108 మహాలక్ష్మీ ఆలయాలను వచ్చే శ్రీకృష్ణాష్టమి లోపల ఏర్పాటు చెయ్యాలి. అందులో ప్రతి అమావాస్యకు 5 రోజులు సాధన జరగాలి. ఈనాడు వనరులన్నీ రాక్షసుల చేతిలో ఉన్నాయి. స్వార్థం వున్నవాడు రాక్షసుడే. ఆ మహాలక్ష్మీని స్వార్థపరుల చేతిలో నుంచి తీసి మహామానవులకు అందించాలి. దాని కొరకు ఈ మహాలక్ష్మీ సాధనలనిచ్చానని అనేక

సార్లు చెప్పారు. నెలకు రెండు సాధనా శిబిరాలను పెట్టించాలని, 9 రోజుల పాటు సాధనలు చేయించాలని, దానికి తగిన ప్రణాళికను తయారుచేయమని చెప్పారు.

ఆ నవరాత్రులలో నాగులుప్పలపాడులో సహస్రకుండీయ శ్రీమహాలక్ష్మీ యజ్ఞం జరిగిన చోట మహాలక్ష్మీ ఆలయానికి శ్రీకారం చేయడం జరిగింది. అక్టోబరు 5వ తేది సాయంత్రం వెంకట్రాజుపాలెంలో 'శ్రీమహాలక్ష్మీ' ఆలయానికి శంఖుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశామని, 4వ తేదీన కలశాన్ని స్థాపించి నవరాత్రి సాధనను ప్రారంభించామని శ్రీమతి కోటేశ్వరమ్మ గారు మాస్టర్‌గారికి చెప్పారు. అది విన్న మాస్టర్‌గారు ఈనెల 3వ తేది సూర్యగ్రహణం, 17వ తేది చంద్ర గ్రహణం ఈ రెంటి మధ్య వచ్చిన ఈ 15 రోజులు చాలా ముఖ్యమైనవి. ఈ అదృష్టం ప్రపంచంలో ఇంకెవ్వరికీ దొరకదు. మీ ఆత్మలకు ముందుగానే తెలుసు మీరీ పని చెయ్యాలని. మీ మంత్రశక్తి, ఆత్మబలం వల్ల ఆ అదృష్టం మీకొచ్చింది. ఆ అద్భుతమైన మహాకాలశక్తితో మీరు 4వ తేదీనే కలశస్థాపన చేశారు. చరిత్రలో లిఖించదగిన సంఘటన. రామునితో పుట్టిన కొన్ని ఆత్మలు, శ్రీకృష్ణునితో పుట్టిన కొన్ని ఆత్మలు, మళ్ళీ వెంకట్రాజుపాలెంలో, శ్రీమహాలక్ష్మీ ఆలయానికి శంఖు స్థాపన చేయిస్తున్నాయి. ఆలయనిర్మాణం చేయగలిగే ఈ మహత్తర అవకాశాన్ని మొదట మీరే మొదలెట్టాలి. బద్ధకంతో, అలసత్వంతో అవకాశాన్ని పోగొట్టుకోవద్దు. ఈ మహదవకాశాన్ని మీరు ఇంకా ఇంకా ప్రపంచానికందించాలని కోరుకుంటున్నాను. మీరంతా ఇలాగే పరమగురువులకు సర్వసమర్పణ చేసుకోండని చెప్తూ దానికి సంబంధించిన ధ్యానాన్ని ఆ సాయంత్రం చేయించారు.

తర్వాత కాలంలో గ్రామస్తులందరూ కలసి అక్కడ అద్భుతమైన కోదండరామాలయం, శ్రీమహాలక్ష్మీ ఆలయాలు కట్టించారు. ఆ స్థలవైభవమో, గ్రామస్తుల అంకితభావానికో తెలియదు గాని ఆలయం కట్టిన తరువాత మాస్టర్‌గారు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గం వరకు అక్కడ కార్యక్రమాలను నిర్వహించేవారు.

## లక్షయజ్ఞాల ప్రణాళిక

ప్రణాళికాబద్ధంగా లక్షయజ్ఞాలను ఈ సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి డిసెంబర్ 15 లోపల చేయాలనేది మాస్టర్‌గారి లక్ష్యం. దీనిని ఒక ప్రణాళిక ప్రకారం వివిధరకాల సాధనాల ద్వారా, సామూహిక యజ్ఞాల ద్వారా, సత్సంగ ప్రవచనాల ద్వారా విశాలవిశ్వంలోకి తీసుకువెళ్ళే ప్రయత్నంలో

మొట్టమొదటి అడుగు–నాగులుప్పలపాడులో జరిగిన శ్రీమహాలక్ష్మి సాధనతోపాటు 'సహస్రకుండీ యజ్ఞం'తో ప్రారంభమైంది.

'లక్ష' అనే సంఖ్యను పూజ్యగురుదేవులు తమ జీవితంలో అనేకసార్లు ప్రయోగించి చాలా అద్భుతాలను సృష్టించారు. పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్య "నా జీవిత ఉత్తరార్థం లోని కొన్ని మహత్వపూర్ణనిర్ణయాలు" అని చెప్తూ ఈ జన్మ యొక్క పూర్ణాహుతిగా నేను ఐదు లక్షల ఆహుతులను ఇవ్వవలసి ఉంది. అవి

1) ఒక లక్ష కుండముల గాయత్రీ యజ్ఞములు

2) ఒక లక్ష యుగశిల్పుల ప్రశిక్షణ

3) ఒక లక్ష అశోక వృక్షాలను నాటుట

4) ఒక లక్ష గ్రామ తీర్థములను స్థాపించుట

5) ఒక లక్ష సంవత్సరములు సమయదాన సంచయము.

ఈ ఐదు కార్యక్రమాల ద్వారా కాలపురుషుడు నవసృజన కార్యక్రమాలను రూపొందించటానికి ప్రయత్నిస్తున్నాడు. వీటికి తగిన సాధన, సంపత్తి ఖచ్చితంగా లభించి తీరుతుంది. ఈ కార్యక్రమాలలో పాలుపంచుకునే అవకాశం లభించిన వాళ్లు నిశ్చయంగా యశస్సును, వైభవాన్ని పొందుతారని తమ ఆత్మకథలో వ్రాసుకున్నారు. ఇదొక అద్భుతమైన 'బ్రహ్మాస్త్ర ప్రయోగమని' ఒక చోట చెప్పటం జరిగింది.

**మాస్టర్‌గారి జీవితం ఒక రకంగా పూజ్యగురుదేవుల జీవితానికి ప్రతిబింబంలాంటిది.** ఇక్కడ మాస్టర్‌గారు కూడా 'నవసృజన' కార్యక్రమాలను రూపొందించటానికి ప్రథమ చరణంగా 'ఒక లక్ష యజ్ఞాల' శృంఖలను నిర్ణీత సమయంలో పూర్తి చేయటానికి యావదాంధ్రప్రదేశానికి పిలుపు నిచ్చారు. దానికి స్పందించిన శ్రీసాయి కిశోర్, శ్రీమతి సౌజన్య గార్లు చినముషిడివాడ (వైజాగ్)లో మాస్టర్‌గారి ప్రణాళికను సాకారం చేయటానికి అక్టోబరు నెలలో వచ్చే దేవీనవరాత్రులలో తొమ్మిది రోజులపాటు సాధనాశిబిరంతో పాటు "దశసహస్ర శ్రీమహాలక్ష్మి సాధనా మహాపూర్ణాహుతి" విజయ దశమికి చెయ్యటానికి తగిన ఏర్పాట్లు మొదలుపెట్టారు.

## వైజ్ఞానిక ఆధ్యాత్మికత

ఏదైనా కానీ ఈనాడు మానవజాతికి ఆధ్యాత్మికతను గురించిన సరైన అవగాహన లేకపోవడం చాలా విచారించాల్సిన విషయం. విద్యాలయాలను, వైద్యాలయాలను ఉపయోగించుకున్నంత స్థాయిలో దేవాలయమును ఉపయోగించుకోవటం లేదు. వైజ్ఞానిక ఆధ్యాత్మికత అంటే దేవాలయాలను సరైన రీతిలో ఉపయోగించుకోవడం అని మాస్టర్‌గారు చెప్పుండేవారు. **విద్యాలయాలకెళితే విద్య వచ్చినట్లు, వైద్యాలయాలకెళితే ఆరోగ్యం వచ్చినట్లు, దేవాలయాలకి వెళితే దైవత్వం రావాలనే ధర్మసూక్ష్మం ఒక యథార్థం.**

ఆ స్థాయిలో దేవాలయాలను, అందులో ఉండే దేవతామూర్తులను ఉపాసన చెయ్యాలనేది మాస్టర్‌గారు నేర్పదల్చుకున్న ఆధ్యాత్మిక విద్య. వారి జ్ఞానం ఉత్తుంగతరంగంలాగా ఎగసిఎగసి ఆకాశపుటంచులను తాకడానికి ప్రయత్నిస్తున్నది. వారి ప్రయత్నాలకు స్పందించిన కార్యకర్తలు, తమ వంతు కృషిని, సామూహిక క్రియాకలాపాల ద్వారా అందించటానికి ముందుకు వచ్చారు. పల్లెలు, పట్టణాలు, నగరాలు, మారుమూల గ్రామాలలో సైతం మాస్టర్‌గారి ప్రణాళికలు అందంగా రూపుదిద్దుకోవడం మొదలైంది.

నాగులుప్పలపాడు నుంచి ప్రారంభించబడిన ఈ లక్ష కుండముల యజ్ఞశృంఖల శ్రీమహాలక్ష్మి సాధనతో జత చేయబడి పెనుతుఫానులాగా ముందుకు దూసుకు వెళ్ళింది. అందులో భాగంగా అక్టోబరు 8, 9, 10, 11 తేదీలలో వైజాగ్‌లో సాధనా శిబిరంతోపాటు వేర్వేరు ప్రాంతాలలో శ్రీమహాలక్ష్మిసాధనలు, యజ్ఞాలు, సత్సంగాలను కూడా శ్రీసాయికిశోర్‌గారు ఏర్పాటు చేశారు. వైజాగ్‌లో శ్రీకిశోర్‌గారి నేతృత్వంలో పగలు 'జన జాగరణ శిక్షణ' శిబిరాన్ని నిర్వహిస్తూ, సాయం సమయాలలో గురజాడ కళాక్షేత్రంలో 'వైజ్ఞానిక ఆధ్యాత్మికత' అనే అంశంపై డాక్టర్ శ్రీరామకృష్ణగారు ఇచ్చిన ప్రవచనాలు ప్రజలలో అద్భుతమైన స్పందనను తీసుకువచ్చాయి. రాష్ట్రం నలుమూలల నుంచి సాధనా శిబిరానికి వచ్చిన సాధకులు సాధన చేస్తూ 12వ తేదీన జరుగబోయే సహస్రకుండీ మహాయజ్ఞానికి కావలసిన ఏర్పాట్లను అత్యంత శ్రద్ధా, భక్తులతో చేస్తూ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నారు.

## శ్రీమహాలక్ష్మీ సాధన మహాపూర్ణాహుతి - వైజాగ్

2005 అక్టోబర్ 11, 12 తేదీలలో చినముషిడివాడలో శ్రీమహాలక్ష్మీ సాధన పూర్ణాహుతికి అన్ని ఏర్పాట్లు దివ్యంగా జరిగాయి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరికి శాంతి, సమృద్ధి, సుఖము కలగాలని, దానితోపాటు సుస్థిరమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పడాలనే ఆకాంక్షతో పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారిచే అందించబడిన ఈ మహోజ్వలమైన సాధనావిధానము కుల, మత, జాతి, విచక్షణ లేకుండా అందరికీ అందించబడింది. వారే స్వయంగా అందరిచేత ఈ సాధన చేయించారు. ఈ సాధనా విధానంలో ఇంటింటా గురుస్థానాలను ఏర్పాటు చేసి 5 దీపాలు వెలిగించి 1 మాల గాయత్రీ, 5 మాలలు శ్రీమహాలక్ష్మీ మంత్రం చెయ్యాలనే నియమాన్ని అమలు చేయించారు.

ముందు చెప్పిన విధంగా 11వ తేది సాయంత్రం 4 గంటల నుండి శక్తికలశ శోభయాత్ర జరిగింది. అనంతరం 10 వేల దీపాలతో దీపయజ్ఞం చేశారు. ఇంక 12వ తేది బుధవారం తెల్లవారుఝామున 4 గంటల నుంచి దశసహస్ర శ్రీమహాలక్ష్మీ సాధన పారాయణ ప్రారంభించాలి. అయితే ఆ రోజు రాత్రి అమ్మ అనుగ్రహము అన్నట్లుగా కనీవినీ ఎరుగని రీతిలో కుంభవృష్టి కురిసింది. అయినప్పటికి అనుకున్న సమయానికి శ్రీమతిసౌజన్య, నేను యజ్ఞశాలకు వచ్చి శ్రీమహాలక్ష్మీ పారాయణ ప్రారంభించాం. లెక్కించదగినంత మంది మాత్రమే కార్యక్రమానికి వచ్చి పారాయణలో పాల్గొన్నారు.

పారాయణానంతరం యజ్ఞం జరుగుతుంది. కనుక పూజ్యవరులు యజ్ఞ సమయానికి వేదిక మీదకి వచ్చేశారు. అప్పుడప్పుడే సూర్యభగవానుని లేలేత కిరణాలు పృధ్వీమీద పరుచుకుంటున్నాయి. ఆకాశం మేఘావృతంగానే వుంది కేవలం 200 కుండీలలో మాత్రమే యజ్ఞం కొనసాగింది. పూర్ణాహుతి అయిపోయాక మాస్టర్‌గారు "ఈ నెల 23వ తేదీన కుజగ్రహం భూమికి దగ్గరగా వచ్చేరోజు. ఎంతో శ్రేష్ఠమైన ఆ పర్వదినం రోజున మళ్ళీ మనందరం కలుసుకొని 1008 కుండీలతో పూర్ణాహుతి యజ్ఞం చేద్దాం" అప్పటివరకు మీరు, మీతోపాటు వేలాదిమందిని కలుపుకొని సాధన చేసి పూర్ణాహుతికి రావాలని చెప్పారు. అనుకున్నట్లుగానే 12వతేదీన జరుగవలసిన సహస్రకుండీ మహాయజ్ఞం అక్టోబరు 23వతేదీన చినముషిడివాడలో జరిగింది. శ్రీమహాలక్ష్మీ సాధనా మహా పూర్ణాహుతికి మాస్టారు వైజాగ్‌కు వచ్చారు. వాతావరణం ప్రశాంతంగా వుంది. ఏర్పాట్లన్నీ యథావిధి

గానే చేశారు. తెల్లవారితే పూర్ణాహుతి జరగాలి. మళ్ళీ వరుణదేవుని కృపాకటాక్షవీక్షణాల పర్యవేక్షణ లోనే పూజ్యశ్రీ మాస్టర్‌గారి సంకల్పశక్తితో శ్రీమహాలక్ష్మీసాధనా మహాపూర్ణాహుతి అత్యంతశోభాయ మానంగా జరిగిపోయింది. ఆ రోజులలో ఎప్పుడు, ఎక్కడ శ్రీమహాలక్ష్మీసాధనా పూర్ణాహుతి జరిగినా అది కుంభవృష్టితోనే మొదలయ్యేది, కుంభవృష్టిలోనే పూర్ణాహుతి జరిగిపోయేది. సాధనా బలం అంతగా ఉండేదప్పుడు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్‌లో మాస్టర్‌గారు చెప్పిన విధంగా శ్రీమతి శ్రీలక్ష్మి, తేజశ్రీ, కుమారి సావిత్రి, అనూషలు సనత్‌నగర్, హనుమాన్ ఆలయ ఆవరణలో 1008 కుండీల మహాలక్ష్మీసాధనా పూర్ణాహుతిని పూజ్యశ్రీమాస్టర్‌గారి సూక్ష్మఉపస్థితిలో మహాద్భుతంగా చేయడం విశేషం.

## కార్యక్రమాల ప్రభంజనం

శ్రీసాయికిశోర్‌గారు ఒక వైపున విజయదశమికి చినముషిడివాడలో, శ్రీమహాలక్ష్మీసాధన, సహస్రకుండీ యజ్ఞానికి తగిన ఏర్పాట్లు చేస్తూనే మరొక వంక వేర్వేరు ప్రాంతాలలో 108 కుండీల యజ్ఞాలకు కాలనిర్ణయ పట్టికను తయారు చేసి, సరిగ్గా ఆ సమయానికి మాస్టర్‌గారిని ఆయా ప్రదేశాలకు తీసుకువెళ్ళేవారు. అతి ముఖ్యమైన విషయాలేమైన వుంటే కారులో వెళ్తూ మధ్యలో మాట్లాడుతుండేవారు. దుర్గాష్టమినాడు 'దుర్గా గాయత్రీ శక్తిపీఠం' భీమిలిలో 108 కుండీల యజ్ఞానికి మాస్టర్‌గారిని తీసుకువెళ్ళారు. అక్కడ శ్రీచంద్రశేఖర్, భారతిగార్లు 5 కోట్ల గాయత్రీ జప అనుష్ఠానం చేయించారు. ఆ సాధనా పూర్ణాహుతికి వారు శ్రీశ్రీ మాస్టర్‌గారిని ఆహ్వానించారు. ఆ రోజు 108 కుండీలలో శ్రీ గాయత్రీ–లలితా–భాగవత యజ్ఞం చేయించడానికి ముందు ఆ యజ్ఞము యొక్క విశిష్టతను వివరించారు. గాయత్రీ సద్బుద్ధినిస్తుంది. రాబోయే రోజులలో ఈ శక్తిపీఠం అద్భుతమైన ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా విరాజిల్లుతుందని చెప్పిన అనంతరం నేను, సౌజన్య యజ్ఞాన్ని చేయించటంతో కార్యక్రమం ముగిసింది.

విశాఖపట్టణంలో శ్రీశ్రీ మాస్టర్‌గారికి అత్యంత ఆప్తులు శ్రీ అవతారం రాజుగారి కుటుంబము. మాస్టర్‌గారు అవతారంరాజుగారిని నా గురుభాయ్ అనేవారు. శ్రీఅవతారంరాజుగారు కూడా అనేక చోట్ల వివిధ కార్యక్రమాల నిర్వహణకి వారిని తీసుకువెళ్ళారు. అప్పుడప్పుడు వారు అవతారం రాజు గారింటికి వెళ్ళి వారి ఆతిథ్యాన్ని స్వీకరించి వారి కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతూ వుండేవారు. ఇంక మాస్టర్‌గారు వైజాగ్‌లోఉన్నన్ని రోజులూ ఉదయం ఒక ఊరు, సాయంత్రం

ఒక ఊర్లో కార్యక్రమాలు చేసే విధంగా ప్రణాళిక రచించబడింది. అందులోభాగంగా చింతల పాలెంలోగల శక్తిమాత ఆలయంలో కూడా 108 కుండాలలో యజ్ఞం ఉదయం చేశారు. మళ్ళీ సాయంత్రం అదే గ్రామంలో శిర్డీసాయికి ఆలయం నిర్మాణమై ఉందని పూజ్యశ్రీ మాస్టర్‌గారి అమృత హస్తాలతో సాయినాధుని విగ్రహప్రతిష్ట జరగాలని గ్రామస్థులు కోరగా అది సాయినాధుని కోరికగా భావించి విగ్రహ ప్రతిష్ఠను స్వయంగా మాస్టర్‌గారే చేశారు. సాయినాధుని దివ్యలీలపై చక్కటి ప్రవచనాన్ని చెప్పారు. అనంతరం 108 కుండీలలో యజ్ఞం జరిగింది. అలా వడిసెలేరు, సుజాతనగర్ మొదలైన గ్రామాలలో క్షణం తీరిక లేకుండా కార్యక్రమాలు చేస్తూ ప్రవచనములు చెప్తూ 13వ తేది వరకు వైజాగ్‌లోనే వున్నారు.

## సావిత్రీ ప్రచారవేదిక - వైజాగ్

మిషన్ ఆర్.కె లక్ష్యాలను ఈ సావిత్రీ ప్రచార వేదిక ద్వారా జనసామాన్యంలోనికి తీసుకువెళ్ళే బాధ్యతను 'శ్రీసాయికిశోర్, సౌజన్యలగార్లకు మాస్టర్‌గారు అప్పగించారు. 2004 కృష్ణాష్టమినాడు హైదరాబాదు, శ్రీమతి తేజశ్రీ గారింట్లో మిషన్ ఆర్.కె.ట్రస్ట్ అనే సంస్థను స్థాపించిన విషయం ముందు చెప్పుకున్నాం. దాని లక్ష్యాలు ఋషులందించిన మూడు దివ్య ప్రణాళికలు. 1) రోగరహిత 2) వృద్ధాప్యరహిత 3) మృత్యురహిత జీవిత సాధనా విధానాలను ఆ రోజు చెప్తూ, ఆ సైన్సును మనం బయటకు తీయాలి. తిరిగి ఆ జ్ఞానాన్ని ప్రపంచానికందించటానికి పాటించడానికి వీలైన సాధనలందించారు.

1) **రోగరహిత జీవితానికి:** యజ్ఞవిద్యను ప్రాచుర్యంలోనికి తీసుకురావాలి. ఈనాడు మనుషులందరూ రోగ భూయిష్టమైన ఆహారాన్ని తింటున్నారు. రోగభూయిష్టమైన నీళ్ళను త్రాగుతున్నారు, గాలిని పీలుస్తున్నారు. వాతావరణం మొత్తం కాలుష్య పూరితమై పోయింది. రోగరహిత జీవితవిధానాన్ని నేర్పించడమే మిషన్ ఆర్.కె లక్ష్యం. నూతన సమాజ నిర్మాణానికి ఇంటింటా యజ్ఞకుండీల స్థాపన చెయ్యాలి. **రామరాజ్యం రావడానికిగల ఏకైక కారణం - బ్రాహ్మీముహూర్తంలోనే ప్రతి ఇంటిలోనుంచి యజ్ఞధూమం ఆకాశంలోకి వెళ్ళిపోయేది.** ఇంట్లో వెలిగించే చిన్న దీపంలో నుంచి వచ్చే వేడి, వెలుగు పైకి వెళ్ళి అది తన పనిని తాను చేస్తుంది. అలాంటిది ఒక లక్షమంది ఒకేసారి లక్ష దీపాలు వెలిగిస్తే దాని ప్రభావం ఆకాశంలో ఎలా ఉంటుందో మీరూహించుకోండి.

సంకల్పముంటే పని అదే జరుగుతుంది. ఈనాడు కాలుష్యం చాలా ఎక్కువగా ఉంది. సామూహికంగా అందరూ దీపాలు వెలిగించి, గాయత్రీ మంత్రోచ్చారణ చేస్తే ఈ తపః పూతమైన గాలి పైకి వెళ్ళి అంతరిక్షంలో ఆవిరి అయిపోతుంది. ప్రాణవంతమైన పర్జన్యవర్షం కురుస్తుంది. అందరికి ఆరోగ్యం లభిస్తుంది. పూజ్య గురుదేవులందించిన యజ్ఞీయ చికిత్సావిధానాన్ని అందరికీ అందిచటం ద్వారా రోగరహిత జీవితాన్ని తప్పక సాధించవచ్చు.

2) **వృద్ధాప్య రహిత జీవితం:** మాస్టర్‌గారు డార్జిలింగ్‌కు వెళ్ళినప్పుడు ఒక ప్రదేశానికి తీసుకు వెళ్ళబడ్డారు. అక్కడ వారు చూచిన ఆ కమ్యూనిటీలో అతి తక్కువ వయస్సుగల ఋషి అనుకుందాం, వారి వయస్సు 20 వేల సంవత్సరాలు. ఆ వయస్సు గల వారిని వారు 'బచ్చా'లు అనేవారు. ఇంకా 80 లక్షల సంవత్సరాలు గల వాళ్ళను కూడాచూశానని మాస్టర్‌గారు చెప్పారు. సమస్త పృథ్విపై అలాంటి జీవిత విధానాన్ని నెలకొల్పాలి.

3) **మృత్యురహిత జీవితం:** దానికి **మిషన్ ఆర్.కె యొక్క కర్తవ్యమేమిటంటే దేవాలయమును సరిచెయ్యాలి. దేవాలయములో 1) జపము 2) ప్రాణాయామము 3) ధ్యానము. ఈ మూడు విధిగా జరగాలి. దేవాలయాలకెళ్ళి కోరికల గురించి అడగరాదు. దైవత్వం గురించి ఆలోచించాలి. ప్రాణవిద్యను దేవాలయాలలో నేర్పాలి.** విశాలమైన ప్రాసాదాన్ని నిర్మించాలంటే దానికి మోడల్ (నమూనా) వుండాలి. అలాగే ముందుగా మనం ఈ మూడింటి గురించి తెలుసుకోవాలి. అయిడియాస్, అయిడియల్ మరియు అయొడల్ అంటే ఏమిటో చూద్దాం.

Ideas రోగరహిత జీవితం కావాలని.

Ideal ఆదర్శం వుండాలి అంటే వృద్ధాప్య రహిత జీవితం కావాలి.

**Idol కుండలినీ సాధన జరగాలి. ఇది అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది.** ఈ లక్ష్యాల వైపుకు మనం అడుగులు వెయ్యాలి. దేవాలయాలను బాగా ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా కుండలినీ జాగరణకు ప్రతిరోజు దేవాలయాలకు వెళ్ళి 2 గంటలకొకసారి 16 ప్రదక్షిణలు చొప్పున, 7 సార్లు చేస్తే 7×16=112 ప్రదక్షిణలు పూర్తౌతాయి లేదా 112 ప్రదక్షిణలను ఒకేసారి చేసేయ్యవచ్చు. 7 అంటే 7 సూర్యకిరణాలను, 16 అంటే 16 చంద్రకళలకి సంకేతంగా ఈ సాధన జరుగుతుంది. అలా చెయ్యటం వలన ఆ గ్రహాలకు సంబంధించిన సమస్యలేమైనా వుంటే తీరిపోతాయి.

దీంతోపాటు ప్రాణోత్థాన ప్రక్రియ రోజుకు 2 గంటలపాటు చేసే ప్రదక్షిణల వలన వృద్ధాప్య రహిత జీవితం, కుండలినీజాగరణకు అవే ఫలితాలు లభిస్తాయి. ప్రాణశక్తి సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో అనంతంగా కురుస్తుంది. కనుక దేవాలయాలకు ఆ సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో వెళ్ళి ఈ ప్రదక్షిణలు చేస్తే మనకు కావలసిన ఫలితాలు వస్తాయి.

**3) ధ్యానం :** ప్రతివారూ ఏదో ఒక దేవాలయంలో సూర్యోదయానికి ముందు 20 నిమిషాలు కూర్చోండి. ఆ 20 నిమిషాలు మౌనంగా ఉండిపోగలిగితే నీవే ఆ భగవంతుడివైపోతావు. ధ్యానంలో ఆ దేవతామూర్తిని నఖశిఖ పర్యంతం దర్శనం చెయ్యాలి. దేవాలయాలలో దేవతామూర్తి విగ్రహ ప్రతిష్ఠ ఎలావుండాలంటే ఒక సాధారణ మనిషి క్రింద కూర్చుంటే ఆ దేవతామూర్తి పాదం మనిషి శిరస్సు వరకు ఉండాలి. శ్రద్ధా విశ్వాసాలతో ఈ ధ్యానం చెయ్యండి. అప్పుడే ఏదైనా ఫలితం వస్తుంది. **భవానీ శంకరం వందే శ్రద్ధా విశ్వాసరూపిణం అంటే పార్వతి, పరమేశ్వరులు శ్రద్ధ, విశ్వాసానికి ప్రతీకలు–అలా జపం, ప్రాణాయామం, ధ్యానం, ప్రదక్షిణలు చేస్తే వృద్ధాప్యముండదు. ఉత్సాహముంటుంది. ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండవచ్చు' అని చెప్పారు.**

**ఇంకా దేవాలయాలకెళ్ళినప్పుడు ఆరతి సమయంలో ఆ దేవతామూర్తి యొక్క అంగ ప్రత్యంగాలను తదేక నిష్ఠతో దర్శిస్తే మనలోని పంచప్రాణాలకి, పంచజ్ఞానేంద్రియాలకి అనంతమైన శక్తి వస్తుంది. రోగరహిత జీవితానికి ఈ జ్యోతిధ్యానం ఎంతో ఉపకరిస్తుంది.** ప్రతి దేవాలయాలలో ఆరతి సమయానికి భక్తులు తప్పనిసరిగా రావడంలో గల అంతరార్థం ఇదే, తెలిసి చేస్తే ఫలితాలు త్వరగా వస్తాయి. శిరిడీలో 4 ఆరతులలో వున్న చమత్కారమంతా ఇదే.

2005 డిసెంబరు లోపల చేయవలసిన కార్యక్రమము గురించి చెప్తూ 12 రోజులపాటు – 108 కుండీలలో ఒకేచోట లేదా వేర్వేరు ప్రాంతాలలో యజ్ఞములు చేయవలసి ఉంటుందని చెప్పారు. ఈ విధమైన భవిష్యత్ ప్రణాళికలను వివరించటంతో వైజాగ్ కార్యక్రమాలు పూర్తయినాయి. ఇక ఇక్కడ్నుండి మాస్టర్‌గారి తదుపరి కార్యక్రమాలు అమలాపురం నుండి జరగనున్నాయి. కనుక ఆ రాత్రికే అమలాపురానికి బయల్దేరారు. ఒకరు మాస్టర్‌గారి దగ్గరకు వచ్చి తమ అనారోగ్యం గురించి చెప్పగా ఈ చిన్న చిట్కాను చెప్పారు. **నాలుగు తులసి ఆకులను చిన్న రాగిపాత్రలో వేసి కాసిని నీళ్ళుపోసి మీకిష్టమైన ఏ మంత్రాన్నైనా కాసేపు జపించి, రెండు గ్రాముల కర్పూరం వెలిగించి దేవునికి ఆరతిచ్చి ఆ నీటిని తీర్థంలాగా తీసుకుంటే అన్ని రోగాలు పోతాయి.**

## జన్మదిన వేడుకలు

అక్టోబర్ 14వ తేది శ్రీశ్రీ మాస్టర్‌గారి జన్మదినం. శ్రీశ్యామలరావుగారింట్లో ఈ వేడుకలు జరగటానికి ఏర్పాట్లు జరిగిపోయాయి. అన్ని ఊళ్ళ నుండి కార్యకర్తలు మాస్టర్‌గారిని చూడాలని ఈ జన్మదిన వేడుకలలో పాలుపంచుకోవాలని అత్యంత ఉత్సాహంగా ఎంతెంత దూరాలనుంచో వచ్చేశారు. ఉదయాన్నే అభ్యంగన స్నానాలు చేసి నూతన వస్త్రాలను ధరించి అపర సనత్కుమారుల వలె వెలిగిపోతున్న శ్రీ మాస్టర్‌గారు జన్మదిన సంస్కారం చేసుకోవటానికి వేదిక మీదకి వచ్చారు. యుగయజ్ఞ పద్ధతిలో జన్మదిన సంస్కారం చేసిన తర్వాత మాస్టర్‌గారు కొన్ని దీక్షలను స్వయంగా స్వీకరించారు. ఈ సంవత్సరం తీసుకున్న దీక్షలు వచ్చే జన్మదినం నాటికి పూర్తి చేయడం అనేది వారికి అలవాటు. పూర్ణాహుతి సమయంలో వారు తీసుకున్న దీక్షలను తమ ప్రవచనంలో చాలా స్పష్టంగా ఇలా వివరించారు.

“2006 కృష్ణాష్టమి వరకు నేను, మీరు విశ్రాంతనేది లేకుండా పని చెయ్యాలి. అలా చేస్తామనే వారికే బాధ్యతలనందిస్తాను. గురుపరంపర 1750 సంవత్సరం నుంచి తమ పనిని ప్రారంభించింది. వారి ప్రణాళికలోని భాగంగానే మన కార్యక్రమాలు చక్కగా రూపుదాలుస్తున్నాయి.

సూర్యోదయానికి ముందు ధ్యానం చేసుకోవటం అలవాటు చేసుకోండి. శ్రద్ధ ఏర్పడుతుంది. నేను చెప్పే మాట మీద విశ్వాసం ఉంటే ప్రతి ఇంట్లో యజ్ఞకుండ నిర్మాణం జరగాలి. **శ్రద్ధ ఉండి, ఆచరణ ఉండి యజ్ఞం చేస్తేనే అది ఫలితాన్నిస్తుంది.**

మొదటి ఆచరణ 12 ఇటుకలు + 5 దీపాలు + 5 అగరబత్తులు వెల్గించి - 1 మాల గాయత్రీ - 5 మాలలు శ్రీమహాలక్ష్మీ చెయ్యండి. డిసెంబర్ లోపల ఒక లక్ష ఇళ్ళల్లో యజ్ఞకుండాల స్థాపన జరిగి జపం జరుగుతూ ఉండాలి. మీకేదైనా సమస్యలుంటే నాకు ఉత్తరాల ద్వారా తెలియ పరచండి. శ్వేతద్వీపం అడ్రస్సుకు ఒకటి, హరిద్వార్ శాంతికుంజ్‌కు ఒకటి వ్రాయండి. శ్రద్ధ వున్న వాళ్ళకు గ్యారంటీగా సమస్యలు తీరిపోతాయి. ఈ గ్యారంటీని ఒక అద్భుతమైన తపఃశ్శక్తితో ఇస్తున్నాను. **పంచవీరభద్ర సాధన చేసిన ఒక మహనీయుడు, మీ కోర్కెలను షిర్డీసాయి, సత్యసాయి, వేంకటేశ్వరస్వామి రూపంలో తీరుస్తున్నారు. నాకు నా గురువు మీద ఆ మాత్రం నమ్మకమున్నది. మీకూ ఉంటే ఈ పన్లు చెయ్యండి. మీ పన్లు మీరనుకున్నట్లు అయిపోతాయి.**

లక్ష యజ్ఞాలు చెయ్యాలని కదా అన్నాను. అంతేగా? దేవతా శక్తులను మానవజాతి దగ్గరకు తీసుకురావాలి. ఋషులు అనుకున్న దేవాలయాలు ఈనాడు లేవు. దానికి శ్రీమహాలక్ష్మీ దేవాలయాలు 108 రావాలి. అక్కడ ఋషి ప్రణీత కార్యక్రమాలను మనం చెయ్యాలి. చెప్పిన విషయాలు మళ్ళీ చెప్తున్నాను.

1. లక్ష కుండాలలో యజ్ఞం జరగాలి. 2. లక్ష గురుచరిత్రల పారాయణలు జరగాలి.

3. మహాలక్ష్మీ దేవాలయాలు 108 రావాలి. 4. గాయత్రీ – కుండలినీ – సావిత్రి సాధన.

ఈ పుస్తకం చదివిన వారు 9 రోజులు సాధనా క్యాంప్‌కు శ్రీశైలానికి రావాలి. ఇప్పటికిది చాలు. చివరిగా మీకేదైనా బాధలుంటే శ్వేతద్వీపం అడ్రస్సుకు లెటర్స్ వ్రాయండి మీ బాధలు తీరతాయి. నేను ఒక శక్తితో కనెక్ట్ అయి ఉన్నాను" అని ఆనాటి ప్రసంగాన్ని ముగించారు. పైన చెప్పిన విషయాలు కాలక్రమంలో లక్షయజ్ఞాల టార్గెట్ పూర్తయింది. గురుచరిత్రల పారాయణలూ పూర్తయి పురుషోత్తమపట్నంలో పూర్ణాహుతి చేశారు. మహాలక్ష్మి మందిరాలు కొంత వరకు స్థాపించగలిగారు. గాయత్రీ – కుండలినీ – సావిత్రి పుస్తకముపై సాధనలు కూడా ఇంకా జరగాలి.

జన్మదిన సందేశం ఇవ్వడం అయిపోయాక అందరూ ప్రహ్లాదబాబాగారి ఆశ్రమానికి (తోటల పందరి) వెళ్ళటం జరిగింది. శ్రీ బాబావారికి శ్రీశ్రీ మాస్టర్‌గారంటే ఎనలేని అభిమానం. పూజ్యశ్రీ బాబావారు, మాస్టర్‌గారితో ప్రత్యేకంగా ఏకాంతంలో అనేక రహస్యమయ ప్రసంగాలు చేస్తుండేవారు. విశిష్టమైన సాధనా విధానాలను చేయిస్తుండేవారు. బాబావారే స్వయంగా మాస్టర్‌గారికి ఎంతో ప్రేమతో తినిపిస్తుండేవారు. వారిద్దరి అనుబంధం తండ్రీకొడుకుల అనుబంధం అని మాస్టర్‌గారు అప్పుడప్పుడు చెప్పేవారు. మాంచి హుషారుగా ఉన్నప్పుడు మా మానాన్న గారంటుండేవారు.

ఆనాటి జన్మదినాన్ని తోటల పందరిలో బాబావారు అత్యంత రమణీయంగా ఏర్పాటు చేసి మాస్టర్‌గారికి తమ దివ్యాశీస్సులను అందచేశారు. ఎంతో పెద్ద ప్రమాదకరమైన హార్టెటాక్ నుంచి రక్షించబడి మళ్ళీ మాములుగా కంటే కూడా రెట్టింపు ఉత్సాహంతో పరమగురువుల పనిచేస్తూ విశ్రాంతి అనేది లేకుండా లక్షయజ్ఞాల శృంఖలను ఒక పెద్ద సునామీలాగా అత్యంత వేగంగా చేస్తున్న మాస్టర్‌గారిని చూస్తుంటే అందరికి ఆనంద ఆశ్చర్యాలు కల్గుతుండేవి. అది పూర్తిగా పరమగురువుల అనుగ్రహం కాక మరేమౌతుంది. అలా అందంగా, ఆనందంగా ఆ రోజు మాస్టర్‌గారి జన్మదిన వేడుకలు పూర్తైపోయాయి.

అమలాపురంలో క్షణం తీరిక లేని విధంగా కార్యక్రమాలను శ్రీశ్యామలరావుగారు సిద్ధం చేసి ఉంచారు. శ్రీశ్యామలరావుగారు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఎలా వీలైతే అలా అమలాపురంలో వేర్వేరు ప్రాంతాలకు మాస్టారిని తీసుకువెళుతుండేవారు. రోటరీ క్లబ్బుల్లో ప్రతిరోజూ ప్రవచనాలుండేవి. అమలాపురం, రంగాపురం, అంతర్వేదిపాలెం, కాట్రేనికోన, ముమ్మిడివరం, పిల్లంకి, యానం, ఎదుర్లంక, గొప్పలంక, ఉప్పులగుత్తం, రాజోలు ఇలా అనేక గ్రామాలలో 108 కుండీల యజ్ఞాలు, ప్రవచనాలు శ్రీమహాలక్ష్మి దేవాలయ స్థాపనలు అవిశ్రాంతగా చేస్తూ చివరగా 15,16 తేదీలలో శ్రీగీతాశ్రమంలో శ్రీరామానందస్వామి వారి ఆధ్వర్యములో గీతా ప్రవచనాలు చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమాలనన్నింటనీ శ్రీ శ్యామలరావు, శ్రీమతి నాగమణిగార్లు, కొంత మంది కార్యకర్తల సహకారంతో నిర్వహించారు.

అమలాపురంలో శ్రీరామకృష్ణగారు, శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో సహస్రకుండీలలో శ్రీమహాలక్ష్మి సాధనా పూర్ణాహుతిని నిర్వహించారు. మళ్ళీ డిసెంబరు 13వ తేదిన 1 కోటి 25 లక్షల మంత్రసాధనా పూర్ణాహుతిని సహస్ర కుండీయ యజ్ఞములో శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారి చేత నిర్వహించబడినది. ఆనాటి వారి ప్రసంగంలో "రాబోయే 5 సంవత్సరాలలో వచ్చే మార్పులు 1) నిత్యావాడకంలో ఆయుర్వేద తయారీవస్తువులు ప్రాచుర్యంలోకి వస్తాయని, ఆయుర్వేదం యొక్క పునర్జాగరణ జరుగుతుందని చెప్పారు. 2) హనుమంతుడు భవిష్యబ్రహ్మ. అందుకే రాజమార్గాలలో (హైవేలలో) విరివిగా ఆయన విగ్రహాలు వస్తాయి. ఆ దారి వెంట ప్రయాణించేవారికి అనుగ్రహాన్ని ప్రసాదించి, అనేక ప్రమాదాల నుంచి ఆయన రక్షిస్తాడు. వారి భవిష్యత్తును లిఖిస్తుంటాడు కనుక ఆ దారి వెంట వెళుతున్నప్పుడు శిరస్సువంచి ఆయనకు నమస్కరించి వెళ్ళండి" అని చెప్పారు.

పెనుగొండలో శ్రీమతి మిరియాల పద్మావతిగారు మాస్టర్‌గారి నిర్దేశాల ప్రకారం అప్పటికే సహస్రాధిక గురుచరిత్రల పారాయణక్రమాన్ని పూర్తిచేసిన శుభసందర్భంగా మాస్టర్‌గారు ఆ దివ్యశక్తిని విశ్వవ్యాప్తం చేయటానికి ఆ గ్రామంలో 108 కుండీలలో విశ్వఏకీకరణ మహాయజ్ఞం చేశారు. ఆ వాతావరణంలో ఎంతటి గురుచేతనత్వపు పవిత్రతరంగాలు ప్రవహించాయో మనమూహించలేము. అంతగొప్ప కార్యక్రమం చేయటానికి అంతమందికి అంతటి ప్రోత్సాహాన్నిచ్చిన కుమారి రమణ కుమారి, పద్మగార్లను మాస్టర్‌గారు ఇంకా ప్రోత్సాహిస్తూ ఈ క్రమం లక్షకు చేరాలని స్ఫూర్తినిచ్చారు.

## సంపూర్ణ చంద్రగ్రహణం

అక్టోబరు 17వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణమని ముందుగానే చెప్పుకున్నాము. ఏ మంత్ర జపం కానీ, సాధన కాని గ్రహణసమయంలో చేస్తే సాధకునిలో రెట్టింపుశక్తి వస్తుందనేది అందరికి తెలిసిన విషయమే. అత్యంత ప్రభావం కలిగిన ఈ సమయంలో అంతర్వేదిపాలెంలో శ్రీమహాలక్ష్మీ దేవాలయంలో ఉదయం 27 కుండాలలో యజ్ఞం, సాయంత్రం దీపయజ్ఞం చేయటానికి శ్రీమతి రమాదేవిగారు చేసిన కృషి అభినందనీయము.

ఆరువేల సంవత్సరాలకొకసారి మాత్రమే వచ్చే ఈ యుగసంధి కాలములో ఎవరెంత నాటుకుంటే వారికంత ఫలితాలు వస్తాయనేది పరమసత్యం. ఈ యుగ సంధికాలంలో మీరు తీసుకున్న నిర్ణయాల వల్ల మీ, మీ భావితరతరాల పుత్రపౌత్రులకు లాభంతో పాటు, భవిష్యత్‌లో వారికి అఖండ గౌరవం లభిస్తుందని ఆనాటి ప్రవచనంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు సభాముఖంగా చెప్పటం జరిగింది.

### గురువులను గుర్తించడమెలా?

మాస్టర్‌గారు డార్జిలింగ్ వెళ్ళినప్పుడు అక్కడ గురువులు కొన్ని విషయాలు ఇలా చెప్పారుట. 'మేము మానవజాతికి దగ్గరగా వద్దామనుకుంటున్నాము. కానీ మా గురించి ఎవ్వరూ, ఎవ్వరూ చెప్పడం లేదు సరికదా, కనీసం ఆలోచించడమైనా లేదు. ఆ గురువులు చెప్పిన విషయాలే నేను మీకు చెప్తున్నాను. నాదేం లేదు. నా వెనుకన గల ఆ దివ్యశక్తులు నా చేత ఈ పనులన్నీ చేయిస్తున్నారని చాలా స్పష్టంగా చెప్తూ "ఏ కల్కి అవతారమైతే మన మధ్యనే సశరీరంగా ఉన్నదో దానితో కలిసి పనిచేసే అదృష్టం మనకు దక్కింది. ఈ విషయాన్ని మీరు నమ్మినా, నమ్మకపోయినా అదే యదార్ధం కనుక మీరీ విషయాన్ని అందరికీ చెప్పాలి".

మీరు ఆ అవతారమూర్తితో కలిసి పని చెయ్యాలనుకుంటే, నాతో వచ్చెయ్యండని ఒక సందర్భంలో చెప్పారు. శిరిడీసాయి సశరీరంగా కనిపించి "నీ గురువు శ్రీరామశర్మ ఆచార్య – నీవు ఆయన దగ్గరకు వెళ్ళు"అని చెప్పిన తర్వాతనే నేను మధురకు వెళ్ళానని మాస్టర్‌గారు 21-10-2005 నాగారంలో చెప్పిన ప్రవచనంలో సభాముఖంగా వెల్లడించారు.

## ఇంటింటా గురుస్థానం

ఆరువేల సంవత్సరాలకొక్కసారి మాత్రమే వచ్చే ఈ అద్భుతమైన కాలాన్ని శ్రీశ్రీ మాస్టర్‌గారు వివిధ రకాల సాధనా విధానాలతో దానిని ప్రకృతికి అనుకూలంగా మార్చడానికి చేసే ప్రయత్నంలో భాగంగా లక్షయజ్ఞాల శృంఖలను ప్రారంభించారు. లక్షయజ్ఞముల శృంఖల మొదట నాగులుప్పలపాడు నుంచి ప్రారంభించిన తర్వాత వైజాగ్, అమలాపురం, హైదరాబాద్ మొదలైన ప్రాంతాలలో సహస్ర కుండీ యజ్ఞాలు చేస్తూ ఈ యజ్ఞ ప్రక్రియను ఇంటింటికీ అందించటానికి ఒక బృహత్ప్రణాళికను రచించారు. అది గురుస్థానాలను స్థాపించుకునే ప్రక్రియ. సాయిచరిత్రలో ఒక గణాచారి 'శిరిడి సాయి' యొక్క గురుస్థానాన్ని చూపిస్తారు. అందులో 4 ఇటుకలు, 5 దీపాలు, పూలు, జపమాల అక్కడ కనిపిస్తాయి.

సాయిచరిత్ర చదివితే గురువును గుర్తించడమెలాగో అర్థమౌతుంది. ఈ కాలంలో గురువు అనుగ్రహం చాలా అవసరం. గురువు అనుగ్రహంగానీ, సాయి అనుగ్రహం కానీ మీకు గురుస్థానాల ద్వారా మాత్రమే లభిస్తుంది. ఆ ఇటుక గురువుతో లింకు అయ్యి ఉంటుంది. ధునిలో ఉండే అగ్ని గురువే. ఇటుకల్లోకి గురువు అనుగ్రహం రావాలంటే దీపం వెలిగించాలి. ఏ గురు అనుగ్రహంతో సాయి అంతటి వాడయ్యాడో, ఆ శక్తినే సాయి మీకు ఇస్తారు. 12 ఇటుకలతో గురుస్థానాలు పెట్టాలి. దానిమీద 5 దీపాలు, 5 అగరబత్తీలు వెల్గించండి. 12 ఇటుకలు ద్వాదశ రాశులకు, ద్వాదశ ఆదిత్యులకు, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, భాగవతములోని ద్వాదశ స్కంధాలకు ప్రతీకలు. 5 దీపాలు పంచదత్తావతారాలకు, పంచతత్వాలకు ప్రతీకలు, అలానే శ్రీరామశర్మ ఆచార్యగురుదేవుల పంచవీరభద్రులకు ప్రతీక. 5 దీపాలు వెలిగించాక 1 మాల గాయత్రీ, 1 మాల మహాలక్ష్మీమంత్రం చేయాలి.

### గురుస్థానాల స్థాపనా మహోత్సవాలు

1) ఇలా ప్రతి ఇంటిలో గురుస్థానాలు స్థాపించాలి. 2) 1 లక్ష గురుచరిత్ర / సాయిచరిత్ర లేదా మీకు ఇష్టమైన ఏ గురుచరిత్రనైనా సాప్తాహిక పారాయణ చెయ్యాలి. ఈ నెలలో మీరు చేసే ఈ సాధనల ప్రభావం ఆరువేల సంవత్సరాల పాటు మీకు అండగా ఉంటుంది. 29-12-05 నుంచి 01-01-2006 వరకు రాజా ఇంజనీరింగ్ కాలేజిలో, శివగంగరోడ్డు, మధురైలో జరిగే

అశ్వమేధ యజ్ఞము యొక్క శక్తి మీ యజ్ఞకుండాలలోకి దిగుతుంది. దాని ప్రభావం మీ జీవితాలలో వెలుగులను నింపుతుంది. ఈ గురుస్థానాలను ఎన్నాళ్ళు పెట్టుకోవాలి? అనే ప్రశ్నకు – గురువును మీ ఇంట్లో పెట్టుకున్నాక ఎంత తొందరగా వెళ్ళిపోతాడు అని చూస్తారా? లేకపోతే శాశ్వతంగా మీ దగ్గరే ఉంచుకోవాలని చూస్తారా. గురుస్థానం మీ శరీరానికి ప్రతీక. మీరు ఎన్నాళ్లు జీవిస్తారో అన్నాళ్లు పెట్టుకోవాలి. గురువులందరి ప్రణాళికా ఒక్కటే! అదే దైవీప్రణాళిక. ఆ ప్రణాళికలో భాగస్వామ్యం పొందటానికే ఇలాంటి సాధనా విధానాలను అందించారు. **పరమగురువులెప్పుడూ అందరికి హితం చేకూర్చే ఓర్పుతో కూడిన ప్రేమను ప్రదర్శిస్తారు.**

## రాబోయే విపత్తుల నివారణ ఎలా?

09-10-2005వ తేదీన న్యూస్‌పేపర్‌లో వచ్చిన ఈ సూర్యగ్రహణం, చంద్రగ్రహణం, కుజగ్రహం భూమికి దగ్గరగా వస్తున్నదనే వార్త చాలా పెద్ద సంచలనాన్ని సృష్టించింది. ఈ పేపర్లలో వ్రాసిన పరిస్థితులకంటే ఇంకా ప్రమాదకరమైన పరిస్థితులు వస్తాయని సైంటిష్టులు, జ్యోతిర్విజ్ఞానవేత్తలూ ఇంకా భవిష్యవేత్తలందరూ ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నారు. వాటిని నివారించగల సూత్రాలేవి తమ వద్దలేవని సైంటిస్టులు చేతులు ఎత్తేశారు. అయితే ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి మానవాళి రక్షణ పొందే విధానాన్ని శ్రీశ్రీ మాస్టర్‌గారు అనేక రకాల దివ్య ప్రణాళికలను అమలు పరచటం ప్రారంభించారు. మనకంటూ ఏదైనా ఒక లక్ష్యమంటూ వున్నప్పుడు దానిని సాధించటానికి సరైన ప్రణాళికంటూ ఒకటి ఉండనే వుంటుంది. లక్ష్యాలనేవి ఎప్పుడూ దివ్య ప్రణాళికకు అనుగుణంగానే ఉంటాయి.

లక్ష్యాన్ని సాధించడం కోసం ఉపయోగపడే జీవితాన్ని లక్ష్యసిద్ధినిచ్చే జీవితం అంటాము. ఒక్కసారి లక్ష్యమంటూ ఒకటి ఏర్పడితే మన సమయం, శక్తి, వనరులు, ప్రతిభ అన్నీ ప్రయత్న పూర్వకంగా ఆ లక్ష్యసిద్ధికోసం ఉపయోగించబడతాయి. ఈనాటి ఈ విపత్కర పరిస్థితుల నివారణ మన ఏకైక లక్ష్యం. దాని కోసం శ్రీశ్రీ మాస్టర్‌గారు మొదటగా తీసుకున్న సాధన, లక్ష యజ్ఞాలు చేయించడం. దాని కోసం వారు అత్యంత సరళమైన సాధనా విధానాలను ఈ క్రింది విధంగా అందించారు.

**ఇంటింటా గురుస్థానం:** భారతదేశంలో ప్రతి ఇంటా ఈ గురుస్థానాలు వెలుగుతూ ఉండాలి. గురుస్థానం అంటే గురువు యొక్క అనుగ్రహాన్ని పొందే స్థానము అని అర్థం. ఇవి భాగవత

విద్యకు, శిర్డిసాయి మరియు శ్రీరామశర్మ ఆచార్యగారి అనుగ్రహానికి ఆధారభూతమైన కేంద్రస్థానాలు.

ఇంటింటా ఇలా చేయడం వల్ల సమస్తవాస్తు దోష నివారణ, గ్రహ, నక్షత్ర శాంతి జరిగి సుఖశాంతులు లభిస్తాయి. చెప్పాలంటే ఇలా చేస్తే పంచవీరభద్ర సాధనలో పాల్గొన్నట్లే. దాని వలన పంచకోశాలు ఆ పవిత్రతను పొందుతాయి. ఇలా వెలిగించిన దీపాలు 2 నిమిషాలు వెలిగినా చాలు. ఇంకా గురువు అనుగ్రహం ఎప్పుడు పనిచేస్తూందంటే దాని మీద దీపాలు వెలిగించినప్పుడు. ఇటుకను, అగ్నిని ఉపయోగించుకునే విద్యను మన భారతీయ ఋషులు యజ్ఞవిద్యగా అందించారు. పరమగురువులు, ఋషులు చెప్పేది ఏమిటంటే గాయత్రీ మంత్రాన్ని యజ్ఞముతో కలిపి చేసుకుంటే వాతావరణ కాలుష్యము తొలగిపోతుంది. ఇంత పెద్ద విశాల భారతదేశ వాతావరణము పరిశుద్ధి కావాలంటే ఏ నలుగురు, ఐదుగురో చేస్తే లాభము లేదు. ఆ పని చెయ్యటానికి పెద్ద సంఖ్య కావాలి.

**గాయత్రీ మంత్రము:** గాయత్రీ మంత్రము యొక్క ఆవశ్యకత ఏమిటో తెలుసుకోవాలి. ధూమపానము హానికరము అని అట్టమీద వ్రాసి అమ్ముతున్నా ప్రజలు దాని వాడకాన్ని ఆపడం లేదు. ఇంకా అలాంటి వ్యసనాల నుండి బయట పడటానికి గాయత్రీ మంత్రము ఎంతో ఉపకరిస్తుంది. నిరంతరం దానిని ఉపాసన చేయటం నేర్చుకోవాలి. దీనినే జీవించే కళ అంటారు. మనస్సును లొంగదీసుకునే మంత్రము "హే సూర్యదేవా! మాలోని అంధకారాన్ని తొలగించి మమ్ములను సన్మార్గములో నడిపించు" అనుకున్నా చాలు మార్పువస్తుంది.

**శ్రీమహాలక్ష్మీ మంత్రము:** శ్రీవిద్యారణ్యస్వామివారు శ్రీమహాలక్ష్మీ సాధన, ఉపాసనలతో సుస్థిరమైన విజయనగర సామ్రాజ్య స్థాపనను చేయగల్గారు. మహాలక్ష్మీ అంటే పరిపాలనా శక్తి. బాధ్యతను స్వీకరించగలిగే సాహసం వస్తుంది. మహాలక్ష్మీ మంత్రం అంతరంగ శక్తిని జాగృతం చేస్తుంది. కమలే కమలాలయే అంటే మానవశరీరంలో ఆరు కమలాలున్నాయి. అవి జాగృతం కావాలి. ప్రసీద-ప్రసీద అంటే ఈ శరీరం దైవీచేతనత్వానికి, గురుప్రణాళికకు అంకితమగుగాక అని అర్థం. మన సంస్కృతిలో అష్టలక్ష్మీ వైభవం గురించి అనేక స్తోత్రాలలో, అనేక విధాలుగా కీర్తించడం ఉన్నది. అష్టలక్ష్మీ అనేది గీతలో చెప్పినట్లు భూమి, ఆపో, అనలో, వాయుః, ఖం, మనో, బుద్ధి, అహంకారాలు. వీటి ద్వారా నిరంతరం దైవీ ప్రణాళికలను చేరువకాగలిగే మహా

మంత్రం శ్రీమహాలక్ష్మీ మంత్రం. దీనినే ధనమగ్నిః, ధనంవాయుః, ధనం సూర్యో, ధనం వసుః అని శ్రీసూక్తంలో చెప్తారు. మహాలక్ష్మిని సంపదలంటారు. సంపదల రూపంలో దర్శించాలంటే ప్రకృతి శక్తుల ఉపాసన ద్వారా వాటిశక్తిని పొందవచ్చు.

**అలానే ఆపదల నివారణకు:**

**ఓం కృష్ణాయ వాసుదేవాయ హరయే పరమాత్మనే**
**ప్రణత క్లేశనాశాయ గోవిందాయ నమో నమః ఓం ॥**

ఎలాంటి ఆపదలనైనా, కష్టాలనైనా దాటించగల అద్భుతమైన మంత్ర రాజమిది. "క్లేశ"అనే పదం, కారాగార శిక్షను అనుభవిస్తున్న వారిని సైతం బయట పడవేయగల దివ్యనామము. చెరసాలలో బందీలుగా వున్న రాజులకు తరుణోపాయంగా ఈ మంత్రాన్ని నారదమహర్షి దీక్షగా ఇచ్చినట్లు భాగవతంలో ఉన్నది. పరమాద్భుత మంత్రమిది. దీనిని చేసుకోవచ్చు.

ఇప్పుడున్న కాలుష్యం ఎంతో కాలం ఉండదు. ఈ ఐదు దత్తావతారాలు 'శ్రీనృసింహసరస్వతీ స్వామి, శ్రీపాదశ్రీవల్లభులు, మాణిక్య ప్రభువు, అక్కలకోట మహారాజ్, శిరిడీసాయి' వీళ్ళందరి శక్తిని యజ్ఞవిద్య ద్వారా, పంచవీరభద్రసాధన ద్వారా శ్రీరామశర్మ ఆచార్య పరమోత్తమమైన దివ్య శక్తిని అంతరిక్షంలో నిలిపివుంచారు. ఆ శక్తిని క్రిందికి దింపటానికి ఈ చిన్న యజ్ఞమును ఇంట్లో చేసుకుంటే చాలు. ఇంతకంటే ఇంకేమి చేయనక్కర్లేదు, స్విచ్ ఆన్ చేసుకోవటమే. **కుండలినీ జాగరణకు సంబంధించిన అనేక రహస్యాలు యజ్ఞకుండములో ఉన్నాయి. యజ్ఞకుండము యొక్క నాలుగు దిక్కులు మరియు మధ్య ప్రదేశము ఐదు తత్వాలకి ప్రతీకలు.**

**ఎలాగంటే ఇటుక - పృథ్వీతత్వం, నెయ్యి - జలతత్వం, దీపం - అగ్నితత్వం, అగరుబత్తి - వాయుతత్వం, మంత్రోచ్చారణ - ఆకాశతత్వం.** దానినే లలితాసహస్రంలో పంచమి, పంచభూతేషు పంచ సంఖ్యోపచారిణీ అని వర్ణించారు. ఇంకా చెప్పాలంటే ఐదు దీపాలు పంచవీరభద్రులకి ప్రతీక. ఇలా ఐదు దీపాలు, ఐదు రకాల దివ్యశక్తులకు ప్రతీకలుగా వెల్లడించాలి. 12 ఇటుకలు ఎందుకు అంటే ఇటుకకు, మనిషి ఆలోచనకు ఇంకా వారి కోరికలు తీరడానికి చాలా దగ్గర సంబంధం ఉన్నది. యజ్ఞకుండం మూలాధారానికి ప్రతీక. కుండీ అంటే పిట్, అక్కడ రెండు ఎముకలుంటాయి. వాటికి ప్రతీకలుగా క్రింద ఆరు + పైన ఆరు ఇటుకలు పేరుస్తారు. క్రింది 6

ఇటుకలు, దక్షిణాయణం, పైన 6 ఇటుకలు ఉత్తరాయణం. సాలిగ్రామంలో రాయి, విష్ణువుకు ప్రతీక అయినట్లే ఇటుక, గురువుకి, గురువు అనుగ్రహానికి ప్రతీక. ఇది మీ శరీరాలకి ప్రతీక. మీరు ఎన్నాళ్ళు జీవిస్తారో అన్నాళ్ళు పెట్టుకోవాల్సిందే. గురువులందరి ప్రణాళిక ఒక్కటే. అదే దైవీ ప్రణాళిక. దీన్ని అర్థం చేసుకొని ఆ దైవీ ప్రణాళికలో మొత్తం మానవజాతి భాగస్వాములమైతే శాశ్వతంగా గురువు అనుగ్రహానికి పాత్రులుకాగలరు.

దానికోసం శ్రీశ్రీ మాస్టర్‌గారు "గురుచరిత్రల అఖండ పారాయణ" అనే సాధనా క్రమాన్ని ప్రాచుర్యంలోకి తేవాలని ప్రయత్నించారు. అలాగే శ్రీశ్రీ మాస్టర్‌గారు కొన్ని లక్ష్యాలను పంచవర్ష ప్రణాళికల రూపంలో ప్రవేశపెట్టారు.

అందులో **మొదటగా ఒక లక్షయజ్ఞాల ప్రణాళిక.** ఇది ఇంటింటా గురుస్థానాల స్థాపన ద్వారా అత్యంత త్వరిత గతిలో, చాలా సులువుగా కార్యాచరణలోకి వచ్చేసింది.

**దీని తరువాత లక్షగురుచరిత్రల పారాయణాక్రమము.** సహస్రాధిక గురుచరిత్రల పారాయణా క్రమమును, మాస్టారిచ్చిన ప్రేరణతో మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో 2006 జనవరి నుండి గ్రామాలలో, నగరాలలోని వారు తమకు నచ్చిన గురువుల చరిత్రను వ్యక్తిగతంగా, వీలైతే సామూహికంగా ఒక ప్రభంజనం మాదిరి పారాయణ చేశారు. ఈ పారాయణల పూర్ణాహుతిని పురుషోత్తమపట్నంలోని శిరిడీసాయి మందిరంలో ఏప్రియల్ 13,14,15 తేదీలలో పూజ్యశ్రీ మాస్టర్‌గారే స్వయంగా నిర్వహించారు. ఆలయఅర్చకస్వామి శ్రీనారాయణస్వామిగారి కోరిక మేరకు పూజ్యశ్రీ మాస్టర్‌గారు "లక్ష గురుచరిత్రల పారాయణా వైభవాన్ని" శ్రీశిరిడిసాయి సన్నిధిలో మూడురోజుల పాటు అత్యద్భుతంగా వివరించారు.

**మూడవ లక్ష్యం, ఒక లక్ష విశ్వఏకీకరణ యజ్ఞాలు జరగాలి. ఈ మూడే కాకుండా శ్రీమహాలక్ష్మి సాధన మరియు గోమాత మంత్ర జపం కూడా లక్షల సంఖ్యలో ఈ నెల అక్టోబరు నుండి డిసెంబర్ 15వ తేదీ లోపల జరగాలనే ఒక టార్గెట్ ఇచ్చారు.** ఈ సాధనలన్నీ క్రియాన్వితం చేయటానికి ఎంతో సరళమైన దగ్గర మార్గాలను కూడా వారే సూచించారు. ఆ ప్రకారంగా అనుకున్న సమయానికి అన్ని సాధనలు పూర్తయిపోయి డిసెంబరు 15వతేదీకి పూర్ణాహుతులను కూడా చేయడమనేది మాస్టర్‌గారి సంకల్పబలానికి మరో మైలురాయి. ఎంతో స్థితప్రజ్ఞతతో ఆరోగ్యాన్ని

సైతం లెక్కచేయకుండా ఊరు, ఊరు తిరుగుతూ పూర్తి చేయదలుచుకున్న లక్ష్యాలను పూర్తి చేయటమనేది మాస్టర్‌గారిలో గల శ్రద్ధ, నిష్ఠలకి ప్రత్యక్ష నిదర్శనం.

## హైదరాబాద్‌లో సహస్ర కుండీయజ్ఞాలు

మాస్టర్‌గారు 'గురుదేవుల ఉద్బోధన- జాగృతాత్మల బాధ్యత' అనే (గురుదేవుల విదాయి సందేశం) అంశంపై అక్టోబర్ 28వ తేదీ నుండి హైదరాబాద్‌లోగల 'ఘోషామహల్' ఆవరణలో ప్రవచనాలు చెప్తున్నారు. అదే ఆవరణలో 30వతేదీన జరుగబోయే సహస్రకుండీ యజ్ఞశాలలో తాత్కాలికంగా శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని ఏర్పాటు చేసి అక్కడ శ్రీమహాలక్ష్మీ మంత్రజపం, దాంతో పాటు పరిక్రమాపథంలో ప్రదక్షిణలు కూడా మొదలెట్టించారు. ఈ కార్యనిర్వహణ బాధ్యతను శ్రీయుగంధర్, విజయశ్రీగార్లకు అప్పచెప్పారు. మాస్టర్‌గారి సూచనల మేరకు వారు ఎంతో సమర్థతతో అన్ని ఏర్పాట్లను చేశారు.

అనుకున్న ప్రకారం 29వ తేదీ సాయంత్రం శోభాయాత్ర, 30వ తేదీ ఉదయం 10గంటలకు సహస్రకుండీ శ్రీమహాలక్ష్మీ సాధనా పూర్ణాహుతి యజ్ఞం జరగాలి. కలశయాత్ర యథావిధిగా జరిగిపోయింది. ఇంక ఇక్కడ కూడా షరా మామూలే. అగ్నిదేవుడికి, వరుణదేవుడికి మధ్య హోరాహోరీ పోరాటం. ఒక ప్రక్కన వర్షం కురియడానికి మేఘాలు కమ్ముకొని వస్తున్నాయి. అయినా వేదిక మీద మాస్టర్‌గారు కూర్చొని కార్యక్రమాన్ని ప్రశాంతంగా కొనసాగిస్తున్నారు. శ్రీమహాలక్ష్మీ సాధన - పూర్ణాహుతి ఎప్పుడు, ఎక్కడ జరిగినా 'అమ్మ' తన ఆవాసాన్ని చిక్లీత వసమే గృహే అనే ప్రమాణాన్ని సార్థకం చేసుకుంటుంది. అమ్మ తన దయను, ఆశీర్వాదాలను ఆ రూపంలో కాక మరింకే రూపంలో చూపిస్తుంది చెప్పండి! తల్లి అనుగ్రహంతో తనయుడు కూడా తన కర్తవ్యాన్ని, ఎంతో నిష్ఠతో ఏ విధమైన విఘ్న, విరామం లేకుండా కొనసాగిస్తూనే ఉన్నారు. అదీ అక్కడ జరుగుతున్న విచిత్రం. ఎంతో ఘనంగా పూర్ణాహుతి కార్యక్రమం పూర్తైంది. ఎంతో పట్టుదలతో కృషిచేసి ఇంత అద్భుతంగా ఈ కార్యక్రమాన్ని చేసిన శ్రీయుగంధర్, విజయశ్రీగార్లకు ఆశీస్సులనిచ్చి, మళ్ళీ అదేరోజు సాయంత్రం సనత్‌నగర్‌లో గల హనుమాన్ దేవాలయంలో జరిగే సహస్రకుండీ యజ్ఞానికి పూజ్యశ్రీ మాస్టర్‌గారు బయల్దేరారు. సాయంత్రానికి వర్షం పూర్తిగా వెలిసింది.

ఆ సాయంసంధ్యవేళ ఎంతో చల్లని, ఆహ్లాదకరమైన వాతావరణంలో హనుమాన్ ఆలయ ప్రాంగణం విద్యుద్దీపాల కాంతితో దేదీప్యమానంగా, అత్యంత కమనీయంగా, హాయిగా ఆనందాన్నిచ్చే

విధంగా ముస్తాబైంది. అందంగా అలంకరించిన వేదిక మీదికి సర్వసాక్షి అయిన శ్రీశ్రీ మాస్టర్‌గారు చంద్రకాంతిని పోలిన ధవళవస్త్రాలను ధరించి సరస్వతీదేవి యొక్క అపర పురుషావతారంగా ఆ ఆలయ పూజారుల పూర్ణకుంభ స్వాగత లాంఛనాలతో యజ్ఞశాలలోకి వచ్చారు. ప్రకృతి ప్రశాంతంగా వుంది. అంతే శాంతస్థితిలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు 1008కుండీల మహాకాల దీపయజ్ఞాన్ని నిర్వహించారు. అందరికీ ఎంతో సంతృప్తిని కలిగించే విధంగా, ప్రశాంతంగా యజ్ఞపూర్ణాహుతి జరిగిపోయింది. అంత అందంగా చక్కగా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసి, తగిన ఏర్పాట్లను చేసిన శ్రీలక్ష్మి, తేజశ్రీ, సావిత్రీ, అనూషా వాళ్ళకు ఆశీర్వాదాలనందచేశారు. అప్పటివరకు ఉపవాస దీక్షలో ఉండి పరదేవతా అనుగ్రహంగా ఈ రెండు యజ్ఞాల మహాపూర్ణాహుతిని పూర్తి చేశాక యజ్ఞ ప్రసాదంగా ఆహారాన్ని స్వీకరించారు. దివ్యాత్ములైన వారు అలా ఏ పనినైనా అత్యంత శ్రద్ధ, నిష్టలతో చేసేవారు.

## శ్రీమహాలక్ష్మి కోటిజప మంత్రదీక్షలు

శ్రీమహాలక్ష్మి సాధన పరమాద్భుతాలను సృష్టిస్తున్నది. ఎంతో ఉజ్వలంగా జనసామాన్యంలోకి చొచ్చుకుపోతోంది ఈ సాధన. ఆరువేల సంవత్సరాలకొకసారి మాత్రమే వచ్చిన ఈ మహత్వ పూర్ణకాలాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచిదనే ఉద్దేశ్యంతో శ్రీశ్రీ మాస్టర్‌గారు శ్రీమహాలక్ష్మి కోటి మంత్రజప దీక్షను హైదరాబాదు పట్టణంలో వేర్వేరు ప్రాంతాలలో వందలాది మందికి దీక్షల నిచ్చారు. మహాలక్ష్మి అంటే ప్రపంచాన్ని పాలించే వ్యక్తి యొక్క శక్తి. విష్ణువు ప్రపంచాన్ని శాసిస్తాడు. ఆ విష్ణువు యొక్క శక్తి మహాలక్ష్మి అంటే ఆ మహాలక్ష్మి ఏమి చెయ్యాలి? పరిపాలనాశక్తినివ్వాలి. సరైన పరిపాలనా వ్యవస్థ ఈనాడు ప్రపంచంలో ఏ దేశంలోనూ లేదు.

భారతదేశంలో ఈనాడున్న ఈ పరిస్థితులను చక్కదిద్దటానికి మహాలక్ష్మి సాధన చేయడం ఎంతో అవసరం. శ్రీమహాలక్ష్మి ఉన్నచోటనే శ్రీమహావిష్ణువు ఉంటాడు. కనుక శ్రీమద్భాగవత సాధన కూడా చేయవల్సిన అవసరం ఉందనే ఉద్దేశంతో భాగవత సప్తాహాలను కూడా ప్రారంభించారు. తమాషా ఏమిటంటే ఎక్కడైతే సహస్రాధిక శ్రీమహాలక్ష్మి సాధనలు మొదలెట్టారో అక్కడి నుంచే ఈ భాగవత సప్తాహాన్ని ప్రారంభించారు. బాపూజీ గోసంరక్షణశాల, ఒంగోలు నుండే భాగవత సప్తాహం ప్రారంభమైంది. మనకు తెలిసినా తెలియకపోయినా అదంతా ప్రకృతి నియతియే!!

# VI శ్రీకృష్ణ: లలితాంబికా

## అధ్యాయం-11
## శ్రీమద్భాగవత మహాయజ్ఞాలు

### శ్రీమద్భాగవత సప్తాహాల ప్రభంజనం

ఒక వైపున జగన్మాత శ్రీమహాలక్ష్మీ-పారాయణ పరంపరలు జరుగుతుంటే, మరొక ప్రక్కన శ్రీకృష్ణులవారి దివ్యచరిత్రను సాధక లోకానికందించటానికి హైదరాబాద్, సనత్‌నగర్‌లో వున్న హనుమాన్ దేవాలయంలో నవంబరు 4వతేదీ నుండి 'శ్రీమద్భాగవత వైభవాన్ని' అద్భుతంగా చెప్పడం మొదలెట్టారు. ఏది చెప్పినా దానిని సహేతుకంగా అందరూ నిత్యజీవితంలో దానిని ఆచరించే విధంగా చెప్పడమనేది మాస్టారికి వెన్నతో పెట్టిన విద్య. శ్రీమహాలక్ష్మితో పాటుగా శ్రీకృష్ణులవారి దివ్యలీలలను సమన్వయం చేయడం సాధనలో అదొక కళగా సృజనాత్మక చైతన్యానికి అదొక అద్భుతమైన మలుపుగా అభివర్ణిస్తూ 11వ తేదీన దివ్యమైన పూర్ణాహుతిని చేయించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీమతి తేజశ్రీ ఏర్పాటు చేశారు. ఇదే విధంగా ఈ సప్తాహాలను అపూర్వంగా అనేక ప్రాంతాలలో చేయడం జరిగింది.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు గొప్ప 'క్లీం' బీజ సాధకులు. భగవత్స్వరూపమైన కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనేది మనం మాస్టారిని చూసి నేర్చుకోవాలి. ఆరువేల సంవత్సరాల తరువాత వచ్చిన ఈ మహత్వపూర్ణకాలాన్ని సాధనాశిబిరాలతో, సహస్రకుండీయజ్ఞాలతో, భాగవత సప్తాహాలతో, మంత్రదీక్షలనివ్వటంతో పాటు ఇంకా ఇతర సంస్థల వారితో కలిసి తమ అఖండమైన ప్రజ్ఞను, జ్ఞానగంగ రూపంలో ప్రవహింపచేశారీ మహాతపస్వి, మహాయోగి. "యోగస్థ: కురుకర్మాణి" అనే గీతావాక్యాన్ని శతధా, సహస్రధా ఆచరణలో పెట్టిన మహాయోగీశ్వరులు మన మాస్టర్‌గారు.

సహస్రకుండీ యజ్ఞాల పరంపరలో పూజ్యశ్రీ మాస్టర్‌గారి ఆదేశాల ప్రకారం శ్రీమతి విజయ,

శ్రీవిశ్వనాథ్‌గార్లు వరుసగా మూడు పూర్ణిమలకు కూకట్‌పల్లి ఏరియాలో ఎంతో వైభవంగా మహాకాల యజ్ఞాలను విజయవంతంగా చేయడం జరిగింది. కాలాన్ని ఎంతలా సద్వినియోగం చేశారనేదానికి ఉదాహరణ ఏమిటంటే, వారు ఉదయం పూట శత, సహస్రకుండీ యజ్ఞాలలో తమ ప్రవచనాలతో భక్తులను సమ్మోహితులను చేస్తూనే, సాయంత్రం పూట థియోసాఫికల్ సొసైటీ కార్యదర్శి అయిన శ్రీసంజీవరావుగారి ఆహ్వానం మేరకు గుంటూరు థియోసాఫికల్ లాడ్జిలో 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు బ్లావెట్స్కీ మాత వ్రాసిన 'ది వాయిస్ ఆఫ్ సైలెన్సు' అనే పుస్తకం మీద అద్భుతమైన ప్రవచనామృతమందించటం మరోవిశేషం.

## శిరిడీలో సాధనా శిబిరం

ఊపిరి సలపని రీతిలో కార్యక్రమాల నిర్వహణలో నిమగ్నమైన శ్రీశ్రీ మాస్టర్‌గారికి కొంత వైద్యసౌకర్యం అవసరమైంది. శ్రీమతి శ్రీలక్ష్మిగారు హైదరాబాదులో తమకు బాగా తెలిసిన 'నేచరు క్యూరు' హాస్పిటలులో మాస్టర్‌గారిని చేర్పించి చక్కటి వైద్యసౌకర్యాన్ని కలుగ చేశారు. 15రోజుల పాటు అక్కడ చక్కటి వైద్యం, దాంతోపాటు ఆహారాది విషయాలలోకూడా శ్రద్ధ తీసుకోవటంతో మాస్టర్‌గారిలో మునుపటి ఉత్సాహం వచ్చేసింది. మళ్ళీ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. అత్యవసరంగా శిరిడీలో సాధనాశిబిరం జరగాలని, దానికి తగిన ఏర్పాట్లను అంటే టిక్కెట్ల రిజర్వేషను మొదలైన విషయాలను వీలైనంత త్వరలో ఏర్పాటు చేయమనీ చెప్పారు. శ్రీరంగనాథంగారు నవంబరు 20 నుండి 25వతేదీ వరకు, ముందుగా శిరిడీకి, అక్కడి నుండి మెహరాబాదుకు తరువాత ఆళంది మొదలైన ప్రదేశాలను చూడటానికి వీలుగా ప్రణాళికను తయారుచేశారు. అనుకున్న ప్రకారం ముందు శిరిడీ సాయినాథుని దర్శించుకుని అక్కడ నుంచి మెహరాబాదులో శ్రీమెహర్‌బాబావారి సమాధి, లైబ్రరీలు చూశారు. ఎక్కడ సమాధి వున్నా మాస్టర్‌గారు ధ్యానం చేయకుండా రారు. తర్వాత భక్త తుకారాం జీవించిన గ్రామం ఆళంది. ఆ మహాత్ముడు సశరీరంగా ఉచ్చ లోకాలకు వెళ్ళారు. ఏ ప్రదేశం నుండి అయితే ఆయన అంతరిక్షంలోకి వెళ్ళారో ఆ ప్రదేశాన్ని చూడడం జరిగింది. ఈ ప్రదేశాలలో ఒక్కొక్క రోజు సాధనాశిబిరం కుదరదు కనుక అలాంటి వాతావణంలో మాస్టారిచ్చే చక్కటి ప్రవచననాలతో పాటు ఆయాప్రదేశాలలో ఆ ప్రాంతవైభవానికి అనుకూలంగా చిన్న,చిన్న సాధనలు చేయడం జరిగింది. ఇంక అక్కడి నుండి నేరుగా మాస్టర్‌గారు 25వ తేదీ ఉదయానికల్లా విజయవాడకు వచ్చేశారు.

## కెనడీ హైస్కూల్లో సహస్రకుండీ యజ్ఞం

26వ తేదీన విజయవాడలో సహస్రకుండీ యజ్ఞం వున్నది. అప్పటికే శ్రీమతి శ్రీలక్ష్మీ, శ్రీమతి శైలజగార్లు కెనడీ హైస్కూలు ఆవరణలో 26వ తేదీన జరుగవలసిన యజ్ఞానికి అన్ని ఏర్పాట్లను పద్ధతిగా తయారుచేసి ఉంచారు. స్కూలు ఆవరణంతా అందంగా అలంకరించబడి పిల్లలతో, పెద్దలతో ఎంతో సందడిగా కళకళ్ళాడిపోతూ శ్రీశ్రీ మాస్టర్‌గారి రాకకై అందరూ ఎదురు తెన్నులు చూస్తున్నారు. ఆ సాయంత్రం అందమైన వాతావరణంలో చల్లని, శీతల లేలేత చంద్ర కిరణాలు పృధ్విని పునీతం చేస్తున్న ఆ ప్రశాంత సమయంలో యజ్ఞోవై విష్ణు: అన్నమాదిరి దివ్యాత్మ స్వరూపులైన మాస్టర్‌గారు యజ్ఞశాల వేదిక మీదికి వచ్చారు. ఎంతో నిశ్శబ్దంగా వారు ప్రవచనం చెప్తూ, అందరితో చేయించిన ఈ విశ్వ ఏకీకరణ యజ్ఞం అపూర్వమైనది. మనసా, వాచా, కర్మణా ఈ యజ్ఞం చేసుకున్నవారందరూ చక్కటి దివ్యానుభూతులను పొందారు. అందరికీ ఎంతో ఆనందాన్ని, అనుగ్రహాన్ని ప్రసాదించింది ఈ మహాయజ్ఞం. ఎక్కడ యజ్ఞం జరిగినా శ్రీశ్రీ మాస్టర్‌గారి ఉపస్థితిలో కొంతమందికిలాంటి అనుభవాలు సర్వసాధారణంగా వస్తూనే ఉంటాయి.

### ఉపద్రవాల నివారణకు

ప్రపంచవ్యాప్తంగా వరుసగా సంభవిస్తున్న సునామీ, కత్రీనా, రీటా, హరికేన్‌విల్మా, తూఫానులు, భూకంపాలు, అతివృష్టి, అనావృష్టి, సూపర్‌సైక్లోనులు ఇవంతా అగ్రరాజ్యాలను సైతం గడగడలాడిం చేస్తున్న ఈ ప్రకృతి ఉపద్రవాల నుండీ మానవజాతి రక్షణ అనేది నేటి ఆధునిక విజ్ఞానవేత్తలకు సైతం ఒక సవాల్‌గా నిలిచింది. ప్రస్తుత గ్రహగతులు, ఈ పరిస్థితి ఇలాగే కొంతకాలం కొనసాగు తుందని సూచిస్తున్నాయి. ఈ ఉపద్రవాల తీవ్రత నుండీ సమస్త ప్రాణకోటినీ రక్షించేందుకు పరమ గురువులు మానవజాతికి ప్రసాదించిన ఆధ్యాత్మిక ఉపచారాలు ఎన్నైతే ఉన్నవో, వాటన్నింటినీ మాస్టర్‌గారు పొల్లుపోకుండా లక్షల, కోట్లసంఖ్యలో చేయించే ప్రణాళికను సర్వేసర్వత్రా అమలు చేస్తూ, అవిశ్రాంతంగా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూ అలా తిరుగుతూనే ఉన్నారు. అందులో భాగంగానే డిసెంబరు నెలలో కాత్రేనికోన, చింతలపూడి, ఒప్పులగుత్తం, వెదుర్లంక, రంగాపురం, తోటలపందరిలో బాబావారి ఆశ్రమం మొదలైన చోట్ల సాధనలతో పాటు మంత్రజపాలు చేయించటం 108 కుండాలలో విశ్వఏకీకరణ యజ్ఞాలను చేయిస్తూ అలా,అలా చివరగా అమలాపురానికి వచ్చారు.

# విగ్రహ ప్రతిష్ఠలు

## సకలకార్యసిద్ధి శ్రీహనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

ప్రకృతి విపత్తుల నివారణార్థం, లోకకళ్యాణార్థమనే సంకల్పంతో శ్రీరామానందస్వామివారు శ్రద్ధావంతులైన భక్తులతో 1కోటీ 25లక్షల హనుమత్‌గాయత్రీ మంత్రజప అనుష్ఠానం పూర్తి చేయించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీశ్రీ మాస్టర్‌గారి మార్గదర్శనంలో మహాపూర్ణాహుతి చెయ్యాలని శ్రీస్వామివారు కోరగా మాస్టర్‌గారు అమలాపురం వచ్చారు. డిసెంబరు 13వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీవేంకటేశ్వరమందిర ఆవరణలో 1008 కుండీలలో హనుమద్గాయత్రీ మహా యజ్ఞాన్ని అత్యంత శోభాయమానంగా, దివ్యంగా నిర్వహించారు. అదేరోజు సాయంత్రం 24 అడుగుల ఎత్తుగల సకలకార్యసిద్ధిహనుమాన్‌వారి విగ్రహావిష్కరణ కూడా పూజ్యశ్రీ మాస్టర్‌గారి అమృతహస్తాలతోనే చేయించారు. విగ్రహ ప్రతిష్ఠానంతరం మాస్టర్‌గారు మాట్లాడుతూ 'భవిష్య బ్రహ్మగా' శ్రీఆంజనేయస్వామివారి వైభవాన్ని వర్ణిస్తూ, ఆయనను ఆదర్శంగా తీసుకొని మనం ఎలా జీవించాలో చెప్తూ మన కర్తవ్యాన్ని కూడా గుర్తుచేశారు. ఇలా ఈ మధ్యకాలంలో మాస్టర్‌గారు సాయివిగ్రహాలను, హనుమద్విగ్రహాలను అనేక చోట్ల ప్రతిష్ఠించటం జరిగింది. ఇదే వరుసక్రమంలో భీమవరంలో శిరీష, శ్రీదేవిగార్లు ఏర్పాటు చేసిన సహస్రదీపయజ్ఞం చేశారు. ఆ మరునాడు 108 కుండీలలో గాయత్రీ యజ్ఞం చేసి అక్కడి నుంచి తేలప్రోలుకు వచ్చారు.

## తేలప్రోలులో సాయి విగ్రహప్రతిష్ఠ

శ్రీజి.ఎస్.కృష్ణగారు తేలప్రోలులో శ్రీశిరిడీ సాయికోసం మందిరాన్ని నిర్మించారు. అందులో 15వతేదీ ఉదయం శ్రీసాయివిగ్రహ ప్రతిష్ఠను పూజ్యశ్రీ మాస్టర్‌గారితో చేయించారు. అనంతరం గాయత్రీమహాయజ్ఞం పూర్ణాహుతీ అంతా కూడా వారి పర్యవేక్షణలోనే చేయటం జరిగింది. అదే రోజు సాయంత్రానికి పురుషోత్తమపట్నం చేరుకున్నారు. శ్రీనారాయణస్వామిగారు సాయి అనుగ్రహంతో, అక్కడ సాయిమందిర ఆవరణలో కట్టించిన 153 అడుగుల దత్తస్థూపావిష్కరణ మహోత్సవాన్ని అత్యంత రమణీయంగా వేలాదిమంది భక్తుల సమక్షంలో అఖండ భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఇంతవరకు తాము చేసిన కార్యక్రమాలకు ఇది పూర్ణాహుతిగా జరుగుతున్నదా, అన్నరీతిలో శ్రీదత్తాత్రేయస్వామివారి దివ్యసమక్షంలో 9 కోట్ల దీపప్రజ్వలన కార్యక్రమాన్ని కన్నుల పండువగా పూర్తి చేసుకొని రాత్రికి ఒంగోలుకు వచ్చారు.

ప్రకృతిలో అన్ని సరిగ్గానే జరుగుతుంటాయి. సరిగ్గా అదే రోజున ఒంగోల్లో శ్రీలక్ష్మీరాజగోపాల్ గారింట్లో జరిగిన నూతనగృహ ప్రవేశానికి హాజరై వారినాశీర్వదించి విందుభోజనం చేస్తూ, 'గత నాలుగు మాసాలుగా చేస్తున్న పరమగురువుల ప్రణాళిక మొత్తం ఈ నూతనగృహప్రవేశ విందు భోజనంతో ముగించటంలో పరమార్థముంది. మనం ఎప్పుడైతే ప్రకృతికి అనుగుణంగా జీవిస్తూ, దానికి తగినట్లు నడుచుకుంటామో, అప్పుడు ప్రకృతి మనకు అనేకరకాలుగా సహకరిస్తూనే వుంటుంది. ఇదే జీవిత పరమార్థం. గమనించుకుంటే అర్థమంతా అందులోనే ఉన్నదని' అన్నారు.

## కఠోపనిషత్తుపై ప్రవచనాలు

ఒకనాలుగైదురోజులు శ్వేతద్వీపంలో విశ్రాంతి తీసుకున్నాక మళ్ళీ సప్తర్షిఆశ్రమం, గుంటూరుకు బయల్దేరారు. ప్రతీరోజూ సాయంత్రం రెండుగంటల పాటు సప్తర్షిఆశ్రమంలో కఠోపనిషత్తు మీద ప్రవచనాలు చెప్పటం మొదలెట్టారు. చాలా రోజుల తర్వాత ఆశ్రమంలో మళ్ళీ జరుగుతున్న శ్రీశ్రీ మాస్టర్‌గారి ప్రవచనాలు వినటానికి సాధకులు పెద్దసంఖ్యలో వచ్చారు. అద్భుతంగా చెప్పిన ఈ ప్రసంగాలను శ్రీమతిలక్ష్మీరాజగోపాల్ చక్కటి పుస్తకరూపంలో తయారు చేసి అందరికీ అందించారు. ఈ కార్యక్రమాలు ఇంతటితో ఆగలేదు. మళ్ళీ హైదరాబాదులో వారి తమ్ముడు శ్రీవిశ్వనాథ్‌గారి ఆధ్వర్యంలో 'జీవనదేవతా సాధన' అనే గురుదేవుల వాఙ్మయం మీద డిసెంబరు 21,22,23 తేదీలలో అష్టలక్ష్మీ ఆలయంలో ప్రవచనాలు జరిగాయి. ఆ తరువాత శంబళసంపర్క కేంద్రంలో "మెనీమాన్షన్స్' మీద తరగతులు నిర్వహించారు. ఆ విధంగా 2005 ఆగష్టు నుంచీ డిసెంబరు వరకు ఊపిరి సలపనిరీతిలో కార్యక్రమాలు నిర్వహించి ప్రకృతి ప్రకోపాల నుంచీ మానవజాతిని రక్షించిన మన మాస్టర్‌గారి ప్రజ్ఞగురించి ఎంతని చెప్పగలం? అంతటి హార్ట్ఎటాక్ నుంచీ బయటపడి కూడా, విశ్రాంతి అనే పదాన్ని తమ నిఘంటువు నుండీ తొలగించి, ప్రకృతి అనుశాసనాన్ని శిరసా వహించి పరమగురువులందించే దివ్యప్రణాళికలను తమదైన బాణిలో విశ్వ కళ్యాణార్థం అలుపెరుగని రీతిలో, ఆ అనుగ్రహాన్ని సహస్రబాహువులతో పంచిపెట్టిన మహాపురుషులు డాక్టర్ శ్రీరామకృష్ణగారు. వారికి వారే సాటి.

## రాజసూయ గాయత్రీమహాయజ్ఞం

అది 2005వ సంవత్సరం. పూజ్య మాస్టర్‌గారు అస్వస్థత నుండి మెల్లిమెల్లిగా కోలుకుంటూ ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నారు. (హార్ట్ ఎటాక్ తర్వాత) మాస్టర్‌గార్ని చూడాలని శ్రీ నంబూరి

విశ్వనాథంగారు ఇంకా కొంతమంది పరివార్ సభ్యులు శ్వేతద్వీపానికి వచ్చారు. ఎక్కడున్నా, ఏ పనిని చేస్తున్నా మాస్టార్‌గారి ఆలోచనలు ఎప్పుడూ గురుదేవుల కార్యక్రమము మీదనే కేంద్రీకరించ బడివుంటాయి. అందులోనూ శ్రీవిశ్వనాథంగారితో ఎప్పుడు మాట్లాడినా ఏవైనా క్రియాశీలక సంభాషణలే జరుగుతుండేవి. అలానే ఆ రోజు కూడా గురుదేవులచే వ్రాయబడిన "రాజసూయ యజ్ఞం" పుస్తకాన్ని తెలుగులోకి అనువదించానని విశ్వనాథ్‌గారు చెప్పారు. దాని వ్రాతప్రతిని చూస్తూ మాస్టర్‌గారు "విశ్వనాథంగారు, దీనిని అచ్చువేయించాలి. అంతేకాదు, ఈనాడు రాజకీయ పరిస్థితులెంతో క్లిష్టంగా వున్నాయి. ముఖ్యంగా మనం ప్రజల దృష్టికోణాన్ని మార్చాలి. దాన్ని మార్చటానికి అశ్వమేధ-రాజసూయయజ్ఞ పరంపరను కొనసాగించాలి. మీరు ఈ బాధ్యతను స్వీకరించాలి అని చెప్పారు.

ఈనాటి ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజలే పరిపాలకులు. పూర్వపు యుగాలలో రాజులు, మహారాజులు, చక్రవర్తులూ అశ్వమేధ, రాజసూయయజ్ఞాలను నిర్వహించేవారు. కానీ ఈనాడు పూజ్యగురుదేవుల తపోశక్తి, ప్రాణశక్తుల సంయోగంతో ఆవిర్భవించిన శక్తిని అనుయాజగా వసుధైకకుటుంబాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఈ రాజసూయ గాయత్రీమహాయజ్ఞం మనం చేద్దాం" అని చెప్తూ మీరు తప్పక ఈ కార్యక్రమాలను ప్రారంభించాలని ప్రోత్సహించారు. శ్రీవిశ్వనాథ్ గారికి, శ్రీశ్రీ మాస్టర్‌గారి మాటంటే వేదవాక్కే! సరేనని ఒప్పుకున్నారు.

## రాజసూయయజ్ఞ శృంఖల

రాబోయే రెండు దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనో లేక ఇతర గ్రహాల చరిత్రలోనో గొప్ప మార్పు రాబోతోంది. ఈ పృథ్వీగ్రహం మీదికి ఇతర గ్రహవాసులు కూడా రావచ్చు. దానికి అంతర్గ్రహసమితి ఒకటి ఏర్పాటౌతుంది. అందుగ్గాను మనం గ్రహాలను, గ్రహాధిదేవతలను, ప్రత్యధి దేవతలను ఆహ్వానించాలి. దాన్ని ఇన్విటేషన్ అంటారు. దేవశక్తుల ఆహ్వానం, దేవ-పూజన, యజనాలతో చేయాలి. అందుకే రాజసూయంలో ఆయా దేవతలకు ఆహ్వానం, వారికి పూజ, సర్వతోభద్రపూజనం, యజనం ఆయా ప్రత్యేక మంత్రాహుతులతో చేయటం ఆచారం.

ఎప్పుడో ద్వాపరయుగంలో దేవర్షినారదుని ప్రోత్సాహంతో శ్రీకృష్ణపరమాత్మ దేవశక్తుల ప్రతీకలైన పాండవుల చేత రాజసూయయజ్ఞం చేయించాడు. జైత్రయాత్రలో అపరిమితంగా నిధులు

చేకూరాయి. ఇప్పుడు దానికి ప్రత్యామ్నాయంగా శ్రీవిద్యారణ్యస్వామివారు రూపొందించిన శ్రీమహాలక్ష్మిసాధనను గత కొన్ని సంవత్సరాలుగా అన్ని ప్రాంతాలలోనూ చేస్తున్నాము. దాంతోపాటుగా మాస్టర్‌గారు రూపొందించిన 'గాయత్రీ–లలితా–భాగవత విశ్వఏకీకరణ' యజ్ఞములు కూడా జరుగుతూనే వున్నాయి. వాటిని గురించిన వివరణ అశ్వమేధయజ్ఞము – అనుయాజ అనే పుస్తకంలో చూడవచ్చు. దాంతోపాటుగా శ్రీమహాలక్ష్మిసాధన పుస్తకం కూడా చదవాలి.

దివ్యపాలకవర్గం ఒకటి ఏర్పడి గ్రహాంతర నిర్దేశపాలన, మార్గదర్శనం సమకూరుస్తూనే వున్నదని దివ్యజ్ఞానులందరికీ తెల్సు. మానవజాతి మీనయుగంలో నుండి కుంభయుగానికి సాగే పరిణామక్రమాన్నే యుగపరివర్తనగా, ప్రజ్ఞాయుగావతరణగా మనం చెప్పుకుంటున్నాము. అందువల్లనే అణుధార్మికశక్తి ప్రకటితమైంది.

**మిత్రావరుణులు, అశ్వినులు అనేవారు** వశిష్ట, అగస్త్య రూపాలలో అవతరించారు. వారిద్దరూ కుంభసంభవులే. వారి ద్వారా క్రొత్త జాతి రూపొందుతున్నది. దానినే దేవరాజ్యం అంటారు. అందుకే పెద్ద ఎత్తున సామూహిక ఉపదేశాలు జరుగుతున్నాయి. పూజ్యగురుదేవులు పండితశ్రీరామశర్మఆచార్య, మాతాభగవతీదేవిగార్లు గాయత్రీమంత్రాన్నీ, యజ్ఞాన్నీ సార్వజనీనం చేశారు. దక్షిణాపథాన్నంతటినీ డా॥ శ్రీరామకృష్ణగారు నడిపిస్తున్నారు. వసుధైకకుటుంబ భావన వచ్చి తీరుతుంది. జాతులు, మతాలు ఒక్కటిగా కల్సిపోతాయి. వైవస్వతమనువు మైత్రేయుల మార్గదర్శనంలో వశిష్ట, అగస్త్యులు క్రొత్త జాతిని దేవరాజ్యాన్ని ధరిత్రిపై స్థాపిస్తారు. అదే భూమిపై స్వర్గావతరణ. దానికోసం ఈ రాజసూయ యజ్ఞ పరంపర కొనసాగింది.

## 2005వ సంవత్సరంలో జరిగిన కార్యక్రమాలు

2005 వ సంవత్సరంలో ఆగస్టునెల నుండీ డిసెంబర్‌నెలాఖరు వరకు కనీవినీ ఎరుగని రీతిలో ఈ యుగసంధి కాలంలో గురువుల ప్రణాళికలకు సక్రియ కార్యక్రమాల ద్వారా ఒక విశిష్టమైన మలుపును తీసుకొచ్చిన మన మాస్టర్‌గారు అదే వేగంతో ఇంకా చేయవల్సిన పనులకు సాధనాత్మకమైన ప్రణాళికను రూపొందించుకున్నారు.

ఇది యుగసంధికాలం. దీని ప్రభావం (1750 నుండి 2250) వేలాది సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ కాలంలో ఋషులైనా–సాధారణ మనుషులైనా ఒకేరకమైన పనులు చెయ్యాలి.

ఉదా: ఎవరైనా నిద్రలేవగానే ముఖం కడుక్కోవాలి, స్నానం చెయ్యాలి ఇంకా... అలా అన్ని పనులు ఒక రీతిరివాజు ప్రకారం జరిగిపోతాయి. ఇప్పుడు చేసే పని మనస్థాయికి సంబంధించినది కాదు. అది ప్రకృతికి సంబంధించినది. మానవజాతి మొత్తం ఈ యుగసంధి కాలంలోనే ఉన్నది. మీరు మళ్ళీ మానవజన్మను తీసుకోలేరు. తెలివైనవాళ్ళయితే ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తక్షణమే పనిలోకి దిగటం ఎంతో మంచిది. ఉదాహరణకు ఆనాడు స్వాతంత్ర్య సమర పోరాటంలో పాల్గొన్న వారి కుటుంబాలవారికి, నేటికీ సమాజంలో గౌరవ మర్యాదలున్నాయి. అలానే మీరు మీ భావితరాలకి బీజాలు వేసుకుంటున్నారు. ఇప్పుడు కనుక మీరు పనిచేసేటట్లైతే కోట్ల తరాలవారిక్కూడా అద్భుతమైన వరాలనిచ్చిన వారౌతారు. ఇలాంటి కాలం, ఇక మళ్ళీ రానేరాదు.

ఈ కాలం యొక్క గొప్పదనమేమిటంటే విశేషమైన శ్రమ చేయకుండానే పేరు పొందవచ్చు. రామునితో పాటు ఒక కోతి ఆయన పనిచేసింది. ఒక జటాయువు, సంపాతి వీళ్ళ పేర్లు ఈనాటికీ చెప్పుకుంటున్నాము. స్తోమతకు మించిన పేరు, గౌరవం వస్తుంది. ఉడతకూ పేరు వచ్చింది. కోతికీ పేరు వచ్చింది. అక్కడ చూడాల్సింది సామర్థ్యానికి తగినంత పని చేస్తున్నారా? లేదా? అని. సర్వసమర్థుడైన గురువుకు మీ గురించి అంతా తెలుసు.

శ్రీకృష్ణుణ్ణి గుర్తించి వుంటే ఆనాడున్న చాలామంది దుర్యోధనుని పక్షంలోకి చేరి యుద్ధం చేసేవారే కాదు. యథార్థానికి అర్జునుని బంధువులందరూ ఆయనకు శత్రువులే గదా? బాంధవ్యాలు వదులుకోమనటం లేదు. కానీ వాలిసుగ్రీవులను చూడండి. ఇద్దరు భగవదాంశతో పుట్టినవాళ్ళే. పరిస్థితుల నవగాహన చేసుకోండి. ఈ అవకాశం మీకు ఇంక రాదు. రాబోయే జన్మలో పని ఇంకా కష్టంగా వుంటుంది. కూల్చటం సులభమే కాని కట్టడం అంటే కష్టమే గద! ఈ జన్మ తర్వాత మీరు గురువుల ప్రణాళికలో పాలుపంచుకోవాలంటే ముందు మీరు 3 విషయాలు నేర్చుకోవాలి.

వేదవిజ్ఞానం అర్థం కావాలంటే చదువులు అక్కరలేదు. కావాల్సిందేమిటంటే ఆర్తి, ఆవేదన, తపన! అవి వుంటే చాలు. అవతారాలు గానీయండి, గురువులు కానీయండి–వీళ్ళంతా ఈ భూమ్మీదకు ఎందుకు వచ్చారని? మీ కోర్కెలు తీర్చటం కోసమేనా? కాదు. వాళ్ళేదో మీకు నేర్పటానికి వచ్చారు. శిరిడీసాయి, సత్యసాయి మొదలగు పరమగురువులతో పాటు మనమూ ఆనాటినుంచి పుడుతూనే వున్నాము. ఇది గీతలో శ్రీకృష్ణుడు చాలా స్పష్టంగా చెప్తాడు గద.

**"బహూనిమే వ్యతీతాని జన్మాని తవచార్జున"** అని గుర్తుతెచ్చుకోండి – ఇంత చెప్తున్నా లేచి నిలబడలేకపోతే ఎలాగ? మీ యోగక్షేమాలను నేను చూస్తానని ఆయన చెప్తూనే వున్నాడు గద.

ఈ మహావాహినిలో చేరిపోండి. అన్ని పన్లు చేయలేరు. ఏదో ఒక పనిని ఎన్నుకోండి – "వందే వేదమాతరం"– భూమిలోకి ఇరుక్కుపోయిన ఆ వేదవిజ్ఞానాన్ని బయటకుతీయండి. దానికి మీరు చేయవల్సింది ఒక్కటే. "గాయత్రీమంత్రం" – మీరు చెయ్యండి. అందరి చేతా చేయించండి. ప్రచారం చెయ్యండి. అనుష్ఠానాలు చెయ్యండి. 1 సంవత్సరం పాటు చేస్తే గుర్వనుగ్రహం కలుగుతుంది. ఈ యుగసంధికాలం కేవలం ఇంకొక 5 సంవత్సరముల వరకు మాత్రమే ఉంటుంది. 2011 సెప్టెంబరు 11 చాలా శక్తివంతమైనది. ఇది గురుదేవుల జన్మశతాబ్దిపర్వము కనుక. బీజాలు నాటటానికి చాలా తక్కువ సమయముంది. ముందు 1 సంవత్సరం పాటు చేద్దాం. ఈ అనుష్ఠాన సాధనను ముందు మీరు మొదలుపెట్టండి.

వేదమాత–వేదవిజ్ఞానం కావాలి. 1 సంవత్సరం పాటు మీ కోరికలు తీరాలీ అని అనుకోవటం మానేసి గురుప్రణాళికను ఒక విప్లవంలాగా ప్రచారం చేద్దాం. ఈ ప్రణాళికను ముందుగా మాస్టర్‌గారే ప్రారంభించారు. మాస్టర్‌గారు మార్చి 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు లఘుఅనుష్ఠానం చేశారు. ఈ అనుష్ఠాన పరంపర:

| **మార్చి** | | **జపసంఖ్య** | | **పూర్ణాహుతి తేది** |
|---|---|---|---|---|
| 1 – 9 | – | 24,000 | – | 10 వ తేదీ |
| 11 – 19 | – | 24,000 | – | 20 వ తేదీ |
| 21 – 29 | – | 24,000 | – | 30 వ తేదీ |

మాస్టారితో పాటు ప్రతీ నెలా ఈ విధంగా అనుష్ఠానాలు చేసేవాళ్ళు రోజుకు 27 మాలల జపం చేసి మాస్టర్‌గారితో పూర్ణాహుతియజ్ఞంలో పాల్గొనవచ్చు. వ్యక్తిగతంగా చేయలేనివాళ్ళు సామూహికంగా కూడా ఈ అనుష్ఠానాలు చేసి పూర్ణాహుతి చేసుకొనే వెసలుబాటును కూడా మాస్టర్‌గారు ప్రసాదించారు. అనేక గ్రామాలవారు ఈ అనుష్ఠాన సాధనలో పాల్గొనటం జరిగింది. జపసంఖ్య 47, 37, 124. అలా ప్రతిసారీ 9 రోజులకు జపం చేసి గాయత్రీ అనుగ్రహపీఠంలో

పూర్ణాహుతిని చేయటం జరిగింది. అలా ఏప్రియల్ 16 వ తేదీ వరకు మాస్టర్‌గారు, వారితోపాటు వందలమంది సాధకులు అనుష్ఠాన పరంపరలను సాగించారు. ఏప్రియల్ 19వ తేదీ శ్రీ వేదమాత అనుగ్రహపీఠంలో 5వ పూర్ణాహుతి దిగ్విజయంగా జరిగింది. ఒక ప్రత్యేకమైన పనిమీద మాస్టర్‌గారు హైదరాబాదు వెళ్ళటం వల్ల వారీ పూర్ణాహుతిలో పాల్గొనలేదు.

## కూకట్‌పల్లి ఆశ్రమములో వసంతపంచమి

పూజ్యశ్రీ మాస్టర్‌గారు హైద్రాబాద్ వచ్చినపుడు సాధనా శిబిరములు నిర్వహించటానికి యజ్ఞయాగాదులు, సామూహికంగా కార్యక్రమాలు ఏర్పాటుచేయటానికి వీలుగా శ్రీవిశ్వనాథ్‌గారు మాస్టర్‌గారి కోసం ఎంతో అందమైన, విశాలమైన ఆశ్రమమును కూకట్‌పల్లిలో నిర్మించారు. ప్రశాంతంగా, చక్కటి చెట్ల మధ్య అందమైన పర్ణశాలతో ఉన్న ఆ ప్రదేశమంటే మాస్టర్‌గారికి చాలా ఇష్టంగా ఉండేది. అందుచేత ఆశ్రమము నిర్మించిన తరువాత వచ్చిన ఈ వసంతపంచమికి ప్రత్యేకముగా సాధనాశిబిరమును అక్కడ పెట్టాలని శ్రీశ్రీ మాస్టర్‌గారు, విశ్వనాథ్‌గారికి చెప్పారు. తక్షణమే భారీగా ఏర్పాట్లు చేశారు. సాధనాశిబిరం 9 రోజుల పాటు యథావిధిగా ఎంతో క్రమశిక్షణతో జరిగిపోయింది.

తెల్లారితే వసంతపంచమి. గురుదేవుల జీవితములో సౌభాగ్యసూర్యోదయం జరిగిన అత్యంత పవిత్రమైన క్షణాలలో ఆ శుభప్రదమైన రోజు రానేవచ్చింది. 24 కుండాలలో పూర్ణాహుతికి ఏర్పాట్లు జరిగాయి. యజ్ఞములతో పాటు సంస్కారములు చేయటం కూడా అనూచానంగా వస్తున్న ఆచారము. అందుచేత శ్రీశ్రీ మాస్టర్‌గారు స్వయముగా అనేకమందికి యజ్ఞోపవీత సంస్కారము, గాయత్రీ దీక్షలనివ్వటం జరిగింది. పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఆ రోజు వేదిక మీదకు వచ్చిన దగ్గరనుంచీ ఎందుకో తెలియదుగానీ, చాలా ఉగ్రమానసికస్థితిలో ఉన్నారు. చెప్పిన ప్రవచనము కూడా ప్రళయకాల ఝంఝూమారుతం లాగా ఉన్నది. ఎందుకో తెలియదు. కొన్ని విపత్కర పరిస్థితులు ఎదురయ్యాయి. దానితో ప్రవచనము మధ్యలో మాస్టర్‌గారు తమకు తాము 'నేను గురువును!' అని ప్రకటించుకున్నారు. 2006 ఫిబ్రవరి 2 వ తేదీన జరిగిన ఆ సందర్భమును ఎవరూ మర్చిపోలేరు. పూర్ణాహుతి అవ్వగానే ఇంటికి వెళ్ళిపోయారు. మాస్టర్‌గారు మరునాడే ఒంగోలు వచ్చేశారు.

## అమరావతిలో కాలచక్రయజ్ఞము

**టిబెట్ దేశానికి చెందిన గురుపరంపరను దలైలామాలని అంటారు. వారు ఇతర దేశాలలో ఉన్నప్పటికీ కొన్ని శతాబ్దాల నుంచీ వారి గురుప్రణాళికలో భాగంగా, తమ యొక్క ఆధ్యాత్మిక ధృవ కేంద్రంగా అమరావతిని ఎన్నుకొని వారి తపఃశక్తిని ధారపోసి 2006లో అక్కడికి వచ్చి ఒక అద్భుతమైన, ఆధ్యాత్మిక క్రతువును నిర్వహించారు.**

గౌతమబుద్ధుని పరంపరకు చెందిన శ్రీదలైలామాగారు భారతదేశమునకు వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది ఒడ్డున గల అమరావతీ పట్టణములో జనవరి 1 నుండి 15 వ తేదీ వరకు కాలచక్రయజ్ఞం చేశారు. 15 రోజులపాటు జరిగిన ఆ మహాయజ్ఞములో వేలాదిమంది భక్తులు పాల్గొని బుద్ధభగవానుని అనుగ్రహాశీస్సులు పొందారు.

ఈ మహాయజ్ఞములో ఆవిర్భవించిన అనంతమైన దైవీశక్తిని ఆకర్షించి అక్కడ స్థాపించాలనేది, మాస్టర్‌గారికి ప్రకృతి ఇచ్చిన ప్రణాళిక. ఆ కార్యక్రమమును సుసంపన్నము చేయటానికి ఒకరోజున “మనం అమరావతిలో 108 కుండీల గాయత్రీయజ్ఞమును చెయ్యాలి. కాలచక్రయజ్ఞములో ఆవిర్భవించిన ఆ అనంతమైన దైవీశక్తిని, దైవీప్రణాళిక కోసం భవిష్యత్తులో దీనిని సమస్త మానవాళి ఉపయోగించుకోవటం కోసం ఒక మహాయజ్ఞం చెయ్యాలి. సమయం ఎక్కువగా లేదు. త్వరగా దానికి ఏర్పాట్లు చేయించమని శ్రీరామ్‌గారితో చెప్పమని” నాతో చెప్పారు. వెంటనే ఈ విషయము శ్రీరామ్‌గారికి చెప్పటం జరిగింది. ఒక వారం లోపలే వారు ఆ యజ్ఞానికి తగిన ఏర్పాట్లన్నీ చేసి మాస్టర్‌గారిని రమ్మని ఆహ్వానించారు. 2006 ఫిబ్రవరి 13వ తేదీ ఉదయాన్నే అమరావతికి వెళ్ళి మాస్టర్‌గారు, తాము చెయ్యదలచుకున్న రీతిలో ఆ మహాయజ్ఞమును దీక్షగా నిర్వహించారు.

యజ్ఞం చేయిస్తూ ఆ రోజు చెప్పిన ప్రవచనములో మాస్టర్‌గారు ‘రాబోయే రోజులలో ఈ అమరావతి మహానగరంగా విరాజిల్లబోతున్నది. దేవతల రాజధానిగా పేరుగాంచిన ఈ అమరావతి నికటభవిష్యత్తులో మీరు ఊహించలేని రీతిలో అత్యంత ఉన్నత శిఖరాలకు చేరుకుంటుంది. ఈ ఆంధ్రప్రదేశ్ యావత్ప్రపంచానికి, ఆధ్యాత్మిక మార్గదర్శనం చేయగల జగద్గురువుగా మారబోతోంది, ఎప్పుడూ అంటే మీరందరూ ఆంధ్రప్రదేశ్‌ని, గాయత్రీప్రదేశ్‌గా మార్చినప్పుడు. దానికి చాలా కష్టపడాలి. మీరందరూ కోటీశ్వరులౌతారు’ అని చెప్పారు.

అలా ఆనాడు వారన్న మాటలు అక్షరసత్యములై 'నవ్యాంధ్రప్రదేశ్'కు అమరావతి రాజధాని అయ్యింది. ఆ క్షేత్రమునకు అనుబంధముగా మిగిలిన గ్రామములను చైతన్యవంతం చెయ్యటానికి అమరావతిలో యజ్ఞం చేసివస్తూ త్రోవలో గల చింతలపాలెం, మైనేటివారిపాలెంలో కూడా ప్రవచనములు చెప్పి గుంటూరుకు వచ్చి అక్కడ సప్తర్షి ఆశ్రమములో క్లాస్ చెప్పి కాసేపు అందరితో ముచ్చటిస్తూ కూర్చున్నారు.

ఆ క్లాసులకు వినటానికి వచ్చిన నారాయణతీర్థులుగారి శిష్యులు, 'మాస్టారూ మీ ఆశ్రమంలో ఒకసారి నారాయణ తీర్థులుగారిచే రచింపబడిన రుక్మిణీకళ్యాణాన్ని తరంగకాలక్షేపంగా మా బృందంవారితో ప్రదర్శిస్తాము. మీరు చూస్తే చాలు, మా జీవితాలు ధన్యమౌతాయని' అన్నారు. తక్షణమే మాస్టర్‌గారు తమ అంగీకారాన్ని తెలిపారు. వారు తరువాత కాలంలో ఆ ప్రదర్శనను మాస్టర్‌గారి సమక్షంలో గానం చేయటం జరిగింది. మధురమైన ఆ తరంగకాలక్షేపానికి మాస్టర్‌గారు ఎంతో ఆనందించి ఆ కార్యక్రమాన్ని మన ఆశ్రమాలలో ఏర్పాటు చేయమని చెప్పగా సమయాను కూలంగా ఆ కార్యక్రమం అన్నీ ఆశ్రమాలలోనూ నిర్వహించటం జరిగింది. అలా మాస్టారు ప్రతివారిలో ఉన్న ప్రతిభను విస్తృతంగా ప్రచారం చేయటానికి సహకరించేవారు.

మరునాడు ఉదయం చిలకలూరిపేటలో క్లాస్ చెప్పి ఒంగోలుకు వచ్చేశారు. ఆ రోజులలో మాస్టర్‌గారు రోజుకు మూడు చోట్ల ప్రవచనములు చెప్పాలనే సంకల్పముతో ఎక్కడ ఎప్పుడు వీలైతే అప్పుడు అలా ప్రవచములు చెప్తూనే వుండేవారు. అలాగ అవిశ్రాంతంగా పని చెయ్యటం వలన బి.పి. పెరిగింది. హృదయస్పందనలో కూడా కాస్త తేడా వచ్చింది. వెంటనే రాత్రి 9 గంటలకు హైద్రాబాద్‌కు బయలుదేరి వెళ్ళాం, వైద్యుల పర్యవేక్షణలో మెల్లిమెల్లిగా కోలుకోవటం జరిగింది. ఎక్కువగా తిరగరాదని, ప్రవచనములు చెప్పరాదని వైద్యులు సూచనలు చేశారు. ఒక వారం పోయిన తరువాత మళ్ళీ ఒంగోలుకు వచ్చారు. స్థిమితముగానే ఉన్నారు. పని ఒత్తిడిని కాస్త తగ్గించుకున్నారు. ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టి, వ్యాయామం, జప ధ్యానములు చేస్తూ ఆహార విషయములో కూడా జాగ్రత్తలు పాటించటంతో మళ్ళా యథాస్థితికి వచ్చారు.

## సంజీవనీవిద్య

ఈ 9 రోజుల కార్యక్రమములోనే జనవరి 28,29 తేదీలలో శ్రీధర్మపురి క్షేత్రం, మియాపూర్, హైదరాబాద్‌లో మాస్టర్‌గారు అందించిన సంజీవనీ విద్యను, పూజ్య గురుదేవులు అందించిన

కల్పసాధనను ప్రపంచానికి అందించే బాధ్యతను శ్రీమతి శ్రీలక్ష్మిగారికి అప్పగించారు. అనాడు పూజ్యశ్రీ మాస్టారు చెప్పిన విషయాలు, "సంజీవనీవిద్య-భారతదేశము యొక్క వారసత్వము. దీనినే "శ్రీవిద్య" అని కూడా అంటారు. సంజీవనీవిద్య అనడంలో అంతరార్థం ఏమిటంటే, **వ్యక్తికి మృత్యువు లేదు**. భగవద్గీత రెండవ అధ్యాయంలో (2.20) శ్రీకృష్ణుడు స్పష్టంగా ఈ సంజీవనీవిద్య గురించి, ఈ ఆత్మ ఏ కాలమునందును పుట్టదు, గిట్టదు, జన్మలేనిది, నిత్యము, పురాతనము, శాశ్వతము, అంటాడు. అంటే మృత్యువు లేదు అని అర్థం. ఈ సంజీవనీవిద్య యొక్క మూడు రూపాలలో మొదటి రెండు రూపాలు మాత్రమే ఈ మొదటి కొన్ని సెషన్స్‌లో అందజేయబడతాయి. అవి – రోగరహితమైన జీవితము, వృద్ధాప్యరహితమైన జీవితము. మూడవది మృత్యురహిత జీవితము. దానికి కొంత సమయం పడుతుంది ఎందుకంటే, మృత్యువు అనే అలవాటుని మనం వదులుకోలేకపోతున్నాము. ఈ సంజీవనీవిద్యను మీరు అర్థం చేసుకుంటే, ఖచ్చితంగా ఈ జన్మలో మీకు రోగాలు రావు. ఒకవేళ వచ్చినా అవి ఇలా వచ్చి అలా వెళ్ళిపోతాయి. ఇంకా నిరంతరం యౌవనముతో ఉంటారు– అదే వృద్ధాప్యరహిత స్థితి. మూడవది, మృత్యురహితస్థితి – ఇది ఒక చేతనత్వము. మృత్యురహిత చేతనత్వాన్ని అర్థం చేసుకోవటానికి రకరకాలుగా ప్రయత్నిస్తున్నాం. ఇంతకీ సంజీవనీవిద్య అంటే ఏమిటో అర్థమైంది కదా! **నేను చావను అనే ఒక మానసికస్థితి!**

ఆ మానసికస్థితి తీసుకురావడానికి మూడు ముఖ్యమైన సాధనలు ఉన్నాయి. మొట్టమొదటి సాధన – స్థిరంగా కూర్చోవటం. "సమం కాయశిరోగ్రీవం....(భ.గీత 6.13)

రెండు, శరీరాన్ని ఉపయోగించుకుని మీరు చేసేదాన్ని ఆసనాలు అంటారు. అసలు ఆసనంలో ఉంటేనే ఫలితాలు వస్తాయి. ఆసనానికి తగిన మానసికస్థితి మీకు వస్తోందా, లేదా! అది ముఖ్యం. గోముఖాసనం వేస్తే పవిత్రత రావాలి, భుజంగాసనం వేస్తే కుండలినీశక్తి మీద నియంత్రణ రావాలి. మీరు ఓ విశేషమైన సాధనకి ప్రాముఖ్యతనివ్వాలి. అదే శవాసనం లేదా అమృతాసనం అంటాం. శవాసనంలో నువ్వు ఒక మానసికస్థితికి వచ్చాక లేస్తే, నువ్వు క్రొత్త శరీరంతో లేస్తావు. ఖచ్చితంగా నీ శరీరం మారుతుంది. ఒక నూతన శరీరము మీకు ఆరోజే అప్పుడే ఆ క్షణమే వస్తుంది.

మూడవ సాధన – శ్వాసను తగ్గించుకోవటం, లేదా ఆలోచనలు ఆపేసుకోవటం. ఆ స్థితిని కేవల కుంభకం అంటారు. ఎప్పుడైతే నువ్వు కేవలకుంభకంలో ఉంటావో నీకు మృత్యువు ఉండదు. ఎందుకంటే, నీకు శ్వాస లేదు – మనస్సు మౌనంగా ఉండిపోయింది. శ్రీఅరవిందో

అది చేసి చూపించారు. మనస్సు మారాలి. ఆలోచనా విధానం మారాలి. అమృతత్వం రావాలి అంటే ఆ మానసికస్థితిలో ఆలోచించటం నేర్చుకోవాలి. ఈ సంజీవనీవిద్య మీ ఆలోచనా విధానాన్ని మారుస్తుంది. అయితే దానికి ఆహారం మారాలి. ఎలాంటి ఆహారం తీసుకుంటామో అలాంటి మనస్సు ఏర్పడుతుంది" అని ముగించారు. ఇంక ఆనాటి నుంచీ ఆవిడ మాస్టర్‌గారి ఆజ్ఞను శిరసావహించి వాటిపై మాస్టర్‌గారు అందించిన ప్రవచనాలను పుస్తకాలుగా అందిస్తూ సంజీవనీ శ్రీలక్ష్మిగా పేరుతెచ్చుకున్నారు. మరునాడే మాస్టర్‌గారు ఒంగోలు వచ్చేశారు.

# అధ్యాయం-12

# ఆత్మసాక్షాత్కారం

ప్రతిరోజు సాయంత్రం 7 నుండి 8 గంటల వరకు జాగర్‌మీద నడుస్తారు. ఆ సమయములో గురుదేవుల ప్రేరణాగీతాలను వింటూ జాగర్‌మీద నడుస్తూండేవారు. అలా నడుస్తూ కూడా ఒక రకమైన ధ్యానస్థితిలోనే ఉండేవారు.

2006 మార్చి 22వ తేదీ సాయంత్రం యథాప్రకారముగా పాటలు వింటూ నడుస్తున్నారు. ఉన్నట్టుండి వారికి తెలియని ఒక దివ్యానుభూతి కలిగింది. అనిర్వచనీయమైన దివ్యానందముతో, దివ్యమైన తేజస్సుతో జాగర్ నుండి క్రిందికి దిగి, 'ఈ క్షణములో నాకు ఆత్మసాక్షాత్కారమయ్యింది. అదెలాంటి అనుభూతో మాటల్లో చెప్పలేను. ఆత్మసాక్షాత్కారమయ్యింది కూడా ఈ ఒంగోల్‌లోనే! ఈ ఘనత కూడా ఒంగోలుకే దక్కింది' అని అంటూ మహదానందంతో అక్కడెవరెవరున్నారో పరికించి చూశారు. ఆరోగ్యం కాస్త కుదుటపడింది. మళ్ళీ నూతనోత్సాహం వచ్చింది. ఒకసారి నాతో అన్నారు. నేను కొన్నాళ్ళపాటు హైదరాబాదులో వుండాలి. సుకృత మెడిసిన్‌లో చేరింది కదా. ఈ టైమ్‌లో దానికి నా గైడెన్సు చాలా అవసరం.

## శ్రీమద్భాగవత మహాయజ్ఞాలు

పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఏ లక్ష్యంతో అనుష్ఠానాలు చేయించారో ఆ లక్ష్యం నెరవేరటానికి పూర్ణాహుతిగా ఒక మహాయజ్ఞం చేయించాలి. గుర్వనుగ్రహ ప్రాప్తి కొరకు శ్రీమద్భాగవత మహా

యజ్ఞం తిరుమలలో జరగాలనీ, దానికి తగిన ఏర్పాట్లు చెయ్యమనీ రాష్ట్రం నలుమూలల నుంచి సాధకులు రావాలనీ, శ్రీమద్భాగవతం – దశమస్కంధం పారాయణ చేస్తూ రాత్రీ పగలు ఆహుతుల నివ్వాలనీ – దానికి తగిన సమస్త ఏర్పాట్లు చెయ్యమని చెప్పటంతో నాకు కాస్త కంగారుగానే అనిపించింది. తిరుమలలో యజ్ఞం చెయ్యటానికి అక్కడి యాజమాన్యం నుంచి అనుమతి లభించలేదు. అందుచేత గోగర్భంలోగల మళయాళస్వామివారి ఆశ్రమంలో, వారు చెప్పిన నియమాలను పాటిస్తూ యజ్ఞం చేసుకోవటానికి అనుమతి లభించింది. 2006 మే 7వ తేదీ నుంచీ యజ్ఞం ప్రారంభించాలి. శ్రీశ్రీ మాస్టర్‌గారు చెప్పారూ అంటే అది జరగాల్సిందే! సరే, కార్యనిర్వహణలో అనుభవం గల శ్రీ కోటిలింగయ్య, శ్రీ సుబ్బయ్యగార్లు ముందుగానే వెళ్ళి ఆశ్రమంలో సాధనకు కావాల్సిన ఏర్పాట్లనన్నింటిని చాలా చక్కగా చేశారు. అనుకున్న సమయానికి అన్ని గ్రామాల నుంచీ కార్యకర్తలు వచ్చారు. మళయాళస్వామివారి ఆశ్రమములో అందరికీ వుండటానికి వసతీ, భోజన సౌకర్యాలు కల్పించబడటంతో అందరికీ ఈ యజ్ఞంలో పాల్గొనే అవకాశం సులువుగా లభించింది.

2006 మే 7వ తేది మధ్యాహ్నానికి శ్రీమళయాళస్వామివారి ఆశ్రమ ప్రాంగణంలో యజ్ఞశాలను సిద్ధంచేసి ప్రవచన కక్ష్యలో వేదికపైన శ్రీకృష్ణుడు, శ్రీమహాలక్ష్మిఅమ్మవారిని, గాయత్రి, గురుదేవులు, మాతాజీల చిత్రపటాలను ప్రతిష్ఠించటం అయిపోయింది. సరిగ్గా దైవసంకల్పమా అన్నట్లుగా అదే సమయానికి ఆశ్రమానికి విచ్చేసిన పెద్దస్వామి శ్రీవిద్యాప్రకాశానందస్వామీజీగారిచేత ఆరతి నిప్పించి కార్యక్రమాలకి శ్రీకారంచుట్టారు. సాయంత్రం 6–30 గంటలకు శ్రీమద్భాగవత మహాయజ్ఞం మొదలైంది.

శ్రీకృష్ణపరమాత్మకూ, శ్రీమద్భాగవత గ్రంథానికీ విశేష పూజ చేసి యజ్ఞకుండంలో అగ్ని ప్రజ్వలన చేసి శ్రీమద్భాగవత మహాయజ్ఞం ప్రారంభించాము. పూజ్యశ్రీ మాస్టర్‌గారు లేకుండా ఇంతటి బృహత్తర కార్యక్రమం నిర్వహించాలంటే కాస్త జంకు వచ్చింది. ఏ మాత్రం కొరతలేకుండా అన్నీ సవ్యంగా జరిగేలా చూడమని మాస్టారికి పదే పదే నివేదన చేసుకునేదాన్ని. ఐనా వారి కృప మన వెంట ఉందనే ధైర్యమూ వుంది. అసలు మాస్టర్‌గారు ఎందుకీ కార్యక్రమాన్ని చెయ్యమన్నారు. దీని వెనుక గల ఆధ్యాత్మిక అంతరార్థమేమిటీ? తెలియదు మరి. చెప్పారు, చేస్తున్నాము అది సరే, కానీ కారణార్థం లేకుండా మాస్టర్‌గారు ఏ పనీ చెయ్యరు. దీని గురించి మాస్టర్‌గారు వివరణ

ఏమైనా ఇస్తారా? అన్న ఆత్రుత మనస్సులో ఉన్నాకానీ పనులు చేస్తూనే ఉన్నాము. ఏదో తెలుసుకోవాలనే తపన మాత్రం అంతరంగాన ఒక ప్రక్కన మెదలుతూనే వున్నది. కానీ కార్యక్రమాలు ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా జరిగిపోతూనే వున్నాయి.

మే 8వ తారీఖు ఉ.11 గంటలకు శ్రీమాస్టర్‌గారు హైద్రాబాదు నుండి తిరుమలకి వచ్చేశారు. యజ్ఞంలో మాస్టర్‌గారు కూడా ఆహుతులు వేసుకున్నారు. తర్వాత అందర్నీ ఏకత్రితం చేసి కొన్ని ముఖ్యమైన విషయాలను సూచనప్రాయంగా చెప్పటం జరిగింది.

రాబోయే 4 సంవత్సరములలో విశేషమైన ప్రయోగం చెయ్యాలి. 2007, 2008, 2009, 2010 వరకు అవిశ్రాంతంగా పనిచేయాలి. 2011 సెప్టెంబరు 11 వ తేదినాటికి గొప్ప విశేషం జరుగబోతున్నది. దాని కోసం మీరు అనేక పన్లు చెయ్యాలి. **ముందు మీ జన్మభూమి మీద ప్రేమ పెంచుకోండి. రాష్ట్రం మీద ప్రేమ పెంచుకోండి. అఖండ భారతం రావాలనేది పరమగురువుల ఆకాంక్ష. దానికోసం మీరు : (1) దేశాన్ని ప్రేమించాలి (2) భాషను ప్రేమించాలి. (3) సమాజాన్ని ప్రేమించాలి. దేశ ప్రేమ గురించి చెప్తూ శ్రీకృష్ణుడు 'దేశం కోసం కుటుంబాన్ని బలిచెయ్యవచ్చు. కుటుంబం కోసం వ్యక్తిని బలివ్వవచ్చు. సమాజం కోసం కుటుంబాన్ని బలి ఇవ్వవచ్చుననే ధర్మాన్ని చెప్తాడు. ప్రాణంపోయే పరిస్థితి వచ్చినా దేశ ప్రేమను వదులుకోవద్దు. స్వాతంత్ర్య సమర పోరాటంలో పూజ్యగురుదేవుల మీద లాఠీచార్జీ జరిగినప్పుడు ఆయన స్పృహకోల్పోయారు. ఐనా వారు భారతదేశ పతాకాన్ని నేల మీద పడనీయకుండా నోటిలోని పండ్ల మధ్యలో ఉంచుకొని పడిపోయారు. అదీ దేశభక్తి అంటే.**

రాబోయే రోజుల్లో చాలా చాలా ముఖ్యమైన కార్యక్రమాలు జరుగబోతున్నాయి. 1 లక్షా 86 వేల సంవత్సరముల తర్వాత హిమాలయములలో ఋషులు వారి వారి ఆశ్రమాలను నెలకొల్పబోతున్నారు. విశ్వామిత్రులవారు కూడా ఆశ్రమాన్ని స్థాపించబోతున్నారు. అర్హత సంపాదించుకున్న వారికే అందులో చోటు దొరుకుతుంది. ఈ భూగ్రహం మీద సప్తఋషుల ఆశ్రమాలు ఆవిర్భవిస్తాయి. ఆ రోజు త్వరలోనే వచ్చితీరుతుంది. ఋషులు తమ ఆశ్రమాలను తీసుకొని భూమ్మీదకు వస్తున్నామని చెప్తున్నా – దానికి తగిన విధంగా మీ ప్రవర్తన వున్నదా? గురువుల ఆశ్రమాలు ఈ భూగ్రహంమ్మీద ఎక్కడ దిగుతాయో – నేను చెప్పలేను.

**గురువు ప్రేమస్వరూపుడు. గురువులకు ప్రేమ కావాలి. ప్రేమస్వరూపులైన గురువుల పట్ల మన ప్రేమను ఎలా వ్యక్తం చేయగలం?** గురువుల చరిత్రలను పారాయణల ద్వారా, భాగవత పారాయణలు చేయటం ద్వారా మనం గురు అనుగ్రహాన్ని పొందవచ్చు. భగవాన్ వేదవ్యాసులవారు సమస్త ఆర్షగ్రంథాలను రచించారు. ఐనా ఆయనకు శాంతి లభించలేదు. ఏదో తెలియని అశాంతితో ఉన్న సమయంలో నారదుడు వస్తాడు. భగవంతుడైన శ్రీకృష్ణుని దివ్యచరిత్ర వ్రాయి. అది ఒక్కటి మాత్రమే నీ మనోవేదనను పోగొడుతుందని చెప్తాడు. నారద ప్రబోధంతో వ్యాసుడు శ్రీమద్భాగవతాన్ని రచిస్తాడు. భాగవతంలో ప్రతి గురువు చరిత్ర వున్నది. ముఖ్యంగా దశమస్కంధంలో జగద్గురువు చేసిన మహత్తరమైన కార్యక్రమాల వివరములున్నాయి. దానిని ఇప్పుడు మీరు చదువుతున్నారు. కోరికలు తీర్చుకోటానికి యజ్ఞాన్ని మించిన ప్రక్రియ మరేదీలేదు. శ్రీమద్భాగవతం చదువుతూ ఒక్కొక్క శ్లోకానికి ఒక్కొక్క ఆహుతిని వెయ్యండి.

యజ్ఞవిద్య ద్వారా ప్రపంచంలోని సమస్త దివ్యశక్తులతోను సంబంధాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ యజ్ఞం ఇక్కడితో ఆగిపోదు. ప్రతి ఊళ్ళోనూ ఈ భాగవత సాప్తాహిక యజ్ఞాలు రాత్రీ పగలు జరగాలి. గురువుల మీద ప్రేమే ఉందీ అంటే ముందు మీరీ పనులు చెయ్యండి. తిరుమలలో స్వయంగా శ్రీ కృష్ణుడు ఈ గోగర్భంలో మళయాళస్వామి ఆశ్రమం ఉన్నచోట సాధన చేశాడు. తపస్సు చేశాడు. మనమూ ఇప్పుడు ఆ మహాత్ముల సాధనాస్థలంలోనే సాధన, యజ్ఞం చేస్తున్నాం. మీరెంత అదృష్టవంతులో చూసుకోండి మరి. అలా చెప్తూ ఇంకా కొన్ని నియమాలను చెప్పారు.

1) యజ్ఞంలో ఇద్దరికంటే ఎక్కువమంది కూర్చోవద్దు.

2) ఒకరు శ్లోకాలు చదవండి – ఒకరు ఆహుతులు వెయ్యండి.

3) ఈ శ్రీమద్భాగవత మహాయజ్ఞాలు యావద్భారతదేశంలో జరగాలి.

4) ముఖ్యంగా మన ఆశ్రమాలలో, అనుగ్రహపీఠాలలో వీలైన ప్రతీచోట జరిగేలా చూడండి. ఆర్తి వుంటే ఆ గుర్వనుగ్రహాన్ని దింపగల్గుతాము. అందరికీ చెప్పండి. అన్ని వూళ్ళలో చేయించండి. ఆర్తితో పిలిస్తే గురువులు పలుకుతారు. గురువుల ఆవేదనను అర్థం చేసుకోండి. 52 వారాల పాటు అఖండ భాగవత సప్తాహాలు జరిగేవిధంగా మీరందరూ చూడండి!

ఈ విధంగా ఎంతో ఆర్తితో, ఆవేదనతో శ్రీశ్రీ మాస్టర్‌గారు సాధకులను ఉద్దేశించి మాట్లాడారు. అలా అక్కడున్న ఏడు రోజులూ సమయానుసారంగా వారి ప్రవచనాలు వినేసరికి ఈ యజ్ఞాలను ఎందుకు చెయ్యమన్నారో బాగా అర్థమైంది.

సాధారణంగా పూజ్య మాస్టారు, ఏ మహాపురుషుల ఆశ్రమాలకి వెళ్ళినా అక్కడ వారియొక్క జీవితచరిత్రలు వారి సాధనా విధానాలను, ఏ లక్ష్యంతో వారా సాధనను చేసి సమాజాన్ని చైతన్య వంతం చేశారు? వాటిఫలితాలు ఏమిటీ? అనేవి సమగ్రంగా అధ్యయనం చేస్తుంటారు. ఇంకా చెప్పాలంటే ఆ ఆశ్రమ నియమాలు పాటిస్తూ ఆ ఆశ్రమ పరిసరాలను శుభ్రంగా వుంచటానికి సాధకులకు ప్రేరణ నిచ్చేవారు. సాధకులను ప్రోత్సహించి వారిచేత దగ్గరుండి అన్నింటినీ శుభ్రం చేయించేవారు. ఆశ్రమాలను, దేవాలయాలను చిమ్మటం, పాత్రలను శుభ్రం చేయటం వలన మన ప్రారబ్ధకర్మలు దగ్ధమైపోతాయని చెప్పడంచేత అందరూ శ్రద్ధతో వంటింటి దగ్గర మొదలుపెట్టి ఆశ్రమాన్ని మొత్తాన్ని ఎంతో పరిశుభ్రంగా, చక్కగా తీర్చిదిద్దటం జరిగింది. ఆశ్రమవాసులకిది ఎంతో ఆనందాన్ని కలుగజేసింది.

## సామూహిక స్వాధ్యాయం

సాధనా శిబిరంలో భాగంగా ఒకవైపున భాగవత యజ్ఞం జరుగుతూనే వుంది. ఆ రోజు సాధనలో భాగంగా అందరూ మళయాళస్వామివారి జీవితచరిత్ర చదవాలని ఆదేశించారు. కార్యక్రమం ప్రారంభమైంది. సాధకులందరూ తలా ఒక పుస్తకం తెచ్చుకొని చదవటం ప్రారంభించారు. సాయంత్రానికి పారాయణ పూర్తయ్యింది. అప్పుడు మాస్టర్‌గారు మళయాళ స్వామివారి జీవితచరిత్ర నుంచి సాధనాత్మక సందేశాన్ని ఇలా చెప్పారు.

"పూజ్యులు శ్రీమళయాళస్వామివారి జీవితంలో అందరి జీవితాలలో లేని విశేషమున్నది. వీరి యొక్క **మొదటి లక్ష్యం**–సత్రయాగాలు. పురాణాలలో జరిగేమాదిరిగా "ఓంకార సత్రయాగాలు" 21 రోజుల పాటు వీరు చేసేవారు. ఇవికాక చాతుర్మాస సత్రయాగాలు నిర్వహించేవారు. తర్వాత కాలంలో అఖండ సత్రయాగాలను కూడా చేయించారు.

వీరి యొక్క **రెండవ లక్ష్యం:** దేశ స్వాతంత్ర్యం. దానికోసం వారు కొన్ని ఆధ్యాత్మిక ప్రక్రియలను చేశారు. ఈ సత్రయాగాలలో సామూహిక భజనలు, కీర్తనలు 2 గంటలసేపు జరిగేవి. అవికూడా

శ్రీరామదాసు, త్యాగరాజుగార్ల కీర్తనలు పాడేవారు. తర్వాత సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో యజ్ఞం జరిగేది. దీని తర్వాత జపయజ్ఞం జరిగేది. దీని తర్వాత అనేకమంది సాధుసంతులను ఆహ్వానించి వారి చేత ప్రవచనాలు చెప్పిస్తుండేవారు. ఈ కార్యక్రమాలలో వేలాదిమంది పాల్గొని తరించేవారు. ఇదంతా వారి జీవితచరిత్రలో ఉంది.

సద్గురు చరణసన్నిధి అనే పుస్తకంలో శ్రీస్వామివారు – కొలది సంవత్సరముల తేడాతో భారతదేశమున తమతో పాటుగా ఇంకా తొమ్మిదిమంది మహనీయులు జన్మింతురని తమ జాతక కథలోనున్నదని చెప్పుచూ, గాంధీమహాత్ముడు, అరవిందయోగి, రమణమహర్షి, శివానందస్వామి, వినోభా, రామదాసస్వామి మున్నగువారు కలరని శ్రీవారు 28–10–1959వతేదీన తమ శిష్యులకు చెప్పిరి. (మళయాళస్వామి జీవితచరిత్ర నుండి.)

**వారు 12 సంవత్సరముల పాటు గోగర్భ గుహలో చేసిన సాధన "నాకు అఖండ భక్తి ఎలా వస్తుందీ? అందరినీ సమభావంతో ఎలా చూడగలను?" అని భగవంతుణ్ణి ఆర్తితో అడిగాడుట.** దీనికోసం వారెంతో తపన, ఆవేదనతో సాధన చేస్తుండేవారు. సమాధానంగా ఒకరోజు నిద్రలేవగానే ఆశువుగా వారి నోటివెంట అద్భుతమైన శ్లోకము వెలువడ్డది. ఆధ్యాత్మికంగా ఎదగాలనుకునేవాళ్ళు ఆ శ్లోకాన్ని నిద్రలేవగానే, మళ్ళీ రాత్రి పడుకోబోయేటప్పుడు, దానిని చదువుకుని పడుకోండని మాస్టారుగారు చెప్పారు.

**అతీత వైరాగ్యమఖండబోధః కదాను మే సిద్ధ్యతు? హేదయాళో !**
**సమాధి యోగస్య పరస్య నిష్ఠా సర్వేషు భూతేషు సమత్వ బుద్ధిః ॥**

హే దయాళో! అతీతమైన వైరాగ్యము, అఖండమగు బోధము, ఉత్తమమగు సమాధినిష్ఠ, సర్వభూతముల ఎడల సమభావము నాకెప్పుడు సిద్ధించును అని అర్థము.

**సంక్షిప్తంగా వారి సందేశాలను మనం అధ్యయనం చేసినట్లయితే:**

1. భోజనానికి ముందు భగవద్గీతలోని 15వ అధ్యాయంలో ఆహారం ఎలా తీసుకోవాలో చెప్పబడి వుంది. కనుక ప్రతీ రోజు ఆ సాధన చేయాలి.
2. భగవంతుడికి, గురువుకు నివేది ఇస్తే దానికి అనేకరెట్లు నీకది తిరిగి వస్తుంది. గురువులకేది పెట్టినా అత్యంత మంచిది, ఆత్మీయంగా పెట్టండి.

3. గురువులకు సరైన శిష్యులు దొరకనప్పుడు వారే అనేక శరీరముల ద్వారా వేర్వేరు ప్రదేశాలలో తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారు.

4. గురువు చెప్పింది నీవు పాటిస్తే, నీవు చెప్పింది ఇతరులు పాటిస్తారు.

5. గురువు చెప్పింది చెప్పినట్లు నీవు చేసినట్లయితే 3 సంవత్సరములలో ఆత్మజ్ఞానం పొందవచ్చు. ఆత్మాభిమానం కోసం ప్రతీక్షణం జీవించటం నేర్చుకోవాలి. నిరంతరం ఆ స్థితిలోనే ఉండాలి. అలా ఉంటూ నిరంతరం స్వాధ్యాయాన్ని కొనసాగించాలి.

6. సత్రయాగం చేసేవారు నిరంతరం స్వాధ్యాయనిరతులై వుండాలి. సత్రయాగంలో ఋషులందరూ కలవాలి. వచ్చిన సాధకులందరూ మళ్ళీ మేము మీ శిష్యులుగానే పుట్టాలని కోరుకోండని స్వామివారు చెప్పేవారు. ఇవన్నీ చేస్తూ జీవితం నుంచి ఎలాంటి పరిస్థితులలోను పారిపోను అని అనగలగాలి.

మళయాళస్వామి చెప్పిన రీతిలో మీరు సభలను పెట్టుకొని ఆధ్యాత్మిక విద్యావేత్తలుగా మారిన తర్వాతనే మీకు చెప్పవలసిన విద్యను చెప్తాను అంటూ ఆనాటి ప్రవచనాన్ని మాస్టర్‌గారు ముగించారు.

## ప్లాన్ ఆఫ్ యాక్షన్

ఆ రోజు మే నెల 11వ తేది. శ్రీశ్రీ మాస్టర్‌గారు ఫలహారం తిన్న తర్వాత గోగర్భంలో మళయాళస్వామి సాధన చేసిన గుహ దగ్గరకు వెళ్ళిపోయారు. అక్కడికి ఎవ్వరూ రావద్దు. నా పనిని నన్ను చేసుకోనివ్వండని చెప్పి వెళ్ళిపోయారు. అక్కడ ఏం జరిగిందీ, ఎవర్ని కల్సిందీ – ఈ వివరాలేం చెప్పలేదు. కానీ మధ్యాహ్నం 3.00 గంటలకు అందర్నీ ఆ గుహ దగ్గర సమావేశం కావాలని ఆదేశించారు. అక్కడ మీకు ప్రాణదీక్షలు ఇవ్వబడతాయి. మానసికంగా దానికి మీరు తయారై రమ్మని మాత్రం చెప్పారు. అనుకున్న సమయానికి అందరూ అక్కడకు చేరారు. దీక్షలనిచ్చే ముందు అసలు కార్యక్రమం రూపురేఖలు (ప్లాన్ ఆఫ్ యాక్షన్) చెప్పారు.

నేను ఇప్పుడు చెప్పబోతున్న ప్రణాళికలను 2, 3 నెలల పాటు చేసి ఒక స్థాయికి వచ్చాక ఆ తర్వాత ఏం చెయ్యాలో చెబుతాను. ఈ సృష్టి యావత్తూ భగవంతునిదే. వేదకాలం నుంచీ ఏ గాయత్రీ మంత్రం చేస్తున్నామో దానిని ఈనాటి కాల పరిస్థితులకు అనుగుణంగా సామూహికంగా

చెయ్యాలి. ఆర్షవిద్యను ఈనాటి దేశకాల పరిస్థితుల కనుగుణంగా చెప్పటం జరుగుతుంది. మొత్తం గురుసంప్రదాయాన్ని చెప్పేస్తాను. మళయాళస్వామివారు చెప్పిన రీతిలో మీరు సభలు పెట్టుకుని ఆధ్యాత్మికవేత్తలుగా, విద్యావేత్తలుగా మారిన తర్వాతే మీకు చెప్పవల్సిన విద్యను చెప్తాను. ఆంధ్రప్రదేశ్‌లో సత్యసాయిని, భగవాన్ సత్యసాయి బాబా అంటారు. కానీ గురుస్థానం మటుకు శ్రీమళయాళస్వామి వారికే లభించింది. మిమ్మల్ని అధ్యయనం చేయమన్నవి రెండే రెండు పుస్తకాలు.

**ఒకటి గురుగీత, రెండవది భాగవతం దశమస్కంధం. ఈ రెండింటిని ప్రచారంలోకి తీసుకు రావాలి.** గురుగీత చదవండి. అందులో గురువునెలా పూజించాలీ, గురువు దగ్గర ఎలా ప్రవర్తించాలో చెప్పబడివుంది. సాధన చేసి సిద్ధి పొందిన స్వామి వాటికి వ్యాఖ్యానాలు వ్రాశారు. అది చదవండి– మీకు ఇవాళ నేను ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ చెప్తాను.

**మొదటిది గురుగీత సమూహం:** ఈ సమూహం వారు గురుగీతను పారాయణ చేసి వారానికొకసారి యజ్ఞం చేసి అందులో గురుగీత ఆహుతులు చెయ్యండి. అఖండజ్యోతి మాసపత్రికలో కూడా గురుగీత ఇస్తున్నారు. అంటే చదవమనే గదా దాని అర్థం.

**2 వ సమూహం: పతంజలి యోగసూత్రాలు:** ప్రతీరోజు 4 పాదాలు చదవాలి. మళయాళ స్వామిగారు వ్రాసిన పుస్తకం చదవండి. వారు అర్థాలు వివరంగా వ్రాశారు. కాబట్టి మీరదే చదవండి. పతంజలి యోగసూత్రాలతో పాటు, పడుకుని వేసే 4 ఆసనాలు ప్రతీరోజు వెయ్యండి. ఇవి మీ భావాల మీద ప్రభావం చూపిస్తాయి.

**3 వ సమూహం: కఠోపనిషత్**–శ్లోకం, భావం కంఠతా రావాలి.

**4 వ సమూహం: భగవద్గీత :** భారతదేశానికి పునాది. ప్రతిరోజు భగవద్గీత మొత్తం చదవాలి. దీనికి స్వామి వ్యాఖ్య వ్రాశారు. మళయాళస్వామివారు భోజనానికి వెళ్తే సాధనా సమయం వృథా అవుతుందని వెళ్ళేవారు గాదుట. ఎవరైనా ఆ సమయానికి తెచ్చిపెడితే తినేవారు అంతే. అంటే గీతా సాధనలో 'అనన్యాశ్చింతయంతోమాం...' అన్న శ్లోకానికి ప్రత్యక్షసాక్ష్యం శ్రీమళయాళ స్వామి!

**5 వ సమూహం: మంత్రానుష్ఠానాల సమూహం:** ముందు గాయత్రీమంత్రం చెయ్యాలి.

సత్రయాగాలు 10 రోజులు చేస్తే–100 మంది సాధనలో పాల్గొంటే 2,40,000 జపం

పూర్తౌతుంది. అలా ప్రతినెల 1-9, 11-19, 20-29 తేదీలలో అనుష్ఠాన పరంపరలు జరగాలి. సత్రయాగమంటే 100 మంది కలవాలి.

**6 వ సమూహం: మహాలక్ష్మీసాధన** – ఇదీ ప్రతీ నెలా ఇంతకుముందు చెప్పిన తేదీలలో అలానే జరగాలి.

**7 వ సమూహం: లక్ష్మీగణపతి సాధన** – ఈ సాధన వలన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆత్మరాజ్యస్థాపన చేసుకోవాలనుకునేవారు లక్ష్మీగణపతి సాధన చెయ్యటం మంచిది.

**8 వ సమూహం: భాగవతం దశమస్కంధ పారాయణ వారానికొక సారి చెయ్యండి.** ఆ శ్లోకాలు చదవటం రానివారు మీకు నచ్చిన ఒక గురువు జీవితచరిత్ర వారానికొకసారి పారాయణ చెయ్యండి. ఈ 8 సమూహాలు తయారయ్యాక 9,10 సమూహాలు – మీ యిష్టం. ఈ కార్యక్రమాల్లో ఏదో ఒకదానిని ఎంచుకొని సాధన ప్రారంభించండి. ఈ పాఠ్యప్రణాళికను తు.చ. తప్పకుండా పాటించినవారికి తర్వాత ఏం చెయ్యాలో చెప్తాను. వీటితోపాటు ప్రతిరోజు 2 ప్రాణాయామాలు అభ్యసించాలి.

1. సోఽహం సాధన 2) దీర్ఘ ప్రాణాయామము. అసలు ప్రాణాయామానికి సంబంధించిన ప్రాణాయామము ప్రాణాకర్షణ ప్రాణాయామము. వీటిని ఆచరిస్తే చాలు.

## 12-5-2006 వ తేదీన ఇచ్చిన దీక్షలు

చెయ్యవలసిన పనులు చెప్పిన తర్వాత ఇక దీక్షా కార్యక్రమానికి సమాయత్తమౌతుండగా, సన్నని చిరుజల్లు అలా కురిసిపోయింది. అందరం దాదాపు కాస్తంత తడిసిపోయాము. దానికి మాస్టర్‌గారు చూడండి, ప్రకృతి మీరు తీసుకోబోయే దీక్షలకి అనుమతినిస్తూ 'పవిత్రీకరణ' చేసి వెళ్ళింది. ఇది మీ అదృష్టం అన్నారు. పరమగురువుల అనుగ్రహం అలా మీమీద వర్షించబోతున్నది. శ్రద్ధగా దీక్షలు తీసుకోండి. తిరుమలలో, గోగర్భంలో వైశాఖపూర్ణిమనాడు ఈ పవిత్రస్థలంలో మీకు మూడు దీక్షలను ఇస్తాను.

1. గాయత్రీమంత్రం 2. మహాలక్ష్మిమంత్రం 3. లక్ష్మీగణపతిమంత్రం

నేనిస్తున్న ఈ మంత్రాలను మీరు అనుష్ఠానం చేస్తూ ఇతరులకు దీక్ష ఇచ్చేటప్పుడు 'శ్రీరామకృష్ణ గురుదేవుల' పేరుతోనే దీక్షల నివ్వాలి. పద్ధతి ప్రకారం ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థసద్గురు దేవాయనమః

అని 108 సార్లు మంత్రజపం చెయ్యాలి. అలాంటివారే దీక్షల నివ్వాలి. ఈ సందర్భంగా సాధకుడు గురుదక్షిణ కూడా ఇచ్చుకోవాలి. నిష్ఠగా ప్రతిరోజూ గాయత్రీమంత్రం – 2 మాలలు. శ్రీమహాలక్ష్మి మంత్రం– 4 మాలలు చెయ్యాలి. ఇలా చెప్పి ఇచ్చే దీక్షను ప్రాణదీక్ష అంటారు. ఈ దీక్షా విజ్ఞానానికి గురువు మళయాళస్వామివారు. ప్రాణవంతుడైన గురువు ఫోటో పెట్టుకొని ఇచ్చే దీక్షను ప్రాణదీక్ష అంటారు. దీని తర్వాత బ్రహ్మదీక్ష. గురువు మహాసమాధి అయ్యాక ఇచ్చేది. శిరిడీసాయి శరీరంతో ఉన్నప్పుడే కొంతమందికీ దీక్షను ఇచ్చాడు. కష్టపెట్టే గురువు దగ్గర దీక్షను తీసుకునేవాళ్ళు అదృష్ట వంతులు. నేను 'టఫ్' గురువును. నేను మాట్లాడితే నషాళానికి అంటుతుంది. వసంతపంచమినాడు నేను గురువునని స్పష్టంగా చెప్పుకున్నాను. నా తర్వాత రాబోయే గురుపరంపర ఎవరూ.... మీరే!! ఈ మంత్రాలననుష్ఠానం చేసి తపశ్శక్తిని సంపాదించుకోండి. దానికి 5 రకాల ప్రాయశ్చిత్తాలు చేసుకోవాలి.

1. ప్రతీ ఏకాదశికి ఉపవాసం వుండండి. నిమ్మకాయ, తేనె కలిపిన నీరు మాత్రమే త్రాగి వుండాలి. లేదంటే పాలు, పళ్ళరసాలు తీసుకున్నా, మజ్జిగ తీసుకున్నా మంచిదే.
2. నెలలో వచ్చే రెండు ఏకాదశిలు ఉపవాసం చెయ్యండి.
3. మీకు నచ్చిన గురువు ఫోటో పెట్టుకుని ప్రతిరోజు గురుపూజ చెయ్యండి.
4. స్వాధ్యాయం ప్రతీరోజు విధిగా చెయ్యండి. స్వాధ్యాయానికి నేను మీకు చెప్పిన కఠోపనిషత్తు, భగవద్గీత, పతంజలి, యోగసూత్రాలు, గురుగీత, భాగవతం, గాయత్రీమహావిజ్ఞానం మూడు భాగాలు చదవండి.

ప్రాణదీక్ష ఇచ్చిన సందర్భంగా కొన్ని శాసనాలు చెప్తున్నాను.

1) పూర్ణిమలు – రాబోయే రోజుల్లో అవి ఏకమాత్ర పండుగలుగా చేస్తారు. వాటిని గురు పూర్ణిమలుగానే గుర్తించి ఆ రోజు ఆధ్యాత్మిక విద్యాబోధనకు ప్రాధాన్యత నిస్తారు.

2) గురుపరంపర మనకు చాలా ముఖ్యం. మన గురుపరంపరలో మళయాళస్వామి చేరారు. ఆయన మార్గాన్ని మనం ప్రజలకందచేయాలి. మనం ఇంతవరకు ఏప్రియల్, మే, జూన్ పూర్ణిమలు విశేషంగా చేసుకుంటున్నాం.

ఈసారి మే పూర్ణిమను మనం మళయాళస్వామి ఆశ్రమంలో జరుపుకుంటున్నాము. ఈసారి మేనెల పూర్ణిమనాడు కూడా ఇక్కడే సత్రయాగ పద్ధతిలో చేసుకుందాము. (ఆ రోజున అన్నమాట ప్రకారం కాలక్రమంలో మంత్రాలయంలో సత్రయాగం చేశారుగదా! ఋషి వాక్కులో ఉండే శక్తి అలాంటిది.)

2007 సంవత్సరం ఏప్రియల్ నెల పూర్ణిమ గుంటూరులో సప్తర్షి ఆశ్రమంలో, మే నెల పూర్ణిమ శ్రీ మళయాళస్వామివారి ఆశ్రమంలో, జూన్ పూర్ణిమ శిరిడీలో సాయి సన్నిధిలో జరుగుతాయి.

ఈ మూడు కార్యక్రమాలు 3 రోజులపాటు

| | | |
|---|---|---|
| **శ్రీరామశర్మ ఆచార్య** | - | 330 మంది |
| **మళయాళస్వామి** | - | 330 మంది |
| **సాయిచరిత్ర** | - | 330 మందితో జరగాలి. |

ఈ గురువుల జీవితచరిత్రలను పారాయణ చేయించి గుంటూరు సప్తర్షి ఆశ్రమంలో సహస్ర గురుచరిత్రల పారాయణతో సత్రయాగం జరగాలి.

3) మీ జీవితంలో మూడు రకాల దానాలను గురువులకివ్వాలి. (1) సమయదానం (2)అంశ దానం (3) ప్రతిభాదానం. ఎవరెంత ఇస్తారో రాసి వెళ్ళండి. 4) ఆశ్రమాలను పరిశుభ్రంగా వుంచండి.

**ఆ రోజున మాస్టర్‌గారే స్వయంగా తమ పవిత్రమైన హస్తాలతో వ్రాసిచ్చారు ఈ క్రింది మంత్రాన్ని.**

**ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః - 108 సార్లు సమర్పణ భావంతో చెయ్యాలి.**

**'శ్రీ' అనే లింక్ గురువుకి శిష్యునికి మధ్యవస్తుంది.**

14 వ తేదీన పూర్ణాహుతి కార్యక్రమానికి ఆశ్రమంలో ఉన్న స్వామీజీలు అందరూ వచ్చారు. పూర్ణాహుతికి ముందున మాస్టర్‌గారు "అమ్మా, ముందు ఒంగోలు సీతామహలక్ష్మిగారికి ఫోను

చేసి వెంటనే భాగవత సప్తాహ యజ్ఞాన్ని ప్రారంభించమని చెప్పండి. అక్కడ యజ్ఞం ప్రారంభమైన తర్వాతే ఇక్కడ మనం పూర్ణాహుతిని చేస్తాం. అప్పటి వరకు యజ్ఞం కొనసాగించండని" చెప్పారు.

తక్షణమే మాస్టర్‌గారు చెప్పింది చెప్పినట్లు చెయ్యటం జరిగిపోయింది. ఒంగోల్లో యజ్ఞం ప్రారంభమవ్వగానే ఇక్కడ పూర్ణాహుతి మొదలైంది. ఆ సమయంలో కనివిని ఎరుగని రీతిలో కుండపోతగా వర్షం కురిసింది. తిరుపతి నుండి ఈ మహాపూర్ణాహుతికి చాలామందే వచ్చారు. ఆ వర్షాన్ని చూచినవారి ఆనందానికి అవధులు లేవు. "ఇంతగా వర్షం కురిసి ఎన్ని సంవత్సరాలైందో స్వామీ! ఈ యజ్ఞం ఎంత గొప్ప మాహాత్మ్యం గలదో!" అని అన్నారు. అలా మాస్టర్‌గారి సంకల్పశక్తీ, గురువుగారి అనుగ్రహంతో ఈ యజ్ఞంలో పాల్గొన్న భక్తుల జీవితాలు పునీతమయ్యాయి.

ఆ యజ్ఞం ఆంధ్రప్రదేశ్ నలుచెరుగులా అశ్వమేధ దిగ్విజయయాత్రలాగా కొనసాగింది. దాదాపు 108 వూళ్ళల్లో జరిగింది. ఐతే కృతజ్ఞత అనేది పరమగురువులు కోరుకునే ప్రధాన లక్షణం కనుక మాస్టర్‌గారుఈ కార్యక్రమాలు చెయ్యమని చెప్పగానే ఎంతో శ్రమపడి గోగర్భంలో మళయాళ స్వామి ఆశ్రమంలో అన్ని సదుపాయాలు, యజ్ఞానికి కావాల్సిన సమిధలను సమీకరించి ఎలాంటి ఆటంకాలు లేకుండా నాకు సహకరించిన శ్రీసుబ్బయ్యగారు, కోటిలింగయ్య దంపతులకు, ఇంకా యజ్ఞానికి వనరులను పంపిన శ్రీమతి తేజశ్రీకి, భోజనవసతి కల్పించిన శ్రీమతి విజయ విశ్వనాథ్, రామసీతగార్లకు, బాలిరెడ్డికి సద్గురువులు అనుగ్రహాశీస్సులనందించాలని కోరుకుంటూ ముగిస్తున్నాను.

ఈ యజ్ఞమును గురించి మాట్లాడుతూ 'ఈ యజ్ఞాన్ని చూచి – మాతాజీ గురుదేవులు చాలా ఆనందించారు. గురువుగారైతే 'నీకీ ఆలోచన ఎలా వచ్చింది రామకృష్ణా–చాలా మంచిపని చేస్తున్నావ్!' అని అభినందించినట్లుగా చెప్పారు (ఇది ఈ సూక్ష్మజగత్తులో జరిగిన వాస్తవ సంభాషణ). అలా గురుదేవులు మాస్టర్‌గారు చేసే ప్రతి కార్యక్రమానికి తమదైన ముద్రను వేయటం ప్రతీసారీ జరుగుతూ వుండేది.

## వైజ్ఞానిక ఆధ్యాత్మికత

2006 జులై 10,11,12 తేదీలలో ఒంగోలులో సిల్వర్, డైమండ్ కళ్యాణమండపంలో గురుపూర్ణిమా సాధనా శిబిరాన్ని శ్రీ శ్రీరామకృష్ణగారు నిర్వహించారు. ఈ సాధనా శిబిరంలో మొట్టమొదటిసారిగా మాస్టర్‌గారు 1) జపము, 2) ప్రాణాయామము, 3) ధ్యానముల గురించి,

వైజ్ఞానిక విధానాలను ఆధాత్మికతలో పొందుపరచి సాధన చేసే విధానాలను నేర్పించారు. అయితే ఈ జప, ప్రాణాయామ, ధ్యానాలను గురించి అనేక సాధనాశిబిరాలలో చెప్పటమనేది అందరికీ అనుభవైకవేద్యమే! తమాషా ఏమిటంటే మాస్టర్‌గారు ఒకే విషయాన్ని గురించి వేర్వేరు చోట్ల చెప్పినా ఎప్పటికప్పుడది కొత్త, కొత్తగానే చెప్పేవారు.

**జపంతో స్థూలశరీరాన్ని, ప్రాణాయామంతో సూక్ష్మశరీరాన్ని, ధ్యానంతో కారణశరీరాన్ని ఎంతో ధృఢంగా చేసుకొని చైతన్యవంతులం కావచ్చుననే విషయం ఆ సాధనా శిబిరంలో అందరికీ అవగాహన అయింది. దానితో పాటుగా శ్రీమద్భాగవత** యజ్ఞశృంఖల విస్తారంగా ప్రజలలోకి తీసుకువెళ్ళటానికి కావలసిన స్ఫూర్తిని కూడా ఆ మూడు రోజులలో అందరిలో నింపారు.

తరువాత ఇలా చెప్పారు, 'కొంతకాలం పాటు నేను మీకు అందుబాటులో వుండను. అత్యవసరమైన సాధనలు చేయవలసి ఉన్నది. కానీ మీకు నా సందేశాన్ని సర్క్యులర్స్ ద్వారా అందచేస్తుంటాను. వాటిని మీరు తు.చ. తప్పకుండా పాటించవలసి ఉంటుంది. నా సాధన అయిపోగానే రెట్టింపు బాధ్యతతో కార్యక్రమాలను చేయవలసి రావచ్చు" అని చెప్పి శిబిరాన్ని ముగించారు. తరువాత శ్రీశ్రీ మాస్టర్‌గారు చెప్పిన విధంగానే కార్యకర్తలందరికీ హైదరాబాద్ నుంచే ఆగష్టునెల ఒకటవ తేదీ నుంచీ సర్క్యులర్స్ పంపటం ప్రారంభించారు.

## సహస్రకుండీ యజ్ఞము-మంత్రాలయము

మహాపుణ్యక్షేత్రమైన మంత్రాలయములో శ్రీగురురాఘవేంద్రస్వామివారి దివ్యసన్నిధిలో 1008 కుండీలతో శ్రీమహాలక్ష్మీయజ్ఞము 2006 జులై 23 న ఆదివారం ఉదయం 8 గంటలకు శాంతిధామ ఆశ్రమ ఆవరణలో జరిపించటానికి శ్రీవేంకటేశులుగారు చక్కటి ఏర్పాట్లు చేసి ఆ యజ్ఞమునకు పూజ్యశ్రీ మాస్టర్‌గారిని ఆహ్వానించారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు రాయలసీమలో మొట్టమొదటిసారిగా ఈ మహాయజ్ఞమును నిర్వహించారు. శ్రీమహాలక్ష్మీయజ్ఞముతో పాటు విశ్వఏకీకరణయజ్ఞము చేయించి భవిష్యత్తులో సత్రయాగమునకు బీజారోపణ చేసి ఆ గడ్డకే ఖ్యాతిని తెచ్చిపెట్టారు. ఈ యజ్ఞమును సుసంపన్నము చేయటానికి శ్రీవేంకటేశ్వరులగారి కుటుంబం ఎంతో కృషిచేయటమనేది హర్షనీయము.

## శ్రీమద్భాగవత యజ్ఞశృంఖల

జులై నెలలో శ్రీశ్రీ మాస్టర్‌గారు హైద్రాబాద్‌కు వెళ్ళారు. మాస్టర్‌గారు జీవితానికి చాలా ప్రాధాన్యతనిస్తారు. వ్యక్తిగత జీవితం, ఉద్యోగ నిర్వహణ, ఆధ్యాత్మిక జీవితానికి ఎంత ప్రాధాన్యత నిస్తారో కుటుంబసభ్యుల భవిష్యత్తును గురించి కూడా అంతే శ్రద్ధ వహించేవారు. శ్రీశ్రీ మాస్టర్‌గారికి సుకృత అంటే ప్రాణం. తన పట్ల చిన్నప్పటి నుండి ఎంతో శ్రద్ధ వహిస్తూ వుండేవారు. సుకృతకు ఏ కష్టమూ రాకుండా చూసుకునేవారు. అప్పుడు సుకృత ఫిజియోథెరపీ కోర్సు చేస్తుండేది. 'పరీక్షల సమయం వచ్చింది. దగ్గరుండి చదివించాలి. పరీక్షలయ్యాక మళ్ళీ మన కార్యక్రమాలు మొదలు పెడదాం' అని చెప్పి హైద్రాబాదుకు వెళ్ళారు. అయితే కార్యకర్తలందరూ శ్రీమద్భాగవత యజ్ఞ పరంపరంతో పాటు మిగిలిన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. మాస్టర్‌గారు ఏ పనిని చేసినా పూర్తి తన్మయతతో చేస్తారు. అలానే సుకృతను మెడిసెన్‌లో ఉత్తీర్ణురాలిని చెయ్యటానికి తనకు రోజూ బోర్డుమీద పద్ధతిగా క్లాసులు చెప్పేవారు. దీనికోసం ఆయన హైదరాబాదులోని కోఠికి వెళ్ళి అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించిన పుస్తకాలను, సిడిలను తెచ్చుకొని క్షుణ్ణంగా చదివి తనకి చెప్పేవారు. తల్లితండ్రులు ఇలాంటి శ్రద్ధను పాటించగలిగితే పిల్లలకి చాలా సమస్యలు ఉండవు.

ఉన్నపళంగా ఆగష్టు ఒకటో తేదీకల్లా 'నన్ను' హైద్రాబాద్‌కు రమ్మని శ్రీశ్రీ మాస్టర్‌గారి నుంచి సమాచారం వచ్చింది. తక్షణమే హైద్రాబాద్‌కు వెళ్ళాను. సుకృత పరీక్షలైందాకా మాస్టర్‌గారు ప్రత్యక్షంగా ఏ కార్యక్రమాలకు రారు గాబట్టి కార్యకర్తలకు రోజువారీ కార్యక్రమాలను – సందేశాలను సర్క్యులర్స్ ద్వారా అందించాలి. వాటిని వ్రాసి పంపటానికి నన్ను పిలిపించారు. రోజువారీగా సర్క్యులర్స్‌లో ఏమి వ్రాయాలనేది సూచనప్రాయంగా వారు చెప్పేవారు. విషయాన్ని పాఠకులకర్థ మయ్యేలా వ్రాసి దానిని మాస్టర్‌గారికి చదివి వినిపించి – మార్పులు, చేర్పులు ఏమైనా వుంటే చేసి, ఏరోజు కారోజు వాటిని సాధకుల కందజేయటం జరుగుతున్నది. దాంతోపాటుగా గాయత్రీ మహావిజ్ఞాన్ 2వ భాగంలో గల 'గాయత్రీరామాయణం' రికార్డింగ్ వర్క్‌ను శ్రీశ్రీ మాస్టర్‌గారు పాడుతుంటే పటేల్‌గారు వాటిని రికార్డ్ చేస్తుండేవారు. సుందరకాండ పారాయణ, వేర్వేరు ప్రదేశాలలో ప్రవచనాలు. ఇలా ఒక్కక్షణమైన ఖాళీ లేకుండా పనిచేస్తున్నారు. ఆగష్టు 15వ తేదీకి కొంతపని జరిగింది.

ఆ రోజు ఆగష్టు 15 తేది. మాస్టర్‌గారికి కాశీలో మిత్రుడు, ఆత్మీయుడు ఐన శ్రీలాల్‌గారు, మాస్టర్‌గారితో వుండాలని హైద్రాబాద్‌కి వచ్చివున్నారు. ఆగష్టు 16 వ తేదీ శ్రీకృష్ణాష్టమికి ఆశ్రమంలో కార్యక్రమాలు చెయ్యటానికి శ్రీమతి విజయావిశ్వనాథ్‌గారు గుంటూరుకు వెళ్తున్నారు. శ్రీలాల్‌గారికి కూడా ఆశ్రమాన్ని చూపించాలని వారిని కూడా తీసుకొని బయలుదేరారు. అక్కడికి దగ్గరే వున్న వేటపాలెంలో ఉన్న దత్తఆశ్రమం కూడా చూపిస్తే బావుంటుందని విజయగారు నన్ను రమ్మన్నారు. సరే, వచ్చిన పని కొంత వరకు పూర్తైంది కదా, నీవు కూడా వెళ్ళు అన్నారు మాస్టర్‌గారు. దాంతో నేను కూడా కారు ఎక్కేశాను.

కారు కొంతదూరం వెళ్ళిన తరువాత మాస్టర్‌గారు ఫోన్ చేసి వేటపాలెం దత్తాశ్రమంలో రేపట్నుంచీ అంటే శ్రీకృష్ణాష్టమి నుంచి శ్రీమద్భాగవత అఖండ యజ్ఞం ప్రారంభించమని చెప్పారు. ఫోన్‌ల ద్వారా పన్లు జరిగిపోతున్నాయి. కాసేపయ్యాక సుమాపటేల్ ఫోన్ చేశారు. శ్రీశ్రీ మాస్టర్‌గారు వేటపాలెం దత్తాశ్రమానికి వస్తున్నారు. ఈ రాత్రికే భాగవతయజ్ఞం ప్రారంభించాలట, వారిని తీసుకొని మేము వస్తున్నాం అని చెప్పింది.

అంతే, ఒక్కసారిగా అందరిలో చైతన్యం వచ్చేసింది. ఈ హఠాత్ పరిణామంలో గల అంతరార్థ మేమిటీ అనుకుంటూ వాళ్ళు వచ్చే లోపల యజ్ఞానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసి అందరం తయారై సిద్ధంగా వున్నాం. పూజ్యశ్రీ మాస్టర్‌గారు రాత్రి 12.50 గంటలకు దిగారు. స్నానాదులు పూర్తిచేసుకొని అఖండ అగ్నిస్థాపన చేసి భాగవత అఖండ యజ్ఞాన్ని ప్రారంభించారు. ఆనాడలా ప్రారంభించిన ఆ యజ్ఞం 9 నెలల పాటు అఖండంగా కొనసాగింది. 'నన్ను వేటపాలేంలోనే ఉండి యజ్ఞనిర్వహణ చూసుకొమ్మన్నారు'. మాస్టర్‌గారు చెప్పినట్లుగానే నేనింక అక్కడే వుండి యజ్ఞబాధ్యతను చూసుకుంటున్నాను.

(సరే ఇక అసలు విషయానికొస్తే – 'సుమా! మాస్టర్‌గారు క్షణాల్లో అలా ఎలా నిర్ణయం తీసుకొని వేటపాలెం వచ్చారు?' అని అడిగితే–ఆంటీ! మిమ్మల్ని కారు ఎక్కించి మాస్టర్‌గారు లోపలికి వెళ్ళారు. లోపలికి వస్తూనే సుమా టి.వి. పెట్టు అన్నారు. పెట్టాం. 'నీవొస్తానంటే నేనొద్దంటానా' అనే సినిమా అది. సినిమాను చూస్తూ చూస్తూనే క్షణాలమీద నిర్ణయించుకున్నారు. ఇలా చెప్పారు. దత్తుడి నిర్ణయమది. "నీవొస్తానంటే నేనొద్దంటానా" అనే సినిమాలో ప్రకృతి ద్వారా అందిన దత్తస్వామి

సందేశముంది. వెంటనే మనం బయల్దేరాలి. పటేల్‌కు చెప్పు అన్నారు. అంతే వెంటనే కారు ఎక్కేశారు' అని చెప్పింది. మాస్టర్‌గారు ప్రతీక్షణం ప్రకృతి మనకేం చెప్తోంది అనేది గమనించుకుంటూ పని చెయ్యాలని చెప్తుంటారు. చెప్పటం కాదు. వారూ పనిని తక్షణమే చేస్తుంటారు. తక్షణమే చెయ్యటమనేది 'శుచి' అనే అగ్ని లక్షణం. ఇంకో మాటగా చెప్పాలంటే అది సాక్షాత్ 'భగవంతుని' లక్షణం. అందుకే మాస్టర్‌గారు ఏ పనైనాగాని 'తక్షణమే' చెయ్యాలని అంటుండేవారు. అనటమే కాదు. చేయించేవారు కూడా!!

అలా 2006 ఆగష్టు 15వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభించబడిన యజ్ఞం 2007 ఏప్రియల్ వరకు అలా రాత్రీ పగలు జరుగుతూనే వుంది. దాంతోపాటు మాస్టర్‌గారు కూడా అక్కడ వుండటం – సాధకుల నిలయానికీ, గురునిలయానికి కావాల్సిన క్రొత్త క్రొత్త మార్పులు – దత్తస్వామి దేవాలయం చుట్టూ విశాలంగా వేలాదిమంది కూర్చునేందుకు వీలుగా రేకుల షెడ్డులు – తూర్పు పశ్చిమాలలో సింహద్వారాలు – దత్తస్వామి దేవాలయానికి పైన చుట్టూ శంఖం, చక్రం, కమండలాది దివ్యాయుధాలతో అందంగా నగిషీలు చెక్కిన ప్రాకార నిర్మాణం – పంచదత్తుల ఆలయనిర్మాణాలు, ఆశ్రమంలో నలువైపులా సాధకులు కూర్చుని సాధన చేసుకోవటానికి వీలుగా చక్కటి వసతి సదుపాయాలతో పర్ణశాలలు, అన్నింటికంటే మించి – శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం– ఆ గ్రామానికే ఎంతో శోభను, వైభవాన్ని ఇచ్చే రీతిలో దివ్యమైన భవ్యమైన రీతిలో నిర్మాణాలను చేయటం జరిగింది. వీరితోపాటుగా దత్తస్వామి ఆలయ పృష్ఠభాగంలో " మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి" దేవతలు అగ్రగామిగా వుండే రీతిలో ఎంతో సుందరమైన దేవాలయం – శ్రీమహాలక్ష్మిదేవి ప్రతిష్ఠ కోసం నిర్మించటం జరిగింది.

ఆశ్రమానికి కన్వీనర్‌గారైన శ్రీమతి ప్రమీలగారే అన్నీ చూసుకుంటుండేవారు. అత్యవసరమైన పని మీద ఆవిడ యు.యస్., వెళ్ళినందువలన ఈ నిర్మాణాది కార్యక్రమాలను శ్రీ వేణుగోపాలరెడ్డి గారికి, యజ్ఞ నిర్వహణను నాకు మాస్టర్‌గారు అప్పజెప్పటంతో మేము అప్రమత్తతతో ఆ బాధ్యతలు చూసుకుంటూ పర్వదినాలలో ప్రత్యేకమైన పూజ, అర్చనలు చేయించేవాళ్ళం. ఈసారి శ్రీశ్రీ మాస్టర్ గారి జన్మదినం కూడా ఎంతో వైభవంగా వేలాదిమంది భక్తుల హర్షాతిరేకాల మధ్య చాలా ఘనంగా జరిగింది. నిత్యావతార దత్తక్షేత్రముతో పాటు రోజూ ఓడరేవు ఆశ్రమానికి వెళ్ళి అక్కడ కూడా కార్యక్రమాలు నిర్వహిస్తూండేవారు, **మీరందరూ సహకరిస్తే 'శిరిడీసాయికి ద్వారకామాయి–చావడి**

**ఎలానో నాకు దత్తక్షేత్రం - ద్వారకామాయి, ఓడరేవు-చావడిగా వీటిని నేను అభివృద్ధిచేస్తాను' అని చెప్పారు.**

## శ్రీ మహాలక్ష్మీ ఆలయం - నిత్యావతార దత్తక్షేత్రం

గ్రామగ్రామాలలోనూ అమావాస్యకు శ్రీమహాలక్ష్మీ సాధన నిరవధికంగా జరిగిపోతున్నది. తదనుబంధంగా జగద్గురువైన శ్రీకృష్ణులవారి "శ్రీమద్భాగవత సాప్తాహిక" మహాయజ్ఞాలు కూడా ఒక శృంఖలగా విరాట్‌రూపంలో జరిగిపోతున్నాయి. శ్రీకృష్ణులవారు, శ్రీమహాలక్ష్మీదేవి అనేవి ఒకే నాణానికి ఉన్న బొమ్మ, బొరుసుల్లాంటి రెండు చైతన్యశక్తిధారలు. ఒకదానికొకటి పూరకాలుగా ఆ శక్తిధారలూ నిరంతరం అలా ప్రవహిస్తూ ఉండటానికి సరైన రీతిలో ఈ రెండూ సాధనలు ఎంతో సరళంగా, సామూహికంగా, చైతన్యవంతంగా పూజ్యవరుల స్ఫూర్తి, ప్రేరణలతో సాగిపోతున్నాయి.

ఇక్కడ శ్రీమహాలక్ష్మీ సాధనను కుండలినీ సాధనగా రూపొందించాలనేది మాస్టర్‌గారి లక్ష్యం. అందుకోసం వేటపాలెంలోని నిత్యావతారదత్తక్షేత్రం ఆలయప్రాంగణంలో నైరుతీదిశలో 18 అడుగుల ఎత్తుగల నలుచదరపు భవంతిని నిర్మించి దానిపైన శ్రీమహాలక్ష్మీదేవి చిత్రపటాలను 4 దిక్కులలోనూ స్థాపించి, ప్రాణప్రతిష్టా కార్యక్రమాన్ని చేసి శ్రీమహాలక్ష్మీసాధనకు దానిని కేంద్రంగా ప్రకటించారు. అప్పటి నుండి ప్రతిరోజు ఆశ్రమంలో జరిగే అర్చనా కార్యక్రమాలలో శ్రీమహాలక్ష్మీసాధనకు అనేకమంది స్త్రీలు వచ్చి శ్రీవిద్యారణ్య ప్రోక్త సంపుటిత శ్రీసూక్త పారాయణ చేసేవారు.

మన ప్రస్తుత జీవితము మరియు రాబోయే కొన్ని జన్మల ఏకైక లక్ష్యమును క్రియాన్వితము చేసే ప్రక్రియకు బీజారోపణ కార్యక్రమము చేయటానికి గురుపూర్ణిమయే సరైన కాలముగా భావించి పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఈ సాధనా శిబిరాన్ని ఒంగోలులో నిర్వహించారు. భవిష్యత్తులో మన లక్ష్య పూర్తికి కావలసిన సరంజామాను, సాధనా సంపత్తి ద్వారా పొందాలంటే చేయవలసిన సాధనా ప్రక్రియలలో నిశితమైన కొన్ని సాధనలను ఈ శిబిరంలో అతి ఉగ్ర మానసికస్థితిలో థియోరిటికల్‌గా అనగా సిద్ధాంతపరంగా విశదపరుస్తూ, ప్రయోగాత్మకంగా వాటినెలా సాధన చెయ్యాలో కూడా చాలా స్పష్టంగా వివరించటం జరిగింది. అందులో 9వ తేదీ పంపిన సర్క్యులర్ ఫ్రేమ్ కట్టించి ప్రతీరోజూ దానిని చదువుకోవాలని చెప్పారు.

## మన ఏకైక లక్ష్యము

09.08.2006 వ తేది సాయంత్రం 4.00 గంటలకు అసలు జపము, ప్రాణాయామము, ధ్యానములను ఎందుకు చెయ్యాలో ఒక సర్క్యులర్ ద్వారా అందరికీ ఇలా తెలియచేశారు.

(1) అన్ని విద్యలలాగే ఆధ్యాత్మిక విద్య లేక జీవించే కళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) లేక సంజీవనీ విద్యను ముందు సిద్ధాంతపరంగా, విశదముగా ఒకదాని తరువాత ఒకటిగా అధ్యయనము చెయ్యాలి. ప్రతి అంశము యొక్క పూర్వాపరాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. (**జపము**)

(2) కుటుంబము అనే ప్రయోగశాలలో సిద్ధాంతపరంగా మనం నేర్చుకున్న జ్ఞానము ఆచరణలో పెట్టి, అభ్యసించి లభించిన ఫలితాలకు తగిన వైజ్ఞానిక ఆధారాలేమిటో తెలుసుకోవాలి. (**ప్రాణాయామము–1**)

(3) ఈ విజ్ఞానాన్ని మానవజాతి సమాజముల నిర్మాణానికి ఉపయోగించుకోవాలి. (**ప్రాణాయామము–2**)

(4) మానవజాతిలో జరిగిన ప్రయోగాలను ఖనిజ (మినరల్ కింగ్‌డమ్), వృక్ష (ప్లాంట్ కింగ్‌డమ్), జంతు (యానిమల్ కింగ్‌డమ్), జగత్తులలో మలుచుకుంటూ, దేవజాతి (డివైన్ కింగ్‌డమ్)తో చేతులు కలిపి ఇదివరకు ఎన్నడూ ఊహించబడని నవయుగాన్ని స్థాపించాలి (**ధ్యానము**).

పై వాక్యాలే మన ప్రస్తుత జీవితానికి, రాబోయే కొన్ని జన్మలలోని జీవితాలకు ఏకైక లక్ష్యము అనే సర్క్యులర్ పంపారు. అంటే జప, ప్రాణాయామ, ధ్యానముల లక్ష్యాలను చాలా స్పష్టంగా ఈ సర్క్యులర్ ద్వారా అందించారు.

## నవయుగ నవరాత్రి సాధన

నిత్యావతార దత్తక్షేత్రానికి వచ్చిన మాస్టర్‌గారు ఇంక ఆశ్రమంలోనే ఉండి పోయి, ఆశ్రమాన్ని ఉన్నతస్థాయి సాధనాకేంద్రంగా తీర్చిదిద్దటానికి ప్రణాళికాబద్ధంగా కొన్ని నిర్మాణాలను చేపట్టారు.

ప్రకృతిలో మనకు రామనవరాత్రులని, దేవీ నవరాత్రులని, గణేశ నవరాత్రులని, గాయత్రీ జయంతి నవరాత్రులని ఇలా వేరు, వేరు దేవతలకు వారి ప్రత్యేకతలను బట్టి, విశిష్టతలను బట్టి నవరాత్రులు మన సంస్కృతిలో కలిసిపోయి ఉన్నాయి. మనం గమనిస్తే ప్రకృతి ప్రసాదించిన మహత్వపూర్ణమైన మరొక నవరాత్రుల గురించి ఇక్కడ చెప్పుకుందాం.

పూజ్యగురుదేవులు వేదమూర్తి, తపోనిష్ట, పండిత శ్రీరామశర్మ ఆచార్యగారి జన్మదినం సెప్టెంబర్ 11వ తేది అయితే మాతా భగవతీదేవిగారి జన్మదినం సెప్టెంబర్ 20వ తేది. ఈ రెండు తేదీల మధ్యన సరిగ్గా 9 రోజులు రావటమనేది ఖచ్చితంగా ప్రకృతి నిర్ణయించిన నవయుగ నవరాత్రులు. ఇంకో తమాషా ఏమిటంటే ఈ నవరాత్రులు అటు గణేశ నవరాత్రులకు, ఇటు దేవీ నవరాత్రులకు మధ్య రావడమనేది ప్రకృతిలోని మరో పరమాద్భుతం. ఎంతో శక్తివంతమైన ఈ 9 రోజులను 'నవయుగ నవరాత్రిసాధన'గా నామకరణం చేసి ఈ సమయంలోనే Education in New Era తీసుకువచ్చి, చెప్పటానికి మాస్టర్‌గారు బహుధా కృషి చేశారు.

సెప్టెంబర్ 11వ తేదీన పూజ్యగురుదేవుల జన్మదినం. ఈ రోజున శ్రీమహాలక్ష్మి చిత్రపటాలను ఆవిష్కరించారు. వేలాదిమంది భక్తులు ఎంతో ఉత్సాహంగా ఈ మహాపర్వంలో పాల్గొని తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. నవరాత్రి కార్యక్రమాలు మొదటిరోజున జగన్మాత శ్రీమహాలక్ష్మి ఆశీర్వాదాలతో ప్రారంభమైనాయి. 11వతేది నుండి 20వతేదీ వరకు నవయుగ నిర్మాణానికి అవసరమైనవి, నూతన మానవజాతికి తగిన శిక్షణను ఇచ్చే సాధనా విధానాల గురించి ఈ శిబిరంలో చెప్పారు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ విద్య 'ప్రాణశక్తి'ని గురించి నేర్పుతుంది. ఏ దేవతా స్వరూపమైనా అది ప్రాణశక్తికి సంబంధించిన 'దేవత' అని ముందు తెలుసుకోవాలి. విద్యుత్తుతో ఫ్రిజ్‌ని వాడతాం, ఏ.సి.ని వాడతాం, టి.వి.ని వాడుతాం, కంప్యూటర్ వాడతాం, ఇలా ఎన్నో రకాల విద్యుత్ ఉపకరణాలను నిత్యజీవితంలో వాడుతుంటాము. ఒకే ఒక్క ఎలక్ట్రిసిటీని ఉపయోగించి ఈ వస్తువుల న్నింటిని వాడతాం. అలానే దేవతాశక్తి యొక్క రూపము, ఆ దేవతాశక్తి వినియోగము ఇవన్నీ ప్రాణశక్తి యొక్క విభిన్నరూపాలు. ఇప్పుడు చెప్పుకోబోయే ఈ నూతన విద్య అంతా కూడా ప్రాణశక్తిని గురించే నేర్పించబడుతుంది. ఎలక్ట్రిసిటీ ప్రమాదకరమైనదే అయినా దాని నియమాలను పాటిస్తూ సురక్షితంగా వాటిని ఉపయోగించుకుంటున్నాము. అలానే గ్యాస్‌ను వాడుకుంటున్నాము. ప్రమాదం అని తెలిసినా వాటిని ఉపయోగించుకోగలుగుతున్నాం. ఎలా అంటే వాటి నియమాలను పాటిస్తూ. అలానే ఇక్కడ కూడా దేవతాశక్తులను ఉపయోగించుకోవాలంటే వాటికి ఏర్పరచిన నియమాలను పాటించాలి. దేవతాశక్తులకు 'శుచి' అంటే ప్రాణం. దేవతలు రావాలంటే శుచిగా వుండాలి. ప్రాణశక్తిని గురించి అవగాహన ఉండాలంటే ముందు శుభ్రంగా వుండాలి. పరిసరాలు చాలా చాలా శుభ్రంగా వుండాలి.

ఆశ్రమ వాతావరణం అతి శుభ్రంగా, నిర్మలంగా వుండాలి. ఎక్కడపడితే అక్కడ కరెంట్ వైర్లు, తాళ్ళు వ్రేళ్ళాడకూడదు. తెగిపోయిన వైర్లు ఉండకూడదు. (అంటే పవర్‌తెగిపోయినట్లేగా). బట్టలు ఆరేసే తీగలు సాఫీగా స్ట్రయిట్‌గా వుండాలి. ఆరవేసిన బట్టల నాలుగు అంచులూ పొందిగ్గా ఉండాలి. ఎండిన పూలు దేవతామూర్తులమీద వుండరాదు. తోరణాలు వాడిపోతే తీసివేయ్యాలి. ఎక్కడ గానీ బూజు వేళ్ళాడ కూడదు. పూజ్యగురుదేవులు యోగవిద్య నేర్చుకోవాలని గాంధీగారి ఆశ్రమానికి వెళితే అక్కడ ముందు చెప్పిన పని టాయ్‌లెట్‌లు కడగటం, కట్టెలు కొట్టడం. ఆశ్రమంలో లెట్రిన్‌లను శుభ్రంగా ఉంచడం లాంటి పనులే ముందుగా నేర్పించారని వారి జీవితచరిత్రలో వ్రాసుకున్నారు. ఎందుకంటే సాధకుడైన వాడు మొదట చేయవలసిన ప్రధాన కర్తవ్యం అదే కనుక. ప్రాణశక్తి, కుండలినీ జాగరణకు సంబంధించిన విషయాలు చెప్పాలంటే 'శుచి' అంటే ఏమిటో ముందు తెలుసుకోవాలి. కుండలినీజాగరణ జరగాలంటే శరీరము, మనస్సు, ఆత్మ (బాడీ, మైండ్, సోల్) ఈ మూడూ శుచిగా అంటే స్వచ్ఛంగా ఉండాలని చెప్తూ అందుకు కొన్ని ప్రాథమిక సూచనలను, విధిగా పాటించవలసిన నియమాలను చాలా తీవ్రంగా చెప్పారు.

నిత్యావతార దత్తక్షేత్రం మొత్తాన్ని 14 విభాగాలుగా రూపొందించారు. విభాగముల వారీగా వాటిని నిర్వహించే వారి పేర్లు, వారి బాధ్యతలు, విధులను ఒక రోజు క్లాసులో ప్రకటించారు. ఇది ఆశ్రమంగా మాత్రమే కాక నలందా, తక్షశిల విశ్వవిద్యాలయాల స్థాయికి తీసుకువెళ్ళాలి. నూతన విద్యలకిది కేంద్రస్థానము కావాలి. 'నవయుగ నిర్మాణం' జరిగి తీరుతుంది. దానికి తగినట్లుగా, నూతన మానవజాతికి అవసరమైన నూతన విద్యను నేర్పించటానికి తగిన శిక్షణా తరగతులకిది కేంద్రం కాబోతోంది. అంటే ముందు ఆశ్రమాన్ని వ్యవస్థీకృతం చేసి ఏ విభాగమునకు ఆ విభాగం అత్యంత సుందరంగా, సమర్థవంతంగా పనిచేసేలా అందరూ కృషి చేయాలి. బాధ్యతతో పని చేసే వారికి మాత్రమే విధుల వివరాలు చెప్పబడినాయి.

(1) **శ్రీమహాలక్ష్మీదేవాలయం:** అఖండ జపము జరగాలి. నిత్య పూజలు, అర్చనలు జరగాలి.

(2) **అన్నపూర్ణాలయం:** స్టాకు రిజిష్టర్ మెయిన్‌టైన్ చెయ్యాలి. రోజూవారీ ఖర్చుల రిజిష్టర్ నిర్వహణ. భోజనాలు చేసిన వారి సంఖ్య, వంట బాధ్యత.

(3) **ప్రజ్ఞ (గురునిలయం):** సాధకులు కూర్చోవటానికి సరైన ఏర్పాట్లు, మైకుసెట్ల ఏర్పాట్లు, లైబ్రరీ పరిరక్షణ బాధ్యత.

(4) **ఇంద్ర (కంప్యూటర్ విభాగము):** ఇందులో మూడు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. నూతన విద్యావిధానానికి అవసరమైన స్టడీ మెటీరియల్ – ఏ రోజు ప్రవచనాన్ని ఆ రోజు డి.టి.పి. చేసి మరుసటి రోజుకు అందించడం దీని బాధ్యత. శ్రీ వల్లభభాయిపటేల్‌గారు ఈ విభాగాన్ని చూసుకున్నారు.

(5) **మాస్టర్‌గారి విశ్రాంతి నిలయము :** ఈ గది చుట్టూ ప్రశాంత వాతావరణం ఉండాలి. లోపల ఉన్న వస్తువులన్నీ శుచిగా, శుభ్రంగా ఉంచే బాధ్యత ఒకరికివ్వబడింది.

(6) **దత్తక్షేత్రము :** నిత్య పూజలు, అర్చన, ఆరతులు జరగాలి. అక్కడ ఉపయోగించే వస్తువుల స్టాకు వివరాలు చాలా స్పష్టముగా రిజిష్టర్‌లో నమోదు చెయ్యాలి.

(7) **షోడశ దత్తావతారములు :** పరిశుభ్రత, నిత్యపూజల నిర్వహణ బాధ్యతతో పాటు డబుల్ హెలిక్ పరిక్రమా విధానాన్ని అందరికీ నేర్పించాలి. దీనికి సంబంధించిన యజ్ఞం చెయ్యాలి.

(8) **పంచదత్త ధ్వజస్తంభము :** రోజూవారీగా పంచదత్తుల పూజా విధానము, దాని బాధ్యతతోపాటు పంచదత్తావతారుల జీవిత చరిత్రల పారాయణక్రమం జరిగేలా చూడాలి.

(9) **నక్షత్ర, గ్రహ, రాశి ఉపవనము :** వృక్షసంరక్షణ, పరిశుభ్రత, పూజానిర్వహణలు.

(10) **కొలను :** దాని నిర్మాణ కార్యక్రమము మొదలుపెట్టాలి.

(11) **నిర్మాణములు :** దత్త దేవాలయం చుట్టూ విశాలమైన మండప నిర్మాణములు, అక్కడక్కడ సాధన చేసుకోటానికి అనువుగా పర్ణశాలలు, తూర్పు పశ్చిమ దిశలలో విశాలమైన ప్రవేశ ద్వారాలు.

(12) **జనరేటరు విభాగము :** నీటి సరఫరా నిర్వహణ బాధ్యతను ఒకరు చూసుకోవాలి.

(13) నిత్యావతారదత్త క్షేత్రంలో రోజూవారీ పరిశుభ్రత, వృక్ష పరిరక్షణ, మొక్కలకు నీరు పెట్టటం, పాదులుచేయటం

(14) సాధకులనిలయ సంరక్షణ, నిర్వహణ బాధ్యత.

(15) ఆశ్రమ ఆర్థిక లావాదేవీలు.

ఇలా అనేక విభాగాలను సమర్థవంతంగా నిర్వహించటానికి నిష్ణాతులైన వ్యక్తులను, అదీ వారి స్వయం బాధ్యత మీదనే త్రికరణశుద్ధిగా కృషి చేయాలని చెప్పారు. అలా ముందుకు వచ్చిన వారికి మాత్రమే ఆయా బాధ్యతలను ఆనాడు అప్పచెప్పారు.

ఇలా స్వీకరించిన వారు ఆనాటి నుండి ఎంతో నిష్ఠతో తమ బాధ్యతలను నిర్వర్తించసాగారు. ఇవే కాకుండా దేవీ నవరాత్రులలో శ్రీమహాలక్ష్మి ఆలయం దగ్గర దుర్గాసప్తశతి పారాయణం, పంచదత్తుల దగ్గర దత్త పంచాయతన పూజలు, పాదుకాపీఠం దగ్గర గురుగీత, ప్రకృతి వైపరీత్యాల నివారణకు అఖండ భాగవత మహాయజ్ఞ నిర్వహణ. వీటితోపాటు అఖండ దత్త జపం, శ్రీ మహాలక్ష్మి మంత్రజపం జరిగేలా తగిన ప్రణాళికను వేశారు. ఇవన్నీ సక్రమంగా జరిపించే బాధ్యతను నాకు అప్పచెప్పటం జరిగింది.

## ఆధ్యాత్మిక శక్తికేంద్రం

సాధనా శిబిరం రెండవ రోజునుంచీ యధావిధిగా ప్రాతః కాల అర్చనాది కార్యక్రమాలయ్యాక గురునిలయంలో మాస్టర్ గారి ప్రవచనాలు ప్రారంభమయ్యేవి. సాధారణంగా గురుదేవుల ప్రేరణాగీతాలను టేప్‌లో వినిపించాకనే మాస్టర్‌గారి ప్రవచనం ఉండేది. మైకులో పాట వచ్చేటప్పుడు సాధకులందరూ గొంతు కలిపి దానితోపాటు పాడాలి. అది నియమం. అందరి చేతులలో లామినేట్ చేసిన పాటల కాయితాలుండేవి. పాట అయిపోగానే మాస్టర్‌గారి ప్రవచనం ప్రారంభమయ్యేది. ఆ రోజు మాస్టర్‌గారు ప్రవచనంలో వేటపాలెంలోని 'నిత్యావతార దత్తక్షేత్రము'ను నా కార్యక్రమాలకు కేంద్రంగా ఎన్నుకుని పనిచేయబోతున్నాను. అలా నాతో పనిచేయగలిగే ఊపును మీరు కూడా తెచ్చుకోవాలి. గాఢమైన గోడ మీకూ, నాకూ మధ్య అడ్డుగా వున్నది. శ్రీకృష్ణుడే అర్జునునితో "యధేచ్ఛసి తథాకురు" అన్నాడు.

నేను శ్రీకృష్ణుని కన్నా గొప్పవాణ్ణి. నేనేం చేస్తున్నానో మీకిప్పుడేం అర్థంకాదు. చెప్పింది ఆచరించకపోతే పరిణామాలు తీవ్రంగా వుంటాయి. గురుదేవుల పాటలలో వున్న శక్తి మీకర్థంకాదు. అందరికీ ఆ పాటలు నోటికి రావాలి. చెప్పింది చెప్పినట్లు ఆచరిస్తేనే ఫలితాలు వస్తాయి. నేను ఈ

తరగతులు ఆపను. మీరు రాకపోయినా అశరీరధారులకు చెప్పుకుంటాను. మీకు ఆరాటం అయితే వుంది కానీ చేసే దమ్ము మాత్రం లేదు.

నాలాగా ఇంత గట్టిగా చెప్పేవాళ్ళు మళ్ళీ మీకు ఎప్పటికీ దొరకరు. ఈ ఆశ్రమంలో గాయత్రీ మంత్రం, శ్రీ మహాలక్ష్మీమంత్రం, దత్తమంత్రం నిరంతరం జరుగుతూవుండాలి. గాయత్రీ మంత్రాన్ని పలుకుతున్నప్పుడు ఏం మార్పులు వస్తున్నాయో గమనించాలి. మనస్సు గాయత్రీ మంత్రాక్షరాల మీద పెట్టి జపం చెయ్యండి. ఆధ్యాత్మిక విద్య నేర్చుకోవటానికి ముందు మంత్రజపాలతో మిమ్మల్ని మీరు చితకబాదుకోండి. ఆధ్యాత్మిక విద్యలో ముఖ్యంగా పాటించవలసిన నియమం స్వయంసేవ. ఆశ్రమంలో సాధనకు వచ్చిన వారు ఈ పనీ, ఆ పనీ అనుకోకుండా అన్ని పనులనూ శ్రద్ధగా చెయ్యాలి. వేరే వాళ్ళు వండిన వంట తినకూడదు. సాధకులు వండిన దాన్నే తినాలి.

ఈ తొమ్మిది రోజుల సాధన కోసం వచ్చిన వాళ్ళు, సాధనతో పాటు అన్ని పనులూ చెయ్యాలి. ఆధ్యాత్మిక విద్య నేర్చుకోవటం మామూలు విషయం కాదు. ఒళ్ళు హూనం అయిపోతుంది. ఈ ఆశ్రమంలో అజ, హస్తి, గో, అశ్వముల చిత్రపటాలు 4 దిక్కులలో పెడితేనేగానీ సాధన యొక్క తీవ్రత మీలో రాదు.

ఈ నియమాలన్నీ చెప్పేశాక రోజూవారీగా అందరిచేత (1) జపము, (2) ప్రాణాయామము, (3) ధ్యానములతోపాటు ఉదయంపూట గాయత్రీ రామాయణం, రాత్రిపూట భగవద్గీత రోజుకు 2 అధ్యాయాలు చదివించేవారు. దీని వలన సాధకులలో సమర్పణ యోగం ఎలా సాధించాలి? శ్వాస ద్వారా పరిణామక్రమంలో ముందుకు ఎలా వెళ్ళవచ్చుననే విషయాలు అవగతం కావడంతో పాటు గురుదేవులు చెప్పిన ప్రజ్ఞాపుత్రులుగా ఎలా మనం తయారుకాగలం అనే విషయాలు అర్థమౌతాయి.

**తర్వాత రోజు నుంచీ Education in New Era గురించి చెప్పటం ప్రారంభించారు. పదేపదే చెప్పే విషయం ఏమిటంటే అందరూ పుస్తకాలను బాగా చదవాలి. అధ్యయనం చెయ్యాలి, ఆచరించాలి. ఇక్కడ పెట్టిన పుస్తకాలనెవ్వరూ తాకవద్దు. (అప్పట్లో ఒంగోలులో ఉన్న మాస్టర్‌గారి లైబ్రరీ నుండి కొన్ని పుస్తకాలు తెప్పించి ఇక్కడ పెట్టించారు) చెప్పినా వినకుండా ఆ పుస్తకాలను తాకారనుకోండి దాని వలన వచ్చే షాక్‌లను నేను కూడా వెనక్కు తీసుకోలేను.**

నిత్యావతార దత్తక్షేత్రం అతి త్వరలో ఇంటర్‌ప్లానెటరీ ఆర్గనైజేషన్‌గా రూపొందుతుంది. అలానే శంబళ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్‌గా రూపొందుతుంది. ఇదంతా ఎప్పుడు జరుగుతుందీ అంటే మీరు నన్ను చేయనిస్తే. ఈ మాటను జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఇప్పటి నుంచీ చాలా నిర్మొహమాటంగా చెప్పాలనుకుంటున్నాను. ఈ నవయుగ నవరాత్రి సాధనలో మాస్టర్‌గారు ముఖ్యంగా "New Era Education" మీదనే ఎక్కువగా చెప్పటం జరిగింది. అలా చెప్తున్నప్పుడు శ్రీశ్రీ మాస్టర్ గారి వాణి ద్వారా కొన్ని సత్యాలు అలా బయటకు వస్తుండేవి.

'నాతో మీకు ఈ లింక్ (అనుబంధం) అనేక జన్మల నుండి ఉన్నది. శ్రీరామశర్మ ఆచార్యగారు ఆ అనుబంధాల గురించి చెప్పే నన్ను ఆంధ్రాకు పంపించారు. ఆయన చెప్పిన సంఖ్య కంటే 5 రెట్ల మంది మనుషులు పరివార్‌లోకి వచ్చారు. గురుదేవుల జీవిత విధానాన్ని ఈ 20 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో దింపేశాను. తిరుమలలో అశ్వమేధయజ్ఞం నేనే చేశాను. నేను గొప్పవాణ్ణే. కానీ అది నాది కాదు. నా గురుదేవుల సామర్థ్యం అది. కలెక్టర్ కుండే పవర్స్ అన్నీ గవర్నమెంట్ ఇచ్చినవే కదూ. ఎన్ని జన్మలకైనా ఆంధ్రప్రదేశ్‌కి అథారిటీని నేనే. గురుదేవుల జీవితంలో జరిగిందే నా జీవితంలోనూ జరుగుతున్నది.

ఈ ఆశ్రమాలు, ఈ అనుగ్రహపీఠాలు, ఈ జరుగుతున్న కార్యక్రమాలన్నీ మీ వలన రాలేదు. అదంతా గురువుల ప్రణాళిక. నిస్సందేహంగా అనేకమంది అదృశ్యసహాయకుల సహకారం వలననే ఇవన్నీ జరుగుతున్నాయి తప్ప మీ వల్ల కాదు. అయితే మీరు మాత్రమే చేయవలసిన కార్యక్రమాలు జాగ్రత్తగా గుర్తుంచుకోండి. శ్రీమద్భాగవత సప్తాహాలు, విశ్వఏకీకరణ యజ్ఞాలు, గాయత్రీ, శ్రీమహాలక్ష్మీ, దత్త మంత్రజపాలు నిరంతరం అలా జరుగుతూ వుండాలి. అంత వరకు మీరు చేస్తే చాలు. మిగతా పన్లు ఎవరు చేయ్యాలో వాళ్ళు చేస్తారు.

ఇప్పుడు మనం నేర్చుకోబోతున్నది New Era Education. అది రావాలని గురుదేవులు చాలా కోరుకున్నారు. హరిద్వార్‌లో దానిని పెట్టాలని చాలా ప్రయత్నించారు. దానిని గాయత్రీతీర్థ్‌గా పెట్టారు. గురుదేవుల కోరిక ప్రకారం ఇప్పుడు దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం వచ్చేసింది. వారి కోరిక ఏమంటే నలందా, తక్షశిల లాంటి విశ్వవిద్యాలయాన్ని స్థాపించి అందులో ఆ జీవించేకళను నేర్పించాలనేది వారి అసలు ఆశయం. అయితే ఆ పనినే కొనసాగించాలని నేను కూడా ప్రయత్నిస్తున్నాను.
**నిత్యావతార దత్తక్షేత్రం నా కార్యక్రమాలకు కేంద్రం. ఇక్కడి నుండే నేను నా పనులను కొనసాగిస్తాను.**

ఈనాడు మానవజాతికి రైట్ హ్యూమన్ రిలేషన్‌షిప్స్ లేవు. మానవీయ సత్సంబంధాలనేవి ఎక్కడా కనిపించటంలేదు. దానిని తేవాలనే శ్రీసత్యసాయి చాలా ప్రయత్నించి అనేక అవకాశాలను ఇచ్చాడు. విదేశాలలో యం.ఐ.సి.ఐ. అనే పేరుతో మహేష్‌యోగి కొంతవరకు దానికి ఒక రూపాన్నిచ్చారు. మీకీ విద్యను నేర్పించటానికి గురువులు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు మళ్ళీ అదే ప్రయత్నం ప్రారంభిస్తున్నారు.'

మిలటరీ డిసిప్లిన్‌తో ఈ విద్యను నేర్చుకోవాలి అని చెప్తూ మాస్టర్‌గారు సాధకులుగా ఆశ్రమంలో ఉండేవారు అతి కఠినమైన నియమాలను పాటించాలని ఆదేశించారు. నవరాత్రిసాధనలో ముఖ్యంగా దేవాలయాలకు వెళ్ళినపుడు పాటించవలసిన ప్రధాన ధర్మాలైన 1. ప్రదక్షిణ, 2. దక్షిణ, 3. తీర్థము, 4. ప్రసాదముల ప్రాముఖ్యతను చాలా అద్భుతంగా వివరించారు.

ప్రాణోత్థాన ప్రక్రియకు సంబంధించిన ప్రదక్షిణలు ఎలా చెయ్యాలి, కుండలినీ జాగరణకు సంబంధించిన ప్రదక్షిణలు ఎలా చెయ్యాలనే విషయాలు పరమాద్భుతంగా చెప్పడమే కాదు, ప్రతిరోజు అక్కడికి వచ్చిన వాళ్ళందరి చేత తప్పనిసరిగా ప్రదక్షిణలు చేయించేవారు, దక్షిణ ఇవ్వవలసిందే, తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందే అనే నియమం ఏర్పరచారు.

నూతన విద్యావిధానంలో 'ప్రధానసిలబస్'గా శ్రీజ్వాలాకూల్ మహర్షి వ్రాసిన

The Soul and its Mechanism – జీవాత్మ–దాని పరికరాలు

The Externalisation of Heirarchy – ఋషిపరంపర బాహ్యప్రకటీకరణ – అనే పుస్తకాల మీద తరగతులు హృదయానికి హత్తుకునేలాగా చక్కగా వివరించారు.

# VII శాంతికుంజ్‌తో సంగతీకరణ

## అధ్యాయం-13

## ప్రాణశక్తి - కుండలినీశక్తి

పూజ్యశ్రీ మాస్టర్‌గారు చెప్పే సాధనా విజ్ఞానం గురించి చెప్పాలంటే వారు ఓంకార సాధన చేయించినా, దేవాలయాలలో చేసే ప్రదక్షిణల గురించి చెప్పినా, శ్వాస విజ్ఞానం గురించి చెప్పినా, పూజ్య గురుదేవుల ఆత్మకథ గురించి చెప్పినా, యజ్ఞశాలకు ప్రదక్షిణలు చెయ్యమని చెప్పినా వారి లక్ష్యం మాత్రం 'ప్రాణశక్తి-కుండలినీ జాగరణ' చుట్టూనే అల్లుకుపోయి వుండేది. ఎటు నుంచి ఎటు తిప్పి, తిప్పి చెప్పినా సాధకునిలో ఈ రెండు శక్తులను ఏ విధంగా జాగృతం చెయ్యాలి? ఏ సాధనల గురించి చెప్పినా, చేయించినా గమ్యం మాత్రం ఆ శక్తి జాగరణల దగ్గరకే వచ్చి ఆగేది.

**భారతీయ ఆధ్యాత్మికత వ్యక్తిలోని దైవత్వాన్ని వికసింపజేసే విజ్ఞానము. ఈ విజ్ఞానము ప్రాణశక్తి మరియు కుండలినీ శక్తుల మీద ఆధారపడి వుంటుంది.** భౌతికత లేక భౌతిక సుఖాన్వేషణ, విద్యుచ్ఛక్తి మీద ఆధారపడి వుంటుంది. ఈనాడు మానవజాతిలో వ్యాపించి వున్న భౌతికవాదము ప్రాణశక్తిని, కుండలినీశక్తిలనేవాటిని పూర్తిగా మరిచిపోయి, కేవలం విద్యుత్‌శక్తి ప్రచార ప్రయోగాలకి మాత్రమే పరిమితమైపోవడం వల్లనే ఈ భయావహ పరిస్థితులు ఏర్పడినాయి. వాస్తవానికి ఈ మూడుశక్తుల ఉద్గమ స్థానము ఒక్కటే, అది సూర్యుడు. సూర్యుణ్ణి గురించి శాస్త్రాలు 'సూర్య ఆత్మా జగతస్థుషశ్చ' అనే ఒక అద్భుతమైన నిర్వచనం చెప్పాయి. ఒకే సూర్యుణ్ణి ఒక్కొక్క సందర్భంలో ఒక్కోలా ఉపయోగించటం.

1. **విద్యుచ్ఛక్తిని సన్‌లైట్‌గా ఉపయోగించుకుంటున్నప్పుడు సూర్యుడనీ,**
2. **ప్రాణశక్తిగా ఉపయోగించుకుంటున్నప్పుడు సవితయనీ, అదే**
3. **కుండలినీ శక్తిగా ఉపయోగించుకుంటున్నప్పుడు ఆదిత్యుడనీ అంటారు.**

మానవజీవితానికి విద్యుత్‌శక్తి లేక కాంతిశక్తి వలన వచ్చే దోషాలను వాస్తుదోషాలంటారు. అంటే వాస్తుదోష నివారణ అంటే మానవశరీరాలలోనూ, గృహాలలోను కాంతి సవ్యంగా ప్రసరించి విస్తరించకపోవటం వల్ల వచ్చే దోషాలు. తూర్పు, ఉత్తర దిక్కులలోని స్థలాలని ఉపయోగించుకోక పోవటం వల్ల సృష్టికి ఉపయోగపడే హవ్యవాహ, కవ్యవాహలనడే విద్యుత్తులను ఉపయోగించుకో గలుగుతాము. ధ్యానానికి కూర్చోవాలనుకున్నా తూర్పు, ఉత్తర దిక్కులకే ప్రాముఖ్యతనిస్తాము.

ప్రాణశక్తి మానవశరీరంలో 5 విభిన్న శక్తులుగా ప్రసరిస్తుంది. దీనినే పంచకోశవిద్య లేక పంచాగ్ని విద్య అంటారు. ఈ ప్రాణశక్తి ప్రసరణ ముందు కుండలినీశక్తిగా మూలాధారంలో చేరి, మస్థిష్క గ్రంధి వద్ద రెండుగా విభజింపబడి, మళ్ళీ ఆజ్ఞాచక్రము వద్ద 'ఇడ' ప్రాణప్రవాహము చంద్రుడుగా, 'పింగళ' ప్రాణప్రవాహము సూర్యుడిగా మారుతుంది. అక్కడ నుండి ఈ సూర్య, చంద్ర ప్రవాహాలు సూర్య, చంద్రగ్రహాలుగా మానవ శరీరంలో ఆజ్ఞా చక్రము నుండి దిగువన ఉన్న 5 ప్రాణశక్తులుగా రూపొందుతాయి. సౌరకుటుంబంలో ఈ 5 ప్రాణశక్తులు – కుజుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, శనిగా ఉంటాయి. ఇడ, పింగళ స్వరాలు స్త్రీ, పురుషులిరువురికి ఒకే రకంగా ఉంటాయి కనుక, సూర్య చంద్రగ్రహాలకు ఒకే ఆధిపత్యము ఇవ్వబడింది. ఆజ్ఞచక్రము వద్ద స్త్రీ, పురుషులకు ఏ విధమైన భేదము ఉండదు గదా!

దిగువ చక్రాలలో స్త్రీ, పురుష భేదము వుంటుంది కనుక ఈ గ్రహాలకు రెండు రాసుల ఆధిపత్యము ఇవ్వబడింది. **ఈ ప్రాణశక్తి వాయురూపంలో శరీరంలో ఉంటుంది కనుక ఈ ప్రదక్షిణాపథము ముందు వాయవ్యం నుండి ప్రారంభం అవుతుంది. శరీరంలోని ఈ గ్రహములను లేక ప్రాణవాయువులను సరిచేయుటయే గ్రహశాంతి.**

సృష్టిలో అగ్ని, పిండాండం నుండి బ్రహ్మాండము వరకు సవ్యదిశలో ప్రదక్షిణామార్గాన్ని అనుసరించటం వలన వాటి ప్రాణశక్తి లోపించక అవి చాలా కాలం మనుగడ సాగిస్తాయి. **యజ్ఞశాల ప్రదక్షిణ ఈ ప్రాణశక్తిని పెంపొందిస్తుంది. గ్రహదోషాలను నివారిస్తుంది.**

**వ్యక్తిలోని సంకల్పశక్తియే కుండలినీశక్తి.** ఆ సంకల్పశక్తియే దేనినైనా ముందుకు నడిపిస్తుంది. "అగ్రేనయతి ఇతి అగ్నిః" అనేది ప్రమాణం. ఈ సంకల్పశక్తిని ప్రకృతి మనకు 'అగ్ని' రూపంలో ప్రసాదించింది. అగ్నికి వాక్ కూడా ఒక రూపమే. అందుచేతనే అగ్ని లేక వాక్‌ను ఉపయోగించుకొని మానవజాతి ఇంత పురోగమించింది.

అగ్ని మానవశరీరంలో 27 రకాల శక్తులుగా ప్రవేశిస్తుంది. అందుకనే 27 నక్షత్రాలుగా ఆ సంకల్పశక్తిని మనం ఉపాసన చేస్తాం. దానినే 'నక్షత్ర విద్య' అంటారు. ప్రకృతిలోని ఇడ, పింగళ శక్తుల ప్రతినిధులైన మిత్ర, వరుణులను మరియు కుండలినీ శక్తికి ప్రతీకమైన అగ్నిని 1008 కుండాలలో ప్రజ్వరిల్లించబోతున్న ఆ స్థలము విరాట్ పురుషుని సహస్రారము కనుక ఆ యజ్ఞశాల చుట్టూ చేసే పరిక్రమ సకల వాస్తు-గ్రహ-నక్షత్ర దోషాలను నివారించి అత్యంత ఆనందప్రదమైన జీవితాన్నిస్తుంది.

**ప్రాణశక్తులు:** మానవశరీరంలో 5 గ్రహాలకి ప్రతీకలైన 5 ప్రాణశక్తులు 24 నిమిషాల పాటు ప్రసరిస్తాయి. 5 ప్రాణాలు 24 నిమిషాలు అంటే 5×24=120 నిమిషాల పాటు యజ్ఞశాలలో ప్రదక్షిణ చేస్తే సకల కోరికలు తీరతాయి. ఇదంతా వివరంగా చెప్పకుండా ఋషులు

**'యాని కానిచ పాపాని జ్ఞాతాజ్ఞాత కృతానిచ, తాని తాని ప్రణశ్యన్తి ప్రదక్షిణాయాం పదేపదే'**

అని అతి సూక్ష్మంగా చెప్పారు. యజ్ఞశాల చుట్టూ చేసే ప్రదక్షిణ వ్యక్తికి భౌతికంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో లాభదాయకమైనది. నిజంగా ఇది ఎంతో సరళమైన ప్రక్రియ కదా! అందుచేత ఎక్కడ యజ్ఞాలు జరిగినా కష్టమనుకోకుండా కాస్త ఓపిక చేసుకొని యజ్ఞశాలకు ప్రదక్షిణలు చేసి ఫలితాలను పొందుదాం.

## శ్రీమహాలక్ష్మీ వైభవం

నిత్యావతార దత్తాక్షేత్రంలో 'శ్రీమహాలక్ష్మీదేవిని ప్రతిష్ఠించాక, రోజురోజుకూ ఆ సాధనను ఎంతో అద్భుతంగా ఆకర్షణీయంగా, ఆచరణయోగ్యంగా తయారైంది. ఆ రోజు చెప్పిన అంశాలు సువర్ణాక్షరాలతో లిఖించదగిన అద్భుతమైన రహస్యాలు.

**అక్టోబర్ 23వ తారీఖున చెప్పిన ఈ ప్రవచనంలో, "ఇప్పుడు నేను చెప్పబోయేవన్నీ హిమాలయాలలోని ఋష్యాశ్రమాలలో చెప్పబడే విషయాలు. వారి దివ్య ఆశీస్సులతో ఈనాడు వాటిని మీకు నేను చెప్తున్నాను. అయితే ఇవి అందరూ నమ్మే విధంగా ఉండవంటూ" ప్రారంభించారు.**

'ధనమును సంపాదించుకోనక్కరలేదు. ధనాన్ని ఆకర్షించుకోవచ్చు. 'ధనం' ఎప్పుడూ నీళ్ళ మీద కొట్టుకు వచ్చేస్తుంది. ఎలాగో చెప్తాను వినండి. మానవశరీరాలు ధనాకర్షణ అయస్కాంతాలు.

పుట్టుకతోనే ధనాకర్షణ చేస్తున్న వ్యక్తులు మీరు. బిడ్డ పుట్టగానే ఆహారలక్ష్మి సమృద్ధిగా తల్లిపాల రూపంలో బిడ్డకు అందుతుంది. డబ్బు ఒక్కటే లక్ష్మి కాదు. ఆరోగ్యమే మహాభాగ్యం. ఆ ఆరోగ్యానికి ఆధారం ప్రాణశక్తి – అదే అగ్ని. బిడ్డ పుట్టగానే లభించే ఆహారం–ధాన్యలక్ష్మి. తల్లి గర్భం ధరించిన నాటి నుండి తల్లిదండ్రులు ఇద్దరూ ఆహారనియమాలను పాటిస్తే బిడ్డ మంచి ఆరోగ్యవంతు డౌతాడు. ఆహారంతో మంచి మనస్సు దాని వలన సదాలోచనలు, సత్కర్మలు అభివృద్ధి చెందుతాయి. ఇదే ఆరోగ్యలక్ష్మి.

**ధన సంపాదన కష్టంగానీ – ధనాకర్షణ సులభమేగా! ధనాకర్షణకు పాటించాల్సిన నియమాలు ఏమిటంటే – చెప్పిన మాటను తక్షణమే చెయ్యటం. ఏ పనినీ రేపు చేస్తాను అని అనవద్దు. ఆలస్యం అమృతం విషం. కాబట్టి చేయగలిగిన పనిని తక్షణం చేసెయ్యటం అలవాటు చేసుకోండి.! ఇదీ ధనం యొక్క ఆకర్షణకు ప్రధాన నియమం.**

**శక్తి:** చెప్పిన మాటను తక్షణమే చేసే వారికిది లభ్యమౌతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వినటం ద్వారా జ్ఞానాన్ని పొందుతాము. ఆ జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడము – ఇదీ ఒక లక్ష్మియే! మొత్తం ధనానికి ఆధారం – వినటం. ప్రపంచంలోని అన్ని రకాల లక్ష్మీధారలను ఆకర్షించటానికి గల ఏకైక మంత్రం.

**ఓం శ్రీం హ్రీం శ్రీం కమలే కమలాలయే ప్రసీద, ప్రసీద శ్రీం హ్రీం శ్రీం ఓం మహాలక్ష్మ్యై నమః॥**

ప్రతీ నెలా అమావాస్యకు రెండు రోజులు ముందు, రెండు రోజులు తర్వాత శ్రీ విద్యారణ్యప్రోక్త బీజమంత్రసంపుటిత శ్రీ సూక్త పారాయణ చెయ్యాలి – చెయ్యటంతోపాటు మంత్రాన్ని వినగలగాలి. ధనాకర్షణకదే ముఖ్యం. మరొక నియమం

**యః శుచిః ప్రేయతో భూత్వా జుహూయాదాజ్య మన్వహం ।**
**శ్రియః పంచదశర్చంచ శ్రీకామః సతతం జపేత్ ॥ (శ్రీసూక్తం)**

**'శ్రీ' అంటే లక్ష్మిని కోరుకునేవాడు పాటించవలసిన మరో నియమం. ఇంట్లో ప్రతి వస్తువు శుచిగా, శుభ్రంగా ఉండాలి.** ప్రతి వస్తువూ సమకోణంలో వుండాలి. విరిగిపోయిన కుర్చీలు, బక్కెట్లు, ప్లాస్టిక్ మగ్గులూ పారెయ్యాలి. వాటిని ఇంట్లో వుంచుకోకూడదు. స్వచ్ఛమైన వస్తువులను

దేనిని ఎక్కడ, ఎలా అమర్చాలో అక్కడ అందంగా, పొందిగ్గా అమర్చాలి. **ధనాన్ని ఆకర్షించుకోదలచిన వారు ఏ వస్తువునూ వృధా చెయ్యరాదు.** ఎండిపోయిన పూలదండలు, వాకిలికి తోరణాలు ఉంచ రాదు. ఇళ్ళల్లో ఉండే దేవతా మందిరాలలో దేవుడి ఫోటోలను ఎప్పటికప్పుడు దుమ్ము పట్టకుండా చూచుకోవాలి. ఇళ్ళల్లో బూజు వేళ్ళాడకూడదు. దానిని అలా ఉంచామా, మన బుఋలు కూడా బూజు పట్టిపోతాయి.

భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ ఈ చిన్న, చిన్న నియమాలను పాటించితీరాలి. ఇళ్ళను మాత్రమే కాదు. వీధులను కూడా శుచిగా, శుభ్రంగా వుంచటానికి ప్రయత్నించాలి. వాల్మీకి ఆశ్రమాల్లా ఇళ్ళను కూడా అందంగా పెట్టుకోవాలి. చెట్లను, లతలను వీలైనంత ఆకర్షణీయంగా అమర్చుకోవాలి. సామానులను సవ్యంగా సర్దుకుని ఇల్లును విశాలంగా వుంచుకోవాలి. కుర్చీలను, బల్లలను బర్రు, బర్రున లాగితే ఆ గీత మనం చేసే మహాలక్ష్మి సాధన మీద పడుతుంది. దాని వలన సాధనా ఫలితాలు తగ్గిపోతాయి.

**ధనాన్ని ఆకర్షించుకోవటానికి పాటించాల్సిన ఇంకో నియమం నీళ్ళు.** ఈ నీళ్ళను గురించి చెప్పాలంటే 'నీరే ప్రాణాధారమని' పెద్దలు చెప్తుంటారు గదా. **నీళ్ళకు – ప్రాణశక్తికి** చాలా దగ్గర సంబంధం ఉంది. అందుకే పూర్వకాలంలో 'నీళ్ళను వృధాగా ఖర్చు చేయరాదని' పదేపదే హెచ్చరించేవారు. డబ్బును ప్రాణప్రదంగా చూస్తాము గదా. మరి నీరూ, అలాంటి ప్రాణమే కాబట్టి నీటిని వృధాగా వాడే వారి దగ్గర ధనం నిలవదు. ఓవర్ హెడ్ ట్యాంకులో నీరు ఓవర్ ఫ్లో కాకుండా చూచుకోవాలి. మాస్టర్‌గారు గుంటూరులో వుండే రోజులలో మోటర్ వేసిన కొంతసేపటికి ఒకళ్ళను పైకి వెళ్ళి చూడమని చెప్పేవారు. ట్యాంక్ కాస్త వెలితిగా వున్నప్పుడే మోటర్‌ను ఆపమని చెప్పేవారు. పొరపాటున ఎప్పుడైనా ట్యాంక్ ఓవర్ ఫ్లో అయిందా, ఇంక ఆ రోజు వాళ్ళ పని అయిపోయిందే! నీటి విషయంలో అంత జాగ్రత్తలను పాటించేవారు.

నీటి మాదిరే అగ్నిని కూడా మనం లక్ష్మీదేవిలాగా ఆరాధించాలి. "ధనమగ్నిర్ధనం వాయుః" అని సూక్తమున్నది గదా! సాయంత్రం దీపం వెలిగిస్తూ, దీపలక్ష్మిగా మన్నిస్తూ – 'తమసోమా జ్యోతిర్గమయా' అనుకోవాలి. అది మనలో ఆవహించిన అజ్ఞానాంధకారాన్ని పారద్రోలుతుంది. ఇంకో విషయం – నీరు, అగ్ని లేకుండా వంట చెయ్యలేము. నీటిలో వుండే మాలిన్యాలన్నీ అగ్ని సంపర్కంతో ఆవిరైపోతాయి. అలానే మనలో వుండే కుసంస్కారాలనబడే మాలిన్యాలన్నీ జ్యోతి

ప్రజ్వలనతో కడిగివేయబడతాయి. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే **మనో నిగ్రహానికి – దీపప్రజ్వలన చాలా అవసరం.**

అందుకే ప్రతినెలా అమావాస్యకు ముందు త్రయోదశి, చతుర్దశి, అమావాస్య, పాడ్యమి, విదియ తిథులలో శ్రీమహాలక్ష్మి సాధనను సామూహికంగా చేస్తూ , దీపావళికి తర్వాత వచ్చే తదియనాడు అందరూ కలసి పూర్ణాహుతిని చేసుకోవాలి.. "మట్టిని పట్టుకున్నా వాడికి బంగార మౌతుందనే" నానుడిని తరచుగా వింటూ వుంటాము. అదీ మీ చేతులలో కూడా వున్నది. నీ చేతిలో సువర్ణవిద్యను సాధించాలంటే **నిద్రలేవగానే – అరచేతిని చూసుకోవాలి. అలా కాసేపు చూసుకోవాలి. అరచేతిని అలా చూస్తూ ఉండటము అంటే వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకూడదు అని అర్థము. అలా ప్రతిరోజూ అరచేతిని చూసుకోవటం అంటే మన చేతలు, మహాలక్ష్మి సాధనకు అనుగుణంగా వుండాలి, వచ్చిన అవకాశాలను అలసత్వంతో, బద్ధకంతో జారవిడుచుకోకూడదు అని అర్థం.**

నీటిని వృధా చెయ్యకూడదని చెప్పాను గదా! ఎందుకంటే శ్రీమహాలక్ష్మి అమ్మ ఎక్కడ ఆవిర్భవించింది? సముద్రంలోనే కదా! అందుచేత నీటిని ఎక్కువగా వాడే స్థలాలను అంటే బాత్‌రూమ్‌ను లావెట్రీలను ప్రతిరోజూ శుభ్రంగా వుంచుకోవాలి. నీటి యొక్క సద్వినియోగం ద్వారా శ్రీమహాలక్ష్మిని పొందవచ్చు. నీటిని సద్వినియోగం చేసే చోట నీటి కొరత రానేరాదు. నీటి కొరత వున్న చోట కూడా అలాంటి వాళ్ళకి నీరు లభిస్తుంది.

భీష్మాచార్యుల వారు అంపశయ్య మీద వున్నా, అర్జునుడు భూగర్భజలాలతో ఆయన దాహాన్ని తీర్చాడు. అలా ఆ నియమాలను కనుక దీక్షగా పాటిస్తే నీకే కోరిక వున్నా తక్షణమే తీరుతుంది. ఎప్పుడు, ఎక్కడ, ఏ పని కనిపించినా ముఖ్యంగా దేవాలయాలలో అరటితొక్కలు, కొబ్బరి చెక్కలు, వాడిపోయిన పూలదండలు, క్రిందా మీద పోసిన ప్రసాదాలతో ఉండటం, భక్తులు వాటిని తొక్కుకుంటూ వెళ్తుండటం చూస్తుంటాం, కానీ ఎవ్వరూ దానిని పట్టించుకోనే, పట్టించుకోరు. ఇలాంటి పరిస్థితిని ఎప్పుడు గమనించినా వెంటనే ఆ దేవాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయటం వలన మీకు జరగవలసిన పనులకు వచ్చే అవరోధాలు తొలగిపోయి తక్షణమే మీ పనులకు సానుకూలత కలుగుతుంది.

**ధనాన్ని ఆకర్షించాలనుకునే వారు ఏ పనినైనా తక్షణం చేయటం అలవాటు చేసుకోండి.** మీ జీవితాలలో డబ్బు రావాలంటే 'డబ్బు టు ద పవర్ ఆఫ్ డబ్బు' అనే పుస్తకాన్ని చదవండి. ముఖ్యంగా మీ మాటతీరు మీకు డబ్బును సంపాదించిపెడుతుంది. శ్రీమహాలక్ష్మి సాధనలో మాటను అంటే అగ్నిని ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకోవటం వస్తుంది.

## శ్రీమహాలక్ష్మీసాధన

అసలు విశ్వప్రణాళిక ఏమిటి? ఈ ప్రణాళికలో వున్న శక్తులు ఏమిటి? ఆ శక్తుల యొక్క నియమాలు ఏమిటి? ఆ నియమాలను మనము ఎలా ఉపయోగించుకోవాలి అనే విషయాలను గురించి కూలంకషముగా తెలుసుకుందాము.

ప్రకృతిలో నాలుగు రకాలైన శక్తులు ఉన్నాయి. వాటిని మనము నాలుగు దిశలు అంటాము. ఏ దిశవైపు వెళ్తున్నావు అంటే ఏ లక్ష్యం వైపు వెళ్తున్నావు అని అర్థం. కానీ ఇప్పుడు మనం దిశ అంటే ఏమనుకుంటామంటే ఉత్తరదిశ, తూర్పుదిశ, పశ్చిమదిశ , దక్షిణదిశ అని. ఎటువైపు కూర్చుంటే ఎక్కువ పుణ్యము వస్తుంది, ఎటు కూర్చుంటే కష్టాలు వస్తాయని ఆలోచిస్తుంటాము. పడమటి దిశలో వెళ్ళవలసిన వాడు తూర్పుదిశలో వెళితే చేరవలసిన గమ్యానికి ఎప్పటికీ చేరలేడు. అంచేత దిశ అంటే ఏమిటి? **జీవితాలు ఏ లక్ష్యం వైపు వెళుతున్నాయి అనేది గమనించుకోవాలి.**

**(1) జ్ఞాన సంపాదన వైపు వెళితే దాన్ని పూర్వదిశ అంటాము.**

**2) ధన సంపాదన వైపు వెళితే దాన్ని ఉత్తరదిశ అంటాము.**

**(3) ఇతరుల కోసం పనిచేస్తున్నప్పుడు కానీ, ప్రకృతి రహస్యాలను తెలుసుకోవటానికి కానీ పనిచేసే దిశను పశ్చిమదిశ అంటారు.**

**(4) వీటన్నింటినీ ఒక విశేషమైన లక్ష్యం వైపు నియామకం చేస్తే దాన్ని దక్షిణదిశ అంటారు.**

కనుక ఇప్పుడు ఏదిశలో కూర్చుని ఏమి చేయాలో మీరు అర్థము చేసుకోండి. తంత్రవిద్యలో ఈ నాలుగు దిశలకు నాలుగుపేర్లు చెప్పారు. వాటినే 1.మహేశ్వరీ, 2. మహాలక్ష్మి, 3. మహాసరస్వతి, 4. మహాకాళీ లేక మహారుద్ర అంటారు. **శ్రీరామకృష్ణ పరమహంస మహాకాళీ ఉపాసన చేశారు. శ్రీరామశర్మ ఆచార్య మహాకాల ఉపాసన చేశారు. ఈ శక్తులన్నింటికీ ఆధారభూతమైన శక్తి సూర్యుడు.**

**ఆ సూర్యుడి యొక్క కిరణాలే ఈ నాలుగు రూపాలు ధరించి మహాలక్ష్మీ, మహాకాళీ, మహాసరస్వతీ, మహేశ్వరీ స్వరూపాలుగా ప్రకటితమౌతున్నాయి.** మహాలక్ష్మీసాధన ఎప్పుడూ కూడా మహాకాళీ సాధనకు లొంగివుంటుంది. ఉదాహరణకి బ్యాంకు వేళలు ఉదయం 10 నుండి సాయంత్రం 4 వరకు అనుకోండి. ఆ సమయంలో వెళితేనే మనకు డబ్బు ఇస్తారు. ఆ తరువాత డబ్బు ఇవ్వరు. అసలు మహాలక్ష్మీ అంటేనే వనరులు. అంటే ఈ వనరులన్నీ కూడా మహాకాలుడి అధీనంలో ఉంటాయి.

**వనరులను ఏర్పరచుకోవడమే మహాలక్ష్మీ సాధన యొక్క ఉద్దేశ్యము. మహాలక్ష్మీ ఎప్పుడూ కాలాన్ని సద్వినియోగము చేసుకోగలిగే వాడి చేతుల్లోనే వుంటుంది.** మహాలక్ష్మి కావాలనుకునేవారు ఆ మహాకాళీ, మహాకాల (సమయపాలన) అనుష్టానాలు చేయాలి. అది చేయని వారి చేతిలో డబ్బు నిలబడదు. వనరులు నిలబడవు. అందుచేత ముందు ఒక టైమ్‌టేబుల్ వేసుకోవాలి. టైమ్‌టేబుల్ అంటేనే మహాకాలుడు. ఏదైనా పొందాలి అనుకుంటే సమయాన్ని సద్వినియోగము చేసుకోవాలి. అందులోనూ ఈ క్షణాన్నే సద్వినియోగం చేసుకోవాలి. రాబోయే క్షణం మీ చేతుల్లో లేదు. అందుచేత మహాకాళీ, మహాకాల సాధన జాగ్రత్తగా అర్థం చేసుకొని ఆచరించాల్సి వుంటుంది. వనరులు సాధించటానికి ఒక ముద్ర వుంది. దాన్ని కుబేర ముద్ర అంటాము. పెన్నుతో రాయాలి అంటే పెన్నును చేతితో మనకు అనుకూలమైన పొజిషన్‌లో (కుబేరముద్ర) పెన్ను పట్టుకుని వ్రాస్తాము.

**అలాగే మహాలక్ష్మీ సాధన చేయదలుచుకున్న వాళ్ళకి కుబేరముద్ర చాలా అవసరము.** ఇప్పుడు కుబేరముద్ర అంటే ఏమిటో నేర్చుకుందాము. దీనికి ముందు ప్రాణశక్తిని ఎలా దింపుకోవాలో నేర్చుకోవాలి. చిన్ముద్ర లేదా జ్ఞానముద్రతో మొత్తము శరీరాన్ని ప్రాణశక్తితో కడిగేసుకుని, భూమిలోంచి మీకు కావలసిన శక్తిధారలు పీల్చుకొని నూతనశక్తిని, ఉత్సాహాన్ని నింపుకోవాలి.

## సాధన

నిటారుగా కూర్చుని కళ్ళు మూసుకోండి. శ్వాసను గమనించుకోండి.

చేతులు చిన్ముద్రలో పెట్టుకోండి. చిన్ముద్ర అంటే చూపుడువేలు, బొటనవ్రేలు కలిపి ఉంచుకోవడము. శాంతంగా మనసును ఆలోచనరహితంగా వుంచుకొని మౌనంగా కూర్చోండి. **చిన్ముద్ర**

**మనస్సును పవిత్రం చేస్తుంది. అందుకనే ఎప్పుడూ చిన్ముద్రలో వుంటే మంచిది. మనస్సు పరిశుద్ధంగా వుంటే సహజంగా మనం చేసేదంతా పరిశుద్ధంగా ఉంటుంది. మనస్సు పరిశుద్ధము చేసుకోవడానికి ఉపయోగపడే ఈ ముద్రని చిన్ముద్రని కొంతమంది, జ్ఞానముద్రని కొంతమంది అంటారు. ఆకాశము వైపు తిప్పుతే దాన్ని చిన్ముద్రనీ, భూమి వైపుకు తిప్పితే దాన్ని జ్ఞానముద్రనీ అంటారు. కానీ రెండింటి ఫలితాలు ఒకటే. ఎలా పెట్టినా మనస్సు పవిత్రం అయిపోతుంది.**

ఈ విశాల విశ్వములో ప్రతి కణము కూడా ప్రాణశక్తిలో కొట్టుకుపోతున్నదని యోగులు, శాస్త్రజ్ఞులు నిర్వివాదంగా చెప్పారు. ప్రస్తుతము మీరు అందరూ ప్రాణసముద్రంలోనే కూర్చుని ఉన్నారు. ఏ పని చేస్తున్నా అంటే తిరుగుతున్నా, తింటున్నా, నిద్రపోతున్నా కూడా ఉండేది మీరు ఆ ప్రాణసముద్రంలోనే. అంచేత ఆ ప్రాణసముద్రానికి ఇప్పుడు మీరు ఈ జ్ఞానముద్ర ద్వారా మీలో ఉన్నటువంటి మాలిన్యాలని కడిగేసుకోవడానికి పర్మిషన్ ఇస్తున్నారు. ముద్రతో పాటు అనుభూతి కూడా ఉంటేనే కానీ ఫలితము రాదు.

ఆ విశాలమైనటువంటి ప్రాణప్రవాహం బ్రహ్మరంధ్రం నుండి పడుతూ, మీ శరీరమంతంటా వ్యాపిస్తూ, మీలోని చెత్తాచెదారాన్ని భూమిలోనికి తీసుకుపోతున్నది, భూమి మీలోకి తిరిగి శక్తినిస్తున్నది అని భావించాలి. ఒక బీజము మహావృక్షంగా మారటానికి కావలసిన శక్తిని భూమి ఇస్తుంది. మూలాధారం ఇస్తుంది. పృథ్వి ఇస్తుంది. అందుచేత పైనుండి పడుతున్నటువంటి ఆ ప్రాణశక్తిధారలు మిమ్మల్ని పూర్తిగా పరిశుభ్రం చేస్తున్నాయనే భావనతో పాటు ప్రతి కణములో ఆ ప్రాణశక్తి ప్రవాహాన్ని అనుభూతి చెందగలగాలి. అది మొదటిసారే రాదు. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో విధిగా చేసినట్లయితే ఆ ప్రాణశక్తి ప్రవాహం మీకు అర్థమైపోతుంది. భావన చాలా ముఖ్యం.

1. నడుము నిటారుగా పెట్టుకోండి. శరీరాన్ని కదపొద్దు.
2. బ్రహ్మరంధ్రములోనుండి ప్రాణశక్తి అత్యంత వేగముగా దూసుకొస్తుంది. తీవ్రమైన వేగముతో నీరు ప్రవహిస్తున్న ట్యూబ్‌ని చేతితో పట్టుకుంటే ఎలా కుదిపినట్లుగా వుంటుందో అలాంటి భావన తెచ్చుకోవాలి.
3. ముద్ర బిగించి పట్టుకోవలసిన అవసరం లేదు. స్పర్శ ఉంటే చాలు. బిగిస్తే అక్కడే ఆగిపోతారు. బొటనవ్రేలు, చూపుడువ్రేలు కలిసివుంటే చాలు.

4. మీలోవుండే పనికిరాని ఆలోచనలు, చెడుపదార్థాలు, వీటినే టాక్సిన్స్ అంటాము. ఇవన్నీ కొట్టుకుపోతున్నాయి అనే భావన చేయాలి.

5. పై నుండి ప్రవహిస్తున్న ప్రాణశక్తి టాక్సిన్స్‌ని తీసేస్తోంది, ఆ తరువాత భూమి క్రింది నుండి సంజీవనీ శక్తిధారలను ఇస్తున్నది. ఆ ఆత్మశక్తి, ఆ భూమిలోని ప్రాణశక్తి ఈ కణకణాల్లో చేరుతోంది. ప్రతి కణములో వున్నటువంటి కషాయకల్మషాలను తీసివేస్తోంది. ప్రతి కణము లోనూ ప్రాణశక్తి ప్రవేశిస్తోంది. మీకు ఇప్పుడు నూతన ఉత్సాహము, శక్తి వస్తున్నాయి అనే భావన చేయాలి. ఇప్పుడు చిన్ముద్రను వదిలేయాలి. ఇది సాధనకి మొదటి మెట్టు. ఇలా రోజుకి కనీసము రెండుసార్లు దింపుకుంటూ ఉంటే కొన్ని సంవత్సరాలకి ఎలా దిగుతుంది అనే అనుభూతి తెలుస్తుంది. దీని తర్వాత మహాలక్ష్మి సాధనకి అవసరమైన కుబేరముద్ర ఎలా వేయాలో తెలుసుకుందాము.

   అ) కుబేరముద్రలో చిటికిన వ్రేలు, ఉంగరపు వ్రేలు అరచేతివైపు ముడిచి వుంచాలి. తరువాత మధ్య వ్రేలు, చూపుడు వ్రేలు, బొటన వ్రేలు కలపాలి. ఇలా రెండు చేతులతోను చేయాలి.

   ఆ) చిటికిన వ్రేలు, ఉంగరపు వ్రేలు ముడిచి ఉంచడమంటే ప్రాణవాయువు, ఆపాన వాయువుని క్లోజ్ చేసేశాము అని అర్థము. చిటికిన వ్రేలు ప్రాణవాయువు. ఉంగరపు వ్రేలు అపానవాయువు. అంటే ప్రాణశక్తి ప్రవాహాన్ని అదుపు చేయడమని అర్థం.

   ఇ) మిగిలిన మూడు వ్రేళ్ళలో – సమాన (మధ్య వ్రేలు), వ్యాన (చూపుడు వ్రేలు), ఉదాన (బొటన వ్రేలు) వాయువులని మనం కలుపుతున్నాం. ఈ వాయువుల కలయిక సాధకుణ్ణి కుబేరుడిని చేస్తుంది. అందుకే కొందరు మట్టి ముట్టుకున్నా బంగారమైపోతుంది. వారు ఏమడిగినా ఎవరూ కాదనకుండా ఇచ్చేస్తారు.

స్వామి రామతీర్థ మొదటిసారి అమెరికా వెళ్ళారు. అక్కడ ఆయనకు ఎవరూ తెలియరు. ఇంకో రెండు గంటల్లో ఓడలోంచి దిగి అమెరికాలో కాలు పెట్టాలి. ఆ స్థితిలో ఒక అమెరికన్ వచ్చి ఏమండీ మీరు చూస్తుంటే సన్యాసిలా వున్నారు. అమెరికాలో మరి మీకు ఎవరైనా తెలుసా అని అడిగాడు. అప్పుడు స్వామి తెలియకేం, తెలుసు అన్నారు. ఎవరు అంటే నువ్వే అని సమాధాన

మిచ్చారు. ఇంక స్వామి అమెరికాలో ఉన్నంతవరకూ ఆయనకు కావలసిన సదుపాయాలన్నీ ఆయనే చూసుకున్నారు. ఇది కుబేరముద్ర యొక్క లక్షణం. మహాలక్ష్మీదేవి చేతిలో రెండు పద్మాలు వుంటాయి. ఈ ముద్ర అలానే వుంది కదా! మొదటిది ఈ ముద్ర శరీరం ఏ పద్ధతిలో వున్నా పెట్టేసుకుంటే ఆ ప్రాణశక్తి అలా ప్రవహిస్తూనే వుంటుంది. ఈ ముద్రని సరిగ్గా మడచగలిగితే అరచేతిలోని హెడ్‌లైన్ యొక్క మడతలో పడుతుంది. ఇది పామిస్ట్రీ తెలుసున్న వాళ్ళకి తెలుస్తుంది.

రెండవది ఎప్పుడు **చిటికెన వ్రేలు, ఉంగరపు వ్రేలు ముడిచారో అప్పుడు మీ అహంకారము ప్రక్కకు వెళ్ళిపోతుంది. నేను చదివిన దాన్ని బట్టి దీనినే కల్పవృక్షముద్ర అని కూడా అంటారు. ఏమి కోరుకుంటే అది జరుగుతుంది. కుబేరముద్ర వేసుకున్నప్పుడు భావతీవ్రత ఉండాలి. శక్తికి హద్దు అంటూ ఏమీ వుండదు. మీకు ఉపయోగించుకోవడమే చేతకావాలి. ఇది కేవలము స్వార్థానికి కాదు. మీతో పాటు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా వుండాలి.** అందరి బాధలు నివారించుకునేందుకు దీనిని ఉపయోగించుకోండి.

## రెండవ సాధన

మహాలక్ష్మిసాధనలో మొట్టమొదట కోరుకోవాల్సినది

1. వ్యక్తిగత ఆరోగ్యము, 2. కుటుంబసభ్యుల ఆరోగ్యము, 3. సమస్యల పరిష్కారము.

**కుబేరముద్ర సాధించుకున్నవాడు, ఇతరులకు సేవ చేస్తాడు తప్ప వాడికి ఎవరూ సేవ చేయవలసిన అవసరం రాదు.** అందువల్ల వ్యక్తిగతమైన ఆరోగ్యాన్ని, సమస్యల పరిష్కారాన్ని కోరుకుంటూ మీ శరీరములోని ఏ బాధైనా, అనారోగ్యమైనా ఉంటే దాని పేరు చెప్పి (ఉదా. డయాబిటీస్, హార్ట్ ప్రాబ్లమ్). **నా ఈ బాధను ప్రాణశక్తి నిర్మూలించుచున్నది. అని స్పష్టముగా మూడుసార్లు అనుకోండి.** ఆయా శరీరభాగాలలోకి ప్రాణశక్తి ప్రవేశించుచున్నది అని భావించండి. మీ ఊహ, మీ భావతీవ్రత మీకు ఫలితాన్ని ఇస్తుంది. సమాజములో ఉండవలసిన కామ్యములు పెళ్ళిళ్ళు, ఉద్యోగాలు, కోర్టు కేసులు వగైరా కూడా ఈ కుబేర ముద్ర తీరుస్తుంది. ముద్ర అంటేనే సీల్. మహాలక్ష్మి అంటేనే వనరులు. ధాన్యలక్ష్మి, విజయలక్ష్మి, ధైర్యలక్ష్మి, మోక్షలక్ష్మి, యోగలక్ష్మి, ధనలక్ష్మి, సంతానలక్ష్మి, విద్యాలక్ష్మి అనబడే అష్టలక్ష్ముల కలయికయే శ్రీమహాలక్ష్మి.

1. పరిపూర్ణమైన ఏకాగ్రతతో చేయండి. ప్రాణాయామము, మంత్రజపము చేయవద్దు. ఈ నిర్ధారిత సాధనలో, ధ్యానములో శ్వాస మీకు గురువుగా పనిచేస్తుంది.

2. ఈ శ్వాసే మిమ్మల్ని అంతర్‌యాత్రకు తీసుకువెళుతుంది. మీరు ఆ అంతర్‌యాత్రకు వెళ్ళగలగాలి. కొద్దిసేపటి తరువాత కళ్ళు తెరవండి. తరువాత మీకు వచ్చిన అనుభూతులు నోట్ చేసుకోండి.

ఎటువంటి పరిస్థితులలో అయినా మీరు దీనిని చేసుకోవచ్చు. చివరికి ఈ సాధన నిద్రలో కూడా జరగడం మొదలెడుతుంది. అందుకే ఈ యోగసాధన గురించి శ్రీకృష్ణుడు

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ (భ.గీ. 6-17)**

అని చెప్పారు. యుక్తమైన ఆహారమే కాదు. యుక్తమైన విహారమే కాదు. యుక్తమైన చేష్టలేకాదు. యుక్తమైన స్వప్నములు కూడా చూడగలగాలి. అంటే నిద్రపోతున్నప్పుడు కూడా మీకు ఈ శ్వాస గమనం తెలియడం మొదలౌతుంది. 5 రోజులలో మీకు ఇది తెలిస్తే మీరు పురాకృత యోగులైనట్టే. హనుమంతుడు పుట్టగానే అనేకమంది దేవతల వరదానాలు పొందాడు. కానీ రామకార్యము చేయనంతవరకు భయపడుతూ, ఏకాంతంలో, ఒంటరిగా, నిస్సహాయస్థితిలో ఋష్యమూకపర్వతం మీద గడిపాడు. మరి హనుమంతుడికి శక్తిలేదా? ఉంది. కానీ రామకార్యానికి వినియోగించలేదు. **మనమూ మనకున్నటువంటి ఈ శ్వాసను కానీ, వనరులను కానీ, జీవితాన్ని కానీ, భగవత్ కార్యానికి వినియోగిస్తే మనలో నిద్రాణస్థితిలో వున్నటువంటి ఆ యోగశక్తులన్నీ తక్షణమే లేస్తాయి. ఆ నమ్మకంతో ఈ సాధన చేసుకోండి.**

## భారతదేశము యొక్క పాత్ర

పూజ్యశ్రీ మాస్టర్‌గారు, "నా గురుదేవుల పని చెయ్యటమే" నా జీవితలక్ష్యం అని పదేపదే చెప్తుండేవారు. ఆధ్యాత్మిక విద్యను నేను మాత్రమే చెప్తున్నాను. "నేను, నా గురువుల ప్రతినిధిని. గురువులు మీ పిచ్చి పిచ్చి కోరికలు తీర్చటానికి భూమి మీదకు రాలేదు. వారివ్వాలనుకున్న దానిని మీరు తీసుకోవటానికి రావటంలేదు." ఈ భూమి మీద ఎంతోమంది గురువులున్నారు. ఎన్నో రకాలుగా మానవజాతికి వారి, వారి జ్ఞానాన్ని అందించటానికి ప్రయత్నిస్తూనే వున్నారు. కానీ 'నేను మాత్రమే పరమగురువులందిస్తున్న విద్యను చెప్తున్నాను. గురువులు చెప్తున్న విద్య – వారిచ్చిన

నియమాలు పాటిస్తేనే – వాటి, వాటి ఫలితాలు వస్తాయి. ఎలక్ట్రిసిటీని ఉపయోగించుకోవాలంటే దాని నియమాలను పాటించాల్సిందే కదా! అలానే గాయత్రీమంత్రాన్ని ఎలా ఉపయోగించుకోవాలో శ్రీరామశర్మ ఆచార్య నేర్పారు.' గాయత్రీ మహావిజ్ఞాన్ చదివితే ఆ వివరాలు తెలుస్తాయి. గాయత్రీ మంత్రం చేస్తూ ఉన్నా, స్వాధ్యాయం కూడా వుంటేనే ఆధ్యాత్మిక ప్రగతిని సాధించగలం అని ఆయన చెప్పేవారు.

**సూర్యుణ్ణి హృదయంలోకి దింపుకుంటే రోగాలు నయమైపోతాయి.** ఎవ్వరినీ ఏమీ అడగఖ్ఖర్లేదు. గురువుల పనులు చేస్తుంటే వనరులు వాటంతటవే వస్తాయి. ఎవ్వరినీ ఏమీ అడగక్కరలేదు – అనేది మాస్టర్‌గారి సిద్ధాంతం.

అనంతమైన ఈ జ్ఞానాన్ని అందించాలనే ఆశ్రమాలు పెట్టాను. కానీ సర్వతోభావంగా సమర్పణ చేసుకున్న వ్యక్తులు రాలేదు. **పూజ్య గురుదేవులు 'మీ కోరికలు తీర్చటానికి, వీరభద్రులను పెట్టారు. అడిగితే చాలు మీక్కావలసిన ఆ పరిస్థితులు అవే వస్తాయి. మీ కోరికలు తీర్చుకోవాలంటే గురువుల దగ్గరకు రానక్కర్లేదు.** వాళ్ళ విగ్రహం దగ్గర లేదా వాళ్ళ ఫోటో దగ్గరకు వెళ్ళి మీ సమస్యలను చెప్పుకున్నా చాలు, మీ పనులు అయిపోతాయి.

'నేను మాత్రం నా గురువుకి 2011 అంటే జన్మ శతాబ్ది వరకు వారి ప్రణాళికలను పూర్తి చెయ్యటానికి పని చేస్తాను' అని తమ జీవితపరమావధిని చాలా స్పష్టంగా చెప్పేవారు. జన్మ శతాబ్ది వరకు పూజ్య గురుదేవుల వాఙ్మయాలను అధ్యయనం చేస్తూ అందులో ఇవ్వబడిన విశేషసాధనలను, సాధన శిబిరాల ద్వారా ఆ అఖండమైన విజ్ఞానాన్ని, జ్ఞానాన్ని వివిధ కోణాలలో చెప్పడమనేది మాస్టర్‌గారికి వెన్నతో పెట్టిన విద్య. వైజాగ్‌లో జరిగిన సాధనా శిబిరంలో "థాట్ రివాల్యుషన్" అనే అంశం మీద ప్రత్యేకమైన తరగతులు నిర్వహించారు. ఆనాటి ప్రవచనంలో పృథ్వీ గ్రహ చరిత్రలో భారతదేశము యొక్క పాత్ర ఎంత విశిష్టమైనదో చాలా అద్భుతంగా చెప్పారు.

**ఆనాటి ప్రవచనాన్ని గనుక మనం గుర్తుంచుకోగలిగితే గురుపరంపర, ఋషులు, యోగులు మనలను ఏ దిశకు తీసుకువెళ్తున్నారో చాలా స్పష్టంగా అర్థమౌతుంది. ఇక్కడ విశిష్టత అని చెప్పడంలో అర్థం దేశం గురించి కాదు. దేశానికి ప్రాధాన్యత లేదు అక్కడ. దాని పాత్ర గురించే మాట్లాడడం జరిగింది. శరీరంలోని అన్ని అంగాలలో శిరస్సు చాలా ప్రధానమైనది. అన్ని అంగాలను శిరస్సు**

**సమన్వయం చేస్తుంది. అలానే భారతదేశము యొక్క పాత్ర అంత విశిష్టమైనది. అంటే మిగతా దేశాలను గురించి మాట్లాడటం లేదక్కడ. అదీ మన ఆలోచనలలో రావలసిన మార్పు. మిగతా అన్ని దేశాలను సమన్వయం చేయవలసిన బాధ్యత భారతదేశం మీదనే ఉందనేది పరమగురువుల ప్రణాళికలోని ఒక భాగం. భారతదేశం విశిష్ఠమైనదేనని తెలుసు కాని ఎందులో? ఎందుకు? ఎలా? అనే విషయంలో స్పష్టత రావాలి.**

శిరస్సు శరీర అంగాలను సమన్వయం చేసినట్లే భారతదేశం అన్ని దేశాలను సమన్వయం చేసి అఖండ భారత నిర్మాణం చేస్తుందనేది తథ్యం. భారతదేశం అన్ని దేశాల సమన్వయ కర్త కావాలి. భారతదేశం ఎప్పుడూ, ఎక్కడా ఆక్రమణ చెయ్యలేదు. ఆక్రమణ చెయ్యటానికి వచ్చిన వారిని తనలో కలిపేసుకుంది. 'మెదడు' సమన్వయం చేసుకున్న జ్ఞానాన్ని, శరీరం ఆచరణలో పెట్టాలి.

**పృథ్వీ గ్రహం మీద భారతదేశ పాత్ర చాలా విశిష్టమైనది.** శరీర అంగాలను శిరస్సు నియంత్రణ చేసినట్లే భారతదేశము ప్రపంచదేశాల మధ్య భౌతిక, ఆధ్యాత్మిక రంగాలలో సమన్వయం చేస్తుంది. భౌతికత అంటే అందరికీ తెల్సిందే! మరి ఆధ్యాత్మికత అంటే

1. జీవించే కళ – ది ఆర్ట్ ఆఫ్ లివింగ్.
2. పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకునే కళ

నిత్య జీవితంలో చుట్టుప్రక్కల వారితో ఎలాగైతే సాన్నిహిత్యం పెట్టుకుంటామో అలాగే చుట్టుప్రక్కల భూఖండాల వారితో ఎలా సమన్వయం పెట్టుకోవాలో నేర్పుతుంది జియోపోలిటిక్స్. ఇతర భూ ఖండాల వారితో సంబంధమెలా పెట్టుకోవాలనే ఈ రకమైన జీవితవిధానం శ్రీ రామాయణం, మహాభారతంలో అద్భుతంగా చెప్పబడివుంది. రామాయణం అనగానే రామరాజ్యం గుర్తుకు వస్తుంది. అలా ఆదర్శవంతమైన రాజ్యాన్ని స్థాపించడం ఎలా? మహాభారతాన్ని ఎలా నిర్మాణం చెయ్యాలి? రామాయణం ఒక మూలస్తంభం అయితే మహాభారతం ఇంకో మూలస్తంభం. జీవితాలలో సంస్కృతి అనేది ఒక మూలఆధారం అయితే నాగరికత అనేది మరో ఆధారం. మానవజాతి అనే నది ప్రవహించాలంటే " సంస్కృతి మరియు నాగరికత (Culture and Civilization)" రెండు తీరాలు వుండాలి. అందులో రామాయణం ఒకటి అయితే మహాభారతం ఇంకొకటి.

రామాయణం అనగానే రామ, రావణ యుద్ధం గుర్తుకు వస్తుంది. రామ, రావణయుద్ధం జరిగిపోగానే రామరాజ్యం స్థాపన జరగలేదు. దానికి 10 వేల సంవత్సరాల సమయం పట్టింది. ఆ పనిలో పడిన శ్రీరాముడు శరీరాన్ని త్యజించాలనే విషయమే మరచిపోయాడు. యమధర్మరాజు వచ్చి పిలువవలసి వచ్చింది. అలా పనిలో నిమగ్నమైపోతే చనిపోవటం కూడా మర్చిపోవాలి. అలా పనిచేసిన వాళ్ళు చిరంజీవులై పోయారు. హనుమంతుడు, విభీషణుడు మొదలైనవారు. మహాభారతం అనగానే పంచపాండవులు, కౌరవులు కురుక్షేత్ర సంగ్రామం గుర్తుకు వస్తాయి. మహాభారతయుద్ధం జరిగిపోయి 5 వేల సంవత్సరాలైంది. **మహాభారతయుద్ధం దేనికి ఆధారం? నవభారత నిర్మాణానికి – ఒకే విశ్వానికి నాంది, దానిని సాధించటమెలా?**

**మహాభారతనిర్మాణం చెయ్యాలనేది శ్రీకృష్ణుని జీవితలక్ష్యం–జీవితపరమావధి కూడా.** దానికి మనం ఏం చెయ్యాలనే విషయం గురించి మాస్టర్‌గారు చాలా స్పష్టంగా జవాబు చెప్పారు. **మన జీవితాలను శ్రీకృష్ణునికి అప్పజెప్పేద్దాం. ఇంక అందులో మీకంటూ ఏ కోరికలూ ఉండకూడదు.** దానికి సంబంధించిన సాధనా విధానాలను ఎంతమంది, ఎలా చెయ్యాలో చెప్పారు. భగవద్గీత నేర్చుకున్న తరువాత మనం "కరిష్యేవచనంతవ" అని అనగలగాలి. శరీరం, మనస్సు, వాక్కు, కర్మలను శ్రీకృష్ణునికి సమర్పణ చెయ్యాలి. ఆ విధంగా 'శ్రీకృష్ణుడు నా జీవితరథసారథి' అనే మానసికస్థితిలో వుండే సమూహమును తయారుచేసిన తరువాత సంవత్సరంలోనే మహాభారత నిర్మాణం జరగాలనేది మాస్టర్‌గారి ఆకాంక్ష.

శ్రీకృష్ణుడు **గీతాజ్ఞాన ముపాశ్రిత్యా త్రీన్‌లోకాన్ పాలయామ్యహం** అన్నాడు. ఇంకా **యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం స్మృతం, తత్రాహం నిశ్చితం పృధ్వీ నివసామి సదైవహి'** అనేది శ్రీకృష్ణుడి వాగ్దానం. శ్రీకృష్ణచేతనత్వం ఈ భూమి మీదనే ఉన్నది. ఇవాళ హిమాలయాల నుండీ పరమగురువుల నుంచీ, 'భగవద్గీత ద్వారా మహాభారతనిర్మాణం జరగాలనేది మా ఆకాంక్ష' అని చెప్పారుట. మాస్టర్‌గారు అందుకొరకు 'నేను ఒక సంవత్సరంపాటు గీతా జ్ఞానయజ్ఞాలను ప్రచారం చేస్తాను. పరిపూర్ణమైన సమర్పణా భావంతో పని చేస్తే పరమగురువుల ప్రణాళికలు సాకారమౌతాయి, దానికి మీరెంతో కష్టపడాలి. అప్పుడే మీ జీవితం ధన్యమౌతుంది' అని దృఢంగా చెప్పారు.

## భగవద్గీతతో మహాభారతనిర్మాణం

ఈ బ్యానర్‌తో 2006 నవంబర్ 5వ తేది కార్తీకపూర్ణిమనాడు వణిదుద్రులో గీతా యజ్ఞం చేయించి, వచ్చే 2007 కార్తీక పూర్ణిమ వరకు ఈ యజ్ఞాలు ప్రతి ఏకాదశికి 18 అధ్యాయాలు పారాయణ చేస్తూ, యజ్ఞంలో ఆహుతులు ఇస్తూ తరువాత గీతా జయంతికి 'పూర్ణాహుతి' చెయ్యమని చెప్పారు. **గీతాయజ్ఞాల వలన సుస్థిరమైన పరిపాలనా వ్యవస్థ నిర్మాణమౌతుందని–** ఈ యజ్ఞశృంఖల విస్తృతంగా అన్ని ప్రాంతాలలో జరగాలని నిర్దిష్టంగా చెప్పారు. ఇంకా **అగ్ని ద్వారా, నీటి ద్వారా, పృథ్వి ద్వారా మూడు రకాల ముప్పులను మానవజాతి ఎదుర్కోవలసి వస్తుందనీ, గతంలో వచ్చిన సునామీల్లాంటివి ఇంకా ఎన్నో వస్తాయనీ, అవి వచ్చాక చేసే ప్రక్రియల కంటే ముందుగా వాటి నివారణకు శ్రీమద్భాగవత యజ్ఞాలు చేస్తే ప్రమాదాలు ఆగుతాయని చెప్పారు.** పరివార్‌సభ్యులకు శ్రీ మాస్టర్‌గారి మాటంటే వేదం. అలానే గ్రామ,గ్రామాలలో ఈ శ్రీమద్భగవద్గీత యజ్ఞాలు కూడా ఆ సంవత్సరమంతా ఆగకుండా జరిగాయి.

శ్రీమద్భాగవత యజ్ఞాలు 7 రోజులపాటు చేస్తే ప్రమాదాలు ఆగుతాయి. **పృథ్వి గ్రహానికి సేవ చేస్తున్నామన్న భావనతో భాగవతం మీద విశ్వాసంతో, శ్రీకృష్ణునిమీద ప్రేమతో, యజ్ఞాల మీద వున్న నమ్మకంతో ఈ భాగవత సప్తాహాలు చెయ్యమని చాలా నిష్కర్షగా చెప్పారు. సునామీ అంటే భూమిలో ఉన్న అగ్ని పైకి నీళ్ళగా, ఉధృతంగా ఎగసిపడి భూభాగాన్ని అంతటినీ ముంచివేసే ప్రక్రియ.**

**ఆపదల నుండి పృథ్వీ గ్రహాన్ని కాపాడటానికి 'శ్రీమద్భాగవతసాప్తాహిక యజ్ఞాలు', పృథ్విపై స్వర్గావతరణకు, మహాభారత నిర్మాణానికి ప్రతి ఏకాదశికి 18 అధ్యాయాలతో శ్రీ గీతాయజ్ఞాలు విస్తృతంగా ఒక సంవత్సరం పాటు గ్రామగ్రామాలలో జరగాలనీ, అవి సహస్ర భాగవత–షట్సహస్ర గీతా మహాయజ్ఞాలుగా జరిగి తీరాలని చెప్పారు.** ఇంకా 2007 శ్రీరామనవమికి నిత్యావతార దత్త క్షేత్రంలో పూర్ణాహుతి జరగాలనేది శ్రీశ్రీ మాస్టర్‌గారి ఆదేశం. వారిచ్చిన ప్రణాళిక ప్రకారం అత్యంత శ్రద్ధా భక్తులతో సాప్తాహిక భాగవత యజ్ఞాలు – ప్రతి రోజూ గీతాపారాయణలు సామూహికంగా ఏ ఊరిలో వారు ఆ ఊరిలోనే చాలా నిష్టగా చేయటం జరిగింది. అయితే కాలక్రమంలో అనుకోని మార్పులు రావటం అనేది సహజం. అందుచేత ప్రకృతి నిర్దేశించిన విధంగా కార్యప్రణాళికలో

మార్పు వచ్చింది. పరమగురువుల ప్రణాళికలు చిత్రవిచిత్రంగా మారిపోతుంటాయి. వాళ్ళనుకున్నది చేస్తారు. సాధనలు జరిగిపోయాయి. 2007 ఏప్రియల్ 29, 30, మే 1వ తేదీలలో "సహస్ర భాగవత – షట్సహస్ర భగవద్గీతాపారాయణల మహాపూర్ణాహుతి " కార్యక్రమాలు మూడు రోజులపాటు ముల్లోకాలు మురిసిపోయేవిధంగా పూజ్యశ్రీ మాస్టర్‌గారు 'శ్రీరామ హంస సహ్యాద్రి ఆశ్రమం' వాడరేవులో వేలాదిమంది భక్తజనులతో సాధనాపూర్ణాహుతిని మహాద్భుతంగా నిర్వహించారు. శ్రీ సుబ్బారావుగారి కుటుంబసభ్యుల నిర్విరామ కృషితో, సాధకులందరి సహకారంతో అత్యంత శోభాయమానంగా ఈ మహాయజ్ఞం సుసంపన్నమైనది.

## భాగవత పారాయణలు – వాటి ఫలితాలు

శ్రీమద్భాగవత యజ్ఞాల వలన ఎంతో మానసిక పరిణతి అభిస్తుంది. సుఖాలను అనుభవించలేరు ఎవ్వరూ. ఈ క్లాస్‌ల వలన మీరు గురుపరంపరకు అంకితమౌతారు. అలా,అలా మీ పరంపర మొదలౌతుంది. ఆదిశంకరుల పరంపరలోని శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామి జైలుకు ఎందుకు వెళ్ళారు? వీటికి జవాబులు నా దగ్గరున్నాయి. మీ పూర్వజన్మ, రాబోయే జన్మల గురించి తెలుస్తుంది. ఎప్పుడు? శ్రీమద్భాగవతం చదువుతే చాలు పరిపూర్ణమైన జ్ఞానం లభిస్తుంది. ఎలా?

(1) సూతులవారు చెప్పే కథలో మేము కూడా అందులో భాగస్వాములం అనే దృష్టితో చదవాలి.

(2) శ్రీశుకులవారి, పరీక్షిత్తుల భాగవతం చదివితే మన లక్ష్యం, జీవిత పరిణామక్రమం అన్నీ బోధపడతాయి.

**నేను గురుపరంపర యొక్క పునర్వ్యవస్థీకరణ కొరకు పాటుపడుతున్నాను. భాగవతం ద్వారా గురుపరంపరను క్రిందికి దింపే ప్రయత్నం చేస్తున్నాను. అందుకే ఈ పారాయణలు. హిమాలయాల లోని పరమగురువుల కోరిక మేరకు నేను ఈ భాగవతాలు చెప్తున్నాను. నేను చేస్తున్న ప్రతీ పనిని రికార్డెడ్‌గా వ్రాసి వుంచండి.**

**భాగవతంలో చెప్పబడిన ప్రేత స్థితి అనగా – ఏది తినలేరు, త్రాగలేరు.**

**(1) గ్యాస్ట్రిక్ ట్రబుల్:** మీరు సుఖాలను అనుభవించలేరు. తినకూడనవి తినటం వల్లనే ఈ గ్యాస్ట్రిక్ ట్రబల్.

**(2) పిశాచం:** ఏ రోగాలు వుండవు, రోగంలేకుండానే ఏదో వస్తుందని బాధపడటం. బాధలేదు కానీ బాధవస్తుందని 'బాధపడటం.

**(3) రాక్షసులు:** ఎదుటివారిని సుఖపడనీయరు. అనవసరంగా నీకు బాధ కలిగించని వారిని మాటల ద్వారా, చేతల ద్వారా బాధించే ప్రవృత్తి.

**(4) అసురులు:** అతి ముఖ్యమైన గుణం. "నేను చాలా గొప్పవాణ్ణి. నా పుట్టుక చాలా గొప్పది. నన్ను మించిన వారులేరు."– అని తనకుతానే భావించుకొనటం.

భాగవతం కనుక చదివినట్లైతే మీరు ఇలాంటి వాటి బారిన పడరు.

**సూతశౌనక సంవాదం వింటే రాక్షసప్రవృత్తి రాదు. ప్రేతము అనేది అది ఏదో కాదు. శరీరాన్ని ఏ పనికీ సహకరించకుండా చేస్తుంది. ఈ నాలుగు మన యొక్క విభిన్న మానసిక స్థితులు. ప్రేత అంటే ఇంద్రియాలకు బానిసలు.** సుఖమిచ్చే పరిస్థితులు కూడా మీకు బాధగానే వుంటాయి. భాగవత సప్తాహానికి పాటించవలసిన

మొదటి నియమం – ఆహారాన్ని చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలి.

2వ నియమం – ఆలోచనలు సవ్యంగా ఉండాలి. చాలా మౌనంగా వుండాలి. 40 ని॥ల పాటు ధ్యానం చెయ్యాలి. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో ధ్యానంలో కూర్చోవాలి.

3వ నియమం – రెగ్యూలారిటి. ప్రతీరోజూ క్రమం తప్పకుండా చేయాలి. సప్తాహాన్ని ఒక ఉత్సవంగా జరుపుకోవాలి.

## విద్య యొక్క లక్ష్యం ఏమిటి?

ఈ నాటి పిల్లలకు విద్య అనేది ఏమిటీ అని ఆలోచించటం నేర్పించాలి. ఈనాడు అది పోయింది. జీవితానికి లక్ష్యంగానీ, ప్రమాణాలు కానీ లేనేలేవు. వ్యవస్థ అనేది అసలే లేదు. లక్షల రూపాయలు పోసి చదువు కోవటం చూస్తున్నాము. మల్టీనేషనల్ కంపెనీలు మాత్రం అద్భుతంగా ఆర్గనైజ్ అవుతున్నాయి.

ఈనాటి ఆదర్శం ఏమిటంటే డబ్బు సంపాదించటం. ప్రస్తుతం మనం పిల్లలకు డబ్బు సంపాదించటం నేర్పుతున్నాం. కానీ, ఆదర్శాలను నేర్పడం లేదు. మానవీయ విలువలను నేర్పడం

లేదు. ప్రదక్షిణలు మానవజీవితాలను మార్చేస్తాయి. ఏ గుళ్ళోనైనా సరే 1గంటకు తక్కువ కాకుండా ప్రదక్షిణ చెయ్యాలి. **అలా చేస్తేనే గానీ, మనం చేసే వెధవ పనులకు పరిహారం చెల్లించడం కుదరదు. ప్రపంచమనే భగవంతుని క్షేత్రంలో దక్షిణరూపంలో ధనాన్ని నాటుకోండి. 1గంట కాలాన్ని ప్రదక్షిణలకు నాటుకుంటేనే గానీ మీ పాపాలు పోవు. ఇదొక సైన్సుగా చేసి చూపించాలి.** దేవతాశక్తులు మనకెందుకు పలకరు. ఒక శ్రీరామకృష్ణ పరమహంస, సక్కుబాయి, మీరాబాయి, వెంగమాంబ, తిరుమలలో హాథీరాంబాబా వీళ్ళకు భగవంతుడు పలకలేదా? మరి మనకెందుకు పలకటం లేదని ఎవరైనా ఆలోచించారా? ఎంతమంది మహనీయుల జీవితాలు మనకు ఆదర్శంగా నిలబడ్డాయో ఒక్కసారి చూడండి. భారత్ అంటేనే వెలుగు. ఆ వెలుగును దర్శించటం నేర్చుకోవాలి. మహాకాళి అన్నా మహాకాల అన్నా ఒక్కటే. మహాకాల్ అంటే కాలాన్ని కంట్రోల్ చేసే టెక్నాలజీ. మహా అంటే కంట్రోలింగ్ పవర్. ఆధ్యాత్మిక విద్య అంటేనే టైమ్ మేనేజ్‌మెంట్. మన గురుపరంపరనే చూడండి. వాళ్ళుకాలాన్ని ఎలా ఉపాసించారో అర్థమౌతుంది.

భగవద్గీతను గురుపరంపరలో ఎవరు, ఎలా ఉపయోగించుకున్నారో చూద్దామా!

(1) మాస్టర్ C.V.V – బ్లావేట్స్కీగార్లు – మమైవాంసోస్థితో జగత్ (గీత–46)

(2) అరవిందులవారు – వాసుదేవః సర్వమితి (గీత అధ్యాయం 7)

(3) లాహిరీ మహాశయులు – అపానేజుహ్యతి ప్రాణం (గీత అధ్యాయం 4)

(4) శిరిడీసాయి – యోయః శ్రద్ధస ఏవనః (గీత అధ్యాయం 7)

(5) రమణమహర్షి – అంతకాలేచమామేవ (గీత అధ్యాయం 8)

(6) శ్రీరామశర్మ ఆచార్య – సహయజ్ఞాః ప్రజాసృష్ట్వా (గీత అధ్యాయం 4)

(7) జిల్లెళ్ళమూడి అమ్మ – అన్నాద్భవంతి భూతాని (గీత అధ్యాయం 4)

ఒక చిన్న శ్లోకపాదాన్ని పట్టుకొని వారు ఎంతటి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారో అర్థమౌ తోంది కదా ! ఆ జ్ఞానాన్ని వారు ప్రపంచానికి ఎంత ఆదర్శవంతమైన మార్గంలో ఇచ్చారో కాస్త ఆలోచిస్తే మనకూ అర్థమౌతుంది. అలా ఒక సంవత్సరం పాటు గీతా, భాగవతములను పారాయణ చేయించి ఒక సంవత్సరం తరువాత వాటి పూర్ణాహుతిని చేయించటం జరిగింది.

**ప్రాక్టికల్ టిప్స్:** కొంతమంది పిల్లలు నిద్రలో ప్రక్కలు తడుపుతూంటారు. దానికి "బాబూ! నీవు పూర్వజన్మలో చేసిన పాపాలను అనుభవించనక్కరలేదు" అని బిడ్డ నిద్రపోయాక తల్లి,తండ్రి బిడ్డ చెవిలో చెప్తే సమస్య తీరుతుంది.

## గుంటూరు ఆశ్రమంలో చెప్పిన ముఖ్యమైన పాయింట్స్

నాతో ఉంటున్నవారు పనులు చేస్తున్నారు కానీ వారి పని దిశావిహీనంగా ఉంది. భాగవత యజ్ఞాలనేవి భగవంతునితో చేతులు కలిపి చేసే పనులు. మీకు శ్రీకృష్ణుని అనుగ్రహం చాలా, చాలా వున్నది. భాగవత యజ్ఞాలు జనవరి 1 నుండి ఆపేస్తున్నాను. ఇంతవరకు చేసిన యజ్ఞాల విలువను మీరు ఊహించలేరు. వాటి ఫలితాలను మీరు ఊహించలేరు. గురుప్రణాళికలో మీరు ఇంకా భాగస్వామ్యం చెయ్యండి. 2011 సంవత్సరం తర్వాత విచిత్రాలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ మూడు ముక్కలౌతుంది. ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమలను పరిపాలనా సౌలభ్యం కోసం మూడు భాగాలు చేసుకోవచ్చును. కానీ సి.యం, పి.యం. పోస్టుల కోసం మాత్రం కాదు. మాస్టర్‌గారిచ్చిన ప్రిడిక్షన్స్ సరదాగా చెప్పినవి కానేకాదు. వాటి నిదర్శనాన్ని 2014 ఎలక్షన్లో మనం కళ్ళారా చూశాం. వారు ఎంతటి సర్వజ్ఞులో, అంతటి సర్వసమర్థులు కూడా.

## మిషన్ ఆర్.కె. ట్రస్ట్‌కి శ్రీకారం

ప్రతివారు హనుమంతుడులాగా సూర్య విజ్ఞానాన్ని నేర్చుకోవాలి. యోగులు కావాలి. నిస్వార్థంగా రామకార్యం చేసేవారుగా ఉండాలి. మానవజీవితం యొక్క పరమార్థపుటంచుల ఆవలి గట్టును దర్శించాలి. దాని కోసమే మాస్టర్‌గారు అనేక ఆశ్రమాలను స్థాపించారు. వేలాది మంది సాధకులను తయారుచేశారు. అయితే దీనినంతటినీ వ్యవస్థీకృతం చేసేందుకు ఒక అద్భుతమైన వ్యవస్థను ఏర్పరచాలి. అది సర్వసత్తా ప్రభుత్వంలాగా అన్ని ఆశ్రమాల క్రియాకలాపాలను, సాధనా విధానాలను అత్యంత సునిశితంగా క్రియాన్వితం చేయగలగాలి. ఆశ్రమాల ఆలన, పాలన, ఆర్థిక వ్యవస్థనంతా ఒకే గొడుగు క్రిందకి తీసుకురావాలనే సంకల్పంతో మిషన్ ఆర్.కె.ట్రస్ట్‌నొక దానిని పెట్టాలని సంకల్పించారు. మాస్టర్‌గారిలో వున్న ఒక విచిత్రమైన గుణమేమిటంటే ఆయన ఎప్పుడు ఏ పని చేసినా దానికి ప్రకృతి నుండి ఏదో విధంగా ముద్రపడాలి. అప్పుడే అది గురువుల ప్రణాళికలోని భాగమని వారు గుర్తిస్తారు. ట్రస్ట్ పెట్టాలనే యోచనైతే చేశారు కానీ, తరువాత దానిని గురించి ఏమీ మాట్లాడలేదు.

భద్రాచలంలో సాధనాశిబిరం ఏర్పాటు చెయ్యమని చెప్పారు. "ఋషి వాక్యంతు కర్తవ్యం" అన్న ప్రమాణం ఆధారంగా తక్షణమే అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. చాలాకాలం తర్వాత ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఎంతో ఉత్సాహంతో అనుకున్న సమయానికి అన్ని ఊళ్ళ నుండి సాధకులు వచ్చేశారు. మాస్టర్‌గారితో కలసి లాంచీలో ప్రయాణం, ఆ పాపి కొండల అందాలను చూస్తున్న మాస్టర్‌గారు ఒక అనిర్వచనీయమైన అనుభూతికి లోనైనారు. దారిపొడుగునా సందడి, సంతోషాలతో ప్రయాణం చిరకాలం గుర్తుండిపోయేలాగా జరిగింది. వసతి, సౌకర్యములు ఎంతో బాగున్నాయి. తొమ్మిదిరోజుల సాధనకు అనువైన విధంగా శ్రీ భద్రాద్రిసీతారామచంద్రమూర్తి వారి ప్రాంగణంలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పూజ్యశ్రీ మాస్టర్‌గారిలో చెప్పలేనంత ఉత్సాహం వచ్చేసింది. ఈ సాధనా శబిరంలో ఒకే రకమైన టైమ్‌టేబుల్ లేదు. భద్రాచలంలో ప్రతిరోజు రామచంద్రుని దర్శనం – వేర్వేరు ప్రాంతాలకెళ్ళి అక్కడి ప్రత్యేకతలను తెలుసుకొని అక్కడే ధ్యానంలో కూర్చోవటం ఎక్కువగా జరిగింది. ప్రత్యేకించి ప్రతిరోజూ సాయంత్రం 'ఆరతి'కి తప్పనిసరిగా వెళ్ళటం రోజువారీ ప్రత్యేక కార్యక్రమం.

26వ తేదీ సాయంత్రం మాస్టర్‌గారు, వారితోపాటు కొంతమంది కార్యకర్తలు భద్రాద్రి రాముని ఆలయంలో జరుగుచున్న ఆరతికి వెళ్ళారు. ఆరతి అయిపోగానే మాస్టర్‌గారు ఆలయ అర్చకస్వామిగారికి నమస్కారం చేశారు. అంతే ఆ అర్చకస్వామి వారు ఆగ్రహోదగ్రులు అయ్యారు, 'ఏమిటి నీవు నాకు నమస్కారం చేస్తావా? లక్షలాదిమందికి ఆధ్యాత్మిక మార్గదర్శనం చేసి శ్రీరామకార్యమును చేయటానికి జన్మించిన నీవు సాధారణ మానవులకు నమస్కారం ఎలా చేస్తావు? నీవు చేయవలసిన పని ఇంకా చాలా వుంది. దానికి నా అనుమతి సదా నీ వెంట ఉంటుంది' అంటూ ఆయన ఏదో ఆవేశించిన వ్యక్తి లాగా ఉగ్రరూపంలో ఆయన నుండి వాక్ప్రవాహం ప్రవహించింది. ఆ సంఘటనను చూచిన వారందరూ అవాక్కయ్యారు. కాసేపటికి తేరుకున్నారు. అందరూ నిశ్చేష్టులైపోయినా మాస్టర్‌గారు మాత్రం చాలా మామూలుగానే ఉన్నారు. ఏం చెయ్యాలో ఆలోచిస్తూ వచ్చారు.

వెంటనే మాస్టర్‌గారు రాత్రి 8 గంటలకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మౌనంగా వచ్చి కూర్చున్నారందరూ. విచిత్రం, ఎందుకీసమయంలో అందరినీ రమ్మన్నారనే ఉత్సుకత. ఏం చెప్తారనే భావోద్వేగం. మాస్టర్‌గారు చెప్పటం మొదలెట్టారు. ఆరతి సమయంలో ఏం జరిగిందో

అందరూ చూశారుగా. దానికి వివేచన చెప్పబోతున్నాను. నేను చేస్తున్న పనులకు శ్రీరాముని ముద్ర (స్టాంపు) పడింది. నేను చేయవలసిన కార్యక్రమాలు దానికి కావలసిన వీలుకలిగిస్తానని శ్రీరామభద్రుడు నాకు అర్చకస్వామి ముఖతః చెప్పించారు. అది నాకు పరమ గురువులిచ్చిన అనుమతి. రాబోయే రోజులలో ఆధ్యాత్మికత యొక్క నూతన స్వరూపాన్ని ప్రపంచానికందించబోతున్నాను.

**శ్రీరాముడిచ్చిన విశేషమైన గ్యారెంటీతో నేను ఒక ప్రణాళికను సిద్ధం చేస్తున్నాను. దానికి నేనిచ్చే గ్యారెంటీ "లైఫ్ ఆఫ్టర్ లైఫ్" జన్మజన్మల పర్యంతం నేను, మీతోనే ఉంటాను" అనే వాగ్దానాన్ని సభాముఖంగా చెప్పటంతో, ఆ క్షణంలో ఆ మాటలు విన్న వారి హృదయాలు ఆనందంతో పులకరించి పోయాయి.**

ఇంతకు ముందే నేను 'మిషన్ ఆర్.కె. ట్రస్ట్‌ను' స్థాపించానని మీకూ తెలుసు. ఆ ట్రస్ట్‌ను ఇవాళ శ్రీరామభద్రుని ఆదేశంగా వ్యవస్థీకృతం చేయబోతున్నాను. దానికి కొన్ని నియమాలను కూడా పెట్టవలసివుంటుంది. ప్రతి నెలా విశేషమైన మూడు పనులు చెప్తుంటాను. దానికి నా ఆధ్యాత్మిక సంరక్షణను ఇస్తుంటాను. భౌతికమైన కోరికలు తీరుతాయా? లేదా అది నాకు తెలియదు. ఇక నుండి నేను చెప్పిన పనిని చేసే వాళ్ళతోనే మాట్లాడుతాను. నాతో సంబంధమున్న మీ అందరికీ అనేక జన్మల నుండి గురువుల అనుగ్రహం మీకుంటూనే ఉంది. 2007 జనవరి నుంచీ మిషన్ ఆర్.కె. ట్రస్ట్ పెడతాను. విశేషమైన కృషి చేసే వారు మాత్రమే అందులో సభ్యులు అవుతారు. వారు ప్రతి నెలా 51 రూపాయల అంశదానమును ట్రస్ట్‌కు జమ చేయాలి. ఏ నెల అంశదానాన్ని ఆపుతారో, ఆ రోజు నుంచి వాళ్ళకు, నాతో లింక్ పోతుంది. దానికి 1000 మంది సాధకులు కావాలి. గ్రామ గ్రామాల నుండి వచ్చిన ఆ అంశదానం ట్రస్ట్ ద్వారా నాకు అందుతుంది. ఈ అంశదానం అనేది ప్రాణశక్తితో అంటే సాధకుల ప్రాణశక్తితో (మాస్టర్‌గారి) నా ప్రాణశక్తితో లింక్ అప్ అవుతుంది. అప్పుడా శక్తిని మీరూహించలేరు. అలా వచ్చిన అంశదానమును – ఆశ్రమాల అభివృద్ధికి, నిర్వహణకు ఉపయోగిస్తాను. తక్షణమే ఈ సందేశాన్ని వేలాదిమందికి తెలియచెప్పండి. సంఘటిత శక్తితో ఈ ట్రస్టుతో కలిసి పని చేయండి అని చెప్పారు.

మాస్టర్‌గారి మార్గదర్శనంలో వారిచ్చిన సూచనల ప్రకారం భద్రాచలం నుంచీ రాగానే "మిషన్ ఆర్.కె.ట్రస్ట్"ను ఒక ఆరుమంది వ్యక్తులతో చీరాలలో రిజిష్టరు చేయటం జరిగింది. "మిషన్ ఆర్.కె.ట్రస్టు కేంద్రస్థానంగా నిత్యవతారదత్తక్షేత్రాన్ని" ఎంపిక చేసారు. ఇంక అక్కడి

నుండే అన్ని ఆశ్రమాలు సమయానుసారంగా సక్రమంగా పని చేసేలా చూస్తానని మాస్టర్‌గారు చెప్పటంతో అన్ని ఆశ్రమాలవాళ్ళకు ఉత్సాహం వచ్చింది. ఆ తర్వాత విశేషమైన రీతిలో వ్యవస్థ చురుకుగానే ఒక రూపానికి వచ్చింది. వెయ్యిమంది దాకా సాధకులు అందులో రిజిష్టర్ అయ్యారు. కానీ వ్యక్తిగత స్వార్థ సంకుచిత ప్రలోభాల ప్రవాహంలో ఆ మహత్తరమైన అంకురం, ఆదిలోనే అంతరించిపోయింది. ఏది జరిగినా మాస్టర్‌గారు చెప్పే మహామంత్రం ఒకటి ఉండనే వుంది గదా! "నేచర్ ఈజ్ ఆల్వేస్ రైట్" అంతే.

అన్ని వూళ్ళల్లో ఉన్న సాధకులను ఏకత్రితం చేసి మాస్టర్‌గారిచ్చిన సూచనల ప్రకారం - సమయదాన, అంశదానములనిచ్చేవారి పేర్లను మిషన్ ఆర్.కె.లో నమోదుచేసి వారి అంశదానాలను ప్రతి నెలా విధిగా ట్రస్టు జమ చేయటం జరిగింది. ఇలా ఒక ఐదు, ఆరు నెలల పాటు సజావుగా సాగిపోయింది. కాలం చిత్రమైనది. మనిషి మనస్సు ఎప్పుడు ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. అనుకోని పరిణామాల ప్రభావం వలన వ్యవస్థలలో అనేక రకాల మార్పులు రావటంతో తర్వాత ఆ ట్రస్ట్ అనంత కాలప్రవాహంలో లయమైపోవటం జరిగింది.

## అధ్యాయం-14
# కరిష్యే వచనం తవ

### ఋషీకేశ్‌లో సాధనా శిబిరం

ఎక్కడ ఎన్ని ఆశ్రమాలు స్థాపించినా, సాధనా శిబిరాలు పెట్టినా మాస్టర్‌గారి "పర్మినెంట్ అడ్రస్" (శాశ్వత చిరునామా) శ్వేతద్వీపం, ఒంగోలు. వారు శ్వేతద్వీపంలోనే ఉంటున్నారు. ఒకసారి మాస్టర్‌గారిని చూడాలని సావిత్రీ, అనుషా వాళ్ళు వచ్చారు. ఒకరోజు ఉదయం టిఫిన్, కాఫీలు అయ్యాక మాస్టర్‌గారు సావిత్రీ వాళ్ళతో "ఈ వేసవిలో మనం ఋషీకేశ్‌కు" వెళ్ళాలి. వీలైతే అక్కడొక సాధనా శిబిరం కూడా పెడదాం. దానికి కావాల్సిన ఏర్పాటు చెయ్యి అన్నారు సావిత్రితో.

మాస్టర్‌గారు సహజంగా ఎప్పుడూ అలానే చెప్తారు. "నాకిది కావాలి. ఎలా చేస్తారో మీరందరూ కల్సి మాట్లాడుకొని చెయ్యండి. అందరికీ తెలియపరచి నిర్ణయించుకొని కార్యక్రమాన్ని ఒక 'టీం'

వర్కులాగా చెయ్యండని" చెప్పారు. ఇది ఒక అనుశాసనం లాంటిది. సమావేశాలు, చర్చలు అయిపోయాయి. ఋషీకేశ్‌లో సాధనా శిబిరం అనేసరికి అందరిలో ఉత్సాహం పొంగి పొరలింది. అందునా వేసవిసెలవలు కావటంతో చాలామందీ సాధనా శిబిరానికి రావటానికి తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ఈ ప్రయాణంలో రెండే రెండు ప్రదేశాలు – ఒకటి ఋషీకేశ్‌లో సాధనా శిబిరం, రెండవది హరిద్వార్‌లో గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్ చూడటం. అంతవరకే పరిమితం చేశారు. ఇష్టమున్న వాళ్ళు గంగోత్రి, యమునోత్రీలక్కూడ వెళ్ళిరావచ్చుననే సడలింపు కూడా అక్కడ ప్రతిపాదించారు. సావిత్రీ, అనూషా వాళ్ళే అన్నీ ఏర్పాట్లు చేశారు. అనుకున్న సమయానికి 'అందరూ ఋషీకేశ్‌కు' చేరుకోవటం జరిగింది. నిర్ణీత సమయానికి సాధనా శిబిరం ప్రారంభమైంది. ఈ సమావేశంలో మాస్టర్‌గారు ప్రతీరోజు 'పరమగురువులు – వారి ప్రణాళికలు' మన కర్తవ్యం ఏమిటీ అనే విషయాలపై ప్రవచనాలనివ్వటం జరిగింది.

పూజ్యశ్రీ మాస్టర్‌గారితోపాటు ప్రతీరోజూ అందరూ గంగా స్నానాలు చేయటం అనేది సాధనలోని భాగము. సాధనా శిబిరంలో భాగంగా ప్రతీరోజూ అందరూ గంగ యొక్క ఈ ఒడ్డు నుంచీ అవతలివైపుకు సరదాగా పడవలో వెళ్తుండేవారు. ఆవలి ఒడ్డున గల ఆశ్రమాలను దర్శించటం మహాత్ములుంటే వారిని దర్శించి, వారితో సంభాషించటం రోజు వారి కార్యక్రమం.

రోజూ మాదిరే ఆ రోజూ గంగ ఆవలి వడ్డుకు వెళ్ళారు అందరూ. మహాద్భాగ్యమా అన్నట్లు ఆరోజు నుంచీ శ్రీమద్భాగవత సప్తాహాలు ప్రారంభమయ్యాయి. అందుచేత వేలాదిమంది స్త్రీ, పురుషులు పసుపు వస్త్రాలు ధరించి "శిరస్సు మీద భాగవత గ్రంథాన్ని పెట్టుకుని" శ్రీకృష్ణనామం, భజనలు చేసుకుంటూ గంగ ఒడ్డున నడుస్తున్నారు. మాస్టర్‌గారు, మిగతా పరివార్ సభ్యులూ వాళ్ళల్లో కల్సిపోయారు. అందరూ తలోక దారి అయిపోయారు. మాస్టర్‌గారు ఎటు వెళ్ళిపోయారో వెళ్ళిపోయారు.

కారణాంతరాల వల్ల నేను ఆరోజు గంగ ఒడ్డుకు వెళ్ళకుండా 'అతిథి గృహం' లోనే వున్నాను. మధ్యాహ్నం రెండు గంటలైంది. ఎండ మండిపోతున్నది. అంత ఎండలో మాస్టర్‌గారు నడుచుకుంటూ కందిపోయిన ముఖంతో, విపరీతమైన అలసటతో గదిలోకి వచ్చారు. బాగా అలిసిపోయి నట్లున్నారు.

లోపలికి వస్తూనే "చల్లటి మంచినీళ్ళు ఇవ్వమ్మా" అని అడిగారు. మంచి నీళ్ళు ఇస్తే త్రాగి మాట్లాడకుండా మంచం మీద పడుకొని ఒళ్ళు తెలియకుండా నిద్రపోయారు. సాయంత్రం 5 గం॥లకు కళ్ళు తెరచి కాఫీ కావాలి అన్నారు. కాఫీతో పాటు టిఫిన్ తెప్పించి ఇస్తే అవి తీసుకున్నాక కాస్త కుదుటపడ్డారు. శరీరం శాంతస్థితికి వచ్చింది. అప్పుడు నాతో ఇలా చెప్పారు. ఇవాళ చాలా విచిత్రం జరిగింది. భాగవత సప్తాహ ఊరేగింపులో అందరూ కలిసిపోయారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి నన్ను, వాళ్ళతో ఎక్కడికో తీసుకుని వెళ్ళిపోయారు.

అది ఒక శిధిలావస్థలో వున్న శివాలయం. లోపలికి తీసుకువెళ్ళాక దాదాపు రెండు గంటల సేపు వారు, నాతో అనేక భవిష్య ప్రణాళికలను వివరించి, ఇవాళ్టికి ఇంత వరకు చాలు. రేపు ఇలాగే ఇక్కడికి తీసుకువచ్చి ఇంకొన్ని విషయాలు చెప్తాము అని చెప్పి అంతా అయిపోయాక తీసుకువచ్చి నన్ను ఈ హోటల్ వాకిట్లో వదలి వెళ్ళిపోయారు. అప్పటి దాకా ఏదో ప్రపంచంలో వున్న నాకు ఈ హోటల్, ఈ గది గుర్తు వచ్చి లోపలికి వచ్చాను. వాళ్ళు చెప్పవలసిన ప్రణాళికలు ఇంకా చాలానే వున్నాయనీ మళ్ళీ రేపు నన్ను తీసుకువెళ్తామని చెప్పారు కదా. అప్పుడు నేను వాళ్ళను అడిగాను. రేపు నాతోపాటు రాజ్యలక్ష్మిగారిని కూడా తీసుకురావచ్చునా అని. 'ఆమె వరకు అనుమతి వుంది' అన్నారు. రేపు ఉదయం రోజూ మాదిరే మనం గంగ దాటి అవతల ఒడ్డులో వున్న 'ఛోటీ వాలీ' హోటల్ దగ్గరకి వెళదాము. వాళ్ళతో వచ్చిన చిక్కేమిటంటే చుట్టు ప్రక్కల ఎవ్వరూ ఉండకూడదు. (అంటే వాళ్ళను ఎవరూ గుర్తించకుండా ఉండాలి) ఎన్నివేల మందిలో వున్నా వాళ్ళు నిశ్శబ్దంగా తీసుకువెళ్ళిపోతారు. "వాళ్ళను ఎవ్వరూ గమనించలేని పరిస్థితులలోనే వాళ్ళు వచ్చి తీసుకెళ్ళగలరు. అని చెప్పి మనిద్దరం మాత్రమే రేపు గంగ ఒడ్డుకు వెళుతున్నాం" అన్నారు. పరమాత్మ స్వరూపులైన మాస్టర్‌గారు ఎంతటి మహాద్భాగ్యాన్ని ప్రసాదిస్తున్నారో గదా! ఎంతటి దయ, ప్రేమా వారిది అనుకుంటూ మనస్సులోనే వారికి కోటి కోటి ప్రణామాలను సమర్పించు కున్నాను.

మర్నాడుదయం యధాప్రకారంగా గంగాస్నానం అయిపోయాక 8.30గం.లకు గంగ ఆవలి వడ్డుకు వెళ్ళి 'ఛోటీవాల్' హోటల్‌లో కూర్చుని టిఫిన్‌తిని , కాఫీత్రాగటం పూర్తి చేశాము. అయితే ఆ రోజు మాస్టర్‌గారితో పాటుగా ఒక ఆరు, ఏడు మంది పరివార్ వాళ్ళు కూడా వున్నారు. మాస్టర్‌గారు టిఫిన్ తింటున్నా, కాఫీ తాగుతున్నా వారి దృష్టి ఆ మహాత్ముల ఆగమనం

కోసం ఎదురుచూస్తున్నది. ప్రక్కనున్న వాళ్ళతో మాస్టర్‌గారు 'మేము కాసేపు ఇక్కడే వుండి తర్వాత వస్తాం – మీరు బయల్దేరండని' అన్నారు. 'మాకూ పనేమీ లేదు మాస్టర్‌గారూ, కల్సే వెళ్దాము' అన్నారు. మాస్టర్‌గారు ఇంకేం మాట్లాడకుండా, అయితే బయల్దేరండి వెళదాము' అన్నారు. కార్లో తిరిగివస్తున్నప్పుడు మెల్లగా నాతో " అదుగో అటు చూడు – ఆ ప్రదేశంలోనే నిన్నటి మా సమావేశం జరిగింది" అని మాత్రం చెప్పారు. నిన్నటి రోజున గమనించలేకపోయాను. ఒక్కొక్కటి ఇప్పుడు గుర్తుకు వస్తున్నది. ఈ ప్రదేశం అదే' అని మళ్ళీ చెప్పారు. అదొక నిర్జన ప్రదేశం. బయటకు ఏమీ కనిపించటం లేదు. కానీ అదొక చిన్న దేవాలయం అని మాత్రం అర్థమైంది. ఏది ఏమైనా మాస్టర్ గారు ఋషికేష్‌కు ఎందుకువచ్చారో మరి ఆ పని పూర్తి అయిందేమో! తిరుగు ప్రయాణానికి సిద్ధమైనారు.

సాధకులందరూ హరిద్వార్‌కు వెళ్ళి శాంతికుంజ్ ఆశ్రమాన్ని చూడాలని తహతహలాడి పోతున్నారు. అనుకున్న ప్రకారం గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్ ఆశ్రమంలోకి అడుగుపెట్టాము. అడుగుపెడుతున్న క్షణంలోనే 'పరమధామం' లోకి ప్రవేశించిన అనుభూతి కల్గింది. ఎటు చూచినా మాతాజీ, గురుదేవుల అనుగ్రహవర్షం ఒక ఫౌంటెన్ లాగా దశ,దిశలా విరజిమ్మబడతున్న అనుభూతి కల్గింది అందరికీ. శ్రీ మాస్టర్‌గారు వస్తూనే 'అఖండజ్యోతి దర్శనం' చేసుకున్నారు. వారు అఖండ జ్యోతిని దర్శించారు అంటే సాక్షాత్ గురుదేవులిచ్చే ప్రేరణను దాని ద్వారా స్వీకరించుతారు. మాతాజీ, గురుదేవులకి ప్రణామాలు చేసి క్రిందికి వచ్చారు. వస్తూనే వారికి కడుపులో ఒక వికారం వచ్చినట్లు అయింది. వెంటనే వాంతులు చేసుకున్నారు. రెండు సార్లు 'విరోచనాలు' అయిపోయాయి. మనిషి బాగా డీలాపడిపోయారు. బట్టలన్నీ తడిసిపోయాయి. వెంటనే ఆశ్రమంలో గల వస్త్రాలయం నుంచీ పసుపు వస్త్రాలు తెప్పించి వాటిని ధరింపచేయటం జరిగింది. త్రాగటానికి చల్లని పానీయాలు ఇవ్వగా కాస్త కుదుటపడ్డారు. ఒక గంట పడుకొని నిద్రపోయి లేచాక పూర్తిగా స్వస్థత చేకూరింది. అప్పుడు చెప్పారు "చాలా కాలానికి 'అమ్మ' (మాతాజీ) దగ్గరికి వచ్చాను గదా! పూర్తిగా ప్రక్షాళణ చేసేసింది. కడిగి పారేసింది. ఇప్పుడు హాయిగా ఉంది". అన్నారు.

మాస్టర్‌గారు గురుదేవులు ఉపాసించిన అఖండ జ్యోతి దగ్గర ధ్యానంలో కూర్చున్నప్పుడు 'గురుదేవులు' ఇచ్చిన ప్రణాళికను పూర్తి చెయ్యటానికి 'ఈ శరీరాన్ని' సమాయత్తపరచాలి. దానికి 'మాతాజీ భోజనం' తినాలి. అప్పుడే బాహ్యాంతరాలలో 'రీచార్జింగ్ జరుగుతుంది' అని చాలా

స్పష్టంగా, నిర్మల హృదయంతో, దేదీప్యమానమైన ముఖవర్చస్‌తో వెలిగిపోతూ ఈ మాటలు చెప్పారు. మాతాజీ భోజనాలయంలో అమ్మ చేతి ప్రసాదాన్ని "మహా అదృష్టం"గా ఎంతో ప్రీతితో అందరూ తిన్నారు. ఆ పవిత్రమైన భోజనంతో అందరి అంత: కరణలు పవిత్రమౌతాయి. అంతేకాదు ఆ తల్లి పవిత్ర ప్రేమ, అనంత ఆశీర్వాదాలు నిస్సందేహంగా సదా మనతోనే, మనవెంటే వుంటాయి. ఇది సత్యం,సత్యం, సత్యం.

ఆ సాయంత్రం అందరినీ తీసుకుని 'ఉత్తమ్‌భయ్యా' దేవసంస్కృతీ విశ్వవిద్యాలయాన్ని, గోశాలను, అక్కడ తయారుచేస్తున్న ఆయుర్వేదమందులశాల, క్రొత్తగా నిర్మిస్తున్న అనేక నిర్మాణాలను ఇంకా మహాకాల ఆలయాన్ని ఎంతో చక్కగా చూపించారు. ప్రజ్ఞాపుత్రులైన మాస్టర్‌గారి ఆగమనానికి ఆశ్రమంలోని వారందరూ చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాయంత్రం నాదయోగసాధనలో, గాయత్రీమాత ఆరతిలో పాల్గొని, రాత్రికి మళ్ళీ హరిద్వార్ చేరుకున్నాం. 'గాయత్రీతీర్థ్ – శాంతికుంజ్' దర్శనం అందరి హృదయాలలో చెరగని ముద్రవేసింది. తర్వాత మళ్ళీ మాస్టర్‌గారు 2007 ఆగష్టులో విజయా, విశ్వనాథ్‌గార్లతో కలసి మళ్ళీ శాంతికుంజ్‌కు వెళ్ళారు. కాంతిపుంజం లాంటి మాస్టర్‌గారు ఈసారి 'సంజీవనీ' సాధనా శిబిరంలో పాల్గొని పూజ్యగురుదేవుల సరిక్రొత్త ప్రణాళికలను ఆకళింపుచేసుకొని 'జన్మశతాబ్ది కార్యక్రమాల'కు ఒక రూపకల్పన చేసుకొని వచ్చారు.

శాంతికుంజ్ నుండి వస్తూనే మాస్టర్‌గారు ఒక ప్రకటన చేసారు. 'మనందరం గురుభాయిలం. గురువుగారిచ్చిన మార్గదర్శనంలో మనందరం కలిసి పనిచెయ్యాలి. ఇప్పటి వరకు 'నాతో సంపూర్ణ సాంగత్యం వున్న వాళ్ళందరూ తప్పనిసరిగా శాంతికుంజ్‌తో తమ సంబంధబాంధవ్యాలను కొనసాగించాలి.' అని.

## శాంతికుంజ్‌తో మన సంబంధం

శాంతికుంజ్ నుండి వచ్చిన తరువాత కార్యకర్తలందరినీ సమావేశపరచి (8-9-2007) చాలా ముఖ్యమైన సందేశాన్ని చాలా ఘాటుగానే ఇచ్చారు.

"ఆధ్యాత్మికత అంటే జీవితం నుండి పారిపోవటం కాదు. సన్యాసం పుచ్చుకోవటం అంతకన్నా కాదు. జీవితాన్ని మన చేతిలోకి తీసుకొని, మనం ఏ లక్ష్యసాధనను ఎంచుకున్నామో అటువైపు వెళ్ళగలిగే విధానాన్ని నేర్చుకోవటం. ఇప్పుడు నేను చెప్పేటటువంటి దానిని జాగ్రత్తగా అర్థం

చేసుకోండి. మిమ్మల్ని చాలా పెద్ద సమూహానికి, 'ఆల్ వరల్డ్ గాయత్రీ పరివార్' అనే పెద్ద సమూహానికి జోడించాను. కానీ మీరు అందులో ఎప్పుడు కలుస్తారు అంటే అందులో సభ్యులైతేనే కదా! ఒక యూనివర్శిటీకి వెళ్ళి క్లాసులో కూర్చున్నంతమాత్రాన మీకు డిగ్రీ పొందే హక్కురాదు. అందులో చేరాలి. డబ్బు కట్టాలి. అందులో కొన్ని నియమాలుంటాయి. వాటిని పాటించాలి. ఎవరికి పడితే వారికి సీటు ఇవ్వరు. మీ నుండి నేను ఆశిస్తున్నదేమిటంటే మీరీపాటికే అందులో సభ్యులైపోయారు అని (ఎవ్వరి దగ్గరినుంచీ సమాధానం రాలేదు). చాలా కష్టము మిమ్మల్ని మార్చటం. గోడలనైనా మార్చవచ్చును గానీ – మానవజాతిని మార్చలేము అంటూ ఎంతో ఆవేదనను వ్యక్తం చేశారు.

ఇంకా ఇలా చెప్పారు – **"ఎందుకు నేను దీనినింత స్పష్టంగా చెప్తున్నాను అంటే, నేను నా జీవితవిధానానికి ఒక ఫుల్‌స్టాప్ పెట్టి, క్రొత్త జీవిత విధానానికి మారబోతున్నాను. మారే ముందు మిమ్మల్ని నట్టేట ముంచడం లేదు. మిమ్మల్ని ఒక అద్భుతమైన సంస్థతో అదీ నా గురుదేవుల సంస్థతో జోడిస్తున్నాను. ఏ శిష్యుడైనా చేయగలిగింది అంతే కదా! నా గురుదేవులతో మీకు లింకు పెడుతున్నాను. ఆయన మామూలు వ్యక్తి కానేకాదు. కనుకనే మిమ్మల్ని ఆ మహావ్యక్తి యొక్క సంస్థతో కల్సి పనిచెయ్యమంటున్నాను."**

అఖిల విశ్వగాయత్రీపరివార్‌లో సభ్యులు కాగానే సరిపోదు, ముందు అందులో ఎన్‌రోల్ అయిపోండి. కానీ ఇక్కడిలాగా ఎవరికి వాళ్ళు చెయ్యకండి, అలా చేస్తే మీరు పప్పులో కాళ్ళేస్తారు. నేనిచ్చిన అవకాశాన్ని చేజార్చుకుంటారు. జాగ్రత్తగా అర్థం చేసుకోండి. నా దగ్గరున్నప్పుడు ప్రవర్తించినట్లు ప్రవర్తిస్తే ఒక్కరు కూడా ముందుకు పోలేరు. అక్కడా బోర్లా పడతారు. అక్కడంతా గ్రూప్ ఎఫోర్ట్ అంటే సామూహిక ప్రయత్నం కావాలి. మీరింతవరకు ఏదో చేస్తున్నామనే భ్రమలో జీవించారు. ఏమీ చేయలేదు. ఇప్పుడు చెయ్యండి. ముఖ్యంగా మీరు నేర్చుకోవలసింది ఏమిటంటే–

**దేవాలయం – ఆశ్రమం – గురుకులం – ఆరణ్యకం – తీర్థాలు.**

గాయత్రీ జీవితవిధానము మాత్రమే ఆధ్యాత్మిక పథం! ముందు గాయత్రీమంత్ర సాధకులుగా మారాలి. ఎలా మారుతారు? అంటే ముందు గాయత్రీపరివార్‌తో కలిస్తే ఎలా మంత్రజపము చెయ్యాలో తెలుస్తుంది. ధ్యానమునెలా చెయ్యాలో కూడా గురుదేవుల సి.డి.ల ద్వారా చేయవచ్చు. ఇదంతా చెప్తూ ఇంకో మూడు ముఖ్యమైన విషయాలు చెప్పారు.

మొదటిది – గాయత్రీ దేవస్థాపన ప్రతి ఇంటిలో జరగాలి. మీ దేవతామందిరంలో ఈ దేవస్థాపన ఫోటోను పెట్టండి. దానికి శాంతికుంజ్‌లో మాదిరి ఉదయం, సాయంత్రం ఆరతి, ఇంకా ఉదయం గాయత్రీస్తవనం, సాయంత్రం చాలీసా పాడుకోవాలి. దీనికి శాంతికుంజ్‌లో ఇచ్చే సి.డి.లను ఉపయోగించితే మంచిది. వీలైతే సహస్రగాయత్రీ చెయ్యండి. ఇది మొదటి అడుగు. గాయత్రీ దేవాలయం తరువాత మీరు మంత్రసాధకులుగా మారాలి.

దీని తర్వాత రెండవ అడుగు ఇంటినే గాయత్రీ ఆశ్రమంగా పెట్టుకోండి. దీనికి శాంతికుంజ్‌లో మాదిరి మూడు క్యాసెట్లు వినాలి. ఉదయం మూడు శరీరాల ధ్యానం, మధ్యాహ్నం జ్యోతిఅవతరణ సాధన, సాయంత్రం 6.00గంటలకు నాదయోగసాధన చెయ్యండి.

ఇప్పుడు మీ ఇల్లు గాయత్రీ దేవాలయముగా, గాయత్రీ ఆశ్రమంగా తయారైంది. మూడవ చరణంలో మీరు మనుషులను రానిచ్చి వారికి జపము, ధ్యానము, యజ్ఞము మొదలైన వాటికి శిక్షణ నిచ్చారనుకోండి, అప్పుడది గురుకులమౌతుంది. ఆశ్రమంలో నీవు ఎదుగుతున్నావు. గురుకులంలో ఇంకొకరికి శిక్షణనిస్తున్నావు. ఇంకా వివరంగా చెప్పాలంటే గురుకులంలో శిక్షణనిస్తారు. ఆశ్రమాలలో సాధనలు చేస్తారు. వీటి తర్వాత ఇంకొక రెండు విశిష్టమైనటువంటి ఆధ్యాత్మిక శక్తి కేంద్రాలు భారతదేశంలో ఉన్నాయి. అవి ఒకటి ఆరణ్యకాలు, రెండు తీర్థాలు.

ఆరణ్యకం అంటే ఏమిటి? అక్కడ ఋషులుంటారు. మీకక్కడ మీ వ్యక్తిగతమైన, సామాజికమైన లేదా మీకు ఎలాంటి సమస్యలున్నా, ఆ సమస్యలకి పరిష్కార మార్గము సూచించబడుతుంది. ఋషులందరూ ఒకచోటచేరి శాస్త్రార్థాలను చర్చలు చేస్తుంటారు. ఈనాడు వాటినే మనం సెమినార్స్ అంటాము.

చివరగా తీర్థాలు అంటే పూర్వకాలంలో ఎవరైనా ఒక తప్పు చేస్తే, ఆ తప్పుకు ప్రాయశ్చిత్తానికి తీర్థస్నానానికి వెళ్ళేవాళ్ళు. అక్కడ సాధన చేసుకుని నిష్పాపులై, పవిత్రతను సంతరించుకొని వచ్చేవారు. ఇప్పుడు తీర్థాలకు ఎందుకు వెళ్తున్నారో, దేవుడికి తెలియాలి. అందువలన భారతీయసంస్కృతికి ఆధారమైనటువంటి ఆరణ్యకాలు, తీర్థములు కేవలం హరిద్వార్ లో గురుదేవులచే స్థాపించబడిన గాయత్రీ తీర్థములోనే లభిస్తాయి.

అందుచేత దేవాలయాలు, ఆశ్రమాలు, గురుకులాలు, ఆరణ్యకాలు, తీర్థస్థలాలు అనేవి భారతీయ సంస్కృతి యొక్క ఆధారంతో అంటే గాయత్రీమంత్రశక్తితో ఏర్పాటు చేయబడి వున్నాయి. అందుచేత నేనేమంటున్నానంటే నాతో సంబంధమున్న ఆశ్రమాలు గానీ, అనుగ్రహపీఠాలు గానీ అవన్నీ గాయత్రీ ప్రజ్ఞాపీఠాలుగా మారిపోవాలి. అలాంటి సాధనా స్థలాలుగా మారిపోవాలి. ఈ చెప్పినవన్నీ మీరు మరిచిపోయినా నేను మరచిపోను. ఎందుచేతనంటే నేను కాదు చెబుతున్నది. ఇక్కడున్నది గురువుగారు. మీరు ఈ అవకాశాన్ని వదులుకున్నారో, తర్వాత మీ ఆత్మఘోష వుందే దానిని ఆత్మప్రతాడన అని కూడా అంటాము. దానిని మీరు ఊహించలేరు. అది మిమ్మల్ని ఎంతలా హింసిస్తుందో మీకు తెలియదు. దానినుండి బయటపడటానికైనా ఉత్సాహంగా ఈ కార్యక్రమాలలో పాల్గొనండి." ఇలా పూజ్యశ్రీ మాస్టర్‌గారు వీలున్నప్పుడల్లా గాయత్రీతీర్థ్, శాంతికుంజ్ యొక్క ప్రాధాన్యతను, గురుదేవుల గొప్పదనాన్ని ప్రతి ప్రవచనంలోనూ చెప్పేవారు.

"గురుదేవులను కేవలం వ్యక్తిగా చూడకండి. ఆయన మహాకాలస్వరూపము. ఆయన ప్రణాళికలను అమలుచేస్తున్న గాయత్రీ తీర్థముతో మీకు సంపర్కము ఏర్పడాలి అంటే ప్రతి గ్రామంలోను ప్రజ్ఞామండలిని ఏర్పాటు చేయండి. సాధనలు చెయ్యండి. ఇంకా మీరు శాంతికుంజ్‌లో నిర్వహించబడుతున్న సాధనా శిబిరాలకు హాజరుకండి. సాధనలు చేస్తూ మీ సామర్థ్యాన్ని దృఢతరం చేసుకోండి.

ఇంకా సంస్కారాల పరంపరల ద్వారా సంస్కారవంతులుగా మారటానికి ప్రయత్నించండి. పుట్టినరోజు, వివాహదినోత్సవసంస్కారాలు తప్పనిసరిగా చేసుకోండి – చేయండి – ఇవన్నీ 'గాయత్రీ కార్యకర్తల శిక్షణా శిబిరం' హరిద్వార్‌లో నేర్పబడుతున్నాయి. వారితో చేతులు కలిపి గురుదేవుల కలలను సాకారం చెయ్యండి" అని ఎంతో భావోద్వేగంతో చెప్పారు.

ఇంతలో మాస్టర్‌గారి 'జన్మదినం' వచ్చేసింది. ఈసారి మాస్టర్‌గారి జన్మదినోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో చెయ్యాలని శ్రీ విశ్వనాథ్‌గారు సంకల్పించారు. ఈ సంవత్సరం వారి జన్మదినం దేవీ నవరాత్రులలో వచ్చింది. అందుచేత మాస్టర్‌గారు 'నవరాత్రిసాధన' హైదరాబాద్‌లో జరుగుతుంది కనుక అందరూ అక్కడికి రావాలని సూచన చేశారు. ఒకరోజు ఫోన్‌లో నాతో మాత్రం "ఈ నవరాత్రిసాధన ఎట్టి పరిస్థితుల్లోను 1000 మంది సాధకులతో నిర్వహించాలి. అందులోనూ వచ్చే సాధకులందరూ "గాయత్రీపరివార్ సభ్యులు"గా నమోదైవుండాలి. వారి సమయదాన,

అంశదాన, ప్రతిభాదానాల వివరాలతో కూడిన "అఖిల విశ్వగాయత్రీ పరివార్" అప్లికేషన్లతో సహా అందరూ రావాలి. అందరినీ 'గాయత్రీ పరివార్'లో సభ్యులుగా నమోదు చెయ్యమని చాలా స్పష్టంగా చెప్పారు.

ఈ ఫోను వచ్చిన సమయానికి శ్రీ వేణుగోపాలరెడ్డిగారు ఒంగోల్లోనే వున్నారు. వారితో మాస్టర్‌గారు చెప్పిన సమాచారం వివరించి, " రెడ్డిగారు మీరూ నాకు సాయంగా వస్తే మనం అన్ని గ్రామాలు తిరిగి మాస్టర్‌గారు చెప్పిన విషయాన్ని వివరించి అందరినీ గాయత్రీపరివార్ సభ్యులుగా నమోదు చేసుకొని వస్తే బావుంటుంది. మీరు రాగలరా? " అని అడిగాను. అప్పటికి రెడ్డిగారికింకా గాయత్రీ పరివార్‌తో పెద్దగా పరిచయాలు లేవు. కానీ అడగగానే వస్తానన్నారు. అలా వారి సహకారంతో గిద్దలూరు, మార్కాపురం మొదలుకొని ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాలన్నీ కలిపి 27 గ్రామాలలో తిరిగి గాయత్రీపరివార్ వాళ్ళందరినీ కలిసి, మాస్టర్‌గారి జన్మదిన వేడుకలకు అందరూ హైదరాబాద్‌కు రావాలని చెప్తూ, అలాగే అందరినీ గాయత్రీ పరివార్ సభ్యులుగా నమోదు చేసుకొని – వారిచ్చిన అంశదానాలతోపాటు వారిని యుగశక్తిగాయత్రి పత్రికకి చందాదారులుగా చేర్పించి నవరాత్రి సాధనకు హైదరాబాద్‌కు చేరుకోవటం జరిగింది. ఈసారి నవరాత్రి సాధన శాంతికుంజ్ ప్రతినిధి శ్రీపరమానంద ద్వివేదీగారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఐదువందల మంది దాకా ఈ సాధనా శిబిరానికి వచ్చారు.

## 24 కోట్ల గాయత్రీ మంత్ర జపానికి సామూహిక దీక్ష

ఈ నవరాత్రులలోనే మాస్టర్‌గారి జన్మదినం అక్టోబర్14వ తేదీ కలిసి రావడం జరిగింది. ఆ రోజు సాయంత్రం శ్రీ ద్వివేదిగారు మాస్టర్‌గారికి జన్మదిన సంస్కారం చేశారు. ఎంతో వేడుకగా జరుగుతున్న ఆ పండుగలో వారి జన్మదిన సందర్భంగా గురుదక్షిణగా 2400 అప్లికేషన్లు (గాయత్రీ పరివార్‌లో చేర్పించినవి), 75 వేల రూపాయల అంశదానం, 1200 యుగశక్తిగాయత్రీ చందాదారుల వివరాలతో సహా మాస్టర్‌గారికి సమర్పించాము. (గత నెలరోజులుగా నేను, రెడ్డిగారు కల్సి గ్రామాలలో తిరిగి గాయత్రీ పరివార్‌లో చేర్పించిన సభ్యుల జాబితా అది) మాస్టర్‌గారు చాలా సంతోషించారు. అలానే ఇంకా కొందరు సోదరసోదరీమణులు తాము తయారుచేసుకొని వచ్చిన జాబితాను కూడా 'మాస్టర్‌గారికిసమర్పించి' తమ గురుభక్తిని ప్రకటించుకున్నారు. అదే వేదికమీద మాస్టర్‌గారు ఆ

మొత్తాన్ని శ్రీ అశ్వినీ సుబ్బారావుగారు, శ్రీ ద్వివేదీగార్ల చేతిలో ఉంచి "పూజ్య గురుదేవులకు గురుదక్షిణగా దానిని సమర్పిస్తున్నానని" ప్రకటించగా కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

సాధనా శిబిరం పూర్తి అయింది. **పూర్ణాహుతి రోజున పూజ్యశ్రీ మాస్టర్‌గారు సభాముఖంగా ఒక సందేశాన్నిచ్చారు. "గాయత్రీ జపాన్ని ఒక లక్ష్యంతో చెయ్యండి. ఏమిటా జపము యొక్క లక్ష్యము అంటే గాయత్రీ మంత్రము నాలో వికసించాలి, నాలో ప్రస్ఫుటించాలి" అనే ఉద్దేశ్యంతో చెయ్యండి.** అలా 8000 మంది సహస్రగాయత్రీ చేసేవాళ్ళు నాకు కావాలి. అది ఎందుకు అడుగుతున్నాను అంటే దాంతో నెలకు 24 కోట్ల మంత్ర జపము పూర్తి అవుతుంది. గురుదేవులు తమ జీవితంలో 24 కోట్ల మంత్రజపం చేసినట్లు మనం చదువుకున్నాం. అప్పుడు ఆయన ఒక్కరే చేశారు. ఇప్పుడు 8000 మంది రోజుకు సహస్రగాయత్రి చేస్తే 24 కోట్ల గాయత్రీమంత్ర జపసిద్ధి, శక్తిని ప్రసరింపచేస్తుంది. కనుక మీరు, మీతో పాటు మీ బంధుమిత్రులనందరిని ఇందులో భాగస్వాములను చేసి పుణ్యపరమార్థాన్ని సంపాదించుకోండి. ఈ నవరాత్రి సాధనా పూర్ణాహుతి సందర్భంగా మనందరం సామూహికంగా 24 కోట్ల గాయత్రీ జపం చెయ్యాలనే సంకల్పం తీసుకుంటున్నాం. ఈ సంకల్పంతో మనం ఆంధ్రప్రదేశ్‌ను గాయత్రీప్రదేశ్‌గా మార్చాలి అని చెప్తూ ఆంధ్రప్రదేశ్‌ని మొత్తం నాలుగు ప్రాంతాలుగా విభజించి గుంటూరు, వరంగల్, అమలాపురం, వైజాగ్ జిల్లాల్లో త్రిదివసీయ సాధనా శిబిరాలను వెంటనే ఏర్పాటు చేసి రోజుకు సహస్ర గాయత్రీ చేసే సాధకులను తయారు చెయ్యాలని చాలా స్పష్టంగా చెప్పి మాస్టర్‌గారు సభను ముగించారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారి సూచనలను విని దానిని ఎలా కార్యాచరణలోకి తేవాలీ అనేదానికి కార్యకర్తలందరూ వెంటనే సమావేశమైనారు. తర్జన, భర్జనలన్నీ అయ్యాక ప్రప్రథమంగా ఈ సాధనా శిబిరం నర్సరావుపేటలో నవంబర్ 17,18,19 తేదీలలో జరగాలని నిర్ణయం జరిగింది. ఆ తరువాత అక్కడి నుంచీ వరంగల్, పిమ్మట అమలాపురం, వైజాగ్‌లలో కూడా జరిగే విధంగా టైమ్‌టేబుల్ వేసి మాస్టర్‌గారికి చూపించి ఆమోదాన్ని పొందటమైపోయింది. ఈ నాలుగు ప్రదేశాలవారిని సంగతీకరణ చేసి, మాస్టర్‌గారు కోరిన విధంగా ఈ నాలుగు కార్యక్రమాలనీ సమర్థవంతంగా ఎలా నిర్వహించుకోవాలో ఒక ప్రణాళికగా రూపొందించుకొని ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళిపోయారు.

అనుకున్న తేదీలలో ఈ నాలుగు చోట్ల పూజ్యశ్రీ మాస్టర్‌గారు, పూజ్యశ్రీ గౌడ్‌జీ, ఇంకా శాంతికుంజ్ నుంచి వచ్చిన ప్రతినిధులతో ఈ కార్యక్రమాలు ఎంతో దిగ్విజయంగా మొదట నర్సరావుపేట, తర్వాత వరంగల్, ఆ తర్వాత అమలాపురం, వైజాగ్‌లలో ఆయా ప్రాంతాల కార్యకర్తల కృషిఫలితంగా ఎంతో సమర్ధవంతంగా నిర్వహించబడ్డాయి. మాస్టర్‌గారి కోరిక మేరకు వేలాదిమంది అఖిల విశ్వగాయత్రీపరివార్‌లో సభ్యులైనారు. వారి లక్ష్యం ప్రకారం రోజుకు 24 కోట్ల మంత్రజపం జరిగేవిధంగా మంత్రజప శృంఖల ఏర్పడింది. ఈ నాలుగు ప్రదేశాలలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు మరియు శ్రీగౌడ్‌జీ గార్లు చెప్పిన విషయ సారాంశము సంక్షిప్తంగా ఏమిటంటే

1. గాయత్రీపరివార్ సభ్యులంతా కారణజన్ములే.
2. మన శరీరమే గాయత్రీమంత్రాక్షర సమూహము.
3. గాయత్రీమంత్ర జపం జరుగుతున్నప్పుడు 24 శక్తులు మన శరీరంలో జాగృతమౌతున్నాయనేది గమనించుకోవాలి.
4. గాయత్రీ అక్షరమైతే – యజ్ఞము కాగితము వంటిది. మనము, యజ్ఞము కలిసేపుట్టాము. యజ్ఞము ద్వారా కోరికలు తీరుతాయి.
5. మీ సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి అంశదానరూపంలో, సమయదానరూపంలో ఇవ్వాలి.
6. వాడవాడలా ప్రజ్ఞామండలి స్థాపించండి. ప్రజ్ఞామండలి అనేది పూజ్యగురుదేవుల శరీరములో ఒక భాగము.
7. ఒక్కసారైనా హరిద్వార్‌లో నిర్వహించబడే సాధనా శిబిరాలలో పాల్గొనాలి.
8. ప్రతి ఇంటిలోనూ దేవస్థాపన జరిగి తీరాలి.

ఈ సాధనలన్నీ చేస్తే కనుక ఆంధ్రప్రదేశ్ గాయత్రీప్రదేశ్‌గా మారిపోగలదనే భావభరితమైన ఉపన్యాసాన్ని చెప్పారు.

ఆ ఉపన్యాసములతో ప్రేరణ పొందిన కార్యకర్తలందరూ, తమ తమ ప్రాంతాలలో ఎంతో ఉత్సాహంతో పనిచేసి దేవస్థాపనా కార్యక్రమాలతోపాటు ప్రజ్ఞామండలులు పెట్టించడం, పంచకుండీ

యజ్ఞాలను చేయటం, పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని ప్రజలకందించటంతోనేకాక వేలాదిమందిని యుగశక్తిగాయత్రీ పత్రికకు చందాదారులుగా చేర్పించటం ఒక శృంఖలలాగా చేశారు.

## శ్రీఅరవిందులవారి కార్యక్రమాలు

పూజ్యశ్రీ మాస్టర్‌గారు, అఖండగురుసత్తాలో గల శ్రీ అరవిందులవారి కార్యక్రమాలకు కూడా శ్రీకారం చుట్టారు. హైదరాబాదులోని శ్రీ అరవిందో సొసైటీలో రెండు సెంటర్స్‌లోను అరవిందుల వారి సాహిత్యం పై ప్రవచనాలను అందించారు,) శ్రీ అరవిందో ఇంటర్‌నేషనల్ స్కూల్ నల్లకుంట నందు ఉన్న సెంటర్‌లో 24 జూలై 2004 నుండి క్లాసులు చెప్పటం మొదలుపెట్టారు. వారు ఏ గురువు పుస్తకాన్ని వివరించటం మొదలుపెట్టినా సాక్షాత్తు ఆ పుస్తకం వ్రాసిన గురువే మనకు వివరించినంత స్పష్టత, వివరణలో సాధకులకు అర్థం అవ్వాలనే ఆర్తి తొంగిచూసేది. శ్రీఅరవిందుల వారి సాహిత్యం అర్థం చేసుకునేందుకు ముందు వారు వారి భార్య శ్రీమతి మృణాళినిగారికి వ్రాసిన ఉత్తరాన్ని అర్థం చేసుకోవాలంటూ అందులోని ముఖ్యాంశములను వివరించారు.

నాకు 3 రకాల పిచ్చి ఉన్నది. అది

1. నా జీవితంలో నేను సాధించిన ఘనత, ఉన్నత చదువులు, డబ్బు, హోదా, గౌరవం వంటివి అన్నీ భగవంతుడు నాకు ఇచ్చాడు అనే పూర్తి విశ్వాసం నాకు ఉన్నది. అందువలన నా జీతంలో నా కుటుంబానికి అవసరమైన నిత్యావసరాలకు తగిన డబ్బును మాత్రమే నేను ఖర్చుపెట్టి మిగిలినది తిరిగి భగవంతునికి ఖర్చు పెడతాను. నేను నా సరదాలకి సంతోషాలకి ఖర్చు పెట్టినట్లయితే దొంగని అవుతాను, హిందూ ధర్మాన్ని అనుసరించి భగవంతుని నుండి పొందిన సిరిసంపదలను తిరిగి భగవంతునికి ఇవ్వకపోతే దొంగ అని అంటారు. నాకు భారతదేశములోని ప్రతి ఒక్కరూ సోదరులే, అందువలన నా సంపదలన్నీ వారితో కలిసి పంచుకోవాలని అనుకుంటున్నాను. మనం అతి సాదా అయిన జీవితాన్ని కలిసి జీవించటానికి నీకు సమ్మతమేనా?

2. ఈ రోజులలో మతాలన్నీ భగవంతుని నామం జపిస్తూనో, వారు ఎంత గొప్పగా సాధనలు చేస్తున్నారనో, లేదా ఆడంబరాలకో వాడుకుంటున్నారు కానీ. మతాల మూల ఉద్దేశ్యం భగవంతుని దర్శించటం. భగవంతుడనేవాడు ఉంటే ఆయనను అనుభూతి చెందేందుకు

ఏదో ఒక మార్గం తప్పనిసరిగా ఉంటుంది, ఆయన్ని ముఖా ముఖి దర్శించటానికి కూడా ఏదో ఒక మార్గం ఉంటుంది. ఇది ఎంత కష్టతరమైన మార్గమైనా దీనిని నేను సాధించటానికి నిర్ణయించుకున్నాను. హిందూ ధర్మానుసారం మార్గం మనలోనే, మన మనస్సులోనే ఉంది అని, దానికి కొన్ని సూత్రాలను అందించింది, నేను వాటిని పాటిస్తున్నాను, ఒక్క నెలలోనే నాకు హిందూ ధర్మంలో చెప్పినది నిజం అనిపించింది. నేను వాటిలో చెప్పిన అనుభూతులను పొందుతున్నాను, నేను సాధించినది నువ్వు ఇప్పుడే సాధించలేక పోయినా నావెనుక నడవటానికి తగిన మార్గదర్శనాన్ని నేను నీకు అందించగలను. నీకు సమ్మతమేనా?

3. అందరూ తమ దేశాన్ని ఒక మట్టి గడ్డగా, నదులు, పంటపొలాలు, అడవులుగా మాత్రమే చూస్తారు, కానీ నాకు భారతదేశం తల్లి. నేను ఆవిడను పూజిస్తాను. తల్లి గుండెలమీద శత్రువు కూర్చుని తన రక్తాన్ని తాగుతుంటే, నేను నా భార్యతో, పిల్లలతో హాయిగా కూర్చొని భోజనం చెయ్యాలా? లేదు పరుగు పరుగున వెళ్ళి నా తల్లిని రక్షించుకోవాలా? దిగజారిపోయిన నాజాతిని లేపగలననే నమ్మకం నాకు ఉంది, ఇది భౌతికమైన శక్తి కాదు, ఇది జ్ఞాన శక్తి. క్షత్రియుల శక్తి మాత్రమే శక్తి కాదు, బ్రాహ్మణుల జ్ఞానం కూడా చాలా శక్తివంతమైనది. ఇది నాకు ఇప్పుడు కలిగిన భావన కాదు, నేను ఈ భావనలతోనే పుట్టాను, నా కణకణంలోను ఉన్నది. భగవంతుడు ఈ పని కోసమే నన్ను భూమి మీదకు పంపాడు. నా జాతిని సరైన మార్గంలో నడిపించవలసిన బాధ్యత నాకు ఉంది. నీకు సమ్మతమేనా?

ఈ మూడు ప్రశ్నలు కేవలం తన భార్య కోసం కాదు, శ్రీ అరవిందులవారి మార్గదర్శనాన్ని కోరుకుంటున్న ప్రతి ఒక్కరిని ఉద్దేశించి చెప్పిన విషయాలు. అందువలన మీరంతా వారి ఈ 3 రకాల పిచ్చిని మీ పిచ్చిగా మార్చుకోగలిగితే ఆయన మార్గదర్శనం మీకు కూడా లభిస్తుంది అంటూ ముగించారు. అందరినీ వీలయినప్పుడల్లా పాండిచ్చేరికి వెళ్ళి ఆశ్రమంలో గడపవలసినదిగా చెప్పారు. లైఫ్ డివైన్, సింథెసిస్ ఆఫ్ యోగాపై వారు ఇచ్చిన ప్రవచనాలను విన్న వారికి శ్రీఅరవిందుల వారిది, శ్రీమాత యొక్క స్పర్శ తప్పక లభిస్తుంది. 15 ఆగష్టు 2004లో శ్రీ అరవిందులవారు వ్రాసిన దేశ స్వాతంత్ర్యం గురించి రాసిన పుస్తకములోని విషయాలను వివరిస్తూ దేశ ఉన్నతి కొరకు, శ్రీ అరవిందుల, మాతా మిత్రాల కల కొరకు పని చెయ్యాల్సిన ఆవశ్యకతను తెలియచెప్పారు. వారు ఊహించిన అఖండభారతాన్ని నిర్మించవలసిన ఆవశ్యకతను చెప్తూ ప్రతి ఒక్కరి ఇంట్లో

మాతా మిత్రా అఖండభారత ఫొటోను తప్పనిసరిగా పెట్టుకుని లక్ష్యాన్ని గుర్తుచేసుకొమ్మన్నారు. ఆరోజు అందరికీ ఆ ఫొటోలను పంచారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఎక్కడ ఉంటే అక్కడ వారి జ్ఞానజ్యోతి నలుదిశలా వెలుగులు విరజిమ్ము తుంటుంది. అది వారి సహజ లక్షణం. వారు వేసవికాలంలో బెంగుళూరులో 2007 నుండి తమ సమయాన్ని గడపటానికి వెళ్ళినప్పుడల్లా అక్కడ జెపి నగర్‌లోని శ్రీ అరవిందో ఆశ్రమంలో ప్రవచనాలను చెప్పేవారు. గురుసత్తా మహోత్సవాలలో ఒకొక్కరికి ఒక గురువు కార్యక్రమాన్ని అప్పగించినప్పుడు శ్రీమతి పద్మా ప్రసాద్, సుమంగళి పటేల్, శివ, శంకరిగార్లకు శ్రీ అరవిందులవారి గ్రూప్ కొరకు పని చెయ్యవలసిందిగా చెప్పారు. ఆనాటి నుండి వారు మాస్టర్‌గారి ఆదేశాలప్రకారం బెంగుళూరు అరవిందో సెంటర్‌లో పూర్తిగా భాగస్థులైనారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు, శ్రీఅరవిందులవారి సాహిత్యముతో పాటు భగవద్గీతపై కూడా ప్రవచనాలను చెప్తూ, బెంగుళూరు కార్యకర్తలకు మార్గదర్శనాన్ని అందించారు. శ్రీ అరవిందులవారి 'ది లైట్ ఆన్ గీత' ను వివరించిన తరువాత, ఇందులో భాగంగా 1 డిసెంబరు 2006లో గీతా జయంతి రోజున శ్రీమతి పద్మా ప్రసాద్‌కు, శ్రీమతి శంకరికి భగవద్గీత పారాయణను నిత్యము జరిగేట్టు చూసే ముఖ్య బాధ్యతను కూడా అప్పచెప్పారు. ఆనాటి నుండి జె పి నగర్‌లోని విజయ వినాయక దేవాలయమునందు ఆ దేవాలయ యాజమాన్య సహాయంతో, భక్తుల సహకారముతో ఈనాటికీ ప్రతిరోజూ ఒక గంట గీతా పారాయణ జరుగుతూనే ఉన్నది. గీతాజయంతి రోజున అఖండ గీతా పారాయణ చేసుకొని పూర్ణాహుతిని యధావిధిగా జరుపుకొంటున్నారు.

శ్రీ అరవిందులవారు వ్రాసిన సాహిత్యాన్ని చదవటానిగ్గానీ, అందులో వారందించిన సాధనలను చెయ్యటానికి ఎంత సమయము కావాలో ఊహించలేము. కాని అపర సరస్వతీ అవతారమైన శ్రీ శ్రీరామకృష్ణగారు, గురువులందరూ అందించిన సాహిత్యాన్ని ఔపోసన పట్టటమే కాక మానవ జాతిపై ఆయనకు గల అపారమైన ప్రేమకు సాక్షిగా ఆ సారాంశాన్ని అతి చిన్న సాధనలుగా మలచి అందించారు. ఏ గురువు సాహిత్యాన్ని ఎలా చదవాలి, ఎక్కడ మొదలుపెట్టాలి? ముఖ్య సాధనలు ఏమిటి? ఏ లక్ష్యముతో ఏ గురువు పని చేసారు అన్న సారాంశాన్ని రకరకాల పుష్పాలనుండి సేకరించి ఒకచోట కూర్చిన మధువువోలె అత్యంత మధురంగా శిష్యులకు అందించేవారు.

2003లో 29 మార్చి నుండి 9 రోజులపాటు సింథెసిస్ యోగాపై వారిచ్చిన ప్రవచనాలను వినిన శ్రీ అరవిందుల ఆశ్రమంలోని సీనియర్ కార్యకర్తలు మాస్టర్‌గారిని వారి వద్దే ఉండి వారికి మార్గదర్శనాన్ని అందించవలసినదిగా కోరారు. మాస్టర్‌గారి భుజస్కంధములపై మరిన్ని బాధ్యతలు ఉన్న కారణంగా వారికి ఎప్పుడు ఎప్పుడు అవసరమైనా తాను వచ్చి వారికి మార్గదర్శనాన్ని అందిస్తానని ఆశ్వాసననిచ్చారు. 2012 వరకు మాస్టర్‌గారు సమయం దొరికినప్పుడల్లా శ్రీఅరవిందో సెంటర్ బెంగుళూరు వారికి తమ అనుగ్రహభాషణాన్ని, మార్గదర్శనాన్ని అందిస్తూనే ఉన్నారు.

శ్రీ అరవిందులవారి సాహిత్యంలో తప్పక చదవవలసిన పుస్తకాలు సావిత్రి, సింథెసిస్ ఆఫ్ యోగా, లైఫ్ డివైన్‌లను ఎలా అర్థం చేసుకోవాలి వాటి సారాంశము ఏమిటి అన్నది వారికి వివరించాక ప్రతి శిష్యుడు తప్పనిసరిగా పాటించవలసిన కొన్ని సాధనలను ఇలా వివరించారు.

1. ప్రతి రోజూ నిద్రపోయే ముందు తప్పనిసరిగా ఈ ప్రార్థన చెయ్యాలి. ఒక అందమైన కార్డు మీద ఈ క్రింది విధంగా రాసి పెట్టుకోవాలి. "ఓం శ్రీమాతారవిందాయనమ:' ఈ కార్డును చూస్కొని నమాస్కారం చేసుకుని

"నేను నిద్రావస్థలో ఉన్నప్పుడు, నా సమాధి స్థితిలో నేను మనుష్యులందరి ప్రాణములోని లోపములను, భౌతిక మరియు మానసిక రుగ్మతలను నివారిస్తున్నాను".

నేను రేపు నిద్రలేచినప్పటినుండి నాకు అది "సుప్రామెంటల్ డే" రేపటినుండి ప్రతి రోజూ నేను మెలుకువగా

ఉన్నంతసేపు నాకు అది "సుప్రామెంటల్ డే" అనే స్థిరమైన భావనలను, సంకల్పాలను చెప్పుకొని అభివృద్ధి చేసుకోవాలి.

2. ఈశోపనిషత్‌లోని 15వ శ్లోకాన్ని చెప్పుకొని ఫొటోలో ఉన్న విధంగా మననం చేసుకుని నిద్రపోవాలి–

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితమ్ ముఖమ్**
**తత్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే ॥**

మెరుస్తున్న బంగారు పాత్రలో సత్యము యొక్క ముఖము దాగి ఉన్నది, హే సూర్యదేవా, దాని మూతను తొలగించి మాకు సత్యదర్శనమును ప్రసాదించుము.

3. డివైన్ మదర్ అందించిన ముద్రలను అందరూ నేర్చుకోవాలి.

4. శ్రీ అరబిందో మదర్ కలలు కన్న అఖండ భారత్ ఫొటో తప్పనిసరిగా అందరి ఇళ్ళల్లోను ఉండాలి.

5. గాయత్రీ మంత్రం సావిత్రి మంత్రంతో అనుసంధానం చేసి ఈ మంత్రాన్ని ప్రతి నిత్యం జపించుకోమని చెప్పారు.

**తత్ సవితుర్ వరం రూపం**
**జ్యోతి పరస్య ధీమహి**
**యన్నః సత్యేన దీపయేత్**

ఇలా అతి సునాయాసమైన సాధనలు, అతి తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాల్ని పొందే విధంగా మలచి అందించారు.

.................. స్వస్తిః ప్రజాభ్యః .......................

# Evolution: a faster way


Life means evolution. Science - the telephones, T.V.s, mobiles, computers and wed - is the instruments of their people but as their damaging means are doing devasting future. But can we use a faster develop-ing and use in a few months the goal of yoga as Swami Vivekanand confirmed. Then Earth is heaven as Param Pujya Gurudev confirmed his prophesy.

Remember that ownly dharma is different from animals and men. But the dharma is lost in our daily life. Many religions (dharmas) are there but where are dharma? All dharmas are the evolution of physical, emotional and mental laws of nature and controls from $10^{23}$ km. to $10^{-18}$ km. Except humans, all the universe is growing fast (evolution) by the laws of nature. Thus Param Pujya Gurudev is given the Einstein's law for the Spiritual law as Gayatri Yagna - like atomic energy the kundali techniques for the 3 planes Bhuh, Bhuvah, Swah fused as A, U, M as ॐ.

Learn P.T. in Chemistry. The 7 groups - the 7 Chakras. The 8th can be for evolution the Bhishma or Sri Kwsha. The Extendend periods - the radiations of human is their aura, should not be the end of dead must go on and on as Sri Krishna says Bahunime ...; and the Ego goes on to normal living to ॐ (The eternal now). The A (physical), U (dream) and M (sleep). The 8 births of Pandu and Satyavati & Devaki and Vasudev. The 8 Vasus. Then the 11 Rudras and 12 Adityas with 2 Aswins. The Back Bones and the Initiations of Theosophy.

8 + 11 + 12 + 2 = 33
P + A + M + Birth & Death } Use it as breathing for 33 as Sohum or Hamsa.

పరిణామక్రమము త్వరితగతి వివరణ – మాస్టర్‌గారి చేతి వ్రాత


The steps of Vidya or the Science of Evolution.

① The science of Kabir. Gyan Vidya

② The science of Ram . Kriya Vidya

③ The science of Sri Rama Krishna Param Hamsa. Bhakti Vidya.

The three in one evolution -

i.e. Kriya △ Bhakti Gyan or Bhakti △ Kriya Gyan or [star]

The 6 angles in 4 consciousness is

6 × 4 = 24 Gayatri or 24 hrs. of day.

The 24 hrs + the body, mind, atma = 27 stars. The Brahmvarchas Chandrayana Vrata

The 1 to 27 stars and 3 days Physical Mental Atmic = 30 days. One Month the Krishna & Shukla

Geeta VIII Ch.

Every month date
28th → is only physical
29th → physical + Manas
30th → physical + Manas + Buddhi
31st → physical + Manas + Buddhi + Samadhi

పరిణామక్రమము త్వరితగతి వివరణ – మాస్టర్‌గారి చేతి వ్రాత




బోర్డుపై వ్రాస్తూ వివరిస్తున్న మాస్టర్ ఆర్.కె.



ఒంగోలు శ్వేతద్వీపంలో మాస్టర్‌గారు



గజేంద్ర మోక్షం



జిల్లెళ్ళమూడి అమ్మ సాన్నిధ్యంలో మాస్టర్‌గారు



ఖాండ్వా (మధ్యప్రదేశ్) నర్మదాదేవి వద్ద మాస్టర్‌గారు




ప్రహ్లాద్‌బాబాగారితో మాస్టర్‌గారు



శ్రీమన్నారాయణుని ధ్యాన చిత్రము



మాస్టర్ మౌర్య



మాస్టర్ కుతుహుమీలాల్ సింగ్



మాస్టర్ జ్వాలాకూల్



మాస్టర్ జ్వాలాకుల్‌గారి నివాసం




వేటపాలెం నిత్యావతార దత్తక్షేత్రంలో దత్తుడు, మాస్టర్‌గారు



వేటపాలెం నిత్యావతార దత్తక్షేత్రంలో పంచ దత్తుల ప్రతిష్ఠ చేసిన మాస్టర్‌గారు




హైదరాబాదులోని మినర్వా హోటల్‌లో బాడీ బ్యూటీఫుల్ వర్క్‌షాప్‌నందు ప్రసంగిస్తున్న మాస్టర్‌గారు





హైదరాబాదులోని సోలార్ సిస్టం వర్క్‌షాప్‌నందు ప్రసంగిస్తున్న మాస్టర్‌గారు



హైదరాబాదులో మిషన్ ఆర్.కె ను ఆవిష్కరిస్తున్న మాస్టర్‌గారు

మిషన్ ఆర్.కె మొదటి లోగో

మిషన్ ఆర్.కె లోగో




అపోజ్యోతి సాధనలో ఎనిమిది ఆకారములో ప్రదక్షిణ విధానం



మాస్టర్ ఆర్.కె



వాస్తు విధానంలో శ్రీ చక్ర పూజ చేస్తున్న
మాస్టర్‌గారు




సహస్ర శ్రీమహాలక్ష్మీ సాధనలో
ప్రసంగిస్తున్న మాస్టర్‌గారు



సహస్ర శ్రీమహాలక్ష్మీ సాధనలో పుస్తకావిష్కరణ



శ్రీమహాలక్ష్మి



గోమాత

“గాయత్రీ-కుండలినీ-సావిత్రీ” పుస్తకావిష్కరణయందు అతిథులతో మాస్టర్‌గారు




2005 మే 5వ తేదీన, నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారిచే
హైదరాబాదులో “గాయత్రీ-కుండలినీ-సావిత్రీ” పుస్తకావిష్కరణ





కాకివాయి శ్రీహంసరామ ఆశ్రమంలో పంచముఖ శివలింగంతో మాస్టర్‌గారు




వైజాగ్‌లో సావిత్రి ప్రచార వేదికని ఆవిష్కరిస్తున్న మాస్టర్‌గారు




పురుషోత్తమపట్నం (చిలకలూరిపేట మండలం)లో 153 అడుగులు ఎత్తుగల
దత్తస్థూప ఆవిష్కరణ




సహస్రకుండీ యజ్ఞవేదికపై మాస్టర్‌గారు




శాంతికుంజ్ హరిద్వార్ అఖండజ్యోతి ముందు మాస్టర్‌గారు




ఋషి ప్రభాకర్‌గారితో...



Salute to the advent of the Truth.



1. In adoration we see union with the Divine



2. With a quiet receptivity prepare yourself.



3. By receptivity the consciousness is united with the Divine.



4. We turn to the world.




5. ... and we face the world where falsehood is opposing the Truth.



6. Truth must conquer and dominate falsehood.



7. The Truth will spread over the whole world and be manifested.



అఖండ భారతము – మదర్ మిర్రా




బెంగుళూరు శ్రీ అరవింద మహర్షి ఆశ్రమంలో ప్రసంగిస్తున్న మాస్టర్‌గారు



ధ్యానచిత్రము

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితమ్ ముఖమ్
తత్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే ॥



"ప్రజ్ఞావతార కథామృతము" పుస్తకముపై ప్రవచిస్తున్న మాస్టర్‌గారు


తిరుపతి శ్రీమద్భాగవత యజ్ఞములో మాస్టర్‌గారు




YASASVEE ART PRINTERS, HYD @ 9701055009